# శ్రీరామకథామృతం

**(వాల్మీకి మహర్షి రామాయణం)**

**రచయిత**

**డా॥ పింగళి పాండురంగారావు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు,**

**తిరుపతి**

**2023**

# **శ్రీరామ కథామృతం**

**(వాల్మీకి మహర్షి రామాయణం)**

**రచన**

డా॥ పింగళి పాండురంగారావు :

**ప్రకాశకులు:**

**శ్రీ ఎ.వి.ధార్మారెడ్డి,** ఐడిఇఎస్

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

అంతర్జాల ప్రచురణ: 2023

వెల: అమూల్యం

ముద్రణ:

తి.తి.దేవస్థానములు. తిరుపతి.

*Pingali Pandu Ranga Rao*
M.A.(Eng)., M.A.(P.A)., B.Ed.,
Principal (Rtd.)
A.B.M. Degree College, Ongole.
C.M.B.C. Degree College (Women), Ongole.
A.B.M. Degree College, Kavali.

Phone : 08592-232126
Cell : 94405 54114
"Srirangadhamam"
8-71, Lawyerpet,
ONGOLE - 523002
kripanidhiom@gmail.com

# అక్షర కైంకర్యం

శ్రీ రఘురామ చారు తులసీదళదామ, శమక్షమాది శృం
గార గుణాభిరామ, త్రిజగన్నుత శౌర్యరమాలలామ దు
ర్వార కబంధరాక్షస విరామ, జగజ్జనకల్మషార్ణవో
త్తారకనామ భద్రగిరి దాశరథీ! కరుణా పయోనిధీ!

'చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్।
ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్॥'

శ్రీరామచంద్రుని చరిత్రము శతకోటి శ్లోకములతో గానం చేయబడింది. అందులోని ప్రతి అక్షరము మహా మహా పాపరాశిని నశింపచేస్తుంది.

భారతీయ సంస్కృతిని విశ్వవిఖ్యాతం చేసిన మహాగ్రంథాలు రామాయణం, భారతం, భాగవతం. ప్రజల నిత్య జీవితాలను భారతం ప్రదర్శిస్తుంది. దివ్యమైన జీవితాన్ని ఎలా గడిపి భగవంతుణ్ణి చేరుకోవచ్చునో భాగవతం తెలియజేస్తుంది. రామాయణం మానవుడు ఎలా ఆదర్శప్రాయమైన జీవితాన్ని అలవరచుకోవాలో మార్గనిర్దేశనం చేస్తుంది.

ఈ భూమి మీద పర్వతాలు, నదులు ఉన్నంత కాలం రామాయణ కథ వ్యాప్తిలో ఉంటుందన్నది బ్రహ్మ వాక్కు. అది సత్యమే. శ్రీరాముడు వేదం ప్రవచించిన ధర్మానికి ప్రతిరూపం కావడమే అందుకు కారణం. శ్రీమహావిష్ణువు మానవ రూపంలో శ్రీరాముడుగా అవతరించాడు. మానవుల సహజ లక్షణాలనే ఆయన ప్రదర్శించాడు. తాను భగవంతుణ్ణి అని తనకు తెలిసినా, బ్రహ్మాది దేవతలు, ఋషులు ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో ఆయనతోనే చెప్పినా కూడ, తను మాత్రం మానవుడనేనని, దశరథుని కుమారుడనే నని ప్రకటించాడు.

వేదాలే వాల్మీకి మహర్షి ద్వారా శ్రీమద్రామాయణంగా ప్రకటించబడినవి. శ్రీరామనామ మహిమ వర్ణించాలంటే మాటలు చాలవు. రామమంత్రంలో, అష్టాక్షరీ, పంచాక్షరీ మహామంత్రం నుండి 'రా', 'మ' అనే రెండు అక్షరాలు కలిపి రామనామ తారక మంత్రం రూపొందింది. శివకేశవులు అభిన్నులనే అద్వైత సిద్ధాంతానికి ఇది ప్రతీకగా పెద్దలు చెపుతారు. వశిష్ఠ మహర్షి కూర్చిన ఈ మంత్రాన్ని ఎందరో మహనీయులు జపించి సిద్ధిని పొందారు. ప్రకృతి శక్తులను రక్షించే దైవీ శక్తులను ప్రేరేపించి, దానిద్వారా లోకకళ్యాన్ని సాధించుటయే భగవత్తత్త్వం. ఆ తత్త్వాన్నే లోకానికి చాటి చెప్పటానికే విష్ణువు రాముడుగా అవతరించి జగద్రక్షణ చేశాడు. ధర్మప్రతిష్ఠాపనయే రామాయణ ప్రధానాంశం. ఇహపర సాధనయే రామాయణం ద్వారా సాధ్యమని నిరూపించడమే వాల్మీకి సంకల్పం. మానవుడు పరిణతి చెంది, పరిపూర్ణతను సాధించటానికి సాయపడే గ్రంథమే రామాయణం.

రామయణం అంటే రాముడు ప్రదర్శించిన ఆదర్శవంతమైన మార్గం. ఆ మార్గంలోనే ప్రతి ఒక్కరూ నడుస్తూ, జీవితంలో ధర్మమార్గాన్ని అనుసరించాలని రామాయణం ఉపదేశిస్తుంది, నిర్దేశిస్తుంది. రామాయణంలో మానవ ధర్మాలు, కుటుంబ ధర్మాలు, పాలనా ధర్మాలు, మానవీయ అంశాలు ఉన్నాయి. ధర్మసూక్ష్మాలు పుష్కలంగా ఉన్నాయి.

రామాయణం విశిష్టత ఏమంటే - భారతీయ సంస్కృతిని దేశవిదేశాల్లో పరివ్యాప్తం చేసిన మహత్తర గ్రంథం. రామాయణం అనేక రూపాల్లో, అనేక భాషల్లో వెలువడింది. రాముడు తమకే కాదు, సర్వజగత్తుకే రక్షకుడు అనే భావన మానవుని హృదయంలో నిలిచిపోతుంది.

వాల్మీకి మహర్షి ఒక ప్రేమకథను బహుసుందరంగా రామాయణ రూపంలో తరతరాలకు అందించాడు. రామాయణం వల్ల వ్యక్తుల మధ్య ప్రేమ అజరామరమయింది. ప్రేమకు శాశ్వతత్వం లభించింది. అందుకు వాల్మీకి మహర్షికి అందరమూ ఋణపడి వుండాలి.

శ్రీరామచంద్రుడంటే - ఒక కల్పిత వ్యక్తి కాదు. సామాన్య మానవుడు కాదు, ఒక మహాపురుషుడు కాదు. అగణిత లౌకికాలౌకిక విశ్వాలకు సృష్టికర్త, సంరక్షకుడు, నియామకుడు అయిన దేవాధిదేవుడే. ఆత్మలకు ఆత్మయై ప్రతి అణువులోను, ప్రతి జీవి హృదయాంతర్గతంగాను నెలకొని ఉన్నాడు. త్రికాలాల్లోని సర్వమూ ఎరిగినవాడు, త్రికాలజ్ఞుడు, సర్వజ్ఞుడు.

బలము, సంపద, యశస్సు, సౌందర్యం, వైరాగ్యం, జ్ఞానం అనే ఆరు దివ్య వైభవాలను పరిపూర్ణంగా కలిగినవాడు శ్రీరాముడు. సకల కళ్యాణ గుణాభిరాముడు. యోగులకు, విరాగులకు, భక్తులకు అంతిమ గమ్యం శ్రీరాముడే.

బాధలతో అలమటిస్తున్న బద్ధజీవుల పట్ల తనకున్న అపార కారుణ్యంతో భగవానుడు ఈ లోకంలోకి దిగివచ్చి, అవతార పురుషునిగా కొనియాడబడుతూ ధర్మసంరక్షణ చేస్తూ ఉంటాడు. ఈ విషయాన్ని భగవద్గీతలో మనం చూడవచ్చు. భగవానుడు తన శాశ్వత సచ్చిదానంద రూపంలో అవతరించటం జరుగుతుంది.

ఎన్నో వేల సంవత్సరాలుగా శ్రీరాముని చరిత ఆస్తిక జనులకు ఆనందాన్ని నిత్యం ప్రసాదిస్తూ వస్తోంది. రామాయణంలోని పాత్రల తీరు, నాటకీయత, కరుణరసం అత్యంత ప్రజాదరణ పొందిన ప్రపంచ వాఙ్మయంలో దాని స్థాయిని భద్రంగా నిలబెట్టాయి.

రామాయణాన్ని రంజింపజేసే కథగా భావించకుండా, శ్రీరామచంద్రుని లోకాతీతమైన శాశ్వత పరమ వైభవ స్థితిని ఆకళింపు చేసికొని చదివినపుడే పరమ శ్రేయస్సును ప్రసాదిస్తుందని చెప్పక తప్పదు. అట్టివారు జీవితం యొక్క పరమ లక్ష్యమైన భగవత్ చరణారవింద ప్రాప్తిని పొందుతారు.

### శ్రీరామనామ మహిమ

"శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే। సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే॥"

విష్ణుసహస్రనామ స్తోత్రం పఠించడంలో భక్తులకు కొంత యిబ్బంది కలుగుతుందేమో! లఘురూపంలో ఆ పుణ్యఫలం లభించే ఏదైనా ఉపాయం చెప్పమని పార్వతీదేవి పరమశివుని వేడుకొంటుంది. అపుడు పరమశివుడు

పార్వతీదేవికి పై శ్లోకాన్ని వినిపించాడు. భావమేమనగా – నిన్ను దర్శించాలని తలచేవారందరికీ అఖండానందం ప్రసాదించు ఓ భవానీ! వినుము. శ్రీరామ రామ రామ అని శ్రీరామనామాన్ని వరుసగా మూడు సార్లు పఠించినచో, ఆ నామములు వేయిసార్లు పఠించిన దానితో సమానము. ఈ విధంగా పఠించి ఎల్లరు తరింతురు గాక! అని చెప్పాడు.

కనుక ప్రియతమ భక్తమిత్రులారా! రామాయణం సీతారాముల దివ్యచరితం. వాల్మీకి విరచితమై, లవ కుశుల ప్రవచనమై, మధుర వాఙ్మయ మనోహరమై, భక్తిభావనామృతమై, ఆరుకాండల సమన్వితమై, విశుద్ధ భక్తుల జీవితమైవేల వసంతాలనుండి ప్రజానురంజకమైన ఈ మహాకావ్యమును చదివి జీవితం సార్థకం చేసుకొందాం.

**మరొక మనవి:** నేను ఈ గ్రంథంలో ఆరు కాండలు మాత్రమే వ్రాశాను. ఏడవదైన ఉత్తరకాండను లుప్తం చేశాను. కారణమేమంటే – చాలమంది పండితులు, పెద్దవారు ఈ కాండను సహేతుకంగా నిరూపించి వదలినారు. అందుచేత నేను కూడ చేర్చలేదు. మన్నించ ప్రార్థన.

ఈ మహాకావ్యాన్ని కూడ నాచే వ్రాయించిన శ్రీవారి దివ్యచరణములకు ఈ గ్రంథాన్ని పూజాపుష్పంగా సమర్పించుకొంటున్నాను.

నా మేనమామ, పరమపూజ్య కీ.శే. ఇలపావులూరి పాండురంగరావుగారి (డైరెక్టరు, భారతీయ జ్ఞానపీఠ్, న్యూఢిల్లీ) జ్యేష్ఠపుత్రులు, నా కత్యంత ప్రియులైన సుప్రసిద్ధ సాహితీవేత్త డా॥ ఇలపావులూరి వెంకట సుబ్బారావుగారు ఈ గ్రంథం గురించి తమ మహోన్నత మధుర భావాలను అందించినందుకు వారికి నా హృదయపూర్వక, కృతజ్ఞతాపూర్వక శుభాశీస్సులు అందిస్తున్నాను. వీరి కుటుంబాన్ని శ్రీనివాస ప్రభువు సదా కాపాడు గాక!

ఈ నా రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహిస్తూ, ఈ గ్రంథానికి తమ అక్షరాశీస్సులు ప్రసాదించిన మహా మాన్యవర్యులు, మహోపాధ్యాయ, వాచస్పతి, సాహితీ శిరోమణి డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారికి అభివందనాలు సమర్పించుకొంటున్నాను.

**నిరంతర శ్రీరామసేవలో..**

**డా॥ పింగళి పాండురంగారావు**

SIROMANI, VACHASPATI, MAHAMAHOPADHYAYA
Dr. SAMUDRALA LAKSHMANAIAH, M.A.
SPECIAL OFFICER (Retd.)
Purana-Itihasa Project
Tirumala Tirupati Devasthanams

Off. : 0877 - 2264305
Res: 0877 - 2230679

TIRUPATI - 517 507

Date : ..................

# నివేదన

వేదవేద్యే పరే పుంసి – జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసాదాసీత్ – సాక్షాద్రామయణాత్మనా ॥

వేదాలచే తెలియదగినవాడు, పరమాత్ముడు 'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః' అని గీతావచనం. ధర్మస్థాపనకై ఆ దేవుఉ పలు అవతారాలు ధరిస్తాడు. త్రేతాయుగంలో రావణాదులైన దుష్టరాక్షసులను శిక్షించడానికై ఆ దేవుడు దశరథుని పుత్రుడుగా ఆవిర్భవించాడు. ఆ సమయంలోనే వేదం రామాయణంగా ఆదికవి వాల్మీకి ద్వారా రూపొందింది.

యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే।
తావద్రామయణ కథా లోకేషు ప్రచరిష్యతి॥

పర్వతాలూ, నదులూ భూతలంలో ఎంతవరకూ ఉంటాయో, అంతవరకూ రాముని కథ లోకాలలో ప్రచారంలో వుంటుందని భావం.

వేదవాఙ్మయం తరువాత లౌకిక వాఙ్మయంలో అవతరించిన మొదటి రచన రామాయణమే. అందుకే అది ఆదికావ్యంగా ప్రశస్తి పొందింది. వాల్మీకి యోగదృష్టితో కరతలామలకంగా రాముడి చరిత్రను సమగ్రంగా దర్శించి రామాయణం రచించాడు.

ఒక గ్రంథం లోకంలో ప్రశస్తి పొందాలంటే అందులో వర్ణింపబడే నాయకుడు లోకోత్తర గుణసంపన్నుడై యుండాలి. రాముడు సుగుణాభిరాముడు, వీర్యశాలి, ధర్మజ్ఞుడు, సత్యసంధుడు, దృఢవ్రతుడు, సర్వభూత హితకారి, విద్వాంసుడు, కోపరహితుడు, ఇంకా ఇలాంటి ఉత్తమ గుణాలెన్నో ఆయనలో ఉన్నాయి. అందువల్లనే రాముడు రామాయణంలో కథానాయకుడై నేటికీ ఆరాధనీయుడై వున్నాడు.

రాముని కథ నానా భాషలలో గద్యకావ్యాలుగా, పద్యకావ్యాలుగా, చంపూప్రబంధాలుగా, రపకాలుగా వివిధ రూపాలతో అవతరించింది. అనన్య సామాన్యమైన ప్రశస్తి పొందింది. ఆదికావ్యమైన అద్వితీయ కావ్యంగా రూపొందింది.

ఎందుకిలా పాడినపాటే పాడినట్లు రామకథనే కవులు కీర్తిస్తున్నారు? అని ఒక కవిని ప్రశ్నిస్తే ఆయన ఇలా సమాధానం చెప్పాడు –

'యదిక్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్య చరితం।
గుణైరేతావద్భిః జయతి పునరన్యో జగతి కః? (మురారి)

'ఒకే రామకథను మాటిమాటికీ చెప్పడం ఎందుకు? అని వదలివేస్తే శ్రీరాముని వంటి గుణవంతుడు మరొకడుంటే చెప్పండి! అప్పుడు రాముణ్ణి విడిచి మీరు చెప్పిన వ్యక్తినే అభివర్ణిస్తూ కావ్య రచన కావిస్తాము' అని భావం.

రామాయణాన్ని "చతుర్వింశతి సాహస్రీ సంహితా" అని అంటారు. అంటే గాయత్రీ మంత్రంలో 24 అక్షరాలున్నట్టే ఇందులో 24 వేల శ్లోకాలున్నాయి. రచన సరళమూ, సుందరమూ అయిన లౌకిక సంస్కృతంలో సాగింది.

రామాయణ రచనా కాలనిర్ణయంలో పరిశోధకులు భిన్నాభిప్రాయాలు కల్గివున్నారు. అనేక ప్రమాణాలను బట్టి బుద్ధునికి పూర్వమే, అనగా క్రీస్తుకు పూర్వం 500 సంవత్సరాలకు ముందే రామాయణ రచన జరిగిందని ప్రముఖ పరిశోధకుల అభిప్రాయం.

రామాయణంలో ఎక్కడా దీర్ఘ దీర్ఘ సమాసాలు ప్రయుక్తం కాలేదు. వ్యస్తమైన చిన్న చిన్న పదాలతోనే వివక్షితార్థం చెప్పడమయింది. రాముని స్వభావాన్నీ, శిక్షకత్వాన్నీ వివరించే యీ క్రింది శ్లోకాన్ని గమనించండి.

"నాస్య క్రోధః ప్రసాదో వా నిరర్థోస్తి కదాచన।
హన్త్యేష నియమాద్వధ్యాన్ అవధ్యేషు నకుప్యతి॥ (2-2-46)

ఇలా అలతి అలతి పదాలతో అల్లిన అనుష్టుప్ శ్లోకాలు పరమ రమణీయాలై పాఠకులకు పునఃపునః పఠించడానికి ప్రేరణనిస్తాయి.

కావ్యరచనలో వర్ణన చాలా కీలకమైనది. వర్ణనతో పాటే కవిత్వం పుట్టిందనీ, అంతకు ముందు కవిత్వం పుట్టలేదనీ అలంకార శాస్త్రజ్ఞులు చెప్పారు. కావ్యంలో అష్టాదశ వర్ణనలుండాలని వారంటారు. రామాయణం వివిధ వర్ణనలకు నిలయం. నగరాలు, ఋతువులు, యుద్ధాలు, అడవులు ఇత్యాదిగా వివిధములైన దృశాయలు అతిమనోజ్ఞంగా ఈ ఆదికావ్యంలో వర్ణింపబడి వున్నాయి. అనంతర కవులకు ఈ కావ్యమే ఆదర్శమయింది. కావ్యరచనలకు దారి చూపింది. అందుకే చంపూ రామాయణకర్త భోజమహారాజు వాల్మీకిని 'మధుమయ ఫణతీనాం మార్గదర్శీ మహర్షిః' అని కీర్తించాడు.

కవికులతిలకుడుగా ప్రసిద్ధుడైన కాళిదాస మహాకవి రఘువంశాది మహాకావ్యాల రచనలో వాల్మీకినే అనుసరించాడు. ఆయన చెప్పిన మాట ఇది.

"అథవా కృతవాగ్ద్వారే వంశేస్మిన్ పూర్వసూరిభిః।
మణే వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మే గతిః॥ (రఘువంశం)

'వజ్రపు సూదితో బెజ్జం వేసిన మణిలోదూరే దారానికి లాగా పూర్వకవులు తీర్చిన వాగ్రూపమైన ద్వారంగల యీ వంశంలో నాకూ ప్రవేశమున్నది.' అని తాత్పర్యం. ఇక్కడ కాళిదాసు స్మరించిన పూర్వసూరులలో అగ్రగణ్యుడు వాల్మీకి మహర్షియే.

రామాయణాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం చేసే వారెందరో వున్నారు. దానివల్ల అశుభాలు తొలగిపోయి శుభాలు కల్గుతాయని వారి విశ్వాసం. రామాయణంలో సుందరకాండకు ఎంతో వైశిష్ట్యం ఉన్నది. ఈ కాండలో

హనుమంతునికి గల ప్రాముఖ్యాన్ని బట్టి ఈ కాండను 'హనుమద్విజయం' అని కూడ వ్యవహరిస్తారు.

"సుందరే సుందరో రామ, సుందరే సుందరీ కథ।
సుందరే సుందరీ సీతా, సుందరం వనం।
సుందరే సుందరం కావ్యం సుందరే సుందరం కవి।
సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరం?"

అన్నట్లు "సుందరకాండలో రాముడు సుందరుడు, ఆంజనేయుడు సుందరుడు, సీత సుందరి, ఇక ఆ కాండలో సుందరం కానిదేమున్నది?"

యుద్ధకాండలో రావణ కథకు ముందు ప్రస్తావనకు వచ్చే ఆదిత్య హృదయ స్తోత్రం మిక్కిలి ప్రశస్తం. ఆరోగ్యసిద్ధి కొరకు దాన్ని పారాయణం చేస్తారు. ఇలా ఎన్నో రీతుల రామాయణ కావ్యం మన సాహిత్యంలో ప్రథమగణ్యమై విరాజిల్లుతున్నది.

కావ్యజగత్తులో శృంగారం మొదలైన తొమ్మిది రసాలు ప్రసిద్ధాలు. రామాయణంలో ఏది ప్రధాన రసం? అంటే ఆనందవర్ధనుడు కరుణ రసమే ప్రధానమన్నారు. సీతాచరిత్ర అంతా దుఃఖభూయిష్టమే. క్రౌంచపక్షుల వియోగం శోక కారణమై శ్లోకరూపం పొంది కరుణరసానికి హేతువయింది. ఆ రసమే రామాయణంలో ప్రముఖమయింది. 'ఏకోరసః కరుణయేవ' అని భవభూతి మాట గూడా దీన్ని సమర్థిస్తున్నది.

రాముడు దశావతారాలలో ఏడవ అవతారం. ఆయనను మర్యాద పురుషోత్తమునిగా వాల్మీకి చిత్రించాడు. ఉత్తమ మనుజరూపంలో వర్ణింపబడిన శ్రీరాముడు లోకానికంతా ఆదర్శమై వెలుగొందాడు.

శ్రీరాముని సోదర ప్రేమ అనుపమానమైనది. లక్ష్మణుడు శక్తి ప్రయోగానికి గురి అయినప్పుడు రాముడు 'దేశే దేశే కళత్రాణి' ఇత్యాదిగా విలపించిన ఘట్టం ఎంత ఉదాత్తమో కదా!

గీతలో కామక్రోధలోభాలనే మూడు నరక ద్వారాలు పేర్కొనబడ్డాయి. వాలి వినాశనానికి కామక్రోధాలే కారణాలు. అట్లే ధర్మవిరుద్ధ కామమే రావణ వినాశ హేతువు. ఈ అంశాలు రామాయణంలో నిపుణంగా చిత్రించబడి వున్నాయి.

"రమో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథా।
రామ భూతం జగద భూ ద్రామే రాజ్యం ప్రశాసతి॥

రామరాజ్యంలో ప్రతి ఒక్కరూ 'రాముడు, రాముడు, రాముడు' అని రాముణ్ణి గురించే చెప్పుకొనేవారు. ఆ కాలంలో జగమంతా రామమయ మయింది.

అట్టి రాముణ్ణి గురించి వివరించే రామాయణం ప్రపంచ సాహిత్యంలో నిరుపమానమై రాణిస్తున్నది. ఎన్నో భాషలలో రామాయణం అనువదింపబడింది. నేటికీ కవులు రామకథా ప్రధానమైన రచనలు కావిస్తూనే వున్నారు. చలనచిత్రాదులు వచ్చిన తరువాత రామాయణ ప్రశస్తి ఇంకా విస్తరించి దేశవిదేశాలకు ప్రాకిపోయింది.

ప్రస్తుతం 'శ్రీరామకథామృతం' అన్న పేరుతో ఈ రామాయణ గాథను సులభ సుందర వ్యావహారిక భాషలో రచించిన శ్రీ పింగళి పాండురంగరావు గారిని గురించి నాల్గు మాటలు.

శ్రీ పింగళిగారు సుప్రసిద్ధ సాహితీవేత్తల వంశంలో జన్మించారు. అధ్యాపకులుగా, ప్రిన్సిపాలుగా ఉద్యోగాలు నిర్వర్తించి విద్యావంతుల అభిమానాన్ని చూరగొన్నారు. గ్రంథరచన, వారికి వెన్నతో పెట్టిన విద్య. ఎనుబదేండ్లు దాటినా వారి రచనా వ్యాసంగం కుంటుపడ లేదు. ఇంచుమించు శతగ్రంథ కర్తృత్వ స్థితిని సొంతం చేసుకొన్నారు.

వీరి రచనలన్నీ ధార్మిక – నైతిక – ఆధ్యాత్మిక – ఉపదేశాత్మకాలే కాని ఉబుసుపోకకు, కేవలం కాలక్షేపానికి రూపొందినవి కావు. కావ్యం వల్ల ఎన్ని గుణాలు కీర్తి, అర్థం, వ్యవహారజ్ఞానం, అమంగళక్షతి, ఆనందం, సదుపదేశం మొదలైనవి పూర్వాలంకారికులచే కీర్తింపబడినవో అవన్నీ వీరి రచనల వల్ల వీరికి అనుభవానికి వచ్చాయి. ఈ రచనలు రచయితనే కాక, పాఠకులను గూడా తరింపజేసే లక్షణాలు గలవి. అట్టి లోకోత్తర రచనలు గావించి ఆంధ్ర సారస్వ వైభవాన్ని పెంపొందించిన శ్రీ పాండురంగరావుగారు అభినందనీయులు.

వీరి పలు రచనలకు 'నివేదనల' రూపంలో పరిచయ వచనాలు వ్రాసే భాగ్యాన్ని వీరు నాకు కల్గించినందుకు కృతజ్ఞుణ్ణి. ఒకటి, రెండు రచనలను నాపేర అంకితం కూడా చేసిన ఈ మహనీయునికెలా కృతజ్ఞతలు తెలుపవలెనో తెలియకున్నది.

ఇటీవలే భారతం ఆధారంగా అందలి వనితామణులు, 'యువభారతం' పేర భారతంలోని ప్రముఖ పాత్రల గురించి విశిష్ట రచనలు కావించారు. ప్రస్తుతం ఆదికావ్యమైన రామాయణం గురించి ఈ గ్రంథాన్ని రూపొందించి జన్మను ధన్యం కావించుకొన్నారు. ఇందులో కథాగమనమూ, వర్ణనలూ, పాత్రల చిత్రణా – ఇత్యాది విషయాలన్నీ మనోరంజకాలై ఉన్నాయి

అటు ఉద్యోగ జీవితాన్ని కర్తవ్య పరిపాలనతోనూ, విశ్రాంత జీవితాన్ని సారస్వత సేవతోనూ గడిపి జీవితాన్ని సఫలం చేసుకొన్న శ్రీ పాండురంగ రావుగారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

తిరుపతి
8-4-2021

... సముద్రాల లక్ష్మణయ్య

**Dr. I.V. Subba Rao, IAS,**
**Secretary to the**
**Vice President of India**
**New Delhi - 110 001.**

# ముందుమాట

ఆదికవి వాల్మీకి విరచించిన రామాయణం నిత్యకావ్యం. విశ్వసాహితీ ప్రపంచంలో అద్భుతమైన స్థానాన్ని సంతరించుకున్నది. మానవ హృదయాల్లో అంతర్లీనమై భక్తి, శక్తి, రక్తి, ముక్తి ప్రదాయకంగా అశేష జనావళికి అక్షయపాథేయమై జ్ఞానక్షుత్తును తీరుస్తోంది. కవులకు, కథకులకు, జిజ్ఞాసువులకు, తాత్త్విక చింతనాపరులకు, విజ్ఞులకు, అక్షర క్షీరాబ్ధిగా, అద్భుత వర్షిణిగా గోచరిస్తోంది. ఈ అమోఘ రససంజీవని అనేక శతాబ్దాలుగా మానవాళికి అమృత బిందువులను అందిస్తూనే ఉంది.

.పర్వతాలు సుస్థిరంగా, పదిలంగా ఉన్నంతవరకూ, నదులు సాగేవరకూ వాల్మీకి అద్భుత సృష్టి చిరస్థాయిగా ఉంటుందన్నది బ్రహ్మ దివ్యదృష్టి. ప్రపంచ సాహితీ జగత్తులో ఇలాంటి మహాకావ్యం మరొకటి లేదంటే అతిశయోక్తి ఏమాత్రం కాదు. అనేక ప్రపంచ భాషల్లో అనువదింపబడి, విభిన్న కళాప్రక్రియల్లో అనుసృజింపబడి, అనేకానేక వచన, నాటకాది రూపాల్లో నిరంతరం పునరుద్ధరమైన రామాయణ గాథను ఎన్నిసార్లు విన్నా, చదివినా తనివితీరదు ప్రతిసారీ కొత్త అనుభూతిని పొందుతాము. చదివిన ప్రతిసారీ కొత్త ఆలోచనలు, సరికొత్త దృక్కోణాలు స్ఫురిస్తాయి.

అందుకే రామకథా సాగరం అనంతం, ఆపాతమధురం, హృదయంగమం. ఈ సాగరతీరంలో వీచే దివ్యశబ్ద వీచికలను చాలాకాలం నాన్నగారు కీ॥శే॥ డా॥ ఇలపావులూరి పాండురంగారావుగారి దగ్గర అమితానందంతో ఆస్వాదించాను. అదే ఆనందలహరిని కొనసాగిస్తున్నారు మా మామయ్య శ్రీ పింగళి పాండురంగా రావుగారు. వీరు రాసిన ఈ అక్షర కైంకర్యానికి ముందుమాట రాసే అదృష్టం కలిగినందుకు, ఆదికవిని మరలా స్మరించి తరించే అవకాశం కల్గినందుకు, సాహితీ కృషీవలుడైన మా కుటుంబీకుని సద్భక్తిని, సద్వచోవిలాసాన్ని పాఠక లోకానికి పరిచయం చేసే భాగ్యం కలగటం నిజంగా నాకు వారిచ్చిన ప్రేమపూర్వక ఆశీర్వచనమే.

ఈ అవకాశాన్ని నాకు అందించినందుకు వారికి కృతజ్ఞతాభివందనములు. వారు వ్రాసిన మనోరంజకమైన ఈ రామకథ మానవ శ్రేయస్సుకు, పురోగతికి, అభివృద్ధికి తప్పక దోహదపడుతుందని నా గట్టి నమ్మకం.

**ఐ.వి. సుబ్బారావు**

**న్యూ ఢిల్లీ**
**28 సెప్టెంబర్ 2021**

**ఐ. పినాకపాణి,** M.A.,
**కళాశాల ఉపన్యాసకులు**
**నెల్లూరు**

# నా మాట

**"శ్రీరామ కథామృతం"** అనే గ్రంథం మా మేనమామ గారైన శ్రీ పింగళి పాండురంగ రావుగారు వ్రాయడం చాల ఆనందదాయకం. బహుభాషా కోవిదులు, పరిపాలనా దక్షులైన వీరు శ్రీరామ కథామృత పానాన్ని, భక్త జనావళికి అందిస్తూ శ్రీరామ కటాక్షాన్ని వారు పొందడమే కాక, అందరికీ అనుగ్రహింప జేయడం వారి పరిపూర్ణ భక్తిపరాయణతకు నిదర్శనం.

మా తండ్రిగారైన కీ॥శే॥ ఇలపావులూరి కామేశ్వరరావుగారు వీరికి స్వయానా మేనమామగారు. మా తండ్రిగారు చేసిన రచనలు 'త్యాగరాజు – రామాయణం', 'త్యాగరాజు – భాగవతార్థం', 'త్యాగరాజు – గీతార్థం' వీరి స్వీయ సంపాదకత్వంలో వారి స్వయంప్రతిపత్తితో ముద్రణ గావించబడ్డాయి. వీరు చేసిన ఈ సత్కార్యం వారికి, వారి మేనమామగారి పట్ల వున్న ప్రేమాభిమానాలు ఎంత ఉన్నతోన్నతమైనవో మనకు అవగత మవుతుంది. అందులకై వారికి నా మనఃపూర్వక నమస్కృతులు తెలుపుకొనుచున్నాను.

మా తండ్రిగారు గొప్ప రామభక్తులు. త్యాగయ్య అన్నా, సంగీతం అన్నా మహాప్రాణం. త్యాగయ్య కీర్తనల ద్వారా శ్రీరామధ్యానం చేయడం ఆయియనకు చిన్నతనం నుండి అలవడిందే. శాస్త్రీయ సంగీతం నేర్చుకొన్నారు. చక్కని గాత్ర విద్వాంసులుగా పేరుగడించారు. సంగీతమే ప్రాణంగా బ్రతికారు. నాదోపాసకులు వారు. త్యాగయ్యగారి కీర్తనల పట్ల ఆరాధనాభావం పెరిగింది. లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించారు. ఎన్నో విశేషాలను కనుగొన్నారు. శ్రీరామచంద్రమూర్తిని త్యాగయ్య దర్శించిన తీరు ఆయనను అబ్బురపరచింది. త్యాగరాజు రచనల మీద పరిశోధనలు మొదలుపెట్టి "Melody & Message of Tyagaraja" అన్న శీర్షికతో పలు రచనలు చేయడం మొదలు పెట్టారు. రాముడిని నాదస్వరూపునిగా త్యాగయ్య దర్శించడం జగదానంద కారకుడుగా, జయజానకీ ప్రాణనాయకుడుగా, నాదస్వరూపమే రాముని విగ్రహంగా రాముడి రూపం వర్ణించడం చాల గొప్పగా అనిపించింది. "త్యాగరాజు – రామకథ' అనే పుస్తకంలో వారు త్యాగయ్య రామయణాన్ని వారి కీర్తనలలో ఎలా పొందుపరచారో వర్ణించిన తీరు అత్యంత రమణీయం. రామాయణంలోని మొత్తం ఆరు కాండలను వారి కృతులతో సమన్వయం చేసి వారు ఎలా శ్రీరామ కథాగమనాన్ని నడిపినారో తెలియజేసిన తీరు చాలా అద్భుతం. త్యాగరాజు రామహృదయాన్ని త్రికరణశుద్ధిగా అర్చించి, దర్శించి, తరించారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నో రామాయణ విశేషాంశాల్ని వ్రాశారు. అది ఒక్కటి చాలు మా తండ్రిగారి అనన్య రామభక్తి ప్రకటిత మయ్యేందుకు.

'త్యాగరాజు – భాగవతార్థం'లో కృష్ణపరంగా త్యాగయ్య హృదయాన్ని ఆవిష్కరించారు. 'నవవిధ భక్తి మార్గాలు', 'శరణాగతి', 'నౌకా చరిత్రం', 'ప్రహ్లాద భక్తి విజయం' తదితర అంశాలన్నీ అధ్యయనం చేశారు. 'వేణుగానలోలుని గన వేయి కనులు కావలెనా..' ఈ ఒక్క కీర్తన చాలు నాన్నగారికి పూర్తి భాగవత తత్వాన్ని ఆవిష్కరించడానికి. ఇలా ఎన్నో కృష్ణునికి సంబంధించిన కీర్తనలలో త్యాగరాజు ఆవిష్కరించిన 'కృష్ణ భక్తి తత్వం' ఈ "రామకథామృతం" పుస్తకంలో పొందుపరచడం జరిగింది. "గానమూర్తి"గా కృష్ణుణ్ణి కొలిచాడు త్యాగయ్య. సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము కలదే మనసా" అంటారు త్యాగయ్య.

'ప్రహ్లాద, నారద, పరాశర, పుండరీక, వ్యాస, అంరీష, శుక, శౌనక, సనకాదులు' అను ఈ భాగవతోత్తములను త్యాగయ్య ఆరాధించిన తీరు విశేషంగా వారి రచనలలోనూ, ఉపన్యాసాల్లోనూ చెప్పారు.

ఇక 'త్యాగరాజు – గీతార్థము' అనే పుస్తకం ద్వారా మా తండ్రిగారు భగవద్గీతను త్యాగరాజు దర్శించిన తీరును విశ్లేషించడం జరిగింది. సృష్టి అంతా పూర్తిగా పరమాత్మ అధీనంలోనే వుంటుంది. అందుకే 'విశ్వం విష్ణుః' అన్నారు. అన్నిట్లో ఆయన చైతన్యమే ఉంది. కాలం అధీనం ఆయనదే. సర్వం, అంతటా ఆయనే. కాని ఆయనకు ఏదీ అంటదు. కేవలం సాక్షీభూతుడాయన. గీతార్థసార మంతా 18 అధ్యాయాల సారమును త్యాగయ్య తన కృతులలో ఎలా వర్ణించారో ఆయన అధ్యయనం చేసే వాటిని ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగింది. భగవంతునిచే గానం చేయబడిన గీత త్యాగయ్యగారి సంగీతం ద్వారా ఎలా చక్కగా మనం అవగతం చేసుకోవచ్చో ఈ పుస్తకం చదివితే తెలుస్తుంది.

పైన పేర్కొన్న అంశాలే కాక త్యాగయ్యగారి సంగీతానికి సంబంధించిన ఎన్నో విషయములపై మా తండ్రిగారు విశేష పరిశోధన సల్పినారు. 'సంగీతం ఎలా పాడాలో, సంగీతం ద్వారా చెప్పినవాడు త్యాగయ్య' అని వారు ఎప్పుడూ అంటుండేవారు. సంగీత శాస్త్ర సంబంధమైన పలు అంశాలు త్యాగయ్య కీర్తనలలో మనకు గోచరమవుతాయి. మా తండ్రిగారు వాటిని కూడా అధ్యయనం చేసి దాదాపు 5000 ఉపన్యాసాల ద్వారా సంగీత రసజ్ఞులకు తెలియజేశారు. సంగీతాన్ని తపస్సుగా ఆరాధించారు. త్యాగయ్య అంటే వారికి ప్రాణం. సంగీతం, త్యాగయ్య ఇదే వారి లోకం. నిజంగా వారిది నాదోపాసనే. అందలి గొప్ప సంగీత స్రష్టకు బిడ్డగా జన్మించడం నా పూర్వజన్మ సుకృతం.

మా తండ్రిగారి వైభవాన్ని, ప్రాభవాన్ని ఎంతచెప్పినా తక్కువే. వారిని స్మరించుకుంటూ, వారిని వారి సంగీత వైదుష్యాన్ని గురించి ఈ నాలుగు మాటలు వ్రాసే భాగ్యాన్ని కల్గించిన మా మేనమామగారైన శ్రీ పింగళి పాండురంగరావుగారికి సవినయంగా నా కృతజ్ఞతాపూర్వక నమస్కారములు తెలియపరచుకొనుచున్నాను.

"శ్రీరామ జయ రామ జయ జయ రామా"

ఇట్లు,

బుధజన విధేయుడు,

పినాకపాణి.

ఓం

# శ్రీరామ కథామృతం - బాలకాండ

అతి ప్రాచీన కాలంలో వాల్మీకి అనే మహర్షి ఉండేవాడు. ఆయన భగవంతుని దివ్యలీలల్ని గురించి మాట్లాడుకోవడం, చర్చించుకోవడంలో ఆనందపడుతూ ఉండేవాడు. ఒకరోజు వాల్మీకి మహర్షి ఒక శిష్యబృందానికి శ్రీమన్నారాయణుని దివ్యలీలలను గురించి వివరిస్తూ ఉన్నాడు. అదే సమయంలో ఆధ్యాత్మిక లోకాల్లోను, భౌతికలోకాల్లోను విహరించే నారద మహర్షి, అక్కడికి వచ్చాడు. నారదుని చూడగానే, వాల్మీకి మహర్షి, ఆయన శిష్యగణం లేచి సాష్టాంగపడి నమస్కరించి, కుశల ప్రశ్నలు వేశారు.

అదే సమయంలో వాల్మీకి మహర్షి నారదునితో ఇలా అన్నాడు. "ఓ మహర్షీ! సమస్త భూమండలంలో సకల సద్గుణ సంపన్నుడైన వాడెవడు? అత్యంత ఘనుడు, శక్తివంతుడు, విద్వాంసుడు, బుద్ధిమంతుడు, సత్యశీలి, నిష్కళంక సౌశీల్యం కలిగిన వాడెవడు? ప్రజ్ఞావంతుడు, సకల జీవకోటి క్షేమాన్ని కాంక్షించేవాడు, అవజ్ఞకు లోబడనివాడు, దేవతలకు సైతం ప్రీతిపాత్రుడైనవాడు ఎవడు? ముల్లోకాల్లో ఎవరినైనా రక్షించగల వాడెవడు? శ్రీమహాలక్ష్మి చేత ఆశీర్వదించబడిన వాడెవడు? ఓ మహర్షీ! నా ఈ ప్రశ్నలకు సరియైన సమాధానం మీరు తప్ప మరెవ్వరూ ఇవ్వలేరు. చెప్పండి." అని అడిగాడు.

ముల్లోకాల విషయ పరిజ్ఞానం ఉన్న నారద మహర్షి ఇలా సమాధానం ఇచ్చాడు. "ఓ ఋషివరేణ్యా! ఇక్ష్వాకు వంశంలో దశరథ మహారాజు కుమారునిగా జన్మించిన రాముడనే రాజపుంగవుడు వున్నాడు. అతను దివ్యలక్షణ శోభితుడు. జితేంద్రియుడు. సకల ఐశ్వర్య శోభితుడు. అపార శక్తి సంపన్నుడు. ఆజానుబాహుడు. ఆయన కంఠంపై మూడు మంగళ రేఖలున్నాయి. విశాల వక్షం కలవాడూ, మహాభుజుడూ, అందమైన శిరస్సు, ప్రసన్న ముఖం, శరీర పుష్టి కల్గినవాడూ, విశాలనేత్రుడూ, ఠీవి గల ఆకారం కలవాడూ, సౌష్ఠవ దేహం కలవాడూ, శరీరం కృష్ణవర్ణంతో తేజోవంతంగా వెలుగొందేవాడూ, మేధోసంపన్నుడూ, అద్భుతమైన వర్తనం, వక్తృత్వ శక్తి గల్గినవాడు అతడు.

శ్రీరాముడు అత్యంత విశుద్ధ సౌశీల్యం కల్గినవాడు. సత్యధర్మాలను అనుష్ఠించేవాడు. ఆత్మసాక్షాత్కారంతో సంపూర్ణుడు. వర్ణాశ్రమ ధర్మం కాపాడేవాడు. సత్యమేమంటే నిర్మల విశ్వానికి ఆధారభూతుడు అతడే. శరణాగత వత్సలుడు, శత్రుసంహారి కూడ. వేదవిదుడు, ధారణాశక్తి కల్గిన మేధావి. వివేకవంతుడు, దయార్ద్ర హృదయుడు, యుద్ధవిద్యా ప్రవీణుడు, వీరుడు, శత్రుపక్షాన్ని మిత్రునిగా భావించే దయాశీలి, సకల ప్రాణులకు ప్రీతిపాత్రుడు, సముద్రం వలె గంభీరమైనవాడు, ధైర్యంలో హిమాలయం, శక్తిలో విష్ణువు, అందంలో చంద్రుడు, సహనంలో భూదేవి, కోపంలో అగ్నిలాంటి వాడు" ఇలా శ్రీరామచంద్రుని లీలావిశేషాలతో వాల్మీకి మహర్షికి సంక్షిప్తంగా చెప్పి, శ్రీరాముడొక్కడే ధర్మపరిపాలకుడు అని చెప్పి, ముగించాడు. రామరాజ్య భోగభాగ్యాలను, పరిపాలనా విశేషాలను, ప్రజల స్థితిగతులను చెప్పాడు. సత్యయుగంలో రాజ్యపాలన జరుగుతున్నదని వివరించాడు. ఇలా శ్రీరాముడు ఈ భూమిని 11 వేల సంవత్సరాలు పాలించిన మీదట తన పరంధామానికి చేరుకుంటాడు.

నారద మహర్షి వాల్మీకి సందేహాలు తీర్చి, యథాప్రకారం శ్రీమన్నారాయణుని లీలలను కీర్తిస్తూ, తన మామూలు యాత్రను ప్రారంభించాడు. వాల్మీకి తన శిష్యుడైన భరద్వాజుని వెంట బెట్టుకుని తమసా నదీతీరానికి

బయలుదేరాడు. నారదుడు పలికిన విషయాల్ని ధ్యానిస్తూ, వాల్మీకి ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు. అక్కడి చెట్టు కొమ్మపై క్రౌంచ పక్షుల జంట ఒకటి మైథునంలో ఆనందంగా పాడుకొంటూ కనిపించాయి. సరిగ్గా అదే సమయంలో ఒక నిషాద వేటగాడు వచ్చి ఒక బాణాన్ని వదలగా అది మగపక్షి దేహంలోకి దిగిపోగా, అది బాధతో అరుస్తూ నేలమీద పడిపోయింది. తన మగపక్షికి జరిగిన ఆపద, బాధను గమనించిన ఆడపక్షి ఆర్తనాదంతో విలపించ సాగింది.

ఈ విషాద సంఘటనను చూచిన వాల్మీకి మనస్సు కరుణతో నిండిపోయింది. హృదయం ద్రవించింది. పాపాత్ముడు చేసిన ఘోరానికి విచలితుడైన వాల్మీకి ఆగ్రహంతో 'ఓరీ నిషాదుడా! తన ఆడపక్షితో రమిస్తున్న ఏ పాపం ఎరుగని అమాయక మగపక్షిని నిర్దయగా చంపిన పాపానికి గాను, నీవు మనశ్శాంతి కోల్పోయి, విలపించెదవు గాక!' అని అంటూ శపించాడు.

కాని వెంటనే కోపాన్ని కట్టడి చేసికోలేక పోయానని బాధతో వాల్మీకి జీవులు ప్రకృతి బద్ధులు కావున వివశులై వ్యవహరిస్తారనే విషయం తనకు తెలియనిది కాదు కదా అని తెలుసుకొని, నిషాదునిపై ప్రతీకార బుద్ధికి చింతిస్తూ, పశ్చాత్తాప పడ్డాడు వాల్మీకి. కాని తన నోటినుండి వెలువడిన శాపవిమోచనంలోని ఏదో ఛందోగతి ఉన్నదని గ్రహించి ఆశ్చర్య పడ్డాడు. ఆ శాపవచనం తాను ధ్యానిస్తూ వచ్చిన రామాయణం యొక్క ప్రధాన భావాత్మక వ్యక్తీకరణగా ఉందని భావించాడు.

ఈ అవగాహనకు వచ్చిన వల్మీకి శిష్యుడైన భరద్వాజుని వైపు తిరిగి "ఆ శోకం నుండి నాలుగు పంక్తులు వెలువడ్డాయి. అద్భుతమైన ఎనిమిది మాత్రలు గల శ్లోకం ఆవిర్భవించింది. కారణం కారుణ్యం లేకుండా కార్య వ్యక్తీకరణ జరుగదు." అంటూ వ్యాఖ్యానించాడు వాల్మీకి.

వాల్మీకి నదిలో స్నానం చేసి శిష్యునితో కూడి ఆశ్రమానికి వచ్చాడు. తన ఆశ్రమంలో ఉండి, ఆ శ్లోకాన్ని మననం చేసుకొంటూ ఉండగా, బ్రహ్మదేవుడు అనుకోకుండా తన లోకాన్ని విడిచి రావడాన్ని వాల్మీకి గమనించాడు. ఆశ్చర్యంతో బ్రహ్మదేవుని స్వాగతించటానికై, వాల్మీకి లేచి నిలబడ్డాడు. బ్రహ్మదేవునికి నమస్కరించి, శ్రద్ధాభక్తులతో పూజించాడు. విశ్వ పితామహుడైన బ్రహ్మదేవుడు అన్నీ ఎరిగినవాడు కనుక వాల్మీకితో 'ఋషివర్యా! నీవు నిషాదుణ్ణి శపించినందుకు బాధపడవద్దు. నీవు పలికిన ఆ పలుకులు నా పలుకులే సుమా! నీవు సాధించవలసిన ఒక మహత్కార్యానికి నిన్ను సన్నద్ధం చేయటం కోసమే నీ చేత  ఆ మాటలు పలికించాను. జగత్కల్యాణం కోసం శ్రీరామచంద్రుని దివ్యలీలా విశేషాలను నీవు రచించవలసిన సమయం ఆసన్నమైంది.

ఈ విషయమై ఆందోళన వద్దు. నీకు తెలియని అనేక విషయాలు నీ హృదయంలో నా వల్ల వెల్లడవుతాయి. అలా నా అనుగ్రహంతో నీవు రామాయణాన్ని అద్భుతంగా వెలయించ గలవు.' అని చెప్పాడు.

బ్రహ్మదేవుడు ఇలా ఆశీస్సులు ప్రసాదించి, హంసవాహనంపై తన లోకానికి వెళ్ళిపోయాడు. అందువల్ల వాల్మీకి బ్రహ్మ సూచన మేరకు శ్రీరాముని లీలలను తెలుసుకునేందుకై, ధ్యానంలో నిమగ్నుడైనాడు. తన ధ్యానంలో శ్రీరామచంద్రుని లీలా విశేషాలన్నీ హృదయంలో స్పష్టంగా గోచరించ సాగాయి. అలా వాల్మీకి 24,800 శ్లోకాలతో రామయణాన్ని రచించాడు. తరువాత ఈ మహకావ్యాన్ని లోకానికి విస్తరించడం ఎలా అనే ఆలోచన ఆయనకు కలిగింది. ఆలోచనలో ఉన్న సమయంలో వాల్మీకి శిష్యులు, వీణాధారులై వాల్మీకి ముందుకు లవకుశులు వచ్చారు. సీతాదేవి అరణ్యవాసంలో ఉండగా, ఈ కవలలు జన్మించటం, ఆనాటినుండి వారు వాల్మీకి సంరక్షణలో ఉండటం

జరిగింది. వారిరువురు వచ్చి వాల్మీకి మహర్షికి పాదాభివందనం చేశారు.

ఒక పౌరుని సంశయ కారణంగా శ్రీరాముడు సీతయొక్క పాతివ్రత్యాన్ని శంకించి బహిష్కరించవలసి వచ్చింది. ఆమెకు ఇలా అరణ్యవాసం సంభవించింది. ఆమె బిడ్డలైన లవకుశులకు అసాధారణ ధారణా శక్తి, సంగీత పాటవం అబ్బాయి. వారు వేదవేదాంగ కోవిదులు. ఇద్దరూ తండ్రి పోలిక. గంధర్వులతో సమానమైన ప్రజ్ఞ కలవారు కూడ. వారిని వీక్షించిన వాల్మీకికి వారిద్దరూ రామాయణం నేర్చుకొనేందుకు సంపూర్ణమైన అర్హత గలవారుగా స్ఫురించింది.

తర్వాత వాల్మీకి రామాయణాన్నంతటినీ శ్రద్ధగా లవకుశులకు నేర్పించడం ప్రారంభించాడు. వాళ్ళు మొత్తం కావ్యాన్ని కంఠస్థం చేశారు. మహర్షులు, విద్వాంసులు, పూజ్యుల సమక్షంలో శ్రీరామచంద్రుని లీలలను అద్భుతంగా గానం చేశారు. గానాన్ని విన్నటువంటి వారందరూ ఆనందపరవశులైనారు. వారు లవకుశులను పొగిడి, కానుకలు సమర్పించారు.

ఆనాటి నుండి లవకుశులు రామాయణ కావ్యాన్ని గానం చేస్తూ, దేశమంతా తిరుగసాగారు. పర్యటనలో భాగంగా వారు అయోధ్యకు చేరారు. ఋషికుమారుల వేషంలో గానం చేస్తున్న వీరిని పురవీథుల్లో శ్రీరాముడు చూచాడు. వారిని తన రాజసౌధానికి వచ్చి గానం చేయమని కోరాడు. ఆయన వారిని గుర్తుపట్టలేక పోయాడు. కాని వారిని రాజసభకు ఆహ్వానించాడు. ఆ బాలురు ఋషి బాలుర వలె వేషధారణలో ఉన్నా కూడా, వారిలో కినిపించిన క్షత్రియ లక్షణాలను శ్రీరామచంద్రుడు గుర్తించాడు. దానితో తన సోదరులను పిలిచి 'ఓ రఘువంశ శ్రేష్ఠులారా! ఆ బాలుర గానాన్ని ఆలకించండి. వారు తాపసుల మాదిరిగా కన్పిస్తున్నా, వారిలో చక్రవర్తి చిహ్నాలు గోచరిస్తున్నాయి. ఈ కథను శ్రద్ధగా ఆలకించండి. ఎందుకంటే ఇందులో సాహితీరమ్యత పుష్కలంగా వుండి, అందరినీ ఆకట్టుకొనేలా ఉంది.' అని అన్నాడు.

లవకుశులు రమణీయంగా ఆ కావ్యాన్ని గానం చేస్తుంటే, శ్రీరాముడు, ఆయన సోదరులు ఆ శ్రవణంలో లీనమై పోయారు. భగవంతుడి లీలలను ప్రస్తుతించినా, శ్రవణం చేసినా, భవబంధాలను పటాపంచలు చేసికోవచ్చుని అర్థం తెలుపుతోంది.

సరయూనదీ తీరంలో గల కోసల రాజ్యం సువిశాలమైంది. సస్యశ్యామలమై, సిరిసంపదలతో తులతూగే రాజ్యం అది. ఈ సుప్రసిద్ధ రాజ్యంలోనే అయోధ్యా నగరం ఉంది. వైవస్వత మనువుయొక్క కోరిక మేరకు ఈ నగరం నిర్మించబడింది. ఈ మహానగరం పొడవు 96 మైళ్ళు, వెడల్పు 24 మైళ్ళు. ఈ నగర వీథుల్లో ఏనుగులు పరిమళభరిత జలాలను వెదజల్లుతూ సువాసనలతో గుభాళింప చేస్తుంటాయి. అప్సరసలు ప్రతినిత్యం దివ్యలోకాల్నుంచి విమానాలలో ఇక్కడికి వచ్చి పైనుండి పుష్పవర్షం కురిపిస్తుంటారు.

అయోధ్యా నగర ద్వారాలు చలువరాతితో నిర్మించబడ్డాయి. వాటి కవాటాలు స్వర్ణ, రజిత లోహాలతో నిర్మించబడి, రత్నాలు పొదగబడి ఉంటూ శుత్రుభీకరంగా ఫిరంగులతో నగర రక్షణకు కోటగోడలు నిర్మించబడ్డాయి. వీథులు ప్రణాళికాబద్ధంగా ఏర్పరచబడ్డాయి. ఇరువైపులా ఏడేసి అంతస్థుల సౌధాలు బారులుతీరి ఉంటాయి. సుందరోద్యాన వనాలతో, అద్భుత సౌధాలతో, సంగీతవాద్యాల ప్రకంపనలతో ప్రతిధ్వనిస్తూ, దేవేంద్రుని రాజధాని అమరావతితో పోటీపడుతున్నట్లు శోభిస్తూ వుంటుంది. నగరంలో ప్రతిచోటా వేదపఠనాలు, నారాయణ కీర్తనలతో మార్మోగుతుంటాయి. భగవానుడి లీలలను నటులు ప్రదర్శిస్తూ కనిపిస్తారు. అయోధ్యలో రమణీయ ఉద్యానవనాలు, నీడనిచ్చు ఫలభరిత వృక్షాలు అసంఖ్యాకంగా వెలసి వున్నాయి. కొలనుల్లో అనేక రకాల రంగులు గల పద్మాలు

కనిపిస్తాయి. నీటి జల్లులు సుగంధాల్ని అందిస్తూ, పౌరులకు సేదదీరుస్తుంటాయి. వసంతాన్ని తలపిస్తాయి.

కొంగలు, నెమళ్ళు చేసే కీంకార ధ్వనులు వినిపిస్తుంటాయి. సరస్సుల్లో,ని నీరు చెరుకు రసంలా తియ్యగా వుంటుంది. మామిడి తోటలు కనువిందు కలిగిస్తాయి. సౌధాలు, భవంతులు రమణీయంగా అలంకరించబడి వుంటాయి. వాటి సొగసు వైకుంఠ సొగసుల్ని తలపిస్తుంటాయి.

నేర్పరులైన విలుకాండ్రు, రథికులు, యోధులు అప్రమత్తంగా ఉంటూ, నగరాన్ని రక్షిస్తుంటారు. అయోధ్యను చేర్చే దారులన్నీ ఎప్పుడూ రద్దీగానే ఉంటాయి. దేశం నలుమూలల నుండి రాజులు, రాకుమారులు వచ్చి అయోధ్య మహారాజు దశరథునికి కప్పాలు చెల్లించి వెళ్తుంటారు. సుదూరంలో నుండి వ్యాపారులు వచ్చి సంతలో క్రయవిక్రయం చేస్తుంటారు.

జితేంద్రియులు, సత్యధర్మపరాయణులైన బ్రాహ్మణ పురోహితులు యజ్ఞాలు చేయిస్తూ, వేదమంత్రాలు ఉచ్చరిస్తూ, విష్ణు మహిమలను కీర్తిస్తుంటారు. గొప్ప రాజర్షి, అసమాన యోధుడు, శత్రుభీకరుడు, పురజనులు కూడ పవిత్ర వర్తనులైనందున, అయోధ్యా నగరం సదా వైదిక సంస్కృతీ నిలయంగా శోభిల్లుతుంటుంది. అష్టైశ్వర్యాలన్నీ అక్కడే కొలువు దీరాయి. భౌతిక దౌర్భాగ్యులు కనిపించరు. చతుర్వర్ణాలవారు పరస్పరం సహకరించుకొంటూ సంతోషంగా జీవిస్తుంటారు. మోసగాళ్ళకు తావులేదు. అహంభావం, నాస్తికత్వం, మొరటు ప్రవర్తన ఎక్కడా కనిపించవు.

అంతటి వైభవంతో శోభిల్లుతున్న, దశరథ మహారాజు అసంతృప్తితో ఉన్నాడు. కారణం ఆయనకు పుత్రసంతానం లేదు. ఎంతగానో ఆలోచించి, అశ్వమేధ యాగం చేయాలని సంకల్పించాడు. రాజపురోహతుల్ని పిలిపించాడు. వశిష్ఠుడు, వామదేవుని సారథ్యంలో బ్రాహ్మణులు వచ్చారు. వారితో దశరథ మహారాజు 'ఓ ద్విజోత్తములారా! నాకు పుత్రసంతానం కలుగక నాకు దుఃఖంగా ఉంది. మీ అనుమతితో అశ్వమేధ యాగం చేయాలని నిర్ణయించుకున్నాను. మీరందరు సర్వశాస్త్ర పారంగతులైనందున, నన్ను సరైన మార్గంలో నడిపించగలరని విశ్వసిస్తున్నాను." అని ప్రసంగించాడు. పురోహితులందరూ ఆమోదం తెలిపారు. వెంటనే దశరథ మహారాజు యజ్ఞానికి కావలసిన ఏర్పాట్లు చేయమని మంత్రులను ఆజ్ఞాపించాడు.

తర్వాత సుమంత్రుడు దశరథ మహారాజుకు క్రింది కథను వినిపించాడు.

"ప్రియమైన రాజా! ఈ కథ ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఎందుకంటే మీరు రత్నాల్లాంటి నలుగురు కుమారులకు తండ్రి కాబోతున్నారని సూచిస్తోంది. కృతయుగంలో సనత్కుమారుడు ఇదే కథను ఒకసారి చెప్పాడు. అందులో సంఘటనలు ఇంతవరకు సంభవించ లేదు. త్వరలో సంభవించనున్నాయి. రోమపాదుడనే మహారాజు ద్వారా జరిగిన పొరపాటు వల్ల ఆయన రాజ్యంలో జీవరాశులన్నీ తీవ్ర భయాందోళనలకు వశు లైనారు. దీనికి కారణమేమై ఉంటుందని రాజు బ్రాహ్మణులను సమావేశపరచి అడగాడు. 'బ్రాహ్మణోత్తములారా! నేను ఏదో పాపం చేసి ఉంటాను. అందువల్లనే ఈ తీవ్ర పరిణామాలు రాజ్యంలో ఏర్పడ్డాయి. వీటి నివారణకు నాకు ప్రాయశ్చిత్తాని విధించండి' అని వారిని వేడుకొన్నాడు.

అపుడు బ్రాహ్మణులు – 'ఓ రాజా! మృగీఋషి అనే గొప్ప బ్రాహ్మణ మునీశ్వరుడు అరణ్యంలో నివసిస్తున్నాడు. అతడు కాశ్యపుని కుమారుడు. అతని కుమారుడు ఋష్యశృంగుడు. ఆ ఋషి మనుమణ్ణి

తీసికొని వచ్చి నీ కుమార్తెతో వివాహం జరిపిస్తే, ఈ కరువుకాటకాలు తొలగిపోతాయి' అని చెప్పారు.

విషయ మేమంటే – శాంత దశరథ మహారాజు యొక్క కుమార్తె అయినప్పటికీ, తన స్నేహితుడైన రోమపాదుడికి పిల్లలు లేని కారణంగా, శాంతను పెంచకోవడానికి, అతను కోరగా, అతనికి ఇచ్చాడు. కాటకాన్ని అంతం చేయడానికి మంచి మార్గం లభించిందని రోమపాదుడు సంతోషించాడు. కాని ఋష్యశృంగుని వెంట బెట్టుకొని రమ్మని పురోహితులకు చెప్పినపుడు వాళ్ళు తిరస్కరించారు. ఎందుకంటే – అతనిని ప్రలోభ పెట్టి బయటకు తీసికొని వస్తే, మృగీఋషి మమ్మల్ని శపిస్తాడు. ఏకాంతంలోనే తన కుమారుని పెంచుతున్నాడు. ఋష్యశృంగుడు ఎవరినీ చూచి ఎరుగడు, పైగా ఏ స్త్రీని చూచి ఎరుగనందున, స్త్రీ సుఖం అంటే అతనికి తెలియదు. కాని రాజా! ఒక ఉపాయం ఆలోచించాం. అత్యంత వయ్యారాలను ఒలకబోసే వేశ్యలను అక్కడికి పంపి, అతనిని మోహింపజేయాలి. ఇలా అయితేనే మన పని సులభమవుతుంది అని మా అభిప్రాయం' అని వారు చెప్పారు.

పురోహితుల మాటల ననుసరించి, రాజు అందగత్తెలైన వేశ్యల కోసం పిలువనంపాడు. రాజు ఆ కన్యలతో ఋష్యశృంగుని ఎలాగైనా ఇక్కడికి తీసికొని రావాలని, అందుకై తగిన రీతిలో బహుమతులు ఇస్తానని చెప్పగా, ఆ వేశ్యలు సమ్మతించి, అరణ్యానికి బయలుదేరారు.

అరణ్యంలో ఋష్యశృంగుని ఆశ్రమానికి దగ్గరలో ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసుకొని అతని కోసం వేచి వున్నారు. ఒకరోజు అనుకోకుండా ఋష్యశృంగుడు బయటకు వచ్చి తిరుగుతూ తిరుగుతూ వేశ్యలున్న శిబిరం దగ్గరకు చేరాడు. అతన్ని చూచి ఆ యువతులు ఆనందంతో అతన్ని సమీపించారు. వాళ్ళు ఋష్యశృంగునితో 'మీరెవరు?' అని అడిగారు.

అందుకు ఋష్యశృంగుడు 'నేను మృగీఋషి కుమారుణ్ణి. దగ్గరలో ఆశ్రమంలో నా తండ్రితోపాటు తపస్సు చేసుకొంటున్నాను. మీరందరు ఎంత సౌందర్యమూర్తులుగా ఉన్నారో! ఒకసారి మీరు మా ఇంటికి వచ్చి, నా పూజలను, ఆతిథ్యాన్ని స్వీకరించండి.' అని అన్నాడు ఋష్యశృంగుడు.

ఆ వేశ్యలు అతనితో వెళ్ళారు. ఋష్యశృంగుడు వారికి ఫలాలను, అర్ఘ్యపాద్యాలను సమర్పించి సాదరంగా సత్కరించాడు. కాని అతని తండ్రి ఏ క్షణాన వస్తాడోనన్న భయంతో, ఆ యువతులు అక్కడ ఎక్కువ సేపు ఉండదలచుకో లేదు. వారు వెళ్ళిపోతూ 'ఓ ప్రియమిత్రుడా! అతిథి సత్కారంలో మీ ఆచారాలు మా వాటికి భిన్నంగా ఉంటాయి. ఇపుడు మా గౌరవ సత్కారాలను స్వీకరించండి' అంటూ వారు ఋష్యశృంగుని ప్రేమతో కౌగిలించుకొని, వారు తెచ్చిన భక్ష్యాలను అతనికి తినిపించారు. అంత రుచికరమైన పదార్థాలు అతను అంతకు ముదు ఎప్పుడూ తిని వుండలేదు. తన తండ్రిని తప్ప మరెవరినీ చూడని అతను ఆ వేశ్యాంగనలను కూడ సుందరమైన పురుషులుగానే భావించాడు.

వారు వెళ్ళిపోయిన తరువాత, ఋష్యశృంగుని హృదయంలో ఏదో తెలియని కామవాంఛ ఉద్భవించింది. ఫలితంగా, ఆ వేశ్యలను గురించే ఆలోచించసాగాడు. నిద్ర పట్టలేదు. వాళ్ళ మధురవాక్కులతో, ఆలింగనాల అనుభూతులతో, అతని హృదయం పరవశించి పోతోంది.

హద్దును మీరి, ఋష్యశృంగుడు మరునాటి ఉదయం ఆ వేశ్యల శిబిరానికి వెళ్ళాడు. అక్కడ ఆ వేశ్యలు ఋష్యశృంగునితో ఇలా అన్నారు. 'ఇది మా నివాసం కాదు. మా ఆశ్రమంలోకి అడుగుపెట్టి, మాతోపాటు ఒక

చోటికి వస్తే, అక్కడ మిమ్మల్ని మరింత వినోదింప చేస్తాం. రుచికరమైన ఫలాలు ఇస్తాం. అక్కడ ఎలా ఆనందిస్తూ వుంటే కాలం ఎటు, ఎలా పోతోందో మీకు తెలియదు' అని అనగానే ఋష్యశృంగుడు క్షణం కూడ ఆలోచించకుండా, ఆ వేశ్యల వెంట వెళ్ళాడు.

ఆ వేశ్యలు అతన్ని ప్రలోభపెట్టి, రోమపాదుడి అంగరాజ్య రాజధానికి తీసుకొని వచ్చారు. పడవలో ప్రయాణిస్తుండగనే, ఇంద్రుడు వర్షాలు కురిపించి ఆనందింప జేశాడు.

ఋష్యశృంగుడు వచ్చాడనే వార్త తెలియగనే, రోమపాద మహారాజు రాజభవనం నుండి బయటకు వచ్చి, ఆ యువ ఋషికి ప్రణామం చేశాడు. తర్వాత అతనిని పూజించి, తన అంతఃపురంలోనికి తీసుకొని పోయి, ఆ ఋషికి తన కుమార్తెను దానం చేశాడు.

రోమపాదుడు అతనిని ప్రలోభపెట్టి తెప్పించుకొన్నందుకుగాను, అతను గాని, అతని తండ్రిగాని తన మీద ఆగ్రహించకుండా అతనిని మన్నించమని వేడుకొన్నాడు. సరేనన్న ఋష్యశృంగుని హామీతో ఋష్యశృంగునికి శాంతతో వివాహం జరిపించాడు.

వివాహం తరువాత నవదంపతులు రోమపాద మహారాజు రాజభవనంలోనే రాజభోగాలతో సుఖంగా కాలం గడిపాడు."

సుమంత్రుడు పై కథను చెప్పి దశరథ మహారాజుతో "ఓ రాజా! నీవు అశ్వమేధ యాగం చేస్తావని, రోమపాదుని సహాయం తీసికొంటావని సనత్కుమారుడు ఆరోజే చెప్పాడు. యాగానంతరం నలుగురు వీర పుత్రులను పొంది నీ కోరిక తీర్చుకుంటావని కూడ చెప్పాడు." అంటూ ముగించాడు.

ఈ కథ వినిన దశరథ మహారాజు ఎంతో సంతోషించాడు. తర్వాత పరివార సమేతంగా అంగ రాజ్యానికి వెళ్ళాడు. అక్కడ రోమపాద మహారాజు ఎంతగానో గౌరవించాడు. అంగరాజు ఋష్యశృంగునితో అతని అసలైన మామగారు దశరథుడేనని వివరించాడు. వారం రోజులు గడిపి దశరథ మహారాజు మిత్రుడైన రోమపాదునితో 'మిత్రమా! నేను పుత్ర సంతానం లేకపోవడంతో, చాల దుఃఖంతో ఉన్నాను. అశ్వమేధ యాగం తలపెట్టాను.' ఆ యజ్ఞం చేయడానికి ఋష్యశృంగుని అయోధ్యకు పంపవలసినదిగా నిన్ను వేడుకొంటున్నాను.' అని అడిగాడు. రోమపాదుడు అంగకరించడంతో దశరథుడు ఋష్యశృంగుని వెంటబెట్టుకొని అయోధ్యకు వచ్చాడు. వసంత ఋతువు రాగానే యజ్ఞానికి సంబంధించిన పాత్రల్లో అన్నీ సమకూర్చుకొని, సరయూనదికి ఉత్తర దిశన యజ్ఞం చేయుటకు మార్గదర్శనాన్ని తెలియజేశారు.

ఆచారం ప్రకారం, చక్రవర్తి తన ఆధిపత్యాన్ని నిరూపించుకొనేందుకు దేశం నలుమూలలకు ఒక అశ్వాన్ని చక్రవర్తి సైనికులతో కూడ పంపిస్తారు. అశ్వం ప్రవేశించిన రాజ్యంలోని రాజు చక్రవర్తి ఆధిపత్యం అంగీకరించి కప్పం కట్టడమో, లేక ఎదిరించి యుద్ధం చేయటమో జరుగుతుంది. ఇలా ఆ అశ్వం దేశమంతా చుట్టివచ్చి, వ్యతిరేకులు ఎవరూలేరని నిర్ధారణ అయిన తర్వాతనే అశ్వమేధ యాగం ప్రారంభం అవుతుంది. యజ్ఞం సక్రమంగా పరిసమాప్తి కావడానికి ఆధిపత్యాన్ని అంగీకరించిన రాజులందరూ తమ శక్తిమేరకు చక్రవర్తికి కానుకలు సమర్పించుకొని, యజ్ఞంలో పాల్గొని, యజ్ఞం పూర్తి అయిన తర్వాత చక్రవర్తి సత్కారాలను అందుకొని తృప్తితో

తమ తమ రాజ్యాలకు వెళతారు.

జనక మహారాజు భవిష్యత్తులో తన కుమారులకు కన్యాదానం చేసి, మామ అవుతాడని గ్రహించి దశరథ మహారాజు, మొదటి ఆహ్వానం ఆయనకే పంపాడు. అలాగే సామంతరాజులందరిని ఆహ్వానించాడు. యజ్ఞాశ్వం 400 క్షత్రియుల రక్షణతో భూమండలమంతా తిరిగి, ఒక సంవత్సరం తర్వాత అయోధ్యకు తిరిగి వచ్చింది. అప్పుడే యజ్ఞం ప్రారంభం కానుంది.

దశరథ మహారాజు పట్టపురాణి కౌసల్య యజ్ఞకర్మలన్నీ జరిగిన తర్వాత, యూపస్థంభానికి కట్టివేయబడిన యజ్ఞాశ్వానికి ప్రదక్షిణం చేసింది. తరువాత ఆమె వేదోక్తరీతిలో, మూడు ఖడ్గ ప్రహారాలతో అశ్వం యొక్క శిరస్సును ఛేదించింది. ఆ తరువాత ఋష్యశృంగుడు ఆ చనిపోయిన అశ్వం యొక్క శరీరంలోని కొవ్వును తీయించి, యజ్ఞ గుండంలోని జ్వాలల్లో ఆహుతి చేసి, పాప విముక్తికై, ఆ ధూమాన్ని పీల్చవలసిందని దశరథ మహారాజుకు సూచించాడు. ఆ అశ్వ అవయవాలను అగ్నికి ఆహుతి చేసి, మూడు రోజుల యాగాన్ని సంపూర్ణం చేశాడు. నాలుగు దిక్కులలోని నాలుగుభూభాగాలను ప్రధాన ఋత్విక్కులకు దానంగా దశరథ మహారాజు సమర్పించాడు.

కాని ఋత్విక్కులు 'రాజా! మాకు రాజ్యాల మీద ఆశ లేదు. గోవులను, సువర్ణాన్ని దానం చేయండి' అని అడిగారు. అపుడు ఋష్యశృంగుడు దశరథునితో 'రాజా! మీకు నల్గురు కుమారులు జన్మించడం జరుగుతుంది. అయితే అందుకోసం మీ చేత పుత్రకామేష్ఠి అనే ప్రత్యేక యాగం చేయించాలని అనుకొన్నాను.' అని అన్నాడు. దశరథ మహారాజుఅంగీకరించడంతో యజ్ఞం ప్రారంభం అయింది.

ఈలోగా, దేవతలందరు బ్రహ్మదేవుడి దగ్గరకు వచ్చి 'ఓ పితామహా! మీరిచ్చిన వరాలతో రావణుడు పెట్రేగి పోతున్నాడు. అతని దుష్టకార్యలను మేము కూడ అదుపు చేయలేకపోతున్నాము. ఇతని పీడ వదలించుటానికి ఏదైనా ఉపాయం ఆలోచించండి.' అని ప్రార్థించారు. అపుడు బ్రహ్మదేవుడు దేవతలతో'రావణుడు వరాలు కోరినపుడు మానవుడి చేతిలో మరణం కలుగరాదని కోరలేదు. అందుచేతనే అతడు అలా క్రూరుడై ప్రవర్తిస్తున్నాడు. కనుక మానవ రూపమే అతణ్ణి నిర్జించాలి.' అని అనగా, అకస్మాత్తుగా అక్కడికి ఉజ్జ్వల తేజస్సుతో విష్ణుమూర్తి ప్రత్యక్ష మైనాడు. దేవతలందరూ ఆ పరమాత్ముని పూజించి, 'ఓ జగత్పతీ! రావణ సంహారానికై నీవు దశరథ మహారాజుక నల్గురు పుత్రులుగా జన్మించి, మమ్మల్ని కాపాడండి'అని ప్రార్థించారు. అందుకు శ్రీమహావిష్ణువు 'మీరందరు నిశ్చింతగా ఉండండి. భయం వద్దు. నేను త్వరలో అవతరించి, ఆ రాక్షసుని వధించి 11 వేల సంవత్సరాలు భూమండలాన్నంతా పాలిస్తాను.' అని చెప్పి, దేవతలు చూస్తుండగానే, అదృశ్యమైనాడు.

ఈలోగా దశరథ మహారాజు యజ్ఞం చేస్తుండగా, యజ్ఞజ్వాలల్లోంచి శ్యామలవర్ణంతో, ఒక దివ్య పురుషుడు ఆవిర్భవించాడు. అపరిమిత క్తి సంపన్నుడుగా ఉన్నాడు. దివ్యాభరణాలతో శోభాయమానంగా ఉన్నాడు. చేతిలో స్వర్ణపాత్రలో సోమరసం ఉంది.' అతడు 'నేను విష్ణుదూతను' అని దశరథునితో చెప్పాడు.

వెంటనే దశరథ మహారాజు అతనికి నమస్కరిస్తూ 'ఓ దేవదూతా! నేనేమి సేవ చేయాలో చెప్పండి' అని అడిగాడు. అపుడు ఆ విష్ణు సేవకుడు 'నీ యాగఫలమే ఈ పాయస పాత్ర. దీనిని నీ ముగ్గురు భార్యలకు అందించు. వారి ద్వారా పుత్రులు కలిగి నీ యశస్సును చిరస్థాయికి చేరుస్తారు.' అని చెప్పాడు.

దశరథుడు సంతోషంతో ఆ పాయస పాత్రను స్వీకరించి, ఆ దేవదూతకు ప్రదక్షిణం చేసి, నమస్కరించాడు.

విష్ణుదూత అదృశ్య మవడంతోనే దశరథుడు ఆ పాయసాన్ని ముగ్గురు భార్యలకు భాగాలు చేసి ఇచ్చాడు. కౌసల్యకు సగం, సుమిత్రకు నాలుగో వంతు, కైకేయికి ఎనిమిదో వంతు ఇచ్చాడు. కొంచెం మిగిలితే, దాన్ని సుమిత్రకు ఇచ్చాడు. భార్యలు తాము త్వరలో తల్లులం కాబోతున్నామని ఆనందంతో పరవశించి పోతున్నారు. ముగ్గురూ పాయసం స్వీకరించగానే, వారికి తమ గర్భంలో దివ్య శిశువు ఉన్నట్లు అనుభూతి చెందారు. దశరథుడు సంతసించాడు.

ఈలోగా, బ్రహ్మదేవుడు దేవతలందరినీ ఇలా అజ్ఞాపించాడు – 'శ్రీమహావిష్ణువు త్వరలో అవతరించనున్నాడు. ఆ అవతారమూర్తికి సహాయం కోసం మీరందరు మీ మీ అంశలతో భూమిపై అవతరించండి. అనగా వానరుల రూపంలో మీరు కనే బిడ్డలు సర్వసిద్ధులై ఉండాలి. మేధావులు, యుద్ధనైపుణ్యం కలిగి ఉండాలి. విష్ణువుతో సములై, సూక్ష్మదేహులై ఉండాలి.' బ్రహ్మదేవుని ఆజ్ఞ ననుసరించి – ఇంద్రుని వల్ల వాలి, సూర్యుని వల్ల సుగ్రీవుడు, బృహస్పతి వల్ల తార, కుబేరుని వల్ల గంధమాదుడు, విశ్వకర్మ వల్ల నలుడు, వరుణుని వల్ల సుషేణుడు, వాయుదేవుని వల్ల హనుమంతుడు జన్మించారు. అప్సరసలంతా ఆడ కోతులుగాను, యక్షిణులు, నాగినులు, విద్యాధరిమణులతో సంగమించుట ద్వారా వీరందరు జన్మించారు. వీరే కాదు విష్ణువు సహాయులై, వేలమంది జన్మించారు. మహాకాయులు తమ ప్రచండ శక్తితో దేనినైనా అల్లకల్లోలం చేయగలరు, సృష్టించగలరు, మహా శక్తిసంపన్నులు. ఇలా జన్మించినవారిలో మూడు రకాల వారున్నారు. భల్లూకాలు, వానరులు, వీరు కోటిమందికి పైగా ఉంటారు. వీరితో భూమి నిండిపోయింది. అరణ్యాలలో సంచరిస్తూ, దుంపలను తింటూ విహరిస్తుంటారు.

పుత్రకామేష్ఠి యాగం పూర్తికావడంతో దేవతలు, ఋత్విజులు, ఋష్యశృంగుడు, శాంత తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. 12 నెలల తర్వాత కౌసల్యకు పుత్రుడు జన్మించాడు. ఆ దివ్య శిశువు విష్ణుమూర్తి అంశతో జన్మించినవాడు. దీర్ఘబాహువులు, సకల శుభ లక్షణాలతో కూడినవాడై వున్నాడు. తరువాత కైకేయికి విష్ణుమూర్తి నాలుగవ వంతు అంశకు ప్రతినిధిగా కుమారుడు జన్మించాడు. తర్వాత రెండు రోజులకు సుమిత్రకు కవలలు జన్మించారు. వారు విష్ణువు ఆరవ అంశకు ప్రతినిధులు. శిశువులందరూ ఒక పోలికతో ప్రకాశమానులైన ఉన్నారు. ఇది తెలిసిన దేవతలు పుష్పవర్షం కురిపించారు. గంధర్వుల గానం, అప్సరసల నాట్యం, నగర ఉత్సవాలు మారుమ్రోగాయి. పౌరులందరు సంబరాలు చేసుకొన్నారు. కౌసల్యకు జన్మించిన కుమారునికి వశిష్ఠ ముని నామకరణం జరిపించాడు. ఆ ఋషి కౌసల్య కుమారుడికి శ్రీరామచంద్రుడని, కైకేయి బిడ్డకు భరతుడని, సుమిత్ర కవలలకు లక్ష్మణ, శతృఘ్నులని పేరు పెట్టారు. ఆ మహర్షియే అన్ని సంస్కారాలు జరిపించి, చివరగా ఉపనయనాలు కూడా జరిపించాడు. వశిష్ఠుని మార్గదర్శనంలోనే ఆ కుమారులు నల్గురు వేదవేదాంగ కోవిదులుగాను నానా శస్త్రాస్త్ర ప్రవీణులుగాను, దైవీగుణ సంపన్నులుగాను తీర్చిదిద్దబడ్డారు.

శ్రీరాముడు సోదరులందరికంటే మిన్నగా కన్పించేవాడు. దశరథుడు అందుకే రాముని మిక్కిలిగా ప్రేమించేవాడు. లక్ష్మణుడు చిన్నతనం నుండి రామునిపై ప్రేమానురాగాలు చూపేవాడు. లక్ష్మణుడు లేనిదే రాముడు లేడనేంత బంధం వారి మధ్య ఉండేది. భరత శత్రుఘ్నులు కూడ పరస్పరం విశేష ప్రేమాభిమానాలతో ఉండేవారు.

రాముని తర్వాత లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు తమ తమ విద్యాభ్యాసాన్ని పూర్తి కావించుకొన్నారు. ఇక వారి వివాహాల గురించి దశరథుడు వశిష్ఠుని సంప్రదించసాగాడు. అలా చర్చిస్తున్న సమంలో మహనీయ బ్రహ్మర్షి విశ్వామిత్రుడు అక్కడికి వచ్చాడు. దశరథ మహారాజు, వశిష్ఠుడు అందరూ లేచి స్వాగతం పలికారు.

పూజాదికాలు నిర్వర్తించి, దశరథుడు విశ్వామిత్రుణ్ణి రాజసభలోకి తీసుకొని వచ్చి, ఒక ఆసనం చూసి కూర్చోబెట్టి 'ఓ ఋషివరేణ్యా! చేతికి అమృతభాండం లభించినట్లు, సంతానరహితునకు పుత్రోదయం కలిగినట్లు, పోగొట్టుకొన్న నిధి లభించినట్లు మీ రాక నాకు మిక్కిలి ఆనందాన్ని ప్రసాదించింది. అంటూ ఋషికి అభివాదాలు తెలిపాడు. విశ్వామిత్రునికి, దశరథ మహారాజుకు మధ్య కుశల ప్రశ్నలు ముగియగా 'ఓ మహర్షీ! మీ రాక నా భాగ్యం. నాకు గౌరవం లభించింది. మీ అభిలాష ఏమిటో చెప్పితే, నేను నెరవేరుస్తాను.' అని దశరథ మహారాజు అన్నాడు.

అందుకు సంతసించిన విశ్వామిత్రుడు 'రాజా! నేనొక యజ్ఞం చేస్తున్నాను. కాని మారీచ సుబాహులనే రాక్షసులిద్దరు యజ్ఞ నిర్వహణకు విఘ్నం చేస్తున్నారు. భగ్నం చేయాలనే పట్టుదలతో ఉన్నారు. నా యజ్ఞాన్ని విజయవంతం చేసుకొనేందుకు, ఆ రాక్షసులను సంహరించేందుకు నీ రాముణ్ణి తీసుకొని పోదామని వచ్చాను. తండ్రిగా ప్రేమతో నిరాకరించవద్దు. ఎందుకంటే రాముడు ఈ పనిని చాల సులభంగా చేయగలడు. నీ ఔదార్యానికి నేను నీకు ఆశీర్వాదాలు ఇస్తాను. కనుక పది రోజుల పాటు రాముని నాతో పంపు. అతడు సురక్షితంగా తిరిగి నిన్ను చేరుకొంటాడు. అనుమానం వద్దు" అని అన్నాడు. విశ్వామిత్రుడి మాటలు బల్లేల్లా దశరథుని హృదయాన్ని గ్రుచ్చాయి. శరీరం వణకసాగింది. రాజు మూర్ఛ పోయాడు. కొంతసేపటిలో తేరుకొని, మళ్ళీ రాముడు తనను వదలి వెళుతున్నాడనే భావం మదిలో రాగానే, మళ్ళీ మూర్ఛిల్లి నేలమీద పడిపోయాడు. గంట తర్వాత రాజు స్పృహలోకి వచ్చాడు. ఎదురుగా వున్న విశ్వామిత్రుని చూస్తూ 'ఓ ఋషీశ్వరా! నా రామునికి 16 సం॥ల వయస్సు. క్షత్రియ విద్యలు పూర్తి చేయలేదు. యుద్ధం అంటే తెలియనివాడు. వానిని అర్థించవద్దు. ఆ రాక్షసులను వధించటానికి నేను స్వయంగా ఒక అక్షౌహిణి సైన్యంతో వస్తాను. ఒకవేళ రాముడే కావాలంటే అతని వెంట నేను, నా సైన్యాన్ని కూడ రానీయండి. ప్రియ మహర్షీ! నేను వృద్ధుణ్ణి. రాముడు లేకుండా నేను జీవించలేను. ఆ రాక్షసులెవరో చెప్పండి." అని విశ్వామిత్రుని అభ్యర్థించాడు రాజు.

అందుకు విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు. 'లంకా నగరాన్ని పరిపాలించే రావణుడనే వాడు రాక్షసుల రాజు. అతడు ప్రపంచంలో దమనకాండ సాగిస్తున్నాడు. తాను రాలేని సమయాల్లో, మారీచ సుబాహులనే ఇద్దరు రాక్షసుల్ని పంపిస్తూ, ఆయా దుష్కార్యాలు చేయిస్తుంటాడు.' అని విశ్వామిత్రుడు సమాధానం ఇచ్చాడు.

రావణుడి పేరు వినగానే దశరథ మహారాజుకు వణుకు పుట్టింది. 'రావణుడితో పోరాడగలిగే వారెవరూ లేరు. ఆ ఇద్దరిని వధించడం కూడా సాధ్యం కాదు. కనుక ఓ మహర్షీ! మీ కోరికను నేను తీర్చలేను. నా రాముని నీ వెంట పంపడమనే ఆలోచనే నేను భరించలేను.' అని చెప్పాడు.

దాదాపు దుఃఖభారంతో దశరథుడు మతిస్థిమితం తప్పి, ఏదేదో మాట్లాడటం ప్రారంభించాడు. దీనితో ఋషి తీవ్రమైన మనస్తాపంతో 'ఓ మూర్ఖ రాజా! నీ ఈ అనుచిత ప్రవర్తన నీ వంశనాశనానికి కారణమవుతుంది. నా సేవకు మాట ఇచ్చి తప్పావు. రఘువంశంలో ఇలాంటి ప్రవర్తన ఎవరికీ లేదు. ఈ దరిద్రపు రాజ్యం నుండి వెంటనే వెళ్ళిపోతాను. అని ప్రకటించాడు విశ్వామిత్ర మహర్షి.

విశ్వామిత్రుని కోపానికి భూమి కంపించింది దేవతలు భయభ్రాంతులైనారు. అపుడు వశిష్ఠుడు దశరథుని సమీపించి, 'ఓ రాజా! ఇన్నాళ్ళూ సంపాదించుకొన్న పుణ్యాన్ని నాశనం చేసికోకు. సత్యమార్గాన్ని వీడవద్దు. నీ వాగ్దానం మేరకు రాముని విశ్వామిత్రునితో పంపు. ఆయన కోరికను మన్నించు. నీవు భయపడవద్దు. విశ్వామిత్రుడు

కూడ పూర్వం ఒక మహారాజు. పరమశివునినుండి దివ్యాయుధాలను పొందిన ఘనుడు. ఆ ఆయుధాలను, తన శక్తియుక్తులను రామునికిచ్చి, రాక్షసులను మట్టుబెట్టిస్తాడు. నిజానికి విశ్వామిత్రుడే ఆ రాక్షసులను సంహరించ గలడు. కాని రాముని యశస్సును ఘనపరచడానికే రాముని పంపమని కోరుతున్నాడు.' అని చెప్పాడు.

ఈ పలుకులను వినిన దశరథుని మనస్సు భయం వీడి, కుదుట పడ్డాడు. విశ్వామిత్రుని కోరికను మన్నించుటకు సమ్మతించాడు. రాముని రాజాస్థానానికి రమ్మని కబురంపాడు. రామునితో పాటు లక్ష్మణుడు కూడ వచ్చాడు. తండ్రి యెదుట నిలబడ్డారు. కుమారుల తలలను నిమిరాడు. విశ్వామిత్రుడు నడుస్తుండగా, ఆయన వెనుకనే, రామలక్ష్మణులు ధనుర్బాణాలు ధరించి నడువసాగారు. వారు రాజసౌధాన్ని వీడిపోతున్న సమయంలో పూలవాన కురిసింది.

సరయూ నదీతీరాన 12 మైళ్ళు నడిచిన తర్వాత విశ్వామిత్రుడు ఆగి 'నాయనా! రామా! నీవు ఆచమనం చేస్తే నీకు బల, అతిబల అనే రెండు మంత్రాలను ఉపదేశిస్తాను. వాటితో నీకు అలసట, వృద్ధాప్యం ఉండవు. గొప్ప జ్ఞానం, శక్తి కూడ లభిస్తాయి. ఈ గుణాలు నీలో ఇప్పటికే ఉన్నాయి. కాని నీ శ్రేయస్సు కోరి వీటిని ఉపదేశిస్తున్నాను.' అని అన్నాడు.

మంత్రోపదేశంతో రాముడు వేయి సూర్యుల వెలుగుతో ప్రకాశించాడు. ఆ తరువాత వారు సరయు, గంగానదీ తటాల మీద ఆరాత్రి నిద్రించారు. రాముడు అక్కడ ఒక ఋషి ఆశ్రమం వుండడం గమనించి, దాని చరిత్ర చెప్పమని విశ్వామిత్రుని కోరగా, విశ్వామిత్రుడు 'కామదేవుడైన మన్మథుడు పరమశివుని తపోదీక్షను భస్మం చేయాలని ప్రయత్నించడంతో, ఈ ప్రదేశంలో శివుడు అతనిని భస్మీపటలం చేశాడు.' అని జవాబు ఇచ్చాడు.

మరురోజు ఉదయమే, వారు గంగానదిని దాటారు. ప్రవాహం మధ్యలో ఉండగా రామునికి పెద్ద జలపాతపు శబ్దం వినిపించింది. ఆ శబ్దమేమిటని రాముడు అడుగగా, విశ్వామిత్రుడు 'ఒకసారి బ్రహ్మదేవుడు తన మనసునుండి ఒక సరస్సును సృష్టించాడు. అదే మానస సరోవరంగా ప్రసిద్ధి చెందింది. దానినుండే సరయూనది ప్రవహించేది. ఇపుడు నీవు వింటున్న శబ్దం మానస సరోవరం నుండి వస్తున్న జలాలు గంగానదిలో ప్రవేశించటప్పుడు వినిపించేదే. ఓ రామా! ఈ పుణ్యస్థలిలో ప్రార్థనలు చేసి, నమస్కరించు' అని చెప్పాడు.

గంగానది దక్షిణ తీరానికి చేరుకోగానే, రామునికి ఒక దట్టమైన అరణ్యం కనిపించింది. సంచారమే లేని భయంకర అరణ్యం గురించి చెప్పమని రాముడు అడుగగా, విశ్వామిత్రుడు 'రాక్షసునిగా కనిపించే వృత్రాసురుణ్ణి ఇంద్రుడు సంహరించాడు. ఆ పాపంతో ఇంద్రుడు తేజస్సు కోల్పోయాడు. ఆ శక్తిని పునరుద్ధరించటానిక దేవతలు వేదమంత్రాలతో శక్తివంతం చేయబడిన గంగాజలంలో స్నానం చేయించారు. తరువాత ఇంద్రుని కల్మషాలతో కలుషితమైన ఆ నీటిని ఇక్కడ స్థాపితం చేశారు. ఈ భూభాగం తన పాపఫలాలను స్వీకరించనందున ఇంద్రుడు దీనికి సిరిసంపదలతో తులతూగేట్లు వరాన్ని ప్రసాదించాడు. తత్ఫలితంగా ఇక్కడ మలదా, కరంశ అనే రెండు సంపన్న రాజ్యాలు వెలశాయి. కాని తర్వాత కాలంలో తాటక అనే రాక్షసి ఇక్కడి ప్రజలను భయపెట్ట సాగింది. ఆ రాక్షస స్త్రీ సునందుడి భార్య. మారీచుడే వారి కొడుకు. వాడిని వధించటానికే నేను నిన్ను ఇక్కడికి తీసుకొని వచ్చాను. రామా! తాటక బాధలు తట్టుకోలేక జనం వెళ్ళిపోవడంతో నిర్జనమై పోయింది. రామా! నీవు ఈ రోజు ఈ ఆడరాక్షసిని వధించి, ప్రజల ఇక్కట్లను తీర్చాలి. ఈ రాక్షసి బ్రతికి వున్నంత కాలం ఈ అడవిలో

ఎవరూ అడుగు పెట్టలేరు.' అని చెప్పాడు.

అపుడు రాముడు 'ఓ మహర్షీ! అసలు ఈ రాక్షసికి ఇంతటి శక్తి సామర్థ్యాలు ఎలా వచ్చాయో చెప్పగలరా? అని అడిగాడు. అపుడు విశ్వామిత్రుడు 'ఒకప్పుడు సుకేతుడు అనే శక్తివంతుడైన యక్షుడుండేవాడు. అతడు తపోబలంతో బ్రహ్మదేవుని వద్ద వరాలు పొందాడు. కుమారుని కోరుకొన్నాడు. కాని బ్రహ్మదేవుడు శక్తివంతురాలైన కుమార్తెను ప్రసాదించాడు. ఆ అందాల కుమార్తెకు తాటకి అని పేరుపెట్టి, మయస్సు రాగానే సునందుడికి ఇచ్చి పెండ్లి జరిపించాడు. తర్వాత అగస్త్యుని శాపంతో సునందుడు చనిపోయాడు. పగ తీర్చుకొనుటకు తాటకి తన కుమారుడైన మారీచునితో కలిసి ఆ ఋషిని మ్రింగివేయాలని ప్రయత్నించారు. అగస్త్యుడు వెంటనే వారిని రాక్షసులుగా మారిపొమ్మని శపించాడు. ఫలితంగా తాటక రాక్షసి అయింది. అగస్త్య మహర్షి ఇక్కడే తపస్సు చేసుకొంటూ వుండేవాడు. కనుక తాటక పంతంతో ఇక్కడనే అరాచకాలు సృష్టించసాగింది.

'నాయనా! రామా! తాటక మహా దుష్టురాలు. ఆడమనిషిని చంపరాదనే ఆలోచన చేయవద్దు. పూర్వం విరోచనుడి కుమార్తె భూమిని అల్లకల్లోలం చేస్తుంటే. ఇంద్రుడు ఆమెను చంపిన విషయం గుర్తుతెచ్చుకో. అలగే భృగుముని భార్య ఇంద్రుని చంపదలచుకునప్పుడు విష్ణుమూర్తి ఆమెను చంపాడు కదా! కనుక ఏ అనుమానం పెట్టుకోకుండా, నా ఆజ్ఞను పాటించడానికి తయారుగా వుండు' అని అన్నాడు.

ఈ ఆజ్ఞను వినగానే రాముడు ధనుష్టంకారం చేశాడు. ఆ ధ్వని భయంకరమై నలుదిక్కులా వ్యాపించి, ఋషులు భయకంపితులైనారు. ఈ ధ్వని విన్న తాటకి కూడ ఆశ్చర్యంతో రెచ్చిపోయింది. క్రోధంతో శబ్దం వచ్చిన దిశలో తాటకు పరుగులు తీసింది.

తాటకను చూచిన రాముడు 'లక్ష్మణా! ఈ ఘోర స్త్రీ రాక్షసిని చూడు. ఈ రాక్షసి స్త్రీ కనుక నేను చంపను. కాని ఆమె చేతులను, కాళ్ళను నరికి ముక్కలు ముక్కలు చేసి, చెవులు కోసి, నిరాకారిగా చేస్తాను. దానితో చేసేదేమీ లేక ఆ తావున పడివుంటుంది.' అని అన్నాడు.

తాటక ధూళి తుఫాను సృష్టించి రామలక్ష్మణులను అంధులను చేసేసింది. తన మాయశక్తులతో శిలావర్షం కురిపించింది. శ్రీరాముడు ఆ శిలలను ఖండిస్తూ వేగంగా దూసుకుపోయి తాటక ముంజేతులను ఖండించాడు. లక్ష్మణుడు తాటక చెవులను, ముక్కును కోసేశాడు. తాటక మాయశక్తితో అదృశ్యమైంది. మళ్ళీ శిలావర్షాన్ని కురిపించింది. విశ్వామిత్రుడు 'ఓ రామా! సంధ్యాసమయం కావస్తోంది. రాక్షసులు రాత్రివేళ శక్తి పుంజుకొంటారు కనుక తాటక మీద దయ చూపించకుండా, వెంటనే వధించు' అని అన్నాడు. రాముడు, తాటక తన మీదకు దూసుకు వచ్చినా, భయపడకుండా తన అమ్ములపొంది నుండి ఒక స్వర్ణ శరాన్ని తీసి, ఆ రాక్షసిపై వదిలాడు. ఆ బాణం నిప్పులు కక్కుతూ తాటక వక్షస్థలంలో దిగబడగా, ఒక పెద్ద కేకతో తాటక నేలకూలి మరణించింది. ఆకాశం నుండి దేవతలు పూలవర్షం కురిపించారు. గంధర్వులు, అప్సరసలు తమ ఆనందాన్ని వ్యక్తపరచారు. మహర్షులు శ్రీరాముని పరాక్రమాన్ని కీర్తించారు.

ఆ తరువాత ఇంద్రాది దేవతలు విశ్వామిత్రుణ్ణి కలుసుకొని 'ఓ మహర్షీ! శ్రీరాముడు సాధించవలసిన ఒక ముఖ్యమైన జీవన కార్య మొకటి వున్నందున, నీకు తెలిసిన దివ్యాస్త్రాలనన్నింటిని అతనికి బోధించు' అని చెప్పి అంతర్థానమైనాడు. విశ్వామిత్రుడు మరురోజు ఉదయం తనకు తెలిసిన దివ్యాస్త్రాల నన్నింటిని శ్రీరామునికి ఉపదేశించాడు. రాముడు ఉపదేశం పొందిన సమయంలో, ఆయా అస్త్రాలు రూపం దాల్చి రాముని ముందు

నిలిచి 'రామా ఆజ్ఞ ఇవ్వు. మేము మీకు ఏవిధంగా సేవ చేయాలో సెలవివ్వు' అని అడిగాయి. అపుడు రాముడు 'నేను మిమ్మల్ని తలచిన మాత్రముననే, మీరు నాముందు వచ్చి నిలవాలని నా ప్రార్థన' అని జవాబు ఇచ్చాడు. అస్త్రాల రూపాలు అదృశ్యమైపోగా, విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు ముందుకు సాగారు.

వారు అదే రోజు విశ్వామిత్రుని ఆశ్రమానికి చేరుకొన్నారు. ఆ ఆశ్రమ విశేషాల్ని చెప్పమని శ్రీరాముడు విశ్వామిత్రుని కోరగా, ఆయన ఇలా చెప్పాడు. 'రామా! ఈ సిద్ధాశ్రమంలోనే పూర్వం వామనమూర్తి కొన్ని లక్షల సంవత్సరాలు నివసించాడు. ఒకసారి దేవతలు వామనుని దర్శించుకొని యజ్ఞ దీక్షలో ఉన్న బలి మహారాజును సందర్శించవలసిందిగా కోరారు. రాక్షస రాజైన బలి మహారాజు ముల్లోకాలను జయించి వున్నందున, ఆయనను యాచించి వామనుడు ఆ లోకాలను స్వాధీనం చేసుకోవాలని వామన మూర్తిని వారు వేడుకొన్నారు. సరిగ్గా అదే సమయంలో కశ్యపుడు కూడ కార్యక్రమానికి వచ్చాడు. ఆయన వామనుని పూజించి, ఆయన్ను తన కుమారునిగా అవతరించమని ప్రార్థించాడు. అందుకు అంగీకరించి, అదితి కశ్యపులను కుమారునిగా మరుగుజ్జు బ్రాహ్మణునిగా అవతరించడం జరిగింది. ఆయన బలి మహారాజు దగ్గరకు వెళ్ళి మూడు అడుగుల నేల అడగటం అనే సాకుతో ఆయన యజ్ఞాన్ని స్వాధీనం చేసుకునే దేవకార్యాన్ని నెరవేర్చాడు.'

విశ్వామిత్రుడు తన ఆశ్రమానికి చేరుకోగానే, యజ్ఞ దీక్షకు ఉపక్రమించాడు. రామలక్ష్మణులు ధనుర్ధారులై మారీచ సుబాహుల కోసం ఎదురు చూస్తున్నారు. ఆరు రోజుల పాటు నిద్రాహారాలు లేకుండా యజ్ఞవాటికను సోదరులు సంరక్షిస్తూ వున్నారు. కీలకమైన ఆరవరోజు రాత్రి సోమరసాన్ని పిండుతుండగా, రాక్షసుల రాకను సూచిస్తుందన్నట్టుగా, యజ్ఞ జ్వాల భగ్గున మండుతూ పైకి లేచింది. వెంటనే ఆకాశంలో భయంకర కేకలు వినిపించాయి. అకస్మాత్తుగా మారీచ, సుబాహులు అనుచరులతో విరుచుక పడ్డారు. యజ్ఞవాటికను ఛిన్నాభిన్నం చేయబోయారు. రాముడు లక్ష్మణునితో 'లక్ష్మణా! ఈ దుష్టులు కొన్ని సంవత్సరాలు జీవించవలసి వుంది. అందుచేత నేను వీళ్ళను చంపను. కాని ఆయుధాలతో వీరిని లొంగదీస్తాను.' అని చెప్పాడు. రాముడు ఒక మహత్తర అస్త్రాన్ని ప్రయగించగా, అది మారీచుడి రొమ్ము ఛేదించి, వాడిని దూరాన సముద్రం మధ్యలో విసిరి వేసింది. మరొక శక్తివంతమైన బాణాన్ని సంధించగా, అది సుబాహుడి గుండెల్లో దిగబడి, వాడు నేలకూలి మరణించాడు. మరో అస్త్రంతో రాముడు మిగతా రాక్షసుల్ని అక్కడినుండి పారద్రోలాడు. అంతటితో ఆ ప్రాంతం అంతా శాంతించి, ప్రశాంతత నెలకొంది. తర్వాత ఆ ఆశ్రమంలో నివసించి, భయపడిన ఋషులందరూ వచ్చి, శ్రీరాముడు చేసిన అద్భుత కార్యానికి అభినందనలు తెలిపారు. ఆ సాయంకాలానికి యజ్ఞం నిరాటంకంగా సంపూర్ణమైంది.

ఆరాత్రి గడచిన తర్వాత శ్రీరాముడు ఋషుల ఎదుటకు వచ్చి 'ఓ పూజ్య బ్రాహ్మణులారా! రాక్షసుల బారినుండి ఇప్పుడు ఈ ప్రాంతం విముక్తమైంది కదా! నేను ఇంకా ఏమైనా సేవ చేయాల్సి వుంటే చెప్పండి.' అని అడిగాడు. విశ్వామిత్రుని సూచన మేరకు ఋషులు శ్రీరామునితో 'జనక మహారాజు యజ్ఞం చేస్తున్నాడు. మేము అక్కడికి వెళ్తున్నాం. మీ సోదరులు కూడ మాతో పాటు మిథిలా నగరానికి రావలసిందిగా ప్రార్థిస్తున్నాం. పూర్వం పరమశివుడు దేవతలకు ప్రసాదించిన అద్భుతమైన ధనస్సు ఒకటి యజ్ఞ వేదికపై ఉంది. తరువాతి కాలంలో మిథిలను పాలించిన దేవవ్రత మహారాజుకు దేవతలు ఆ ధనస్సును బహూకరించగా ఆ దివ్య ధనస్సును దేవతలు సైతం ఎక్కుపెట్ట లేకపోయారు. ఇక మానవులు ఏమి చేయగలరు? చాలకాలంగా ఆ ధనస్సు మిథిలలోనే వుంటూ వచ్చింది. దానిని అక్కడ ఒక పీఠంపై వుంచి పూజాద్రవ్యాలతో పూజిస్తూ ఉంటారు.' అని జవాబు

ఇచ్చారు. ఇది వినిన రాముడు ఋషులతో కలిసి వెళ్ళటానికి విశ్వామిత్రుని అనుమతి కోరాడు. విశ్వామిత్రుడు కూడా అందుకు సమ్మతించాడు. ఆపై జనక మహారాజు యజ్ఞానికి కావలసిన సామగ్రితో వంద రథాలతో ఒక మహాయాత్ర ప్రారంభమైంది.

వారు రోజంతా ప్రయాణించి శోణనదీ తీరానికి చేరుకొన్నారు. ఆ రాత్రి అక్కడే విశ్రమించారు. విశ్రాంతిగా వున్న విశ్వామిత్రుని శ్రీరాముడు ఆ స్థల చరిత్ర విశేషాలు ఏమైనా వుంటే చెప్పమని అడిగాడు. అపుడు విశ్వామిత్రుడు క్రింది కథను శ్రీరామునికి వివరించాడు. 'బ్రహ్మదేవుడికి స్వయగా కుశుడనే మహర్షి కుమారుడుగా ఉండేవాడు. కుశునికి నలుగురు క్షత్రియ కుమారులు జన్మించి నాలుగు నగరాలు నిర్మించారు. అందులో ఒకటి శోణనదీ తీరాన ఉంది. కుశుని కుమారుడైన కౌశనాభుడికి ఘృతాచి అనే అప్సరస ద్వారా నూరుమంది కుమార్తెలు జన్మించారు. వారందరూ అపురూపసౌందర్యవతులై ఈ నదీతారాన ఆడుకొంటూ ఉండేవారు.

ఒకనాడు వాయుదేవుడు వీరి సౌందర్యాన్ని చూచి మోహితుడైనాడు. వాయుదేవుడు వారిని సమీపించి 'ఓ సుందరీమణులారా! మీరందరూ నా భార్యలైనట్లయితే, మీ ఈ రూప సౌందర్యాలను దివ్యమైనవిగా మార్చేస్తాను.' అని అన్నాడు. ఆ తరుణీమణులు ఆకర్షితులు కాకపోగా, తమను వాయుదేవుడు అవమానించినట్లు వారు భావించారు. అతనితో 'మేము మా భర్తలను ఎంపిక చేసుకునే ఆలోచన లేదు. మా తండ్రి నిర్ణయాన్ని బట్టే మేము పెండ్లి చేసుకుంటాం. గొప్ప రాజర్షి పుత్రికలమైన మేము నీవు చేసిన తప్పుకు నిన్ను శపించగలం. కాని మా తపస్సు వల్ల లభించే పుణ్యఫలాన్ని తగ్గించుకొనే ఉద్దేశం మాకు లేదు. అందుచేతనే నిన్ను శపించకుండా వదలి వేస్తున్నాం' అని వారు సమాధానమిచ్చారు. ఆ మాటలు విన్న వాయుదేవుడు ఉగ్రుడైనాడు. ప్రతీకారంతో ఆయన ఆ వందమంది యువతుల శరీరంలోనికి సూక్ష్మరూపంలో ప్రవేశించి తన మంత్రశక్తితో వారి సహజ లక్షణాలను అవలక్షణాలుగా మార్చివేశాడు. వారు ఏడుస్తూ రాగా, తండ్రి వారి శరీరాలను చూచి ఆశ్చర్యపడినాడు. కుమార్తెలు జరిగినదంతా చెప్పారు. వాయుదేవుని శపించకుండా నిగ్రహం ప్రదర్శించినందుకు వారిని అభినందించాడు. కాని వారి వివాహం ఎలా చేయాలనే ఆలోచనలో పడిపోయాడు.

పూర్వం చులి అనే గొప్ప బ్రహ్మచారి తపస్సుకు పూనుకొన్నాడు. ఒక గంధర్వ యువతి అతనికి పరిచర్యలు చేస్తుండేది. ఆమె చేసిన సేవలకు ప్రసన్నుడై ఆమెను వరం కోరుకోమని చులి అడిగాడు. ఆమె తన కన్యాత్వానికి భంగం కలుగకుండా గొప్ప పుత్రుని ప్రసాదించమని కోరింది. చులి సమ్మతించగా, ఆమెకు మహా తేజోరాశియైన మహా తపస్సంపన్నుడైన బ్రహ్మదత్తుడు అనే మానసపుత్రుడు జన్మించాడు. కాలక్రమంలో బ్రహ్మదత్తుడు రాజై రాజ్యపాలన చేయసాగాడు. ఆ బ్రహ్మదత్తుడే, తన కుమార్తెలకు తగిన వరుడని కుశనాభుడు నిశ్చయించుకొన్నాడు.

అలా ఆహ్వానించబడ్డ బ్రహ్మదత్తుడు వారిలో ముగ్గురు యువతులను మాత్రం స్వీకరించాడు. పాణిగ్రహణంతో వారి కురూపాలు అదృశ్యమై, పూర్వమున్న సౌందర్యాన్ని తిరిగి పొందారు.

ఆ తరువాత విశ్వామిత్రుడు ఇలా కొనసాగించాడు. 'కుశనాభునికి కుమారులు లేనందున, అందుకోసం ఒక యజ్ఞం చేశాడు. ఫలితంగా, కుశనాభుడికి గాధి జన్మించాడు. ఆ గాధిరాజు కుమారుణ్ణి నేనే' అంటూ కథ ముగించాడు.

మరునాడు వారంతా ప్రయాణించి, చీకటిపడే సమయానికి గంగాతీరం చేరుకొన్నారు. ఆ రాత్రి అక్కడే విశ్రమించగా, శ్రీరాముడు విశ్వామిత్రుని గంగానది చరిత్ర చెప్పమని అడుగగా, విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు.

‘హిమాలయాల అధిష్ఠాన దైవమైన హిమంతుడికి, మేరుపర్వత రాజపుత్రియైన మేనక ద్వారా గంగ, ఉమ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. ఒకప్పుడు బ్రహ్మదేవుడు హిమవంతుని సమీపించి, విశ్వశ్రేయస్సుకై గంగను దేవతలకు దత్తం చేయమని కోరాడు. హిమవంతుడు సమ్మతించాడు. తరువాత ఉమ శివుని గురించి ఘోర తపస్సు చేస్తూ, అనుక్షణం ఆయన స్మరణలోనే వుండడం చేత ఉమను శివునికి సమర్పించాడు. ఉమను చేపట్టిన నాటినుండి, శివుడు ఆమెతో శృంగారానుభవంలో నిమగ్నుడై పోయాడు. ఇలా వారిద్దరి మధ్య వంద దివ్య సంవత్సరాలు గడిచినా, సంతానం కలుగలేదు.

ఆ సమయంలో దేవతలందరు పరమశివుని సమీపించి ‘మహాదేవా! నీ శృంగార చేష్టలు ఆపు. ఎందుకంటే నీకు పుట్టబోయేవాడు ఈ విశ్వం భరించలేనంత శక్తిశాలి అవుతాడని మా భయం. నీవు ఇక తపస్సులో మునిగిపోవాలని మేము వినయంగా ప్రార్థిస్తున్నాం’ అని అన్నారు.

అందుకు పరమశివుడు ‘నిజానికి నా హృదయం ఆత్మసాక్షాత్కారానికే మొగ్గు చూపుతున్నందున మీ ప్రతిపాదనను నేను స్వీకరిస్తాను. కాని ఇప్పటికే నా వీర్యశక్తి నా హృదయం నుండి పట్టుతప్పినందున, అది ఎక్కడున్నా స్వీకరించక తప్పదు’ అని సమాధానం చెప్పాడు. అందుకు దేవతలు ‘ఎంత బారాన్ని అయినా భరించగల భూమి నీ బీజాన్ని స్వీకరించుగాక’ అని సూచించారు.

అంతట పరమశివుడు తన వీర్యశక్తిని విడుదల చేయగా, అది ప్రవహించి భూతలాన్ని వశం చేసుకొంది. ఇది గమనించిన దేవతలు భూమి ముక్కలవుతుందేమోనని భీతిచెందారు. ఆ విధంగా ఆక్రమిస్తున్న శివుని వీర్యశక్తిని ధరించమని అగ్నిదేవుణ్ణి, వాయుదేవుణ్ణి ప్రార్థించసాగారు. దేవతల ప్రార్థనను మన్నించి, వాయుదేవుని సహాయంతో అగ్ని ఆ వీర్యశక్తిని ధరించ పూనుకొన్నాడు. అగ్నిదేవుని స్పర్శ తగలగానే శివుని వీర్యశక్తిలో కొంత భాగం ఒక ధవళ పర్వతంగా మారి, అందులోనే కొంత తెల్లని రెల్లుగడ్డితో నిండిన ప్రకాశవంతైన పొగగా మారిపోయింది. తక్కిన వీర్యశక్తి యధాపూర్వంగా ప్రవహిస్తూ ఉండగా, అగ్నిదేవుడు దానిని తనలో ధరించాడు. ఈ గొప్ప ఉపద్రవం నుండి ఇలా భూమండలం కాపాడబడినందుకు దేవతలు సంతోషించారు. పరమశివుణ్ణి, ఆయన పత్నిని పూజించటానికి వెళ్లారు కృతజ్ఞతా భావంతో. కాని ఉమాదేవి మాత్రం తాము సంయోగానందంలో పరవశులై యుండగా అంతరాయం కలిగించినందున దేవతలపై ఆగ్రహించింది. ‘మీ భార్యలందరు వంధ్య స్త్రీలు అగుదురు గాక! భూమి కూడ సంభోగరహితం కావడమే కాదు, అసంఖ్యాక రాజులచే పాలించబడు గాక!’ అని శపించింది. ఆ తరువాత పార్వతీ పరమేశ్వరులు తపస్సు సాగించటానికి హిమాలయాల ఉత్తర దిశకు వెళ్ళిపోయారు.

అలా కొంతకాలం జరిగిన తరువాత దేవతలు తమను రాక్షసులు వేధిస్తుండుటచే, సేనాధిపతికై బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళారు. బ్రహ్మదేవుడు – పార్వతి శాపకారణంగా సేనాధిపతి కాగల పుత్రుణ్ణి మీరెవరు ఉత్పన్నం చేయలేరు. అందుచేత పరమశివుని వీర్యశక్తిని అగ్నిదేవుడు గంగానదీ గర్భంలో ఉంచాలని నా సూచన. అప్పుడైతే గొప్ప వీరుడైన పుత్రుడు కలుగుతాడు.’ అని సూచించాడు.

తరువాత వారు అగ్నిదేవుని సమీపించి, బ్రహ్మదేవుని ఆదేశాలు తెలియపరచారు. అగ్నిదేవుడది విని, దేవనదియైన మందాకినీ గంగను సమీపించి, తాను చాలకాలంగా ధరించి ఉన్న పరమశివుని వీర్యాన్ని స్వీకరించమని కోరాడు. గంగాదేవి అందుకు సమ్మతించింది. ఆమె మహాసౌందర్యరాశిగా రూపం దాల్చి, అగ్నిదేవుని వల్ల గర్భం దాల్చింది. కాని భరించలేని వేదనను పొందింది. ఈ గర్భాన్ని భరించలేను. శివ వీర్యశక్తి మంటతో ఉన్నాను’ అని

అగ్నితో చెప్పింది. అపుడు అగ్నిదేవుడు ఆ వీర్యాన్ని హిమలయాల్లో ఏదో చోట విడిచిపెట్టమని చెప్పగా ఆమె వేగంగా అక్కడికి వెళ్ళింది. అలా గంగా దేహస్పర్శతో కాంతులీనే తేజస్సును సంతరించుకొని శివ వీర్యశక్తి ధవళ పర్వతం మీద తెల్ల రెల్లు పొదలోపడింది. అలా ఒక అద్భుతమైన శిశువు ఆవిర్భవించాడు. వీర్యశక్తిలోని ఇతర భాగాలు భూమిపై పడిన చోట్ల అది వెండి, బంగారు గనులుగా మారింది. వాస్తవానికి పరమశివుని వీర్యశక్తి కారణంగానే ప్రపంచంలో సుదూర ప్రాంతాల్లో రాగి గనులు, ఇనుప గనులు ఏర్పడటం జరిగింది. ఆ శిశువు జనించగానే అతని పోషణ కొరకు దేవతలు ఆరుగురు దేవ వనితలను తీసికొని వచ్చారు. ఆ బిడ్డ వారి బిడ్డగానే గుర్తింపు ఉంటుందని ఆ స్త్రీలకు దేవతలు హామీ ఇచ్చారు. ఈ కారణంగానే ఆ శిశువు కార్తికేయుడని పేరుగాంచాడు గంగా గర్భం నుండి ఉదయించిన కారణంగా ఆ బాలునికి స్కందుడు అని పేరు కూడా ఉంది.

తన ఎదుట ఆరు తల్లులను చూచిన ఆ శిశువు, వారి చనుబాలు త్రాగటానికి ఆరు ముఖాలు ఏర్పరచుకున్నాడు. స్కందుడు ఎంత శక్తిశాలి అంటే అతడు వయసులో ఉన్నప్పుడే దేవతల సేనాధిపతిగా ఎందరో భయంకర రాక్షసులను సంహరించాడు.

ఆ తర్వాత విశ్వామిత్రుడు శ్రీరామునికి సగర చక్రవర్తి కథను వినిపించాడు. ఈ సగర చక్రవర్తి పూర్వకాలంలో అయోధ్యను రాజధానిగా చేసుకొని ప్రపంచాన్ని పరిపాలించినవాడు. ఆయనకు ఇద్దరు భార్యలున్నా సంతానం లేనందున ఇద్దరు భార్యలతో కలిసి తపస్సుకై హిమాలయాలకు వెళ్ళాడు. భృగు మహర్షి ఆయన తపస్సుకు మెచ్చి ఇద్దరు భార్యలలో ఒకరికి పుత్రుడు జన్మించి వంశం నిలుపుతాడని, మరొక భార్యకు 60 వేలమంది పుత్రులు జన్మిస్తారని అనుగ్రహించాడు.ా మాటలు విన్న భార్యలు ఎవరికి ఏ విధమైన సంతానం కలుగుతుందని భృగుమహర్షిని అడిగారు. ఎవరికేది కావాలో మీరే ఎంచుకోండి అన్నాడు మహర్షి. ఫలితంగా పెద్దరాణి కేశిని తనకు ఇక్ష్వాకు వంశాన్ని నిలిపే కుమారుడు కావాలని కోరుకోగా, గరుడుని సోదరియైన రెండవ రాణి సుమతి 60 వేల మంది సంతానాన్ని కోరుకొంది.

సగర మహారాజు భార్యలతో కలిసి ఇంటికి తిరిగి వచ్చాడు. కాలక్రమంలో కేశినికి కుమారుడు కలుగగా, అతనికి అసమంజసుడు అనే పేరు పెట్టారు. కాని సుమతికి కూష్మాండ రూపంలో ఒక మాంసపు ముద్ద జన్మించింది. దానిని చీల్చగా అందులోనుంచి 60 వేల పిండాలు బయటకు వచ్చాయి. వాటిని వికసించే వరకు నేతి జాడీలలో ఉంచారు. ఆ తరువాత కొంతకాలానికి జనించిన 60 వేల మంది పుత్రులు పెరిగి పెద్దవారయ్యారు. సరియైన ప్రవర్తన కనబరచలేని అసమంజసుడు, తన సోదరులను సరయూ నదిలోకి విసిరి వేస్తూ ఆనందించేవాడు అతని దుష్ప్రవర్తనకు విసిగి సగర మహారాజు అతనిని రాజ్యంనుండి బహిష్కరించాడు. అప్పటికే అసమంజసునికి అంశుమంతుడనే కుమారుడు కలిగి వున్నాడు. అతడు బహుళ ప్రజాభిమానం పొందినందున, సగరుడు అతనిని తనవద్దే వుంచుకొన్నాడు.

సగర మహారాజు అశ్వమేధ యాగం తలపెట్టి అంశుమంతుణ్ణి యజ్ఞాశ్వానికి రక్షకుడుగా భూసంచారానికి వదిలాడు. కాని యజ్ఞం జరుగుతున్న సమయంలోనే ఇంద్రుడు ఒక రాక్షస రూపంలో వచ్చి ఆ అశ్వాన్ని దొంగలించుక పోయాడు. అశ్వం లేక యజ్ఞం అసంపూర్తిగా మిగులుతుందని పురోహితుడు రాజుకు చెప్పాడు. అపుడు మహారాజు ఆ అశ్వాన్ని ఎక్కుడున్నా తీసుకొని రావాలని తన 60 వేల మంది పుత్రులను ఆదేశించాడు. భూమండలంలోకనపడకపోతే, దిగువన కూడా గాలించాలని చెప్పాడు. యజ్ఞవాటిక వద్ద రాజు, అంశుమంతుడు నిరీక్షిస్తుండగా, 60 వేల మందికి ఎక్కడా అశ్వం కనిపించక పోవడంతో వారు పాతాళం దాకా భూమిని

త్రవ్వుకుంటూ పోయారు. భూదేవి ఎంతగానో భయపడింది. ఇదంతా గమనించిన దేవతలు బ్రహ్మదేవుని సరిదిద్దమని వేడుకొన్నారు. బ్రహ్మదేవుడు 'భూమి విష్ణువు యొక్క పత్ని అయినందున కపిలుని రూపంలో అవతరించి, ఆ 60 వేల మంది పుత్రులను నశింపచేస్తాడు' అని వారిని శాంతపరిచాడు.

సగర పుత్రులు భూమిని ఎంత త్రవ్వినా, ఏ లోకంలోనూ కనిపించక పోయేసరికి, వారు నిరాశతో తండ్రి వద్దకు వచ్చారు. అశ్వం కనబడేంత వరకు పాతాళం దాకా త్రవ్వుకుంటూ ముందుకు పొమ్మని తండ్రి ఆదేశించాడు.

త్రవ్వగా, త్రవ్వగా వారికి భూమిని మోస్తున్న నాలుగు మహా దిగ్గజాలూ, నాలుగు దిక్కులూ కనిపించాయి. అవి కూడా భారాన్ని మోస్తూ అప్పుడప్పుడూ తలను కదిలించినపుడే భూకంపాలు వచ్చేవి. ఇలా వారు తొలుచుకుంటూ పాతాళానికి చేరుకోగా, అక్కడ పద్మాసీనుడైన కపిల భగవానుడు, ఆయన ఆశ్రమంలో వున్న అశ్వం కనిపించింది. కపిలుడే దొంగిలించాడని వీరు భావించారు. అందుకే కపిలుని చంపటానికి ప్రయత్నించడం గమనించిన కపిలుడు కోపించి, 'హుం' అనే మంత్రాన్ని ఉచ్చరించడంతో ఆ 60 వేల మంది భస్మమైపోయారు. ఎంతకాలానికీ కుమారులు తిరిగి రాకపోయే సరికి సగరుడు తన మనుమడైన అంశుమంతుని వారిని వెతికి రమ్మని పంపాడు. దేశమంతా తిరిగి, ఎక్కడా కానరాక, చివరకు తన సోదరులు త్రవ్విన భూమిలో నుండి పాతాళానికి చేరుకొన్న అంశుమంతుడు అక్కడ కనిపించిన దిగ్గజాలతో తన పినతండ్రులను గురించి అడిగాడు. ఇంకా ఇలానే లోపలికి వెళితే అన్నీ తెలుస్తాయి అని వారు చెప్పారు. చివరకు భస్మరూపంలో మిగిలిపోయిన చోటుకు చేరుకున్నాడు. దుఃఖితుడై వున్న అతనికి దగ్గరలోఏ యజ్ఞాశ్వం కనిపించింది. రాజు వద్దకు అశ్వంతోవెళ్ళేముందుగా, పినతండ్రులకు తర్పణం విడుద్దామని తలంచాడు అంశుమంతుడు. కాని ఎక్కడా నీరు కనిపించ లేదు. అపుడు గరుడుడు ప్రత్యక్షమై 'నాయనా! అంశుమంతా! దుఃఖించకు. ఒక ప్రయోజనం కొరకు నీ పినతండ్రులు చనిపోయారు. పవిత్రమైన గంగానదిని భూమార్గం పట్టించడానికే ఈ సగరపుత్రులు కారణమౌతారు. మీ పినతండ్రులను కపిల మహర్షియే భస్మం చేశాడు. ఈ భస్మరాసులను గంగలో కలిపితే, వారికి స్వర్గం ప్రాప్తిస్తుంది. మీ తాతగారి యజ్ఞం పూర్తి కావడానికి ఈ అశ్వాన్ని తీసికొని వెళ్ళు.' అని చెప్పాడు.

యజ్ఞాశ్వం తిరిగి రావడంతో యాగం పరిసమాప్తమైంది. గంగానదిని భూమిపైకి తెచ్చే విషయమై గరుడుడు చెప్పిన మాటలు విన్న సగర మహారాజు ఆ విషయమై ఆలోచించ సాగాడు. కాని ఆ పని సాధించక ముందే సగర మహారాజు మరణించాడు. తాత తర్వాత మనుమడు అంశుమంతుడు కొంతకాలం రాజ్యపాలన చేశాడు. తరువాత అతడు తన కుమారుడైన దిలీపునకు రాజ్యాన్ని అప్పగించి, గంగను తీసికొని వచ్చేందుకు తపస్సు చేయుటకు అడవులకు వెళ్ళిపోయాడు. కొంతకాలానికి తన కోరిక తీరకుండానే అంశుమంతుడు కూడా మరణించాడు. గంగను భూలోకానికి తీసికొని రాలేక పోయాడు. దిలీపుడు కూడ తండ్రి కోరిక తీర్చేందుకు ప్రయత్నించాడు కాని అతడు కూడ విఫలుడై మరణించాడు. దిలీపుని కుమారుడు భగీరథునకు రాజ్యం సంక్రమించింది. అతడు కూడా అదే ఉద్దేశ్యంతో తపస్సు చేయ తలంచాడు. కాని తనకు పుత్రులు లేనందున భగీరథుడు రాజ్యపాలనను మంత్రులకు అప్పగించి అరణ్యానికి వెళ్ళిపోయాడు. భగీరథుడు వేయి సంవత్సరాలు తపస్సు చేయగా, బ్రహ్మదేవుడు ప్రసన్నుడైనాడు. వరం కోరుకోమని అడిగితే భగీరథుడు 'సగర మహారాజు అయిన నా పూర్వీకులకు అందరికి గంగాజలం అందేటట్లు వరమివ్వండి. నాకొక పుత్రుణ్ణి ప్రసాదించండి' అని కోరాడు. అందుకు బ్రహ్మదేవుడు 'ఈ వరాలు ఇస్తాను. కాని గంగావతరణ భారాన్ని భూమి భరించలేదు. ఆ భారాన్ని పరమ శివుడు ఒక్కడే భరించగలడు. కనుక నీవు ఆయనను ఆ భారాన్ని స్వీకరించమని ప్రార్థించు' అని

ఆ వరాలిచ్చి అదృశ్యుడయ్యాడు.

పరమ శివుని అనుగ్రహం పొందాలంటే ఘోరతపస్సు తప్పదు. భగీరథుడు పూనుకొన్నాడు. ఒక సంవత్సరం పాటు ఒటికాలి మునివేళ్ళ మీద నిలబడి తపస్సు చేయగా, పరమశివుడు ప్రత్యక్షమై ఆ భారాన్ని తన శిరస్సుమీద భరించేందుకు అంగీకరించాడు. తత్ఫలితంగా స్వర్గంలో ఉన్న గంగ భూలోకం వైపు ప్రవహించ సాగింది. ఈ దృశ్యాన్ని చూచుటకు దేవతలు గుమిగూడారు. గంగ పరమశివుని చూడగానే, తాను అలా ఆయన శిరస్సుపై ప్రవహిస్తే, మలిన పడతానని భావించింది. దీన్ని గమనించిన పరమ శివుడు అవమానంగా భావించి, కోపంతో ఆ గంగను తన జటాజూటంలో బంధించాడు. దాంతో గంగ యొక్క భూలోక అవతరణం నిలిచి పోయింది. గంగ ఇలా చిక్కుకు పోవడంతో, భగీరథుడు మళ్ళీ తపస్సు ప్రారంభించాడు. ఫలితంగా పరమశివుడు కోపాన్ని తగ్గించుకొని ఒక జడను మాత్రం తొలగించి గంగాజల ధారను హిమాలయాల్లోని బిందు సరోవరంలో పడేలా, ఆమెను విడుదల చేశాడు. ఆపైన గంగ ఏడు పాయలుగా చీలింది. ఆరు పాయలు వేరే వేరు నదులుగా రూపొందగా, ఏడవ పాయ భగీరథుని రథం వెంట ప్రయాణించింది. ఇలా గంగ ప్రయాణిస్తూ వున్న సమయంలో జహ్ను మహర్షి ఆశ్రమంలోని యజ్ఞవాటికను ముంచివేసింది. కోపించిన మహర్షి గంగను మ్రింగివేశాడు. దేవతలు ఆశ్చర్య పోయారు. వారు జహ్నువును సమీపించి గంగ ఆయన కుమార్తెగా పేరు గాంచుతుందని మాట ఇచ్చి, విడుదల చేయమని ప్రార్థించారు. ఆ ఋషి అంగీకరించి, తన కుడి చెవినుండి గంగానదిని విడిచి పెట్టాడు. ఆ కారణంగా గంగకు జాహ్నవి అన్న పేరు వచ్చింది. అలా ప్రయాణాన్ని కొనసాగించి, చిట్టచివరకు గంగ పాతాళంలోని సగర పుత్రుల భస్మరాసిపై నుండి ప్రవహించగా, వారందరు స్వర్గానికి చేరుకొన్నారు.

బ్రహ్మదేవుడు మళ్ళీ భగీరథుని ఎదుట ప్రత్యక్షమై 'ఓ రాజా! నేటితో నీ గొప్ప కార్యం సఫలీకృతమైంది. ఇప్పటి నుండి గంగ నీ పుత్రికగా భాగీరథి అనే పేరుతో ఖ్యాతి గాంచుతుంది' అని ప్రకటించాడు. ఈ విధంగా తన పితరులకు సద్గతి కలిగించిన తరువాత భగీరథ మహారాజు తన రాజ్యానికి వచ్చి, రాజ్యపాలనను కొనసాగించాడు

ఇలా రాత్రంతా గంగావతరణ విషయమై విశ్వామిత్రుడు శ్రీరామునికి వివరించడంతో గడచిపోయింది. తెల్లవారి గంగానదిని దాటి ముందుకు ప్రయాణించారు. వారి ప్రయాణం కొనసాగించి, చివరకు విశాల నగరాన్ని చేరుకొన్నారు. ఆ రాజ్యాన్ని గురించిన విశేషాలు చెప్పమని శ్రీరాముడు విశ్వామిత్రుని కోరాడు. ఆయన ఇలా చెప్ప నారంభించాడు. 'దేవతలు, దానవులు పరస్పరం శత్రువులు. ఒక పర్యాయం శ్రీమన్నారాయణుని సూచన మేరకు అమృతం కోసం సముద్రాన్ని మథించటానికి దానవులతో దేవతలు ఒక ఒడంబడిక చేసుకొన్నారు. మథించగా లభించిన అమృతాన్ని ఇరువురు సమానంగా తీసుకోవాలనేదే ఆ ఒడంబడిక. వారిద్దరు అమరులు కావాలనే ఆకాంక్షతో, మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని తాడుగా వెంటబెట్టుకొని క్షీరసాగరం వైపు కదిలారు. దేవదేవుని చాకచక్యమైన ఏర్పాటు ప్రకారం దానవులు వాసుకి సర్పానికి తలవైపున, దేవతలు తోకవైపున పట్టుకోవడం జరిగిది. వేలాది కళ్ళు, నోళ్ళున్న వాసుకి వదలిన ధూమాన్ని పీల్చగా దానవులు గాయపడ్డారు తీవ్రంగా. అలా వారు శక్తిహీనులై పోయారు. దేవతలు కూడ తేజస్సను కోల్పోయి, పొగచూరి నల్లబడ్డారు. కాని దేవదేవుని కృపావిశేషంతో వర్షం బాగా కురిసి, దాని తుంపరలు, నీటి రేణువులు వీరి మీద పడడం వల్ల దేవతలకు ఊరట చేకూరింది. పర్వతం యొక్క బరువు కారణంగా దేవతలు, దానవులు అలసిపోయి కొందరు చనిపోవటం కూడ జరిగింది. మందర పర్వతం బాగా బరువు కలిగినది కావడంతో, అడుగు భాగం నిలబడేందుకు ఆధారం ఏమీ

లేకపోవడంతో సముద్రంలో మునిగిపోసాగింది. అలా దేవదానవులు ఇద్దరికి ఎలాంటి శక్తులు లేకుండా కొరగాకుండా పోయింది.

అపుడు శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై అక్కడ నీలమేఘశ్యాముడుగా దర్శనమిచ్చాడు. వైజయంతి మాలను ధరించి, పీతాంబరధారియై ఉన్నాడు. కర్ణాభరణాలు తేజోమయంగా ఉన్నాయి. కన్నులు అరుణరాగ రంజితాలై భాసిల్లుతున్నాయి. శిరోజాలు భుజాల వరకు వ్యాపించి వున్నాయి. ఆయన దయతో దేవతలను, దానవులను సజీవులను చేశాడు. విష్ణుమూర్తి ఒక చేత్తో ఆ పర్వతాన్ని లేపి, గరుడుని వీపుపై పెట్టాడు. తర్వాత తాను ఆ పర్వతంపై కూర్చొనగా గరుడుడు ఆయన్ని సముద్ర మథన ప్రదేశానికి తీసుకొని వెళ్ళి, పర్వతాన్ని పాల సముద్ర మధ్యలో ఉంచాడు. గరుడుడు అక్కడ ఉన్నంత సేపు వాసుకి అక్కడికి రాడు కనుక విష్ణువు అతనిని ఇక వెళ్ళిపొమ్మన్నాడు. శ్రీమహావిష్ణువు మహాకూర్మావతారాన్ని దాల్చి, సముద్రం అడుగుకు వెళ్ళి పర్వతాన్ని తన వీపుపై పెట్టుకొన్నాడు.

అంతట, శ్రీమహావిష్ణువు తన భవ్యమైన హస్తాలతో వాసుకిని ఒక త్రాడువలె పట్టుకొని, మందర పర్వతాన్ని కవ్వంగా చేసుకొని సముద్ర మథనానికి పూనుకొన్నాడు. అపుడు ఆ మహావిష్ణువు రమణీయ ఇంద్రనీల పర్వతంలా భాసించాడు.

మహత్తర శక్తితో మహావిష్ణువు మథనం ప్రారంభించమని ఆదేశించగా, మత్స్యాలు, సొరచేపలు, తాబేళ్ళు, సర్పాలు ఆందోళన చెందసాగాయి. సముద్రమే మొత్తం కల్లోలం కావడంతో తిమింగలాలు, నీటి ఏనుగులు, మొసళ్ళు మున్నగునవి ఉపరితలానికి వచ్చాయి. ఇలా మథించగా, మొదట హాలాహలం అనే భయంకర విషయం ఎక్కువ మోతాదులో జనించింది. తమ రక్షణ కొరకు దేవతలు పరమశివుడి దగ్గరకు వెళ్ళి ప్రార్థించారు. భక్తుని భక్తికి పరవశించే పరమశివునకు ఆశుతోషుడనే పేరు ఉంది. అందుచే సముద్ర మథనం ద్వారా వెలువడిన విషాన్నంతా తానే త్రాగటానికి సమ్మతించాడు. దుర్గాదేవికి పరమశివుని శక్తి తెలుసు. కాబట్టి ఆయన విషం త్రాగుతానన్నా, ఆమె భయపడలేదు. శివుడి అంగీకారం ఆమెను ఎంతో సంతోషపరిచింది కూడా. అంతటా వ్యాపించిన విషాన్ని కూడగట్టి త్రాగగా, ఆయన నీలకంఠుడైనాడు. కాని ఆయన చేతిలో నుండి కొద్దిగా విషం నేలమీద పడింది. దాని కారణంగానే ప్రపంచంలో సర్పాలు, తేళ్ళు, విషజీవులు పుట్టుకు వచ్చాయి. ఆ తరువాత పాలసముద్రాన్ని మధిస్తుండగా, 60 కోట్ల మంది అప్సరసలు పుట్టుకొచ్చారు. వారిని దేవతలు కాని దానవులు కాని స్వీకరించనందున, వారు వేశ్యలైనారు. తర్వాత పాలసముద్రం నుండి సురాదేవతయైన వారుణి ఉద్భవించగా, దానవులు ఆమెను స్వీకరించ లేదు. దేవతలు స్వీకరించారు. ఆ కారణంగానే దితి కుమారులు అసురులుగాను, అదితి కుమారులు సురలుగాను ప్రసిద్ధికెక్కారు.

చివరగా, చాల సంవత్సరాల తర్వాత, శ్రీమహావిష్ణువు ధన్వంతరి (వైద్యశాస్త్ర ప్రారంభికుడు) రూపంలో ఒక చేత అమృత భాండాన్ని, మరొక చేత దండాన్ని ధరించి పాలసముద్రం నుండి బయటకు వచ్చాడు. ఆ అమృతం కోసం, దేవదానవుల మధ్య భయంకర యుద్ధం జరిగింది. ఇరుపక్షాలు నాశనం కాబోయే సమయానికి, దానవులు అమృతాన్ని చేజిక్కించుకొన్నారు. శ్రీమహావిష్ణువు మోహినీ అవతార రూపాన్ని ధరించాడు. విష్ణువు యొక్క ఈ అపురూప సౌందర్యాన్ని చూచిన దానవులు, ఆమెపై మోహితులైనారు. అమృతాన్ని తమలోతాము పంచుకోవటంలో వివాదం రాగా, తీర్పుకై ఆ సుందరిని ఎంచుకొన్నారు. దేవదేవుని అవతారమైన ఆ మోహిని

దానవులను మోసగింప జేసి, తన నిర్ణయాన్ని అందరూ ఆమోదించేలా షరతు పెట్టింది. దానవులు సమ్మతింగానే, మోహిని దేవదానవులను వేరు వేరు పంక్తుల్లో కూర్చోబెట్టింది. మోహిని దానవులను మొదటగా సమీపించి ముచ్చటిచటంతో దానవులు మురిసిపోయారు. దేవతలు దూరంగా ఉన్నారు. కాబట్టి వారికి అమృతం కొద్దిగానే దొరుకుతుందని భావించారు.

మోహిని తమపట్ల చూపే అభిమానానికి మురిసిన దానవులు అంతా తమకే లభిస్తుందని భావించారు. మోహిని మొహంలో పడిన దానవులు అమృతాన్ని మోహినికి ఇచ్చేశారు. ఆమె నేర్పుగా అమృతాన్ని దేవతలకు పంచింది. దానవులు ఎంతగా మోహినీ వశంలో పడిపోయారంటే, అమృతాన్ని దేవతలను ఆమె వడ్డిస్తుంటే, దానవులు పట్టించుకోకుండా మిన్నకుండి పోయారు. ఆమె తీయని మాటలతోనే దానవులు తృప్తి పడి పోయారు. మోహినీ రూపధారియైన దేవదేవుడు అసురులతో ఇలా అన్నాడు. 'పిసినారులైన ఈ దేవతలు ముందుగా అమృతాన్ని తాగుదామనుకొంటున్నారు. కనుక వారినే ముందు తీసికోనిద్దాం. మీరు మంచివారు కనుక వేచి ఉండండి. మీరు ధీరోదాత్తులు కనుకనే నా పట్ల సంతృప్తితో ఉన్నారు. ఈ దేవతలు ఈ అమృతాన్ని త్రాగేదాకా ఇలా మీరు వేచి ఉండుటయే మంచిది.' అన్నాడు.

దేవతలకు మాత్రమే అమృతం పంచాలని దేవదేవుని అభిమతం. దానవులు అమృతపానానికి అనర్హులు అని ఆయనకు తెలుసు. మోహినియే తమను మోసగిస్తున్నదని తెలిసి కూడా దానవులు మౌనంగా వున్నారు. కాని రాహువు అనే ఒక దానవుడు మాత్రం దేవతల వేషంలో వారిలో చేరి సూర్యచంద్రుల మధ్య కూర్చొన్నాడు. దాన్ని గమనించిన విష్ణువు (మోహిని) అతని శిరస్సును ఖండించాడు. కాని అప్పటికే అతను అమృతాన్ని రుచిచూడడం చేత సజీవుడుగానే ఉండిపోయాడు. దేవతలందరూ అమృతపానం ముగించగానే, విష్ణువు తన నిజరూపంలో అమృతాన్ని అక్కడినుండి తీసికొని వెళ్ళిపోయాడు. దానవులు విష్ణువును ఎదుర్కోగా, మోహినీ మూర్తి వారిని చాల సులభంగా ఓడించి, ఇంద్రుడు నిర్వివాదంగా త్రిలోకాధిపతి కావడానికి మార్గం సుగమం చేశాడు. దితి తన సంతానం యొక్క ఓటమిని భరించలేక, ఇంద్రునిపై ప్రతీకారేచ్ఛతో, అతనిని చంపగల తనయుణ్ణి పొందేందుకు ఘోరతపస్సుకు సిద్ధపడింది. దితి తపస్సును గురించి తెలుసుకొన్న ఇంద్రుడు ఆమె వద్దకు వచ్చి, ఆమకు సపర్యలు చేయడం ప్రారంభించాడు. తపోదీక్షకు 10 సం॥లు మిగిలాయి. దితి ఇంద్రుని సేవల పట్ల సంతృప్తి చెంది, తనకు కుమారుడు పుట్టగానే, అతనిని శాంతింప చేస్తానని, దానితో ఇంద్రుడు నిర్భయంగా ముల్లోకాలు పాలించవచ్చని అభయం ఇచ్చింది. కాని ఇంద్రుడు మాత్రం తన జాగ్రత్తలో తానున్నాడు.

అలా కొంతకాలం తరువాత దితి బాగా అలసిపోయి అడ్డదిడ్డంగా నిద్రపోయింది. శిరోజాలు కలుషితం అయ్యాయి. ఆ పొరపాటునే అదనుగా భావించి, ఇంద్రుడు మాయతో ఆమె గర్భంలో ప్రవేశించాడు. ఆమె గర్భంలో గల పిండాన్ని ఏడు ముక్కలుగా ఖండించాడు. మరల ఒక్కొక్క ముక్కను ఏడుగా విభజించడంతో అవి 49 ముక్కలయ్యాయి. జరుగుతున్నది తెలిసిన దితి తన బిడ్డను చంపవద్దని ఇంద్రుని ప్రార్థించింది. ఇంద్రుడు చేసిన తప్పు బయటపడటంతో, పశ్చాత్తాపపడ్డాడు. క్షమింమని తన సవతి తల్లిని ప్రార్థించాడు. అందుచేత దితి తన 49 మంది బిడ్డలను మరుత్ దేవతలు అయ్యేలా చేయమని ఇంద్రుని కోరింది. అందుకు ఇంద్రుడు సమ్మతించాడు. అలాగ వారిద్దరి రాజీ ఫలితంగా 49 మంది బిడ్డలు మరుత్తులనే పేరుతో దేవతలుగా గుర్తింపు పొందారు

ఈ కథ అంతా చెప్పిన విశ్వామిత్రుడు 'ఆరోజు దితి తపస్సు చేసిన ప్రదేశమే ఈ విశాల నగరం.

తరువాతి కాలంలో ఇక్ష్వాకు చక్రవర్తి కుమారుడు విశాలుడు ఈ నగరాన్ని నిర్మించాడు. ఆ వంశం వాడు ప్రస్తుత రాజు సుమతి' అని చెప్పిముగించాడు.

సుమతి రాజు వచ్చి విశ్వామిత్రుని స్వాగతించి, పూజించాడు. ఆ రాత్రికి అక్కడే అందరూ విశ్రమించారు. మరురోజు ఉదయం నుండి వారందరు విదేహ రాజ్యం వైపు పయనం సాగించారు. వారు అలా మిథిలానగర పొలిమేరలు చేరుకొనేసరికి, శ్రీరాముడికి అక్కడ ఒక పాడుపడిన ఆశ్రమం కనపడింది. ఆ ఆశ్రమాన్ని గురించి శ్రీరాముడు అడుగగా, విశ్వామిత్రుడు ఇలా వివరించాడు. 'ఈ ఆశ్రమం ఒకప్పుడు గౌతమ ఋషికి చెందింది. ఇక్కడ ఆయన భార్య అహల్యతో కలసి తపస్సాధనలు చేస్తుండేవాడు. అహల్య సౌందర్యానికి మోహితుడైన ఇంద్రుడు ఆమెను ఎలాగైనా పొందాలని తహతహలాడుతూ వేచివుండేవాడు. ఒకనాడు గౌతమ మహర్షి ఆశ్రమంలో లేని సమయంలో ఇంద్రుడు గౌతముని రూపంలో ఆశ్రమానికి వచ్చి అహల్యను సమీపించి "ప్రియా! నీతో సంగమించాలని ఉంది నా కోరిక తీర్చు. కాదనకు" అని అన్నాడు. ఇంద్రుడే ఋషి వేషంలో వచ్చాడనే విషయం అహల్య గుర్తించింది. ఆమె కూడ ఇంద్రుని కౌగిలింతలకు ఆశపడుతున్నందున, అతని కోరిక కాదనలేక, అతనిని తిరస్కరించలేక పోయింది. అతనితో సంగమించింది.

తరువాత అహల్య 'ఇంద్రా! నా భర్త గౌతముడికి నామీద కోపం రాకుండా నీవే నన్ను కాపాడాలి' అని ప్రార్థించింది ఎవరికీ కనపడకుండా వెళ్ళిపోతానని ఇంద్రుడు హామీ ఇచ్చాడు. కాని ఇంద్రుడు దొంగచాటుగా వెళుతున్న సమయంలోనే గౌతముడు రావటం తటస్థించింది. తన అపచారాన్ని బట్టి, ఇంద్రుడు తల దించుకొన్నప్పుడు గౌతమునికి ఇంద్రుని పాపమేమిటో అర్థం అయింది. అందుచే గౌతముడు ఆగ్రహంతో 'ఓరీ కామపిశాచీ! నీవు చేసిన నీచపు పనికి శిక్షగా నీ వృషణాలు నేలరాలి పోవు గాక!' అని శపించాడు. శాపంతో ఇంద్రుని వృషణాలు వెంటనే నేలరాలిపోయాయి. ఆ తరువాత ఆశ్రమంలోనికి ప్రవేశించిన గౌతముడు భార్యను చూచి 'ఓ దుష్టురాలా! నీవు ఇక మీదట అన్నపానాదులు స్వీకరించలేని స్థితిలో భస్మశయ్యపై పడి వుందువు గాక!' అని శపించాడు. ఆ మాట చెప్పి గౌతముడు హిమాలయాలకు వెళ్ళిపోయాడు. ఈలోగా ఇంద్రుడు దేవతలతో ఇలా చెప్పాడు. 'నేను గౌతమ ఋషికి కోపం తెప్పించి, స్వర్గాధిపతిగా ఆయన అందుకొనే పనిని అడ్డుకొన్నాను. కాని ఆ పనిలో నా వృషణాలు పోగొట్టుకున్నాను. ఇపుడు నాకు పురుషత్వాన్ని ఏదోవిధంగా పునరుద్ధరించండి.' అని చెప్పాడు.

ఇంద్రుని కోరికను మన్నించి, దేవతలు పితృదేవతల చేత ఒక గొర్రెకు పురుషత్వాన్ని హరింపజేసి, దాని వృషణాలను ఇంద్రునికి అమర్చారు.

ఈ వృత్తాంతం చెప్పిన తరువాత, శ్రీరాముని ఆశ్రమంలో అడుగు పెట్టమని కోరాడు. శ్రీరాముడు ఆశ్రమంలో అడుగు పెట్టగానే, అహల్య తపోతేజస్సుతో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ పూర్వరూపాన్ని పొందింది. అహల్యకు శాపవిముక్తి లభిండంతో స్వర్గం నుండి పూలవర్షం కురిసింది. రామలక్ష్మణులు ఆమెకు నమస్కరించగా, ఆమె వారిని, విశ్వామిత్రుని స్వాగతించింది. అదే సమయంలో గౌతమ మహర్షి కూడ వచ్చి సతీసమేతంగా శ్రీరామలక్ష్మణులను పూజించాడు.

వారి నుండి సెలవు తీసుకొని, విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో బాటు మిథిలా నగరంలోకి ప్రవేశించారు. అక్కడ జనక మహారాజు యజ్ఞవాటికను, అందుచేరిన బ్రాహ్మణ సమూహాన్ని చూచి శ్రీరాముడు ఆనందించాడు. విశ్వామిత్రుని రాకను వినిన జనక మహారాజు సంతోషంతో ఎదురేగి స్వాగతించి, 'ఓ ఋషిపుంగవా! ఈ యజ్ఞం

పూర్తి కావడానికి 12 రోజులు పడుతుంది. హవిస్సును స్వీకరించడానికి దేవతాగణం కూడ వస్తున్నారు. మీ వెంట వున్న ఈ మహనీయ వ్యక్తులెవరో చెప్పగలరా? నిజానికి వీరు మానవ రూపంలో ఉన్న దేవతల వలె ఉన్నారు." అని అన్నాడు. విశ్వామిత్రుడు 'రాజా! వీరు దశరథ మహారాజు కుమారులు, రామలక్ష్మణ నామధేయులు. మీరు పూజిస్తున్న ఆ మహా ధనుస్సును వీరు చూడాలని వచ్చారు. నా యజ్ఞాన్ని ధ్వంసం చేస్తున్న రాక్షసులను చంపటానికి వీరిని అయోధ్య నుండి నా ఆశ్రమానికి తీసుకొని వచ్చాను, వీరు రాక్షసి తాటకను వధించారు. రాముడు సిద్ధాశ్రమం వద్ద మారీచుని సముద్రంలోకి విసిరి వేశాడు. సుబాహుని సంహరించాడు. అహల్యకు శాపవిమోచనం కలిగించాడు, గౌతముని పూజలు అందుకున్నాడు.' అని జనకునితో చెప్పాడు.

అందరూ సుఖాసీనులైనారు. జనకుని పురోహితుడూ, గౌతమ మహర్షి జ్యేష్ఠ కుమారుడు అయిన శతానందుడు తన తల్లి శ్రీరామదర్శనంతో ఎలా నిజరూపాన్ని పొందిందో ఆ వివరాల్ని చెప్పమని విశ్వామిత్రుని అడిగాడు. అంతట విశ్వామిత్రుడు సంతోషంతో ఆ వృత్తాంతాన్నంతా సవివరంగా చెప్పాడు. ఆ తరువాత శతానందుడు విశ్వామిత్రుని యొక్క అద్భుత చరిత్రను గురించి ఇలా వివరించాడు.

'విశ్వామిత్రుడు గాధికి కుమరుడుగా జన్మించాడు. తొలుత ఒక ధార్మిక క్షత్రియునిగా రాజ్యపాలన చేశాడు. ఒకసారి అక్షౌహిని సైన్యంతో భూమండల యాత్రకు బయలుదేరాడు. కాలక్రమంలో ఆయన గొప్ప బ్రహ్మర్షి యైన వశిష్ఠుని ఆశ్రమానికి వచ్చాడు. సాదరంగా వశిష్ఠునికి నమస్కరించాడు. అనేకమంది ఋషులతో కూడి వున్నది ఆ ఆశ్రమం. తరువాత విశ్వామిత్రుడు, వశిష్ఠుడు స్నేహసంభాషణల్లో నిమగ్నమై ఉండగా, వశిష్ఠుడు 'ప్రియమైన మహారాజా! దయచేసి మీరు ఇక్కడ కొద్దిరోజులు వుంటే, మీ స్థాయికి తగ్గట్టు ఆతిథ్యమిచ్చి, మిమ్మల్ని ఆనందింప చేయాలనుకొంటున్నాను' అని అన్నాడు. అపుడు విశ్వామిత్రుడు 'మీరిచ్చిన ఈ స్వాగత సత్కారాలతో నేను ఇప్పటికే ఆనందంతో ఉన్నాను. ఇక మేము వెళ్ళటానికి అనుమతి ఇవ్వండి' అని వినయంగా అన్నాడు. కాని వశిష్ఠుడు అనుచర బృందం పట్టుబట్టడంతో, విశ్వామిత్రుడు అంగీకరించాడు. వశిష్ఠుడు శబల అనే పేరుగల కామధేనువును విశ్వామిత్రుని వద్దకు తెచ్చి, వీరికి షడ్రసోపేతమైన భక్ష్యాలను అందించమని కోరాడు. క్షణంలో కామధేనువు పరమాద్భుతమైన వంటలను దివ్యశోభలతో రప్పించింది. విశ్వామిత్రుడు, మిత్రులందరు మహా సంతృప్తితో విందు ఆరగించారు.

ఇంత ఔన్నత్యాన్ని చూచి, విశ్వామిత్రునికి వశిష్ఠుని మీద అసూయ కలిగింది. ఆ దివ్య ధేనువును తనకు ఇమ్మని, ప్రతిఫలంగా ఏదడిగినా ముట్టజెపుతానని విశ్వామిత్రుడు వశిష్ఠుని అడిగాడు. ఎన్నో ఆశలు చూపించినా సరే, వశిష్ఠుడు కామధేనువును వదలుకోను, అది లేనిదే మేము ఉండలేమన్నాడు. నా యజ్ఞ కార్యాలకు కావలసినవన్నీ ఈ ధేనువే నాకు సమకూరుస్తుంది. ఎలా వదలను? ఇలా దివ్యధేనువును విశ్వామిత్రునికి ఇవ్వడానికి వశిష్ఠుడు నిరాకరించాడు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా ప్రయోజనం లేకపోవడంతో, విశ్వామిత్రుడు ఆగ్రహావేశంతో ఆ దివ్యధేనువును దొరకబుచ్చుకొని ఈడ్చుకొని వెళ్ళసాగాడు. ధేనువు ఆక్రందనకు చలించిన అనేక వేల వశిష్ఠ శిష్య బృందం వచ్చి శబలను విడిపించారు. శబల ఆశ్రమంలోకి ప్రవేశించగా, వశిష్ఠుడు 'అమ్మా! శబలా! రాజు శక్తి ముదు నా శక్తి ఎంత? నిన్ను రక్షించుకోలేని అసహాయుణ్ణి' అని అన్నాడు. అందుకు శబల 'ప్రియమైన మహర్షీ! నీ బ్రహ్మశక్తితో ఈ రాజు ఐహిక శక్తి లెక్కలోకి రాదు. నీవు అనుమతిస్తే, నీ మహత్తర శక్తిని నేను వినియోగించుకొని, విశ్వామిత్రుని సేనలను నేనే ఓడిస్తాను.' అని జవాబిచ్చింది. వశిష్ఠుడు అనుమతి ఇవ్వగా,

శబల తన దేహం నుండి భయంకర యోధులను విశ్వామిత్రుని జయించడానికై సృష్టించింది. కాని రాజు శక్తిమంతుడై, వారినందరిని నాశనం చేశాడు. ఇంకా ఎంతమందినైనా సృష్టించుకో, నా ముందు నీవు నిలువలేవు' అని తన క్షాత్ర పౌరుషాన్ని విశ్వామిత్రుడు శబలకు వినిపించాడు. సవాలు చేశాడు. అంతట ధేనువు మరెందరో యోధులను సృష్టించింది. ఈ మహాయోధులు విశ్వామిత్ర సైన్యాన్ని మట్టుబెట్టారు. దీన్ని చూచి విశ్వామిత్రుని కుమారులు వశిష్ఠుని మీద విరుచుకు పడ్డారు. కాని వశిష్ఠుడు ఒక హుంకారంతో అందరినీ భస్మం చేశాడు.

ఈ విధంగా సైన్యాన్ని, కుమారులను కోల్పోయిన విశ్వామిత్రుడు నిరాశతో వెళ్ళిపోయాడు. మిగిలిన ఒక్క కుమారునికి రాజ్యాన్ని అప్పగించి, పరమశివుని ప్రసన్నం చేసుకొనే తలంపుతో తపస్సు చేసుకోవడానికి అరణ్యాలకు వెళ్ళాడు. తపస్సుకు మెచ్చి, పరమశివుడు ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. విశ్వామిత్రుడు సంతోషించి తనకు సకల దివ్యాయుధ పరిజ్ఞానాన్ని ప్రసాదించమని వేడుకొన్నాడు. అశుతోషునిగా పేరుగాంచిన పరమశివుడు విశ్వామిత్రుని కోరికను మన్నించాడు. అసలే గర్విష్ఠి యైన విశ్వామిత్రుడు ఈ వరాన్ని పొందిన తర్వాత, అతనిలో అహంకారం మరింతగా పెరిగింది. ప్రతీకారేచ్ఛతో, విశ్వామిత్రుడు వశిష్ఠుని ఆశ్రమానికి వెళ్ళి తన ఆయుధ ప్రయోగం ప్రారంభించగా, ఆశ్రమం నేలమట్టం అవుతుందేమో ననిపించింది. ఆశ్రమంలోని ఋషులందరూ పారిపోసాగారు. కొంతసేపటికే ఆ ప్రాంతం నిర్జనమైంది.

వశిష్ఠుడు ఈ అరాచకాలన్ని సహించ లేక విశ్వామిత్రునితో 'నీవు ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పూనుకొన్నందున నీ దురహంకారాన్ని అణచివేసి, నీ ప్రతాపాన్ని ఎందుకు కొరగానిదిగా చేస్తాను చూసుకో' అని అన్నాడు. విశ్వామిత్రుడు ప్రయోగించిన ఆయుధాలన్నింటిని, వశిష్ఠుడు తన బ్రహ్మదండంతో నిరుపయోగం చేసేశాడు. అన్ని దివ్యాస్త్రాలను వశిష్ఠుడు నిర్మూలించగా, విశ్వామిత్రుడు తిరుగులేని బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధపడ్డాడు. దేవతలు వీరి ద్వంద్వ యుద్ధాన్ని, ఆకాశం నుండి చూస్తున్నారు. విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించడం చూచిన దేవతలు కూడ భయపడ్డారు. కాని విశ్వామిత్రుడు వదలిన బ్రహ్మాస్త్రాన్ని వశిష్ఠుడు తన దేహాన్ని అమితంగా పెంచి, విశ్వరూపుడై చర్మరంధ్రాల్లోనుండి అగ్నికీలలు వెలువడుతుండగా, ఆ బ్రహ్మాస్త్ర శక్తిని నిర్వీర్యం చేశాడు. వశిష్ఠుని ఉగ్రరూపం అందరూ చూచారు. ఆయన మహాపరాక్రమాన్ని ఋషులందరూ వేనోళ్ళ కొనియాడారు. బ్రహ్మాస్త్రం నిర్వీర్యం అయిన తర్వాత వశిష్ఠుడు తన నిజరూపాన్ని ధరించాడు. ఈలోగా విశ్వామిత్రుడు క్షత్రియ బలహీనతను నిందించుకొంటూ, అక్కడినుండి వెళ్ళిపోయాడు. బ్రహ్మశక్తియే గొప్పదని తెలుసుకొన్న విశ్వామిత్రుడు తానుకూడా బ్రహ్మర్షి కావాలని నిర్ణయించుకొన్నాడు. అంతటితో పత్నీ సమేతంగా ఏకాంత వాసంలో తపస్సు ప్రారంభించాడు. 100 సంవత్సరాలు ఇలా తపస్సు చేయగా, బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై అతనికి రాజర్షి స్థానాన్ని లాంఛనంగా ప్రసాదించాడు. బ్రహ్మ నిష్క్రమించిన తరువాత, విశ్వామిత్రుడు తన ఈ అల్ప విజయానికి తృప్తి పడకుండా, ఎలాగైనా బ్రహ్మర్షి హోదాను సాధించాలని, ఉగ్ర తపస్సును ప్రారంభించాడు.

అదే సమయంలో ఇక్ష్వాకు వంశపు త్రిశంకుడనే రాజు అయోధ్యను రాజధానిగా పరిపాలిస్తున్నాడు. ఆయన శరీరం మార్చకుండానే సశరీరంగా స్వర్గానికి చేరగల ఒక యజ్ఞాన్ని చేయదలచి, దానికి వశిష్ఠుని ఆధ్వర్యం వహించమని కోరాడు. అలాంటి యజ్ఞం అసాధ్యమని వశిష్ఠుడు నిరాకరించాడు.

తరువాత త్రిశంకుడు యజ్ఞం ఏర్పాట్లు చేశాడు. నూరగురు వశిష్ఠ కుమారులను కలుసుకొని, యజ్ఞ నిర్వహణకు సహాయపడమని, వారిని కోరాడు. కాని తండ్రి తిరస్కరిస్తే, మమ్మల్ని కోరతావా అని చీవాట్లు పెట్టారు. త్రిశంకుడు బాధతో 'మీరు కాకపోతే, మరెవరైనా ఉదారులు దొరకరా' అంటూ బదులు ఇచ్చాడు.

త్రిశంకుని పొగరు మాటలు విన్న ఋషులు ఆగ్రహించి, అతనిని చండాలుడు కమ్మని శపించారు. వారు అలా శపించగానే, త్రిశంకుని రూపమే మారిపోయింది. అతని దండ కూడ శ్మశాన దండగా మారిపోయింది. ఈ అసహ్యపు రూపాన్ని చూచిన మంత్రులు అతన్ని అస్పృశ్యునిగా భావించి రాజ్యం నుండి బహిష్కరించారు. తన పూర్వ స్థితిని కోల్పోయిన త్రిశంకుడు తపస్సులో ఉన్న విశ్వామిత్రుని చూడటానికి వెళ్ళాడు. ఆ వృత్తాంతాన్నంతా వినిన విశ్వామిత్రుడు దయతో అతన్ని దగ్గరకు తీసుకున్నాడు. త్రిశంకుడు విశ్వామిత్రుని సహాయం అర్థించగా, ఆ ఋషి అభయమిచ్చి, యజ్ఞ నిర్వహణకు వలయు ఋత్విజులను పంపుతానని వాగ్దానం చేశాడు.

ఆ తర్వాత విశ్వామిత్రుడు తన కుమారులతో తనకు యజ్ఞంలో సహాయపడటానికి అవసరమైన ఋత్విజులను, బ్రాహ్మణులను కోరుతూ విన్నపం పంపవలసిందని ఆజ్ఞాపించాడు. నిరాకరించిన వారి పేర్లను చెప్పమని కూడ అడిగాడు. అలా పలు రాజ్యాల నుండి బ్రాహ్మణులు ఆశ్రమానికి వచ్చారు. ఒక్క వశిష్ఠుడు, అతని పుత్రులు, మహోదయ ఋషి మాత్రం 'ఏ బ్రాహ్మణుడు గాని, దేవత గాని క్షత్రియుని చేతినుండి హవిస్సు అందుకోవడానికి ఇష్టపడతారు? ఇక చండాలుడు చేసే యజ్ఞం గురించి చెప్పేదేముంది?' అంటూ ఆ యజ్ఞంలో పాల్గొనటానికి అందరూ నిరాకరించారు. ఈ పరుషవాక్కులు విన్న విశ్వామిత్రుడు 'నిర్భాగ్యులైన ఈ వశిష్ఠ పుత్రులు భస్మీభూతులై ఈ రోజే యమలోకానికి చేరుదురు గాక! అటు తర్వాత 700 జన్మల పాటు చండాలురుగానే జన్మలెత్తుదురు గాక! ఆ మూర్ఖుడు మహోదయ ఋషి నిషాదుడు అగు గాక!' అంటూ తక్షణమే శాపవచనాలు పలికాడు. ఆ శాపాలు నెరవేరటాన్ని విశ్వామిత్రుడు దివ్యదృష్టితో చూడగలిగాడు. మిగిలిన బ్రాహ్మణులను యజ్ఞాన్ని నిర్వహించమని విశ్వామిత్రుడు కోరగా, వారు శాపభయంతో అందుకు పూనుకొన్నారు.

విశ్వామిత్రుడు దేవతలను ఆహ్వానించి, హవిస్సుల నందుకోవాలని కోరగా, వారెవ్వరూ రాలేదు. దానితో క్రోధంతో విశ్వామిత్రుడు తన శక్తితోనే త్రిశంకుణ్ణి స్వర్గానికి అధిరోహింప జేస్తానని ప్రకటించాడు. ఆ ప్రకటనతోనే, త్రిశంకుడు సశరీరంగా స్వర్గంవైపు పయనించాగాడు. పుణ్యం లేనివాడు వశిష్ఠుని ధిక్కరించిన త్రిశంకుణ్ణి స్వర్గాన్ని సమీపించటం చూచి, ఇంద్రుడు అతనిని తలక్రిందులుగా చేసి, భూమిపై పడే విధంగా క్రిందకు తోసేశాడు. అలా క్రింద పడుతున్న త్రిశంకుడు విశ్వామిత్రుని సహాయం అర్థించాడు. విశ్వామిత్రుడు త్రిశంకుని రక్షించటమే కాదు, అతడు నివసించడం కోసం, నూతన దేవతలతో సహా ఒక స్వర్గాన్ని, ఒక నూతన గ్రహ వ్యవస్థతో అంతరిక్ష మండలాన్ని సృష్టించాడు. ఈ అద్భుత కార్యాన్ని చూచి దేవతలు ఆశ్చర్యపోయారు. వారు విశ్వామిత్రుని సమీపించి, త్రిశంకుడు స్వర్గానికి అనర్హుడు కనుక నీవు అతనికి చేసే ప్రయత్నాలను విడనాడు' అన చెప్పారు. కాని విశ్వామిత్రుడు దేవతలతో 'నా వాగ్దానాన్ని నేను నిలబెట్టుకొంటాను. త్రిశంకుణ్ణి స్వర్గానికి పంపిస్తానన్న నా మాట నుండి నేను వెనక్కు తగ్గేది లేదు. కనుక నేను సృష్టించిన స్వర్గాన్ని మీరు ఆమోదించి, అది ఈ విశ్వం ఉండేంతవరకు ఉండేలా అనుమతివ్వండి' అని అన్నాడు. ఎలాగైతేనేమి దేవతలు సరేననక తప్పలేదు. విశ్వామిత్రుని కృపవల్ల ఆతను తారామండలంలో ఉజ్వలంగా ప్రకాశిస్తూ ఆనంద డోలికల్లో ఊగిపోతున్నాడు.

ఆ తర్వాత విశ్వామిత్రుడు వశిష్ఠుని వలె తాను బ్రహ్మర్షి కావాలనే ఆలోచనతో తపస్సుకు వెళ్ళాడు. విశ్వామిత్రుడు తపమాచరించే సమీపంలోని పుష్కర సరస్సులో స్నానం చేయడానికి మేనక అనే అప్సరస వచ్చింది. ఆమె సౌందర్యానికి విశ్వామిత్రుడు కామపరవశుడైనాడు. ఆమెను తన ఆశ్రమానికి వచ్చి ఉండమని కోరాడు. మేనక సంతోషంతో అంగీకరించి, ఆశ్రమానికి వెళ్ళగా, ఇద్దరూ సంభోగానందంలో పడి సంవత్సరాలు గడిపారు. చివరకు విశ్వామిత్రునికి ఆ భోగమయ జీవితం పట్ల ఏవగింపు కలిగింది. ఇంద్రియానందంలో తన

తపస్సు వల్ల లభించిన పుణ్యాన్ని, తపశ్శక్తిని పోగొట్టుకొన్నాడు. ఇది దేవతల పని అయి ఉంటుంది. వారే మేనకను ఇక్కడికి పంపారు. ఇంతకాలం నా తపోసాధన నిలిచిపోయింది. నేను సతనమై పోయాను.' అని విశ్వామిత్రుడు బాధపడ్డాడు. మేనకను అంతటితో విడిచిపెట్టి భీకర తపస్సుకై హిమాలయాల వద్దకు ఉత్తర దిశవైపు వెళ్ళాడు. మేనక కూడా ఒక కుమార్తెకు జన్మనిచ్చి, ఆమెను ఆశ్రమంలోనే వదిలేసి తన దారిన తాను వెళ్ళిపోయింది.

ఇలా వుండగా విశ్వామిత్రుని ఘోరతపస్సుకు దేవతలు భయపడి, బ్రహ్మను సమీపించి, విశ్వాత్రునికి బ్రహ్మర్షి హెూదా ఇవ్వవలసిందిగా కోరారు. అందుకు బ్రహ్మ సమ్మతించాడు. బ్రహ్మ ప్రత్యక్షమై అడుగగా, నాకు బ్రహ్మర్షి హోదా  కావాలని కోరాడు. 'నీవు ఇంకా సంపూర్ణ ఇంద్రియ నిగ్రహాన్ని సాధించ లేదు. అందుచేత నీవు ఆ పదవి కావాలంటే, మరింత ఘోర తపస్సు చేయాలి' అని చెప్పి బ్రహ్మ అదృశ్యమైనాడు. తర్వాత విశ్వామిత్రుడు ఊర్ధ్వ ముఖుడై వాయువునే భక్షిస్తూ వేయి సంవత్సరాలు తపస్సు చేశాడు. ఇంద్రుడు, దేవతలు భయకంపితులై, అతని తపస్సును భంగపరచుటకు పథకాన్ని తయారుచేశారు. ఇంద్రుడు రంభను పంపి, అతని తపోభంగం చేయమని ఆజ్ఞాపించాడు. విశ్వామిత్రుడు తనను శపిస్తాడేమోనని భయపడి ఆమె వెళ్ళుటకు నిరాకరించింది. కాని ఇంద్రుడు 'ఓ లలనా! భయపడకు. ఇది వసంత ఋతువు. మన్మథుడు నీతోబాటు వస్తాడు. నేను కూడ మధుర గీతాలతో కోయిల రూపంలో వస్తాను. నీ అందం చూచేవారు కళ్ళు త్రిప్పలేరు. విశ్వామిత్రుడు నీ చేతిలో ఆటబొమ్మ ఔతాడు. నీవు సాధించగలవు' అంటూ రంభ భయం దూరం చేశాడు.

చివరకు రంభ అంగీకరించి, తన అపురూప సౌందర్యాన్నంతా ఒలకబోస్తూ, విశ్వామిత్రుని ఎదుట ప్రత్యక్షమైంది. రంభ కావాలనే వచ్చినట్లు భ్రమపడి, ఆమెను ఇష్టపడ్డాడు విశ్వామిత్రుడు. కాని ఇది తపోభంగానికి వేసిన మరొక ఎత్తుగడేనని అర్థం చేసుకున్నాడు. కోపంతో మండిపోతూ 'ఓసీ మూర్ఖురాలా! నేను ఇంద్రియ నిగ్రహం కోసం ఘోర తపస్సు చేస్తున్నాను. నీవు నన్ను లొంగదీసికోవాలని చూస్తున్నావు. కనుక నీవు ఒక రాతి విగ్రహానివై 10 వేల సంవత్సరాల పాటు లేదా వశిష్ఠ ఋషి వచ్చి నిన్ను విముక్తం చేసేదాకా అలాగే నిలిచి ఉండు' అంటూ గర్జన చేశాడు విశ్వామిత్రుడు. తక్షణమే ఆమె శిలారూపాన్ని పొందగా, ఇంద్రుడు, మన్మథుడు పరుగెత్తి పోయారు. తాను క్రోధానికి లొంగిపోయినందుకు విశ్వామిత్రుడు తర్వాత చింతించాడు. పుణ్యఫలం క్షీణించింది. కనుక ఇకముందు తానెన్నడూ క్రోధంతో ప్రవర్తించకూడదని నిశ్చయించుకొన్నాడు. 'బ్రహ్మర్షి హెూదా సాధింవేరకు నేను శ్వాసించను, మాట్లాడను, తినను, త్రాగను, ఏ పని చేయను' అని నిశ్చయించుకొన్నాడు.

విశ్వామిత్రుడు మరల తపస్సాధన ప్రారంభించాడు. వేయి సంవత్సరాలు నిరాహారంగా వుండటం చేత ఏదైనా ఆహారం తీసుకోవాలని నిశ్చయించుకున్నాడు. దొరికిన ఆహారం ముద్దను సరిగ్గా నోట్లో పెట్టుకొనే సమయంలో, ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి, ఆహారాన్ని యాచించి తీసికొన్నాడు. కోపం లేకుండా ఆ ఆహారాన్ని వచ్చిన బ్రాహ్మణునికి యిచ్చాడు విశ్వామిత్రుడు. మరల తపస్సు కొనసాగించాడు. ఈ తపస్సాధనతో జగత్తు అంతా వేడెక్కి పోయింది. ఆయన తలనుండి పొగరాసాగింది. దేవతలు ఈ ఉత్పాతాన్ని గుర్తించి, బ్రహ్మ దగ్గరకు వెళ్ళి విశ్వామిత్రుని సంతృప్తి పరచమని వేడుకొన్నారు. అపుడు బ్రహ్మదేవుడు, దేవతలో సహా స్వయంగా విశ్వామిత్రుని వద్దకు వచ్చి, ఆయనకు బ్రహ్మర్షి హోదా ప్రసాదించాడు.

విశ్వామిత్రుడు ఎంతో సంతోషించాడు. కాని 'నీవు నాకు ఈ హోదా ఇస్తే సరిపోదు. ఇతర బ్రహ్మర్షులు, ముఖ్యంగా వశిష్ఠుడు నన్ను బ్రహ్మర్షిగా ఆమోదించాలి.' అని పట్టుపట్టాడు. దేవతలు విజ్ఞప్తి చేయగా, వశిష్ఠుడు

వచ్చి విశ్వామిత్రుని బ్రహ్మర్షిగా గుర్తించాడు. విశ్వామిత్రుడు కూడ వశిష్ఠుని గౌరవించాడు. ఇద్దరూ ఇపుడు మిత్రులైనారు' అంటూ శతానందుడు విశ్వామిత్రుని చరిత్రను చెప్పి ముగించాడు.

మరురోజు ఉదయం జనక మహారాజు విశ్వామిత్రుణ్ణి, రామలక్ష్మణులను పిలిపించాడే. వారిని స్వాగతించిన మీదట జనకుడు 'ఏదో గొప్ప విషయం లేకపోతే, మహాపురుషులు ఇక్కడకు రారు. కావున నేను మీకు చేయగల్గిన సేవ ఏదైనా ఉంటే తెలియజేయండి.' అని అన్నాడు. విశ్వామిత్రుడు చిరునవ్వుతో 'నీ దగ్గర ఉంచుకొని చిరకాలంగా ఆరాధిస్తున్న ఆ అద్భుత ధనస్సును రామలక్ష్మణులు చూడాలని ఉవ్విళ్ళూరుతున్నారు.' అని అన్నాడు.

అందుకు జనక మహారాజ 'పూర్వం పరమశివుడు ఈ ధనస్సును తన మామ దక్షుని యజ్ఞాన్ని ధ్వంసం చేయడానికి ఉపయోగించాడు. పరమ శివుడు కోపంతో తనకు హవిస్సు ఇవ్వనందున దేవతలను ఈ ధనస్సుతో సంహరించ పూనుకొన్నాడు. ఎలాగో దేవతలు పరమశవుణ్ణి శాంతింప చేశారు. శివుడు ఆ ధనస్సును వారికి ఇచ్చేశాడు. ఆ తర్వాత కాలంలో దేవతలు ఆ ధనస్సును నా పూర్వీకుడైన దేవవ్రతుడికి అప్పగించాడు.' అని చెప్పాడు. పరమశివుని ధనస్సు వృత్తాంతాన్ని చెప్పిన తర్వాత జనక మహారాజు మరొక కథను ఇలా చెప్పాడు. 'నేను ఒకసారి నాగలితో యజ్ఞశాల క్షేత్రాన్ని చదును చేస్తుంగా, ఒక పాప నాకు నాగటి చాలులో లభించింది. ఆమెకు సీత (నాగటి చాలు) అని పేరు పెట్టి, కుమార్తెగా పెంచుకుంటున్నాను. సీత పెద్దదైంది. ఆమెను వివాహం చేసుకోవడానికి ఎందరో రాకుమారులు వచ్చి అడుగుతున్నారు. ఆమె సాధారణ మహిళ కాదు కాబట్టి, ఆమెను చేపట్టేవాడు మహా పరాక్రమవంతుడు అయివుండాలని వారితో చెప్పాను. పరమశివుని ధనసుసను ఎక్కుపెట్టమని వారిని కోరాను. కాని ఒక్కడు కూడ దానిని కనీసం ఎత్తగల శక్తి కూడ వారికి లేదు. వారందరూ అవమానభారంతో మిథిలపై దండెత్త పూనుకొన్నారు. 12 నెలలు భీకర యుద్ధం జరిగింది. నా సేన బలహీనమైనందున, దేవతల సహాయం అడిగాను. దేవతలు దయతో ఒక సైన్యాన్ని పంపారు. ఆ సైన్యాన్ని చూడగనే, వారందరు పారిపోయాం. రామునికి పరమశివుని ధనస్సును చూడాలని ఉన్నదని చెప్పారు కనుక ఆ ధనస్సును తెప్పిస్తాను. శ్రీరాముడు గనుక ఆ ధనస్సును ఎత్తి సంధింగలిగితే నా కుమార్తె సీతను ఆయనకు ఇస్తాను.' అని అన్నాడు. రాజు ఆజ్ఞ మేరకు ఆ ధనస్సును ఎనిమిది చక్రాల బండిపై 500 దృఢకాయులు లాగుకొని వచ్చారు. ఆ పెట్టె తెరువమని విశ్వామిత్రుడు రాముని ఆహ్వానించాడు. రాముడు ఆ పెట్టె మూతను అవలీలగా తెరచి, అందులోని ధనస్సు వంక మెచ్చుకొంటూ చూస్తుండగా దేవతలు, దానవులు, యక్షులు, గంధర్వులు, నాగులు సైతం ఎక్కుపెట్ట లేకపోయిన ధనస్సును ఒక సాధారణ మానవుడు ఎక్కుపెట్టి విజయం సాధిస్తాడా అంటూ జనకుడు హెచ్చరించాడు.

అయినప్పటికీ శ్రీరాముడు తన ఎడమ చేతిని ధనస్సు మధ్యభాగంపై నాజూకుగా ఉంచాడు. జనసమూహం ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, శ్రీరాముడు ఆ ధనస్సును పెట్టెలోనుండి పైకి తీశాడు. శ్రీరాముడు అవలీలగా ధనస్సును ఎత్తి పట్టుకొని ఒక్క క్షణంలో నారిని సంధించి, అమితశక్తితో వంచి, నారి సారించబోతుండగా, ఆ ధనస్సు ఫెళ్ళుమని పెద్ద శబ్దంతో మధ్యకు విరిగిపోయింది. ఆ ధనస్సు విరిగినపుడు ఉద్భవించిన శబ్దం పిడుగుపాటుగా, మేరుపర్వత ఛేదనంగా వినిపించింది. దాని ఫలితంగా, విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు, జనక మహారాజు తప్ప, మిగతా వారందరూ నేలపై పడిపోయారు భీతితో.

జనక మహారాజు పరమానందంతో సీతారాముల కళ్యాణానికి దశరథ మహారాజును ఆహ్వానించే నిమిత్తం దూతలను పంపవలసిందిగా విశ్వామిత్రుణ్ణి ప్రార్థించాడు. మూడు రోజుల అనంతరం, దూతలు దశరథ

మహారాజును కలుసుకొని, రాముని శివధనుర్భంగం విశేషాలు, సీతారాముల కళ్యాణం గురించిన సంఘటనలన్నీ వివరించారు. దశరథుని సంతోషానికి అంతులేదు. ఆ తరువాత వశిష్ఠుని, వామదేవుని సంప్రదించి, తామంతా మరునాడే మిథిలకు బయలుదేరాలని నిర్ణయించాడు దశరథుడు. మరునాటి ఉదయమే రాజు పురోహితులు ముందు నడువగా, దశరథుడు తన సైన్యాన్ని అపార ధనరాశులను తీసికొని బయలు దేరాడు. నాలుగు రోజులు ప్రయాణించిన తరువాత మిథిలా నగర పొలిమేరలు చేరుకొన్నారు. దశరథుని రాకను గురించి తెలుసుకొన్న జనక మహారాజు ఎదురేగి స్వాగత సత్కారాలు నిర్వహించాడు. అనంతరం దశరథ మహారాజు తన కుమారులను కలుసుకొన్నాడు. వివాహ ఏర్పాట్లు ఒక శుభముహూర్తాన ప్రారంభించాలని నిర్ణయం జరిగింది. మరురోజు అందరూ సమావేశం కాగా, వైవాహిక కార్యక్రమాలు ప్రారంభించే ముందు, దశరథ మహారాజు తన రాజవంశ చరిత్రను వశిష్ఠుడు తెలుపగా వినవలసిందని జనక మహారాజును అభ్యర్థించాడు. వశిష్ఠుడు రఘువంశ చరిత్రను ఇలా వివరించాడు.

అదే సమయంలో చ్యవన మహర్షి అక్కడికి రావటం జరిగింది. బాధతో వున్న కాళింది తన బిడ్డను ఎలాగైనా బ్రతికించమని ఆ మహర్షిని అర్థించింది. ఆమె గర్భంలో నుండి విషంతో పాటు, ఒక బిడ్డ కూడా వెలుపలికి వస్తాడు అని ఋషి అభయమిచ్చాడు. అటువంటి అసాధారణ పరిస్థితులలో జన్మించి, కాళింది పుత్రునికి సగరుడు అని పేరు పెట్టారు. విషంతో పుట్టిన వాడని దాని అర్థం.

తరువాతి కాలంలో ఇక్ష్వాకు వంశంలో భగీరథ మహారాజు యొక్క మునిమనుడు అయిన ప్రవృద్ధుడు అనే అతను వశిష్ఠుని శాపంతో రాక్షసుడై కల్మాషపాదునిగా పేరుగాంచాడు. అంబరీషుడు, నహుషుడు, యయాతి దశరథుని తండ్రియైన అజుడు వంటి వీరులెందరో ఇక్ష్వాకు వంశానికి చెందినవారే, ఆ వంశం నుండి వచ్చినవారే కావడం విశేషం. వశిష్ఠుడు వారందరి చరిత్రలను వివరించిన తర్వాత, జనక మహారాజుతో ఆయన కుమార్తెలైన, సీత, ఊర్మిళలను శ్రీరామ లక్ష్మణులకు యిచ్చి కన్యాదానం చేయమని అభ్యర్థించాడు. జనక మహారాజు కూడ తానే తన వంశీయులైన నిమి మొదలుగా గల రాజుల చరిత్రను వివరించాడు. ఆ తరువాత తన కుమార్తెలను దశరథ మహారాజు కుమారులకు ఇచ్చి కన్యాదానం చేయుటకు లాంఛనప్రాయంగా ఒప్పందాలను ముగించాడు సంతోషంతో.

మొదటిగా రామలక్ష్మణుల ఉపనయన కార్యాన్ని జరిపించమని జనక మహారాజు దశరథుని కోరాడు. గురుకులం నుండి విద్యార్థి స్వగృహానికి చేరిన సమయంలో శిరోముండనం జరుగుతుంది. తరువాత మూడు రోజుల పాటు జరిగే అగ్నిష్టోమాన్ని ప్రారంభించాడు ఒక శుభముహూర్తంలో. అంతేకాదు, జనకుడి తమ్ముడైన కుశధ్వజుని ఇద్దరి కుమార్తెలు మాండవి, శృతకీర్తి అనేవారిని భరత, శత్రుఘ్నులకు యిచ్చి వివాహం జరిపించమని వశిష్ఠుడు అభ్యర్థించాడు. జనకుడు సమ్మతించాడు. దశరథుడు సమావర్తనోత్సవం జరిపే సమయంలో బ్రాహ్మణులకు నలుగురు కుమారులతో కలిసి ఒకొక్కరికి లక్ష గోవులు దానం చేశాడు. ఆ తరువాత వివాహానికి నిశ్చయించబడిన శుభముహూర్తంలో వశిష్ఠుడు జనకునితో 'ఓ రాజా! కన్యాదానం కోసం కోసలాధిపతి, అతని నల్గురు కుమారులు బయట ఎదురుచూస్తున్నారు. ఆలస్యం చేయకుండా శుభవివాహ యజ్ఞం ఇప్పుడే ప్రారంభమగు గాక!' అని అన్నాడు

ఆ తర్వాత దశరథ మహారాజు తన నలుగురు పుత్రులతో యజ్ఞశాలలోనికి ప్రవేశించాడు. వశిష్ఠ ముని యజ్ఞవేదికను సకల మంగళప్రదంగా, శోభాయమానంగా అలంకరింప చేయించాడు. అంతా సిద్ధమైన తర్వాత

బ్రాహ్మణులు వేదమంత్రోచ్చారణ చేస్తుండగా, వశిష్ఠుడు యజ్ఞ జ్వాలను వెలిగించి ఆహుతులు సమర్పించడం మొదలు పెట్టాడు.

అంతట జనకుడు సీతను వెంటబెట్టుకొని వచ్చి, యజ్ఞశాలలో రాముని ప్రక్కన ఆమెను ఆసీనురాలిని చేశాడు. జనక మహారాజు గద్గద స్వరంతో 'ఓ శ్రేష్ఠ రాకుమారులారా! ఈమె నా కుమార్తె సీత. నీ జీవన సహచరిగా ఈమెను స్వీకరించు. ఈమె సకల సద్గుణరాశి. నీడలా నిన్నంటి, నీకు అంకితమై నిలుస్తుంది.' అని చెప్పాడు. అంతట గంధర్వులు గానం చేస్తుండగా, అప్సరసలు నాట్యం చేస్తుండగా, స్వర్గ నుండి పూలవర్షం కురుస్తుండగా, దేవదుందుభులు మారుమ్రోగుతుండగా, జనక మహారాజు భాగ్యదేవతయైన సీత యొక్క చేతిని పరమాత్ముడైన రాముని చేతితో కలిపాడు. ఆపైన జనకుడు ఊర్మిళ చేతిని లక్ష్మణుని చేతిలోను, మాండవి చేతిని భరతుని చేతిలోను, శ్రుతకీర్తి చేతిని శత్రుఘ్నుని చేతిలోను పెట్టాడు. ఆపైన ఆ నలుగురు సోదరులు తమ వధువుల చేతులను పట్టుకొని యజ్ఞశాల చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు. తర్వాత వారు జనక మహారాజు, రామలక్ష్మణుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

సద్గుణ రాశి, లావణ్యవతి, సౌందర్యవతియైన సీతను పొంది రాముడు అమితానందభరితుడైనాడు. అలాగే సీత తన పతిదేవుడు సద్వర్తన, ధైర్యసాహసాలు, మేధస్సు, అందచందాలకు ప్రతీకగా నిలిచినవాడు గాన అమితానందభరితురాలైంది. రూపం, సౌందర్యం, వర్తన, వయస్సు, ప్రవృత్తి వంటి దివ్యలక్షణాలన్నింటిలోను సీతారాములు సమానులే. హృదయాలను పరస్పరం అంకితం చేసుకొన్న సీతారాములు లక్ష్మీదేవితో కూడి ఉన్న శ్రీమహావిష్ణువు మాదిరిగా అత్యద్భుతంగా శోభాయమానంగా ప్రకాశిస్తున్నాడు.

వివాహ మహోత్సవాలు ఏనాటికైనా వైభవోపేతాలే. ధర్మబద్ధంగా నడుచుకోవడం ద్వారా స్త్రీపురుషులు తమ వైవాహిక జీవితాన్ని ఎలా సుఖమయం, విజయవంతం చేసుకోవచ్చునో, పరమాత్ముడైన శ్రీరామచంద్రుడే స్వయంగా ఆచరించి లోకానికి చూపించాడు. మానవులు వైవాహిక బంధంలో ధార్మిక చింతన చేస్తూ బ్రతకాలి. పశువిధానంలో జీవిస్తే, పునర్జన్మలుంటాయి. అత్యుత్తమ నియమాలతో వైవాహిక జీవితాన్ని క్రమబద్ధ రీతిలో రూపొందించుకొంటేనే లోకకళ్యాణం జరిగేది.

సీతారాములు సనాతన దంపతులు. పరస్పరం విడదీయరాని భార్యాభర్తలు భౌతికవాదులు శ్రీరాముడు లేకుండా భాగ్యదేవతను మాత్రమే స్వంతం చేసుకోవాలనుకొంటారు. కాని అది ఎన్నటికి సాధ్యం కాని పని. రాముడు లేకుంటే, సీత భౌతికశక్తి దుర్గగా మారుతుంది. ఆమె ఆలింగనం కోరితే అది మృత్యువుతో ఆలింగనమే ఔతుంది. శ్రీరాముని, శ్రీకృష్ణుని మనం భక్తిశ్రద్ధలతో ఆరాధించి, మనస్సు స్థిరం చేసుకొంటే, భాగ్యదేవత మనకు సకల ఆశీస్సులు ప్రసాదిస్తుంది. పరమాత్ముని మనం మన జీవన కేంద్రంగా చేసుకోవాలి. ఆయన సేవనే మన జీవన కార్యక్రమాల్లో అన్నింటికి లక్ష్యంగా చేసుకోవడమే తరుణోపాయంగా భావించాలి.

ఆనాటి వేడుకల తర్వాత అందరూ విశ్రమించారు. మరురోజు ఉదయమే విశ్వామిత్రుడు మిథిలనుండి బయలుదేరి హిమాలయాలకు వెళ్ళాడు. అదే రోజు దశరథ మహారాజు జనకుని నుండి భారీగా కానుకలు స్వీకరించి తన నలుగురు కుమారులు, కోడళ్ళతో సహా అయోధ్యకు బయలుదేరాడు.

అయోధ్యకు తిరిగి వస్తుండగా కొన్ని దుశ్శకునాలు ధశరథునికి కనిపించాయి. అదే సమయంలో ఒక జింక తాను నడిచే దారిలో ఎడమ నుండి కిడివైపుకు వెళ్ళడం అనే శుభశకునం కూడ ఆయనకు కనిపించింది, ఈ రెండు విధాలైన శకునాలు ఎలా వుండబోతున్నాయన్ని దశరథుడు వశిష్ఠుని అడిగాడు. దానికి సమాధానంగా

ఋషి 'నీకు కనిపించిన అశుభాలేవీ నిన్ను బాధించవు అని చెప్పినట్లుగానే జింక వెళ్ళిన దారిలో ఎడమ నుండి కుడికి వెళ్ళండి' అని చెప్పాడు. ఇలా దశరథుడు, పురోహితుడు ఈ విషయాన్ని గురించి చర్చించుకునే సమయంలో ఒక ప్రచండ ప్రభంజనం వీచి, చెట్లు కూలిపోవడం ప్రారంభమైంది. భయంకర ధూళి లేచి భూమిని క్రమ్మేసింది. ఈ భయానక స్థితిని గమనించిన దశరథ కుమారులు, ఋషి మాత్రం ఏమీ భీతి చెందలేదు కాని ఇతరులు భయకంపితులైనారు. అంతలో అకస్మాత్తుగా విఖ్యాత భయంకర యోధుడు పరశురాముడు ఒక చేత గండ్రగొడ్డలితో, మరొక చేత ధనస్సుతో, మహా శక్తివంతమైన శరీరాకృతితో అక్కడ ప్రత్యక్షమైనాడు. గతంలో ఈయన 21 సార్లు ప్రపంచంలోని వేల మంది క్షత్రియ రాజులను సంహరించిన తర్వాత తన కోపంతో ఇలా మళ్ళీ ప్రవర్తించనని ప్రతిన బూని, తపస్సులో లీనమైపోయిన ఈ పరశురాముడు ఇలా ఇపుడు ఉగ్రరూపంలో ప్రత్యక్షమవడం ఋషులకు ఆశ్చర్యం కలిగించింది.

ఈయన కోపానికి కారణమేమై వుంటుందని అందరూ అనుకుంటుండగా, పరశురాముడు శ్రీరాముని ఉద్దేశించి, 'రామా! నీవు పాతబడి, తుప్పుబట్టిన శివధనస్సును త్రుంచి గొప్పకార్యం చేశావనటంలో ఎలాంటి సందేహం లేదు. కాని ఇపుడు నా దగ్గర వున్నది విష్ణు ధనస్సు. ఇది శివధనస్సు కంటె బలమైనది. ఇదిగో నీవు మొనగాడివనుకుంటే, ఈ ధనస్సును తీసికొని, నారిని సంధించు. నీవు ఈ విల్లును ఎక్కుపెట్ట గలిగితే, నీవు నాతో పోరాటానికి అర్హుడవని గుర్తిస్తాను.' అని అన్నాడు. ఈ మాటలు విన్న దశరథుడు తన రాముడు ప్రాణాలు కోల్పోతాడేమోనన్న భయంతో, పరశురామునితో 'ఓ ఋషీశ్వరా! పరశురామా! నీ కోపాన్ని వదలిపెట్టు. నీ శపథాన్ని గుర్తుచేసుకో. నీవు ఈ భూమినంతా కశ్యపునికి దానం చేశావు. తపస్సు నిమిత్తం నీవు మహేంద్ర పర్వతానికి వెళ్ళి పోయావు కదా!' అని అన్నాడు. కాని పరశురాముడు దశరథుని పట్టించుకోకుండా శ్రీరామునితో 'పరమశివుని ధనస్సును, మహావిష్ణువు ధనస్సును విశ్వకర్మయే సృష్టించాడు. వాటిలో ఒక దానిని త్రిపురాసుర సంహారం కోసం పరమశివుడికి ఇవ్వడం జరిగింది. పరమశివుడు ఆ దానవుని చంపిన తర్వాత, ఒకరోజు దేవతలు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి 'పరమశివుడు, మహావిష్ణువు – వీరిలో ఎవరు శక్తివంతులు' అని ప్రశ్నించారు కుతూహలంగా. బ్రహ్మదేవుడు వారిద్దరి మధ్య ఒక సంఘర్షణ రేపాడు. ఫలితంగా గొప్ప పోరాటం జరిగింది. ఆ యుద్ధంలో పరమశివుని వింటిని శ్రీమహావిష్ణువు త్రెంచివేసి, ఆపైన ఒక గర్జనతో పరమశివుని ఇంద్రియ వ్యాపారాలను స్తంభింపజేశాడు. దేవతలు ప్రార్థించగా, ఆ పోరాటం అంతటితో ఆగింది. ఆ ద్వంద్వ యుద్ధాన్ని చూచినవారంతా, పరమశివుడి కంటే మహావిష్ణువే గొప్ప శక్తివంతుడనే నిర్ధారణకు వచ్చారు. కాని పరమశివుడు చికాకు పడ్డాడు. అవమానం పొందాడు. అందుచేతనే ఆ ధనస్సును నిరాశతో జనకుడి పూర్వీకుడైన దేవపుత్రుడికి ఇచ్చేశాడు.

మహావిష్ణువు తన ధనస్సును ఋచీక మహర్షికి ఇవ్వగా, ఆయన తన కుమారుడైన జమదగ్ని అంటే మా తండ్రికి ఇచ్చాడు. అయితే తనకు ఏ హాని జరిగినా, తాను ఎవరికీ ప్రత్యపకారం చేయనని వ్రతం పూనినందున, నా తండ్రి ఆ ధనస్సును ఎన్నడూ ఉపయోగించ లేదు. ఆ తర్వాత ఆ ధనస్సును నేను స్వీకరించాను. నా తండ్రిని కార్తవీర్యుడు చంపినందున ప్రతీకారంగా నేను 21 మార్లు క్షత్రియ రాజులను సంహరించి, వారి రక్తాన్ని ఏరులై పారించాను. నేనిపుడు ఈ భూమిపై తిరుగులేని ఆధిపత్యాన్ని సంపాదించాను. క్షత్రియులను చంపిన పాప పరిహారం కోసం, కశ్యపుడు ఒక మహాయజ్ఞాన్ని నిర్వర్తించగా, ఆయనకు దానంగా ఈ భూమిని ఇచ్చివేశాను. ఆపైన నేను మహేంద్ర పర్వతానికి తపస్సుకు వెళ్ళాను. ఉగ్రతపస్సుతో అనేక శక్తిసామర్థ్యాలను సంపాదించాను. కాని నీవు పరమశివుని ధనస్సును విరిచావని తెలుసుకొని, నిన్ను సవాలు చేయక తప్పని పరిస్థితులలోనే ఇక్కడికి

వచ్చాను. నీవు గొప్ప వీరుడవని భావించుకొంటుంటే, ఈ ధనస్సును తీసికొని, నాతో పోరాడగల యోగ్యత నీలో ఉందేమో పరీక్షించుకో రామా!' అని అన్నాడు.

శ్రీరాముడు ఏమీ మాటాడకుండానే, పరశురాముని చేతిలోనుండి ధనస్సును, బాణాన్ని లాగేసుకుని, ఆయన సవాలును స్వీకరించాడు. వాటితో పాటు పరశురాముని తపశ్శక్తిని కూడ రాముడు లాగేసుకొన్నాడు. దానితో పరశురాముడు ఆశ్చర్య పోయాడు. తన శక్తి అంతా నిర్వీర్యమై పోగా, ఆయన చూస్తుండగానే రాముడు ఆ వింటినారిని తగిలించి సునాయాసంగా బాణాన్ని చివరదాకా లాగి సంధించి, పరశురామునితో 'నీవు బ్రాహ్మణుడవు. విశ్వామిత్రునితో నీకు సంబంధం ఉంది. కనుక నిన్ను నేను చంపను. కాని నేను ఎక్కుపెట్టిన బాణం వృథా కాకూడదు. నీ సవాలుకు సరియైన సమాధానం ఇవ్వవలసి ఉన్నందునను, నీవు నీ తపస్సాధనల ద్వారా ఆర్జించుకొన్న స్వర్గప్రాప్తి ఇవ్వగలిగినట్టి, గట్టి లక్ష్యాన్ని నిశ్శేషం చేయడానికి దీనిని వినియోగిస్తాను.' అని శ్రీరాముడు ప్రకటించాడు.

శ్రీరాముని శరప్రయోగాన్ని చూడటానికి దేవతలు ఆకాశంలో గుంపులుగా చేరారు. అప్పటికే శ్రీరాముడు పరశురాముణ్ణి నిర్వీర్యం చేసేసినందున, అతను కళ్లు అప్పగించి చూడడం తప్ప మరేమీ చేయలేక పోయాడు. రాముడు బాణాన్ని చెవిదాకా లాగుతున్న సమయంలో పరశురాముడు కోపం వీడి నెమ్మదించిన స్వరంతో 'నేను కశ్యపుడికి భూమిని దానం చేసిన మీదట ఆయన నన్ను ఇకపై ఇక్కడ నివసించ ద్దని ఆదేశించాడు. అందుచేత నేను ఇక్కడినుండి చీకటిపడేలోగా వెళ్ళిపోవాల్సి ఉంది. నాకు స్వర్గప్రాప్తి లేకుండా చేస్తే చేశావు కాని కనీసం మహేంద్ర పర్వతానికి వెళ్ళి తపస్సు చేసుకునే అవకాశం ఇవ్వు రామా! ఓ శ్రీరామా! నీవు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే అని ఇప్పుడే తెలుసుకో గలిగాను. నీచేతిలో ఓడిపోవడం నాకేమీ సిగ్గుచేటు కాదు కదా శ్రీరామా!' అని అన్నాడు

పరశురాముని కోరికను శ్రీరాముడు మన్నించి, ఆ మహాశక్తివంతమన బాణాన్ని వదలి జామదగ్ని (పరశురాముని) యొక్క స్వర్గాధిరోహణ శక్తిని తృంచివేశాడు. ఆ తర్వాత పరశురాముడు మహేంద్ర పర్వతం వైపు వెళ్ళిపోయాడు. అంతకుముందున్న అంధకారం తొలగిపోయింది. గగనతలం నుండి దేవతలు ఆనందంతో శ్రీరాముని ప్రశంసిస్తూ, పుష్పవర్షం కురిపించారు. అంతట శ్రీరాముడు ఆ విష్ణుధనస్సును వరుణుడికి కానుకగా ఇచ్చివేయగా, పెండ్లిబృందం ప్రయాణం కొనసాగించింది.

స్వగృహానికి చేరిన దశరథ మహారాజు, అతని నలుగురు కుమారులు తమ తమ సతీమణులతో ఆనందంగా కాలం గడపసాగారు. తర్వాత కొంతకాలానికి కేకయుని పుత్రుడు, కైకేయి సోదరుడు, భరత శత్రుఘ్నులకు మేనమామ అయిన యుధాజిత్తు మహారాజు అయోధ్యకు వచ్చాడు. తన మేనల్లుళ్ళను తనతో వచ్చి కొంతకాలం ఉండవలసిందిగా ఆహ్వానించాడు. తన సోదరులు ఇద్దరూ కేకయ రాజ్యానికి వెళ్ళిపోగా, శ్రీరాముడు తన ముగ్గురు తల్లులను, తండ్రిని ఘనంగా సేవించసాగాడు. రాజ్యపాలన కూడ ఎంతో ప్రజారంజకంగా సాగడంతో ప్రజలు శ్రీరాముని అమితంగా ప్రేమించసాగారు. సీతారాముల ప్రేమానురాగాలు దినదిన వర్ధమానమైనాయి. ఒకరికొకరు అన్ని విధాలుగా పరస్పరానురాగంతో అంకితమైపోయారు సంపూర్ణంగా. సీత సాక్షాత్తూ భాగ్యదేవత ఐన లక్ష్మీదేవియే అయినందున, ఆ లక్ష్మీదేవి సౌందర్యంతోనే ఈ సీతాదేవి శోభిస్తున్నట్లుగా ఉండేది.

శ్రీరాముని అంతర్గత విషయాలన్నింటిని, సీత మహాలక్ష్మి తన మనస్సులోనే చదువగల్గేది. భర్తకు అంకితమైన శ్రీమహాలక్ష్మి అవతారమైన సీతాదేవి తన సహజమైన మృదు స్వభావానికి, పాతివ్రత్యానికీ ప్రతీకలా వ్యవహరించేది. అనతికాలంలోనే సీతా మహాలక్ష్మి శ్రీరాముని హృదయాన్ని తాను నియంత్రించ గలిగే స్థితికి చేరుకొంది.



॥ బాలకాండ సమాప్తం ॥

ఓం

# శ్రీరామ కథామృతం - అయోధ్య కాండ

భరత, శత్రుఘ్నులు తమ మేనమామ యుధాజిత్తు ప్రేమాదరాలలో సుఖిస్తూ, కొంతకాలం పాటు వారు అక్కడనే వున్నారు. ఇక్కడ అయోధ్యలో దశరథుడు, రామలక్ష్మణులు ముగ్గురు తల్లులు సుఖంగా ఉన్నారు. శ్రీరాముడు తన ధర్మబద్ధ పరిపాలనచే పురజనుల ప్రేమను బాగా చూరగొన్నాడు.

దుష్ట రాక్షసుడైన రావణుని సంహరించడానికై మానవ లోకంలో అవతరించిన సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే శ్రీరాముడు. సకల సద్గుణ సంపన్నునిగా శ్రీరాముడు విరాజిల్లాడు. శ్రీరాముని సుందరాకృతి కూడ చూపరులకు కనువిందు చేస్తుండేది. క్షత్రియ వీరునిగా శ్రీరాముడు తన సాహస శౌర్యాలతో పాలన నిర్వహించినప్పటికి ఆత్మ నిగ్రహం, ఆత్మతృప్తి కలిగినవాడై వున్నాడు. ద్వేషం ఎరుగనివాడు. మృదుస్వభావం కలవాడు. మాటలలో లాలిత్యం తొణికిసలాడే వాడు. రాముడు ఇతరులను కోపగించేవాడు కాదు. ఎవరో ఏ చిన్న సాయం చేసినా సంతసించేవాడు ఇతరుల అపరాధాలను మన్నించేవాడు. ఉన్నత స్థాయిలో ఉన్న దర్పం, అహంకారం లేకుండా ఎప్పుడూ వినయంగా ఉండేవాడు. సజ్జనుల, వివేకుల సాంగత్యాన్నే కోరుకునే వాడు. ఇతరుల యెడల శ్రద్ధాసక్తులు కలవాడు. అతిథి సత్కారంలో మిన్న. నిత్యసత్యవ్రతుడే కాక బ్రాహ్మణులంటే గౌరవం, పూజ్యభావం కలిగినవాడు. ప్రజాసంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించేవాడు. ప్రజలు కూడ రాముని అమితంగా ప్రేమించేవారు.

శ్రీరాముడు సదా ధర్మప్రవర్తకు కట్టుబడి, ధర్మసూత్రాలనే అనుసరించేవాడు. ఇతరులను నిర్ణయించడంలో గుణశాలి. ప్రతిభాశాలి. దుష్టసంహారంలో, శిష్టరక్షణలో కఠినంగా ఉండేవాడు. ధనుర్విద్య, అశ్వసారథ్యంలో మేటి. రథికులలో సాటిలేని వాడు. వాస్తవానికి శ్రీరాముడు త్రిలోకాధీశుడు, శాశ్వత కాలనియామకుడు. దేవతలు కాని, దానవులు కాని జయింపలేనివాడు.

దశరథ మహారాజు తన రాజ్యాన్ని 60000 సంవత్సరాలు పరిపాలించాడు. ఇప్పుడు వృద్ధుడై, శక్తి నశించినందున, రాచరికపు విధులనుండి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. కాని రాబోయే దుర్దశను సూచిస్తూ ఎన్నో దుశ్శకునాలు కనిపించాయి. అందుచేత వీలైనంత త్వరగా శ్రీరాముని తన వారసునిగా ప్రకటించాలనే ఆతురతలో వున్నాడు. ఇందుకుగాను ఆయన తన మంత్రులతోనూ, సామంతులతోనూ ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. కాని ఈ సమావేశానికి జనక మహారాజు, కేకయ రాజులను, ఎటు తిరిగి వీరు తనకు సాయం అందిస్తారని తలంచి, ఆహ్వానించ లేదు. సమావేశంలో దశరథ మహారాజు "నేను వృద్ధుడనైనాను. ఇపుడు ఈ రాజసింహాసనాన్ని 27 సం॥ల యువకుడైన నా కుమారుడు శ్రీరామునికి అప్పగించాలని అనుకుంటున్నాను. పవిత్ర చైత్రమాసం వచ్చింది. రేపు పుష్యమీ నక్షత్రం. ఆరోహణలో ఉంది. అందుచేత మీరు అనుమతిస్తే, రాముడి పట్టాభిషేక మహోత్సవాలను రేపటినుండే ప్రారంభించాలని అనుకొంటున్నాను." అని ప్రకటించాడు.

మంత్రులు, సామంతులు, పౌరులు అందరూ ముక్తకంఠంతో ఆ నిర్ణయాన్ని స్వాగతించి ప్రశంసించారు. అందరూ రాముని గుణగణ విశేషాలను ప్రస్తుతిస్తూ, శ్రీరాముడు శ్రీ మహావిష్ణువు అవతారమేనని ప్రస్తుతించారు. దశరథుడు ఎంతో సంతోషించాడు.

దశరథుడు పట్టాభిషేక ఏర్పాట్లను ప్రారంభించమని వశిష్ఠ మునిని ప్రార్థించాడు. వశిష్ఠుడు సచివుడైన సుమంత్రుని పిలిచి, నగరాన్ని శోభాయమానంగా అలంకరించమని, సకల ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించాడు. ఆపైన దశరథ మహారాజు రాముని సభకు పిలువనంపాడు. రాముడు సభలోనికి ప్రవేశించి తండ్రికి సాష్టాంగ ప్రణామం చేశాడు. కుమారుని కౌగిలించుకొని 'ఓ రామా! నేను పరిపాలనలో అలసిపోయి వృద్ధాప్యంలో వున్నాను. నాకు విశ్రాంతి సమయం వచ్చింది. అన్ని రాజభోగాలను అనుభవించాను. లెక్కలేని యజ్ఞాలు చేశాను. బ్రాహ్మణులకు విపరీతంగా దానాలు ఇచ్చాను. రామా! నీవు నా జ్యేష్ఠ కుమారుడవు. ప్రియనందనుడివి. అంతేకాదు, మంత్రులూ, సామంతులు, ప్రజలూ అందరూ నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నారు. అందుచే నిన్ను ఈ రాజసింహాసనానికి వారసునిగా ప్రకటించి, ఏర్పాట్లు చేశాను." అని అన్నాడు.

రాముని మిత్రులు కొందరు అమితానందంతో కౌసల్య మాతకు తామే ముందు ఈ శుభవార్తను తెలియజేయాలనే తలంపుతో పరుగులు తీశారు. ఆమె ఈ వార్త విని ఉప్పొంగిపోయింది. ఈ వార్త తెచ్చిన వారందరికి విరివిగా బహుమానాలు ఇచ్చింది. ఆ తర్వాత రాముడు తన సౌధానికి తిరిగి వస్తుండగా, పురజనులు దారిపొడవునా నిలబడి ఆయన్ను అభినందనలతో ముంచెత్తారు. ఈలోగా దశరథుడు విశ్రాంతికి తన రాజసౌధాంతర్భాగంలోనికి వెళ్ళాడు. అయితే ఆయన నిద్రకు ఉపక్రమించక ముందే, కొన్ని అశుభ శకునాలు పొడసూపాయి. ఒక అశుభ స్వప్నం కూడ రాసాగింది. ఉలికిపడి లేచి, దశరథుడు రాముని కోసం కబురు పంపాడు. శ్రీరాముని పట్టాభిషేకానికి ఏదో ఆటంకం రానున్నదని మహారాజు శంకించాడు.

తండ్రి తనను మళ్ళీ రమ్మన్నందుకు రామునికి కూడ ఏదో సంశయం వచ్చింది. కాన వెంటనే తండ్రి సౌధానికి చేరి, తాను యేమి చేయవలయునో చెప్పమని రాముడు తండ్రిని అడిగాడు. దశరథుడు రాముని కౌగలించుకొని 'నాయనా! రామా! నిన్ను సింహాసనాధిష్ఠునిగా చేయడం తప్ప నా జీవితంలో ఏమి కోరికలు మిగిలి లేవు. అన్నీ నెరవేరాయి. కాని దురదృష్టవశాత్తు, నా జాతకంలో సూర్యుడు, అంగారకుడు, రాహువుల గతుల కారణంగా ఇప్పుడు దుర్దశ వచ్చినట్లు తోస్తోంది. ఏవేవో పీడకలలు నన్ను విపత్తులోనికి తోసి వేస్తున్నట్లు కలలు వస్తున్నాయి. అందుచేత నేను చేయవలసిన ఈ ఒక్క కార్యం తక్షణమే చేయాలని ఆతురతతో ఉన్నాను. నీ పట్టాభిషేక మహోత్సవం వెంటనే ప్రారంభించాలని ఉన్నాను. నీ సోదరులు లేరు. ఫరవాలేదు. నీవు, సీత ఈ రాత్రి ఉపవాస దీక్షలో ఉండండి. రేపు తెల్లవారగనే పట్టాభిషేకానికి సిద్ధమై ఉండండి." అని చెప్పాడు.

రాముడు రేపటి రోజు చేయవలసిన కార్యాల్ని గురించి సీతతో చెప్పాలని తన సౌధానికి తిరిగి వచ్చాడు. ఆమె అక్కడ లేనందున, తన తల్లి గృహానికి వెళ్ళాడు రాముడు. రాముడు ఆమెను సమీపించిన సమయలో కౌసల్య కులదైవమైన ఆదిత్యుని మౌనంగా ప్రార్థిస్తూ, దర్శనమిచ్చింది. రామునికి సకల శుభములు చేకూర్చుటకే కౌసల్య మౌన ప్రార్థనలో లీనమై ఉంది. ఆమె సేవ నిమిత్తమే, లక్ష్మణుడు, సుమిత్ర కూడ అక్కడే ఉన్నారు. ఆమె మౌన ప్రార్థన ముగియగానే, రాముడు 'అమ్మా! తండ్రిగారు నన్ను రాజసింహసనానికి వారసునిగా ప్రకటించాలని అభిలషిస్తున్నారు.' అని చెప్పాడు. కౌసల్య ఆనందభాష్పధారలతో 'నా వ్రతసాధనలన్నీ ఫలించాయి. నీవు, సీత చిరకాలం వర్ధిల్లుదురు గాక!" అని ఆశీర్వదించింది. రాముడు చిరునవ్వుతో, సంతోషంతో లక్ష్మణునివైపు తిరిగి 'ప్రియ సోదరా! నీవు నాకు ప్రాణసమానుడవు. కనుక నీవు కూడ ఈ రాజ్యాన్ని పాలించాల్సిందే. నిజానికి నీవు లేకుండా, నేను ఈ రాజ్య సుఖాల్ని గాని, ఆఖరుకు జీవించడం గాని ఊహించనైనా లేను' అని అన్నాడు. ఆ

తరువాత రాముడు తన సౌధానికి తిరిగి వచ్చి, సీతారాములు ఇద్దరూ శ్రీమన్నారాయణుని పూజించి, ఆ రాత్రికి విశ్రమించారు.

ఈలోగా పురజనులు కోలాహలంగా సంబరాలుచేస్తున్నారు. నగర వీథులన్నీ పరిమళభరితమై, విలసిల్లుతోంది. ప్రతి ఇల్లు, వీథి దీపాలంకరణతో మిరుమిట్లు గొల్పుతున్నాయి. రాత్రిని పగలుగా మార్చేశారు పురజనులు. జనసంద్రం ఉప్పొంగిపోతోంది. అసంఖ్యామైన ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు భారీ జలచరాలను తలపించ సాగాయి. ఇలా అయోధ్య నగరం యావత్తు సకల శోభలతో విరాజిల్లుతున్న అద్భుతరీతిని, పురజనుల కోలాహలం, వీథుల్లో ఆర్భాటాలు అన్నింటినీ మహారాజు మూడవ భార్య కైకేయి యొక్క దాసి మంథర చూచింది. కైకేయిని దశరథునికిచ్చి వివాహం చేసినపుడు, కేకయ రాజు అయిన యుధాజిత్తు తండ్రి అశ్వహతి అంతఃపుర దాసిగా ఈ మంథరను పంపాడు. నిజానికి, రావణ సంహారంలో సహాయ పడటానికి దేవతలచే పంపబడి భూమిపై అవతనెరించిన ఒక అప్సరసే ఈ మంథర.

మంథర ఈ అద్భుత శోభను గురించి తెలుసుకోవాలని ఆశ్చర్యంలో రాముని పెంచిన దాది దగ్గరకు వెళ్ళి 'ఏమమ్మా! ఈ సంబరాలు చేసుకోవడానికి కారణం ఏమిటి? కౌసల్య బ్రాహ్మణులకు విరివిగా దానాలు కూడ చేస్తోందేమిటి?' ఆరా తీసింది.

ఊహించని వార్త 'రేపు పుష్యమీ నక్షత్రంలో దశరథ మహారాజు రాముని తన సింహాసనానాకి వారసునిగా ప్రకటిస్తున్నాడు' అని దాది బదులు చెప్పింది. ఈ వార్త మంథర మదిలో శూలంలా గ్రుచ్చుకొంది. తన రాణి కైకేయికి రాజు వంచన తలపెట్టాడని భావించిన మంథర కైకేయి కోసం వెళ్ళింది. ప్రశాంతంగా విశ్రాంతితో పరుండిన కైకేయిని సమీపించి, మంథర 'లే లేవమ్మా! నీవు మునిగిపోయే ప్రమాదం నీ ముందరే జరుగుతుంటే నిద్ర పోతున్నావా? గ్రహించలేవా' అంటూ కేక వేసింది. మంథరను కైకేయి ఏమి జరిగిందని అడిగింది. అపుడు మంథర తన దుష్ట నైపుణ్యాన్నంతా ఏకం చేసి, దశరథుని హింసాత్మక దృక్పథాన్ని సానబెట్టి, కైకేయికి చిలవలు పలవలు సృష్టించి చెప్పింది. తనను మాత్రమే విశ్వసనీయరాలుగా చెప్పుకొంటూ, కైకేయితో మంథర ఇలా అన్నది. "నీ భర్త, రాముణ్ణి రాజ్యానికి వారసునిగా ప్రకటించడం నీకు తెలియదా? నీ భర్త మోసం నీకు తెలియదా? రాముణ్ణి సింహాసనానికి ఎక్కించడానికి, భరతుణ్ణి దూరంగా పంపాడు. రాముడు రాజైతే నీ కొడుకు సర్వదా అననుకూలుడు. కాలం మించి పోకముందే నా మాట విని బాగుపడు. నీ కొడుకు భరతుణ్ణి కాపాడుకోవడంతో నీవు బ్రతికి పోతావు. జాగ్రత్త పడు. భరతుడే రాజు కావాలి తప్ప వేరే మార్గం లేదు ఇందుకు. కాని కైకేయి 'రాముడు సింహాసనాన్ని అధిష్ఠిస్తున్నందుకు నాకు చాల ఆనందంగా వుంది. ఈ శుభవార్త తెచ్చావు కనుక నీవు ఏమి కావాలో కోరుకో' అని బదులు చెప్పి, ఒక అమూల్యమైన హారాన్ని మంథర చేతిలో పెట్టింది.

కాని, ఆ అమూల్య ఆభరణాన్ని విసిరికొట్టి కోపంతో 'రాముడి పట్టాభిషేకం నీకు సంతోషం కలిగిస్తుంటే, నాకు ఆశ్చర్యమయింది. భరతుని పక్కకు నెట్టి రామునికి సింహాసనం అప్పగిస్తుంటే, నీకు అవమానంగా లేదా? దశరథుడికి నీమీదే మహాప్రేమ వుందని నీవు అనుకోవచ్చు. కాని కౌసల్య మీదనే ఆ ప్రేమ అంతా ఉంది అని తెలుసుకో. బాగుపడేది కౌసల్యయే, నాశనమయ్యేది నీవేనని తెలుసుకో. కాలక్రమంలో నీవు కౌసల్య దాసిగాను, భరతుడు రామునికి దాసుడుగాను ఉండవలసి వస్తుందని గుర్తుంచుకో.' ఇలా విషపూరితమైన మాటలను పదే పదే వినడంతో కైకేయి మనస్సు కలుషితమై పోయింది. అసూయతో కైకేయి మంథరతో 'మంథరా! నీవు చెప్పింది

నిజమే ననిపిస్తోంది. కనుక ఎలాగైనా సరే రాముణ్ణి అడవులకు పంపి, నా భరతుని రాజుగా చేస్తాను. ఇది ఎలా సాధ్యమో చెప్పగలవా మంధరా' అని కైకేయి మంధరకు లోబడిపోయింది.

అపుడు మంధర – రాక్షసులతో జరిగిన యుద్ధంలో దశరథుడు ఇంద్రుడి తరపున పోరాడిన సంగతి గుర్తు చేసింది. శంబలుడి మాయలకు దేవతలు భయపడుతూ ఉండేవారు. దేవతలను నష్టపరచినపుడు, వారికి సాయంగా దానవుల రాజధాని వైజయంతపురం మీదికి ఇంద్రుడు దండెత్తాడు. ఆ యుద్ధంలో దశరథుడు స్పృహ కోల్పోయాడు. అపుడు కైకేయి ఆయనను యుద్ధరంగం నుండి తప్పించి, ఆయన ప్రాణాల్ని కాపాడింది. కృతజ్ఞతా భావంతో కైకేయికి రెండు వరాలు ఇస్తానని వాగ్దానం చేశాడు. కాని అవసరం వచ్చినపుడు అడుగుతానని కైకేయి దశరథునితో అపుడు చెప్పింది. ఈ విషయాన్ని గుర్తుచేసి మంధర ఇలా అన్నది. 'దశరథుని అడగవలసిన వరాల సమయమిదే. ఒక వరం భరతుణ్ణి రాజుగా చేయడం, రెండవ వరం రాముని 14 సం॥ అవడులకు పంపడం. ఇది జరగాలి. రాముడు లేకపోతే భరతుడు మంచి ప్రజాపాలకుడిగా ప్రసిద్ధి చెందుతాడు.' అని చెప్పింది. ఇంకా ఇలా సూచనలు ఇచ్చింది. 'నీవు నీ ఆభరణాలు విసర్జించి, చిరిగిన బట్టలతో, నీకోప గృహంలో నేలపై పడుకొని ఉండు. దశరథుడు వచ్చినపుడు నీవు మౌనంగా ఉండు. నీపై ఆయనకు విపరీతమైన మోహం కనుక నిన్ను అలా చూడలేడు. భరించలేడు. నిన్ను శాంతింపజేయడానికి సిద్ధపడతాడు. నీ కోరికను వదలకు. దృఢంగా వుంచుకో. అవికాక మరేమిస్తానన్నా నీవు ఒప్పుకోకూడదు. భరతునికి పట్టాభిషేకం, రామునికి వనవాసం ఇవే నీ రెండు వరాలు. సడలించకూడదు. దశరథుడు ఎట్టకేలకు తప్పక ఒప్పుకుంటాడు. వెంటనే పట్టాభిషేకం చేయమని పట్టు పట్టు. అంతే." చపలచిత్త కైకేయి మంధరకు లోబడిపోయింది.

మంధర చెప్పినట్లే చేస్తానని కైకేయి హామీ ఇచ్చింది. మంధర దుర్బోధలతో కైకేయి మనసులో భరతుని రాజుగా చేయించే సంకల్పం బాగా దృఢంగా నాటుకొని పోయింది. మంధరను కైకేయి పొగడటం చూస్తే, కైకేయికి పిచ్చి పట్టిందా అనిపించక మానదు. 'ప్రియమైన మంధరా! నీవు వివేకవతివి. గౌరవశాలివి. నీ శరీరం అందంగా ఉంది. నీవు తామరపూవులా ఉన్నావు. నీ రూపమెంతో మనోహరంగా ఉంది. నీ వక్షోజాలు అందంగా వంగి నీ నాభిని మరుగుపరుస్తున్నాయి. నీ పిరుదులు, నీ జఘనాలు నున్నగా, కుదురుగా ఉన్నాయి. నీ మృదువైన పాదాలకు గల అందియలు వినసొంపుగా సందడి చేస్తున్నాయి. నీ గూనిలోనే నీ రాజకీయ చాతుర్యమంతా నిబిడీకృతమై వుంది. భరతుడు రాజు కాగానే, నీ గూనివంపును బంగారు గొలుసుతో అలంకరిస్తాను. ఓ మంధరా! నీకు మహా విలువైన ఆభరణాలు, దుస్తులు బహూకరించి, ఇతర గూని స్త్రీలను నీకు దాసీలుగా చేస్తాను. వారు నీకు సకల సేవలు చేస్తారు.' అంటూ ఏమేమో పిచ్చివాగుడు అంతా పలికింది కైకేయి. పిచ్చిగాక మరేమిటి?

రాముని పట్టాభిషేకానికి అన్ని ఏర్పాట్లు ముగిశాయి. దశరథ మహారాజు కైకేయిని చూడటానికి ఆమె సౌధానికి చేరాడు. చిన్నరాణిని చూడాలనే మోజులో ఆమె గదిలో ప్రవేశించగా ఆమె కనబడక పోవడంతో దశరథుడు కంగారు పడ్డాడు. పిలిచినా జవాబు లేదు. తనకు చెప్పకుండా ఎక్కడకూ వెళ్ళదు. చివరకు ఒక దాసిని అడుగగా, కైకేయి తన కోపగృహంలో వుందని తెలుసుకున్నాడు. ఆదోళనతో ఆయన అక్కడికి వెళ్ళాడు. కైకేయి నేలపై పడి ఉండటం చూచిన దశరథుడు దిగ్భ్రాంతికి లోనైనాడు. ఆమె చుట్టూ ఆభరణాలు, దండలూ అన్నీ ఛిన్నాభిన్నంగా పడి వున్నాయి. అప్సరసలా ఉండవలసిన కైకేయిని అలాటి పరిస్థితుల్లో చూచిన దశరథుడు

ఆందోళనకు లోనైనాడు. ఆమెను సమీపించి, ఆమె ముఖాన్ని ప్రేమతో నిమురుతూ 'ప్రియ కైకేయీ! నీకు వచ్చిన బాధ ఏమిటి? నీ దుఃఖానికి కారణం ఏమిటి? నీ బాధను తొలగించటానికి నేను సిద్ధంగా వున్నాను. నీ సవతుల వల్ల గొడవలు వచ్చాయా? నేను నిన్ను సరిగా చూడటం లేదా? ప్రియా! నేను నీ దాసుడనని తెలుసుకో. నీకు సంతోషం కలిగించే ఏ ప్రయత్నమైనా నేను చేస్తాను. చెప్పు. స్వేచ్ఛగా మాట్లాడు. నీ దుఃఖాన్ని నేను దూరం చేస్తాను. చెప్పు' అని తన ప్రియతమ రాణిని రాజు వేడుకొన్నాడు.

మన్మథ బాణాలకు వశుడైన రాజు స్థితిని కైకేయి గమనించి, తన కోరిక నెరేరుతుందని భావించింది. కొద్దిసేపు మౌనంగా ఉంది కైకేయి. 'ఎవరూ నన్ను అవమానించ లేదు. నాథా! నా మనసులో మాట చెబుతాను. నేను కోరేదానిని నీవు తుచ తప్పక నెరవేరుస్తానని వాగ్దానం చేయాలి' అని పలికింది.

దశరథ మహారాజు కైకేయి తలను నిమురుతూ ఆమెను తన ఒడిలోనికి తీసికొని, శిరోజాలను సవరిస్తూ ఇలా అన్నాడు. 'రాముణ్ణి తప్ప మరెవ్వరిని అధికంగా ప్రేమించనని నీకు తెలుసు. నీ ఆదేశమేదైనా సరే నెరవేరుస్తాను అని ప్రమణం చేస్తున్నాను. నిన్ను బాధిస్తుందేమిటో నిస్సంకోచంగా చెప్పు. నేను తీరుస్తానని మాట ఇస్తున్నాను.' అని అన్నాడు. రాజు ముమ్మారు ఇచ్చిన వాగ్దానంతో ఆయన తన అధీనంలోనికి వచ్చాడని విశ్వాసం కైకేయికి కలిగింది. కైకేయి ఈ విధంగా పలికింది. "ద్వాదశాదిత్యులు, ఏకాదవ రుద్రులు, అష్టవసువులు, అశ్వినీ దేవతలు ఇందుకు సాక్షులగుదురు గాక! సూర్యభగవానుడు, నాలుగు దిశలు కూడ సాక్షులగుదురు గాక! ధర్మాచరణుడు, సత్యవ్రతుడు, ధీశాలియైన నా భర్త నా కోరికను నెరవేరుస్తానని వాగ్దానం చేశాడు.

'ప్రియ నాథా! దేవాసుర సంగ్రామంలో నీవు మృతుడిగా పడిన విషయం గుర్తుకు తెచ్చుకో. నేను అప్పుడు ఎలా నీ ప్రాణాలు నిలిపానో గుర్తు చేసుకో. ఆనాడు నాకు రెండు వరాలు వాగ్దానం చేశావు. ఓ రాజ శ్రేష్ఠుడా! ఈరోజు ఆ రెండు వరాలు నాకు కావాలి. ప్రసాదించు. లేదంటే, నేను ప్రాణాన్ని విడుస్తాను. రాముడి పట్టాషేకం బదులు భరతుని వారసునిగా ప్రతిష్ఠించాలి. ఇది నా మొదటి కోరిక. రెండవది అదే రోజు రాముడు దండకారణ్యానికి వెళ్ళి, 14 సం॥లు ప్రవాస జీవితం గడపాలి. ఇవే నా కోరికలు." అని చెప్పింది.

ఈ కోరికలు వినిన దశరథుడు నిశ్చేష్టుడై నిలుచుండిపోయాడు. అపార దుఃఖంతో వివశుడైనాడు. తేరుకొని, మరల మూర్ఛపోయాడు.

చాలసేపు తర్వాత రాజు కొంత కోలుకొన్నాడు. ధైర్యం కూడకట్టుకొన్నాడు. హృదయంలో ప్రజ్వరిల్లిన ఆగ్రహావేశాలు తీవ్రమై పోగా, దశరథ మహారాజు కైకేయితో 'ఓసీ దుష్టురాలా! నా వంశాన్ని నాశనం చేసేటంత దుర్మార్గురాలివా నీవు, నేనేం పాపం చేశాను. రాముడు నిన్ను కూడ అమితంగా ప్రేమిస్తున్నాడే! తల్లిలాగానే ప్రేమిస్తున్నాడే. వానికి ఇంత కీడు ఎందుకు తలపెట్టావు? పట్టుదల దేనికి? రాముణ్ణి అందరూ ప్రాణంతో సమానంగా చూచుకొంటారు గదా! రాముడు లేనిదే నేను జీవించజాలను. నా భార్యలను వదిలి వుండగలనేమో గాని, నా రాముణ్ణి వదలి నేను ఉండలేను.' అంటూ నిందావాక్యాలు పలికాడు. క్రోధంతో పల్కిన మహారాజు తీరు ఆకస్మికంగా మారిపోయింది. అంతట రాజు తన శిరస్సుతో కైకేయి పాదాలను తాకి 'నా ప్రియమైన అందాలరాణీ! నీ భయంకర కోరికను వదలి వేయి. రాముడు సకల సద్గుణ సంపన్నుడు. క్షమాశీలి. సత్యవ్రతుడు. మృదుస్వభావి. కర్తవ్యపరాయణుడు. నీ భరతుడు నిన్ను సేవించిన విధంగానే రాముడు కూడ నిన్ను సేవించలేదా? చెప్పు. నీకు అంత పట్టుదల ఉంటే, పోనీ భరతుని రాజుగా చేస్తాను. కాని రాముణ్ణి అడవులకు పంపడం నేను చేయలేను. నా రాముని వీడి నేను బ్రతుక లేను. రామునికి హాని చేయాలనే సాహసం నీకు ఎలా కలిగింది?

అతడు దోషరహితుడే, నిన్ను ఎప్పుడూ పరుషంగా మాట్లాడి ఎరుగడు. నా ప్రియతమా! నా మీద దయచూపు. మరేదైనా అడుగు. ఈ సమస్త రాజ్యాన్ని ధారపోస్తాను. రాముణ్ణి రాజ్య బహిష్కరణ చేసి నేను బ్రతుకలేను. నాకు చావే శరణ్యం. ఆ క్రూర చర్యకు పాల్పడకుండా నన్ను వదలి పెట్టు" అని వేడుకొన్నాడు, అంజలించాడు.

హృదయ క్షోభతో శోకిస్తూ, గుండెలు అవిశేవిధంగా మహారాజు దయాభిక్షకై వేడుకొన్నా కూడా, కైకేయి ఏమాత్రం చలించలేదు. 'నీవు చేసిన వాగ్దానం వదిలి నీవు వెనుకకు వెళుతున్నావు. నీవు ఎలా ధర్మపన్నాలు వల్లిస్తావు. నేను మరువను. తన శరీరభాగాన్ని కోసి ఇచ్చిన శిబి చక్రవర్తిని గుర్తుచేసుకో. నీ మాట నిలబెట్టుకోకపోతే, నీ వంశ గౌరవమే నశిస్తుంది. అందుచేత నీవు నీ మాటను నిలబెట్టుకోవాల్సిందే. తప్పదు. తప్పదు' అన్న కైకేయి దుర్మార్గపు మాటలు దశరథుని సంక్షుభితుని చేసింది. స్త్రీ, పట్టపురాణి అని కూడ గమనించుకోకుండా, సిగ్గు, బిడియం వదలివేసి కైకేయి 'ఓ రాజా! నీ ఉద్దేశ్యం నాకు తెలుసు. రాముని వారసునిగా చేసి, నన్ను, నా బిడ్డను తరిమివేయాలని నిర్ణయించుకొన్నావు. అపుడు నీవు పూర్తిగా కౌసల్యతోనే సకుటుంబ సుఖాలను అనుభవించాలని అనుకొంటున్నావు. కనుక నీవు నీ వాగ్దానాన్ని వమ్ముచేస్తే, నేను ఈ రోజే విషం త్రాగి మరణిస్తాను అని శపథం చేస్తున్నాను.' అని అన్నది. ఈ దుర్మార్గపు ఆలోచనకు తట్టుకోలేక, దశరథ మహారాజు 'రామా! రామా!' అంటూ నేలకొరిగి పోయాడు. కొంతసేపటికి ఎలాగో తేరుకొని, మహారాజు 'ఓసీ! ఇలాంటి దుష్ప్రవర్తన ఎవరినుండి నేర్చుకొన్నావు? దుర్మార్గురాలా! భరతుని రాజును చేసినాకూడా అతడు రాముడు లేకుండా రాజ్యాన్ని స్వీకరించడని నీకు తెలియనిదా? ప్రజలు నన్ను ఏమనుకొంటారు? కామపీడితుడై, అగ్రజునికి రాజ్యాన్ని ఇవ్వకుండా, భరతుడి కిచ్చాడని నన్ను ప్రజలు దూషించరా? నేను ఎలా బ్రతుక గలనని అనుకొన్నావు?' అని ప్రశ్నించాడు. రాజభోగాలతో పెరిగిన రాముడు ఎలా అరణ్యవాసం చేయగలడు అనే ఆలోచన కూడ లేకుండా కైకేయి వరం కోరడంతో మహారాజు క్రోధంతో అవహేళనా పూర్వకంగా 'ఓ ధార్మికురాలైన రాణీ! మమ్మల్ని అందరినీ వదిలించుకొన్న మీదట నీకు రాజ్యభోగం అమరాలని కోరుకొంటున్నావు. నీ దుర్మార్గపు ఆలోచనలను నేను సమ్మతిస్తానని అనుకోకు. నేను ఎప్పటికీ నెరవేర్చను సుమా!' అని అన్నాడు.

ఇలా మాట్లాడిన వయోభారతో వివశత్వం పెల్లుబకగా, మహారాజు గాంభీర్యం మళ్ళీ సన్నగిల్లింది. 'నీ మాటలను వెంటనే వెనక్కి తీసుకో. దయచేసి తీసివేయి' అంటూ బ్రతిమలాడుతూ, మళ్ళీ స్పృహ కోల్పోయాడు. తిరిగి కొంతసేపటికి తెలివిలోకి వచ్చిన తర్వాత 'అయ్యో! స్త్రీలు ఎంత క్రూరులు, కుటిలురు. స్వార్థపరులు. ఎంతటి గర్హనీయులు. అందరి సంగతి ఏమోగాని, ఓ భరతుడి తల్లీ! నీవు మాత్రం అలాంటిదానివే సుమా! నీ కోరికలు దుష్టమైనవి. ద్వేషపూరితమైన వాటిని నేను తీర్చేది లేదు. నీ ఇష్టం. విషం తీసుకొంటావో, గోల చేస్తావో నీ ఇష్టం. నన్ను బెదిరించవచ్చు. ఎన్ని చేసినా నేను రాముని అడవులకు పంపేది లేదు.' అంటూ మళ్ళీ కైకేయిని నిందించాడు మహారాజు.

శోకంతో మహారాజు స్థితి హృదయవిదారకంగా ఉన్నా కూడా, కైకేయి మనస్సు కరగలేదు. తలను మరోవైపు తిప్పుకొంది. కాని మహారాజు పదే పదే బ్రతిమలాడాడు. ప్రయోజనం కనిపించలేదు. రాముని అడవులకు పంపకుండా, ఈ రాత్రి హాయిగా గడిచిపోవాలని మ్రొక్కుకున్నాడు కైకేయి దృఢ నిర్ణయాన్ని గమనించిన మహారాజు. మరల అక్కడే మరోసారి మూర్ఛపోయాడు. ఇటు ఈ విషయం జరగుతున్నా, అటు వశిష్ఠ ముని అన్ని ఏర్పాటు పూర్తి కావించాడు.

పట్టాభిషేక పవిత్ర ముహూర్తం సమీపించింది. వశిష్ఠ ముని పురవీథుల గుండా వస్తుండగా, నగరం

శోభాయమానంగా వెలుగొందటం గమనించాడు. వీథులన్నీ రాముని రాక కోసం ఎదురు చూస్తున్నాయి. జన సమూహంతో పురవీథులు నిండి వున్నాయి. ఇతర మహర్షులు కూడ వశిష్ఠుని దారినే అనుసరిస్తూ ఆనందభరిత వాతావరణంలో రాజ ప్రాసాద ప్రాంగణంలోనికి ప్రవేశించారు.

వశిష్ఠుడు ప్రవేశించగానే, రాజ ప్రధాన సచివుడు సుమంత్రుడు కనిపించాడు. వశిష్ఠుడు ప్రభువుకు తెలియజేయమని చెప్పాడు. పవిత్ర జలాలతో స్వర్ణకలశాలను, రాముని కొరకు ప్రత్యేక పీఠాన్ని తీసికొని వచ్చానని చెప్పు. పట్టాభిషేకానికి కావలసిన సకల ఏర్పాట్లు దివ్యంగా చేశానని చెప్పు. యజ్ఞానికి కావలసిన సకల వస్తు సామగ్రిని కూడ తెచ్చాను.

ఇంకా అష్ట కన్యలను, ఏనుగులను, నాలుగు గుర్రాలు లాగే అద్భుతమైన రథాన్ని, ప్రత్యేక ఖడ్గాన్ని, ధనస్సును, పల్లకిని, శ్వేతఛత్రాన్ని, రెండు వింజామరలు, సింహాలతో చెక్కబడిన సింహాసనాన్ని కూడ వెంట తెచ్చాను. కనుక మహోత్సవం ప్రారంభించడానికి రాముని తోడ్కొని రమ్మని దయచేసి మహారాజుకు చెప్పండి' అని అన్నాడు ముని.

సుమంత్రుడు మహారాజు భవనంలోనికి చేరుకొన్నాడు. రాజుకు కైకేయికి మధ్య జరిగిన విషాదం అతనికి తెలియదు కనుక ఆనందంగా ఉన్నాడు. మహారాజు సుఖసంతోషాలు అప్పటికే చెరిగిపోయి వున్నాయి. సుమంత్రుని చూడగానే రాజు 'సుమంత్రా! నీవు నా హృదయాన్ని ముక్కలు చేస్తున్నావు' అని బిగ్గరగా అరచి, స్పృహ కోల్పోయి, నేలమీద పడిపోవడం చూచి, అతను నిశ్చేష్ఠుడైనాడు.

రాముని పిలుచుకు రమ్మని రాజు సుమంత్రుని ఆదేశించాడు. క్షణాల్లో సీతారాముల వద్దకు చేరుకొన్నాడు సుమంత్రుడు. అప్పటికే భగవానుడైన శ్రీరాముడు ఉత్తమ వస్త్రాలను ధరించి ఉన్నాడు. ఆ దివ్యదేహం స్వర్ణాభరణ భూషితమై శోభిస్తోంది. పరిచారకులు పరిచర్యలతో సహకరిస్తుండగా, పలురకాల కానుకలు సమర్పించడం జరుగుతోంది. శ్రీరాముడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువులా విరాజిలుతున్నట్లు దర్శనం ఇస్తున్నాడు. వాస్తవానికి ఆయన శ్రీమహావిష్ణువేగా!

సుమంత్రుడి రాకతో, రాముడు సీతతో 'నన్ను నాన్నగారు రమ్మనడం పట్టాభిషేక కారణమే అయివుంటుంది' అని చెప్పాడు. రాముడు బయలుదేరుతుండగా, ద్వారం వద్ద లక్ష్మణుడు చేతులు జోడించి నిలబడి వున్నాడు. రాముడు లక్ష్మణునితో కూడి రథాన్ని అధిరోహించి, అతి ముఖ్య పురవీథుల గుండా సాగిపోయాడు. దారి పొడవునా జయజయ ధ్వానాలు రాముని దర్శనం కోరిన జనసమూహం కన్ను కదల్చకుండా, వీక్షిస్తూ ఉన్నారు. రాముడు కూడ వారిని చూడటంలోనే నిమగ్నుడైనాడు. తన తండ్రి ప్రాసాదంలోనికి చేరుకొని, రథం దిగి, గదిలోనికి ప్రవేశించిన రాముడికి ఒక తల్పం మీద కైకేయితో పాటు కూర్చొనివున్న దశరథ మహారాజు కనిపించాడు. మహారాజు ముఖంలో సంతోషఛాయలు లేవు.

రాముడు సమీపించగానే, దశరథుడు కేవలం రామా రామా అని మాత్రమే ఉచ్చరించ గలిగాడు. దుఃఖిస్తున్న తండ్రిని చూచిన రాముడు నన్ను చూచి నా తండ్రి ఎందుకు ఆనందించ లేకున్నాడు? కైకేయితో 'నావల్ల ఏమైనా అపరాథం జరిగిందా తల్లీ? ఎందుకు తండ్రి ఇలా ఉన్నారు? కారణమేమిటమ్మా?' అని అడిగాడు. అపుడు కైకేయి ఇలా చెప్పటం ప్రారంభించింది. 'మహారాజుకు కోపం లేదు. ఎవరూ ఏ అపరాథం చేయలేదు. ఆయన నీకు ఒక విషయం చెప్పదలచాడు. అది చెపితే, నీవు బాధపడతావని ఆయన భయం. అదేమిటో నేనే వివరిస్తాను. ఒకప్పుడు యుద్ధంలో ప్రాణాపాయంలో వున్న నీ తండ్రిని నేను కాపాడాను. అప్పుడు ఆయన నాకు

రెండు వరాలిస్తానన్నాడు. ఇపుడు నేను కోరితే, వాటినివ్వటానికి తటపటాయిస్తున్నాడు. అసత్యవాదిగా మారకుండా, నీవు నీ తండ్రికి నచ్చచెప్పి, ఆయన ప్రాణాన్ని నీవు కాపాడాలి. ఓ రామా! నీవు మహారాజు వాగ్దానం ప్రకారం నడుచుకుంటానని నాకు నీవు మాటనిస్తే, అవేమిటో నేనే నీకు చెప్తాను.' అని అనగా, రాముడు ఆ స్థితికి వ్యథ చెందినవాడై, విధేయతతో 'అమ్మా! నా తండ్రి కోరిక నెరవేర్చటానికై నేను అగ్నిప్రవేశం చేయడానికి కూడ వెనుకాడనని, నెరవేర్చుతానన్న విషయమై, నీ మనస్సులో ఏ కొంచెం సందేహం తలెత్తడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. నాన్నగారు కోరినదేమిటో నాకు చెప్పు. ఆ ప్రకారమే నడుచుకొంటాను. సందేహించకు. ఆ మేరకు నీకు నేను వాగ్దానం చేస్తున్నాను.' అని బదులు చెప్పాడు శ్రీరాముడు.

శ్రీరాముని హామీ పొందిన క్రూర కైకేయి ఇలా చెప్పింది. 'మునుపు శంబరాసురినితో యుద్ధంలో మీ తండ్రి గాయపడగ, నేను ఎంతో సేవచేసి ఆయన ప్రాణాలు కాపాడాను. కృతజ్ఞతాభావంతో మీ తండ్రి నన్ను రెండు వరాలు కోరుకొమ్మన్నాడు. ఇపుడు ఆ రెండు వరాలను కోరుకొన్నాను. మొదటిది భరతుని రాజ్యవారసునిగా ప్రతిష్ఠించమని, నిన్ను 14 సం॥లు అరణ్యానికి పంపాలని రెండవ వరంగా కోరాను. నీవు ఆ కాలంలో తపస్విగా జీవించాలని కోరాను. నీ తండ్రి వాగ్దానభంగం చేయకుండా చూడాల్సిన బాధ్యత నీపై ఉంది. సత్యమార్గం విడిచి పెట్టకుండా చూడటం నీ విధ్యుక్తధర్మం.' ఇలా కైకేయి మాటలు విన్న రాముడు కొంచెం కూడ ఆందోళనకు గురి కాలేదు. ఎలాంటి అసంతృప్తి లేకుండా 'ప్రియజననీ! నీవు కోరినట్లే నేను తక్షణమే అడవులకు వెళ్ళిపోతాను. భరతుని పిలుచుకు రావడానికి దూతలు వెళ్ళెదరు గాక! నాకు ఎలాటి విచారం లేదు. నీవు, నా తండ్రిగారు నన్ను ఎల్లప్పుడు అనుగ్రహంతో కాపాడాలనేదే నా అభిలాష. ప్రియమైన మాతా! నాపై ఎటువంటి దురభిప్రాయం పెట్టుకోవద్దు. ' అని బదులు పలికాడు రాముడు. దీనితో కైకేయి మహానందంతో సమస్య పరిష్కారమైనందుకు సంతోషించింది. 'నా భరతుని రప్పించుటకు దూతలను పంపండి. రామా! నీవు ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా అరణ్యానికి బయలుదేరాలి. నీ తండ్రి గురించి నీవేమీ చింతించవద్దు. ప్రస్తుతం కొంత అస్వస్థతకు లోనైనాడే కాని ఏమీ భయము లేదు' అని అన్నది కైకేయి.

శ్రీరాముడు అంతట 'జననీ! నాకు నా తండ్రి స్వయంగా ఆదేశం ఇవ్వలేకపోవడం దుఃఖం కలిగిస్తోంది. ఐనా నీ ఆజ్ఞ ప్రకారమే నేను అడవులకు వెళ్ళడానికి నిశ్చయంగా వున్నాను. జననీ!' అని అన్నాడు. ఈ సంభాషణ వినిన దశరథుడు దుఃఖించాడు.

స్పృహలో లేని తండ్రిని రాముడు పైకి లేపి, కైకేయితో 'ఆశకు, విషయవాంఛలకు నేను బానిసనగా జీవించ కోరడం లేదు. ఋషుల వలె నేను ధర్మానికి కట్టుబడిన వాడిని. కేవలం ఒక రాజ్యం కోసం ధర్మం నుండి వైదొలగను. అమ్మా! ఈ విషయంలో నా తండ్రిగారు ప్రమేయం, జోక్యం అవసరం లేదు. నేరుగా నీవే నన్ను ఈ కోరికలు కోరివుంటే, నేనే స్వయంగా తక్షణమే ఈ రాజ్యాన్నిచ్చి, అడవులకు వెళ్ళిపోయేవాడిని గదా!.' అని అన్నాడు రాముడు. శ్రీరాముడు తండ్రికి, కైకేయికి నమస్కరించి, ఈ వార్తను తన తల్లికి చెప్పడానికి బయలుదేరాడు. తలుపు వద్ద నిలిచి అంతా విన్న లక్ష్మణుడు అన్న వెంట నడిచాడు. తన ఆగ్రహాన్ని అణుచుకోవడం అతనికి కష్టమైపోయింది. సోదరులు ప్రాసాదం విడిచి వెళ్ళిన తర్వాత ప్రజలందరూ విలపించసాగారు. ఆ గద్గద స్వరాలు మిన్నంటాయి. ఈ శోకనాదాలు విన్న మహారాజు సిగ్గుతో దుప్పటి కప్పుకొని ఉన్నాడు. శ్రీరాముడు కౌసల్య భవంతి రాగానే, తల్లి కౌసల్య తక్షణమే 'రామా! నాకెంతో సంతోషంగా ఉంది. ఈ రోజు నీ రాజ్య పట్టాభిషేకం జరుగుతుంది.' అంటూ రాముని కౌగలించుకొంది.

శ్రీరాముడు నెమ్మదిగా, అతి వినయంగా 'అమ్మా! నేను చేయవలసిన పనిని నీతో చెప్పినపుడు, నీవు దుఃఖించరాదు. నా తండ్రి, పినతల్లి కైకయికి గతంలో ఇచ్చిన రెండు వరాల ప్రకారం, నేడు భరతుడు రాజ్యానికి వారసుడవుతున్నాడు. రెండవ వరం ప్రకారం నేను ఈ రోజే అరణ్యానికి వెళ్ళాల్సి వుంది. ఈ రోజునుండి 14 సం॥లు అయోధ్యను వదలి వెళ్ళాలి.' అని చెప్పాడు. ఈమాట వినగానే, కౌసల్య నేలమీద కూలిపోయింది. రాముడు ఆమెను నెమ్మదిగా లేవదీసి, కూర్చుండబెట్టగా, కౌసల్య 'రామా! ఇంత దౌర్భాగ్యమా! సంతానం లేకుంటే బాగుండేది కదా రామా! నాకింకా మృత్యువు ఎందుకు రాలేదు? నన్ను సవతులు హీనంగా చూస్తారు. నా జీవితం మరింత దుర్భరమౌతుంది.' అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది కౌసల్య. అప్పటివరకు కోపాన్ని అణచుకొన్న లక్ష్మణుడు ఇక నిలువలేక పోయాడు.

లక్ష్మణుడు రామునితో 'అన్నా! తండ్రి ముసలివాడు, కుటిలుడు, కామపిశాచి, కైకేయి చేతిలో కీలుబొమ్మ. ఈ దురాగతానికి మనం తలవంచాల్సిన అవసరం లేదు. ఏంచేయాలో చెప్పు. ఉచితం తెలియని తండ్రియైనా, గురువైనా శిక్షార్హుడే. నీవు వెంటనే రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవాలి. ఒకవేళ రాజు నిర్ణయమే ప్రజలకు శిరోధార్యమైతే ఈ రాజ్యాన్ని నాశనం చేయటానికి నేన వెనుకాడను. ప్రియజననీ! నేను ఒక్కడినైనా నా అన్నకు తోడుగా నిలబడతాను. నీవు తెలుసుకో. శ్రీరాముని పట్టాభిషేకం కోసం, మూర్ఖపు తండ్రిని సంహరించడనికి కూడ నేను వెనకాడను.' అంటూ మహావేశంతో లక్ష్మణుడు పలికాడు.

కౌసల్య రాజ్యాన్ని లెక్కచేయలూదు. తన కుమారుని నుండి దూరమవుతాననేదే ఆమె భయం. 'రామా! అరణ్యానికి పోవద్దు. నీ తండ్రి ఆజ్ఞను పాటించాలనుకొంటే రాజ్యం వదలి, నీ తల్లిని సంరక్షించుకుంటే ఉండటమే మరింత ధార్మికమనిపిచుకొంటుంది. రామా! నీవు అయోధ్యను విడిచి వెళ్ళిపోతే, నా జీవితం దుర్భరమై, నేను మరణిస్తాను.' అని అన్నది. అందుకు రాముడు 'అమ్మా! నా తండ్రి ఆజ్ఞను ధిక్కరించడం నాకు సాధ్యం కాదు. నేను అరణ్యాలకు వెళ్ళేందుకు నీవు తప్పక అనుమతించాలి. తప్పదు. ఎవడునూ తండ్రి ఆజ్ఞను జవదాట రాదు. పరశురాముడు తన తండ్రియైన జమదగ్ని ఆదేశానుసారం తన తల్లి రేణుక శిరస్సును ఖండించలేదా? అలాగే కండ్రూషి ఒక గోవును చంపాడు. కనుక నేను కూడ నా తండ్రి ఆజ్ఞను శిరసావహించవలసిందే నమ్మా!' అని చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు. 'అమ్మా! నీవు నిన్ను హింసించుకోకు. దయచేసి. మరణం గురించి మాట్లాడ వద్దు. నా అరణ్యవాసం కాగానే నేను నీ వద్దకు తిరిగి వస్తాను. అనవసరంగా బాధపడకుండా, నీ ఆశీస్సులతో నన్ను అరణ్యానికి పంపించు అమ్మా!' అని అన్నాడు. కాని కౌసల్య శోకించడం తప్ప ఏమీ చేయలేకపోయింది.

అంతట శ్రీరాముడు కొంచెం కఠినత్వం తెచ్చిపెట్టుకొని 'నా తండ్రి ఆజ్ఞను శిరసావహించడం నా ధర్మమని, పాటించాలన్న నా కోరికను మీరు వ్యతిరేకించటంతో నాకు దుఃఖాన్ని కలిగిస్తున్నారు. నేను ఏనాటికీ నా కర్తవ్యం నుండి వైదొలగేవాడిని కానే కాను.' అని అన్నాడు. ఆ తర్వాత లక్ష్మణుని శాంతింపచేయడానికి రాముడు 'సోదరా! భరతుడి రాజ్యాభిషేకంతో ఇదంతా మరుగున పడిపోతుంది. అపుడు నీవు దుఃఖాన్ని సులభంగా వదలివేస్తావు. కైకేయిని నిందించవద్దు. ఎందుకనగా మన భావిజీవితాలు నిర్ణయించబడేది విధి చేతుల్లోనే ఉంటుంది. ఆమె ఒక పనిముట్టు మాత్రమే.' అని చెప్పాడు. కాని ఆ మాటలు లక్ష్మణునికి రుచించలేదు. చెవికెక్కలేదు. అతడు మహాకోపంతో 'రామా! నీవు నపుంసకుడిలా కన్పిస్తున్నావు. ఎందుకంటే క్షత్రియునిగా

స్వీయ పరాక్రమానికి తిలోదకాలిచ్చి తేలిగ్గా విధికి దాసోహ మంటున్నావు. కాని నేను అలాంటి శక్తిహీనుణ్ణి కాదు. స్వశక్తితో విధిని నా పాదాక్రాంతం చేసుకొంటాను, చేసుకోగలను. ఈరోజే నిన్ను సింహాసనంపై అధిష్ఠింప చేస్తాను.' అని బదులు చెప్పాడు లక్ష్మణుడు.

ఇదంతా వినిన కౌసల్య రాముణ్ణి ఏదీ ప్రభావితం చేయలేదని గ్రహించింది. అంతట ఆమె రామునితో 'నాయనా! నీవు నీ తండ్రి ప్రతిజ్ఞను నిర్వహించాలని నిశ్చయముతో వుంటే, నన్ను కూడ నీతో అడవులకు రానివ్వు.' అని అంది. అందుకు రాముడు 'అమ్మా! కైకేయి చేత మోసగించబడి, నీచేత త్యజించబడిన నా తండ్రి ఇక జీవితాన్ని త్యజిస్తాడు. ఖాయం.

పతివ్రత ఎన్నటికీ భర్తను విడనాడదు గదమ్మా! భార్యయొక్క ప్రథమ విధి అది. అతడే ఆమెకు దైవం కదా!ఎంత ధార్మికురాలైన స్త్రీ అయినా భర్తను సేవించకుంటే, ఆమె పాపాత్మురాలే అవుతుంది కదమ్మా! భర్తను సంతోషపెట్టడమే భార్య విధి కదా. అందుచేత దయచేసి, నీవు నా తండ్రిగారితోనే ఉండు. 14 సంవత్సరాల తర్వాత నేను తప్పక తిరిగి వస్తాను. కనుక అప్పటివరకు నాకోసం ఎదురు చూస్తూ ఉండవలసినదే నమ్మా!' అని సమాధాన మిచ్చాడు రాముడు. రాముని వెంట తానూ వెళ్ళే ఆశను వదలుకొని, కౌసల్య రాముని ఆశీర్వదించ డానికే సిద్ధపడింది. రాముడు అరణ్యాలకు వెళ్ళిన తరువాత యాగాలు చేయవలసిందిగా రాముని క్షేమం కాంక్షిస్తూ బ్రాహ్మణులను ఆదేశించింది కౌసల్య. ఆమె ఇలా దీవించింది. 'రామా! నీవు నా సంతోషాన్ని తిరిగి ఇచ్చేందుకు క్షేమంగా తిరిగి వచ్చెదవు గాక! నీ ధర్మమే నిన్ను రక్షించు గాక! దేవతలు నిన్ను రక్షించు గాక! దివ్యాయుధాలు నిన్ను కాపాడు గాక! పంచ మహాభూతాలు నిన్ను కాపాడు గాక! సూర్యచంద్రులు నిన్ను రక్షించు గాక! నీవు సంతోషంగా ఉండేదవు గాక! రామా! నా ఆశీస్సులు సదా నీవెంటనే ఉంటాయి, నాయనా!' అని అన్నది.

కాని రాముని ప్రవాసం సీతకేమీ తెలియనే తెలియదు. రాముని నిరీక్షణలో గంటల కొలదీ కాలాన్ని గడుపుతూ ఉంది సీత. ఎట్టకేలకు రాముడు ఆమె గదిలోనికి ప్రవేశించగానే, రాముని ముఖకవళికలు, శారీరక నిస్సత్తువ మున్నగు లక్షణాలు సీత వెంటనే గుర్తించింది. రాముని వెంట వుండే రాజ పరివారం లేదు. 'ప్రియమైన రామా! ఏమి జరిగింది? ఏమిటిది? ఇలా ఉన్నావే' అని ప్రశ్నించింది సీత. శ్రీరాముడు వెంటే సమాధానమిలా ఇచ్చాడు. 'నా తండ్రి నన్ను అడవులకు వెళ్ళి నివసించమని ఆదేశించాడు. భరతుడు రాజుగా ప్రతిష్ఠితుడౌతాడు. చాలకాలం క్రితం కైకేయికి నా తండ్రి ఇచ్చిన రెండు వరాలను ఇపుడు ఆమె పూరించమని కోరింది. ఒకటి భరతుని పట్టాభిషేకం, రెండు నాకు 14సం॥లు అరణ్యవాసం. నా ప్రియమైన సీతా! నా తండ్రి ఆజ్ఞను పాలివడం మినహా నాకు మరే మార్గం లేదు. కాని నీవు మాత్రం ఇక్కడే ఉండాలని నా కోరిక. ప్రతిరోజూ తండ్రి వద్దకు వెళ్ళి, ఆయన పాదాలకు ప్రణమిల్లు. భరతుని ఆజ్ఞలను శిరసావహిస్తూ ఉండు. ప్రియతమా! నేను అడవులకు వెళ్లే ముందు నిన్ను ఒక్కసారి చూచి వెళదామని ఇక్కడికి వచ్చాను.' అని రాముడు చెప్పగా, సీతలో అలజడి ప్రారంభమైంది.

ప్రేమతో కోపం చేత ఇలా అన్నది. 'ఓ పతిదేవా!ఓ రామా! ఓ నరోత్తమా! నాకిచ్చే సలహా ఏమిటి? భార్య భర్త జీవితంలో పాలుపంచుకోవాలని కదా ధర్మ విధి. అడవులకు నేనుకూడ నీతో వస్తాను. తండ్రి, తల్లి, సోదరుడు, కొడుకు, కోడలు – అదరికీ వారి వారి అస్థిత్వం వుంటుంది. కాని భార్యకు మాత్రం తన భర్తను అనుసరించటమే మార్గం తప్ప వేరేమి ఉండదు కదా. నేను ఎవరినీఆశ్రయించ లేను, ఆశ్రయించను కూడా. నా భర్తయే నా దైవం, ఏకైక ఆశ్రయం. అందుచేత నేను నిన్ను ఆశ్రయించి, నీతోనే ఉంటాను. నీవు భుజించిన తరువాతనే నేను భుజిస్తాను. నీకు అసంతృప్తిని ఏనాడూ కలిగించను. ఎన్నడూ చేయను. ప్రకృతిని తిలకిస్తూ

సంతోషంగా ఉంటాను. నీ రక్షణలో నేను భద్రంగా ఉండగలను. నీవు లేకుండా నేను స్వర్గంలో కూడ జీవించ కోరుకోను. రామా! నీవు లేకపోతే నేను మరణిస్తాను. నిన్ను మాత్రమే ప్రేమిస్తున్నాను.' అని దుఃఖితురాలై విన్నవించుకోగా, రాముడు సీత అబల, దుర్బలురాలు. కనుక అడవులలో కష్టాలు అనుభవించ లేదు అని తలంచాడు. ఆమెను నిరుత్సాహపరచే పనిలో రాముడు 'ఓ సీతా! అడవులలో ఉండటం చిన్న విషయం కాదు. చాల కష్టం. ప్రకృతి అనుకూలంగా వుండదు. క్రూరమృగాల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఆహారాదులు సరిగి లభించవు. ఈ దుర్గమారణ్యాలలో నీవు ఉండలేవు. కనుక నిన్ను నేను అనుమతించను.' అని అన్నాడు. సీత రాముని మాటలు విని వణకసాగింది వియోగం తప్పదేమోననే భావంతో. భాష్పధారలతో శోకిస్తూ సీత ఇలా అన్నది.

'నేను నీతో కలిసి వున్నంత కాలం ఏ అసౌకర్యం, ప్రమాదం గాని పట్టించుకో వలసిన అవసరం ఉండదు ఓ రామా! నీవు లేకుండా నేను జీవించలేను. నీవు నన్ను అనుమతించకుంటే, నేను విషం త్రాగి లేదా అగ్నిలో దూకి లేదా నీటిలో దూకి ప్రాణత్యాగం చేసుకొంటాను.' అని చెప్పింది. ఇంకా ఇలా అన్నది. 'ఓ ప్రియసఖా! వివాహం పూర్వం ఒక బ్రాహ్మణుడు నాకు అరణ్యవాసం వున్నదని ఎప్పాడు. ఓ నాథా! కనుక నిన్ను అనుసరించటమే నా జీవనగతి అని నాకు తెలుసు. నీతోనే స్వర్గం, లేకపోతే నరకం. కనుక నన్ను నీతో తీసికొని పోక తప్పదు. నాథా!' అని ప్రాదేయ పడింది. రాముని కఠినత్వాన్ని సహించలేక సీత రామునితో 'నిన్ను అల్లునిగా చేసుకొని, నా తండ్రి పెద్ద పొరపాటు చేశాడు. నీ భార్యను నీవు ఎలా వదలి వెళ్ళాలని భావించావు. ఆమెను అరక్షితంగా వదలి వేయతగునా? రాముడు తేజోమయుడు, సూర్యునివంటి వాడు అని పురజనుల ఘోష వ్యర్థం అవుతున్నది. నీవు అడవులకు పోతే నేను ఇక్కడ ఒంటరిగా ఉండను. నేను నీతో రావడమో, లేక విషంతో మరణించడమో ఏదో జరుగుతుంది.' అని వెక్కి వెక్కి ఏడుస్తూ, నిస్సహాయురాలై, కూలిపడిపోయే స్థితికి సీత చేరింది. ఆమె దయనీయ స్థితిని చూచి రాముడు దుఃఖించాడు. పతివ్రతా శిరోమణి సీతను తన చేతులలోనికి తీసుకొని ఆమె తలను నిమిరాడు అభయమిస్తున్నట్లు. అంతట రాముడు ఆమెను తనవెంట వచ్చుటకు అనుమతి ఇచ్చాడు రాముడు . 'ప్రియమైన సీతా! నీ మనస్సును యదార్థంగా అర్థం చేసుకోలేక అలాగ మాట్లాడాను. వివేకవంతుడు తన కారుణ్యాన్ని ఎలా విడువలేడో అలాగే నిన్నూ నేను విడువలేను. నీవు అశాంతితోఉంటే, నేను ఎలాగ శాంతితో ఉండగలను? కనుక నీవు వెళ్ళి నీ విలువైన వస్తువులన్నింటినీ బ్రాహ్మణులకు దానం చేయి.' అని రాముడు అన్నాడు. సీత ఆనందంతో వెళ్ళిపోగా, లక్ష్మణుడు వచ్చి, అన్న చరణపద్మాలకు నమస్కరించాడు. భాష్పధారలతో లక్ష్మణుడు 'ఓ రామా! నన్ను కూడ నీతో అడవులకు తీసికొని వెళ్ళు.' అంటూ రాముని వేడుకున్నాడు. రాముడు లక్ష్మణుని నిరుత్సాహరచే ఉద్దేశ్యంతో 'నా ప్రియ లక్ష్మణా! నీవిక్కడే వుండి తల్లులైన కౌసల్య, సుమిత్రలను సేవిస్తూ ఉండాలి. నీ రక్షణ లేకుంటే, కైకేయి దురాగతాలకు అంతు ఉండదు. అవమానిస్తుంది' అని చెప్పాడు. అంతట లక్ష్మణుడు 'అన్నా! మన సోదరుడు భరతుడు అన్ని విషయాల్లో జాగరూకుడై ఉంటాడు. సందేహం లేదు. తల్లులను గురించి ఆందోళన అవసరం లేదు. ఓ రామా! నీవు అడవుల్లో సంచరిస్తూ వున్నపుడు, నేను ధనుర్ధారినై నీముందు నడుస్తుంటాను. దానితో మీరిద్దరు ప్రకృతిసోయగాల్ని ఆస్వాదించవచ్చు. నీ ఆహారం నేను సేకరిస్తాను, తెస్తాను. నీవు నిద్రించే సమయంలో నీకు రక్షణగా, నీ ప్రక్కనే కాపలాగా నిలిచి ఉంటాను.' అని లక్ష్మణుడు బదులు చెప్పాడు. చివరకు రాముడు సరేనన్నాడు. 'లక్ష్మణా! సరే, నీవు రావచ్చు. కాని తల్లి దగ్గర

అనుమతి తీసికో. ఆ తరువాత, జనక మహారాజుకు వరుణుడు ప్రసాదించిన ఆ రెండు శక్తివంతమైన ధనస్సులను, కవచాల్ని, అక్షయ తూణీరాలను, శక్తివంతమైన ఖడ్గాలను, బాణాలను తీసికొని రా. వశిష్ఠునికి నీ గౌరవాభినందనలు తెలిపి, అయుధలతో ఇక్కడికి వస్తే, మనం బయలుదేరుదాం.' అని అనేకమైన ఉచిత సలహాలను ఇచ్చాడు శ్రీరాముడు. రాముడు చెప్పినట్లు చేసి, లక్ష్మణుడు తిరిగి వచ్చాడు. తనవద్దనున్న సకల సంపదలను దానం చేయడానికి బ్రాహ్మణులను పిలుచుకు రమ్మని లక్ష్మణుని ఆదేశించాడు. ఆ తరువాత కొద్దిసేపటికి, వశిష్ఠుని కుమారుడైన సుయజ్ఞుడు, అగస్త్య విశ్వామిత్రుల కుమారులు రాజసౌధానికి వచ్చారు. వారిని స్వాతించి, శ్రీరాముడు తాను లేనపుడు ఈ రాజ సౌధాలను తమ పరిచారకులుతో జాగ్రత్తగా చూచుకోమని సూచించాడు. తన సంపద నంతటిని తీసికొని రమ్మని కోశాధిపతిని ఆదేశించాడు. సంపదనంతా కుప్పలు కుప్పలుగా పోయడం జరిగింది. అమూల్య వస్తువులన్నీ పోగుబడ్డాయి. ఇలా రాముడు వాటినన్నింటిని వితరణ చేయనారంభించాడు.

అయోధ్యకు సమీపంలో అరణ్యంలో త్రిజటుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. పేదరికం వల్ల శరీరం శుష్కించి ఉండేది అతనిని రాముని వద్దకు పోయి సహాయం కోరమని అతని భార్య తొందరపెడుతూ ఉండేది. ఆ పేద బ్రాహ్మణుడు సరిగ్గా రాముడు వితరణ చేసే సమయంలో అక్కడికి చేరుకొన్నాడు. ఆ బ్రాహ్మణుడు రామునితో తన దారిద్ర్యం గురించి విన్నవించుకోగా రాముడు నవ్వుతూ అతనితో 'నీవు నీ దండాన్ని నీకు చేతనైనంత దూరం విసిరి వేయి. అది ఎన్ని గోవులను దాటి పోతుందో అన్ని గోవులును నీకు దానం చేస్తాను.' అని బదులు ఇచ్చాడు. వెంటనే త్రిజటుడు గట్టిగా నడుం బిగించుకొని, అత్యంత ఉత్సాహంతో తన దండాన్ని గాలిలోకి విసిరి వేశాడు. అందరికీ ఆశ్చర్యం కలిగించే విధంగా ఆ బ్రాహ్మణుని దండం సరయూనది దాటిపోయి, ఆ ఆవల వైపు వున్న వేలాది గోవుల మందను దాటి పోయి కింద పడింది. అంతట రాముడు ఆ బ్రాహ్మణుని కౌగిలించుకొని 'నా వ్యంగ్యానికి ఏమీ బాధపడకు. నీ బ్రహ్మ శక్తి ఎంత మహనీయమైనదో నేను చూడాలని ఇష్టపడ్డాను. అంతే' అని రాముడు తన సంపదనంతను అతినికి వితరణ చేశాడు. ఆ రోజున ఏ బ్రాహ్మణుడు గాని, మరి ఎవరైనా సరే, తన వద్ద దానం పొందకుండా పోలేదు.

రాముడు, సీత, లక్ష్మణుడు కాలినడకన అయోధ్య నగర వీథుల గుండా దశరథ మహారాజు రాజభవనం వైపు ప్రయాణిస్తున్నాడు. రాముని ప్రయాణాన్ని వీథులలోని వారు, మేడలపై ఉన్నవారు అందరూ భారమైన హృదయాలతో, దుఃఖం నిండిన కన్నులతో అశ్రువులు కారుస్తూ చూస్తున్నారు. బాధపడుతూ వున్నారు. సీతను వీథిలో చూచే అదృష్టం ఎందరికో లభించింది ఇంతకు పూర్వం. అందరూ రాముని వెంట వెళితే, అరణ్యం జనావాసం అవుతుంది, అయోధ్య అరణ్యం అవుతుంది కదా అని పురజనులు తీవ్ర ఆవేదనకు గురి అవుతున్నారు.

రాముడు కైకేయి భవనం వద్దకు చేరేసరికి అక్కడ సుమంత్రుడు కనిపించాడు. తన రాకను గురించి మహారాజుకు చెప్పమని రథసారథితో చెప్పాడు. ఈ మాట విన్న వెంటనే, దశరథుడు తన భార్యలందరిని సమావేశ పరచి, వారి సమక్షంలోనే తాను రాముని కలుస్తానని, సుమంత్రుని ఆదేశించాడు. తర్వాత కొద్దిసేపటిలో 350 మంది యువ పరిచారికలు వచ్చి, కౌసల్యను పరివేష్ఠించారు. అంతట రాముడు, సీత, లక్ష్మణులతో కలిసి తండ్రి గదిలోనికి ప్రవేశించగానే, తండ్రి రాముని ఆలింగనం చేసుకొనేందుకు పరుగు పరుగున వచ్చాడు. కాని కుమారుని చేరుకునే లోగానే, దుఃఖభావంతో వివశుడై స్పృహ కోల్పోయాడు. అక్కడున్న వారంతా విలపిస్తుండగా, రాముడు తన తండ్రిని తన చేతులతో పొదివి పట్టుకున్నాడు. తండ్రిని తల్పం మీదికి తెచ్చిన తర్వాత దశరథుడు స్పృహలోనికి వచ్చాడు. అపుడు రాముడు 'నాన్నగారూ! మీ వద్ద వీడ్కోలు తీసుకొందామని వచ్చాను. సీత,

లక్ష్మణులతో కలిసి అరణ్యాలకు వెళ్ళడానికి అనుమతించండి' అని అన్నాడు. మహారాజు అపుడు 'రామా! దయతో నా సలహా విను. పాటించు. నన్ను తక్షణమే బందీ చేసి, రాజ్య సింహాసనాన్ని ఆక్రమించుకో. నిన్నెవరూ అడ్డుకోలేరు.' అని సలహా ఇచ్చాడు.

అపుడు రాముడు 'నాన్నగారూ! భూమండలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలాలని గాని, రాజభోగాలను అనుభవించాలని కాని నాకు కోరిక లేదు.' అని బదులిచ్చాడు. అపుడు దశరథుడు 'నాయనా! సరే! నా ఆశీస్సులతో నీవు వెళ్ళవచ్చు. కాని దయచేసి నిన్ను చూడటానికి ఈ ఒక్కరోజు మాత్రం ఇక్కడ ఉండు.' అని అన్నాడు. దానికి రాముడు "నేను తక్షణమే వెళ్ళిపోవాలి. మీ ఆదేశాన్ని ఆచరించడం, కైకేయి కోరిన కోరిక నెరవేర్చటమే నా తక్షణ కర్తవ్యం. నేను వెంటనే అరణ్యానికి వెళ్ళక తప్పదు.' అని బదులు ఇచ్చాడు. ఆపైన రాముని ఆలింగనం చేసుకొని, రాజు మూర్ఛిల్లాడు. సుమంత్రుడు కూడ విపరీతంగా శోకిస్తూ నేలమీద పడిపోయాడు. కైకేయి తప్పించి, మిగతా వారందరు దుఃఖభారంతో విలపించ సాగారు.

సుమంత్రుడు అతి ముఖ్యుడు. అందరికన్నా అతడే ఎక్కువగా బాధపడ్డాడు. కైకేయిని సమీపించి కోపంతో ఇలా అన్నాడు. 'ఓసీ దుష్టురాలా! నీవు రాముణ్ణి అడవులకు పంపించటం ద్వారా నీ భర్త మృత్యువుకు కారకురాలివవుతున్నావు. రాజ్యాన్ని జ్యేష్ఠ పుత్రునికి దక్కాలనే ధర్మసూత్రాన్ని నీవు ఉల్లంఘించావు. రాముడితో పాటు బ్రాహ్మణులు అందరూ వెళ్ళిపోయారు. నీ దుష్కార్యాల దుష్ఫలితాలు నీవు అనుభవించి తీరుతావు. రాముని నిష్క్రమణతో సర్వ మంగళాలు నశించి పోయాయి. నీకు పనికివచ్చే ఒక విషయం చెబుతాను. విను. ఒకప్పుడు నీ తండ్రి కేకయుడు ఋషి నుండి ఒక వరం పొందాడు. దానితో అన్ని జంతువులు, పక్షుల భాషలను కూడ అర్థం చేసుకునే శక్తి వచ్చింది. అయితే ఆ ఋషి ఒక షరతు విధించాడు. ఏ జంతువు లేదా పక్షి నుండి విన్న మాటలైనా మరొకరికి చెప్తే, నీవు చనిపోతావని ఆయన అన్నాడు. తరువాత ఒకరోజు ఆ రాజు ఒక పక్షి కేకను విన్నాడు. అర్థం తెలుసుకొని హాయిగా నవ్వుకొన్నాడు. కాని నీ తల్లియైన రాణి తనను చూచే రాజు నవ్వుతున్నాడని భావించింది. ఏం చూసి నవ్వుతున్నావని మీ తల్లి అడిగింది మీ తండ్రిని. కాని రాజు తన పక్షిభాషను విని నవ్వుకొన్నాని చెప్పి, ఆ భాష నీకు చెపితే నేను చచ్చిపోతాను అని కూడ మీ తల్లితో చెప్పాడు. కాని మూర్ఖురాలైన ఆ రాణి, అంటే మీ అమ్మ అసూయాపరురాలు, మొండిది. 'మీరు బ్రతికినా చచ్చినా నాకు ఒకటే. కాని మీరెందుకు నవ్వుతున్నారో చెప్పి తీరాల్సిందే"నని మొండికేసింది. దిక్కుతోచక, రాజు తనకు వరాన్నిచ్చిన ఋషి దగ్గరకు వెళ్ళి సమస్యను చెప్పాడు. పక్షి పలుకులు ఉచ్చరించవద్దని, రాణిని మందలించమని ఆ ఋషి రాజుకు సలహా ఇచ్చాడు. ఋషి మాటలను స్వీకరించి, కేకయుడు భార్యను మందలించాడు. అప్పటినుండి మీ తండ్రి కేకయుడు హాయిగా, సంతోషంగా జీవించసాగాడు. నీవు, నీ భర్త పట్ల అలాగే చేస్తున్నావు. నీ కుట్రలు కట్టిపెట్టు.' అని చెప్పినా, కైకేయి వినలేదు, చలించలేదు.

శ్రీరాముని అరణ్యవాసం ఇలా ఖాయమైందని గ్రహించిన దశరథ మహారాజు సుమంత్రుని ఇలా ఆజ్ఞాపించాడు. 'రామునితో అరణ్యానికి వెళ్ళటానికి ఒక అక్షౌహిణి సైన్యాన్ని సిద్ధం చేయి. వ్యాపారులను, వేటగాళ్ళను, కోశాధికారిని కూడ బయలుదేరునట్లు చేయి. నా ప్రియ కుమారుడు అరణ్యంలో ఉన్నా కూడా ఎలాంటి అసౌఖ్యానికి లోను కాకూడదు. సుఖంగా ఉండాలి.' అని అన్నాడు. ఈ మాటలు విన్న కైకేయి 'రాజా! మీరు ఇలా రాజ్యానికున్న వనరులను తీసివేస్తే, భరతుడు రాజ్యాన్ని స్వీకరించడు' అని అన్నది. అపుడు రాజు

'నీవు రాముని అడవుల్లో సుఖంగా ఉండనీయకుండా ఉంటే, నేను పురజనులతో కలిసి అడవులకు వెళతాను.' అని అన్నాడు. అందుకు కైకేయి 'మన వంశంలో సగర మహారాజు తన పెద్ద కుమారుణ్ణి అడవులకు పంపిన ఉదంతం ఉంది కనుక నీవు కూడ రాముని పంపించివేయి' అని గట్టిగా చెప్పింది.

ఈ మాటలు వినిన అగ్రగణ్యుడైన మంత్రి సిద్ధార్థుడు ఇలా అన్నాడు. 'అసమంజసుడు ఇతర పిల్లలను సరయూ నదిలో ముంచేస్తూ, ఆనందించేవాడు. ఈ విషయాన్ని పురజనులు సగర మహారాజుకు ఫిర్యాదు చేశారు. అందుచేత క్రూరుడైన తన కుమారుణ్ణి తిరస్కరించాడు. నీవు చెప్పే పోలికకు అర్థమే లేదు. రామునికి, అసమంజసునికి పోలిక ఏమిటి? రాముడు నిర్దోషి.' అని అన్నాడు. అపుడు శ్రీరాముడు తండ్రి నుద్దేశించి 'నాన్నగారూ! మీరు ఎలాంటి దుఃఖం పొందనవసరం లేదు. నేను రాజభోగాల్ని కోరుకోవడం లేదు కదా! కైకేయి పరిచారకులు మాకు నారచీరలు తెచ్చి ఇచ్చెదరు గాక!' అని అనగా దుష్టురాలైన కైకేయి వెంటనే వెళ్ళి నారచీరలు తెచ్చి, కట్టుకోమని వారిని కోరింది. రామలక్ష్మణులు ఏమాత్రం జంకకుండా, ఆలస్యం చేయకుండా వెంటనే ఆ నారచీరలను ధరించారు. కాని సీత మాత్రం నారతో చేయబడిన వస్త్రాలను స్వీకరించినపుడు దుఃఖించింది. కన్నీరు పెట్టింది. ఆ వస్త్రాలు అలవాటు లేనందున, ధరించుటంతో ఇబ్బందులు పడ్డది. రాముడు నారవస్త్రాలు, సీత పట్టుచీర మీద చుట్టాడు. అది చూచిన వశిష్ఠ మహాముని చాల బాధకు లోనైనాడు. కైకేయిని ఇలా మందలించాడు. 'ఓసీ దౌర్భాగ్యురాలా! ప్రతి ఒక్కరూ రాముని వెంట వెళ్ళడం నీవు చూడటం లేదా? భరతుడు, శత్రుఘ్నుడు కూడ ఆయన వెంట వెళ్ళడం నీవు తప్పక చూస్తావు. అపుడు నీవొక్కతెవే ఈ ఖాళీ రాజ్యాన్ని పాలించుకోటానికి మిగిలి పోతావు సుమా! కనీసం సీతనైనా సుఖంగా వాహనంలో పోనివ్వు.' అన్నాడు. కాని సీత తన భర్త వస్త్రధారణ మాదిరిగానే అరణ్యవాస దుస్తులను ధరించి ఉంది. ఇలా వీరిని చూచిన పురజనులు, దశరథుని, కైకేయిని విపరీతంగా దూషించసాగారు. వారి మాటలు విన్న రాజుకు జీవించాలనే కోరిక నశించి పోయింది. ఇలా రాజు ఏదో గొణుక్కుంటూ, ఉన్మాద స్థితిలో రెండు గంటల పాటు ఉన్నాడు. త్వరలో తేరుకొని, రాముని అడవికి తీసికొని వెళ్ళటానికి రథాన్ని తెమ్మని సుమంత్రుని ఆదేశించాడు.

ఆ సమయంలోనే కౌసల్య సీతను కౌగిలించుకొని 'సీతా! దురదృష్టం ఆవహించిన సమయాల్లో ధార్మికులు, ప్రేమమూర్తులు అయినటువంటి భర్తలను కూడ స్త్రీలు విడిచిపెడతారనేది అందరూ ఎరిగిన నిజమే. ఆ దుష్ట స్త్రీలు తాము పొందిన సౌఖ్యాలను విస్మరిస్తారు. కృతఘ్నత కారణంగా వారు వివేకం చేతగాని, ఆఖరుకు వివాహం చేతగాని నిగ్రహించబడరు. కాని మృదుస్వభావులు, సత్యశీలురైన మహిళలు కూడ ఉన్నారు. అలాంటివారు తమ భర్తను సర్వాధికారిగా గౌరవిస్తుంటారు. ఓ సీతా! నా కుమారుడు ప్రవాసంలో వున్నాడని అవమానించకు. అతను సర్వదా నీకు ఆరాధ్యదైవమై నిలుచు గాక! ఇదే నా ఆశీర్వాదంగా భావించు' అని చెప్పగా, సీత నమస్కరిస్తూ 'నా భర్త పట్ల నా బాధ్యత ఏమిటో నాకు తెలుసు. దుష్ట స్త్రీలను గురించి నాతో చెప్పవద్దు. చంద్రునితో ఉన్న అనుబంధమే నాకు రామునితో ఉన్నది. తంత్రులు లేకుండా వీణ, చక్రాలు లేకుండా రథం ఉండవు. అలాగే ఎంతమంది పుత్రులున్నా, భర్త లేనిది భార్యకు భవిష్యత్తు అనేది ఉండదు. రాముడు నా దైవం, ఎప్పటికీ అలాగే ఉంటాడు. నేను ఆయన్ని ఎలా అవజ్ఞ చేయగలను? మీరు చింతించకండి.' అని చెప్పింది.

రాముడు దూరం కానున్నాడని కౌసల్య విలపిస్తుండగా, రాముడు సమీపించి ఓదార్చి, కాలం త్వరగా గడుస్తుంది అని నచ్చ చెప్పాడు. ఆపైన సవతి తల్లి సుమిత్ర విలపిస్తుండగా, రాముడు వెళ్ళి తండ్రి పాదాలను గట్టిగా పట్టుకొన్నాడు. శ్రీరాముడు, లక్ష్మణుడు, సీత ముగ్గురూ మహారాజుకు ప్రదక్షిణం చేశారు. తల్లిదండ్రులకు ప్రణామం చేశారు. ఆ వెంటనే ముగ్గురూ రథాన్ని అధిరోహించి అరణ్యాలకు బయలుదేరారు. ముక్త జీవుడు

ఎలా ప్రాణాన్ని వదులుతాడో అలాగే పరమాత్మ స్వరూపుడైన శ్రీరామచంద్రుడు తన రాజ్యాన్ని, ఐశ్వర్యాన్ని, మిత్రులను, శ్రేయోభిలాషులను, నివాసాన్ని, సర్వస్వాన్ని వెనుకనే విడిచిపెట్టి, సీతాలక్ష్మణులతో అడవులకు వెళ్ళిపోయాడు.

ఆ రథం కనుమరుగయ్యే వరకు దశరథుడు అలాగే చూస్తూ ఉండిపోయాడు. రథం కనపడకుండా పోగానే, దశరథుడు మూర్ఛిల్లి నేలపై పడిపోయాడు. అపుడు ఆయన్ని లేవనెత్తటానికి కౌసల్య, కైకేయిలు రాగా, దశరథుడు చిన్నరాణితో 'నీవు నన్ను ముట్టకు. నీతో నాకేమీ సంబంధం లేదు. నిన్ను ఇక ఏమాత్రం చూడను' అంటూ కైకేయిని సమీపించనివ్వ లేదు.

కౌసల్య తన భర్తను లేవనెత్తి ప్రాసాదానికి తీసికొని వస్తూ, అక్కడి ఘోరమైన విషాద వాతావరణాన్ని చూచింది. మహారాజు తనను కౌసల్య అంతఃపురంలోనికి తీసికొని వెళ్ళమని కోరాడు. మాటలు తడబడుతూ ఉండగా రాజు 'ఇకపైన నేను ఇక్కడే ఉంటాను.' అని ప్రకటించాడు.

ఆ రాత్రి మహారాజు ఎంతో కష్టం మీద గడిపాడు. రాముడు లేకపోవడం ఆయనకు జగత్ప్రళయంగా తోచింది. సుమంత్రుడు వారిని ఓదార్చటానికి ప్రయత్నించాడు. 'దయచేసి మీరు మీ కుమారుని గురించి దుఃఖించకండి. సీత, లక్ష్మణుడు ఆయన వెంట ఉన్నారు కదా! రామునికి ఏమాత్రం కష్టం కలుగదు. రాముడు సామాన్య మానవుడు కాదు. సాక్షాత్తూ సూర్యుణ్ణే ప్రకాశింపజేయ గలవాడు. కాలనియామకుడ,. దేవాధిదేవుడు. అడవుల్లో పంచభూతాలు ఆయన సేవలో నిమగ్నమై ఉంటాయి. రాముడు తిరిగి త్వరలో వస్తాడనే విశ్వాసంతో ఉండండి. విలపిస్తే ఏ ప్రయోజనం ఉండదు. సమస్త జనులు విచారంతో ఉన్నారు. మీరు వారిని ఓదార్చి మామూలు మనుషులుగా చేయాలి.' అని చెప్పాడు.

ఇది ఇలా ఉంటే చాలమంది పురజనులు రాముని రథం వెనుక పరుగెత్తుకొంటూ చాలా దూరం వెళ్ళి, రాముని తిరిగి రమ్మని ప్రార్థించారు. రాముడు వారితో 'నేను ప్రతిజ్ఞ భంగం చేయలేను. నా పట్ల మీకు గల ఇంతటి ప్రేమను భరతుని పట్ల కూడా చూపండి.' అని చెప్పాడు. పురజనులే కాక, కొంతమంది వృద్ధ బ్రాహ్మణులు ఆయన రథం వెంబడి పరుగత్తుతూ అవస్థలు పడుతుండటం రాముడు గమనించాడు. వారి ప్రేమను గుర్తించి రథం దిగి, వారితో పాటు వారి సంతృప్తి కొరకు తాను, సీత, లక్ష్మణులు కొంతదూరం నడిచారు వారు కూడ రాముని తిరిగి రమ్మని ప్రార్థిస్తూ, నడుస్తూ ఉండగా, తుదకు వారు తమసా నదీ తీరానికి చేరుకొన్నారు.

సూర్యాస్తమయం కావడంతో, రాత్రి విశ్రమించడానికి సుమంత్రుడు, లక్ష్మణుడు ఒక స్థలాన్ని ఎంపిక చేశారు. స్థలాన్ని చదును చేసి, రాముడు విశ్రమించేందుకు పర్ణశయ్యను అమర్చారు. సీతతో నిద్రించిన రాముడు త్వరగా నిద్రలోకి జారుకున్నాడు. లక్ష్మణుడు, సుమంత్రుడు ఇద్దరూ అక్కడే ఉండి, రాముని మహిమలను గురించి చర్చించుకొంటూ, రాత్రంతా అలా గడిపారు. రాముడు ఉదయమే నిద్రలేచి, దగ్గరలో అయోధ్య పురజనులు నిద్రిస్తూ ఉండటం గమనించాడు. 'లక్ష్మణా! చూడు. వీరు నన్ను అనుసరిస్తూ ఇంతదూరం వచ్చారు. నన్ను అయోధ్యకు తీసుకొని పోవాలన్న కోరికతోనే వీరు విడువకుండా నాతో వచ్చారు. ఇక్కడ నిద్రిస్తున్నారు. తమ కుటుంబం గురించి పూర్తిగా మరచిపోయారు. వీరు కైకేయి శాపానికి బలికాకూడదు. వీరు మేలుకొనే లోగానే మనం వెళ్ళిపోదాం.' అన్నాడు రాముడు. పథకం ప్రకారం ఈ పురజనులు మనల్ని అనుసరించకుండా సుమంత్రుడు రథాన్ని నడిపే విధంగా ఆలోచించుగాక' అని రాముడు అన్నాడు.

తమసానదిని దాటిన తరువాత రాముడు సుమంత్రుడితో 'పురజనులను తప్పు త్రోవ పట్టించే విధంగా రథాన్ని నడుపుతూ, స్పష్టమైన మార్గంలో తిరిగి రమ్మని సుమంత్రుని ఆదేశించాడు. అలాగే సుమంత్రుడు రథంతో వెళ్ళి తిరిగి వచ్చిన రాముడు, సీత, లక్ష్మణుడు రథమెక్కి మరోమార్గంలో వేగంగా అడవుల్లోకి వెళ్ళిపోయారు.

తెల్లవారగనే, పురజనులు తమ ప్రియతమ ప్రభువు కోసం అన్ని దిక్కుల్లో చూచారు. రథచక్రాలు వెళ్ళిన త్రోవలు గుర్తుపట్టారు. పరుగులు తీశారు. కొంతదూరం తర్వాత ఆ జాడలు కనిపించక రాముడు ఏవైపు వెళ్ళాడు, ఎలా వెళ్ళాలి, రాముని తిరిగి తీసికొని రాకపోతే, మన స్త్రీలు, పిల్లలు మనల్ని ఏమంటారు అని బెంగపడ సాగారు. సుందరరాముడు లేని అయోధ్యలో మనం ఎందుకు ఉండాలి, ఆ జీవితం నిష్ప్రయోజనం కాదా, సీతారాములు లేని నగరం, రాజ్యం ఎందుకు అని తమను తాము పురజనులు నిందించుకోసాగారు. కైకేయి పాలనలో మేము జీవించము అని శపథం చేస్తూ, ఆమెను నానా విధాలుగా దూషించసాగారు. అయోధ్యలో మానవజీవితం స్తంభించి పోయింది. ఎండిన సముద్రంలా కన్పడుతోంది. ఏ వర్ణం వారు కూడ వారి వారి విధులను నిర్వర్తించటం మానేశారు. పశువులు కూడ గ్రాసాన్ని ముట్టుకోలేదంటే ఆశ్చర్యమే కదా! గోవులు దూడలకు పాలు ఇవ్వడం మానేశాయి. తల్లులు బిడ్డల లాలనపాలన చూడటం కూడ నిర్లక్ష్యం చేశారు. ఆకాశంలోని తారలు గంభీరంగా పొడసూపాయి. ప్రజలు తిండితిప్పలు పట్టించుకోవడం లేదు. వినోదాలు అసలే లేవు. శ్రీరాముని విరహబాధలో ప్రతి ఒక్కరూ శవంలా కనిపించసాగారు.

శ్రీరాముడు ప్రయాణిస్తున్న భూభాగాల్లోని ప్రజలు, రాముని స్థితికి చింతిస్తూ, దశరథుని, కైకేయిని నిందించ సాగారు, దుర్భాషలాడారు. ఈ మాటలను రాముడు విన్నాడు. వేదశ్రుతీ, గోమతీ నదులు దాటి రాముడు కోసల దేశపు దక్షిణ సరిహద్దు అయిన స్యందిక నది వద్దకు చేరుకొన్నాడు. అక్కడ రాముడు రథం దిగి తన జన్మభూమియైన అయోధ్యనుండి శలవు తీసికొనే తలంపుతో అటువైపు తిరిగి చేతులు జోడించాడు. స్థానిక పౌరులు కూడ ఎందరో రామునితో వస్తున్నారు. వారినందరిని శ్రీరాముడు తమ తమ స్థలాలకు వెళ్ళని కోరగా, వారు వెళ్ళలేక బిగ్గరగా ఏడవసాగారు. వారి దుఃఖాన్ని నివారించ దలచి, తాను భరించలేక, రథాన్ని వేగంగా నడపమని చెప్పాడు.

గంగానదిని చేరుకోగానే రాముడు ఒక పెద్ద చెట్టు క్రింద రథాన్ని నిలుపమని సుమంత్రుణ్ణి అడిగాడు. ఆ ప్రాంతానికి రామునికి స్నేహితుడైన గుహుడనే వాడు రాజుగా వున్నాడు. శ్రీరాముని రాక తెలుసుకోగానే గుహుడు మంత్రులు, బంధువులందరూ రాముని కలుసుకోవాలని వచ్చారు.

నిషాద కుటుంబంలో జన్మించినా, ఒక గొప్ప భక్తునికి ఉండవలసిన ఉత్తమ లక్షణాలు అన్నీ గుహునిలో వున్నాయి. సౌమ్యుడు, ఆత్మనిగ్రహం కలవాడు, వినయశీలి, దానశీలి, సంపూర్ణ శరణాగతుడు ఇలా అతడు నిజానికి ఒక బ్రాహ్మణునికంటె కూడ ఉన్నతుడు. పుట్టుకతో కులాన్ని నిర్ధారించడం చాల తప్పు. గుణాన్ని బట్టియే కులాన్ని నిర్ణయించడం ధర్మసమ్మత మవుతుంది.

గుహుడు రావడాన్ని గమనించిన రామలక్ష్మణులు ముందుకు వచ్చారు. గుహుడు నిషాద రాజైనా, శ్రీరాముడు అతనిని గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు. రాముడు ఆటవిక దుస్తులతో వుండటం చూచి, గుహుడు 'ప్రియమైన రామచంద్రా! ఈ రాజ్యం నాది మాత్రమే కాదు నీది కూడ. నీవు అయోధ్యలో వున్నట్లే, ఇక్కడ అన్నీ ఉపయోగించుకో. నీవు నా అతిథిగా ఉండటం నాకెంత గౌరవప్రదమో కదా, రామా!' అని అన్నాడు.

రాముని రాజోచితంగా సత్కరించటం కోసం, గుహుడు మృష్టాన్న భోజనం, మెత్తని పరుపులు, పూజాద్రవ్యాలు మున్నగునవి అన్నీ తనతో తీసుకొని వచ్చాడు. ఇవన్నీ గమనించిన రాముడు సంతోషంతో గుహుని మరోమారు ఆలింగనం చేసుకొని ఇలా అన్నాడు. 'నీవు నాకు సమర్పించిన వాటినన్నింటిని నేను నా హృదయంలో పదిలపరచుకొంటాను. నేను ప్రవాసంలో ధరించవలసిన దుస్తులు మున్నగునవి నేను వదిలి వేయలేను. కారణం నేను ప్రతిజ్ఞ చేసి వున్నాను. నీవు తెచ్చిన విలువైన కానుకలను నేను స్వీకరించలేను కనుక నీవు వాటిని తిరిగి తీసుకొని వెళ్ళు ఈ భోజనం తప్ప. ఈ భోజనాన్ని నా అశ్వాలకు తినిపిస్తాను. ఎందుచేతనంటే దశరథ మహారాజు యొక్క విశేష ప్రేమను చూరగొన్న అశ్వాలివి.' అని రాముడు చెప్పగా, గుహుడు ఆ భోజనాన్ని అశ్వాలకు తినిపించాడు. గంగ మీది శ్రద్ధను బట్టి రాముడు ఉపవసించి, కొంచెం తీర్థం మాత్రమే స్వీకరించాడు. ఆ రాత్రి లక్ష్మణుడు, గుహుడు తనను రక్షిస్తుండగా, రాముడు ఆ రాత్రి అక్కడే చెట్టుక్రింద నిద్రించాడు. లక్ష్మణుని కూడ నిద్రించమని గుహుడు కోరగా, అన్న వదినెలు నిద్రిస్తుండగా తాను విశ్రమించేది లేదని, రక్షణలో ఉండాలని చెప్పాడు.

మరురోజు ఉదయం రాముడు గంగానదిని దాటాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గుహుడు ఒక అందమైన నావను తెమ్మని తన పరిచారకులను ఆజ్ఞాపించాడు. నావ రాగానే, రాముడు సుమంత్రునితో 'ఇక నీవు వెళ్ళవచ్చు. దశరథ మహారాజును సేవిస్తూ, ఇతరులను ఓదార్చే స్థితిలో ఉంటూ నీవు కూడ ప్రశాంతమైన మనస్సును సొంతం చేసుకొని ఉండు. ఇప్పటికే నీవు మాకు ఎంతో సాయం చేశాడు. ఇకమీదట మేము కాలినడకన ముందుకు పోతాం' అని చెప్పాడు. సుమంత్రుడు అపుడు తనకు కూడ అడవులకు వచ్చేందుకు అనుమతి ఇవ్వమని శ్రీరాముని కోరాడు, ప్రాధేయపడ్డాడు. రాముడు అపుడు 'సుమంత్రా! దీనావస్థలో ఉన్న నా తండ్రి సుగతి చూడు. మేము తప్పక తిరిగి వస్తాము. ఏమీ విచారించవద్దు. నేను కుశలంగా, సుఖంగా వున్నాని నా తల్లిదండ్రులకు నచ్చ చెప్పు. ఆలస్యం లేకుండా భరతునికి పట్టాభిషేకం చేయమని రాజుకు చెప్పి తన తల్లులందరిని సమానంగా ఆదరించమని దయచేసి నా తరపున ప్రార్థించు' అని చెప్పి వెళ్ళమని గట్టిగా చెప్పాడు. కాని సుమంత్రుడు రాముని వదలి వెళ్ళలేక ఇలా అన్నాడు. 'ఓ రామా! నేను ఒక్కణ్ణీ ఈ రథంలో వెళితే, ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతుంది. నన్ను నీవెంట రానివ్వు. నిన్ను వదలి వెళ్ళితే నా జీవిత నరకమవుతుంది. నేను అగ్నిలో ప్రవేశించడమో, నీట మునగడమో జరిగి తీరుతుంది.' అని చెప్పగా, రాముడు 'నీవు వెళ్ళితేనే, కైకేయికి నేను అరణ్యంలో వున్నానని నమ్మకం కలుగుతుంది. అందుకే వెళ్ళమంటున్నాను. నీవు వెళ్ళకపోతే, నేను ఏ క్షణంలోనైనా తిరిగి వస్తాననే భయం ఆమెలో స్థిరంగా ఉండిపోతుంది.' అని చెప్పాడు.

రాముడు గుహునితో 'అడవిలో నేను మిత్రులతో పరివేష్ఠించబడి జీవించదలచుకో లేదు. ఒంటరిగా జనసంచారం లేని స్థలానికి వెళ్ళి ఒంటరిగా జీవిస్తాను. అందువల్ల నాకోసం ఏ ప్రత్యేకతలు అవసరం లేదు. ఏదైనా రసాన్ని తెస్తే, దానితో నా శిరోజాలను జడలుగా మారుస్తాను' అని అన్నాడు. గుహుడు తెచ్చిన రసాన్ని రామలక్ష్మణులు జుట్టుకు పట్టించి, జడలుగా మార్చి, ఋషుల్లా కనిపించారు. అంతటితో రామలక్ష్మణులు గుహునకు వీడ్కోలు చెప్పి, నావమీద లయదు దేరారు. నావ ప్రయాణం మధ్యలో ఉండగా, సీతాదేవి తమను క్షేమంగా అయోధ్యకు తిరిగి పంపమని గంగామాతను ప్రార్థించింది. ఇలా నది దాటి, అవతలి తీరంలో ముగ్గురూ ప్రయాణించ సాగారు. లక్ష్మణుడు శస్త్రధారియై ముందు నడుస్తుండగా సీతారాములు వెనుక బయలుదేరారు.

రాత్రి కావడంతో, వారు ఒక పెద్ద చెట్టు క్రింద విశ్రాంతి తీసికొన్నారు. సీత రక్షణలో రామలక్ష్మణులు

ఇద్దరూ రాత్రంతా మేలుకొని ఉన్నారు. వారి సంభాషణల్లో, రాముడు లక్ష్మణునితో 'సోదరా! కైకేయి వేధింపులతో మన తల్లులు బాధ పడకుండా ఉండాలంటే నీవు తిరిగి అయోధ్యకు వెళ్ళడమే మంచిది, క్షేమం' అని అంటూ తల్లుల వేదన గుర్తుకు రాగా, రాముడు భావోద్వేగానికి లోనైనాడు. కన్నీటితో ఉన్న అన్నను అనునయిస్తూ లక్ష్మణుడు అన్న లేకుండా నేను ఉండలేనని చెప్పాడు. చివరకు లక్ష్మణుడు తనతో ఉండటానికి రాముడు అంగీకరించాడు.

మరురోజు ఉదయం ముగ్గురూ బయలుదేరారు. కొంత దూరం ప్రయాణించగా, వారు గంగా-యమునా నదీ సంగమానికి చేరుకొన్నారు అక్కడ నివసించే భరద్వాజ మహర్షిని దర్శించ గోరి, రాముడు ఆయన ఆశ్రమాన్ని సమీపించి అనుమతి కోసం నిరీక్షిస్తూ ఉన్నాడు. కొంతసేపటికి ఆ ఋషి శిష్యుడొకడు బయటకు వచ్చి, రాముని లోనికి తోడ్కొని వెళ్ళాడు. భరద్వాజుడు ధ్యానంలో ఉంటూ, చుట్టూ అనేకమంది శిష్యులతో ఉండటం రాముడు చూచాడు. రాముడు భరద్వాజ ఋషితో తాను ఎందుకు ఇలా రావలసి వచ్చిందో, మున్నగు విషయాలన్నీ చెప్పాడు. ఆ తర్వాత భరద్వాజ ఋషి వారికి మంచి విందు ఏర్పాటు చేసి, తానే వడ్డించాడు.

ఆ తరువాత ఋషి వారికి సకల సౌకర్యాలను కల్పించి 'ఓ రామా! నీ ప్రవాసం గురించి వినినప్పటి నుండి నీ కొరకు ఎదురు చూస్తూనే వున్నాను. ఇక్కడే నా ఆశ్రమంలో ప్రశాంతంగా, నీ 14 సం॥లు గడపాలని నా కోరిక. నా శిష్యులందరూ నీ అధీనంలో ఉంటారు. నీకు ఏ అసౌకర్యం ఉండదు' అని అన్నాడు. అందుకు రాముడు చిరునవ్వుతో 'ఓ ఋషిపుంగవా! మీరు ఎంతో కృపతో ఇలా అన్నారు. కాని మీ ఆశ్రమం అయోధ్యకు దగ్గరలోనే ఉంది. నేను ఇక్కడ ఉన్నాననే విషయం, నా పురజనులకు తెలిస్తే, వారు ఇక్కడకి దూసుకొని వస్తారు. అదే నా భయం. కనుక తమరు దయచేసి, నాకు దగ్గరలో అరణ్య జీవన వ్రతాన్ని పాటించదగ్గ ఏకాంత ప్రదేశం ఎక్కడైనా ఉంటే తెలుపండి' అని బదులు చెప్పాడు రాముడు.

అపుడు భరద్వాజుడు 'రామా! ఇక్కడికి 60 మైళ్ళ దూరంలో ఉన్న చిత్రకూట పర్వతానికి వెళ్ళవచ్చు. యమునా నదిని దాటగానే శ్యామనామకమైన ఒక పెద్ద వటవృక్షం కనిపిస్తుంది. అది కన్పిస్తే, మీరు సరైన మార్గంలో ప్రయాణిస్తున్నట్లు తెలుసుకోవచ్చు. చిత్రకూట ప్రాంతమంతా మీకు జలపాతాలతో, పక్షులతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. పండ్లు, తేనె బాగా లభిస్తాయి. సర్వసమానమైన గంధర్వ గాన పర్వతం వలె, సన్మార్గ జీవనాన్ని గడపటానికి అనువైన సుందర ప్రదేశమది' అని సలహా ఇచ్చాడు.

ఆ రాత్రి ముని ఆశ్రమంలో గడిపి, ముగ్గురూ ఋషి వద్ద శలవు తీసికొని చిత్రకూటానికి బయలు దేరారు. ఆరోజు నదిని దాటటానికి రామలక్ష్మణులు ఇద్దరూ ఒక బల్లకట్టును తయారుచేశారు. ప్రవాహ మధ్యానికి చేరుకోగానే సీతాదేవి కాళిందిని ప్రార్థించింది. నదిని దాటి వారు కొద్ది సేపటికే, శ్యామనామకమైన పెద్ద వటవృక్షం దగ్గరకు చేరారు. ఆ వటవృక్షానికి సీతాదేవి మ్రొక్కి, క్షేమంగా తిరిగి అయోధ్యకు చేర్చమని ప్రార్థించింది. కొంతసేపు నడిచి ముగ్గురూ ఆ రాత్రి యమునా నదీతీరంలోనే గడిపారు. ముగ్గురూ మరురోజు ప్రయాణం ప్రారంభించారు. వారి ప్రయాణంలో సీతాదేవి ఆ అడవుల విశేషాలను గురించి రాముని అడుగుతూ వచ్చింది. ప్రకృతి అందాలను గురించి గొప్పగా రాముడు ఆమెకు చెప్పడంతో పాటు తనూ ఆనందించాడు.

ఇలా నడిచి నడిచి చివరకు చిత్రకూట పర్వత ప్రాంత పరిసరాల్లోనికి చేరారు. అక్కడ ఆహార పదార్థాలు

సమృద్ధిగా ఉండటం సంతోషాన్ని కలిగించింది. వీరు అక్కడ వాల్మీకి ఆశ్రమానికి చేరుకోగా, ఆ ఋషి పుంగవుడు వీరిని స్వాగతించాడు. అక్కడే నివసించమని ఋషి కోరాడు. ఒక చిన్న కుటీరాన్ని ఏర్పాటు చేయమని రాముడు లక్ష్మణుని ఆదేశించాడు. లక్ష్మణుడు వెంటనే ఆ పనిలో నిమగ్నుడై, ఒక సుందర కుటీరాన్ని నిర్మించాడు. రాముడు కోరగా, లక్ష్మణుడు ఆ గృహాన్ని పవిత్రం చేయుట కుద్దేశించి, దేవతానుగ్రహం కోసం కొన్ని యజ్ఞాలు నిర్వహించాడు. క్రొత్త కుటీరంలో ప్రవేశించి, అందరూ సంతోషంగా వున్నారు. రాముడు వెళ్ళగానే గుహుడు ఆయనకు తెలియకుండా కొందరు చారులను పంపించాడు. రాముడు చిత్రకూటాన్ని చేరాడనే విషయం అందరికీ తెలిసిపోయింది వీరి ద్వారా.

సుమంత్రుడు అయోధ్యకు విషాదంతో చేరాడు. నగరం శోభాహీనంగా, నిర్నిమిత్తంగా ఉంది. రాముడు లేక ప్రజలు దుఃఖంతో వున్నారు. సుమంత్రుడు తిరిగి వచ్చాడన్న వార్త తెలియగానే జనం చుట్టుముట్టి రాముని గురించి అడగడం ప్రారంభించారు. వారందరికి సుమంత్రుడు ఇలా సమాధానం చెప్పాడు. 'సోదరులారా! విష్ణుస్వరూపుడైన రాముడు గంగాతీరం దాటగానే నన్ను వెనక్కు పంపాడు. నన్ను ఇకపై తనతో రావద్దని ఆపివేశాడు. ఇప్పుడు వారు అడవుల్లో ప్రయాణం చేస్తున్నారు.' అని చెప్పగా, కొందరు మూర్ఛపోయారు. రాముడు రాడని తెలిసికొని, పురజనులు విలపించ సాగారు. "అయ్యో! మనం రాముణ్ణి పోగొట్టుకున్నాం. అంత ప్రేమమూర్తి మనకు లేడు. మళ్ళీ ఎప్పటికి చూస్తామో గదా!' ఇలా తండ్రిని కోల్పోయిన బిడ్డల వలె ప్రజలు ఎడతెగని శోకసముద్రంలో మునిగిపోయారు.

అస్వస్థుడైన మహారాజుకు విషయం చెప్పటానికి సుమంత్రుడు రాజప్రాసాదానికి చేరాడు. మహారాజుకు సుమంత్రుడు రాముని గురించి వివరిస్తుండగనే మహారాజు మూర్ఛిల్లాడు. ఆయన పరిచ్యలో కౌసల్య కూడ మూర్ఛిల్లింది. ఇద్దరికి ఎవరు సేవ చేయాలి. కాని కౌసల్య కొంత తేరుకొని మహారాజుతో ఇలా అన్నది. 'ఓ మహారాజా!ఎందుకు విలపిస్తున్నారు? మీరే కదా నిర్దయతో మీ కుమారుణ్ణి అడవికి పంపింది. సత్యవంతుణ్ణి బహిష్కరించావు. లే, నీవు ఇలాగే విలపిస్తే, శ్రీరాముని విరహాగ్నిలో పౌరులు మసైపోతారు.' అని అన్నది.

దశరథ మహారాజు ఈ మాటలు విని 'ఓ సుమంత్రా! రాముడు ఎక్కడున్నాడో, ఏమి తింటున్నాడో? రాజభోగాలకు అలవాటు పడినవాడు. సీత అరణ్యంలో ఎలా వుంటుందో! అడవిలో దుర్భర జీవితం వారు ఎలా తట్టుకోగలరు? లక్ష్మణుడు ఎలా వున్నాడు? వారు నాకేమైనా సందేశం పంపారా? నీ సమాధాన బలంతోనే నేను బ్రతికేది' అని అన్నాడు. రాముని విశేషాలతోనే, రాజు బ్రతుకుతాడనే విషయం సుమంత్రునికి తెలుసు. అందుచేత ఇలా చెప్పడం మొదలు పెట్టాడు. 'రాజా! రాముడికి కావలసిందల్లా మీ శ్రేయస్సే. నన్ను తిరిగి వెళ్ళి మీ సేవలో ఉండాలని ఆదేశించాడు. కైకయికి మీరు ఇచ్చిన వాగ్దానాన్ని బట్టియే ఆయన అలా వెళ్ళాడు. తాను కుశలంగా వున్నానని మీకు తెలపమన్నాడు రాముడు. కౌసల్యా! నీవు ధర్మానుసారంగా ఉంటూ, భర్తసేవలో భర్తయే దేవునిగా భావించుకొని, ఆయన పాదపద్మాలను పూజించమని నీ తనయుడు నిన్ను ప్రార్థించాడు. అమ్మా! నీ గమ్యాన్ని వదలి, కైకేయిని మహారాణిగా గుర్తించమన్నాడు. అలాగే రాజా! నీవు ఆలస్యం చేయకుండా, భరతుణ్ణి వారసునిగా ప్రకటించమని కూడా కోరాడు. వయస్సులో చిన్నవాడైనా, రాజు కనుక అందరికీ గౌరవార్హుడేనని చెప్పాడు. తన తల్లి కైకేయి మాదిరిగానే, కౌసల్య, సుమిత్రలను కూడ తన తల్లుల వలెనే ప్రేమతో, గౌరవంతో చూచుకోమని భరతునికి కూడ చెప్పమన్నాడు."

అంతేకాదు, 'ఓ చక్రవర్తీ! సీతాదేవి ఇంతకుముందు ఎప్పుడూ కష్టాలు అనుభవించ లేదు. ఆమె ఏ సందేశం ఇవ్వలేదు. నేను శలవు తీసికొని బయలుదేరుతుండగా, ఆమె రాజ రథం వైపు చూచి కన్నీళ్ళు పెట్టింది నేను వారికి నమస్కరించి బయలుదేరాను. కాని నా అశ్వాలు కూడా కన్నీళ్ళతో దారి కానక నేను తికమక పడ్డాను. ఓ చక్రవర్తీ! నేను అయోధ్యకు తిరిగి వచ్చి చూడగా రాజ్యంలోని సకల జీవరాసులు దీనావస్థలో, రాముని వియోగం కారణంగా, ఉండటం గమనించాను. వృక్షాలు, పుష్పాలు, ఫలాలు సహితం విరహంతో వాడిపోయాయి. నదులు, సరస్సులు ఎండిపోయాయి. వన్యమృగాల సంచారమే లేదు. సరస్సులో తామరపూలు వాడిపోయాయి. చేపలు నశించిపోయాయి. రాజ్యంలో ఉద్యానవనాలు నిర్మానుష్యమై పోయాయి. పాటలు పాడే పక్షులు అదృశ్యమై పోయాయి. ఇలా రాముడు లేని రథం చూచి, పురజనులు స్పృహ కోల్పోయారు' అని అన్నాడు.

*భగవత్ప్రేమ పారవశ్యంలో ఒక భక్తుడు బాధ, ఆశ్చర్యం, భయం, శోకం లేదా ఆగ్రహం పొందినపుడు ఎలా ప్రవర్తిస్తాడో అలాగూ అయోధ్యా పురజనులు ప్రదర్శించుటపై దిగ్భ్రాంత స్థితి కలుగుతోంది. భగవంతునితో సంబంధాన్ని కోల్పోయామన్న ఆలోచన కలిగినపుడు భక్తులు దిగ్భ్రాంతి చెందిన సందర్భాలు కోకొల్లలు. శ్రీకృష్ణుని అవతార కాలంలో బృందావన గోపికలు తరచు దిగ్భ్రాంతికి లోనైపోయే వారు. కృష్ణుణ్ణి కాళీయుడో లేదా మరో రాక్షసుడో చంపుతాడేమోనన్న ఆలోచన కలిగినపుడు గోపబాలురు, గోవులు, పెద్దలు దిగ్భ్రమకు లోనుకావడం జరుగుతుండేది. అలాంటి మానసిక స్థితిలో కదలిక లేక, మాట్లాడ లేక, ఒక శూన్యస్థితిలో ఉండటం జరుగుతుం విరహ లక్షణాలు అనేకం కనిపిస్తుంటాయి. భౌతిక వాంఛ లేని మహాభక్తులు దైవసాన్నిధ్యం లేనపుడు ఇలా పారవశ్యానుభూతుల్లో గొప్ప ఆనందాన్ని పొందుతుంటారు. సారాంశమేమన, బృందావనవాసుల వలె అయోధ్య జనులు కూడ భగవత్ ప్రేమకు దూరమై దిగ్భ్రాంతికి లోనైపోయారు అని చెప్పాలి.*

సుమంత్రుని మాటలు విన్న దశరథునికి దుఃఖం మరింతగా పెరిగింది. నిస్పృహతో 'సుమంత్రా! నీవు నన్ను రాముని వద్దకు తీసికొని వెళ్ళాలి, లేదా ఆయన్ను ఇక్కడికి తేవాలి. లేకుంటే నేను మరణిస్తాను. నేను దుఃఖసాగరంలో మునిగి పోయాను. ఆ రెండు వరాలు రెండు తీరాలు. రాముని ప్రవాసకాలం దాని విస్తీర్ణం. కౌసల్య తదితరుల దుఃఖాశ్రువులతో ఆ సముద్రం కల్లోలం. మా ఆక్రందనలే ఆ సాగర గర్జనలు. కైకేయియే ఈ అశ్రుధారాపాతానికి కారణభూతమైన బడబాగ్ని. మంధర పలుకులే మకర బృందం." అని అన్నాడు. మళ్ళీ మూర్ఛిల్లాడు. ఉన్మాదియై కౌసల్య నేల మీద దొర్లాడింది. 'సుమంత్రా! నన్ను నీవు రాముని వద్దకు తీసుకు పోకపోతే, నేను మరణించడం తథ్యం' అని అన్నది కౌసల్య, విలపిస్తూ ఆవేదనతో. సుమంత్రుడు ఆమెతో 'మహారాణీ! రాముడు అడవుల్లో ఉన్నా కూడా, సీత, లక్ష్మణుల సాంగత్యంలో సుఖంగానే ఉంటాడు."అంటూ, ఓదార్చే ప్రయత్నం చేశాడు.

కౌసల్య పెద్ద భార్య అయినా సరే, ఆమె మహారాజును ఇలా తూర్పారబట్టింది. 'మహారాజా! ఇలా ఇన్ని దోషాలు రావడానికి కారణం మీరే. మీ కుమారుని పట్ల, కోమలాంగి సీత పట్ల అంత క్రూరంగా ఎలా వ్యవహరించారు. నేలమీద వారు ఎలా విశ్రమించ గలరు? ఫలాలను తింటూ ఎలా బ్రతుక గలరు? చలిని, గాలివానలను ఎలా తట్టుకోగలరు? క్రూరమృగాల బారిన పడకుండా ఎలా ఉండగలరు? ఎలా రక్షించుకో గలరు? ఆలోచించారా? ఒకవేళ రాముడు అరణ్యవాసాన్ని ముగించుకొని తిరిగివచ్చినా, భరతుడు అతనికి

రాజ్యం ఇవ్వడు. ఒకవేళ ఇవ్వనన్నా, రాముడు ఇష్టపడి తీసికోడు. మీలాంటి దుర్మార్గపు భర్తను కలిగి ఉండటం నా దౌర్భాగ్యం కాక మరేమిటి? మీరు పూర్తిగా కైకేయి విధేయులు. కనుక నాకు ఆశ్రయ భాగ్యం లభించలేదు. మహిళకు రెండవ ఆశ్రయం ఆమె బిడ్డా, పుత్రుడు. మీరు నా బిడ్డను నానుండి వేరు చేసినందున, ఇక నా గతి దుర్గతియే కదా!" అని ఆమె విలాపాలు మాటలు భర్తను ఎలా హింసించాయో గ్రహించిన ఆమె హృదయం కొంత మెత్తబడింది.

రాజు మళ్ళీ స్పృహలోకి వచ్చిన మీదట వారు ఇద్దరూ మళ్ళీ రాజీ పడ్డారు. మహారాజు ఓపికతో క్రింది కథను ఆమెకు వివరించాడు. ఎవడు తాను చేసే పని ప్రతిక్రియను ఆలోచించడో, వాడు వట్టి మూర్ఖుడు. ముళ్ళకంపను పెంచటం కోసం మామిడి చెట్టును నరికేవాడితో సమానం. పండవలసిన సమయంలో పశ్చాత్తాప పడతాడు. రాముని అడవులకు పంపటంలో నీకు సరిగ్గా ఈ ఉదాహరణే అనుసరిస్తుంది రాణీ! చాలాకాలం క్రిందట, నేను యువరాజుగా ఉన్న రోజుల్లో, నేను శబ్దగ్రహణంతో కనపడని ఏ వస్తువునైనా అవలీలగా నా బాణంతో ఛేదించే కళను నేర్చుకున్నాను. ఒకసారి సరయూ నదీతీరంలో వేటకు వెళ్ళిన నేను రాత్రి ఒక ఏనుగు నీరు తాగుతున్న శబ్దం విన్నాను. అలా భావించాను. ఆ దిశగా నేను బాణాన్ని సంధించగా, నాకు ఒక ఆర్తనాదం వినిపించింది. "అమాయకుడనైన, ఋషినైన నన్ను బాణంతో ఛేదించిందెవరు?' అనే మానవ స్వరం కూడ వినవచ్చింది. ఆ రోదన దిశగా పరుగు తీశాను. ఒక ఋషి కుమారుడి దేహంలో నా బాణం దిగబడి, నేలపై పడి వున్నాడు. ఆ ఋషి కుమారుడు నన్ను చూచి 'వృద్ధులు, అంధులు అయిన నా తల్లిదండ్రులు తమ కోసం నేను నీళ్ళు తెస్తానని వేచి చూస్తున్నారు. నీవు నన్ను చంపటమే గాక వారిని కూడ చంపినవాడవైనావు. నేను వారి పరిచర్యలో లేకపోతే, వారు జీవించలేరు. నీవు వెళ్ళి వారికి ఈ నా సంగతి చెప్పు. పోయేముందు ఈ బాణాన్ని నా శరీరం నుండి బయటికి లాగేసిపో. చాల బాధగా ఉంది' అని అన్నాడు ఆ ఋషి కుమారుడు. కాని నేను ఆ బాణాన్ని లాగితే, ఆ బాలుడు వెంటనే వరణించవచ్చు అని భయపడ్డాను. దీన్ని గమనించిన ఋషి కుమారుడు 'ఒక బ్రాహ్మణుని చంపుతున్నానని సంకోచించవద్దు. నేను వైశ్యుడైన తండ్రికి, శూద్రురాలైన తల్లికి జన్మించిన వాడిని.' అని చెప్పి అభయం పలికాడు.

ఈ మాటలు విని, నేను బాణాం లాగివేశాను. తక్షణమే ఆ బాలుడు ప్రాణం విడిచాడు. దుఃఖభారంతోనే ఆ కడవను నీటితో నింపి, ఆ వృద్ధ తల్లిదండ్రులున్న ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడ అంధులు, దుర్బలులు, వృద్ధులు అయిన తల్లిదండ్రులను చూచాను. వారు నేను వచ్చిన శబ్దాన్ని గ్రహించి, వారి కుమారుడు వచ్చాడనే స్పృహతో నన్ను వాత్సల్యభావంతో పలుకరించ సాగారు. అది నా హృదయ వేదనకు కారణమైంది. కాని నేను ధైర్యం తెచ్చుకొని, వారి పుత్ర మరణాన్ని గురించి వివరంగా చెప్పాను. నేను వారితో 'నేను మీ కుమారుణ్ణి కాను. దశరథుడనే పేరుగల క్షత్రియుడిని. మీ కుమారుడు నీటి కడవ ముంచుతుండగా, ఆ శబ్దాన్ని ఏనుగు నీరు త్రాగుతున్న శబ్దంగా భావించి, నా అజ్ఞానంతో ఒక బాణం విసిరి మీ పుత్రుణ్ణి చంపాను. పవిత్రాత్ములారా! నా ఈ పాపానికి ప్రాయశ్చిత్తం ఏమిటో సెలవివ్వండి.'అని అన్నాను.

ప్రాజ్ఞుడను కావడం చేత నేను చేసిన పాప కార్యం యొక్క ఫలితం అనుభవించక తప్పదని తెలుసు. అందుచేతనే తండ్రితో ప్రాయశ్చిత్తం తెలుపమని అడిగాను శాస్త్రానుసారం. ఈ జన్మలో పాపకార్యానికి ఈ జన్మలోనే ఫలితం అనుభవించడం ఉత్తమం. నేరం యొక్క తీవ్రతను బట్టి పరిహారం చెల్లించాలి. ప్రతి కార్యం యొక్క ప్రతిక్రియలు పనిచేస్తూనే ఉంటాయి. అమాయకులు అని చెప్పేవారు కూడ తప్పించుకోలేరు. దైవం

యొక్క ప్రకృతి యొక్క శాసనాలను అతిక్రమించినపుడు వారు జన్మజన్మల పాటు అనుభవించి తీరవలసిందే. దానిని తప్పించుకోవటానికే, నేను ఈ జన్మలోనే ప్రాయశ్చిత్తం ద్వారా పాప పరిహారం కోరాను. నా మాటలు వినిన వృద్ధ తండ్రి 'నీవు నీ పాపాన్ని స్వయంగా అంగీకరించావు. కనుక నిన్ను శపించను. నేను శపిస్తే నీవు తక్షణం మరణిస్తావు. నీవు తెలియక నా పుత్రుణ్ణి చంపావు కనుక నీ ప్రాణాలు దక్కాయి. నా పుత్రుడు ఉన్నచోటికి నన్ను తీసికొని వెళ్ళు' అని అడిగాడు.

నేను ఆ వృద్ధ దంపతులను వారి కుమారుడు శవంగా పడివున్న చోటుకు తీసుకొని వెళ్ళాను. వారు అతని శరీరాన్ని ముద్దాడుతూ, విపరీతంగా ఏడ్వసాగారు. వారు తమ మృత పుత్రునికి జలతర్పణం చేయగానే స్వర్గాధిపతియైన ఇంద్రుడు తన దివ్య రథం మీద వచ్చి అక్కడ దిగాడు. వారి కుమారుడు పొందిన ఉన్నత స్థితినే వారు కూడ పొందుతారని హామీ ఇచ్చిన మీదట, ఇంద్రుడు దివ్యరూపాన్ని పొందిన ఆ బాలుణ్ణి స్వర్గలోకానికి తీసికొని వెళ్ళాడు. ఆ తరువాత ఆ వృద్ధ ఋషి నాతో 'మా పుత్రుని మరణం కారణంగా ఎంత వ్యధను అనుభవిస్తున్నామో, నీవు కూడ నీ పుత్రుని విరహంతో అంతటి దుఃఖాన్ని అనుభవించుదువు గాక!' అని శపించాడు. ఆ తరువాత ఆ వృద్ధ దంపతులు కుమారుని చితిపై దూకి ప్రాణాలు వదలి స్వర్గలోకానికి చేరారు.

నా ప్రియమైన కౌసల్యా! నా ఘోర నేరానికి నేడు నేను ఫలితాన్ని అనుభవిస్తున్నాను. నేను భగ్నహృదయుంతో చనిపోతున్నాను. నా ఇంద్రియాలు ఉడిగి పోతున్నాయి. నా మరణం ఆసన్నమైందని నాకు తెలుస్తోంది. ఓ రాణీ! నా దుఃఖంతో నేను ఇప్పటికే అంధుడనైనాను. నీవు నన్ను స్పర్శిస్తే, నీవు నా ప్రక్కనే ఉన్నందున ధైర్యం కలుగుతుంది' అని అంటూ రాముని స్మృతిలోనే పూర్తిగా మునిగిపోయిన మహారాజు రాత్రి గడచిన మీదట తన పార్థివ దేహాన్ని విడిచాడు.

దేవాధిదేవుడైన తన రాముని అమితంగా ప్రేమించిన కారణంగా శ్రీరామచంద్రుడు రాజ్యమేలే ఆధ్యాత్మిక ఆకాశంలోని భగవంతుని దివ్యధామాన్ని దశరథ మహారాజు చేరుకొన్నాడు. భజిస్తూ, భుజిస్తూ, వినుతిస్తూ, శయనిస్తూ, పయనిస్తూ, విశ్రమిస్తూ వున్నా నిరంతరం భగవంతుని గురించే చింతించే ఏ భక్తుడైనా సరే భగవంతుని దివ్యధామాన్ని తప్పక చేరుకొంటాడు.

కనుకనే మహారాజు గతంలోని తన అపరాధాలకు ప్రతిఫలాన్ని సహించవలసి ఉన్నప్పటికీ, ఆయన తన అభీష్ట లక్ష్యమైన శ్రీరాముని యొక్క శాశ్వత సన్నిధినే సాధించాడని తెలుసుకొందాం.

తెల్లవారిన తరువాత మహారాజును మేల్కొల్పటానికి వైతాళికులు వచ్చారు. ద్వారపాలకులు, పరిచారకులు అందరూ నిలబడి ఉన్నారు. కాని వారు ఆయన గదిలోనికి ప్రవేశించగానే ఆయనలో జీవకళ లేదని గ్రహించారు. ఆ స్త్రీలు కేకలు వేయడంతో, కౌసల్య, సుమిత్ర ఉలిక్కిపడి లేచారు. తమ మహారాజు మరణించాడని తెలుసుకొని, ఇద్దరు రాణులు నేలపై కూలారు. ఈ ప్రమాదం వినిన కైకేయి కూడ వచ్చింది. ఆమె కూడ రోదించ సాగింది.

కౌసల్య మరణించిన భర్తయొక్క శిరస్సును ముద్దాడుతూ, కైకేయి నుద్దేశించి 'నేను మహారాజు చితిపైకి వెళ్ళి, ఆయన వెళ్ళిన చోట నివసిస్తాను. నీలాంటి పాపిష్ఠి దౌర్భాగ్యురాలు మాత్రమే భర్త లేకున్నా హాయిగా బ్రతుక గలుగుతుంది.' అంటూ పరుషంగా మాట్లాడింది.

మంత్రులు వచ్చి, కౌసల్యను ఓదార్చుతూ, దూరంగా తీసికొని వెళ్ళారు. పుత్రుడు మాత్రమే అంతిమ సంస్కారం చేయాలి. కాని పుత్రులెవరూ దగ్గర లేరు. కనుక, తర్వాత వారు మహారాజు దేహాన్ని ఒక తైలఖండంలో నిక్షిప్తం చేశారు.

తమ పాలకుణ్ణి పోగొట్టుకొని, పురజనులు విచారగ్రస్తులైనారు. ప్రజానీకం గుంపులు గుంపులుగా గుమిగూడి తమ దుఃఖాన్ని వెళ్ళగ్రక్కుతూ, కైకేయిని బహిరంగంగా దూషించ సాగారు.

మరునాటి ఉదయం అయోధ్యలోని ప్రముఖ బ్రాహ్మణులు రాజసభకు వచ్చారు. మహారాజు పుత్రులలో ఒకరిని ఆరోజే మహారాజుగా నియమించాలని రాజసచివులను తొందర పెట్టసాగారు. రాజు లేని దేశానికి నాశనమే గతి. బ్రాహ్మణులు వశిష్ఠుడు, వామదేవుడు, మార్కండేయుడు, గౌతముడు, కాశ్యపుడు తదితర ఋషులనుద్దేశించి ఇలా అన్నారు. "రాజులేని రాజ్యంలో వినాశం జరుగుతుంది. చోరులు విజృంభిస్తారు. అరాచకం తాండవిస్తుంది. ధర్మాచరణం లోపించి అరాచకం ప్రబలుతుంది.' అని అన్నారు. దానికి ఋషులు జవాబు చెప్తూ 'మీరు చెప్పింది నిజం. రాజు లేకపోతే రాజ్యం అస్తవ్యస్త మవుతుంది'.

వశిష్ఠుడు 'ఇప్పటికే భరతుని రాజవారసునిగా ఎంపిక జరిగింది. కనుక వెంటనే అతణ్ణి ప్రతిష్ఠించాలి. కేకయ రాజ్యానికి దూతలను పంపి, భరత శత్రుఘ్నులను పిలపించుదురు గాక' అని వశిష్ఠుడు ఆదేశించాడు. అందరూ ఆమోదం ముక్తకంఠంతో తెలిపారు.

దూతలు ఆ రాత్రే కేకయుని రాజధానికి చేరారు. ఈలోగా భరతునికి క పీడకల వచ్చి ఆందోళనకరమైన స్థితిలో మేల్కొన్నాడు. శత్రుఘ్నుడు భరతుని విషాధ ఛాయలను గమనించి, ఉత్సాహపరచే ప్రయత్నాలు చేశాడు. కాని అవేమీ భరతునికి మోదం కలిగించలేక పోయాయి. అదరూ ఆయన మనస్సులోని కలవరం గురించి అడగటం మొదలెట్టారు.

భరతుడు ఇలా చెప్పాడు. 'రాత్రి నాకు పీడకలు వచ్చాయి. నా తండ్రి మురికి దుస్తులతో పర్వత శిఖరం నుండి క్రిందికి దొరులుతూ పడటం చూచాను. ఆ రొచ్చులో నా తండ్రి పడి వికటాట్టహాసం చేస్తున్నాడు. ఆయన తైలంతో వండిన అన్నాన్ని తినడం చూచాను. క్షణంలో ఆ దృశ్యం మారిపోయింది. సముద్రంలో నీరు ఎండిపోవటం, చంద్రుడు క్రిందికి రాలిపోవటం, భూమిలో చీకటి ఆవరించడం, అగ్ని పర్వతాలు జ్వాలలు కక్కడం, రాక్షసులు స్వైరవిహారం చేయడం చూచాను. ఆ దృశ్యం పోయి, నా తండ్రిగారి ఏనుగు దంతం ముక్కలై ఉండటం చూచాను. వికృత ఆకారంతో ఇనుప సింహాసనంపై కూర్చొని ఉన్న నా తండ్రిని, నల్లని శరీరంగల ఒక యువతి వేధించడం చూచాను. చివరగా గార్ధభాలు లాగుతున్న ఒక రథం నా తండ్రిని దక్షిణం వైపు తీసికొని పోతుండటం చూచాను. ఇవన్నీ చూచిన మీదట, నా తండ్రి గాని, నా సోదరులలో ఒకరు గాని మరణించడం తప్పదు అనే అభిప్రాయానికి వచ్చాను. ఇప్పటికీ నాకు భయంగానే ఉంది. నా శరీరం కాంతిని కోల్పోయింది. నా మనస్సు తిరుగుతోంది. తెలియకుండానే, కారణం తెలియకుండానే, నాకు ఎందుకో సిగ్గు, ద్వేషం కలుగుతున్నాయి. ఆలోచిస్తుంటే, రానున్న కాలంలో ఏదో ఒక ఉపద్రవం పొంచి ఉన్నట్లు తోస్తున్నదని నమ్మకం కలుగుతోంది.

భరతుడు ఇలా మాట్లాడుతుండగా, అయోధ్య దూతలు గదిలోనికి వచ్చారు. నమస్కరించిన మీదట 'ఓ రాజకుమారా! సచివులు వశిష్టుడు నిన్ను అయోధ్యకు రమ్మంటున్నారు. అక్కడ అత్యవసరంగా నీ ఉపస్థితి అనివార్యమైంది.' అన్న సందేశాన్ని వినిపించారు.

భరతుడు వారిని తమ తల్లిదండ్రులు క్షేమసమాచారాలు అడుగగా, వారు అందరూ, కుశలురేనని చెప్పారు. వెంటనే వెళ్ళుటకు మేనమామల వద్ద అనుమతి తీసుకొన్నాడు భరతుడు. అశ్వపతి మహారాజు ఎన్నో అమూల్య కానుకలను భరతునికి ఇచ్చాడు. కాని అసలే పీడకలల ప్రభావం వల్ల, వశిష్ఠుని సందేశం వల్ల భరతుడు ఆ కానుకల వైపు కన్నెత్తి చూడలేదు. భరతుడు శత్రుఘ్నునితో రథం మీద బయలుదేరాడు. సైన్యం వెంట నడిచింది. ప్రయాణను ఏడవ రోజుకు భరతుడు అయోధ్య పొలిమేరలకు చేరుకొన్నాడు.

నగరంలో కనిపిస్తున్న విషాద ఛాయలను భరతుడు గమనించాడు. రాజ్యంలోనికి ప్రవేశించగా, ప్రజల దుఃఖం మరింతగా గమనించాడు. ఈ విధంగా విషాదం గమనిస్తే, భరతునికి తన తండ్రి మరణించినట్టున్నాడని రథ సారథితో చెప్పాడు. అయోధ్య పాడుబడినట్లున్నది. జనసంచారం లేదు. భాష్పధారలతో భరతుడు తన తండ్రి ప్రాసాదంలోనికి ప్రవేశించాడు. తన తండ్రి ఆయన అంతఃపురంలో కనిపించక పోగా, వెంటనే తన తల్లి కైకేయి అంతఃపురానికి వెళ్ళాడు. చాలకాలం తర్వాత కుమారుణ్ణి చూచిన తల్లి, తన ఆసనం నుండి క్రిందికి ఎగిరి దూకింది సంతోషంగా. భరతుడు తన తల్లి పాదాలకు ప్రణామం చేశాడు. ఆమె కుమారుని పైకి లేపి, ఆలింగనం చేసుకొని, అతనిని శిరస్సును తన ఒడిలో పెట్టుకొంది. కైకేయి తన తండ్రి యొక్కయు, ఆయన రాజ్యం యొక్కయు క్షేమం అడిగితే, భరతుడు అందరూ చూస్తున్నారని చెప్పాడు.

తరువాత భరతుడు 'వశిష్ఠుడు పిలువనంపగా, నేను వచ్చాను. నాన్నగారు ఎలా ఉన్నారు? ఆయన తన గదిలో లేరేమిటి?' అని అడిగాడు. కైకేయి అంతట 'నా ప్రియమైన కుమారా! దశరథ మహారాజు మరణించారు.' అని నెమ్మదిగా చెప్పింది. ఈ వార్త వినగానే భరతుడు దుఃఖతప్తుడై నేలమీద పడిపోయి, బిగ్గరగా ఏడ్వసాగాడు. కైకేయి అతనితో 'నాయనా! భరతా! దుఃఖించకు. వివశుడవు కాకు. జ్ఞానులు అనాసక్తులై ఉంటారు. విలాపాలకు లోనుకాకు' అంటూ ఓ ఓదార్చటానికి ప్రయత్నించింది కైకేయి. అంతట భరతుడు తండ్రి ఎందుకు, ఎలా మరణించాడని తల్లిని అడిగాడు. ఆపైన 'ఎవరినైనా రాముని దగ్గరకు పంపి, నా రాక విషయం తెలియజేయ'మని ప్రార్థించాడు. కైకేయి నిర్మొహమాటంగా, శుభవార్తలాగా ఇలా బదులు ఇచ్చింది. 'రాముడు 14 సం॥లు అణ్యవాసానికి వెళ్ళాడు. కోసల రాజ్యాన్ని విడిచాడు. ఇపుడు అతడు నారవస్త్రాల్లో ఉన్నాడు. సీత, లక్ష్మణుడు కూడ ఆయనతో ఉన్నారు.'అయితే నీ తండ్రి రాముని విరహం భరించలేక, హా రామా, హా సీతా, హా లక్ష్మణా అంటూ రోదిస్తూ రోదిస్తూ తన జీవితాన్ని చాలించాడు.' అని చెప్పగా, రామునికి ప్రవాసం ఎందుకు విధించాడని అడిగాడు.

అపుడు కైకేయి మహా చాకచక్యంతో ఇలా చెప్పింది. 'నీవు లేని సమయంలో ఒక రోజు మహారాజు ఆకస్మికంగా రాముణ్ణి వారసునిగా ప్రకటించాడు. కౌసల్య, ఆమె కుమారుడు మన మీద అధికారం చెలాయించకుండా ఉండేటందుకు, నేను మీ తండ్రి పూర్వం నాకిచ్చిన రెండు వరాలను ఉపయోగించుకున్నాను. మొదటి వరం – నిన్ను వారసునిగా ప్రతిష్ఠించమని, రెండవది – రాముని 14 సం॥లు అరణ్యవాసం చేయించమని. రాముడు సదా మహారాజుకు ప్రీతిపాత్రుడు. రాముడు లేకపోవటంతో మహారాజు దుఃఖసముద్రంలో మునిగి మరణించాడు. అందుచేత మరణించిన నీ తండ్రికి అంతిమ సంస్కారాలు చేసిన తర్వాత నీవు రాజసింహాసనం అలంకరించి తీరాలి. గుండె రాయి చేసుకొని, దుఃఖాన్ని విడిచి పెట్టు' అని అన్నది కైకేయి.

ఈ మాటలు వినగానే భరతుని హృదయంలో ఆగ్రహావేశం పెల్లుబికి, తల్లిని ఇలా దూషించసాగాడు.

'ఓసీ, దుష్టురాలా! నీవు సమస్త జగత్తును నాశనం చేయటానికి అవతరించిన కాళికవై ఉంటావు. నీవు నా తండ్రిని చంపి, నాకు నా ప్రాణంకన్నా మిన్నయైన నా రాముణ్ణి వనవాసానికి పంపించావు. నేను నిజంగానే ఈ పరిస్థితులలో సింహాసనాన్ని స్వీకరిస్తానని నమ్మేటంత కుటిలురాలవా నీవు? నీవు నా తల్లివి కావు. నా శత్రువులలో అతి నీచురాలైనదానివి. నీవు చేసిన ఈ ఘోరపాపానికి నీవు నరకానికి వెళ్ళాలని ప్రార్థిస్తాను. పాపాత్మురాలా! నీ దుష్ట కోరికలను నేను ఎన్నటికీ నెరవేర్చుకోనివ్వను. నేను ఇపుడే అడవులకు వెళ్ళి, రాముణ్ణి తిరిగి తీసికొని వస్తాను. రాముని ప్రతిష్ఠించి, ఆ మీదట నేను ఆయనకు శాశ్వత పరిచారకునిగా ఉంటాను. నా సహజ స్థానం, నా జీవిత ధ్యేయం అదే తప్ప మరొకటి కాదు. కౌసల్యమాత ఎంత వేదనతో ఉంటుందో తెలుసుకోలేని కఠినాత్మురాలివి నువ్వు? నీకొక విషయం చెపుతాను. విను. సురభి అనే పేరుగల జీవలోకపు కామధేనువు తన పుత్రుల్దిరూ స్పృహ లేకుండా నేలపై పడివుండటం చూచింది. ఒక దుర్మార్గపు హాలికుడు మండుటెండలో ఆ వృషభాలను పొలాలు దున్నించటంతో అవి నీరసించి పడిపోయాయి. అలా పడిపోయిన తన బిడ్డలను చూచి సురభి కన్నులనుండి జాలువారిన భాష్పాలు ఇంద్రుని శిరస్సుపై పడ్డాయి. ఇంద్రుడు శిరస్సు నెత్తి కారణమేమిటి అని సురభిని ప్రశ్నించాడు. జరిగిన సంగతి సురభి చెప్పింది. అందుకు ఇంద్రుడు 'ఈ సకల సృష్టిలో ఒక తల్లికి తన పుత్రుడికంటే ప్రేమాస్పదులు ఎవరూ ఉండబోరు' అని అన్నాడు. అపుడు భరతుడు ఇలా శపథం చేశాడు.

'ఓ నిర్భాగ్యురాలా! నేను రాముణ్ణి అడవినుండి తీసికొని రావడం మాత్రమే కాదు. నా తండ్రిగారి వాగ్దానాన్ని నిలబెట్టటం కోసం, రాముణ్ణి ప్రతిజ్ఞాభంగం నుండి కాపాడటం కోసం నేను కూడ 14 సం॥లు ప్రవాసంలోనే గడుపుతాను.' అలా అంటూనే, నీరసంతో, అలసట చేత భరతుడు నేలపై కూలబడ్డాడు. కొంచెంసేపు తర్వాత కోలుకొని, అక్కడ ఉన్న సచివులతో 'ఈ లోకానికి చక్రవర్తి కావాలన్న కోరిక నాకు లేదు. ఎందుకంటే నేను నా అన్నయైన రామునికి సేవకునిగానే పరిగణించుకొంటాను. నేఉ నా మేనమామ దగ్గర, దూరాన ఉండడం చేత నా తల్లిగారి కుట్రల విషయం నాకు తెలియలేదు. రాముడి ప్రవాసంతో నాకు ఎలాంటి సంబంధం లేదని చెపుతాను. దయతో నన్ను నమ్మండి. కైకేయి కోర్కెలు నా కోర్కెలు కావని గ్రహించండి.' అని పలికాడు.

భరతుని ప్రతిక్రియలను గమనించిన కైకేయి తన భ్రమలన్నీ ఒక్కసారిగా పటాపంచలైనాయని అర్థమైంది. ఆమె దుఃఖాశ్రువులతో ఉంది. హృదయం వ్యధాభరితమై ఉంది. ఈలోగా, భరతుడి స్వరం వినిన కౌసల్య అతన్ని కలుసుకుందామని బయలుదేరింది. కాని మార్గమధ్యంలో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. సరిగా అదే సమయంలోనే ఆమెను చూడటానికి భరత శత్రుఘ్నులు వస్తున్నారు. నేలమీద పడిన కౌసల్యను ఆ సోదరులు ఇద్దరూ లేవనెత్తి అశ్రుపూరిత నయనాలతో ఆమెను కౌగలించుకున్నారు. భరతుణ్ణి చూచిన కౌసల్య 'రాజ్యం కోసం ఇపుడు తిరిగి వచ్చావన్న మాట. పథకం ప్రకారం అంతా బాగా జరిగిపోయిందని సంతోషిస్తుంటావనుకొంటాను' అని నిష్ఠూర మాడింది.

ఈ మాటలకు భరతుడు బాగా బాధపడ్డాడు. సమాధానం చెప్పలేక పోయాడు. స్వస్థుడై కౌసల్య పాదాలపై పడ్డాడు. ముకుళిత హస్తాలతో 'అమ్మా! రాముని ప్రవాసంతో నాకసలు సంబంధం లేదు. కైకేయి చేసిన ఈ క్రూరకర్మను గురించి నాకు తెలియనే తెలియదు. నన్ను నమ్ము అమ్మా! రాముని నేను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలియని విషయం కాదు. రాముని ప్రవాసం, తండ్రి మరణం నన్నెంతగా దుఃఖితుణ్ణి చేసిందో నీవు గుర్తించటం లేదా తల్లీ! నా నిరపరాధిత్వంపై నీకు నమ్మకం కలిగించటం కోసం నేను ఒక శపథం చేస్తున్నాను.

'రాముణ్ణి ప్రవాసానికి పంపే పథకంలో సహాయపడిన వారెవరైనా సరే ఒక మహారాజును, ఒక గోవును, ఒక స్త్రీని, ఒక శిశువును లేదా వృద్ధుణ్ణి చంపిన మహాపాప ఫలితాన్ని పొందుగాక! పుణ్యపురుషుల సాంగత్యం లభించదు గాక! సంతోషహీనుడగు గాక! సకల పాపకార్యాల ఫలితాలను అతడు అనుభవించు గాక! ప్రియ జననీ! సాక్షాత్తూ నా ప్రాణాలు, నా అస్తిత్వం రాముడే, అతడే నా ఆత్మ. అతని సేవకు అంకితం కావడం మినహా, నా జీవితాశయం మరేమీ లేదు.' అని చెప్పాడు.

ఈ మాటలను బట్టి, కౌసల్య సందేహాలు తొలగిపోయాయి. భరతుడి నిరపరాధిత్వంపై ఆమెకు నమ్మకం కుదిరింది. భరతుని లేవనెత్తి, అతని శిరస్సును తన ఒడిలో పెట్టుకొని, ముద్దాడుతూ విలపించ సాగింది. తన సవతి తల్లి దుఃఖంతో భరతుడు వివశుడైనాడు. వారిద్దరూ ఆ రాత్రి దైన్యభావంలో గడిపారు.

మరునాటి ఉదయం వశిష్టుడు భరతునితో దుఃఖం విడనాడి తన తండ్రి అంత్యక్రియలు జరుపమని కోరాడు. దశరథ మహారాజు దేహాన్ని తైల భాండం నుండి బయటికి తీసినపుడు, భరతుడు ఆ స్థితిని చూచి, ఎవరూ వారింప శక్యంగాని విధంగా, రోదింపసాగాడు. అంతిమ సంస్కారాలు చేయవలసి వున్నందున, స్థిమితం కోల్పోవద్దని భరతుని వశిష్టుడు కోరాడు. అంతిమయాత్రకు శకటం బయలుదేరింది. ప్రజల రోదనల మధ్య శవాన్ని శ్మశానికి చేర్చారు. వశిష్టుడు, భరతుడు శ్మశానవాటికకు చేరారు. దశరథుని దేహాన్ని చితిపై ఉంచగా, బ్రాహ్మణుల వేదమంత్రాల మధ్య నిప్పు అంటించటం జరిగింది. మహారాజు సహచరిణులంతా పల్లకీల్లో వచ్చారు. వారి రోదనలతో ఆకాశం నిండిపోయింది. ఆ తర్వాత అందరూ సరయూ నదీతీరానికి వెళ్ళి, జలతర్పణం చేశారు. పది రోజులు అశౌచం పాటించబడింది. భరతుడు రెండు రోజులు మిగతా కర్మకాండలు నిర్వహించాడు. పన్నెండు రోజుల అంతంలో భరతుడు బ్రాహ్మణులకు భారీ వితరణలు చేశాడు.

13వ రోజున భరతుడు, శత్రుఘ్నుడు సరయూ నదిలో నిమజ్జనం చేసేందుకుగాను చితాభస్మం తీసికొని రావడానికి వెళ్ళారు. శ్మశాన వాటికను చేరుకున్న సోదరులు దుఃఖంతో వివశులైనారు. సోదరులు ఇద్దరూ మమ్ములను విడిచి ఎక్కడికి వెళ్ళారు తండ్రీ అని రోదించసాగారు.

వశిష్టుడు భరతుణ్ణి ఓదారుస్తూ "ప్రియమైన రాకుమారా! నీవు నీ విధులను నిర్వహించే విధంగా నిన్ను నీవు నిగ్రహించుకోవాలి. చితాభస్మాన్ని సేకరించు. స్మశావాన్ని శుభ్రపరచిన మీదట, సరయూ నదికి వెళ్ళి అవశేషాలను నిమజ్జనం చేయి. ద్వంద్వాలను అనుభవించటం దేహధారులకు అనివార్యం. చింతించకు. ఇక్ష్వాకు వంశంలో జన్మించి నీకు ఈ శోకాతిశయం తగదు కుమారా!' అని చెప్పాడు. ఆ తరువాత కర్మకాండలు పూర్తి చేయబడ్డాయి. తన సౌధానికి తిరిగివచ్చిన భరతుడు రామలక్ష్మణులను తిరిగి తీసుకొని రావడం గురించి ఆలోచించసాగాడు. అపుడు శత్రుఘ్నుడు భరతునితో 'రాముడు ఒక స్వార్థపరురాలి కుట్రచే అరణ్యానికి పంపబడ్డాడు. కాని సోదరుడు లక్ష్మణుడు తప్పక నిందింపతగిన వాడే. కారణం అతను ఆ విపత్తు తప్పించడానికి చేసిందేమిటి? ఏమీ లేదా?' అని అన్నాడు.

సరిగ్గా అదే సమయంలో గూనిదైన మంథర అక్కడ ప్రత్యక్షమైంది. కోతికంటే మెరుగ్గా కనిపించకపోయినా శరీరానికి చందనలేపనం, విలువైన ఆభరణాల సోయగాలకు ఏమీ లోటు లేదు. ద్వారపాలకుడు మంథర రాగానే, ఆమె చేతిని దొరకబుచ్చుకొని ఒక్క ఉదటున భరతునితో 'రాకుమారా! రాముని వనవాసానికి ప్రేరేపించిన దుష్ట గ్రహం ఇదే. ఈమెయే రాణి హృదయాన్ని విషతుల్యం చసింది. నీ తండ్రి మరణానికి కారకురాలైంది.

ఈమెను మీరు ఎలా శిక్షిస్తారో మీ ఇష్టం' అని అంటూ ఆమెను ఈడ్చుకొని వచ్చి భరత శత్రుఘ్నుల ముందు పడేశాడు. శత్రుఘ్నుడు ఆమెను నేలమీద పడేసి ఈడ్చుకు రాసాగాడు. మంథర ఆభరణాలు, రత్నమాణిక్యాలు ముక్కలుముక్కలుగా రాలిపోయాయి. ఈమె భయంకర స్థితిని గాంచిన, ఆమె అనుచర గూనిస్త్రీలు భయంతో అక్కడినుండి పరుగులు తీశారు. అప్పుడు శత్రుఘ్నుడు 'ఈ మంథర, కైకేయిలు ఇతరులకు కలిగించిన బాధలను తాము అనుభవించేలా చేయాలనే నాలో రగులుతున్న క్రోధాన్ని ఇప్పుడు వీరిపై ప్రయోగిస్తాను.' అని శపథం చేశాడు.

కైకేయి ఆశ్రయం కోసం, భరతుని వద్దకు పరుగులు తీయగా, భరతుడు తమ్మునితో 'శత్రుఘ్నా! స్త్రీలు ఎప్పటికీ వధ్యులు కారు, కైకేయి, మంథరలను నేనే స్వయంగా సంతోషంగా వధించి ఉండేవాడిని. కాని నేను అలా చేస్తే, నన్ను రాముడు ఎన్నటికీ క్షమించడని నాకు తెలుసు. అందువల్ల నీవు దయతో నిగ్రహించుకో.' అంటూ శత్రుఘ్నుని అడ్డగించాడు. శత్రుఘ్నుడు మంథరను వదలి వేయగా, ఆమె పరుగు పరుగున పోయి కైకేయి పాదాల మీద పడిపోయింది. మంథర ప్రాణరక్షణ విషయంలో భరతుడు కరుణతో పాటు, ధర్మపరాయణత్వాన్ని కూడ ప్రదర్శించాడు. భగవద్భక్తులు సదా తమ హృదయాల్లో కారుణ్యాన్ని నింపుకొని ఉంటారు. కరుణార్ద్ర హృదయులైన వారే భక్తులు కాగలరు. సీతారాముల వనవాసానికి, తండ్రి మరణానికి, ప్రజల ఆవేదనకు కారణం మంథర అయినప్పటికీ ఆమెకు ధర్మసూత్రాల కనుగుణంగా ప్రాణహాని తలపెట్టలేదు భరతుడు. ఆమె ధర్మసూత్రాలను పరిత్యజించినప్పటికీ ఆ ధర్మసూత్రాలే తమను అనుసరించే ధార్మికులను రక్షించినట్లుగానే, ఆమె ప్రాణాన్ని కూడ రక్షించాయి.

మరురోజు ఉదయమే వందిమాగధులు వచ్చి భరతుణ్ణి స్తోత్రం చేయసాగారు. వారి స్తుతులు దుఃఖాన్ని హెచ్చించినా, భరతుడు తాను రాజును కాదని స్తోత్రాలు ఆపమని చెప్పాడు. ఆ సమయంలో వశిష్ఠుడు రాజు వద్దకు వచ్చి, భరతుణ్ణి, సచివులను, సైనిక దళాధిపతులను, ఇతర ప్రముఖులను పిలుచుకొని రమ్మని దూతలను ఆదేశించాడు. భరతుడు రాగానే, అతని తండ్రిని స్వాగతించినట్లే, జయజయధ్వానాలు చేశారు. అపుడు వశిష్ఠుడు భరతునితో 'ఓ రాకుమారా! నీ తండ్రి మరణంతో, రామలక్ష్మణుల ప్రవాసంతో రాజ్యంలో పరిపాలన అస్తవ్యస్త మయింది. నీవు కైకేయి కుయుక్తులకు సంబంధం లేనివాడివని నాకు తెలుసు. పైగా దశరథ మహారాజు నిన్ను వారసునిగా ఎంపిక చేసి ఉన్నాడు. ఏర్పాట్లన్నీ పూర్తి అయినాయి. ప్రజలు ఎదురు చూస్తున్నారు. దయచేసి, నీ అంగీకారాన్ని తెలిపితే, ఈ రోజే నిన్ను సింహాసనం మీద అధిష్ఠింపగలము' అని అన్నాడు.

ఈ ప్రతిపాదనకు భరతుడు బాధపడ్డాడు. కన్నీటిని నిగ్రహించుకొంటూ, 'ఓ ఋషిసత్తమా! జ్యేష్ఠుడు సింహాసనాధికారి అనే విషయ మీరు ఎరిగినదే. నేను రాముని యొక్క అధముడనైన పరిచారకునిగా పరిగణించుకొంటాను. రాముని నుండి సింహసనాన్ని చేజిక్కించుకోవాలని నేను ఎన్నడూ ఆశించలేదు. రాముణ్ణి అయోధ్యకు రప్పించుటకు నేను అడవులకు వెళ్ళి ప్రయత్నం చేయాలనుకొంటున్నాను. నేను సఫలుణ్ణి కాలేకపోతే, లక్ష్మణుని వలె నేను కూడ రామునితో వనవాసంలోనే ఉంటాను. అందుచేత, మీరు నేను నిరాటంకంగా అడవులకు పోదగ్గ ఏర్పాట్లు అన్నీ చేయండి.' అని బదులు చెప్పాడు భరతుడు.

భరతుని ప్రేమపూరిత పలుకులు విన్న అందరి నేత్రాలు సజలమై, అందరూ ఆనందించారు. అందరి పరిస్థితుల్ని చూచిన భరతుడు తానూ మిక్కిలి సంతోషపడ్డాడు. భరతుని నిర్ణయం ప్రతిఒక్కరిని సంతోష పరిచింది.

వెంటనే ఒక కార్యబృందం అడవులకు మార్గ నిర్మాణం కోసం బయలుదేరింది. కార్మికులు మార్గాన్ని శుభ్రం చేసుకొంటూ వెళ్ళారు. జలప్రవాహాల మీద వంతెనల నిర్మాణం చేశారు. రాజమార్గాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఆనకట్టలను నిర్మించారు. నిర్మాణం పూర్తి అయిన మీదట అయోధ్యనుంచి గంగాతీరం వరకు విస్తరించి వున్న ఈ రాజమార్గాన్ని చందన సౌరభాలతో గుభాళింప చేశారు. ఆరామశాలలను కూడ మధ్యమధ్యలో నిర్మించారు. అగడ్తలను ఏర్పాటు చేశారు. ఆ విధంగా దేవతలు విహరించనున్న దారన్నట్లు తలపించే ఆ మార్గాన్ని అంతటిని అనతి కాలంలోనే నిర్మించారు పురజనులు సంతోషించారు. భగవంతునికి చేసే భక్తియుత సేవ యొక్క పరిణామాత్మక ప్రభావాలు నిజంగానే అద్భుతంగా శోభిల్లుతాయి కదా! ఇలా రాముని సేవలో కనపడిన కార్యాలను చూచి అందరూ చాల సంతృప్తి చెందారు. భగవంతుని సేవకు, ఆయన దర్శనానికి మధ్య తేడా ఏమీ వుండదు. ఆయనను చేరుకోవాలంటే ఆయనను సేవించడమే సరైన మార్గం. ఆయన్ను చూడాలని ప్రయత్నించేకంటే ఆయనే మనలను చూడాలనిపించేటంతటి చిత్తశుద్ధితో ఆయనను సేవించటం అవసరం.

మరునాటి ఉదయం భరతుడు సుమంత్రుణ్ణి రథం తీసికొని రమ్మని ఆదేశించగానే, అతను పెద్ద సైన్యంతో బయలుదేరి వచ్చాడు. భరతుని నాయకత్వంలో నడపబడుతున్న ఆ బృందంలో రామునికే అంకితులైన రథికులు, అరవై వేల రథాలు, లక్షమంది అశ్వికులు, తొమ్మిదివేల గజాలు ఉన్నాయి. అన్నీ అలంకృతమై ఉన్నాయి. రాముని అడవుల నుండి తిరిగి తీసికొని రావాలనే ఆశతో కౌసల్య, సుమిత్ర, కైకేయి రథాలను అధిరోహించి వచ్చారు. రాముణ్ణి చూడాలనే ఉత్సాహంతో అనేకమంది పురజనులు కూడ భరతుని వెంట బయలుదేరారు.

పౌరులంతా దివ్యలోకవాసుల్లాగా అలంకరణలతో వెలుగులు చిమ్ముతున్నారు. కారణం తమ రాముణ్ణి భరతుడు తిరిగి తీసికొని వస్తాడనే ఆశ వారిలో మిక్కుటమైంది. భరతుడు, అతని బృందం వారంతా గంగాతీరం చేరి, ఆ రాత్రి అక్కడే గడపటానికి నిర్ణయించుకొన్నారు. భరతుడు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తన తండ్రికి గంగాజలంతో తర్పణం విడిచాడు. సైన్యంతో వస్తున్న భరతుణ్ణి గుహుడు చూచి, రామునిపై దండయాత్రకు వస్తున్నారేమోనని అనుమానించాడు. అందుచేత అతడు తన సహచరులను హెచ్చరించాడు. 'మనం రాముని సహచరులం. ప్రమాదం వస్తే, మనం ఎదుర్కోవాలి. అయిదు వందల నావలను సిద్ధం చేయండి. ఒక్కొక్క నావలో వందమంది సైనికులు వుండే ఏర్పాటు చేయండి. అవసరమైతే, భరతుడు గంగానదిని దాటకుండా, మనం మన సైన్యంతో అడ్డుకోవాలి' అని అన్నాడు. భరతుని మనస్సులోని ఆలోచనలను గ్రహించకుండానే, గుహుడు అనేక కానుకలతో భరతుని కలుసుకోవటానికి వెళ్ళాడు. గుహుని రాకను సుమంత్రుడు గమనించి, భరతునితో 'ఈ నిషాద రాజు రాముని స్నేహితు'డని భరతునికి చెప్పాడు. గుహుడు రాగానే, భరతుడు సకల అతిథి మర్యాదలు చేసి, భరద్వాజుని ఆశ్రమానికి మార్గమేది అని ప్రశ్నించాడు. అందుకు గుహుడు 'నీకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా వెళ్ళే మార్గాన్ని నేను చూపుతాను. నీవు నిశ్చింతగా వెళ్ళవచ్చు. అయితే నీవు రాముణ్ణి కలవడానికి నీ ఉద్దేశం ఏమిటో నిజంగా చెప్పు. ఇంత పెద్ద సైన్యంతో రావటం చూచిన నాకు నీవు యుద్ధం చేయటానికి వచ్చావనిపిస్తోంది' అని అన్నాడు.

భరతుడు అపుడు 'ప్రియమైన గుహా! నీ ఆరోపణ నాకు బాధను కలిగిస్తోంది. రాముని బ్రతిమలాడి, తిరిగి అయోధ్యకు తీసికొని పోయి, సింహసనాధిష్టుని చేయటానికే నేను వచ్చాను. దయచేసి నామాట నమ్ము.'

అని అన్నాడు.

సూర్యాస్తమయం కావటంతో, అందరూ విశ్రమించారు. భరతుడు శయ్యపై పడుకొని వుండగా, గుహుడు అతని వద్దకు చేరి, 'రాముడు సీతాలక్ష్మణులతో ఇక్కడికి వచ్చినపుడు, మేము తయారుచేసిన ఎండుటాకుల శయ్యపై వారు విశ్రమిచారు. సీతారాములు నిద్రించగా, లక్ష్మణునితో పాటు నేను మేలుకొని వుండి రక్షణ కార్యాన్ని నిర్వహించాము రాత్రంతా. రాముడు కష్టపడుతున్న కాలం లక్ష్మణుడు ఏ సౌకర్యానికీ అంగీకరించ లేదు. మరురోజు రామలక్ష్మణులు వటవృక్షపు జిగురుతో తమ శిరోజాలను జడలు కట్టుకొని, గంగానదిని దాటారు' అని చెప్పాడు. రాముని విషయం చెప్పగానే, భరతుడు అమితంగా దుఃఖించాడు. రాముడు అయోధ్యకు తిరిగి రాడేమోనని భయపడ్డాడు. ఈ ఆలోచనలతో వివశుడై భరతుడు సొమ్మసిల్లి పడిపోయాడు. దగ్గరలోనే ఉన్న కౌసల్య అతని సాయానికి వచ్చింది. గంట తర్వాత భరతుడు తెప్పరిల్లాడు. కౌసల్యతో 'అమ్మా! రాముని గురించిన ఏ దుర్వార్త వల్ల నేను సొమ్మసిల్ల లేదు. నాకు అది కారణం కా'దని చెప్పి, ఆమె భయాన్ని దూరం చేశాడు.

భరతుడు అడుగుతుండగా, గుహుడు రాముడు చేసిన పనులన్నింటినీ వివరించసాగాడు. తర్వాత గుహుడు భరత, శత్రుఘ్నులను వారి తల్లులను సీతారాములు నిద్రించిన చోటికి తీసికొని వెళ్ళాడు. వారు నిద్రించిన తృణశయ్యను చూచి, వారు విలపించారు. రాముని రాజభోగం ముందు ఇపుడు ఇలా ఉండటం వారు భరించలేక పోయారు. ఈ కష్టాలన్నింటికి తానే కారణమనుకొంటున్న భరతుడు మరీ దుఃఖించసాగాడు. తానూ రాముని స్థానంలో ప్రవాసం చేయాలని, జడలు కట్టించుకోవాలని నిశ్చయించుకొన్నాడు భరతుడు. అలాగే నారవస్త్రాలతో, జడలతో అలంకరించుకొన్న భరతుడు గంగానదిని దాటించమని గుహుని కోరాడు. ఏనుగులు ఈదుతూ నదిని దాటాయి. సైనికులను, అశ్వాలను నావల్లో దాటించారు. అందరూ సురక్షితంగా గంగానది దాటగా, భరతుడు నావ దిగి, గుహుని మార్గదర్శనంతో భరద్వాజుని ఆశ్రమం వైపు పోసాగారు. ఆశ్రమానికి రెండు మైళ్ళ దూరంలోనే, భరతుడు తన సైన్యాన్ని నిలిపి వేసి, అక్కడినుండి వశిష్ఠునితో, శత్రుఘ్నునితో కాలినడకన ముందుకు సాగారు. వశిష్ఠుని రాకను గ్రహించిన భరద్వాజుడు లేచి, స్వాగతం పలికారు. భరద్వాజుడు అయోధ్య క్షేమసమాచారాలను గురించి అడిగి తెలుసుకున్నాడు. భరతుని మనోభావాలను తెలుసుకోవాలనుకొన్నాడు. 'ఓ రాకుమారా! నీవు ఏ పని మీద ఈ అడవులకు వచ్చావో దయచేసి నాకు చెప్పు. రామునికి కీడు తలపెట్టని తలంపుతో వచ్చి ఉంటావని భావిస్తున్నాను.' అని అన్నాడు. ఆయన పలుకులకు వ్యధచెంది, భరతుడు అశ్రునేత్రాలతో 'నా అంతరంగంలోని భావాలను అపార్థం చేసుకొన్నందుకు బాధగా ఉంది. రాజ్యపాలన చేయడానికి శ్రీరాముని ఒప్పించి, తిరిగి తీసికొని వెళ్ళుటకే నేను వచ్చానని దయచేసి నమ్మండి. ఋషిసత్తమా! దయచేసి, రాముడు ఎక్కడ ఉన్నాడో నాకు చూపించండి' అని అడిగాడు.

అందుకు భరద్వాజుడు 'రాకుమారా! నీ యదార్ధ మనోభావాల్ని నేను ముందుగానే నా యోగశక్తితో గ్రహించాను. లాంఛనంగా పరీక్షించాను. అంతే. శ్రీరాముడు చిత్రకూట పర్వతం దగ్గర ఉంటున్నాడు. ఈ రాత్రికి ఇక్కడే ఉండు. నీ ప్రయాణం రేపు కొనసాగించవచ్చు.' అని బదులు చెప్పాడు.

భరతుడు భరద్వాజుని ఆతిథ్యానికి ఒప్పుకొన్నాడు. మొత్తం సైన్యానికి కూడ ఆతిథ్యం ఇవ్వదలచి, పిలిపించమని భరద్వాజుడు కోరాడు. సైనికులు తమ ఆశ్రమానికి వచ్చిన మీదట, భరద్వాజుడు విశ్వకర్మతో పాటు ఇంద్రుడు, యమరాజు, వరుణుడు, కుబేరుల నేతృత్వంలోని ఇతర దేవతలను కూడ ఆహ్వానించి, ఆవాహనచేశ్రే

తన అతిథులకు గొప్ప విందు ఇవ్వటానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చేయించవలసిందిగా వారిని ప్రార్థించాడు.

తక్షణమే మందమారుతం వీయసాగింది. స్వర్గం నుండి పూలవర్షం కురుస్తుండగా, దేవదుందుభులు ధ్వనించసగాయి. గంధర్వుల గానాలు, అప్సరసల నాట్యాలు కొనసాగాయి. విశ్వకర్మ యొక్క ఏర్పాటు ప్రకారం, నలభై మైళ్ళ వ్యాసార్థంతో, ఆ ప్రాంతమంతా క్షణాల మీద ఫల, పుష్ప, ఉద్యానవనాలతో నిండిపోయింది. గదులు, అశ్వశాలలు, గజశాలలు ప్రత్యక్షమైనాయి. సకల సౌకర్యాలతో, సామగ్రితో, ఆహార పదార్థాలతో, భోగ్యవస్తువులతో సకల సుసంపన్నమైన ఒక రాజ ప్రాసాదం కూడ వెలసిందక్కడ.

భరతుడు సచివులతో, పురజనులతో, ఆ ప్రాసాదంలోనికి ప్రవేశించాడు. అక్కడి రాజసింహాసనాన్ని చూచి, దానిమీద రాముడే వేంచేసి ఉన్నాడనే భ్రమతో రాముణ్ణి ధ్యానించాడు. సింహాసనానికి ప్రదక్షిణం చేసి అంజలి ఘటించాడు. అంతట అతను ఒక చామరాన్ని చేతిలో తీసికొని, ప్రధాన సచివునకు ఉద్దేశింబడిన పీఠంపై ఆసీనుడు కాగా, తక్కినవారంతా తమ తమ స్థానాల్లో ఆసీనులైనారు.

ఈలోగా భరద్వాజుడు తన మాయాశక్తిని ప్రయోగించి, ఒక పాయస స్రవంతిని సృష్టించి, దానిని తన ఆశ్రమం గుండా ప్రవహింపచేవాడు. బ్రహ్మదేవుడు, కుబేరుడు ఒక్కొక్కరు 20 వేల మంది చొప్పున యువతులను పంపించారు. వారు ఆలింగనం చేస్తే ఆలు, మనస్సులు క్షణంలో ఉన్మాదానికి గురికాలదు. రాముని మహిమను గానం చేయడానికి గంధర్వ ముఖ్యులు రాగా, వారికి సహకరించటానికి భరద్వాజుడు, దివ్య వృక్షాలను రప్పించాడు. వారందరు భరతుణ్ణి అలాగ వినోదింప చేస్తున్నారు. సైనికులను నిర్లక్ష్యం చేయలేదు. సైనికులను మద్యం సేవించమని, పాయసం భుజించమని రమణులు కోరుతున్నారు. యువతులు, పురుషులకు తైలమర్ధన చేసి, జలస్నానం చేయిస్తున్నారు. మరికొందరు యువతులు సైనికులకు మద్యం అందిస్తూ, వారికి సంతోషం కలిగిస్తున్నారు. అశ్వాలకు కూడ మంచి పోషకాహారాన్ని తినిపిస్తున్నారు. మత్తులో మునిగిన సైనికులు స్వర్గమంటే ఇదేనని భావిస్తున్నారు. అయోధ్య గాని, అడవులు గాని వారికి పట్టడం లేదు. ఆ విధంగా సైనికులు అప్సరసల సాంగత్యంలో అన్ని రకాల సౌఖ్యాలను అనుభవిస్తున్నారు. వేలాదిమంది సైనికులు పాడుతూ, నాట్యం చేస్తూ, పరుగెత్తుతూ ఆనందంలో మునిగి తేలుతున్నట్లు కనిపించింది. ఆ రాత్రి వారికి ఈ ఆనందాలతో అతివేగంగా గడచిపోయి నట్లనిపించింది.

సూర్యోదయం కాగానే అప్సరసలు, గంధర్వులు, దివ్య వృక్షాలు అంతా భరద్వాజుని వద్ద శలవు తీసుకొని, తమ తమ స్థలాలకు తిరిగి చేరుకున్నాయి. తరువాత భరతుడు తన తల్లులను తోడ్కొని చిత్రకూటానికి వెళ్ళడానికి గుర్తులు చెపుతున్నాడు. భరద్వాజుని సమీపించిన ముగ్గురు స్త్రీలు ప్రణామం చేయటానికి ప్రయత్నించగా, వారిని గురించి భరతుడు భరద్వాజునితో 'ఈమె రాముని తల్లి కౌసల్య, నా తండ్రి భార్యలలో జ్యేష్ఠురాలు, ఆమె సుమిత్ర లక్ష్మణ, శత్రుఘ్నుల తల్లి, ఇకపోతే ఈ క్రూరురాలు, వంచకి, పాతకి, అశిష్టురాలు అయిన మూడవ భార్య కైకేయి, ఈమె నా తల్లి. రాముని ప్రవాసానికి కారకురాలైన ఈ దుర్మార్గురాలే మా ఈ కష్టాలన్నింటికి కారకురాలయింది.' అని వివరించాడు. అంతట భరద్వాజుడు భరతునితో 'నీవు నీ తల్లిని నేరస్తురాలిగా పరిగణించరాదు. రాముని ప్రవాసానికి ఒక బలమైన, ఉన్నతమైన కారణం ఉంది. అది అలా సకల జీవరాసుల యొక్క ప్రయోజనం, శ్రేయస్సు కోసం, సుఖసంతోషాల కోసం ఉద్దేశించబడింది.' అని చెప్పాడు.

ఆ తరువాత, భరతుడు భరద్వాజునికి ప్రదక్షిణ, నమస్కారాలు ఆచరించి తన సైన్యాన్ని బయలుదేరమని

ఆజ్ఞాపించాడు. రథ, గజ, తురగ, పదాతిదళాలు ముందు నడువగా, వన్యమృగాలు పలాయనం చిత్తగించాయి.

చివరకు చిత్రకూటం దృగ్గోచరం కాగా, భరతుడు రాముని కుటీరం ఎక్కడుందో చూడమని రక్షకులను ఆజ్ఞాపించాడు. కొద్దిదూరంలో పొగ వస్తుండటం చూచి సైనికులు సంతోషించారు. సైన్యాల్ని అక్కడికి చేరుకోమని చెప్పి, భరతుడు, వశిష్ఠునితోను, సుమంత్రునితోను, కొద్దిమంది ఇతరులతోనూ నడుచుకొంటూ రాముని కుటీరాన్ని సమీపించాడు.

చిత్రకూటం వద్ద 3 నెలలుగా నివసిస్తున్న రాముడు పర్వతపాదం వద్ద ఒక పెద్ద శిలపై కూర్చొని సీతతో కాలక్షేపం చేస్తున్నాడు. ఋషులు భుజించే కందమూలాలను, ఫలాలను గురించి వివిధ వృక్షలతల గురించి, పుష్పాల గురించి, వన్యమృగాల గురించి సీతకు వివరిస్తూ ఉన్నాడు. ప్రవాస జీవిత దుఃఖం నుండి సీతమ్మను మరల్చి, సంతోష పెట్టడానికి చేయగలిగినదంతా రాముడు చేస్తున్నాడు. అక్కడ రమ్యమైన పుష్పాలతో, వృక్షాలతో శోభిల్లుతున్న మందాకినీ నదిని చూపించాడు రాముడు సీతమ్మకు. 'ప్రియతమా! ఇలా రమణీయమైన ప్రకృతిని దర్శిస్తూ, ఆనందించడంలోనే మన ఆనందం వుంది. దుఃఖానికి కారణం ఏముంటుంది చెప్పు.' అంట సీతమ్మను రాముడు అడిగాడు.

ఇలా ఉండగా, సుదూరంలో సైన్యం వల్ల ఎగసిన ధూళిని రాముడు గమనించాడు. వన్యమృగాల అరుపులు వినసాగాడు. దానితో రాముడు లక్ష్మణునివైపు తిరిగి 'లక్ష్మణా! ఇలా ధూళిరేగటం, మృగాలు భయపడటానికి కారణం ఏమిటో కనుక్కొని రా' అని చెప్పాడు. అంతట లక్ష్మణుడు ఒక ఎత్తైన పెద్ద చెట్టు ఎక్కి చూస్తే, ఒక పెద్ద సైన్యం అటువైపు వస్తుండటాన్ని గమనించాడు. గొప్ప తత్తరపాటుతో రామునితో 'ఒక పెద్ద సైన్యం ఇటు వస్తోంది. ఆ నిప్పును ఆర్పివేయి. సీతను కుటీరంలో దాచిపెట్టు. మన ఆయుధాలు తీసికొని రా. వాళ్ళను ఎదుర్కోవటానికి మనం సిద్ధంగా ఉండాలి' అని చెప్పాడు. అంతట రాముడు సోదరునితో 'వారి రథ ధ్వజాలు పరిశీలించు. ఎవరి సైన్యం వస్తుందో మనం తెలుసుకోవచ్చు' అని బదులు పలికాడు. చిహ్నాల బట్టి, అది తన సోదరుడి సైన్యమేనని గుర్తుపట్టి, రాముని ఉద్దేశించి ఇలా కేక పెట్టాడు. 'వాడు భరతుడే. పూర్తి సార్వభౌమత్వాన్ని అనుభవించాలనే వుద్దేశంతో మనల్ని చంపాలని వస్తున్నట్లున్నాడు. గొప్ప సైన్యంతోనే వస్తున్నాడు. మనం కూడ మన ఆయుధాలు తీసికొని, పర్వత శిఖరాలపై నిలిచి వారితో యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలి. మనం అలాంటి దుర్మార్గుడితో తలపడటం మన అదృష్టమనే చెప్పాలి. తక్షణమే భరతుణ్ణి సంహరంచటానికి వెనుకరాడు. ఆ తర్వాత నేను కైకేయిని, ఆమె బంధులందరిని చంపి, ఆమె పాపాలకు తగిన ప్రాయశ్చిత్తం చేసి ఆమెను రూపుమాపుతాను.' అని ఇలా ఆగ్రహావేశుడైన లక్ష్మణుని వారిస్తూ, రాముడు 'భరతుడు నన్ను చూడాలనే గొప్ప ఉత్సాహంతో ఇక్కడికి వస్తున్నట్లున్నాడు. ఈ ధనుర్బాణాలతో అవసరమే లేదు. లక్ష్మణా! రాజ్యాన్ని నాకు అప్పగించడానికే అతడు ఇక్కడికి వస్తున్నాడని నా అభిప్రాయం. నీవే రాజ్యాన్ని కోరుకుంటే ఆ మాటే నాతో చెప్పు. నేను భరతుడికి చెప్పి, ఆ రాజ్యాన్ని నీకే ఇప్పిస్తాను.' అని అన్నాడు. అలా రామునితో మందలించబడిన లక్ష్మణుడు సిగ్గుతో తలదించుకొని 'మనల్ని చూడటం కోసం మన తండ్రి వస్తున్నాడేమోనని ఆశించాను. కాని ఆయనకు ప్రియమైన ఏనుగు కనిపించినప్పటికీ, దానిమీద ఉండే శ్వేతఛత్రం లేకపోడంతో, ఆయన రాలేదని అనుకొన్నాను' అని అన్నాడు.

అంతట లక్ష్మణుడు చెట్టు దిగివచ్చి, సీతారాములతో కలిసి కుటీరానికి తిరిగి వచ్చాడు. ఆ సమయానికి భరతుడు ఆశ్రమం చుట్టూ వున్న అరణ్యంలోనికి ప్రవేశించాడు. భరతుడికి ధూళి కనిపించగా, అది రాముని

కుటీరమై ఉంటుందని, ఆ దిశగా మళ్ళాడు.

భరతుడు ప్రయాణిస్తుండగా వెనుక గుహుడు, శత్రుఘ్నుడు తదితరులు అనుసరించారు. వశిష్ఠుడు ముగ్గురు తల్లులను వెంటబెట్టుకొని వస్తున్నాడు. భరతుడు చివరకు ఒక పరిశుభ్ర ప్రాంతానికి చేరి, అక్కడ కుటీరాన్ని, రామలక్ష్మణుల ధనస్సులను, ఎదుట గల యజ్ఞ వేదికను శోభాయమానంగా కల్పించిన రీతిలో చూచాడు.

భరతుడు రాముణ్ణి చూడగానే, ఆవేశంతో, ఆవేదనతో, అశ్రుపూరిత నయనాలతో వేగంగా ముందుకు సాగివచ్చి 'ఓ రామా! ఏమిటీ కేశపాశం, నారవస్త్రాలు, అరణ్యంలో నీ పాదాలను చూడటం నాకెంత బాధాకరమో కదా!' ఇలా రాజభోగాలను వదలి అరణ్యవాస కష్టాలను అనుభవించటానికి నేనే కారణ'మని అంటూ విలపించ సాగాడు. రాముని పాదాలను స్పృశించుటకు వచ్చిన భరతుడు సొమ్మసిల్లి పడిపోయాడు. రాముడు అతన్ని లేపి, అతను కూడ నారవస్త్రాలు ధరించటం చూచి కలత చెందాడు. భరతుని వలెనే శత్రుఘ్నుని కూడ రాముడు కౌగిలించుకొన్నాడు. భరతుణ్ణి తన ఒడిలోనికి తీసికొని, రాముడు 'ప్రియ సోదరా! మన తండ్రిని వంటరిగా వదలివేసి ఇక్కడకు ఎందుకు వచ్చావు? మన తల్లుల గురించి, పురజనులను గురించిన విశేషాలు చెప్పు' అని అన్నాడు.

రాముడు అందరూ వినే విధంగా భరతుణ్ణి ఇలా ప్రశ్నించాడు. 'ప్రియమైన భరతా! ధర్మబద్ధమైన రాజ్యం తప్పక వృద్ధి చెందుతుంది. పెద్దలను, బ్రాహ్మణులను, దేవతలను సరిగా గౌరవించటం జరుగుతున్నదా? రాజ్యంలోని స్త్రీలకురక్షణ, గౌరవం వున్నవా? రాజులకుండే 14 రకాల బలహీనతలు – నాస్తికత్వం, క్రోధం, దీర్ఘసూత్రత, సోమరితనం, ఇంద్రియ లోలుత్వం, మంచిని తృణీకరించడం, ప్రమత్తత, దుస్సంగ ప్రియత్వం, అసాధ్య ప్రణాళికల రూపకల్పన, రహస్యాన్ని దాచలేకపోవడం, మూర్ఖుల పట్ల మమకారం, సదాచార నిర్లక్ష్యత, శత్రువులను ఎదుర్కోలేక పోవడం – అనే వాటికి దూరంగా ఉంటున్నావని ఆశిస్తున్నాను.

ప్రియ సోదరా! ఉత్సాహం, అధికారం, బుద్ధి చతురత అనే శక్తిత్రయాన్ని నీవు తెలిసి ఉన్నావా? వదరుబోతులు, దుర్భాషలాడేవారు, దురాక్రమణదారులు, అన్యాయ వర్తనులు అనే నాలుగు రకాల వారి స్నేహానికి దూరంగా ఉంటున్నావా?

బలవంతులైన రాజులు, వృద్ధులు, బహీనులైన వ్యాధిగ్రస్తులు, సింహాసనం నుండి గెంటివేయబడినవారు, పిరికిపందలు, ఆశబోతులు, ఇంద్రియలోలురు, అల్పబుద్ధులు, యుద్ధ పరాజితులు, తరచుగా విదేశయాత్రలు చేసేవారు, శత్రువులు అధికంగా ఉన్నవారు, దరిద్రులు, అధర్మపరాయణులు, మంత్రులచే నిర్లక్ష్యం చేయబడేవారు, మతిస్థిమితం లేనివారు అనే ఈ 10 రకాల రాజులతో మైత్రీబంధాలకు దూరంగా వుంటున్నావా? వేలాదిమంది అజ్ఞానులైన వారిని కలవడం కంటే, జ్ఞానియైన, నిపుణుడైన ఒక్కనితో నీవు కలవడానికి ఆసక్తి చూపుతున్నావని ఆశిస్తున్నాను. వేలాది మూర్ఖుల వల్ల ఏ ప్రయోజనం ఉండదు, ఒక సమర్థుడైన సచివుని ద్వారా గొప్ప ప్రయోజనం చేకూరగలదు. ఓ భరతా! వ్యాధిని ప్రకోపింప చేసే వైద్యుడు, యజమానికి అవమానం తేవటమే లక్ష్యంగా గల సేవకుడు, తానే రాజు కావాలని ఆశించే యోధుడు – ఇలాంటివారి పీడను రాజు వదిలించుకోకుంటే, వారు అతనిని చంపటం తథ్యం.

నీవు స్త్రీలను రక్షిస్తూ, గౌరవిస్తున్నావా? స్త్రీలపై మితిమీరిన విశ్వాసాన్ని కలిగివుండటం కాని, వారికి

రహస్యాలను వెల్లడించటం కూడ చేయడం లేదని విశ్వసిస్తున్నాను.' ఇలా చెప్పాడు రాముడు.

రాముడు భరతుని జడలను చూచిన తర్వాత, తనమీద ప్రేమచేతనే అతను అలా చేశాడని భావించాడు. భరతుణ్ణి ఆలింగనం చేసుకొని 'ప్రియ భరతా! నీవెందుకు రాజ్యాన్ని వదలి, తాపసి వేషంలో ఇక్కడికి వచ్చావు?' అని రాముడు ప్రశ్నించగా, భరతుడు 'రామా! నాకు తెలియకుండానే, నా తల్లి కుట్రలు పన్నటం, అమలు జరగటం జరిగింది. నీవే అసలైన వారసుడవని నాకు తెలుసు. అందువల్ల నీవు వెంటనే అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యాన్ని ఏలుకో అని వేడుకొనటానికే వచ్చాను. నీవు లేనందున అయోధ్యలో మొత్తం స్తంభించి పోయింది.' అని అన్నాడు. మిక్కిలి అనురాగంతో ప్రార్థిస్తూ భరతుడు శ్రీరాముని పాదాలను పట్టుకొని, తన తలపై ఉంచుకొన్నాడు. రాముడు భరతుణ్ణి పైకి లేవనెత్తి 'నన్ను అడవులకు పంపించటంలో నీ పాత్ర ఏమీ లేదు. నాకు తెలుసు. కాని పాపమార్గంలో సింహాసనాన్ని పొందే కోరిక నాకు లేదు. నీ తల్లిని గాని, తండ్రిని గాని నిరసించరాదు. ఎందుకంటే వారు తమకు న్యాయమైన రీతిలోనే వ్యవహరించారు. అందువల్ల నీవు సింహాసనాన్ని అధిష్టించి, రాజ్యాన్ని పాలించాలి. నీ తండ్రి కోరిక అదే. తండ్రి ఆజ్ఞయే పరమోత్తమమైన ధర్మసూత్రంగా నేను పరిగణిస్తాను. కనుక నేను 14 సం॥లు అరణ్యంలోనే గడపాలనే కృతనిశ్చయంతో ఉన్నాను.' అని అన్నాడు.

కాని భరతుడు అందుకు అభ్యంతరం చెప్తూ, 'జ్యేష్ఠ కుమారుడు వారసుడై ఉండగా, వేరెవరూ రాజు కాలేరు. అందుచేత తండ్రికి జలతర్పణం సమర్పించి, అయోధ్యకు వచ్చి, సింహాసనాన్ని అధిష్టించాలి.' అన్నాడు.

దశరథుడు మరణించినట్లు వినగానే రాముడు మూర్ఛిల్లి నేలపై పడిపోయాడు. సీత, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు ఆయన మీద నీళ్ళను చిలికించిన తర్వాతనే ఆయన స్పృహలోనికి వచ్చాడు. రాముడు విలపించి తాను ఇక తండ్రిలేని అయోధ్యకు రానే రాను అని రాముడు ప్రకటించాడు. సామాన్య మానవునిగా విలపించినా, రాముడు లోకాతీత మహామూర్తిగా కనిపించాడు.

*భగవంతుడు, ఆయన దేహం, లీలలు ఎన్నటికీ సాధారణమైనవి, ఖ్యాతికెక్కినవి కానే కావు. తన అవతారం, కార్యకలాపాలు, అవతార సమాప్తి అనే వాటి యొక్క మరణ చక్రం నుండి విముక్తి పొదగలదని శ్రీకృష్ణుడు భగవద్గీతలో వెల్లడించాడు. ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుచేసుకొందాం. శ్రీకృష్ణుడు కూడ తన తండ్రి వసుదవుడు వధించబడ్డాడనే వార్త తనకు చెప్పినపుడు, అలాంటి ప్రతిక్రియనే ప్రదర్శించాడని గమనిద్దాం. ఆ సమయంలో ఆయన దుఃఖోద్వేగంతో క్రింద పడిపోయాడు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఇరువురూ శ్రీమన్నారాయణుని అంశలే అయినప్పటికీ, కొన్ని సందర్భాలలో వారు దిగ్భ్రాంతి చెందినట్లు కనిపిస్తారు. ఎందుచేత? విలాపం, దిగ్భ్రాంతి అనేవి బద్ధజీవుల లక్షణాలు. జ్ఞానం, శక్తి సహా సకల ఐశ్వర్య ప్రపూర్ణుడైన భగవంతునిలో ఆ లక్షణాలు ఎలా ఉంటాయి? ఇదొక వివాదాస్పద అంశం. నిజానికి భగవంతుడు ఎన్నటికీ మోసపోవటంగాని, భ్రమకు లోబడటం కాని ఉండదు కాని మానవుని పాత్ర పోషిస్తున్నపుడు, సాధారణ మానవుని ఉద్వేగాలను ప్రదర్శిస్తూ, సంపూర్ణ మానవునిగా దర్శనమిస్తాడు. భగవంతుడికి సేవచేసే ఋషులందరూ శరీర భావాలనుండి ముక్తులవుతారు. అలాంటప్పుడు, స్వయంగా భగవంతుడే దేహంతో ఆత్మను తాదాత్మ్యం చెందేట్లు ఎలా పడతాడు? ఆయన దుఃఖం కూడ ఆయన తన యొక్క స్వచ్ఛమైన, అపరిమితమైన, దురవగాహనయైన వ్యక్తిత్వం యొక్క మరొక ముఖ ననని, మరొక ఐశ్వర్యమేనని స్పష్టమౌతుంది.*

ఆ తర్వాత రాముడు తన సోదరులతో కలిసి గంగాతీరానికి వెళ్ళి, తమ తండ్రికి జలతర్పణం విడిచాడు.

అందరూ చిత్రకూట పర్వతం మీది కుటీరానికి తిరిగారాగా ఆ నలుగురు దుఃఖంతో రోదించారు.

ఆ రోదనా స్వరం లోయ అంతటా ప్రతిధ్వనించింది. సైనికులు తండ్రి మరణ దుఃఖాన్ని బట్టి, సోదరులు రోదిస్తున్నారని గ్రహించారు. సైనికులు కూడ రాముణ్ణి చూడాలనే కుతూహలంతో ఉన్నారు గనుక వారు ఆ రోదన దిశగా పరుగులు తీశారు. అశ్రుపూరిత నయనాలతో సైనికులు రామునికి అభివాదం చేశారు. రాముడు కూడ వారిని స్వాగతించాడు.

ఈలోగా వశిష్ఠుడు దశరథుని ముగ్గురు భార్యలను తీసుకొని వేగంగా రాముని చూడగోరి వచ్చారు. వారు మందాకినీ తీరానికి చేరిన సమయంలో అక్కడ రాముడు వదలిన వనస్థలి అవశేషాలను వారు చూచారు. రాముని వద్ద ఆహారంగా ఉన్నది ఒక అరణ్య స్థలపు గుజ్జు మాత్రమేనని గ్రహించిన కౌసల్య బాధపడింది. ఒక వ్యక్తి పూజించే దేవతలు అతను తిని జీవించే ఆహారాన్నే తీసుకొనవలసి ఉంటుందనే వచనం రాముని సత్యానికి తార్కాణ ఇదే అని ఆమె ఆశ్చర్యంతో అనుకున్నది.

వశిష్ఠుడు, ముగ్గురు తల్లులు రాముని కుటీరానికి చేరి, రాముని చూచి వారు చాల బాధపడ్డారు. రాముడు వారికి దివినుండి దిగివచ్చిన దేవతామూర్తిలా కన్పించాడు. రాముడు వెంటనే లేచివచ్చి తమ తల్లుల పాదాలను స్పృశించాడు. వారికి నమస్కరిస్తుండగా, ముగ్గురు తల్లులు రాముని వీపు మీద ఉన్న ధూళిని తుడుస్తున్నారు. అలాగే సీత, లక్ష్మణుడు కూడా ఆ తల్లుల పాదాలకు నమస్కరించారు. కౌసల్య సీతను ఆలింగనం చేసుకోగా, రాముడు వశిష్ఠుని పాదాలకు నమస్కరించాడు. అంతట రాముడు తన గురువుతో పాటు క్రింద కూర్చొనగా మిగిలిన వారంతా చుట్టూ కూర్చొన్నారు. అపుడు భరతుడు రామునితో 'కోసల రాజ్యాన్ని నీకు తిరిగి ఇచ్చివేయ దలచాను' అని అన్నాడు. అక్కడి వారంతా హర్షించినప్పటికీ, రాముడు 'ప్రియమైన భరతా! ఈ లోకంలో ఎవరూ స్వతంత్రంగా వ్యవహరించ లేరు. నిరంతర కాలనిర్ణయం క్రింద అన్నీ చివరకు పరాజయం చెందుతాయి. కనుక వివేకవంతుడు ఎవడూ ఈ పరిణామాలకు విలపించడు. కుటుంబాలు, సమాజాలు స్వల్పకాలం కలుసుకొని, తర్వాత తమ తమ గమ్యాలకు వెళ్ళిపోవటం జరుగుతుంది. ఇది సహజం. కనుక సంయోగం వియోగంలోనే అంతమవుతుంది. మానవుడు బలహీనుడై, వృద్ధుడై, చివరకు మృత్యువాత పడతాడు.

నది తన మూల స్థానానికి చేరలేక పోయినట్లే, ప్రతి మానవుడు తమ తండ్రితాతల పథంలో సాగిపోక తప్పదు. తానే మరణించుచున్నపుడు, ఇతరుల గురించి దుఃఖించడ మెందుకు? సూర్యుడు ఉదయించి ఆనందిస్తాడు, అస్తమించినపుడూ ఆనందిస్తాడు. తన ఆయువు కొంత నష్టమై పోయిందని మరణానికి దగ్గర అయినానని అనుకోడు. వివేకవంతుడు, జ్ఞాని తన మరణానంతరం ఉన్నత స్థితిని పొందుటకై, ఒక ధర్మాచరణకై పాటుపడాలి. కాన తండ్రి దివ్యసుఖాలు అనుభవించడం కోసం ఈ జరాగ్రస్త దేహాన్ని విడిచాడు. కనుక ఆయన కోసం శోకించ పనిలేదు. భరతా! నీవు వెంటనే అయోధ్యకు వెళ్ళి, తండ్రిగారి ఆజ్ఞను పాటించు. ఆయన కోరిక మేరకే నేను ఇక్కడ ఉంటాను.' అని బదులు ఇచ్చాడు రాముడు. అపుడు భరతుడు 'మన తండ్రి వృద్ధాప్యంలో కామేచ్ఛ తీవ్రత వల్ల కలిగించిన కీడును నీవు సరిదిద్ది అయోధ్యకు రావాలి. నీవొక క్షత్రియుడవు. తాపసి వలె గాక పాలకుని వలె వర్తించుటయే నీ ధర్మం, కర్తవ్యం. సర్వోత్తమ గృహస్థాశ్రమాన్ని స్వీకరించిన వాడవు. నీ కుటుంబ జీవన విధులను ఎందుకు వదలివేస్తున్నావు? నీవు అయోధ్యకు రావడానికి నిరాకరిస్తే, నేనూ అదే చేస్తాను. లక్ష్మణుని వలె నేను కూడ నీతోనే అడవిలో ఉండిపోతాను' అని వాదించాడు భరతుడు. సమాధానంగా రాముడు

'భరతా! మన తండ్రిని కామపిశాచి అని నిందిస్తున్నావు. కైకేయిని తండ్రి వివాహమాడినపుడు, ఆమె పుత్రుడే చక్రవర్తి అయ్యే విధంగా వాగ్దానం చేయించాడు. భరతా! మన తండ్రి వాగ్దానానికి అనుకూలంగా నీవు అయోధ్య వెళ్ళు. రాజ్యపాలనా బాధ్యతలను, నా కోసమే, నీవు నిర్వహించాలి. తప్పదు.' అని అన్నాడు.

ఈ విషయాలన్నీ వినిన జాబాలి అనే పేరుగల మహర్షి ఇలా చెప్పటం మొదలు పెట్టాడు. 'ఓ రాకుమారా! జీవి అనేది రేతస్సు. అండము యొక్క సంయోగమే తప్ప, అంతకు మించి మరేమీ లేదు. జీవికి తండ్రి ఫలప్రద కారణం అయితే తల్లి భౌతిక కారణం. ఒక వ్యక్తి మరణించినపుడు మళ్ళీ అతను మట్టిగా మారుతున్నాడు. కనుక అంతా అణువుల సమ్మేళనమే కాని మరేమీ కాదు. తల్లి, తండ్రి, పుత్రులు ఇలా పిలుచుకొనేవారితో నిజానికి మనకే సంబంధమూ లేదు. రామా! నీ తండ్రి కోసం నీవెందుకు బాధపడాలి? కర్మకాండల ప్రయోజనం ఏమిటి? మరణించినవాడు వచ్చి తినగలడా? మనం ప్రత్యక్షంగా చూచేదే నిజమైనది. కనుక ప్రియ రామా! భరతుని నుండి నీవు రాజ్యాన్ని స్వీకరించి, రాజభోగాలను అనుభవించాలి.' అని నిందాత్మక తత్వాన్ని విన్న రాముడు కోపంతో 'నీ ఆలోచనలు అపవిత్రమైనవి. పచ్చి అజ్ఞాన చర్యలు. యదార్థ జ్ఞానం ఆత్మ సాక్షాత్కారానికి దారితీస్తుంది. విషయానందం కేవలం విశృంఖలతకు దారి తీస్తుంది. సత్యమే పరమధర్మం. నేను ఇంద్రియ భోగాలకు అతీతునిగా నా తండ్రి ఆజ్ఞకు కట్టుబడి ఉంటాను. ఈ భూమి కర్మక్షేత్రం. పవిత్రమైన మానవ జన్మ లభించినందున పవిత్ర కర్మలనే చేయాలి. నాస్తికభావాలున్న నిన్ను సచివునిగా పెట్టమని నా తండ్రి తప్పుచేశాడు. నాస్తికుల ముఖాన్ని కూడ చూడతగదని వేదాలు ఘోషిస్తున్నాయి.' అని సమాధానం చెప్పాడు రాముడు.

అప్పుడు జాబాలి ఇలా జవాబు ఇచ్చాడు. 'నేను నిజానికి వేదాలను అనుసరించే వాడినే. భగవంతుని అస్తిత్వంలో నాకు దృఢవిశ్వాసం ఉంది. నిన్ను ఎలాగైనా అయోధ్యకు రప్పించాలనే ఆశతో నేను ఆ విధంగా మాట్లాడాను.' అని అంగీకరించాడు. జాబాలి ప్రసంగానికి ఆందోళన పడిన రాముని గమనించి, వశిష్ఠుడు జోక్యం చేసుకొంటూ నీవు తిరిగి అయోధ్యకు తిరిగి రావాలని ప్రతి ఒక్కరూ కోరుకొంటున్న విషయం జాబాలికి తెలుసు. అందుచేతనే అతడు ఒక నాస్తికుడిలా ప్రవర్తించాడు. ఇక్ష్వాకు వంశంలో పూర్వం రాజులందరు తమ పెద్ద కుమారులకే రాజ్యాభిషేకం చేయడం జరిగింది. జ్యేష్ఠుడు జీవించినంత కాలం ఆ సింహాసనాన్ని వేరెవరు అధిష్ఠించ కూడదనే సూత్రం ఎప్పటినుంచో అమలులో వుంది. అందుచేత నేను కూడ నిన్ను అయోధ్యకు తిరిగి రావాలని మరోసారి వేడుకొంటున్నాను. నా ఆజ్ఞను ధిక్కరిస్తే, అధర్మానికి ఒడిగట్టినట్లే అవుతుందన్న సంగతి నీవు తెలుసుకోవాలి. తల్లిదండ్రుల ఆజ్ఞకంటే, గురువు ఆజ్ఞ ప్రాముఖ్యత కలది.' అని చెప్పాడు.

కాని రాముడు తల్లిదండ్రుల తర్వాతే ఎవరైనా అనే నిశ్చయంతో దృఢంగా ఉన్నాడు. భరతుడు తన విజ్ఞాపనం విఫలమైనదని గ్రహించి, సుమంత్రునితో ఇలా అన్నాడు. 'రాముని కుటీరం వద్ద కృశతృణాన్ని పరచిపెట్టు. రాముడు ఇష్టపడి, సింహాసనాన్ని స్వీకరించే దాకా ఆహారాన్ని తీసుకోకుండా కళ్ళకు గంతటు కట్టుకుని కూర్చుంటాను.' అని అన్నాడే కాని సుమంత్రుడు రాముని ఆజ్ఞ లేనిదే ఏమీ చేయడు. అందుచేత భరతుడు తానే తన చేతులలో ఉన్న కృశతృణాన్ని పరచుకొని రాముని కుటీరం ఎదుట కూర్చున్నాడు. దీన్ని గమనించిన రాముడు 'ప్రియ సోదరా! ఈ ధోరణి ఎందుకు? నన్ను వ్యతిరేకించాలని ఎందుకు మొండిగా ప్రవర్తిస్తున్నావు?' అని రాముడు ప్రశ్నించాడు భరతుని.

ఆ మాటలకు చింతిల్లి, భరతుడు తన ప్రాయోపవేశ ఆలోచనను విరమించుకొన్నాడు. కాని 'నన్ను నీ బదులు ఇక్కడ అరణ్యంలో ఉండనివ్వు. నీవు అయోధ్యకు తిరిగి వెళ్ళు. దీనికైనా అంగీకరించు.' అంటే ఎంతో

దీనంగా బ్రతిమాలాడు. అదే సమయంలో ఆకాశంలో అదృశ్య దేవర్షులు వచ్చి వారి మధ్య జరుగుతున్న సంభాషణను పొగిడారు. రావణ సంహారమే మనసులో నున్న ఆ దేవర్షులు 'ఓ భరతా! నీ అన్న మాటన నీవు వినాలి' అని అన్నారు. ఇన్ని విధాల తన విన్నపం విఫలమవగా, భరతుడు తుదకు శరణాగతుడై స్వర్ణఖచితమైన పాదుకలను బయటికి తీశాడు. అంతట రాముని పాదపద్మాలను వాటిపై ఉంచమని ఆయనను ప్రార్థించాడు. భరతుడు కోరినట్టే చేసి, రాముడు ఆ పాదుకలను భరతునికి తిరిగి ఇచ్చాడు. ఆ పాదుకలను తన చేతులలో ఉంచుకొని, రామునికి ప్రణామం చేసి ఇలా అన్నాడు. 'రాజ్యపాలనా భారాన్ని ఈ పాదుకలకు అప్పగించి, నేను జడలు, నారవస్త్రాలను ధరించి, అయోధ్యకు వెలుపల ఉంటాను. రామా! నేను నీ రాకకోసం నిరీక్షిస్తూ ఫలాలను, దుంపలను మాత్రమే తింటూ జీవిస్తాను. అయితే 14 సం॥ తర్వాత నీవు అయోధ్యకు తిరిగి రాకుంటే, అప్పుడు నేను అగ్నిప్రవేశం చేసి ప్రాణాలను వదులుతాను' అని పలికాడు.

ఈ ప్రకటనకు రాముడు సమ్మతించి, భరత శత్రుఘ్నులను ఆలింగనం చేసుకొని, ప్రవాసం పూర్తి కాగాన తాను తిరిగి తప్పక వస్తానని వారికి హామీ ఇచ్చాడు. అశ్రుపూరిత నయనాలతో రాముడు సోదరులకు వీడ్కోలు పలుకుతూ, కైకేయిని నిర్లక్ష్యం చేయటం గాని, ద్వేషించటం గాని చేయవద్దని వారిని గట్టిగా కోరాడు. ఆ తరువాత రాముడు తన తల్లులు వ్యథితలై వుండగా, వారితో కూడ రాముడు మధుర వచనాలనే పలికాడు. అంతట భరతుడు రామునికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. చివరకు రాముడు అందిరినీ అయోధ్యకు బయలుదేరమని బ్రతిమాలుతూ, తాను కుటీరంలోకి వెళ్ళిపోయాడు.

భరతుడు రాముని పాదుకలను తన శిరస్సుపై ఉంచుకొని, తన రథాన్ని అధిరోహించాడు. బ్రాహ్మణులు ముందు కదలగా, శత్రుఘ్నుడు వారితో కదిలాడు. వారు అలా భరద్వాజుని ఆశ్రమం చేరుకోగా, ఆ మహర్షి భరతునితో 'నీవు రాముని చూచావా? నీ పని నెరవేరిందా?' అని ప్రశ్నించాడు. రాముడు తన ప్రవాసాన్ని ముగించిన తర్వాతనే అయోధ్యకు తిరిగి రాగలనని చెప్పాడని భరతుడు ఆయనతో చెప్పాడు.

వశిష్ఠుడు రాముని పాదుకలను ముందుకు తెచ్చి, అయోధ్య ప్రజావసరాలను నెరవర్చగల మహిమను ఆ పాదుకలకు సిద్ధింప చేయవలసినదిగా భరద్వాజుణ్ణి ప్రార్థించాడు. భరద్వాజుడు శాస్త్రోక్తంగా ఆ ప్రక్రియ పూర్తిచేసిన మీదట, భరతుడు ఆ ఋషిపుంగవుని పాదాలను పట్టుకొని, తాను బయలుదేరటానికి అనుమతి తీసుకొన్నాడు. తాను ఇంతకుముందు వచ్చిన మార్గాన్నే తిరిగి వెళ్తూ, భరతుడు చివరకు అయోధ్య పరిసరాలను చేరుకొన్నాడు. నగరపు నిర్మానుష్యాన్ని చూచి భరతుడు సుమంత్రునితో 'దేహం నుండి చేతనత్వం వెళ్ళిపోతే ఎలా ఉంటుందో, రాముడు లేని అయోధ్య ఇపుడు అలా ఉంది' అని అన్నాడు.

దశరథుని ప్రాసాదంలోనికి ప్రవేశించిన భరతుడు అది నిర్జనంగా కనిపించటం చూచి భోరున విలపించాడు. అంతట భరతుడు తాను నందిగ్రామానికి వెళిళ అక్కడ తపస్విగా జీవిస్తానని ప్రకటించాడు. సచివులు సంతోషించగ రథాన్ని తెప్పించుకొనిఅందులో భరతుడు, శత్రుఘ్నుడు బయలుదేరారు. పురజనులందరు భరతుని అనసరిస్తూ, నందిగ్రామానికి తరలివెళ్ళారు.

భరతుడు తిరిగి రాగానే ప్రథమంగా రాముడి పాదుకలను సింహాసనం మీద ప్రతిష్ఠించమని సచివులను ఆజ్ఞాపించాడు. ఆ తరువాత తన సైన్యంతో సహా నందిగ్రామంలోనే ఉంటూ భరతుడు రాజ్య వ్యవహారాలన్నింటిని తనకు బహూకరించబడిన కానుకలతో సహా రాముని పాదుకలముందే సమర్పించాడు.

భరతుడు తరచుగా రామపాదుకలపైన రాజఛత్రాన్ని పట్టుకొని, వాటిని వింజామరలతో వీస్తుండటం కనిపిస్తుండేది. పాదుకల రూపంలో అక్కడే విరాజిల్లుతున్న శ్రీరామునికి సర్వవేళల్లోనూ తాను రాముని బంటుగా భావిస్తూ భరతుడు అలాగ 14 సం॥లు రాజ్యపాలన చేశాడు.

ఈలోగా రాముడు చిత్రకూట పర్వత పరిసరాల్లో ఉన్న ఋషుల మనస్సుల్లో ఆందోళన చెలరేగటం గమనించాడు. అందుకు తానే కారణమేమోనని భావిస్తూ, వినయంతో ప్రధాన ఋషిని సమీపించి, 'ఇక్కడ ఉన్న ఋషులలో ఏదో కల్లోలం ఉన్నట్లు నాకు కనిపిస్తోంది. దానికి కారణమేమిటో దయచేసి వీలున్నట్లయితే నాకు చెప్పండి.' అని అడిగాడు.

ఆ వృద్ధ ఋషి బదులు ఇస్తూ 'ప్రియమైన రామా! నీ వల్ల ఎన్నటికీ ఏ విధమైన తప్పు ఉండజాలదు. రావణుని తమ్ముడైన ఖరుడి నాయకత్వంలోని రాక్షసుల వల్ల మాకు భయంగా ఉంది. వారు మా యజ్ఞాలను ఆటంక పరచటం, మాదేహాలను కలుషితం చేయడం మొదలైన దుర్మార్గపు పనులు చేస్తున్నారు. వాళ్ళూడపాకాండకు పూనుకొనేలాగ, మేము వేరే ప్రాంతాలకు వెళిళపోతాం. ఇక్కడికి దగ్గరలోని అశ్వముని ఆశ్రమానికి వెళ్ళాలనే ఆలోచనలో వున్నాను. నీకు ఇష్టమైతే నీవు కూడా మాతో వచ్చి అక్కడ నివాసం ఏర్పరచుకోవచ్చు.' అని అన్నాడు.

ఋషి వెళ్ళిపోవటానికైతే రాముడు అంగీకరించాడు కాని తాను మాత్రం చిత్రకూటం వద్దనే ఉంటానని చెప్పాడు. కాని తరువాత భరతుడు, తన తల్లులు స్మృతిపథంలో మెదలుతుండటంతో, రాముడికి అక్కడ ఉండటం అసౌకర్యంగా అనిపించింది. అదీకాక భరతుడి సైన్యం వదలిన కలుషితంతో ఆ ప్రాంతం సరిగా లేదని రామునికి అనిపించింది. అందువల్ల రాముడు కూడ వేరొక ప్రాంతానికి వెళ్ళాలనే నిర్ణయానికి వచ్చాడు. ఆ తరువాత రాముడు సీతలక్ష్మణుడు చిత్రకూటాన్ని వదలి అత్రి ముని ఆశ్రమానికి వెళ్ళారు. అక్కడ స్వంత బిడ్డల వలె ఋషి వాత్సల్యంతో స్వాగతం లభించింది. సీతను స్వాగతించటానికై అత్రి ముని తన వృద్ధ పత్నియైన అనసూయను పిలిచాడు. సీత ఆ తాపస స్త్రీని అతి వినయంతో సమీపించింది.

సీత ఆ తపస్వినికి ప్రణామం చేసి, ఆమె ఆరోగ్యం గురించి ప్రశ్నించింది. ధర్మాచరణకు అంకితమైన యశస్విని., ధన్యురాలైన సీతను చూచి, అనునయంగా ఇలా అన్నది. 'అదృష్టవశాత్తు, నీ దృష్టి ఎల్లప్పుడ ధర్మంపైనే లగ్నమై ఉంటుంది. ఓ సీతా! ప్రవాసానికి పంపబడిన నీ భర్తను నీవు అనుగమించడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. తన భర్త ఎక్కడ, ఎచట ఉన్నా, అనుకూలంగాని, ప్రతికూలంగాని ఉన్నా, ఆ భర్తనే ప్రియంగా భావించే స్త్రీల కోసం గొప్ప భోగభాగ్యాలతో కూడిన లోకాలు ఎదురుచూస్తుంటాయి. తన భర్త కుసంస్కారియో, విశృంఖలుడో, లేక కటిక దరిద్రుడో అయినప్పటికీ, ఉదాత్తమైన మనఃస్థితి గల స్త్రీల దృష్టికి భర్తయే సర్వోన్నతమైన దైవం. ఓ వైదేహీ! నా దృష్టిలో స్త్రీకి భర్తకు మించిన గొప్ప మిత్రుడు ఉండడు. అక్షయమైన తపోఫలం మాదిరిగా అన్నిచోట్లను తను కోరుకొన్న వస్తువును ఇవ్వగలగటంలో భర్తను మించిన సమర్థుడు ఉండడు. కాని వాంఛాప్రేరిత హృదయం గలిగి భర్తమీద అధికారం చెలాయిస్తూ, పాపపుణ్య విచక్షణాశూన్యులై యథేచ్ఛగా విహరించేదుర్మార్గులైన స్త్రీలు మాత్రం పైవిధంగా వ్యవహరించరు.

ఓ మైథిలీ! నిజానికి అలాటి దుర్గుణాలతో పతితులై అపయశాన్ని అనుభవించక తప్పదు. కాని నీలాంటి పుణ్యస్త్రీలు సద్గుణసంశోభితులై, స్వర్గాన్ని ప్రాప్తించుకొంటారు. ఆరాధ్యదైవంగా భావిస్తూ, సహధర్మచారిణిగా వ్యవహరించు. దానివల్ల నీకు యశోలాభం, పుణ్యప్రాప్తి రెండూ లభిస్తాయి.' అని అనసూయ చెప్పగా సీత

ఆనందపడి ఇలా బదులు పలికింది. 'పవిత్ర మూర్తి అయిన మీరు నాకు ఇలా బోధించటంలో ఆశ్చర్యమేమీ లేదు. పతివ్రతయైన స్త్రీకి భర్త ఆరాధ్యదైవమనునది నాకు తెలిసిన విషయమే. ఒకవేళ నా భర్త నీచుడు జీవనాధారం లేనివాడైనా సరే నేను పైవిధంగా వ్యవహరించ వలసి ఉంటుంది. అది నా కర్తవ్యమే. అలాంటప్పుడు – సామర్థ్యం చేత స్తుతిపాత్రుడు, కారుణ్యాది సుగుణసంపన్నుడు, జితేంద్రియుడు, స్థిర ప్రేమికుడు అయినటువంటి నా భర్త పట్ల మరెంత భక్తిశ్రద్ధలు చూపాలి. మహాశక్తి సమన్వితుడైన శ్రీరాముడు తన స్వంత తల్లిపై చూపిన అనురాగాలనే, మిగిలిన తల్లుల పట్ల కూడ చూపాడు. గౌరవ మర్యాదలను ప్రదర్శించాడు. తల్లుల తప్పులను పరిశీలనకు తీసుకొనేవాడు కాదు. నేను ఈ అరణ్యానికి వచ్చేటప్పుడు, నా అత్తగారి బాధ అంతా నా హృదయంలో పదిలంగా ఉంది. అంతేకాదు, వివాహ సమయంలో, నా చేతిని వరుని చేతిలో పెట్టి మా తల్లి చెప్పిన పాఠం కూడ నాకు గుర్తు ఉంది.

ఓ సద్గుణవతీ! ఇపుడు నీ బోధనల చేత అవన్నీ కొత్తదనాన్ని సంతరించుకొన్నాయి. పతిసేవ తప్ప, సతికి వేరే బాధ్యత లేదు. తమ భర్తల పట్ల పాతివ్రత్యంలో స్థిరులైన పుణ్యస్త్రీలు అందరూ శ్రేష్ఠవంతులైన వారి పుణ్యబలం చేత దేవలోకంలో అపూర్వనామాన్ని అందుకొంటున్నారు.' అని సీత చెప్పింది.

సీత మాటలకు ఆనందించి, అనసూయ 'ప్రియమైన బిడ్డా! నా తపస్సుఫలం వలన లభించిన పుణ్యఫలాన్ని వినియోగించి, నీకొక వరాన్ని ఇవ్వాలనుకొంటున్నాను. నీకేమి కావాలో కోరుకో' అని అనగా సీత 'ఓ మహాతపస్వినీ! నీ సన్నిధియే నాకు అన్నింటిని మించిన వరం' అని జవాబు చెప్పింది. అయినా అనసూయ సంతోషంతో సీతకు ఎన్నటికీ వాడిపోని ఒక దివ్యమైన పుష్పహారాన్ని, అక్షయమైన దివ్యవస్త్రాభరణాలను, అలంకరణ వస్తువులను ఇచ్చింది. రామునితో జరిగిన సీతా వివాహ వృత్తాంతం చెప్పమని అనసూయ సీతను కోరగా, సీత ఇలా చెప్పసాగింది.

ఒకసారి నా తండ్రి జనక మహారాజు యజ్ఞవేదిక కోసం భూమిని దున్నుతుండగా, నేను ఆకస్మికంగా భూమిలోనుండి దుమ్ముతో బయటికి వచ్చాను. సంతానం లేని ఆయనకు ఒక కుమర్తెగా పెరిగాను. నేను యుక్తవయస్సుకు రాగా, నాలాంటి దివ్యబాలికకు తగిన వరుని ఎలా సంపాదించాలని ఆయన ఆందోళన చెందాడు. స్వయంవరం నిర్వహించాలని ఏర్పాటు చేశాడు. మా పూర్వీకుడైన దేవవ్రతుడికి వరుణుడు ఇచ్చిన శివధనస్సును ఎక్కుపెట్టగలవానినే నేను ఆ స్వయంవరంలో పెండ్లాడాలని నిర్ణయించబడింది.

కాని మహాగొప్ప రాజులెవరూ దానిని కనీసం ఎత్తలేక పోయారు. అయితే రాముడు విశ్వామిత్రునితో పాటు మిథిలకు వచ్చి, ధనస్సును అవలీలగా పైకెత్తి నారి సంధించబోగా అది రెండు ముక్కలయింది. కాని తండ్రి దశరథుని అనుమతి లేనిదే నన్ను స్వీకరించనని రాముడు చెప్పాడు. అందువల్ల అయోధ్య మహారాజు వచ్చిన తర్వాతనే మా వివాహోత్సవం జరపబడింది.'

సీత ఈ కథ చెప్పే సమయానికి, సాయంసమయం కావడంతో సీతను దివ్యాభరణాలతో అలంకరించి రాముని సేవకు వెళ్ళమని అనసూయ చెప్పింది. సీతను దివ్యాలంకరణ భూషితురాలిగా చూచి రాముడు ఆనందించాడు. ఆరాత్రి ఋషి ఆశ్రమంలోనే నిద్రించారు. మరురోజు రాముడు దండకారణ్య మార్గం గురించి ఋషిని అడిగాడు. ఆ ఋషి అన్ని సూచనలు చెప్పి 'రామా! ఆ ప్రాంతంలో భయంకరమైన రాక్షసులు వున్నారు. ఏ ధర్మవ్రతాన్ని పాటించని వారిని స్వాహా చేయడంలో వారికి ఎక్కువ ఆనందం ఉంటుంది' అని హెచ్చరించాడు.

ఆ తరువాత రాముడు ఋషి వద్ద శలవు తీసుకొని, నల్లని మబ్బుల్లో ప్రకాశించే చంద్రునిలాగ, సీతాలక్ష్మణులతో కలిసి దట్టమైన దండకారణ్యంలోనికి ప్రవేశించాడు.



**–ః అయోధ్యా కాండ సమాప్తం ః–**

ఓం

# శ్రీరామ కథామృతం - అరణ్య కాండ

సీతారామలక్ష్మణులు దండకారణ్యాన్ని సమీపించగానే వారికి అక్కడ ఋషులు నివసిస్తున్న ఒక కుటీరాల సముదయం చాల ఆహ్లాదకరంగా కనిపించింది. ఫలపుష్పభరితమై, వేదమంత్రాల ధ్వనితో పవిత్రమైనా కుటీరాలు చూచేవారి హృదయాలను పవిత్రం చేస్తున్నాయి. అక్కడ లేళ్ళు, జింకలు, ఇతర వన్యమృగాలు నిర్భయంగా సంచరిస్తున్నాయి.

రామలక్ష్మణులు తమ వింటినారులను సడలించి ఆశ్రమంలోనికి ప్రవేశించారు. ఋషులు ఎంతో సంతోషించి, వారు ఉండటానికి ఒక మంచి కుటీరాన్ని కేటాయించారు. ఆరాత్రి గడిచి, తెల్లవారిన తరువాత రాముడు ఋషుల వద్ద శలవు తీసికొని, తన వెంట సీత, ఆ వెనక లక్ష్మణుడు ఉండి నడచునట్లు ఏర్పాటు చేసుకొని, అరణ్యంలోనికి ప్రవేశించడానికి సాహసించారు. అలాగ వారు వెళ్తుండగా, అకస్మాత్తుగా ఒక భయంకరుడైన, మహాకాయుడైన రాక్షసుడు ఒకడు వారి ముందు ప్రత్యక్షమైనాడు. వాడి ఆకారం మహా వికృతమై ఉంది. సింహాలు, జింకలు, తోడేళ్ళు, ఏనుగుల తతఃలలు వాడి శూలం నుండి వ్రేలాడుతూ రక్తమోడుతున్నాయి. ఆ భీకరాకారుడు బిగ్గరగా రంకెలు వేస్తూ, ముందుకు దూకి సీతను ఒడిసి పట్టుకున్నాడు. కొంతదూరం అలా వెనుకకు నడిచి 'ఈ స్త్రీని నేను భార్యగా చేసుకొంటాను. మీ ఇద్దరి రక్తం త్రాగుతాను' అంటూ గర్జించాడు. దీనితో రాముడు సీతను ఆ రాక్షసుడు స్పర్శించడం చూచి, 'తండ్రి మరణం కంటే బాధగా వుంది' అని అన్నాడు. కాని లక్ష్మణుడు అలాంటి మాటలవాడు కాదు. అందుచేత అతడు రాముణ్ణి నిందిస్తూ – 'అలా దుఃఖిస్తూ నిలబడడ మేమిటి? నేను ఈ రాక్షసుణ్ణి సంహరించి, భరతుడి మీద నాకున్న కోపాన్ని వ్రెళ్ళగక్కుతాను, చూడు.' అని అన్నాడు. రాక్షసుడు 'ఎవడివిరా నువ్వు? నా అడవిలోకి వచ్చావు' అని బిగ్గరగా అరిచాడు. అందుకు రాముడు 'మేమిద్దరం క్షత్రియులం. నీవు నా భర్యను తీసికొని పోయి మమ్మెందుకు ఇలా అడ్డగిస్తూ వున్నావు, సాహసం ఎందుకు చేస్తున్నావు?' అని అన్నాడు. దీనికి రాక్షసుడు సమాధానంగా 'నా పేరు విరధుడు. నేను జపుడికి అతని రెండవ భార్యయైన శతహ్రద ద్వారా పుట్టిన కుమారుణ్ణి. నా తపో చర్యకు మెచ్చిన బ్రహ్మదేవుడు నాకు ఏ ఆయుధాల ద్వారా కూడ మరణం లేని వరం ఇచ్చాడు. కనుక మీరు ఈ సుందరాంగిని నాకు వదిలేసి మరణాన్ని కోరుకోకుండా, మీరు పారిపోండి. ఇదేనా సలహా' అని చెప్పాడు. దానితో రామలక్ష్మణులు వెంటనే తమ తమ ఖడ్గాలు దూసి, రాక్షసునిపై దుమికారు. వారు ఎంతో తీవ్రంగా కత్తులతో రాక్షసుని పొడిచినప్పటికీ, ఆ రాక్షసుడు లెక్కచేయకుండా రామలక్ష్మణుల నిద్దరినీ తన చేతులతోఎత్తుకొని అరణ్య అంతర్భాగంలోకి తీసుకొని వెళ్ళ నారంభించాడు.

ఇది చూచిన సీత 'ఓ రాక్షసా!వారిద్దరిని వదలివేయి. వారికి బదులుగా నన్ను తీసికొని పో' అని దీనంగా విలపించింది. ఇది విన్న రామలక్ష్మణులు విరధుణ్ణి వధించాలనే నిర్ణయించుకొన్నారు మహా పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ, రాముడు వాడి కుడిచేతిని నరికి వేయగా, లక్ష్మణుడు కూడా మరో చేతిని తెగగొట్టాడు. ఎన్ని పిడిగుద్దులు గుద్దినా, ఎంత హింసించినా, రాక్షసుడు చావలేదు. దీనిని గమనించిన రాముడు లక్ష్మణునితో 'వీడు ఇలా చావడు. వీడిని సజీవంగా భూస్థాపితం చేద్దాం. నేను వీడికి కాపలా కాస్తుంటాను. నీవు త్వరగా ఒక గోతిని త్రవ్వు' అని అన్నాడు రాముడ. లక్ష్మణుడు గోతిని త్రవ్వే లోపు, విరధుడు స్పృహలోనికి వచ్చి రామునితో 'ఇపుడు

నేను గుర్తిస్తున్నాను. నేను వాస్తవానికి తుంబురుడనే గంధర్వుడను. అప్సరసయైన రంభపై కామోద్వేగంతో ప్రవర్తించినందున, కుబేరుడు నన్ను శపించి, నీవల్ల నాకు విముక్తి కలిగే వరకు, నన్ను రాక్షసునిగా జీవించమన్నాడు. అంతే. నాకు శాపవిముక్తి కలిగించటానికై నన్నీ గోతిలో పూడ్చిపెట్టు. ఆ తర్వాత దయచేసి ఇక్కడకు 12 మైళ్ళ దూరంలో నివసిస్తున్న శరభంగ మహర్షిని కలుసుకోవటానికి వెళ్ళు. నీవు ఆయనను చూచినపుడు, ఆయన నీకు ఎంతో ప్రయోజనకరమైన సలహా ఇస్తాడు.' అని చెప్పాడు విరధుడు. రాముడు ఆ రాక్షసుని గొంతుపై పాదం పెట్టి ఉంచగా, లక్ష్మణుడు గోతిని త్రవ్వడం కొనసాగించాడు. ఆ పని పూర్తి అయిన మీదట రాముడు గగ్గోలు పెడుతున్న ఆ రాక్షసుణ్ణి ఆ గోతిలోకి త్రోసివేసి, వేగంగా రాళ్ళతో కప్పివేశాడు. అలా తుంబురుడు శాపవిముక్తి పొంది, రాక్షస దేహాన్ని విడిచి, కుబేరుని రాజధాని అలకాపురికి చేరాడు.

*పూర్వం విరధుని వంటి మహారాక్షసులు కూడ తాము దేహాలము కాము, జీవాత్మలమని అర్థం చేసుకొనే ధీమంతులుగా ఉండేవారు. కాని కలియుగ ప్రభావంతో, విద్వాంసులు, మతాచార్యులు కూడ ఈ అర్థాన్ని గ్రహించ లేకున్నారు. ఈ కలియుగంలో మానవులు అల్పాయుష్కులు, మందమతులు, దురదృష్టవంతులై, తత్త్వచింతనాసక్తి లేని నిరర్థకులై జీవిస్తున్నారు. అందుచేతనే చైతన్య మహాప్రభువు, హరే కృష్ణ మ సంకీర్తనం అనే అతి సులభమైన సాక్షాత్కార సాధనాన్ని లోకానికి ప్రసాదించి, తన కృపను చాటుకోవడం మహా విశేషంగా భావిద్దాం. 'హరే రామ, హరే రామ, హరే కృష్ణ, హరే కృష్ణ' అనే ఈ మహామంత్ర జపంతో ఎవ సరే తక్షణమే భగవంతునితో సాయుజ్యం పొంది ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించుకొని, భగవంతునితో శాశ్వతానందంల జీవించడానికి అర్హులు అవగలరనడంలో ఎలాగని సంశయం అవసరం లేదు.*

రాముడు, లక్ష్మణుడు, సీత ముగ్గురూ శరభంగ ఋషిని కలవడానికి బయలుదేరారు. వీరు అక్కడికి చేరేసరికి అక్కడ ఒక దివ్యరథంపై స్వర్గాధిపతియైన దేవేంద్రుడు ఆసీనుడై ఉండటం చూచి ఆశ్చర్యపోయాడు. ఇంద్రునితో పాటు ఇతర దేవతలు కూడ వచ్చి వున్నారు. ఆయన శరభంగునితో మాట్లాడుతున్నాడు. తెల్లని గుర్రాలతో లాగబడే మరొక రథం ఆకాశంలో వేచి ఉంది. అయితే అటువైపు నుండి వస్తున్న రాముణ్ణి గమనించిన ఇంద్రుడు ఇతర దేవతలతో 'భగవానుడైన రాముడు నన్ను ఇప్పుడే చూచుటకు ఇష్టపడను. రావణసంహారం తరువాతనే ఆయన నన్ను చూడాలని నేను కోరుకొంటున్నాను.' అని అన్నాడు. 1000 అశ్వాలు లాగుతున్న తన రథం మీద ఇంద్రుడు వెళ్ళిపోయాడు. ఈ అద్భుతాన్ని చూచిన సీతారామలక్ష్మణులు వేగమే వెళ్ళి శరభంగుని పాదాలను స్పృశించారు తరువాత ఋషిచేత స్వాగతసత్కారాలు పొందిన మీదట రాముడు 'ఓ ఋషిసత్తమా! ఇక్కడికి ఇంద్రుడు ఏ పనిమీద వచ్చాడో దయచేసి చెప్పండి' అని అడిగాడు.

అందుకు శరభంగుడు 'కఠోరతపస్సుచే నేను ఆర్జించుకొన్న పుణ్యం వల్ల బ్రహ్మలోకానికి నన్ను తీసికొని వెళ్ళటానికి ఇంద్రుడు ఇక్కడికి వచ్చాడు. కాని నీవు సమీపంలోనే వున్నావని తెలిసినందున ఈ లోకాన్ని విడిచి వెళ్ళేందుకు ముందు నిన్ను చూడగోరుతున్నాని ఇంద్రునికి చెప్పాను.' అని చెప్పాడు. తమకు ప్రవాసంలో నివసించేందుకు ఒక స్థలాన్ని చూపవలసిందిగా శరభంగుని రాముడు కోరాడు.

శరభంగుడు 'ఓ భగవాన్! నీవు సుతీక్షణ మహర్షి వద్దకు వెళ్ళాలి. ఆయన నీకు ఒక మనోహరమైన స్థలాన్ని నీ నివాసానికి ఏర్పాటు చేస్తాడు. ఓ రామా! నాదొక కోరిక, నెరవేర్చు ప్రార్థన. నేను నీ సన్నిధిలో ఈ దేహాన్ని త్యజించి, దేహత్యాగం చేయనివ్వు' అని వేడుకొన్నాడు ఋషి. ఈ మాటలు చెపుతూనే శరభంగుడు

అగ్నిని రగిల్చి అందులో ఆజ్యాన్ని పోయగా, అగ్ని ఉజ్వలంగా మండింది. అంతట మంత్రోచ్చారణ చేస్తూ ఋషి అగ్ని ప్రవేశం చేశాడు. దేహం భస్మమై పోయింది. అంతట శరభంగుడు తేజోమయ దేహంతో అక్కడినుండి అదృశ్యమయ్యాడు. ఆ తర్వాత ఆయన బ్రహ్మలోకానికి వెళ్ళడానికి రథాన్ని అధిరోహించగా, బ్రహ్మలోక వాసులు ఆయనకు స్వాగతం పలికారు.

ఆ తర్వాత అక్కడి ఋషులు రాముని వద్దకు వచ్చి, 'ఈ అరణ్యంలో మమ్ములను చాలమంది రాక్షసులు చంపేస్తున్నారు. ఓ రామా! మాకు రక్షణ కల్పించవలసినదిగా నిన్ను వేడుకొంటున్నాము.' అంటూ విన్నవించు కొన్నారు. 'ఒక క్షత్రియుడిగా నేను మీ సేవకుణ్ణి. అందువల్ల మీకోసం ఆ రాక్షసులను సంహరిస్తాను.' అని రాముడు ఋషులకు హామీ ఇచ్చాడు. మునులతో కలిసి రాముడు సుతీక్షణుని ఆశ్రమానికి వెళ్ళాడు. రాముని అభివాదాలు స్వీకరిస్తూ, ఆ ముని 'నీ రాక కోసం నేను ఎదురు చూస్తున్నాను. ఓ రాఘవా! ఇంద్రుడు బ్రహ్మలోకానికి వెళ్ళేముందు ఇక్కడికి వచ్చి నీవు రానున్న విషయాన్ని తెలియపరచాడు.' అని అన్నాడు. తాను నివసించటానికి అనువైన ప్రదేశాన్ని చూపమని రాముడు కోరగా, తన స్వంత కుటీరాన్ని వారు ఉపయోగించుకోవచ్చునని తెలిపాడు. కాని రాముడు 'మేము ఇక్కడ ఉంటే, జింకలను చంపటం చేత మీకు అసౌకర్యంగా ఉంటుంది.' అంటూ తిరస్కరించాడు.

సీతారామలక్ష్మణులు ముగ్గురూ ఆ రాత్రి ఆ కుటీరంలనే గడిపారు. మరురోజు రాముడు మహర్షికి నమస్కరించి, శెలవు తీసికొన్నాడు. సుతీక్షణుడు రాముని కౌగిలించుకొని, దండకారణ్యంలోని వివిధ ఋషి ఆశ్రమాలను దర్శించుకొన్న తర్వాత మరల తన వద్దకు రావలెనని అర్థించాడు.

తర్వాత సీత నేర్పుతో ఒకరోజు రామునికి ఒక సలహా ఇవ్వదలచి ఇలా చెప్పింది. 'ప్రాణనాథా! భౌతిక ప్రకృతి ప్రభావం చేత మహనీయుడు, శ్రేష్ఠుడైన వ్యక్తి కూడ పతనమౌతాడు. కనుక భౌతిక వాంఛలకు దూరంగా వుంటూ జాగ్రత్తతో వ్యవహరించ వలసి వుంది. ముఖ్యంగా అసత్య భాషణం, పరస్త్రీ సంగమం, మిత్రుల పట్ల క్రూరత్వం అనే మూడు పాపాల నుండి వైదొలగాలి. దోషాల ఛాయలు కూడ నీ శీలంలో కనపడవు. ఎందుకంటే నీవు ఎప్పుడూ ఇలాటి పాపకర్మలు చేయలేదు. కాని నీవు అమాయకమైన జంతువుల ప్రాణాలను హరించటం చూస్తున్నాను. ఈ కళంకం నీలో ఉన్నట్లు అనిపిస్తుంది. ఇది నాకు అసంతుష్ఠి కలిగిస్తోంది. నా ప్రియ రామా! నీవు ధనుస్సును చేతిలో ధరించటం చేత, మారణ ప్రవృత్తిని అధికం చేసుకొన్న వాడివవుతున్నావు. ఇంధనాన్ని అగ్నికి దగ్గరగా పెట్టినట్లనిపించింది. ఈ సందర్భంలో నేను ఒక కథ చెబుతాను. దయచేసి విను. ఒకప్పుడు ఒక ఋషి విపరీత తపస్సాధన వల్ల తనకు లభించే పుణ్యంవల్ల తన పదవికి ముప్పు వస్తుందేమోనని ఇంద్రుడు భయపడ్డాడు.

ఋషియొక్క పురోగతిని అడ్డగించడానికి, ఇంద్రుడు ఒక యోధుని రూపం దాల్చి ఆయన ఎదుటకు వచ్చాడు. ఆ బ్రాహ్మణునికి ఖడ్గాన్నిచ్చి, 'నేను తిరిగి వచ్చే వరకు దానిని భద్రంగా వుంచు' అని ప్రార్థించాడు. ఋషి సరేనని తన ప్రతిజ్ఞ పట్ల నిజాయితీగా ఉంటూ, ఫలసేకరణకు అడవికి వెళ్ళినపుడు కూడ ఆ ఖడ్గాన్ని తన వెంటే ఉంచుకొంటున్నాడు. దానితో ఋషిలో హింసపట్ల మనస్సు మారటం ప్రారంభమైంది. ఫలితంగా, అతడు తన తపస్సాధనలకు స్వస్తి చెప్పి, హింసతో కూడిన జీవన విధానానికి అలవాటు పడ్డాడు. అలాగ ఆ ఋషి పతితుడై, చివరకు మరణానంతరం నరకాన్ని పొందాడు.

కనుక నా ప్రియనాథా! ఆ బ్రాహ్మణుడు ఇంద్రుని ఖడ్గం వల్ల పతనమైనాడు. కనుక నీవు ఋషులను వేధిస్తున్న రాక్షసులను సంహరించటానికే నీవు ధనస్సును ఉపయోగించు. అమాయక రాక్షసులను కూడ చంపద్దు. ఇక ఇతర ప్రాణుల గురించి చెప్ప పనిలేదు కదా! నీకు ఇలాబోధించవలసిన యోగ్యత నాకు లేదని తెలిసినప్పటికీ నా మాటలను జాగ్రత్తగా ఆలోచించాలని నా ప్రార్థన. ఆపై, తమకు ఉచితమైన విధంగా చేయండి.'

అందుకు రాముడు సమాధానంగా 'ప్రియమైన సీతా! నీ వివేకవంతమైన మాటలు అభినందించ తగ్గవే. నీవు నన్ను ప్రేమిస్తున్నావు కనుకనే నా శ్రేయస్సును కాంక్షించి అలా చెప్పావని నాకు తెలుసు. ఒకడు ఆత్మీయుడై ఉన్నప్పుడే అలాంటి నిష్కల్మషమైన సూచనలు వస్తాయి. ఓ జానకీ! ఋషులు స్వయంగా రాక్షసులను సులభంగా చంపగలరు. కాని వారు అలా చేస్తే, వారు సంపాదించుకొన్న తపస్సాధనల వల్ల లభించిన పుణ్యం క్షీణిస్తుంది. కనుక వారు అలా చేయరు. అందుకే నేను దండకారణ్యంలో ఉన్న రాక్షసులందరినీ సంహరిస్తానని వాగ్దానం చేశాను. నిన్ను గాని, లక్ష్మణుని గాని త్యజించవలసి ఉన్నా సరే, నేను బ్రాహ్మణులకు చేసిన వాగ్దానాన్ని భంగపరచ లేను.' అని రాముడు అన్నాడు.

సీతారామలక్ష్మణులు ముగ్గురూ ఒ విశాలమైన, అందమైన సరోవరం వద్దకు చేరారు. వారికి ఆ సరోవర జలాల్లో నుండి ఏదో ఒక శబ్దం వినిపించింది. కాని అక్కడ ఎవరూ లేరు. ఆ సమయంలో ధర్మభృతుడనే ఋషి అటు రావటం జరిగింది. ఆ విచిత్ర స్వరం ఏమిటని ఋషిని రాముడు అడిగాడు. ఆ ఋషి ఇలా వివరించాడు. 'ఈ సరోవరాన్ని పంచాప్సర అంటారు. మొదట దీనిని మందకర్ణి అనే మునీశ్వరుడు తన మాయశక్తిచేత సృష్టించాడు. మందకర్ణి కేవలం వాయుభక్షణంతో జీవిస్తూ ఈ సరోవర తీరాన 10000 సంవత్సరాలు దీర్ఘ తపస్సు చేశాడు. ఈ ఘోర తపస్సుకు దేవతలు కూడ భయపడ్డారు తమ పదవులు పోతాయేమోనని. అందుకై వారు ఆ ఋషి తపస్సు భంగపరచదలచి ఐదుగురు అప్సరసలను పంపించారు. ఆ ఋషి నిజంగానే మోహితుడై ఆ ఐదుగురిని వివాహం చేసుకున్నాడు. ఆ ఋషి జలగర్భంలో ఒక రహస్య మందిరాన్ని నిర్మించుకొని, అక్కడ వారితో నివసించసాగాడు. మీరు వింటున్న స్వరాలు ఆ అప్సరసల సంగీత ధ్వనులే. తన తపోశక్తితో తిరిగి యవ్వనాన్ని పొందిన ఆ ఋషిని ఈ నాటికీ వారు నిరంతరం సేవిస్తూనే ఉన్నారు' అని చెప్పాడు.

సీతారామలక్ష్మణులు ఒక ఆశ్రమం నుండి మరొక ఆశ్రమానికి దండకారణ్యంలో తిరగసాగారు. వారు ఒక్కొక్క ఆశ్రమంలో తాము ఉండదలచినంత కాలం ఉండేవారు. ఒక సంవత్సరం పాటు కూడ ఉండేవారు. ఇలా రాముని ప్రవాసంలో సుఖంగా, సంతోషంగా, సంతృప్తికరంగా 10 సంవత్సరాలు గడిచిపోయాయి. పదేళ్ళ తర్వాత, ఆ ముగ్గురూ సుతీక్షణుని ఆశ్రమంలో నివసించటానికి తిరిగి వచ్చారు.

ఒకరోజు రాముడు సుతీక్షణునితో మాట్లాడుతూ 'అగస్త్య మహర్షి దండకారణ్యంలో ఎక్కడో ఉన్నాడని విన్నాను. కాని ఈ మహారణ్యంలో ఎక్కడా కనుగొనలేక పోయాను. ఆ మహాఋషికి నా ప్రణామాలు సమర్పించి, ఆయన ఆశీస్సులు పొందాలనుకొన్నాను. దయచేసి, ఆయన ఆశ్రమానికి దారి తెలుపండి' అని అడిగాడు రాముడు.

సుతీక్షణుడు సూచనలు చేయగా, సీతారామలక్ష్మణులు అక్కడకు బయలుదేరారు. అగస్త్య ముని ఆశ్రమ పరిసరాలకు చేరుకోగానే రాముడు ఈ క్రింది చరిత్రను చెప్పాడు. 'ఒకప్పుడు వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షస సోదరులుండేవారు. ఇల్వలుడు బ్రాహ్మణ వేషం ధరించి, సంస్కృతంలో మాట్లాడుతూ, శ్రాద్ధకర్మల పేరుతో

నిజమైన బ్రాహ్మణులను ఆహ్వానిస్తుండేవాడు. బ్రాహ్మణులు తన దగ్గరకు వచ్చేలోగా, ఇల్వలుడు వాతాపిని ఒక మేక రూపంలోనికి మార్చేవాడు. అంతట తన సోదరుణ్ణి కోసి వండి వచ్చిన బ్రాహ్మణులకు ఆహారంతో పాటు మేక మాంసం వడ్డిస్తూ ఉండేవాడు. ఆ విధంగా వాతాపి బ్రాహ్మణుల పొట్టలలోనికి ప్రవేశించగానే, ఇల్వలుడు 'సోదరా! ఇక దయచేసి బయటకు వచ్చేయి' అని బిగ్గరగా పిలిచేవాడు. ఆ కేక వినగానే, వాతాపి ఆ బ్రాహ్మణుల కడుపు చీల్చుకొని, మేకలా అరచుకొంటూ బయటకు వచ్చేవాడు. ఈ పద్ధతిలో ఆ ఇద్దరు రాక్షసులు వేలాదిమంది బ్రాహ్మణులను చంపేశారు. చివరకు దేవతల ప్రార్థనల మీద అగస్త్య మహర్షి అక్కడికి ఆహ్వానింపబడి, అతిథిగా వెళ్ళాడు. ఇల్వలుడు వండిన మేకరూపంలో ఉన్న వాతాపి మాంసాన్ని భుజించాడు. కాని అపుడు ఇల్వలుడు తన సోదరుణ్ణి వెనుకటిలాగా పిలవగా, అగస్త్యఋషి వాడితో 'నేను ఇప్పటికే వాతాపిని జీర్ణం చేసుకొని, యమరాజు సదనానికి పంపించివేశాను.' అని అన్నాడు. ఈ మాటలు విన్న ఇల్వలుడు ఆగ్రహావేశంతో అగస్త్యుని మీద దాడి చేయాలని ప్రయత్నించాడు. కాని అగస్త్య మహాముని తన క్రోధ దృక్కులను వాని మీద ప్రసరించి, వాడిని బూడిద చేసేశాడు. ఆ తరువాత అగస్త్యముని అంటే రాక్షసులకు భయం ఏర్పడటంతో, ఆయన ఆశ్రమం జోలికి వారు పోనే లేదు.'

రాముడు అగస్త్య ఋషి ఆశ్రమంలోనికి ప్రవేశించగా, వారికి ఆసనాలు ఏర్పరచబడి, సముచిత స్వాగత సత్కారాలు ఆచరించ బడినాయి. విశేషమేమంటే – అగస్త్య మహర్షి రామునికి విశ్వకర్మచే నిర్మించబడిన విష్ణు ధనస్సును, దేవేంద్రుడు ఇచ్చిన రెండు అక్షయతూణీరాలను, ఒక అమోఘ శరాన్ని, బ్రహ్మదేవుడు ఇచ్చిన ఒక స్వర్ణఖచిత ఖడ్గాన్ని కానుకలుగా ఇచ్చాడు. తర్వాత సేతాదేవి వైపు తిరిగి 'నీ భర్త కోసం ఇలాగ కష్టాలను ఓర్చుకుని చిరకీర్తిని సంపాదించావు. పురుషుడు సిరిసంపదలతో తులతూగుతున్నంత కాలం మాత్రమే స్త్రీ భర్తను ప్రేమించటమనేది స్త్రీ స్వభావంగా సృష్టి మొదలుకొని జరుగుతూ వచ్చినందున నీ ప్రవర్తన విశేష పుణ్యప్రదం' అంటూ ప్రశంసించాడు.

ఆ తర్వాత రాముడు తమ నివాసానికి ఒక ప్రదేశాన్ని సూచించమని అగస్త్యుణ్ణి అడిగాడు. అగస్త్యుడు కొంచెంసేపు ఆలోచించి, అక్కడికి 16 మైళ్ళ దూరంలో ఉన్న గోదావరి నదీతటంలో వున్న పంచవటికి వెళ్ళమన్నాడు. సరేనని రాముడు బయలుదేరే ముందు అగస్త్యుడు 'నీపట్ల నాకు గల ప్రేమ చేతన మరెక్కువగా పెంపొందిన యోగదృష్టితో నీ జీవిత సర్వస్వాన్నీ నేను ఇప్పటికే తెలుసుకొని ఉన్నాను.' అని వెల్లడించాడు.

ఆశ్రమన్ని వీడి సీతారామలక్ష్మణులు పంచవటి వైపు బయలుదేరి ప్రయాణిస్తుండగా, జటాయువు అనే రాబందుల రాజు కనపడ్డాడు. రాక్షసుడేమోనని అనుమానించి, రాముడు అతనిని నీవెవరవు అని ప్రశ్నించాడు. జటాయువు మృదువుగా జవాబు చెప్తూ 'నాయనా! నేను నీ తండ్రికి మంచి స్నేహితుణ్ణి. చాలకాలం క్రితం కశ్యపుడు దక్షుని యొక్క అష్ట పుత్రికలను వివాహం చేసుకొన్నాడు. వారిలో వినతకు అరుణుడు జన్మించగా, తామసకు స్యేని జన్మించింది. నేను అరుణుడు, అతని భార్యయైన స్యేనిల యొక్క కుమారుడను. నా పేరు జటాయువు. ప్రియమైన రామా! నన్ను నీ పవిత్ర సేవకునిగా స్వీకరించు. ఇక్కడ ఎందరో క్రూర రాక్షసులు నివసిస్తున్నందున, నీవు లక్ష్మణుడు కుటీరాన్ని వదలి వెళ్ళినపుడల్లా, నేనుసీతను కనిపెట్టి రక్షణలోఉంటాను.' అని అన్నాడు. జటాయువు తన తండ్రి స్నేహితుడనని చెప్పినందున, రాముడు అతనికి నమస్కరించాడు. అంతట రాబందుల రాజు జటాయువు వారివెంట పంచవటికి వెళ్ళాడు. అతని చూపులు అప్రమత్తంగానే ఉన్నాయి. పంచవటికి చేరిన తర్వాత రాముడు ఏదైనా సరస్సు లేదా నదివద్ద ఉండే స్థలాన్ని తమ నివాసంకోసం ఏర్పరచుకొంటే మంచిదనుకొని, అక్కడ ఒక మంచి స్థలాన్ని ఎంపిక చేశాడు.

రాముడు ఎంపిక చేసిన స్థలం గోదావరీ నదీ తీరాన ఉంది. ఆ ప్రక్కనే రమణీయ పుష్పాలతో శోభిల్లుతూ ఒక సరస్సు ఉంది. నది నుండి మనోహర దృశ్యాలు ఆవిష్కరించబడుతూ కన్పించాయి. ఒక కుటీరాన్ని నిర్మించుకొని, పుష్పాలతో పవిత్రీకరించారు. ఆ తరువాత రాముడు అందులోనికి ప్రవేశించాడు.

కాలానుగుణంగా హేమంతం ప్రవేశించింది. ప్రాతఃకాలపు సూర్యకాంతి కిరణాలు గిలిగింతలు పెడుతున్నాయి. ఒక ఉదయం రామలక్ష్మణులు నదీ స్నానం ముగించుకొని, అనుష్ఠాన విషయాలు ముచ్చటించుకొంటూ ఉండగా, ఒక రాక్షసి అక్కడ ప్రత్యక్షమయింది. రాముని చూడగానే, దాని హృదయం కామంతో నిండిపోయింది. రాముడు మానవరూపం దాల్చిన మన్మథుడి లాగ కన్పించాడు. కాని ఆ రాక్షసి ఆకారం భయంకరంగా ఉంది. వికృత రూపంతో అసహ్యంగా ఉంది. రాముని దేహం రాజచిహ్నాలతో విరాజిల్లుతుండగా, రాక్షసి దేహం వికృతంగా అసహ్యం కలిగిస్తోంది. అది రాముని మోహంలో పడి తన అసహ్య రూపాన్ని మార్చుకోవడం మరచిపోయింది. 'ఓ సుందరాకారా! నీవు ఋషి వలె ఇక్కడికి ఎందుకు వచ్చావో చెప్పు. నీవు ఋషి వేషంలో ఉన్నా ధనస్సు ధరించి, ఒక స్త్రీని ప్రక్కనే ఉంచుకున్నావు. రాక్షసులుండే ప్రాంతానికి ఎందుకొచ్చావో చెప్పు. నీ కోరికలన్నింటినీ తీరుస్తాను. నీవెవరివో చెప్పు.' అంటూ ఆ రాక్షసి రాముని దగ్గరకు చేరింది.

అందుకు సమాధానంగా రాముడు తన ప్రవాస పరిస్థితులను క్లుప్తంగా చెప్పాడు. నీవెవరవని రాక్షసిని ప్రశ్నించాడు. రాక్షసి కామపీడితయై ఇలా చెప్పింది. 'ఓ పద్మనయనుడా! నాపేరు శూర్పణఖ. అసలైన నిజాన్ని విను. రామా! రావణ, కుంభకర్ణ, విభీషణ, ఖరదూషణులకు సోదరిని. నేను ఇక్కడి జీవరాసులను భయకంపితులుగా చేస్తుంటాను. నేను, నా సోదరులను మించిన దానిని. నీకోసం నేను కామపీడితురాలనైనాను. దాపరికం లేకుండా చెప్తున్నాను. నిన్ను నా భర్తగా చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. నీ కురూపి భార్యను వదలిపెట్టు. ఆమె నీకు తగినది కాదు. నేనెంతో శక్తిమంతురాలను. నీ జీవిత భాగస్వామిగా తగినదానిని. ముందుగా ఈ సీతను, లక్ష్మణుని స్వాహా చేస్తాను. ఆ తర్వాత మనమిద్దరం ఈ కొండల్లో, కోనల్లో ఆనందంగా విహరించవచ్చు.' అని చెప్పిన ఆ రాక్షసియొక్క కామం నిండిన కళ్లలోకి చూసి రాముడు దాని మాటలకు నవ్వాడు. తర్వాత రాముడు 'నేను ఇప్పటికే పెండ్లి అయినవాడిని. సీత యువతీలలామ. నీతో ఎలా సహజీవనం చేస్తుంది? కనుక నాకంటే ధీరోన్నతుడైన నా సోదరుడు భార్య తోడు లేకుండా ఉన్నాడు. కనుక అతన్ని పెండ్లి చేసుకోమని నా సలహా' అని అన్నాడు. సలహా బాగుందనిపించి, శూర్పణఖ వెళ్ళి లక్ష్మణుని ఎదుట నిలబడింది కామవాంఛతో.

'ఓ సొగసుకాడా! నీవు నీ సోదరుని కంటే శక్తివంతుడివి. ఆకర్షణీయంగానూ ఉన్నావు. నీవే నాకు తగినవాడవు అని నా అభిప్రాయం. రా! నన్ను నీ భార్యగా చేసుకో. మనిద్దరం అడవిలో స్వేచ్ఛగా చెట్టాపట్టా లేసుకొని విహరిద్దాం. ఆనందిద్దాం' అని అన్నది. ఆ మాటలు విని లక్ష్మణుడు చిరునవ్వు నవ్వుతూ 'ఓ జవ్వనీ! సుందరాంగీ! నేను మా అన్నయ్యకు సేవకుడను మాత్రమేనని నీవు తెలుసుకో. నన్ను పెండ్లాడితే, నీవు అతనికి దాసిగా ఉండటం మినహా నీవేమీ సాధించలేవు. అందుచేత నీవు రాముడికి రెండవ భార్యగా ఉండుటయే మేలు అనుకొంటున్నాను. సీతను వదలి నిన్ను వరించవచ్చునేమో! నీ సుందర రూపం ఏ మగవానినైనా ఇట్టే ఆకర్షిస్తాయి సుమా! నీ ఆకారాన్ని ఎవరు తట్టుకోగలరు. రాముణ్ణే చేసుకో. సీతను తొలగిస్తాను.' అని అన్నాడు.

రామలక్ష్మణులు తనతో పరిహాసం చేస్తున్నారనే విషయం గ్రహించలేని శూర్పణఖ రాముని వైపు తిరిగి 'నీవు ఈ సీతను ప్రేమిస్తున్నావు. నేను దీనిని మ్రింగేసి, నిన్ను వివాహం చేసుకొంటాను.' అని అన్నది. అలా అంటూనే ఆ రాక్షసి సీతవైపు దూసకొని పోయింది. అపుడు రాముడు లక్ష్మణునితో 'దానికి రూపవికల్పం చేసి పంపు. లేకపోత సీతకు హాని కలుగవచ్చు' అని హెచ్చరించాడు. శూర్పణఖ దూకుడుకు కళ్ళెం వేశాడు లక్ష్మణుడు.

రాముడు చూస్తుండగానే, లక్ష్మణుడు రాముని ఆజ్ఞను పాటిస్తూ, శూర్పణఖ ముక్కును, రెండు చెవులను ఖండించి వేశాడు. రక్తం స్రవిస్తుండగా, రోదిస్తూ, శూర్పణఖ అడవిలోనికి పారిపోయింది. తన సోదరుల పాదాల వద్ద రోదిస్తూ పడపోయింది. అంతట ఆమె సోదరుడైన ఖరుడు ఏమి జరిగిందని ప్రశ్నించాడు. వివరమంతా శూర్పణఖ అతనికి చెప్పింది. ఖరుని హృదయం క్రోధంతో నిండిపోయింది. 'ఓ సోదరీ! దుఃఖించకు. నాకు స్పష్టంగా చెప్పు. నీకీ కీడు చేసిందెవరో చెప్పు. దానవుడు గాని, ఋషి గాని, గంధర్వుడు గాని నీకు కీడుచేసి తప్పించుకోగలడా? దోషి ఎవరో చెప్పు, వాడిని చీల్చి వాడి రక్తాన్ని త్రాగుతాను' అని అన్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ, శూర్ణఖ 'రామలక్ష్మణులనే ఇద్దరు సోదరులు ఈ దండకారణ్యంలో ఉన్నారు. వారు దేవతలో లేక దానవులో నాకు తెలియదు. కాని వారి రక్తాన్ని పీల్చిన మీదటే నేను సంతృప్తి పడతాను.' అని అన్నది. తర్వాత ఖరుడు శక్తివంతులైన పద్నాలుగు మంది రాక్షసులను పిలిపించి, రామలక్ష్మణులను, సీతను సంహరించడానికై శూర్పణఖ వెంట పంపించాడు. ఆ రాక్షసులు వచ్చేసరికి, రాముడు సీత కుటీరంలో కూర్చొని వున్నారు. లక్ష్మణుడు వాకిలి వద్ద కాపలా కాస్తున్నాడు. భయంకరులైన రాక్షసులను చూచి రాముడు లక్ష్మణునితో నీవిక్కడే సీతతో ఉండు. నేను వారి సంగతి తేలుస్తాను.' అని లక్ష్మణునితో అన్నాడు. అంతట రాముడు ఆ రాక్షసుల నుద్దేశించి 'మీరు ఈ ఋషులను వేధిస్తున్నారనే విషయం తెలుసుకొని మేము ఈ అరణ్యానికి వచ్చాం. మేము తాపస జీవితం గడుపుతూ, వీరి రక్షణకు ఉన్నాం. మీ ప్రాణాలు కాపాడుకోవాలంటే, వెనుదిరిగి వెళ్ళండి. మీరు మా జోలికి రాకండి' అని రాముడు బిగ్గరగా అన్నాడు.

రాముని గర్జనకు ఆశ్చర్యపడిన రాక్షసులు ఎర్రని నేత్రాలతో రాముని వంక చూస్తూ 'మా నాయకుడు ఖరుడు మీమీద ఆగ్రహంతో ఉన్నాడు. మిమ్మల్ని చంపమని మమ్మల్ని ఆజ్ఞాపించాడు.ఇంతమంది మాతో పోరాడే శక్తి మీకెక్కడిది? మిమ్మల్ని ఒక్క క్షణంలో భస్మం చేస్తాం.' అని అన్నారు. అంటూనే రాక్షసులు ఆయుధాలతో రామునివైపుకు దూసుకు వెళ్ళారు. కాని రాముడు 14 బాణాలతో వారిని ముక్కలు ముక్కలుగా నరికేశాడు. మరో 14 బాణాలతో వారి హృదయాలను ఛేదించాడు. అంతట వారు రక్తసిక్తులై చనిపోయి, నేలకొరిగిపోయారు. ఈ భయంకర దృశ్యాన్ని చూచిన శూర్పణఖ పరుగెత్తుకొంటూ భయంతో వెళ్ళి తన సోదరులకు జరిగిన వృత్తాంతాన్ని వివరించింది. 'రామలక్ష్మణులను చంపమని 14 మందిని పంపావు. కాని రాముడు వీరిని కేవలం 14 బాణాలతో వధించాడు. నీవు ఇప్పుడు స్వయంగా వెళ్ళాలి. వాళ్ళు నాకు చేసిన అవమానానికి నీవు వాళ్ళను చంపి ప్రతీకారం తీర్చుకోకుంటే, నేను చనిపోతాను' అంటూ శూర్పణఖ దుఃఖవివశురాలై నేలమీద పడి తన పొట్టను తీవ్రంగా బాదుకోసాగింది. సోదరి దుఃఖాన్ని గమనించి, ఖరుడు 'సోదరీ! దుఃఖించకు. నీవు రామలక్ష్మణుల రక్తాన్ని త్రాగేవిధంగా నేను వారిని ఈరోజే చంపుతాను.' అంటూ శపథం చేశాడు. ఈ మాటలకు శూర్పణఖ కొంచెం ఊరట చెందింది. అపుడు ఖరుడు తన రథాన్ని, ఆయుధాలను తెచ్చి, 14 వేల మంది రాక్షస సైన్యాన్ని సమీకరించవలసిందిగా తన సోదరుడైన దూషణుడిని ఆజ్ఞాపించాడు. ఆపై సైన్యంతో ఖరుడు దండకారణ్యానికి బయలుదేరాడు.

రాక్షసులు సాగిపోతుండగా, మేఘాలు రక్తవర్షాన్ని వారిపై కుమ్మరించడంతో అశ్వాలు కుప్పకూలాయి. ఒక రాబందు వచ్చి, ఖరుని రథధ్వజంపై వాలింది. సూర్యకాంతి మసకబారింది. నక్కలు ఊళపెట్టసాగాయి. చీకటి క్రమ్ముకొంది. సూర్యుణ్ణి రాహువు కప్పేశాడు. ఖరుని ఎడమ చేయి ఎంతసేపూ వణుకుతూనే వుంది. అతని గొంతు బొంగురుపోయి నీరసించింది. రానున్న ప్రమాదాన్ని తెలుసుకొని కూడ ఖరుడు 'ఓ రాక్షసులారా! నా శక్తిసామర్థ్యాల ముందు ఆ దుశ్శకునాలను నేను లెక్కపెట్టను' అంటూ అట్టహాసం చేశాడు. ఈలోగా, రాబోయే యుద్ధాన్ని చూడటానికి దేవతలు, ఋషులు అందరూ ఆకాశంలో సమావేశమైనారు. రాక్షసులు సమీపిస్తుండగా, రాముడు లక్ష్మణునితో తనకు కనిపిస్తున్న వైనాన్ని వర్ణిస్తూ లక్ష్మణునితో 'నా బాణాలు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నాయి. నా ధనస్సు ప్రకంపిస్తోంది. సోదరా! సీతను వెంటనే ఒక పర్వత గుహలోనికి తీసుకొని వెళ్ళు. ఆమెను జాగ్రత్తగా చూడు. ఈలోపున ఈ రాక్షసులు ఊచకోత కోస్తాను.' అని రాముడు అన్నాడు.

సీతాలక్ష్మణులు వెళ్ళిన మీదట రాముడు స్వర్ణకాంతులీనే తన కవచాన్ని ధరించాడు. ఆపై రాక్షస సైన్యం యావత్తు తనవైపు వస్తుండగా, రాముడు సర్వాన్నీ లయం చేయగలిగినట్టి కోపాన్ని ఆవేశింప చేసుకొని, మహోగ్రరూపాన్ని ధరించాడు. రాక్షసులు రాముని చుట్టుముట్టారు. ఖరుడు 1000 బాణాలు విడువగ, ఇతర రాక్షసులు గదలు, శూలాలు, ఖడ్గాలు, గండ్రగొడ్డళ్ళు వంటి అసంఖ్యామైన ఆయుధాలను ప్రయోగించారు. కాని రాముడు తన బాణాలతోఅవలీలగా వాటినన్నింటిని ముక్కలు చేసేశాడు. గాయాలు తగిలినా లెక్క చేయలేదు. ఆ తర్వాత రాముడు వేలాది బాణాలను రాక్షసులపై ప్రయోగించి, వారి సర్వాయుధాలను నిర్వీర్యం చేసేశాడు. నిజానికి చాలమంది రాక్షసులు నుగ్గునుగ్గయి చనిపోయారు. కోపించిన రాక్షసులు రామునిపై పోరు సాగించారు. రాముడు వారి ఆయుధాలను నిర్వీర్యం చేసి, వారిని వధించాడు. వారి వికృత శరీరాలను ముక్కలు చేశాడు. ఇదిచూచిన మిగతా రాక్షసులు భయంతో ఖరుని వద్దకు పారిపోయారు. అతనిని ఆశ్రయించారు.

కోపంతో దూషణుడు రామునివైపు సాగాడు. కొందరు రాక్షసులు అతన్ని అనుసరించారు. దానికి ప్రతిస్పందనగా రాముడు గంధర్వ ఆయుధాలలో శ్రేష్ఠమైన దానిని చేత బూనాడు. ఫలితంగా అతని ధనస్సునండి ఎన్నో వేల బాణాలు వచ్చి, రణరంగాన్ని చీకటితో కప్పివేశాయి. వేలదాదిమంది రాక్షసులు హతులైనారు. సూర్యుణ్ణి కప్పివేశాయి. తునాతునకలైన శవాలతో ఆ ప్రాంతమంతా భీభత్సంగా తయారైంది.

కాని దూషణుడు మిగిలిన 5000 మంది రాక్షసులను రామునిపై దాడిచేయమని పురిగొల్పాడు. అప్పటి యుద్ధంలోదూషణుడు వీరోచితంగానే పోరాడాడు. తన బాణాలను త్రిప్పికొట్టడం చూచిన రాముడు తీవ్రంగా కోపించాడు. రాముడు ప్రజ్వరిలుతున్న ఒక శరాన్ని సంధించి దూషణుడి ధనస్సును విరగకొట్టాడు. వాని అశ్వాలను మరో నాలుగు బాణాలతో వధించాడు. మరొక బాణంతో దూషణుని సారథిని శిరస్సును రెండుగా చేశాడు. మరో మూడు బాణాలతో ఆ రాక్షసుని హృదయాన్ని ఛేదించాడు. అమితబాధతో ఉన్నా కూడా, దూషణుడు విరిగిన రథం నుండి క్రిందికి దిగి గదాయుధాన్ని చేతపట్టాడు. రామునివైపు సూటిగా దూసుకుపోయాడు. వెంటనే రాముడు రెండే రెండు బాణాలతో వాడి చేతులను ఖండించి, ఆఖరి బాణంతో వాడిని సంహరించాడు.

దూషణుడి మరణాన్ని చూచిన మిగిలిన రాక్షస సైన్యం ప్రతీకారంతో రాముని వైపు దూసుకు వచ్చింది. రాముడు వాయువేగంతో ఒకదాని వెంట ఒకటిగా 5000 బాణాలను జ్వలిస్తున్న ప్రవాహం లాగా ఉల్కల

మాదిరిగా వర్షించాడు. ఆ ప్రవాహానికి 5000 మంది రాక్షసులు భస్మమైపోయారు. ఈ సంహారాన్ని గమనించిన ఖరుడు మిగిలివున్న వారిని దాడిచేయమని ఆజ్ఞాపించాడు. కాని రాముడు వారినందరిని కూడ సంహరించి వేశాడు. ఈవిధంగా చంపబడిన 14 వేల మంది రాక్షసుల రక్తంతో దండకారణ్యం ఎర్రని రక్తసముద్రంలా తలపించగా, ఖరుడు, త్రిశిరుడు మాత్రమే ప్రాణాలతో మిగిలారు.

రామునిపై ఖరుడు దాడిచేయాలని ఉండగా, త్రిశిరుడు తనను ముందుగా అనుమతించమని కోరాడు. ఖరుడు అంగీకరించగా, మూడు తలల రాక్షసుడు బాణవర్షం కురిపిస్తూ రామునివైపు రాసాగాడు. కొన్ని బాణాలు తన శరీరానికి గ్రుచ్చుకోవడంతో ఆగ్రహించిన రాముడు ప్రతీకారంగా, త్రిశిరుని అశ్వాలు, రథసారథిని చంపి, అతని ధ్వజాన్ని కూల్చివేశాడు. అంట త్రిశిరుడు తన భగ్నరథం నుండి క్రిందికి దూకేందుకు ప్రయత్నిస్తుండగా రాముడు ఒక మహాజ్వాల శరంతో అతని హృదయాన్ని ఛేదించి, మరో మూడు బాణాలతో అతని మూడు తలలను త్రుంచివేశాడు. ఇంకా బ్రతికివున్న కొద్దిపాటి రాక్షసులను కూడగట్టుకొని ఖరుడు రామునిపై భయంకరంగా దాడిచేశాడు. అపుడు జరిగిన భయానక ద్వంద్వ యుద్ధంలో వెలువడిన శరవాహిని గగనతలాన్ని కప్పివేయగా, సూర్యుడు కనిపించకుండా పోయాడు. అంతట తన రథాన్ని నైపుణ్యంతో రాముని సమీపానికి రానిచ్చి, రాముని ధనస్సును రెండుగా విరిచాడు ఖరుడు. ఆ తర్వాత ఖరుడు వెయ్యి బాణాలను వదలి రాముని కవచాన్ని ఛిద్రం చేయగా అది ముక్కలై నేలమీదపడిపోయింది. తన చేతులకు తీవ్రమైన గాయాలు అయినప్పటికి, రాముడు ప్రశాంతంగా విష్ణుధనస్సుకు నారి బిగించాడు. రాముడు అంతట ఖరుని రథధ్వజ చిహ్నాన్ని ఖండించాడు, నాలుగు బాణాలతో ఖరుని అశ్వాలను వధించి, రథసారథి తలను త్రుంచి, ధనస్సును విరిచి, రథాన్ని నుగ్గు చేశాడు. రాముని చివరి బాణం ఖరుని హృదయంలో దిగబడి, అతడు అచేతనుడై క్రింద పడిపోయాడు. కాని వెంటనే తేరుకొని, గదను చేతబూని రాముని ఎదుట నిలబడ్డాడు. రాముడు అపుడు 'ఓరీ పాపాత్ముడవైన క్రూర రాక్షసుడా! ఇతరులను బాధించే నీవు పరమ నీచుడవు. ఇప్పుడే నీ శిరస్సు ఖండించి, నీకు శిక్ష విధిస్తాను.' అని రాముడు నిందించాడు. ఈ మాటలకు ఖరుడు మరింత క్రుద్ధుడైనాడు. రాముని ఉద్దేశించి, 'ఓరీ ధూర్తుడా! నిజమైన వీరులు తమ పరాక్రమాలను గురించి చెప్పుకోరు' అని బిగ్గరగా అరిచాడు.

ఖరుడు తన గొప్ప గదాయుధాన్ని రాముని మీదకు విసిరాడు. నిప్పులు గ్రక్కే ఆ గద మార్గంలోని సర్వాన్ని భస్మీపటలం చేస్తోంది. కాని రాముడు వాయుమండలంలోకి ఎగసిన ఆ గదను బాణాలతో సులభంగా తునకలు చేశాడు. తర్వాత ఉభయులు దూషించుకో సాగారు. పరస్పరం. రామునిపై వేయడానికి ఆయుధాలు లేకపోవడంతో ఒక మహావృక్షాన్ని పెకలించాడు ఖరుడు. నీవు చచ్చావు అంటూ రంకెలు వేస్తూ, ఆ వృక్షాన్ని రాముని మీదకు గిరగిరా త్రిప్పి విసిరాడు. కాని రాముడు ఆ వృక్షాన్ని ముక్కలుగా చేసిపారేశాడు. అంతట యుద్ధాన్ని ముగించగోరి రాముడు ఒకేసారి వెయ్యి బాణాలను వదిలాడు. తన దేహం అంతా రక్తసిక్తమై ఉండికూడా చివరిసారిగా రామునివైపు ఖరుడు దూసుకువచ్చాడు. వాడు చూస్తుండగానే, రాముడు ఒక ప్రజ్వరిల్లే బాణాన్ని సంధించగా, అది ఖరుని గుండెలోనికి దూసుకుపోయి భగభగ మండింది. చిట్టచివరకు ఆ బాధకు తట్టుకోలేక నేలకూలి మరణించాడు.

ఆకాశంలో వేచివుండి ఈ యుద్ధాన్ని వీక్షిస్తున్న దేవతలు అమితానందాన్ని పొందారు. పుష్పవర్షం కురిపించారు. ఒక్కడిగా నిలిచి, వేలాదిమంది భయంకర రాక్షసులను నేలకూల్చిన అద్భుత కార్యానికిగాను దేవతలందరూ రాముని వేనోళ్ళ పొగిడారు. అగస్త్యాది మహర్షులు రాముని ఎదుట ప్రత్యక్షమై 'ఇంతకుముందు

దేవేంద్రుడు శరభంగుణ్ణి దర్శించటానికి కారణం నీచేత ఈ రాక్షసులను సంహరింపజేయడమే. అందుకే శరభంగుడు నిన్ను ఈ ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకోమని చెప్పాడు' అని అన్నాడు.

ఆ తరువాత సీత, లక్ష్మణుడు తాము ఆశ్రయించిన గుహల నుండి వెలుపలకు వచ్చారు. రాముడు సురక్షితంగా, హాయిగా ఉండటం చూచిన సీత మహదానందంతో పరుగెత్తుకొని వచ్చి, రాముని ఆలింగనం చేసుకొంది. ఈ సంహారాన్నుంచి ఎలాగో తప్పించుకొన్న అకంపనుడు అనే రాక్షసుడు లంకలోని రావణుని నివాసానికి వెళ్ళి, అతని సోదరు లిద్దరి మరణవార్తను రావణునికి తెలియజేశాడు. ఈ వార్త విన్న రావణుడు క్రోధంతో 'ఈ దుస్సాహసానికి పూనుకొని తన మరణాన్ని కొనితెచ్చుకొంటున్న దెవరు? వాడిని ఇపుడు ఎవరూ కాపాడలేరు. ఇంద్రుడు, యముడు, విష్ణువు కూడ కాపాడలేరు. తక్షణమే చెప్పు. నాకింత కోపాన్ని తెప్పించ సాహసించిందెవరు?। అంటూ రావణుడు గర్జించాడు. రావణుని కోపానికి భయపడిన అకంపనుడు 'ప్రియమైన ప్రభూ! మీ ప్రశ్నలకు సంతోషంతో జవాబు చెప్తాను. అయితే నాసత్యవచనాలకు నామీద కోపగించనని హామీ ఇవ్వండి.' అని అడిగాడు. అలాగే హామీపొందిన అకంపనుడు 'నీ సోదరు లిద్దరితో సహా 14 వేలమంది రాక్షసులను దశరథ మహారజు పుత్రుడైన రాముడనే మానవుడు వధించాడు.' అంటూ వివరించాడు. 'ఆ రాముడితో పాటు దేవతలు వచ్చారా? అని అడిగాడు రావణుడు.

అందుకు అకంపనుడు 'లేదు ప్రభూ! ఈ రాముడు చివరకు తన తమ్ముని సహాయం కూడ లేకుండానే తానొక్కడే ఈ రాక్షసులను సంహరించాడు. నిజానికి రాముడు ఎంత శక్తివంతుడంటే, ఈ భయంకర కార్యాన్ని అంతటిని రెండు గడియల లోపునే సాధించాడు. రాముని ముందు నిలబడగల వాడెవ్వడూ లేడు. అతనికి కోపం వస్తే, లోకాన్నంతటినీ సర్వనాశనం చేసేట్లుగా కనిపిస్తున్నాడు.' అని బదులు చెప్పాడు.

రావణుడు ఆగ్రహంతో 'నేను తక్షణమే జనస్థానానికి వెళ్ళి ఈ రామలక్ష్మణులను చంపేస్తాను. అపుడు వీరు ఎంతటి వీరులో తెలుస్తుంది.' అని ప్రకటించాడు.

కాని అకంపనుడు మాత్రం రావణుని హెచ్చరిస్తూ ఇలా అన్నాడు. 'దయచేసి రాముని శక్తిసామర్థ్యాలను తక్కువ అంచనా వేసి, నష్టపడకండి. అతడు సమస్త విశ్వాన్నే నాశనం చేయగల సమర్థుడు. విశ్వాన్ని సృష్టించగలడు, దేవతలు దానవులు అందరూ కలిసివచ్చినా అతనిని జయించగలరని నేను అనుకోను. ప్రభూ! అందుచేత నీవు బలప్రయోగంతో అతనిపై దాడికి పూనుకోవద్దు. అయితే రాముడు మరణించేందుకు ఒక ఉపాయం ఉంది. రాముని భార్య అనుపమాన సౌందర్యరాశి. వేయిచంద్రుల రమణీయత ఆమె ముఖంలో ఉంది. స్త్రీత్వ ఆకర్షణకు ఆమె ప్రతీక. పతివ్రతల్లో, సత్ప్రవర్తనలో పరిపూర్ణురాలు. సీత లేకుంటే రాముడు ఎక్కువ కాలం జీవించలేడు. అందుచేత మీరు వెళ్ళి సీతను అపహరించాలని నా సలహా.' అని అన్నాడు. రావణుడు 'నీ ఆలోచన అద్భుతం. నేను రేపే పంచవటికి వెళ్ళి, ఆనందంతో బలవంతంగా సీతను ఎత్తుకొని వస్తాను.' అని అన్నాడు.

అకంపనుడు వెళ్ళిన తర్వాత, రావణుడు తాటక కుమారుడైన మారీచుని ఆశ్రమానికి వెళ్ళాడు. మారీచుడు రావణుని గౌరవించి, స్వాగతించి 'ఓ రాక్షసేంద్రా! నీ విక్కడికి ఆకస్మికంగా వచ్చావేమి? ఏదో అతి ముఖ్యమైన కార్యం లేనిదే నీవు ఇలా రావు అని నాకు తెలుసు అని అన్నాడు. సమాధానంగా రావణుడు 'నీవన్నది నిజమే. రాముడనే మానవుడు ఒకడు జనస్థానంలో నియమించబడిన నా రాక్షస సైన్యాన్ని తెడిచిపెట్టాడు. వాని తమ్ముడు లక్ష్మణుడు నా సోదరి ముక్కుచెవులు కోశాడు. నా సోదరులు ఇద్దరూ ఏమీ చేయలేకపోయారు. వారిని వధించడం

జరిగింది. కనుక మారీచా! నేను రాముని భార్య సీతను అపహరించాలని పథకం వేశాను. కనుక నీవు నాకు సాయం చేయాలి.' అని జవాబిచ్చాడు.

మారీచుడు భయానికి, ఆశ్చర్యానికి లోనై యిలా అన్నాడు.'నీకు ఎవరు ఈ ఆలోచన కలిగించారో గాని, అతను మిత్రుని రూపంలో ఉన్న నీ శత్రువే సుమా! ఓ రావణా! నీవు ఈ ప్రకారం ప్రయత్నించి, సీతను అపహరించావంటే, నీ సర్వనాశనం జరిగి తీరుతుంది. ఎందుకంటే రామునికి శ్రీమహావిష్ణువు స్థాయిలో మహా పరాక్రమం వుంది. రాముడు ఒక అగాధ సముద్రం వంటివాడు. అతని ధనస్సే మకరాలు. అతని శక్తివంతమైన భుజాలే సుడిగుండాలు. ఆయన విడిచే బాణాలే ఎగసే తరంగాలు. ఒక తీరం నుండి మరొక తీరం వరకు వ్యాపించి వున్న ఆయన యుద్ధక్షేత్ర సాగరంలో ఆయన శత్రువులు మునిగిపోతారు. ఓ రాక్షసరాజా! నీవు నీ కోపాన్ని వదలి లంకకు తిరిగి వెళ్ళు. అదే నీకు శ్రేయస్కరం అని చెప్పగలను. నీ భార్యతో సుఖించు. దండకారణ్యంలో రాముని తన భార్యతో సుఖించనివ్వు. లేకపోతే, నీ వినాశనాన్ని నీవే నీ తలమీదకు తెచ్చుకొన్న వాడివవుతావు.' అని చెప్పగా, రావణుడు సలహా స్వీకరించి, తన లంకలోని రాజప్రాసాదానికి తిరిగి వెళ్ళాడు. ఈలోగా శూర్పణఖ పరమ కుపితయై తన సోదరుడైన రావణుని చూడటానికి లంకకు వెళ్ళింది.

రావణుడు పది తలలు, 20 భుజాలు గలవాడు. అతని దేహం మీద విష్ణువు సుదర్శన చక్రపు గాయాలు, వివిధ పోరాటాలలో తగిలిన గాయాల గుర్తులుంటాయి. ఒకసారి రావణుడు నాగుల రాజధానియైన భోగవతిపై దాడి చేశాడు. వాసుకి, తక్షకులను ఓడించి, తక్షకుని భార్యను బలవంతంగా ఎత్తుకు పోయాడు. తరువాత రావణుడు కుబేరుని జయించి, అతని పుష్పక రథాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. అంతట దుర్బుద్ధితో అతడు కొన్ని దివ్యమైన ఉద్యానాలను ధ్వంసం చేశాడు.

**చాలకాలం క్రిందట, రావణుడు తపస్సుకు పూనుకొని 10 వేల సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత యజ్ఞంలో బ్రహ్మదేవునికి తన పది శిరస్సులను సమర్పించసాగాడు. రావణుని తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడు  మానవులు మినహా మరియే యితర ప్రాణుల చేతుల్లోనూ మరణం సంభవించకుండా వరాన్ని ప్రసాదించాడు. ఈ వరాన్ని పొందిన తర్వాత, రావణుడు అహంకారంతో బ్రాహ్మణులను చంపుతూ, వారి యజ్ఞాలను ధ్వంసం చేయసాగాడు. అలా అతడు దేవతలకు ప్రక్కలో బల్లెం కాగా, దేవతలు శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళి, అతనిన నాశనం కోరుతూ ఎంతగానో ప్రార్థించారు.**

రావణుడు తన ప్రాసాదంలో సింహాసనం మీద ఆసీనుడై ఉండగా, శూర్పణఖ వచ్చి తన వికృత రూపాన్ని చూపించి, ఇలా అన్నది 'ప్రియ సోదరా! నీకు రానున్న ప్రమాదాన్ని గుర్తించలేని ఇంద్రియ సంతృప్తీకరణలో నిమగ్నుడవై ఉన్నావా? రాజు రాజ్య పరిసరాలలో ఆసక్తి చూపకపోతే, అతడు అవజ్ఞుడవుతాడు. రాముడు ఒక్కడే ఒక్కడు నీ ఇద్దరి సోదరులతో సహా 14 వేల మంది రాక్షసులను సంహరించిన విషయాన్ని నీ గూఢచారులు నీక నివేదించలేదా?

నీవెందుకూ పనికిరాని రాజువి. నీవు ఈ సింహాసనంపై ఎక్కువ కాలం నిలువలేవని నేను ముందుగానే హెచ్చరిస్తున్నాను.' అని శూర్పణఖ అన్నది. తన మంత్రుల ఎదుట ఇలా ఆమె ఎత్తిపొడుపు మాటలు అనడంఓ రావణునికి జ్వలనం కలిగించింది. మహాకోపంతో 'ఎవడీ రాముడు? వాడి శక్తిసామర్థ్యాలేమిటి? నిన్నిలా వికృత

పరచింది వారేనా? అన్ని విషయాలు పూర్తిగా నాకు చెప్పు' అని అడిగాడు.

శూర్పణఖ ఇలా జవాబు చెప్పింది. 'రాముడు తన శక్తివంతమైన దీర్ఘ బాహువులతోను, అరవింద దళాల నేత్రాలతోను మన్మథుడిలా ఉంటాడు. శ్యామలమైన దేహచ్ఛాయం, సింహం వంటి దృఢకాయుడు. అతని విల్లు ఇంద్ర ధనస్సులా ప్రకాశవంతమైనది. ఆయన ప్రయోగించే సువర్ణ శరాలు విషభుజంగాల్లా ఉంటాయి. తూణీరాలు వేసే వేగం అంతు చిక్కదు. అతడు మహాధీరుడైన క్షత్రియుడైనను, నారవస్త్రాలు ధరించి, జింకచర్మం ధరించి ఉంటాడు. జడలుంటాయి. తన శరపరంపరతో రాక్షస సేనను తుడిచి పెట్టాడు. ఖరదూషణులు సైతం పరాజితులను చేసిన అసమాన పరాక్రమముడు. అతడు ఎంత అసాధారణ శక్తిసంపన్నుడంటే, తాను నదీప్రవాహాన్ని దారి మళ్ళించగలడు. గ్రహనక్షత్రాలను ఆకాశంనుండి క్రిందికి దించగలడు. నాకు నమ్మకం ఉంది. రాముని తమ్ముడు లక్ష్మణుడు. అతడే నా ముక్కుచెవులు కోసేశాడు. రాముని భార్య సీత. ఆమె లక్ష్మీదేవివలె ఉంటుంది. అతి సౌందర్యరాశి. రావణా! సీతవంటి స్త్రీ మరొకరు వుండరు. ఆమెను చూస్తే నీవు మోహావేశంలో మునిగిపోతావు. ఆమె నీకు పరిపూర్ణమైన భార్య కాగలదు. నేను ఆమెను లాక్కొని నీ వద్దకు తీసికొని వస్తామనుకొన్నాను. దానికి బదులుగా లక్ష్మణునిచే వికృతపరచ బడ్డాను. ప్రియ సోదరా! నీవు నిజంగా గొప్ప వీరుడవైతే, ఇప్పుడే వెళ్ళి సీతను అపహరించుకు రావాలి' అని చెప్పగా, రావణుడు సీతను తన స్వంతం చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చాడు. మళ్ళీ రథమెక్కి మారీచుని వద్దకు వెళ్ళాడు. మారీచుడు గౌరవంగా 'ఓ రాజా! మళ్ళీ ఇంత త్వరలో నావద్దకు వచ్చిన కారణమేమిటి?' అని ప్రశ్నించాడు. దానికి రావణుడు 'రాముడు రాక్షసులను ఊచకోత కోసిన వైనం నేను జీర్ణించుకలేక పోతున్నాను. శాంతి లేదు. అందుకే నేను సీతను అపహరించాలని నిశ్చయించుకొన్నాను నీ సాయం నాకు అవసరం. అందుకు ఒక పథకం వేశాను. నీవు ఒక బంగారు లేడి రూపాన్ని ధరించు. ఆ తరువాత వెళ్ళి సీత ముందు ఆటలాడు. ఆమె ఆకర్షితురాలై, స్వంతం చేసుకోవాలని ఆశపడుతుంది. నిన్న పట్టి తెమ్మని రాముని కోరుతుంది. గంతులేస్తూ నీవు రాముని దూరంగా తీసుకుపో. నీవీ పని చేయడంతో నేను వచ్చి సీతను అపహరించుకొని లంకకు తీసికొని వెళ్తాను. ఆ తరువాత రాముడు దుఃఖితుడై బలహీనపడగా, నేను అతనిని చంపుతాను' అని చెప్పాడు.

రాముని పేరు వినగానే మారీచుడు భయపడి పోయాడు. రావణుని వంక చూస్తూ చేతులు జోడించి 'ఓ ప్రభూ! నీవు ఈ పథకం అమలు చేస్తే, దానితో నీ సకల రాక్షస జనం, వారితో బాటు లంకారాజ్యం సర్వనాశనం అయిపోతుంది. నీ అవివేకంతో రాముని పరాక్రమాన్ని గుర్తించలేక, కామప్రవృత్తితో వినాశనాన్ని కోరుకొంటున్నావు. నీవు ఈ వినాశనానికి ముందు, నేను రాముని మహిమను గురించి చెప్పే నాలుగు మాటలు విను.

నేను పూర్వం నా మానవాతీత శక్తితో, గర్వంతో గదాయుద్ధంలో భూమండలమంతా తిరుగుతుండే వాడిని. విశ్వామిత్రుడు చేసే యాగాన్ని నా సోదరుడు సుబాహునితో కలిసి ఆటంక పరిచేవాడిని. విశ్వామిత్రుడు భయంతో దశరథ మహారాజు వద్దకు వెళ్ళి తన యజ్ఞాన్ని రక్షించుకోవటం కోసం రాముని సహాయాన్ని అర్థించాడు. తర్వాత రాముడు విశ్వామిత్రుని యజ్ఞవాటికను పరిరక్షిస్తుండగా, నేను అవివేకంతో భంగం చేయయాలని అక్కడికి వెళ్ళాను. కాని ఒకే ఒక్క బాణంతో రాముడు సుబాహుని చంపేశాడు. ఆ తర్వాత మరొక బాణంతో నన్ను 800 మైళ్ళ దూరానికి విసిరివేసి, సముద్రంలో పడేలా చేసి, నాతో ఉన్న రాక్షసలందరిని సంహరించాడు. రామునిచే అలా వదలిపెట్టబడిన నేను తిన్నగా స్పృహలోనికి వచ్చి, తిరిగి లంకకు చేరుకొన్నాను. కాని అప్పటికీ నా అనుచిత గర్వం తగ్గలేదు. ఒక దుప్పి రూపం ధరించి మళ్ళీ దండకారణ్యానికి వెళ్ళి, ఋషుల మాంసాన్ని

తినసారంభించాను. అక్కడే రాముని, లక్ష్మణుని, సీతను చూడటం జరిగింది. రాముడి సన్యాస జీవితాన్ని గమనించి, ధైర్యంతో ప్రతీకారం తీర్చుకోవాలనే నిర్ణయంతో రామునివైపు ముందుకు ఉరకగానే, రాముడు మూడు బాణాలను వదిలాడు. నా సహచరులు ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. నేను పారిపోయాను. పారిపోయే వానిని రాముని బాణాలు చంపవు కనుకనే, నేను బ్రతికి పోయాను. ఆనాటి నుండి రాముడంటే నాకు భయం. దానితో నాలోని పోరాట స్వభావం, హింసాప్రవృత్తి నశించి పోయాయి. ద్వేషభావాన్ని వీడి, తపోజీవనాన్ని స్వీకరించాను. ఏ వస్తువును చూచినా నాకు నారవస్త్రాలు ధరించిన రాముడే గుర్తుకు వస్తుండటంతో నాకు మనశ్శాంతి లభించలేదు. నా స్వప్నాల్లో రాముడు కనిపిస్తాడు. రాముడంటే నాకు అమిత భయం ఏర్పడింది. ఎందుకంటే రకారంతో మొదలయ్యే రథం, రత్నం వంటి మాటలు వింటున్నప్పుడు కూడ నా గుండె భయంతో దడదడలాడుతున్నది. ఓ రాజా! నీ శ్రేయస్సు కోరి, సీతాపహరణాన్ని మరిచిపొమ్మని కోరుతున్నాను. అసలు నీవు అంతటి పాపకార్యం ఎందుకు చేయాలి? పరస్త్రీ అపహరణ కంటె మించిన పాపం మరొకటి లేదు. నీకున్న వేలకొలది భార్యలతో సుఖిస్తూ, రాజభోగాలు అనుభవిస్తూ, నీ ప్రాణాల్ని కాపాడుకో.' అని సలహా ఇచ్చాడు మారీచుడు. అంతావినిన రావణుడు మారీచునితో 'మారీచా!నేను చెప్పేది కూడ నీవు వినాలి. నేనేమీ నీ సలహా కోసం ఇక్కడకు రాలేదు. సీతాపహరణలో నీ సాయంకోరి వచ్చాను. అడిగితే సలహా లివ్వడం, నా ఆజ్ఞలను శిరసావహించటం సచివునిగా నీ ధర్మం.

నేనిప్పటికే ఒక నిర్ణయానికి వచ్చాను. ఇక ఏదీ నన్ను ఆపలేదు. సీతను ఆకర్షించటం కోసం నీవు ఒక బంగారు లేడిగా మారు. ఆమె రాముణ్ణి నిన్ను పట్టుకోమని కోరగానే నీవు రాముణ్ణి అడవిలోనికి నడిపించు. రాముడు నీపై బాణం వదలగానే పారిపోతూ, 'హా లక్ష్మణా!' 'హా సీతా!' అని కేక వేయాలి. అన్న ఏదో ప్రమాదంలో ఉన్నాడని భావించి లక్ష్మణుడు సీతను వదలి అడవిలోనికి వస్తాడు. నీవు ఈ సాయం చేశావంటే, నీకు నా అర్ధ రాజ్యాన్ని ఇచ్చి, సత్కరిస్తాను. నీవు తిరస్కరిస్తే, నిన్ను ఇప్పుడే చంపేస్తాను. కనుక తేల్చుకో. నా చేతుల్లో మరణించటమా లేక రాముని మోసగించడమా, ఏదో ఒక నిర్ణయానికి త్వరగా రా'. అని అన్నాడు.

అయితే మారీచుడు అతి ధైర్యంగా ఇలా చెప్పాడు. 'ప్రభూ! ప్రశంసించేవారు సులభంగా దొరుకుతారు. శ్రేయస్సు కోరి, అయిష్ట వచనాలు పలికేవారు అరుదుగా దొరుకుతారు. సచివుడు రాజు మేలు కోరి సరైన మార్గాన్ని చెప్పాలి. కాని చావు మూడినవాడు ఎలాంటి సలహాలు స్వీకరించడు. ఓ రాజా! మళ్ళీ చెపుతున్నా. నీవు ఈ పథకం అమలు చేస్తే, మనం ఇద్దరం మరణించటం ఖాయం. అయినా ఇక్కడ నీ చేతిలో మరణించడం కంటే, శత్రువు చేతిలో యుద్ధభూమిలో మరణించడమే శ్రేష్ఠమని భావిస్తాను. కనుక ఇద్దరం ఇప్పుడే బయలు దేరుదాం.'

రావణుడు మారీచుణ్ణి కౌగిలించుకొన్నాడు. వారిద్దరు గగనంలో రథాన్ని ఎక్కి బయలుదేరారు. అనేక అరణ్యాలు, నదులు, పట్టణాలు దాటారు. చివరకు సీతారాములు నివసించే నివాసానికి దగ్గరలో దిగారు. రథం దిగగానే, మారీచుడు తనకు తాను ఒక సుందరమైన బంగారు లేడి రూపాన్ని ధరించాడు. అంతట రాముని కుటీరాన్ని సమీపించి, చెంగు చెంగున గంతులు వేయసాగాడు. నిజానికి ఆ మాయలేడి పలురకాలైన విలువైన రత్నమాణిక్యాలతో నిర్మించబడినట్లుగా అద్భుతంగా, ఆకర్షణీయంగా తేజోరాశిగా వెలుగొందుతున్నది.

తన వెలుగులతో ఆ ప్రాంతాన్నంతా తేజోమయం చేస్తోంది. వింత వింత పోకడలతో అక్కడ సంచరిస్తోంది. ఆ సమయంలో సీత పుష్పాలను సేకరిస్తోంది. ఆమెను ఆకర్షించటం కోసం, లేడి రూపంలో ఉన్న మారీచుడు గంతులు వేశాడు. పరుగులు తీశాడు, దాగుడుమూతలాడాడు. కాని ఈ రాక్షస వాసనను గుర్తించిన, ఆ ప్రాంతపు తక్కిన లేళ్ళు అక్కడినుండి పారిపోయాయి. మాయలేడి సీతను సమీపించి నిలిచింది. అలాంటి అద్భుతమైన లేడిని ముందెన్నడూ చూచి ఉండనందున, సీత ఆశ్చర్యానికి లోనై 'రామా! లక్ష్మణా! ఇటు రండి.' అని బిగ్గరగా పిలిచింది. రాముడు, లక్ష్మణుడు వెంటనే వచ్చి, ఆ మాయలేడిని చూచారు. కాని లక్ష్మణునికి అనుమానం వచ్చింది. మాయరూపాలు ధరించి మారీచుడు దండకారణ్యంలో తిరుగుతూ రాజులను కూడా వధిస్తుంటారనే సమాచారం లక్ష్మణునికి తెలుసు. సీత లక్ష్మణుని అనుమానానికి అడ్డు తగిలింది.

అంతట సీత 'రామా! నన్ను ఆకర్షించిన ఆ లేడిని పట్టుకో. నాకు పెంపుడు జంతువుగా ఉంటుంది. మనం తిరిగి అయోధ్యకు వెళ్ళేటప్పుడు ఆ లేడిని నేను వెంట తీసుకొని వస్తాను. దానిని చూచి భరతుడు తల్లులు సంతోషిస్తారు. రామా! నాకు అది ఎంతో ముద్దొస్తోంది. చందమామలా మెరుస్తోంది ఒకవేళ దానిని నీవు ప్రాణంతో తేలేకపోతే, దాని అందమైన చర్మం నేను కంబళిగా ఉంచుకొంటాను. నన్ను మూర్ఖురాలినిగా భావిస్తారా? అయినా నాకు ఆ లేడి కావాలి. రామా! నేను పూర్తిగా సమ్మోహితురాలనైనాను.' అని సీత అడిగింది. సీత కోర్కె తీర్చేందుకు రాముడు అభిలాషపడ్డాడు. రాముడు కూడ ముగ్ధుడైనాడు లేడి అందాన్ని చూచి. రాముడు 'లక్ష్మణా! లేడి ఎంత అందంగా వుందో చూడు. స్వర్గంలో కూడ ఇలాంటి లేడి ఉండదు. దాని స్వర్ణమయ చర్మాన్ని సీతకు బహూకరించి ఆనందిస్తాను. ఒకవేళ నీవు అనుమానిస్తున్నట్లు ఆ లేడి మారీచుడే అయితే, వాని మరణంతో ఈ ఋషులందరికి రక్షణ లభిస్తుంది కదా! లక్ష్మణా! నేను తిరిగి వచ్చేవరకు ఇక్కడే ఉండి, సీతను సంరక్షిస్తూ వుండు!' అని అన్నాడు రాముడు.

అతడు ఒక ఖడ్గాన్ని, ధనస్సును, రెండు తూణీరాలను తీసుకొన్నాడు. అంతటితో మారీచుడు కనపడకుండా అదృశ్యమైపోయాడు ఆ లేడి కనిపిస్తూ, పారిపోతూ అరణ్యంలో చాలాదూరం పారిపోయి, రాముని ప్రలోభపెడుతూ వుంది. రాముడు పట్టుకోబోయే లోగా మాయమై పోయేది మళ్ళీ రాముని సమీపించేది. ఇలా మారీచుడు రాముణి చాలా దూరం తీసికొని పోయాడ. రాముడు అలసిపోయి ఒక వృక్షఛాయలో విశ్రమించాడు. అపుడు ఆ లేడి మళ్ళీ ప్రత్యక్షమైంది. రాముడు దానిని పట్టుకొందామని లేచేలోగానే అది అంతర్ధానమై పోయింది. ఇక ఈ లేడిని ప్రాణంతో పట్టుకోవటం అసంభవం అని భావించిన రాముడు దానిని చంపుటకు మహోజ్యలమైన బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. దానిని తప్పించుకునేందుకు మారీచుడు ఆకాశంలోకి ఎగిరాడు. కాని అది వాని హృదయాన్ని ఛేదించింది. ప్రాణాపాయంతో మారీచుడు తన నిజ రాక్షసరూపాన్ని ప్రదర్శిస్తూ నేలకూలాడు. కాని రావణుని సలహా గుర్తుకు వచ్చి, రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ 'హా లక్ష్మణా!" 'హా సీతా!' అంటూ వేదనతో గావుకేక పెడుతూ, ప్రాణం వదిలాడు.

మారీచుడు వేసిన గావుకేకలు విన్న రాముడు భయంతో పర్ణశాలవైపు పరుగులు తీశాడు. కాని సీత మారీచుని స్వరం విని, రాముడే సాయం కోరుతున్నాడేమోనని భీతి చెందింది. అందుచేత సీత లక్ష్మణునితో 'లక్ష్మణా! నా గుండె దడదడలాడుతున్నది. రామునికేమైనా అయిందేమో. రాక్షసుల ధాటికి ఏమైనాడో" అంటూ తొందర చేసింది. కాని రామాజ్ఞ ప్రకారం లక్ష్మణుడు కదలలేదు.

లక్ష్మణుని నిర్లక్ష్యంతో సీత మరింత ఆందోళన చెందింది. శోకంతో లక్ష్మణునితో 'ఊరికే నిలబడ్డావేమిటి? రాముడు మరణించాలని వుందా? నీవు శత్రువులా కనిపిస్తున్నావు. నాకోసం నీవు రాముని మరణాన్ని కోరుకొంటున్నావు. లేకపోతే నీవు పరుగెత్తేవాడివే! వంటనే వెళ్ళు' అని అన్నది.

సీత వెక్కి వెక్కిఏడుస్తుండగా, లక్ష్మణుడు నిగ్రహించుకమని చెప్పాడు. 'రామునికి ఎవరూ హాని చేయలేరు. మారీచుడు పన్నిన కుట్రయే ఇది అని నాకు గట్టి నమ్మకం ఏర్పడింది. నిన్ను సంరక్షిస్తూ ఉండమని రాముడు చెప్పాడు. నేను ఇక్కడే ఉండి, నీ రక్షణ బాధ్యత నుండి తప్పుకోలేను. రాముని ఎవ్వరూ ఏమీ చేయలేరు.' అని జవాబు చెప్పాడు.

లక్ష్మణుని ఈ మాటలు సీతకు మరింత కోపాన్ని రగిలించాయి. కోపోద్వేగంతో సీత 'సిగ్గులేని దుర్మార్గుడా! రాముని దురదృష్టానికి నీవు సంతోషిస్తున్నావా? లేకుంటే అంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటావు? నీవు సేవకునిగా నటిస్తున్నావు. నీవు కామవాంఛల కోసమే రామునితో అడవులకు వచ్చావు. భరతునికి సాయం చేయాల్సిన నీకున్నది. కాని నీ తుచ్ఛ కోర్కెలను తీర్చుకోలేవు. రాముని పత్నియైన నేను నిన్ను అంగీకరిస్తాననుకొంటున్నావా? అంతకంటే మరణమే నాకు మేలు. నిజానికి రాముడు లేనిదే ఒక్క క్షణమైనా నేను బ్రతికి ఉండనని తెలుసుకో.'

ఇంతటి తీవ్ర పదప్రయోగంతో లక్ష్మణుని హృదయం పగిలిపోయింది. లక్ష్మణుడు చేతులు జోడించి 'ఓ మిథిలా రాకుమారీ! నీవు నాకు దేవతలాంటి దానవు. అందుచేత పరుషంగా నేను బదులు ఇవ్వలేను. గొడవలు సృష్టించడం స్త్రీ స్వభావం. వారు చపలచిత్తులు, కఠినహృదయలు. కనుకనే స్త్రీ ఏదేని కోరిక వుంటే, దానికోసం మిగతా భావాలకు తిలోదకాలిస్తారు. నీకు ఏదో విపత్తు ముంచుకు వస్తుందనే దుశ్శకునాలు నాకు పొడగట్టంతోనే, నేను వెళ్ళి రామునితో తిరిగి వచ్చేసరికి, నీవిక్కడ కనిపించవేమోనని భయపడుతున్నాను. అంతే తప్ప మరేమీ లేదు.' అని సమాధానం ఇచ్చాడు. కాని సీత విపరీతమైన భయంతో రాముడు వధించబడితే, నేను ప్రాణత్యాగం చేసుకొంటాను అని అనగా, లక్ష్మణుడు అటు రామాజ్ఞ, ఇటు సీత పరుష వచనాల మధ్య పోకచెక్కలా నలిగిపోయాడు. ఆ తర్వాత లక్ష్మణుడు ఆలోచించి, గత్యంతరం లేని పరిస్థితుల్లో, లక్ష్మణుడు కుటీరాన్ని వదలడం రావణునికి అవకాశం కల్పించినట్లయింది.

రావణుడు మారువేషంతో పరివ్రాజకునిలా సీత ఎదుట ప్రత్యక్షమైనాడు. రావణుడు గుమ్మం వద్దకు వచ్చేసరికి, సీత రాముడు రాలేదని శోకిస్త, దుఃఖాశ్రువులను రాలుస్తూ ఉంది.

గాలి వీయటం ఆగింది. చెట్ల ఆకులు కదలటం మానేశాయి. గోదావరి జలఘోష ఆగిపోయింది. వేదమంత్రాలు ఉచ్ఛరిస్తూ, రావణుడు సీతను సమీపించాడు. సీతను సమ్మోహన పరచదలంచి, రావణుడు ఇలా అన్నాడు. 'ఓ సుందరాంగీ! ఈ భయంకర అడవిలో ఒంటరిగా ఉన్న నీవు ఎవరవు? నీవు పదం ్మలేని సాక్షాత్తూ లక్ష్మీదేవివే అయివుంటావు. నీ ధవళ శోభిత సుందరరూపం నన్ను సమ్మోహితుని చేస్తోంది. నీ పద్మలోచనాలు చంద్రుని తలపిస్తోంది. నీ శరీరం యావత్తూ అత్యంత సమ్మోహభరితంగా ఉంది. నీ సౌందర్య విలాసం నన్ను ఇంతగా మోహింపచేసే దేనితోగాని సాటిరాదు. ఓ సుందరాంగీ! వేరేచోట భోగాలనుభవించిన నీవు ఇక్కడ ఎందుకున్నావు? నీవు మణిమాణిక్యాలతో శోభిస్తూ, అసంఖ్యాక పరిచారికలతో తులతూగుతూ ఉండాల్సిన దానవు. నీవు ఎవరి భార్యవు? నీవు నాలాంటి భర్తను ఎన్నుకొని ఈ అరణ్యం వదలివేయి' అంటూ దుష్టవచనాలను పల్కినా, వాడు బ్రాహ్మణుడని తలంచి, సీత వానికి అతిథి సత్కారాలు అందించింది. అతనికి సముచిత సత్కారం

చేసి ఇలా అన్నది. 'స్వామీ నా పేరు సీత. మిథిలాధిపతి జనక మహారాజు కుమార్తెను. రాముణ్ణి వివాహమాడాను. దశరథుడు తన భార్య మాటలను విని, నా రాముని అరణ్యాలకు, భరతునికి పట్టాభిషేకం చేయ నిశ్చయించారు. కనుక మీరు మీ పేరు చెప్పి, ఎందుకు ఈ అరణ్యానికి వచ్చారో దయచేసి తెలుపండి.' అని అనగా, రావణుడు తన మనోభావాలను నిగ్రహించుకోలేక, ఉత్సాహంతో 'నేను రాక్షసులరాజు రావణుణ్ణి. నా పేరు విన్నంత మాత్రాన్నే దేవతలు గజగజలాడతారు. ఓ సుందరీమణీ! నేను నిన్ను చూశాక, నా అసంఖ్యాక భార్యలతో సుఖాన్ని పొందలేను. నా ప్రియమైన సీతా! నీవు నా పట్టపురాణివి అయితే, 5000 మంది దాసీజనం నీ ఆజ్ఞల కోసం ఎదురు చూస్తుంటారు, నీ సేవలో ఉంటారు. ఈ అడవిని వదలివేసి, నాతో లంకకు వచ్చి, సల భోగభాగ్యాలను అనుభవించు' అని పలికాడు.

రావణుని మాటలు విన్న సీత ఆగ్రహోదగ్రురాలైంది. ఇలా బదులు ఇచ్చింది. 'పర్వతం వలె స్థిరుడు, సాగరం వలె గంభీరుడు, వటవృక్షం వలె ఆశ్రయప్రదాతయైన రాముడికి నేను సంపూర్ణంగా అంకితమైన దానిని. మహాభాగుడు, పూర్ణచంద్రముఖుడు, ఆత్మనిగ్రహ సంపన్నుడు, ధర్మపరాయణుడు అయిన రామునికి అంకితమైన దానిని. రాముడు నరులలో సింహంవంటి వాడు. జంబూకం వంటి వాడవైన నీవు, సింహికలాంటి నన్ను చేపట్ట గోరుతున్నావు. సూర్యుణ్ణి స్పర్శించటానికి, మంధరపర్వతాన్ని ఎత్తటానికి సాహసిస్తున్నావా? నీ మెడకు గుదిబండ కట్టుకొని సముద్రాన్ని ఈదుతావా? మరి రాముని భార్యనే తీసికొని పోతానని ఎందుకు సాహసం చేస్తున్నావు? రాముడు గరుత్మంతుడు అయితే నీవు ఒక కాకివి మాత్రమే. రాముడు మహాసాగరమైతే, నీవొక బురదగుంటవు. రాముడు అమృతం, నీవు గంజివి. రాముడు శ్రీగంధం, నీవు బురదవు. ఆయన సువర్ణం, నీవు ఇనుమువు. రాముడు హంస, నీవు రాబందుకంటే కూడా హీనుడవు. నీవు నన్ను అపహరించ వచ్చావు. కాని రాముడు జీవించి వున్నంత కాలం నీవు నీటిలో పడి తన్నుకునే ఈగకు మించి నన్నేమీ అనుభవించలేవు. పైకి ధైర్యంగా మాట్లాడుతున్నా, సీత లోపల భయంతో వణికిపోతోంది.

ఆమెను భయపెట్టాలని రావణుడు 'నా సుందరాంగీ! అర్థం చేసుకో. నేను ధనాధిపతియైన కుబేరుడి సవతి తమ్ముణ్ణి. అతన్ని ఓడించి అతని పుష్పక రథాన్ని నేను స్వాధీనం చేసుకొన్నాను. ఇప్పుడు అతడు కైలాస పర్వతంలో దాగి వున్నాడు. నేనంటే దేవతలు భయపడతారు. నేనెక్కడికి వెళ్ళినా సూర్యకిరణం వెన్నెలగా మారుతుంది. గాలి ఆగిపోతుంది. నదులు ప్రవహించటం మానేస్తాయి. రాముణ్ణి మరచిపో. అతడు కేవలం మానవుడు. త్వరలోనే నశించిపోతాడు. నాతో వచ్చి స్వర్గసౌఖ్యాలు అనుభవించు. నేను నీకోసం కామంతో రగిలిపోతున్నాను. నన్ను నిరాశపరచవద్దు' అని అన్నాడు.

అందుకు సీత సమాధానంగా 'నీవు నిజంగా కుబేరుడి సోదరుడవైతే, ఇలాంటి దుష్ట ఆలోచనలు ఎందుకు చేస్తున్నావు? ఇంద్రుని భార్యను బలాత్కరించిన వాడెవడైనా బ్రతకగలడేమోగాని, నాపై అత్యాచారానికి పాల్పడిన వాడెవడైనా సరే సర్వనాశనం కాక తప్పదు.' అని అన్నది సీత.

ఈ మాటలతో రావణుడు పూర్తిగా ఓర్పును కోల్పోయాడు. చివరకు తన పది తలలు, ఇరవై చేతులతో క్రూర రాక్షస రూపాన్ని బయల్పరచాడు. అంతట వాడు 'ముల్లోకాలలో పేరుగాంచిన వాని భార్యగా ఉండదలచుకొంటే, నన్ను స్వీకరించు. అడవులకు పంపబడిన రాముడంటే నీకెందుకు అంత ప్రీతి? నేను నిన్ను ఎన్నటికి అసంతుష్టి పరచను గదా!' అంటూ రావణుడు సీత జట్టు తన ఎడమ చేతితో దొరకబుచుచకొన్నాడు. పిలవగనే వాడి స్వర్ణ

రథం దగ్గరకు వచ్చింది. తన కుడిచేతిని ఆమె తొడపై ఉంచి, భీతితో వణికిపోతున్న సీతను తన చేతుల్లోకి తీసుకొని ఆకాశంలోనికి పైకి లేచాడు. వారు అలా ఆకాశ మార్గాన వెళుతుండగా, సీత 'రామా! రామా! నన్ను కాపాడు. ఈ దుష్ట రాక్షసుణ్ణి సంహరించు' అంటూ కేక పెట్టింది. దిక్కుతోచని సీత తన అపహరణను రామునికి చెప్పమని ప్రకృతిని వేడుకొంది. సరిగ్గా అదే సమయానికి ఒక చెట్టుపై కూర్చొని నిద్రిస్తున్న జటాయువును సీత చూచింది. 'జటాయూ! దయచేసి నాకు సాయం చేయి. నీవు వెంటనే వెళ్ళి నన్ను దుష్ట రావణుడు అపహరించాడని రామునికి చెప్పు' అని ఎలుగెత్తి చెప్పింది. సీత కేకను విన్న జటాయువు, రావణుడు ఆమెను తీసుకొని వెళ్తున్నట్లుగా గమనించి 'ఓరీ రావణా! నేను రాబందుల రాజు జటాయువును. పరస్త్రీ మీద చేయి వేయడానికి ఎలా సాహసించావు? జాగ్రత్త! నీ చేతుల్లో ఒక విషసర్పాన్ని మోసుకోపోతున్నావు. నేను 60 వేల సంవత్సరాల ముసలివాడిని. నిరాయుధుణ్ణి. నీవు యువకుడవు. అనేక ఆయుధాలతో వున్నావు. అయినా నేను నిన్ను సీతను ఎత్తుకొని పోనివ్వను'. నిన్ను హెచ్చరిస్తున్నాను. ఈ దుష్ట ఆలోచన వదలిపెట్టు లేదా వృక్షం నుండి పక్వమైన ఫలం రాలినట్లు నీ రథం నుండి త్రోసివేయబడటానికి సిద్ధంగా ఉండు' అంటూ రావణుని జటాయువు సవాలు చేశాడు. అందుకు కోపించిన రావణుడు జటాయువు వైపు దూసుకెళ్ళాడు. వారిద్దర మధ్య పోరాటం రెండు పర్వతాలు ఢీకొన్నట్లుగా తోచింది. రావణుడు ఎన్నో బాణాలు వదిలాడు. కాని ఆ మహాబలుడు తన పదునైన గోళ్ళతో కూడిన రెక్కలతో రావణుని రక్కాడు. ఎన్నో శక్తివంతమైన బాణాలు జటాయువును బాధించాయి. కాని సీత ఆర్తనాదం ముందు అవేమీ పనిచేయలేదు. అతను బాధను సహించగలిగాడు. రావణుని శరపరంపరకు జటాయువు తన రెక్కలతో విరగగొట్టి, తన పాదాలతో రావణుని ధనస్సును విరవగలిగాడు. ఇదే అదనుగా, జటాయువు రావణుని కవచాన్ని ముక్కలు చేశాడు. తన వాడియైన పంజాలతో అశ్వాలను చంపాడు. రథాన్ని రెండు ఖండాలుగా చేసి, ముక్కుతో రథసారథి తలను త్రుంచాడు. రథం భగ్నం కావడంతో, రావణుడు సీతను చేతులతో గట్టిగా పట్టుకొని నేలకూలాడు. ఈ అద్భుత పరాక్రమాన్ని చూచిన జీవరాశులు జటాయువును ప్రశంసించాయి.

జటాయువు వృద్ధుడు కావటంతో కొద్ది సేపట్లోనే అలసిపోయాడు. రావణుడు ఒక చేత్తో సీతను పట్టుకొని, మరొక చేత్తో ఖడ్గాన్ని తీసుకొని ఆకాశంలోకి లేచాడు. జటాయువు దానిని గమనించి, ఒక్కసారిగా అతని వీపు మీదికి దూకి అతని శిరోజాలను పట్టుకొని గట్టిగా లాగసాగాడు. రావణుడు క్రోధంతో సీతను గట్టిగా తన ఎడమ తొడకు అదిమి పట్టి, తన అరచేతితో జటాయువు వీపు మీద చరిచాడు. కాని జటాయువు ఆ దెబ్బను చాకచక్యంతో తప్పించుకొని, తన శక్తివంతమైన చుంచువుతో రావణునిపై పడి ఎడమ చేతులను త్రుంచి వేసింది. కాని పోయిన చేతుల స్థానంలో క్షణలో క్రొత్త చేతులు మొలకెత్తాయి. సీతను ఒక ప్రక్క వదలి, రావణుడు జటాయువును పిడిగుద్దులతో కాళ్ళతో తన్నసాగాడు. ఇలా ఒక గటసేపు పోరు జరిగింది. వరకు నిస్పృహతో రావణుడు తన ఖడ్గంతో జటాయువు రెక్కలను, పాదాలను, పార్శ్వాలను ఖండించి, నేలకూలేటట్లు చేశాడు. ఎంతగానో వ్యధచెందిన సీత జటాయువు పడివున్న చోటుకు వచ్చి, దుఃఖాశ్రువులతో అతనిని ఆలింగనం చేసుకొంది. కాని రావణుడు ఆమెను రామా! రామా! అని అరుస్తున్నా కూడ తనతో లాక్కొని వెళ్ళాడు.

సీత కేకలతో విశ్వం సమస్తం గతి తప్పింది. అంతటా అంధకారమే. సీత దుఃఖంలో గాలి కలిసిపోయింది. సూర్యుడు తన తేజాన్ని దాచివేశాడు. ఈ వృతాంతాన్నంతటినీ గమనిస్తున్న ఒక బ్రాహ్మణుడు దివ్యదృష్టితో గ్రహించిన వాడై 'మన ఉద్దేశ్యం ఇప్పుడు నెరవేర బోతోంది.' అని ప్రకటించాడు. తదనంతరం రావణుడు

ఆకాశంలోకి లేవగా, సీత ఆభరణాలన్నీ నేలపై పడ్డాయి. ఆకాశం నుండి విశుద్ధ గంగానదీ జలాలు భూమిపై పడినట్లుగా, ఆమె కంఠహారంలోని ముత్యాలు జారిపడ్డాయి. సీత దుఃఖంతో వివశురాలై, రావణుని పిరికితనాన్ని నిందిస్తూ, అతని పట్టునుండి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూనే ఉంది. ఆ విధంగా రావణుడు లంకవైపు వేగంగా ప్రయాణిస్తుండగా, సకల ప్రకృతి 'ధర్మానికి, సత్యానికి మర్యాదకు తావెక్కడ' అని రోదిస్తున్నట్లు అనిపించింది. లహీనపడగా సీత 'ఓ రామా! ఓ లక్ష్మణా!' అని రోదిస్తూ వుంది. సరిగ్గా అదే సమయంలో ఒక పర్వత శిఖరాన ఐదుగురు వానర ముఖ్యులు కూర్చొని ఉండటం సీత చూచింది. రావణుడు గమనించకుండా, తన పట్టు ఉత్తరీయాన్ని, కొన్ని ఆభరణాలను తెంపి, ఆ వానర రాజులు రామునికి సమాచారం అందిస్తారన్న ఆశతో, వారి మధ్యకు జారవిడిచింది. ఆ వానరులు చూస్తుండగానే, రావణుడు సీతను లంక వైపు తీసికొని వెళ్ళాడు.

*రావణుడు తన అభీష్టసిద్ధి కోసం సర్వం ఫణంగా పెట్టాడు. సీతను విజయవంతంగా అపహరించాననే సంతోషంతో రావణుడు మురిసిపోతున్నాడు. ఆమెను తన రాణిగా చేసుకోవాలనే ఆశతో ఆనందపడుతున్నాడు. కాని తన వాంఛితమే మృత్యుకౌగిలి అని గ్రహించలేని మూర్ఖుడుగా మారాడు రావణుడు. భాగ్యాధిదేవతయైన శ్రీమహాలక్ష్మి సదా శ్రీమన్నారాయణుని పాదపద్మాలనే సేవిస్తూ ఉంటుంది. భౌతికవాదులు ఆమెను అనుభవించ చూచినపుడు, ఆమె కరాళ దుర్గగా అవతరించి వారికి అలా కనిపిస్తుంది. నిజానికి దుర్గ కలిగించే బాధలను ఎంత గొప్ప వైజ్ఞానికుడు గాని, విజేతగాని ఎదుర్కొనలేడు. రావణుడు తనను దేవుని కంటె శక్తివంతుణ్ణి అని భావిసూ సత్యాన్ని నిర్లక్ష్యం చేశాడు.*

సముద్రాన్ని దాటి, సీతను రావణుడు తన అంతఃపురంలోనికి తీసికొని వెళ్ళాడు. అక్కడ భయంకర రాక్షస పరిచారికలతో 'ఈమెను జాగ్రత్తగా కాపాడండి, నా అనుమతి లేకుండా ఆమె ముఖాన్ని ఎవరూ చూడకూడదు ఆమె ఏమి కావాలంటే, అన్నీ ఇవ్వండి. కాని ఆమె గురించి ఒక పరుషవాక్కు మీలో ఎవరు పల్కినా వారు చావడం ఖాయం. గుర్తుంచుకోండి.' అని అన్నాడు రావణుడు. తరువాత రావణుడు ఎనిమిది మంది మహాశక్తివంతులైన రాక్షసులను పిలిపించి, రాముడు జనస్థానంలోని రాక్షసులు చంపినప్పటి నుండి, నాకు అతనిపై వైరం పెరిగింది. రాముడు మరణించే వరకు, నేను ప్రశాంతంగా నిద్రించను మీరు ఇప్పుడు జనస్థానానికి వెళ్ళి, రాముని కదలికలను గమనిస్తూ, నాకు ఆ సమాచారాన్ని నివేదించండి.' అని చెప్పాడు.

తిరిగి కామవివశుడై, రావణుడు సీతను చూడటానికి వెళ్ళాడు. ఆమె రాక్షసుల చేత పరివేష్టించబడి, నిస్పృహలో వుండటం గమనించాడు. దెబ్బతిన్న నావవలె, శునకాలచే చుట్టుముట్టబడిన ఆడ లేడివలె కనిపించింది. రావణుడు సీతను, ఇష్టం లేకున్నా, తన వెంటబెట్టుకొని రాజప్రాసాదం అంతా త్రిప్పి చూపించాడు. ఆ వైభవోపేతమైన ప్రాసాదం దేవతల హర్మ్యాన్ని పోలి ఉంది. ప్రాసాదాలు అమూల్య రత్నాలతో శోభిల్లుతున్నాయి.శయ్యలు స్వర్ణఖచితాలై నిర్మించబడినాయి. సుమధుర రాగాలు వినిపిస్తున్నాయి. ప్రసాదోద్యానవనాలు, కొలనులు శోభిస్తున్నాయి.

ఒక్కొక్క గదిలో వేలాదిమంది స్త్రీలు ఉన్నారు. రత్న మాణిక్యాలతో ప్రతి గది అలంకరించబడింది. సీతతో రావణుడు ఇలా అన్నాడు. 'సీతా! వృద్ధులు, శిశువులు మినహాయిస్తే, లంకలో 32 కోట్ల మంది రాక్షసులున్నారు. వీరిలో వెయ్యిమంది నా వ్యక్తిగత పరిచారకులు. ఓ లావణ్యవతియైన సీతా! నీకేమాత్రం వివేకం ఉన్నా, నీవు నా పట్టపురాణివి అవుతావు. ఈ ఐశ్వర్యాన్నంతటిని ఏలుకో. సర్వం నీదే, నీకే అంకితం. నీ ప్రేమతో నేను పీడితుడను. నీకొక్కదానికే నేను అంకితమౌతాను. సౌందర్యం అనిత్యం కనుక, దయతో నాపై నీ ప్రేమను ప్రసరించు.

రాముణ్ణి మరచిపోయి, నాతో సకల సౌభాగ్యాలను అనుభవించు' అని అంటుండగా, సీత తన చంద్రబింబం లాంటి ముఖాన్ని మేలిముసుగుతో కప్పివేసుకొని, మౌనాశ్రువులను రాలుస్తోంది. రావణుడు మాత్రం అలాగే చెప్పుకు పోతున్నాడు. 'మన కలయిక ధర్మవిరుద్ధమని భయపడవద్దు. నిన్ను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాను. నీ పాదాల మీద పడి నీ అనుగ్రహం కోసం ప్రార్థిస్తున్నాను. ఇంతవరకూ, ఈ రావణుడు ఏ స్త్రీ ఎదుట ఇలా మోకరిల్ల లేదు.' అని అంటూ, తన ఈ ప్రేమభాషణలచే సీతను సులభంగా లొంగదీసుకోవచ్చునని తలంచాడు. కాని సీత నిర్భయంగా 'నా హృదయం ఒక్క రాముని కోసమే ఉంది. పద్మాలతో నిండిన సరస్సులో నా జతగానితో క్రీడిస్తున్న హంసనైన నేను, ఒడ్డున సంచరిస్తున్న బాతునెందుకు చేరతాను? నీవు నన్ను ఏమి చేయగలవో చేసుకో. నీ దుష్ట కామప్రవృత్తి కారణంగా, నీవు రాముని చేతిలో మరణించడం ఖాయం' అని బదులు చెప్పింది.

సీత పరుషవాక్కులు విన్న రావణుడు ఆగ్రహించి, 'నీవు నాకు లొంగిపోవటానికి నీకు 12 నెలలు గడువు ఇస్తున్నాను. ఆ తరువాత కూడ నీవు ప్రతిఘటిస్తే, నా వంటవాళ్ళ చేత నిన్ను ముక్కలు, ముక్కలుగా నరికించి, నా ఆహారంగా నిన్ను భుజిస్తాను.' అని అన్నాడు. తరువాత రావణుడు సీతను అశోకవనానికి తరలించమని పరిచారకులను ఆజ్ఞాపించాడు. ఆమను జాగ్రత్తగా రక్షిస్తూ, ఆమె మనస్సును నాపై మరలేటట్లు ప్రయత్నించండి, బెదిరించండి, పొగడండి, ఏది అనుకొంటే అదే చేయండి. అన్నివిధాల మచ్చిక చేయండి.' అని ఆజ్ఞాపించాడు రావణుడు.

సీత అశోకవనానికి చేరుకొని, వేదనతో వివశురాలైంది. ఆడ రాక్షసులు ఆమెను అదేపరిగా భయపెట్టడంతో, ఆమె స్పృహ కోల్పోయింది.

ఆ సమయంలో బ్రహ్మదేవుడు, ఇంద్రుని పిలిపించి, 'సీత రావణుని చేత అపహరింపబడి లంకకు చేర్చబడింది. ఇది మన అదృష్టం. ఎందుకంటే, ఇక రాక్షస రాజు మరణించడమే తరువాయి అని ఖచ్చితంగా చెప్పవచ్చు. అయితే, రాముని విరహ కారణంగా సీత మరణించే అవకాశం కూడ ఉంది. అందుచేత నీవు వెళ్ళి, ఈ దివ్యపాయసాన్ని ఆమె తినటానికివ్వు' అని చెప్పాడు.

ఆ తరువాత ఇంద్రుడు నిద్రాదేవిని వెంటబెట్టుకొని లంకలోని అశోక వనానికి వెళ్ళాడు. ఈ నిద్రాదేవి ప్రభావంతో రాక్షసులు అందరూ నిద్రలో ఉండగా, ఇంద్రుడు ఒక బ్రాహ్మణుని వేషంలో సీతాదేవిని సమీపించి, 'నేను స్వర్గాధిపతియైన దేవేంద్రుణ్ణి. శ్రీరామునికి సాయం చేయటానికి వచ్చాను. ఈ దివ్య పాయసం నీకు చాల సంవత్సరాల పాటు ఆకలిదప్పులు గాని, దేహబాధలు గాని లేకుండా చేస్తుంది. దయచేసి దీనిని స్వీకరించు.' అని అన్నాడు. ఆ బ్రాహ్మణుడు నిజంగా ఇంద్రుడేనా అన్న అనుమానంతో సీత అతని దివ్యరూపాన్ని చూపించమని కోరింది. ఆమె కోరికపై ఇంద్రుడు తన నిజస్వరూపాన్ని ధరించాడు. నేలను తాకని అతని పాదాలను, వాడిపోని పూదండతో, నిర్మలమైన అతని దుస్తులను గమనించిన సీత అతడు దేవేంద్రుడేనని భావించి, ఆ పాయసాన్ని స్వీకరించింది. సీత ముందుగా ఆహారాన్ని స్వీకరించవలసిందిగా రాముని ప్రార్థించి ఆయనకు నివేదించింది. ఆమె ఆ పాయసాన్ని స్వీకరించటంతో అన్ని శారీరక బాధలు తొలగిపోయాయి. తమ కార్యం ఇలా పూర్తి చేసికొని, ఇంద్రుడు నిద్రాదేవి అక్కడి నుండి అదృశ్యమైనారు.

*భగవద్భక్తుడు కష్టాల్లో చిక్కుకొన్నపుడు, భగవంతుడు అతని సంరక్షణ భారాన్ని వహిస్తాడు. భక్తు ఎన్నడూ స్వీయ రక్షణ, శ్రేయస్సుఉ గురించి కలత చెందడు. భగవంతుడే తన రక్షణ బాధ్యత*

*వహిస్తాడనేదృఢవిశ్వాసంతో ఉండి, భక్తుడు సదా భగవానుని సేవలోనే నిమగ్నుడై ఉంటాడు. భక్తుడు భగవానునికిమధ్య గల ఈ దివ్య అన్యోన్య ప్రేమ శ్రేష్ఠమై ఉండగ, భగవాన్ ఎల్లపుడు భక్తుని గురించి ఆలో అలాగే భక్తుడు భగవానుని సేవలో ఆయన్ని గురించే స్మరిస్తుంటాడు.*

మారీచుణ్ణి వధించిన తర్వాత రాముడు తన పర్ణశాల వైపు పరుగు తీశాడు. దారి పొడవునా రాముడు తన మనస్సులో ఇలా భావించాడు. జనస్థానంలోని రాక్షసులనందరిని తాను వధించడం వల్ల, శూర్పణఖ ముక్కుచెవులు కోసిన కారణంగా వాళ్ళు తప్పక నామీద పగబూని ఉంటారు. నన్ను దూరంగా తీసుకొని పోయి, సీతను స్వాహా చేయాలనే పన్నాగంలో మారీచుడి హస్తం కూడ ఉండి ఉంటుంది. మారీచుడు నా స్వరాన్ని అనుకరించి చేసినది విని లక్ష్మణుడు పర్ణశాల విడవకుండా ఉంటేనే మంచిది. సీతను వంటరిగా వదలి వెళ్ళడని భావిస్తున్నాను, ప్రార్థిస్తున్నాను' అని ఆలోచిస్తూ, త్వరత్వరగా పర్ణశాల వైపు రాసాగాడు.

తన వెనుకనే ఒక నక్క ఊళ వేయడంతో రామునికి భయం అధికమైంది. పక్షులు, మృగాలు అరుస్తూ ఆయన కుడి ప్రక్కన పోసాగాయి. ఆయన ఎడమ కన్ను అదిరింది. ఎడమ చేయి ఆగి ఆగి వణుకుతోంది. గుండెదడ ఎక్కువైంది. ఈ అశుభ సూచనలు గమనిస్తూనే, పర్ణశాల నుండి వస్తున్న లక్ష్మణుని కలుసుకొన్నాడు. వెంటనే లక్ష్మణుని చేయి పట్టుకొని, 'సీతను వదలి, నా ఆజ్ఞను ఎలా ధిక్కరించ గలిగావు? నాకు కనిపించిన అశుభాలను బట్టి, ఆమెకు ఏదోహాని జరిగి ఉంటుంది. అయ్యో! లక్ష్మణా! సీతను ఎందుకు వంటరిగా వదిలి వచ్చావు?' అని నిందించాడు.

అంతట లక్ష్మణుడు 'సహాయం కోరుతూనీవు పెట్టిన కేకలు విని సీత పిచ్చిదై పోయింది. నేను తనను అనుభవించటానికి నీ మరణం కోరుకున్నానని అతి పరుషంగా మాట్లాడింది. నేను భరతుడి తొత్తునని, నీ శత్రువునని దూషించింది. ఆమె ఆరోపణలు అసత్యం కావాలంటే, నేను నీ దగ్గరికి రాక తప్పలేదు. వచ్చాను' అని చెప్పాడు. అందుకు రాముడు ఆగ్రహంతో 'సీతను వదలి రావటానికి ఏ సాకులు చెప్పరాదు. నేను అజేయుణ్ణని, రాక్షసుల నుండి ఆత్మరక్షణ చేసుకోగల పరాక్రమం నాలో వుందో లేదోనని నీకు తెలుసు. ఒక స్త్రీ ఆగ్రహానికి లోనై, ఇలా రావడం నా ఆజ్ఞను ధిక్కరించడం సరికాదు. ఓ లక్ష్మణా! చాల పెద్ద తప్పు చేశావు. నీవంటి వాడు అలా ప్రవర్తించాల్సి వాడు కాదు' అని బదులు పలికాడు రాముడు.

రామలక్ష్మణులు పర్ణశాలకు చేరి, అది నిర్మానుష్యంగా ఉండటం గమనించారు. రాముడు సీతకోసం చుట్టుప్రక్కల గాలించాడు. ఎక్కడా కనిపించక పోవడంతో రాముడు నిర్వీర్యుడైనాడు. వ్యథార్తుడైన రాముడు 'పసుపురంగు పట్టు చీర ధరించి సిగలో పూలతో నా ప్రియతమ సీత ఇటువైపు వెళ్ళటం నీవేమైనా చూచావా' అంటు చెట్లను ప్రశ్నించసాగాడు. వన్యమృగాలను, పక్షులను అలాగే అడగసాగాడు. సమాధానం లేక రాముడు మరింత దీనుడైనాడు. సీత తన ఎదుట ప్రత్యక్షమైనట్లు రాముడు ఊహించుకొంటూ, బిగ్గరగా 'సీతా! సీతా!' అంటూ అరవ సాగాడు. చివరకు సీతను రాక్షసులు అపహరించి ఉంటారని ఊహించి, మనోనేత్రంలో వీక్షించాడు. రామలక్ష్మణుడు కొండల్లో, కోనల్లో గాలించసాగారు. అయినా సీత కనిపించక పోవడంతో రాముడు నీరసించి, వేదనతో నేలమీద చతికిల పడ్డాడు. అయినా లక్ష్మణుడు రాముని ఉత్సాహపరుస్తూ అన్వేషణను కొనసాగింప చేశాడు. అలా వారు అనేక పర్వతాల్లో, అడవుల్లో, మైదానాల్లో సంచరించ సాగారు. చివరకు రాముడు పూర్తిగా అశక్తుడై ప్రేమతప్తుడై, పదే పదే 'సీతా! సీతా!' అంటూ రాముడు ఆక్రోశించాడు. 'నా ప్రియా! నా ముందుకు రా! తమాషాలు చేయవద్దు. నా బాధ వర్ణనాతీతం ప్రియా!' అంటూ మతిభ్రమించినట్లు రాముడు ప్రేలాపించాడు.

ఇక్కడ ఒక విషయం తెలుసుకొందాం.

*భగవంతుని విరహంలో భక్తులు రోదించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గోపికలు బృందావనంలో శ్రీకృష్ణాన్వేషణలో జీవితాలు గడిపారు. ఒక పరిపూర్ణ భక్తునిగా చైతన్య మహాప్రభువు కూడ భగవంతునియ విరహ భావాన్నే స్వీకరించాడని గ్రహిద్దాం. మీరాబాయి, అన్నమయ్య, రామదాసు, సక్కుబాయి వంటి భక్తశిఖా భగవంతుని విరహంలోనే కాలం గడిపారు. ఇక్కడ దేవాధిదేవుడైన రాముడు ఇలా ఒక భార్య కోసం ఎందుకు విలపించాడని ఎవరైనా అడుగవచ్చు. నిజానికి సర్వజ్ఞుడైన భగవానునిగా సీత ఇప్పుడు ఎక్కడ ఉన్నదో ఆయనకు ఖచ్చితంగా తెలుసు. ఆయన లీలలను అనేక విధాల తెలియజేస్తుంటాడు. అన్నిటికంటే ముఖ్యంగా... ఆయన తాను ఎన్నటికీమూర్తిత్వరహితుణ్ణి కాదని, సర్వదా పురుషోత్తముడనని మనకు బోధించటానికే అవతరిస్తుంటాడ ఆయన తన భక్తులకు ఆనందాన్ని ప్రసాదించి, పరమోన్నత సత్యం అనేదానికి పట్టువడి, ప్రేమచే నియంత్రించబడే వ్యక్తిని కానని తాత్త్వికులకు, యోగులకు బోధిస్తాడు. రెండవ కారణం – భగవానుడు ధర్మ సంస్థాపన కోసం అవతరిస్తుంటాడు కదా. తన పత్ని కోసం విలపించటం ద్వారా రాముడు ధర్మాన్ని నిలబెడుతున్నాడు. స్త్రీల యెడ మితిమీరిన అనురాగం యొక్క ప్రతికూల పరిణామాలు ఎలా ఉంటాయో నిరూపిస్తున్నాడు ఇక్కడ. స్త్రీ రక్షణ పరమ ధర్మమని ఈ ఉదంతం తెలుపుతోంది. వైదిక జీవనంలో స్త్రీ స్వతంత్ర జీవనం సాగించ లేదు. ఎంత శక్తివంతురాలైనప్పటికీ, తనకు తాను రక్షించుకో జాలదు. ఇది భౌతికవాదులకు తెలియజేయుట కొరకే తెల*

అధ్యాత్మిక దృష్టితో చూస్తే, రాముడు దేవాధిదేవుడు కావడంతో భౌతిక పరిమితులకు లోనైన వాడు కాదు. సీత పట్ల రాముని విరహం అలౌకిక దాంపత్య ప్రేమగా సంభావించాలి. ఆధ్యాత్మిక జగత్తులోని దాంపత్య ప్రేమకు అత్యున్నత నిదర్శనంగా దర్శించాలి.

సీత కోసం ఎంత గాలించినా కనిపించనందున, రాక్షసులు ఆమెను భక్షించి ఉంటారని రాముడు నమ్మాడు. లక్ష్మణుడు కూడ విసిగి వేసారి పోయాడు. అంతట రాముడు లక్ష్మణునితో 'లక్ష్మణా! సీత గోదావరీ తీరానికి పూలకోసం వెళ్ళిందేమో, అక్కడికివెళ్ళా చూస్తావా?' అని అడిగాడు. లక్ష్మణుడు వెళ్ళి తిరిగి రాగా, రాముడే స్వయంగా వెళ్ళి జంతువులను, పక్షులను ప్రశ్నించసాగాడు. కాని రావణుని భయంతో ఏ జీవీ ఏమీ చెప్పలేదు. కాని లేళ్ళ చూపులను రాముడు గమనించి, వాటి ఆలోచనలను ఆకళింపు చేసుకోవటానికి ప్రయత్నించాడు. సీతను ఆకాశమార్గాన దక్షిణ దిక్కుకు తీసికొని పోయినట్లు సూచిస్తున్న హరిణాల సందేశాన్ని లక్ష్మణుడు అర్థం చేసుకో గలిగాడు. ఏదైనా సమాచారం దొరుకుతుందేమోనని, దక్షిణం వైపు వెళదామని లక్ష్మణుడు సూచించాడు. వాళ్ళు కొంత దూరం నడువగా, అక్కడ పూలు పడివున్న జాడలు కనిపించాయి. అవి తాను సీతకిచ్చిన పూలేనని రాముడు గుర్తించాడు. ప్రక్కనే ఉన్న ఒక పర్వతాన్ని సంబోధిస్తూ 'ఇటు వచ్చిన సీత ఎటు వెళ్ళింది? ఓ పర్వతమా! నీవు నాకు బదులు ఇవ్వకపోతే, నిన్ను నా శరాలతో నుగ్గు చేస్తాను.' అని అన్నాడు. పర్వతం నుండి నిశ్శబ్దమే కారణంగా రాముడు పర్వతంపై తన బాణాలను ప్రయోగించ సిద్ధపడిన సమయంలో, లక్ష్మణుడు అక్కడ ఒక మహారాక్షసుని పాదముద్రల ప్రక్కన సీత పాదముద్రలు ఉండటం గమనించాడు. రామునికి చూపించాడు. వారు అలా అనుసరించగా, రావణుని భగ్న ధనస్సును, ముక్కలైన తూణీరం, చెక్కలైన రథభాగాలు, సీత ఆభరణాలు పడి వున్న చోటుకు చేరుకొన్నారు. అక్కడ రక్తపు చుక్కలు కనిపించగా, సీతను రాక్షసులు చంపేశారని రాముడు నిశ్చయించుకొన్నాడు. ఎందుకంటే ఆ ప్రదేశంలో ఇద్దరు నరభక్షకులు తగాదా పడినట్లుంది.

అక్కడ మృతిచెందిన అశ్వాలను, ధ్వంసమైన రథాలను, చిందరవందరగా పడి వున్న ఆయుధాలను చూచిన రాముడు 'ఏ రాక్షసుడు నానుండి తప్పించుకో లేడు. నా సీతను హత్యచేసిన రాక్షసులందరినీ సర్వనాశనం చేస్తాను. నా పత్నిని రక్షింటం కోసం పనికిమాలిన ఏ దేవతలు ఏమీ చేయలేదేమిటి? దేవతలు తక్షణమే నా సీతను నాకు అప్పగించకుంటే, వారి నిర్లక్ష్యానికి, రాక్షసుల నేరానికి ప్రతీకారంగా నేను సమస్త విశ్వాన్ని సర్వనాశనం చేస్తాను.' అని రాముడు శపథం చేశాడు.

క్రోధంతో రాముని నేత్రాలు రక్తరంజితాలైనాయి. అంట లక్ష్మణుని నుండి తన ధనస్సును అందుకొనిసమస్త విశ్వాన్ని సర్వనాశనం చేయగల మహాశక్తివంతమైన శరాన్ని వింటి నారిపై ఉంచాడు. భీతితో లక్ష్మణుడు నమస్కరిస్తూ 'రామా! నీవు మృదుస్వభావుడవు. ఆత్మనిగ్రహం కలవాడవు. సకల ప్రాణికోటి యొక్క శ్రేయోభిలాషివి. కనుక దయచేసి, నీ ఆగ్రహాన్ని నిగ్రహించుకో. తొందరపడి ఏమీ చేయవద్దు. ఇక్కడ ఒక రథం మాత్రమే విరిగి పడటాన్ని బట్టి, ఇక్కడికి ఒక్క రాక్షసుడే వచ్చి పోరాటంలో పాల్గొన్నాడనిపిస్తోంది. సీత కోసం అన్వేషణ సాగిద్దాం. అప్పటికీ కనిపించకపోతే, నీకు తోచిన విధంగా చేయవచ్చు. ప్రియ సోదరా! కీకారణ్యాలలో ఎవరికైనా కష్టాలు తప్పవు. సహనం కోల్పోరాదు కదా! నీవే కష్టాలు భరించలేక పోతే, ఇక సామాన్య మానవుల సంగతి ఏమిటి? శత్రువును వధించటం గురించే నీ ఆలోచన ఉండాలి. యావత్ విశ్వాన్ని నాశనం చేయాల్సిన అవసరం ఏముంది?' అని లక్ష్మణుడు అభ్యర్థించాడు. ఈ విధంగా చెపుతూనే, ఆయన పాదపద్మాలను వత్తుతూ అనునయింప చేశాడు. రామును నుండి శరాన్ని ఉపసంహరించుకొన్న తర్వాత ఇద్దరూ జనస్థాన ప్రాంతాలను క్షుణ్ణంగా గాలించటానికి బయలుదేరారు. అరణ్యంలో గాలిస్తూ ఉండగా, రక్తపు మడుగులో పడివున్న జటాయువును చూచారు. సీతను భక్షించిన వీడే ఇప్పుడు విశ్రాంతిలో ఉన్నాడని రాముడు తలంచాడు. అందుచేత అతన్ని వధించటానికి తన బాణాన్ని ఎక్కుపెట్టుకు సిద్ధపడుతున్నాడు.

కాని జటాయువును సమీపించగా, అతనిని చూచిన రామునికి అర్థమయిన దేమంటే – జటాయువు సీతను రక్షించే యత్నంలో గాయపడ్డాడని. అలా అర్థం చేసుకొన్న వెంటనే రాముడు ధనస్సును విరిచి వేసి జటాయువును కౌగలించుకొన్నాడు. జటాయువు దైన్యస్థితి రాముని మనస్సును కలచివేసింది. అపుడు రాముడు 'ఓ జటాయూ! సీతను గురించి, ఆమెను తీసుకొని పోయినవవాడిని గురించి నీకు తెలిస్తే దయచేసి వివరంగా చెప్పు' అని ఆత్రుతగా అడిగాడు. మృత్యువకు చేరువలో ఉన్న జటాయువు జరిగినదంతా రామునికి వివరించాడు. ఇలా అన్నాడు. 'రావణుడు సీతను వింద అనబడే ముహూర్తంలో ఎత్తుకు పోయాడు. ఏ వ్యక్తి అయినా ఆ ముహూర్తంలో దేనినైనా పోగొట్టుకుంటే, కొద్దికాలంలోనే మరల ఆ వ్యక్తి పోగొట్టుకొన్న దానిని తిరిగి పొందుతాడు. ప్రియమైన రామా! సీత గురించి ఎక్కువగా దుఃఖించకు. ఎందుకంటే నీవు ఆ రాక్షసరాజును చంపి, సీతను మళ్ళీ పొందుతావు' అని వ్యాఖ్యానించాడు జటాయువు. అంతట జటాయువు రావణుని వంశానుక్రమణికను రామునికి వివరిస్తూ 'రామా, రామా!' అంటూ తుదిశ్వాస విడిచాడు. రాముడు లక్ష్మణునితో 'నాకోసం ఈ జటాయువు తన ప్రాణాన్నే ఫణంగా పెట్టడం నన్ను కలచివేస్తోంది. కొన్ని కట్టెలను తీసుకొని రా. దహన సంస్కారాలు చేస్తాను. నాకు ఇతడు చేసిన సేవలకు ఇతడు ఉన్నత లోకాల్ని చేరుకొంటాడు' అని అన్నాడు. లక్ష్మణుడు చితిని పేర్చగా, రాముడు జటాయువు దేహాన్ని దానిపైవుంచి, నిప్పంటించాడు. జటాయువు ఆత్మ శ్రేయస్సు కోసం, సోదరులు ఇద్దరూ వేదమంత్రాలతో జలతర్పణం చేశారు. ఆపైన సోదరులు తీరానికి చేరి స్నానాలు చేశారు. జటాయువు అంతిమ సంస్కారాల్ని ముగించి, మరల సీతాన్వేషణలో అరణ్యంలో సంచరించ సాగారు.

నైరుతి దిక్కుగా ప్రయాణించి, కీకారణ్యంలోకి చేరారు. అతికష్టంతో ఆ ప్రాంతాన్ని దాటి క్రౌంచారణ్యంలోనికి ప్రేశించారు. దానినీ దాటి, వారు దట్టమైన కీకారణ్యంలోనికి ప్రవేశించారు. అక్కడ వారికి ఒక గుహ బయట నిలిచిన మహాకాయురాలైన రాక్షసి ఎదురు పడింది. ఆ భయంకర రాక్షసి ఒక్క ఉదటున ముందుకు వచ్చి లక్ష్మణునితో 'ఓ సొగసుకాడా! నాతో వచ్చి ఈ అరణ్యంలో విహరించు.' అంటూ అతని చేయి పట్టుకొంది. ఆపై 'నన్ను నీ భార్యగా స్వీకరించు. నేను నీదానను' అని అంటూ లక్ష్మణుని కౌగలించుకొంది. వెంటనే లక్ష్మణుడు క్రోధంతో ఖడ్గం తీసి, దాని ముక్కు, చెవులు, వక్షోజాలను ఖండించి వేశాడు. ఆ రాక్షసి రోదిస్తూ పారిపోయింది. సోదరులు ఇద్దరూ యథాప్రకారం ముందుకు సాగారు. అనుకోకుండా రాముడు 'లక్ష్మణా! నా ఎడమ చేయి వణుకుతోంది. మనసు కలతగా ఉంది. రానున్న ఆపద కోసం మనం సిద్ధంగా ఉండాలి' అని అన్నాడు. అదే సమయంలో వంజుల పక్షి కూత భయంకరంగా వారికి వినిపించటంతో లక్ష్మణుడు 'విజయం మనదే అవుతుందని దీని కూత ద్వారా గోచరిస్తోంది' అని అన్నాడు.

రామలక్ష్మణులు కొంతదూరం ముందుకు వెళ్ళగా, ఒక మహా స్వరం వినిపించింది. అకస్మాత్తుగా ఒక పెనుగాలి వీచసాగింది. ఆ స్వరం ఎక్కడినుండి వచ్చిందో ఆ దిశగా వారు ఖడ్గాలు ధరించి ముందుకు సాగారు. కొద్దిసేపట్లోనే వారికి ఒక వికృతరూపియైన పెద్ద రాక్షసుడు తటస్థపడ్డాడు. వాడికి తల, మెడ, కాళ్ళు ఏమీ లేవు. కడుపు మధ్యలో ఒక నోరు ఉంది. వాడు ఒక పర్వతమంత పరిమాణంలో ఉన్నాడు. శరీరం అంతా నిక్కబొడుచుకుని రోమాలు వాడి దీర్ఘబాహువులు ఎనిమిది మైళ్ళ వరకు విస్తరించి వున్నాయి. వీడిని చూచిన రామలక్ష్మణులు రెండు మైళ్ళ దూరం వెనక్కు పోయారు. అయినా ఆ రాక్షసుడు వీరిని తన గుప్పిట బంధించి, గట్టిగా బిగించటంతో వారు నిస్సహాయులైనారు. రామునికి భయం కలుగలేదు కాని లక్ష్మణుడు 'రామా! నన్ను ఈ రాక్షసుడికి బలిగా ఇచ్చి, నీవు సీత దగ్గరకు బయలుదేరు.' అని అన్నాడు. లక్ష్మణుణ్ణి భయపడ వద్దని రాముడు చెపుతుండగా ఆ రాక్షసుడు 'నా పేరు కబంధుడు. చాలకాలం నుండి నేను ఆకలి బాధతో వున్నాను. మీరు రావటం నా అదృష్టం. దైవం మిమ్మల్ని నాకు ఆహారంగా పంపాడు. మీ ప్రాణాల మీద మీకు ఆశ పడనవసరం లేదు.'అని అన్నాడు. అపుడు రాముడు లక్ష్మణునితో వీడి బాహువులను ఖండిస్తే, మనల్ని మనం కాపాడుకోవచ్చు.' అని అన్నాడు. ఈ మాటలు వినిన రాక్షసుడు ఆగ్రహించి, వీరిని తినాలనే ఆలోచనతో నోటిని విశాలంగా తెరిచాడు. కాని కబంధుడ ఇలా చేసే ఆలోచనలో ఉండగానే, రాముడు వాడి కుడిచేతిని, లక్ష్మణుడు ఎడమ చేతిని ఖండించి వేశారు. అంతట రాక్షసుడు బాధతో 'మీరెవరు?' అని వాడు ప్రశ్నించాడు. అందుకు లక్ష్మణుడు 'ఈయన రాముడు, క్షత్రియుడు, నేను ఈయన సోదరుణ్ణి. నా పేరు లక్ష్మణుడు. మా రాముని పత్నియైన సీతను రాక్షస రాజైన రావణుడు అపహరించగా, అన్వేషిస్తూ, మేము ఇటు వచ్చాం.' అని జవాబు చెప్పాడు.

రాముని పేరు వినగానే, కబంధుడు అమితానందం పొందాడు. 'నేను ఎంతో అదృష్టవంతుణ్ణి. నాకు విముక్తి కలిగించటానికి మీరు ఇక్కడికి వచ్చారు. నాకీ వికృతరూపం ఎలా వచ్చిందో చెబుతాను. వినండి. పూర్వజన్మలో నేను ధనువు యొక్క కుమారుణ్ణి. నేను నా తపస్సుచే బ్రహ్మదేవుని ప్రసన్నం చేసుకోగా, నాకు దీర్ఘాయువు ప్రసాదించాడు. ఇక నాకు బద్ధశత్రువైన దేవేంద్రుడు నన్నేమీ చేయలేడని గర్వించాను. తర్వాత నేను అతనితో యుద్ధం చేసినపుడు తన వజ్రాయుధాన్ని నాపై విసిరాడు. అది నన్నెంతగానో బాధించి, నా అవయవాలను దేహంలోనికి చొచ్చుకపోయేలా చేసింది. అలాటి స్థితిలో నన్ను చంపమని ఇంద్రుణ్ణి కోరితే, అతడు తిరస్కరించాడు ఎలా బ్రతకాలని అడిగితే, ప్రస్తుతం వున్న నీ ఆకారంతోనే అడవిలో పడివుండు. రామలక్ష్మణులు నీ ఎదుటకు

వచ్చినపుడు నీవు నీ దివ్యరూపాన్ని పొందుతావు' అని అన్నాడు. ఆనాటినుండి నేను ఏనాటికైనా రాముణ్ణి కలుసుకోగలనని భావించాను. రాముడు నన్ను దహనం చేసిన మీదట, నా పూర్వరూపాన్ని పొందుతానని, ఆయన శాపాంతాన్ని ధృవపరచాడు. ఇప్పుడు నీవల్ల నాకు విముక్తి లభించింది. నీ లక్ష్యఛేదనలో నీకు సాయపడగల ఒక శక్తివంతమైన మిత్రుణ్ణి చేరుకొనే మార్గాన్ని నా మరణానంతరం నీకు సూచిస్తాను.' అని అన్నాడు. అంతట రాముడు ఇలా వివరించాడు. 'నా భార్యను రావణుడు అపహరించాడు. అతని పేరు మాత్రమే తెలుసు. మరి ఏ విషయాలు తెలియవు. నేను నిన్ను ఒక గోతిలోకి త్రోసి, నీ దేహాన్ని దహనం చేసి, ఉత్తమ గతిని పొందేలా చేస్తాను. అందుకు బదులుగా, నీవు నాకు రావణుని గురించి సమాచారాన్ని ఇవ్వు.' అన్పుడు కబంధుడు 'నేను చాల చింతిస్తున్నాను. కాని రావణుని గురించి నాకూ ఏమీ తెలియదు. అయితే ముల్లోకాలు సంచరించిన ఒక వ్యక్తిని గురించి నీకు చెపుతాను. అతడు నీకు అన్ని వివరాలు చెబుతాడు.' అని అన్నాడు.

ఆ తరువాత రామలక్ష్మణులు కబంధుణ్ణి ఒక పర్వత గుహలోకి తీసుకొని పోయి, లక్ష్మణుడు పేర్చిన చితిమీద అతని దేహాన్ని ఉంచారు. శరీరం పెద్దది కావటం చేత మండటం మొదలు కాగానే, అది ఒక పెద్ద అగ్నిజ్వాలలా కాల్చివేసింది. ఆ అగ్నిలోనుండి కంబధుడు శోభాయమానంగాను, దివ్యాలంకృతుడైన దివ్య స్వరూపం ధరించి ప్రత్యక్షమైనాడు. హంసలు లాగే ఒక దివ్యరథంలో ఆసీనుడైన తర్వాత కబంధుడు ఇలా అన్నాడు. 'ఓ రామా! సంధిచేసుకోవడం, పోరాడటం, హత్య చేయటం, మేలైన ఆయుధాలను, రక్షణ సామగ్రిని వృద్ధి పరచుకోటం, విభేదాలను రాజేయటం, ఇతరుల సాయాన్ని కోరటం – అనే ఆరు పద్ధతుల ద్వారా రాజకీయమైన దురదృష్టాన్ని అధిగమించవచ్చు. ఇపుడు నీవు నీ భార్యను కోల్పోయి, అమిత కష్టాల్లో నిలిచినట్లుగానే, ఇదే పరిస్థితిలో ఉన్న ఒక వ్యక్తి యొక్క సాయంతో నీవ ఆమెను తిరిగి పొందగలుగుతావు. ఆ వ్యక్తి వానరరాజు సుగ్రీవుడు. ఇంద్రసుతుడైన తన సోదరుడు వాలి కారణంగా ప్రవాసంలోఉంటున్నాడు. ఓ రామా! ఋక్షరాజు భార్యకు సూర్యునివల్ల జన్మించిన సుగ్రీవునితో నీవు స్నేహం చేయి. ఎందుకంటే అతడు కూడ తనకు సాయం చేయగల వ్యక్తి యొక్క అవసరంలో ఉన్నాడు. ప్రస్తుతం అతడు మరో నలుగురు వానర ముఖ్యులతో కలిసి ఋష్యమూక పర్వతంపై నివసిస్తున్నాడు.

మొదట పంపాసరస్సు వద్దకు వెళ్ళు. పక్షిజాతులతో కూడిన రమణీయ ప్రదేశం అది. ఆ పక్షులు నరుల భయం లేకుండా జీవిస్తున్నాయి. నీవు ఆ పక్షులకు, పంపా సరస్సులోని మత్స్యాలకు ఆహారంవేసి, ఆపై అక్కడ నివసిస్తున్న శబరి అనే తపస్వినిని కలుసుకోవాలి.

మతంగ ఋషి యొక్క శిష్యులు అరణ్యం నుండి తెచ్చే కందమూల ఫలాలను, పుష్పాలను తెస్తుండగా, ఆ ప్రాంతం యావత్తు మనోజ్ఞంగా శోభిల్లుతుంది. మతంగ మహర్షి చాలకాలం క్రిందట పంపా సరస్సు వద్ద తన దేహాన్ని త్యజించాడు. ఆ తర్వాత తపస్వినియైన శబరి ఆయన శిష్యులకు పరిచర్య చేసింది. ఆ ఋషులు చాలాకాలం క్రితమే దివ్యలోకాలకు చేరుకోగా, శబరి మాత్రం బ్రహ్మలోకానికి వెళ్ళే ముందు, నీ దర్శన ప్రాప్తికై నిరీక్షిస్తూ, అక్కడనే నివసిస్తోంది.

పంపా సరస్సుకు దగ్గరలోనే ఋష్యమూక పర్వతం ఉంది. కాని తన సోదరుడు వాలి తనపై ఎప్పుడు దాడిచేస్తాడోననే భయంతో సుగ్రీవుడు ఆ పర్వతం మీద ఒక గుహలో నివసిస్తున్నాడు. సుగ్రీవుడు విధేయత గలవాడు. ప్రజ్ఞావంతుడు. ఔదార్యం గలవాడు. వివేకి, సాహసి, శక్తిమంతుడు. రాక్షసులను గురించి అతనికి సర్వం తెలుసు కనుక నీవు అతనితో మైత్రి నెరపటం మంచిది. సీతను కనిపెట్టే వరకు, అతని అనుచరులు భూతలమంతా సంచరించగలరు.' ఈ మాటలు చెప్పి కబంధుడు, శ్రీరాముని అనుమతి పొంది స్వర్గాన్ని

అధిరోహించాడు. అంతట రామలక్ష్మణులు కబంధుని సూచనల మేరకు ప్రయాణం సాగించారు. రెండవ రోజు పంపా సరస్సు వద్దకు చేరుకొన్నారు. అక్కడ వారికి మతంగ ఋషి ఆశ్రమం కనిపించింది.

రామలక్ష్మణులు ఆశ్రమంలోనికి ప్రవేశించగా, శబరి లేచి చేతులు జోడించి వారికి స్వాగతం పలికింది. అంతట శబరి రామలక్ష్మణుల పాదాలను స్పృశించి, అన్నివిధాలైన ఆహారపానీయాలు, సకల సౌకర్యాలతో వారిని స్వాగతించి సమర్పించింది. ఆమె ఆధ్యాత్మిక సాధనలను గురించి రాముడు ప్రశ్నించగా, 'నిన్ను దర్శించటంతోనే నా తపస్సాధనలన్నింటి యొక్క ఫలసిద్ధిని నేను సాధించాను. నీవు చిత్రకూటానికి వచ్చినపుడు, నేను సేవిస్తున్న ఋషులందరు దివ్యరథాలపై స్వర్గానికి వెళ్ళారు. అయితే వారు వెళ్ళేముందు నీవు ఇక్కడికి రానున్నావని, నీ దర్శన ప్రాప్తి తర్వాత నేను కూడ దివ్యలోకాలకు రాగలనని వారు నాకు హామీ ఇచ్చారు.' అని పరిపూర్ణ సిద్ధురాలైన శబరి బదులు చెప్పింది.

రాముని కోరిక మేరకు శబరి రమణీయ పరిసర ప్రాంతాలన్నీ త్రిప్పి చూపించింది. తరువాత శబరి తాను సేవించిన ఋషులను కలుసుకోడటానికి తన మర్త్య దేహాన్ని త్యజించటానికి రాముని అనుమతి కోసం ప్రార్థించింది.

రాముడు శబరి పట్ల అమిత ప్రసన్నుడై, ఆమె కోర్కెను మన్నించాడు. అగ్నిని రగిలించి, ఆ వృద్ధ తపస్విని ప్రజ్వరిల్లుతున్న ఆ అగ్నికీలల్లోకి దూకింది. మరుక్షణం శబరి దివ్యాలంకరణ శోభితయై దివ్య లోకాలను అధిరోహించింది.

ఆ విధంగా శబరి యొక్క ఆధ్యాత్మిక మహాశక్తిని చూచిన తరువాత రామలక్ష్మణులు సప్తసాగర జలాలతో సృజింపబడిన పంపా సరోవరంలో స్నానం చేయటానికి వెళ్ళారు. ఆ తరువాత ఉల్లాసాన్ని పొంది, సీతాన్వేషణ చేయాలనే ఆశతో, సుగ్రీవుని కనుగొనే ఉత్సాహంతో లక్ష్మణునితో కలిసి రాముడు అక్కడినుండి బయలుదేరాడు.

**-: అరణ్యకాండ సమాప్తం :-**

ఓం

# శ్రీరామ కథామృతం – కిష్కింధ కాండ

పంపా సరోవర పరిసర ప్రాంతాల్లోని వసంత రమణీయం గమనించి సీతతో తన అనురాగ వినోదం గురించిన గత జ్ఞాపకాలు రాముని మనస్సులో మేల్కొని, ఆయన దుఃఖాన్ని తీవ్రతరం చేసింది. రాముడు ఎల్లవేళలా సీతను గురించే ఆలోచిస్తూ, తాను లేకుండా ఆమె ఎలా జీవించగలదు అని తలపోస్తూ ఉన్నాడు.

సరస్సు ఎంతో మనోహరంగా ఉంది. వృక్షాలన్నీ విరమూసి కాంతులీనుతూ వున్నాయి. ఇది అనురాగ ఋతువు. కాని సీత లేని జీవితం అర్థరహితంగా రాముడు భావిస్తున్నాడు. కోకిల పిలుపు వినగానే రామునికి సీత కనిపిస్తోంది. గులాబిరంగు తామర  పుష్పాలను చూస్తే రామునికి సీత కన్నులు గుర్తుకు వస్తున్నాయి. 'ఓ లక్ష్మణా! ఈ క్రూర వసంతం సీత లేనందున నన్ను ఎంతగానో బాధిస్తోంది. ఆమె లేక జీవితాన్ని భరింలేను. అందుచేత నీవు అయోధ్యకు వెళ్ళి భరతునికి సేవ చేయి, నేను ఇక్కడనే ప్రాణం త్యజిస్తాను.' అంటూ రాముడు పెద్దగా విలపించాడు.

దానికి జవాబుగా లక్ష్మణుడు 'ప్రియ సోదరా! సీత సజీవంగానే ఎక్కడో ఒకచోట ఉన్నది. కాని మనం మన ఆగ్రహాగ్నితో రావణుడు ఎక్కడున్నా సరే, స్వర్గం, భూమి, పాతాళం, సముద్రంలో ఎక్కడున్నా సరే, వాడిని దహించి వేద్దాం. ఈ విషాదాన్ని ముగించి రావణుని కనిపెట్టే ప్రయత్నంలో ఉండాలి. దీక్షాదక్షతతోనే మనం విజయం సాధిస్తాం.' అంటూ రామునిలో ఆశాభావాన్ని ప్రవేశపెట్ట ప్రయత్నించాడు.

లక్ష్మణుని మాటలకు రాముడు ప్రభావితుడై, విషాదాన్ని త్యజించాడు. వారు అలా మాట్లాడుకొంటూనే ఋష్యమూక పర్వతం చేరుకున్నారు. రామలక్ష్మణుల ఆగమనాన్ని సుగ్రీవుడు దూరాన్నుంచే చూడగలిగాడు. వారు వాలికి మిత్రులేమోనని సుగ్రీవుడు మొదట భయపడ్డాడు. అంతట అతను తన అనుచరులతో మతంగ ఋషి మహిమచేత రక్షించబడుతున్న ఆయన ఆశ్రమంలో ఆశ్రయం తీసుకొన్నాడు. అయినా సుగ్రీవుని భయానికి అంతులేకుండా పోవడంతో, ఒక శిల నుండి మరొక శిలకు సంచరిస్తూనే ఉన్నాడు. అంతట హనుమంతుడు తన నాయకుడితో 'నీవు ఈ వాలి భయాన్ని విడవాలి. చంచలమైన మనస్సుతో ఏదో నిర్ణయాలకు వస్తుంటావు. అవి తప్పు అని తేలుతాయి. పరిశీలిస్తే' అని అన్నాడు.

దానికి సుగ్రీవుడు జవాబు ఇస్తూ 'వాలిమనుషులు కానీ, కాకపోనీ, వీరు ఖచ్చితంగా భయంకరులే. వీరిద్దరూ దేవతా ముఖ్యుల్లా కనిపిస్తున్నారు. ధనుస్సు, ఖడ్గాలు ధరించి ఉన్నారు. వాలి కుటిలుడన్నది నిజం అతనికి స్నేహితులున్నారు. అందుచేత నీవు అటువెళ్ళి, వాళ్ళు ఎందుకు వచ్చారో కనుక్కో. వారి హావభావాలు జాగ్రత్తగా గమనించు. వారు ఎవరో, వారికి ఏమి కావాలో తెలుసుకో. వారి సమక్షంలో నీవు నన్ను పొగిడితే వారు నా మిత్రులో, శత్రువులో తెలిసిపోతుంది.' అని అన్నాడు.

హనుమంతుడు ఈ మాటలు విని తనది కూడ వానర బుద్ధియే కనుక తన నిజరూపాన్ని మరుగుపరచి ఒక భిక్షకునిగా రామలక్ష్మణుల ముందు ప్రత్యక్షమైనాడు. వారికి నమస్కరించి హనుమంతుడు, 'ఓ మహావీరులారా! ఇంతటి మహావీరులైన మీరు ఈ నిర్జన ప్రాంతానికి రావడానికి కారణమేమి? తపస్సుల వేషధారణలో మీరు ఉన్నా, మీ వేషధారణలను బట్టి మీరు క్షత్రియుని తెలుసుకోవచ్చును. నా పేరు హనుమంతుడు. తన అన్నయైన

వాలి చేత బహిష్కరించబడిన సుగ్రీవుని సచివుణ్ణి. నేను వాయునందనుడను. సంకల్పముతో ఎక్కడికైనా వెళ్ళగల కామగామిని. కోరిన రూపాన్ని ధరించగల కామరూపిని. సుగ్రీవుడు తన మైత్రిని, ఆతిథ్యాన్ని మీకు అందివ్వ నుద్దేశించి, నన్ను ఇక్కడికి పంపాడు.' అని చెప్పాడు. అపుడు రాముడు లక్ష్మణునితో 'లక్ష్మణా! మనం ఎవరి కోసమై అన్వేషిస్తున్నామో, అటువంటి వానర శ్రేష్ఠుడైన సుగ్రీవుని సచివుడు ఈ హనుమంతుడు. ఈతడు అమిత సౌజన్యమూర్తిగా అగుపిస్తున్నాడు. సంభాషణ కవితాత్మకంగా ఉంది. ఇతనిలో ఆత్మవిశ్వాసం, శక్తి పుష్కలంగా వున్నాయి. సంభాషణలలో పరిణతి కనిపిస్తోంది. శత్రువైనా సరే ముగ్ధుడౌతాడు ఇతని ప్రవర్తనతో. ఓ లక్ష్మణా! మనలను ఇక్కడికి తీసికొని వచ్చిన పరిణామ క్రమమును హనుమంతునికి వివరించు' అని రాముడు చెప్పాడు.

అపుడు లక్ష్మణుడు హనుమంతునితో 'నిన్ను కలుసుకోవడం మా అదృష్టం. మేము సుగ్రీవుని కలుసుకొని, అతనితో మైత్రీబంధం ఏర్పరచుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నాం. ఈయన రాముడు, దశరథ మహారాజు కుమారుడు. నేను ఈయన సోదరుడైన లక్ష్మణుణ్ణి. రాముని తండ్రి ఈయనను రాజసింహసనానికి వారసునిగా ప్రకటిద్దామని తలంచాడు. కాని రాజకీయ కుట్ర ఫలితంగా, ఈయనను అడవులకు పంపడం జరిగింది. ఇటీవలనే రావణుడు మా రాముని భార్య సీతను అపహరించుక పోయాడు. దుఃఖంతో మేము సీత కోసం అన్వేషిస్తున్నాం. మధ్యలో మాకు కబంధుడు అనే గొప్ప రాక్షసుడు తారసపడ్డాడు. అతనిని మేము వధించటంతోఅతను తన శాపంనుండి విముక్తి పొందాడు. అందుకు ఆయన బదులుగా, దివ్యలోకాలకు వెళ్తూ, సుగ్రీవునితో మమ్ము మైత్రి ఏర్పరచుకోమని సలహా ఇచ్చాడు. అందుకే మేము ఇటు వచ్చాం. నీకు, నీ శ్రేష్ఠుడైన రాజుకు ఏదైనా సరే ఉపయుక్తంగా ఉన్నది చేయాలని ఉన్నాం' అని వివరించాడు.

లక్ష్మణుడు పై వివరణ ఇస్తుండగా, వారిద్దరి నేత్రాలు అశ్రుపూరితం కావటం, దుఃఖించటం హనుమంతుడు గమనించాడు. అందుచేత హనుమంతుడు 'మీవలెనే సుగ్రీవుడు కూడ రాజ్యాన్ని, భార్యను పోగొట్టుకున్నాడు. ఆయన, ఆయన సహచరులు మీ సీతాన్వేషణలో సాయం చేయగలరని నేను చెప్పగలను. దయచేసి, నా వెంట వచ్చి, సుగ్రీవుణ్ణి కలుసుకోండి. ఆయన కూడ మీ రాకకు కారణం తెలుసుకోవాలని ఇష్టపడుతున్నాడు' అని జవాబు ఇచ్చాడు.

అక్కడికి చేరిన తరువాత, హనుమంతుడు సుగ్రీవునితో రామునికి సంబంధించిన విషయాలన్నీ నివేదించాడు. సుగ్రీవుడు సంతృప్తి చెంది, రామలక్ష్మణులను కలుసుకోవడానికి బయటకు వచ్చాడు. స్నేహపూర్వక హస్తాన్ని సుగ్రీవుడు వారి ముందు చాపాడు. రాముడు మిక్కిలి సంతసించి, తన మైత్రీ హస్తాన్ని అందుకొని, వానర ప్రభువును ఆలింగనం చేసుకొన్నాడు.

ఆ తరువాత సుగ్రీవుడు, రాముని నడుమ ఇద్దరు మిత్రుల కలయికను సూచిస్తూ, పవిత్రాగ్నిని రగిలించాడు హనుమంతుడు. అగ్నికి ప్రదక్షిణం చేసి, రామ సుగ్రీవులు ఒకరినొకరు సుహృద మైత్రీ భావంతో చూచుకొన్నారు.

అంతట సుగ్రీవుడు 'ప్రియమైన రామా! ఈరోజు నుండి నీ సుఖమే నా సుఖం. నీ దుఃఖమే నా దుఃఖం. అలాగే నాకు సుఖదుఃఖాలు నీవే ఔతాయి' అని అన్నాడు. రాముడు ఆసీనుడగుటకై, సుగ్రీవుడు ఒక పుష్పసమృద్ధమైన తరుశాఖను నేలపై ఉంచగా, హనుమంతుడు లక్ష్మణుని కోసం అలాగే చేశాడు. అందరూ కూర్చొన్న మీదట, సుగ్రీవుడు 'ప్రియమైన రామా! నా సోదరుడైన వాలి కారణంగా నేను నిరంతరం దుఃఖంలో గడుపుతున్నాను. వాలి బలవంతంగా నా భార్యను, నా రాజ్యాన్ని లాక్కొని నందున, నేను ఈ అరణ్యంలో ఆశ్రయం పొందాను.

కాని నా సోదరుడు ఏ క్షణంలోనైనా ఇక్కడికి వచ్చి, నాపై దాడి చేస్తాడనే భం నన్ను వెంటాడుతూనే ఉంది. ఒక్క క్షణం కూడ ప్రశాంతత ఎరుగను.' అని వివరించాడు. రాముడు చిరునవ్వుతో 'సేవయే స్నేహానికి నిజమైన ఫలం.. అందుచేత నేను వాలిని వధించి, నీ భార్యను, రాజ్యాన్ని తిరిగి నీవు పొందేందుకు నేను నీకు సహాయం చేయటమే నా విధి.' అని అన్నాడు.

అంతట సుగ్రీవుడు రామునితో 'నీ ప్రవాసం, నీ భార్య అపహరణ గురించి హనుమంతుడు నాకు చెప్పాడు. ఆమె స్వర్గంలో వున్నా, భూమి మీద ఉన్నా, పాతాళంలో ఉన్నా నీవు ఆమెను తిరిగి పొందడంలో నేను నీకు మిత్రునిగా సాయం చేస్తానని శపథం చేసి చెపుతున్నాను. ఓ రామా! ఒక బలవంతుడైన రాక్షసుడు సీతను ఎత్తుకొని పోతుండగా, 'రామా' 'రామా' అని నేను విన్న కేకలు సీతవేనని నేను నమ్ముతున్నాను. నన్ను, నా సహచరులను పర్వతాగ్రంపై కూర్చొని వుండటం గమనించిన సీత తన ఉత్తరీయాన్ని, కొన్ని ఆభరణాలను క్రిందికి జారవిడువగా, మేము వాటిని సేకరించి ఉంచాము.' అని చెప్పాడు. రాముడు ఆ వస్తువులను చూడాలని ఆశగా వుంది, వాటిని తెప్పించమని సుగ్రీవుణ్ణి కోరాడు. అంతట సుగ్రీవుడు వాటిని దాచివుంచిన గుహలోనికి వెళ్ళి, వాటిని వెలుపలకు తెచ్చి రాముని ముందు పెట్టి చూడమన్నాడు.

వాటిని సీతవిగానే భావించిన రాముడు 'హా ప్రియా' అని బిగ్గరగా కేకవేశాడు. అశ్రువులు నిండిన నయనాలతో రోదిస్తూ రోదిస్తూ స్పృహ కోల్పోయాడు. తిరిగి తెలివచ్చిన తర్వాత రాముడు 'లక్ష్మణా! ఈ వస్తువులన్నీ సీత ధరించేవే. నీవు వాటిని గుర్తుపట్టావా?' అని అడిగాడు. 'నేను పాదాలకు పైన సీతను ఎన్నడూ దృష్టి ప్రసరించి యుండలేదు. అందువల్ల నేనేమీ చెప్పలేను. కాని ప్రతి ఉదయం నేను ఆమె పాదపద్మాలకు నమసకరిచే వాడిని కనుక ఈ కాలి అందియలను మాత్రం గుర్తించగలను.' అని సమాధానం ఇచ్చాడు. అనంతరం రాముడు రావణుని గురించి ప్రశ్నించగా, సుగ్రీవుడు ఇలా అన్నాడు. 'నేను రావణుని గురించి ఏమీ వినలేదు. కాని నేను అతనిని కనిపెట్టగలనని, అలా నీకు సాయం చేయగలనని నిశ్చయంగా చెప్పగలను. నీవు నిశ్చింతగా ఉండవచ్చు. ఓ రామా! నీ ప్రియ భార్యను పోగొట్టుకొన్నందకు ఎక్కువగా దుఃఖించకు. ఊరికే ఏడుస్తూ కూర్చోవడంతో ఏ సౌఖ్యాన్ని పొందలేవు. అలాచేస్తే శక్తి ఉడిగి జీవితం ప్రమాదంలో పడుతుంది. నేను ఒక మూర్ఖ వానరుణ్ణి అయినా, నేను అదే పరిస్థితిలో ఉన్నా కూడా, నేను నీలాగ విలపించడం లేదు.' ఇలా సుగ్రీవుని మాటలు విని రాముడు కొద్దిగా స్థిమిత పడ్డాడు. మళ్ళీ మరొకమారు సుగ్రీవుణ్ణి రాముడు కౌగిలించుకొన్నాడు.

ఇద్దరూ హాయిగా కలిసి కూర్చున్నారు. వాలి విషయం సుగ్రీవువు చెప్పగా, రాముడు 'సుగ్రీవా! ఈరోజే నేను వాలిని వధిస్తాను. నిశ్చింతగా ఉండు. అయితే మీ సోదరు లిద్దరి మధ్య ఈ వైరం ఎందుకు వచ్చిందో చెప్పు' అని అడిగాడు రాముడు. అపుడు సుగ్రీవుడు 'నా తండ్రి మరణించాడు. రాకుమారులలోపెద్దవాడైన వాలి కిష్కిధకు రాజు కాగా, నేను అతని సేవలో నిమగ్నుడనైనాను. ఇంతకు పూర్వమే, మయుడనే దానవ మాయావి ఒక స్త్రీ కారణంగా వాలితో వైరం పెట్టుకొన్నాడు. ఒక రాత్రి వేళ, అందరూ నిద్రిస్తుండగా, ఆ మాయావి కిష్కింధకు వచ్చి, వాలిని ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించాడు. వారి భార్యలు వద్దని చెప్పినా, వాలి రాజసౌధం నుంచి బయటికి వచ్చాడు. నేను మా అన్నను అనుసరించే వెళ్ళాను. మమ్మల్ని చూడగానే, మాయావి భయపడి పారిపోయాడు.

మేము వానిని తరుముకుంటూ వెళుళతుండగా, అతడు అంధకారబంధురమైన గుహలోనికి చొరబడ్డాడు. వాలి నన్ను గుహద్వారం వద్ద కాపలా వుండమని చెప్పి, ఆ గుహలోనికి వెళ్ళాడు. అలా ఒక సంవత్సరం

గడిచింది. నేను మాత్రం అక్కడే ఉండినా కూడా వాలి జాడ లేదు. అకస్మాత్తుగా గుహలోనుండి బయటికి రక్తం రావటం గమనించాను. దానవుని అరపులు కూడ వినిపించాయి. కాని వాలి కంఠస్వరం వినిపించ లేదు. వాలిని వధించి ఉంటాడని అనుకొన్నాను. అంతట ఒక పెద్ద బండరాతితో గుహ ద్వారాన్ని మూసివేసి, వాలి శ్రేయస్సు కోరి నేను జలతర్పణం చేశాను. నేను కిష్కింధకు రాగానే, నన్ను సచివులు రాజసింహాసనంపై ప్రతిష్టించారు. నేను ధర్మబద్ధంగా రాజ్యపాలన చేయసాగాను.

అలా చాలాకాలం గడిచిన తర్వాత, ఆ దానవుణ్ణి వధించిన వాలి తిరిగి కిష్కింధకు వచ్చాడు. రాజసింహాసనంపై వున్న నన్ను గమనించి, వాలి సచివులను కారాగృహంలో బంధించాడు. నేను వాలితో పోరాడే శక్తి కలిగి వున్నాకూడా, అతని మీద నాకు గల గౌరవభావంతో, అతని పాదాలకు నమస్కరించి, రాజమకుటాన్ని ఆయన పాదాల వద్ద సమర్పించాను. కాని వాలి ఆగ్రహం తగ్గకపోగా, నన్ను తీవ్రంగా దూషిస్తూనే ఉన్నాడు. అంతేకాదు, పురప్రముఖులను పిలిచి, వారందరితో ఇలా అన్నాడు. 'దానవుడైన మాయావిని వధించటం కోసం, నేను భూగర్భంలోనికి వెళ్ళాను. ఏడాదిపాటు వుండి, వాడిని, వాడి బంధువులను కనిపెట్టి, వారినందరిని వధించగా, వారి రక్తంతో ఆ గుహ నిండిపోయింది.

నేను బయటకు రావడం కష్టమైంది. కష్టపడి గుహ ముఖద్వారం చేరేసరికి, ద్వారం బండరాయితో మూసివేయబడి వుండటం గమనించాను. సుగ్రీవుని కోసం పిలిచాను. సమాధానం లేదు. చివరకు ఆ బండరాతిని అతి కష్టం మీద తన్నివేసి, నేను తిరిగి కిష్కింధకు వచ్చాను. సుగ్రీవుడు సింహాసనం మీద ఉండటం చూచి ఆశ్చర్యపోయాను. నన్ను గుహలోనే ఉంచి, ద్వారాన్ని రాయితో మూయటం వెనక వున్న అతని ఉద్దేశమేమిటో ఇపుడు అర్థమైంది నా రాజ్యాన్ని చేజిక్కించుకోవాలనే అతడు అలా చేశాడు అని గ్రహించ గలిగాను. ఆ తర్వాత వాలి నా భార్యతో సహా నా సర్వస్వాన్నీ స్వాధీనం చేసుకొని నన్ను ఏకవస్త్రంతో కిష్కింధ నుండి బహిష్కరించాడు. ఆనాటి నుండి నేటి వరకు నా సన్నిహిత మిత్రులతో ఈ పర్వతం మీద నివసిస్తున్నాను.' అని సుగ్రీవుడు వివరించాడు.

అన్ని వినిన రాముడు 'ప్రియమైన సుగ్రీవా! నీవు నీ భార్యను, నీ రాజ్యాన్ని తిరిగి పొందగలిగేలా నేను వాలిని సంహరిస్తాను. నీవు నిశ్చింతగా ఉండు.' అని అన్నాడు. కాని వాలిని రాముడు సంహరించ గలిగే శక్తి అతనికున్నదా అనే సంశయంతో సుగ్రీవుడు ఉన్నాడు. తన అన్న వాలి పరాక్రమాన్ని తెలియజేయ దలచి సుగ్రీవుడు రామునికి ఒక కథ వినిపించాడు 'పూర్వం దుందుభి అనే భయంకర దానవుడు ఉండేవాడు. వాడు మహిష రూపంతో భూమ్మీద సంచరిస్తూ ఉండేవాడు. సముద్ర తీరం చేరిన దుందుభి సముద్రాన్ని తనతో యుద్ధం చేయమని కోరాడు. అపుడు సముద్రుడు ప్రత్యక్షమై 'అసురోత్తమా! నేను నీకు సరితూగేవాడను కాను. నేనిచ్చే సలహా ఏమంటే నీవు పరమశివుని మామ, హిమాలయాల అధిష్ఠాన దైవమైన హిమవంతుని దగ్గరకు వెళ్ళు' అని చెప్పాడు. తనతో సముద్రుడు యుద్ధం చేయడానికి భయపడుతున్నాడని గ్రహించిన దుందుభి హిమాలయ సానువుల వద్దక వెళ్ళి శిఖరాలను చీల్చ సాగాడు. అంతట ఒక శిఖరాగ్రంపై హిమవంతుడు ప్రత్యక్షమై 'నేను అహింసా వాదిని. ఋషులకు ఆశ్రయ మిస్తున్నాను. యుద్ధ క్రీడల్లో నేను నిపుణుడను కాను. అందుచేత దానవాగ్రగణ్యా! మమ్మల్ని ఇలా వదిలేసి, ఇకపై కల్లోలాలను సృష్టించడం మానుకో' అని అన్నాడు. మరి ఎవరితో నేను యుద్ధం చేయాలి అని దానవుడు ప్రశ్నించగా ఇంద్రసూనుడు వాలి గురించి చెప్పాడు. ఆ తర్వాత దుందుభి

పెద్ద ఎనుబోతు రూపంలో కిష్కింధకు వెళ్ళి బిగ్గరగా రంకెలు వేస్తూ, తన దుష్ట క్రీడలతో నగర ద్వారాలను ధ్వంసం చేయసాగాడు. వాలి తక్షణమే బయటికి వచ్చి ఆ దానవుణ్ణి యుద్ధానికి సవాలు చేశాడు. వాలి దుందుభి కొమ్ములను దొరకబుచ్చుకొని గిరగిరా త్రిప్పి నేలకేసి బాదగా, రక్తం పారింది. ఆ ద్వంద్వ యుద్ధంలో ఇరువురూ బాగా గాయపడ్డారు. కాని కొద్ది సమయంలో దానవుడి బలం క్షీణించసాగింది. దీన్ని గమనించిన వాలి దుందుభిని ఎత్తి గాలిలోకి లేపి తన శక్తినంతా ఉపయోగించి వానిని నేలపై ఈడ్చి కొట్టాడు. ఇంద్రుడు ఇచ్చిన కాంచనమాల కారణంగా వాలితో ఎవరైనా నేరుగా పోరాటానికి దిగితే, పోరాడే కొద్దీ ఎదుటివారి శక్తి వాలికి చేరుతుంది. అప్పుడు ఎదుటివాడు శక్తిహీనుడౌతాడు.

తన దేహం నుండి విస్తారంగా రక్తం స్రవించడంతో దుందుభి మరణించాడు. అలా వాలి అతని మృతదేహాన్ని నాలుగు మైళ్ళ దూరం వరకు విసిరి వేశాడు. వాని మృతదేహం ఆకాశంలో పోతూ ఉండగా, దానినుండి వెలువడిన రక్త బిందువులు కొన్ని మతంగ ఋషి ఆశ్రమ స్థలంలో పడ్డాయి. దానితో కోపించిన మతంగ మహర్షితో దానవుడు వాలిచేత వధించబడ్డాడని తెలిసి ఆగ్రహించాడు. ‘ఆ వానరుడు ఎప్పుడైనా నా ఆశ్రమానికి నాలుగు మైళ్ళ దూరంలోకి రావడం జరిగితే అతడు మరణిస్తాడు, అతని సచివులెవరైనా ఇటు వస్తే, వారు వేల సంవత్సరాల పాటు రాతి విగ్రహాలై ఇక్కడే పడివుంటారు.’ అని శపించాడు. ఋషిని ప్రసన్నం చేసుకోవాలని, వాలి ప్రయత్నించినప్పటికీ వీలుకాలేదు. అప్పటినుండి ఈ స్థలానికి రావడానికి వాలి భయపడుతూనే వున్నాడు. అదిగో అక్కడ పడివున్న ఆ మహాదానవుని అస్థికలను చూడవచ్చు. ఎంతటి బలశాలియో తెలుసుకోవచ్చు. మరి వాలిని హతం చేయగలనని ఎలా ఆశించగలవు?’ అని అన్నాడు సుగ్రీవుడు.

వాలిని సంహరించడంలో రాముని పరాక్రమాన్ని సుగ్రీవుడు సంశయిస్తున్నాడని గ్రహించి లక్ష్మణుడు నవ్వాడు. ‘రాముడు తన పరాక్రమాన్ని చూపించి, నీ మనస్సుకు సంతోషం కలిగించే పని ఏమిటో చెప్పు’ అని అడిగాడు. అందుకు సుగ్రీవుడు ‘ఒకప్పుడు వాలి ఈ స్థలంలో ఏడు మహావృక్షాలను ఏడు బాణాలతో ఛేదించాడు. రాముడు ఈ వృక్షాలలో ఒకేసారి ఒకే బాణంతో చీల్చి, దుందుభి అవశేషాలను 200 ధనుఃప్రమాణాల దూరానికి తన్న గలిగితే, ఆయనను వాలికి సముడైన పరాక్రమవంతునిగా పరిగణిస్తాను’ అని అన్నాడు.

ఈ మాటలు వింటూనే, రాముడు దుందుభి కళేబరాన్ని తన కాలి బొటన వేలితో ఎత్తి అవలీలగా 80 మైళ్ళ దూరానికి విసిరి వేశాడు. అయినప్పటికీ, సుగ్రీవుడు ‘దుందుభి దేహాన్ని వాలి విసిరి వేసినపుడు అతని దేహం రక్తమాంసాలతో నిండి భారంగా ఉంది. పోరాటంలో మరణించాడు. అందుచేత ఇపుడు అతని శరీరం రక్తమాంసాలు లేక బాగా తేలికగా ఉన్నందున, నీవో, వాలియో ఎవరు ఎక్కువ పరాక్రమవంతులు అనేది నిర్ణయించటం సాధ్యం కాదు.’ అని అన్నాడు. దానితో రాముడు తన ధనస్సును ఒక శక్తివంతమైన బాణాన్ని ఎక్కుపెట్టి విడువగా, అది ఏడు వృక్షాలను ఒకేసారి చీల్చుకొంటూ పోయి, భూమిలోనికి ప్రవేశించి, విశ్వంయొక్క అడుగుభాగం వరకు వెళ్ళి ఒక గంట తర్వాత, ఆయన తూణీరంలోనికి తిరిగి వచ్చింది. సుగ్రీవుడు సంభ్రమాశ్చర్యాలతో రాముని పాదాలకు నమస్కరించాడు. అంతట రాముడు సుగ్రీవుని ఆలింగనం చేసుకొని, ‘ఇక మనం ఇప్పుడే కిష్కింధకు పోదాం. ముందు నీవు వెళ్ళి వాలిని పోరాటానికి ఆహ్వానించు. నేను లక్ష్మణుడు నగర ద్వారానికి కొంచెం అవతల వృక్షాల మాటున దాగివుంటాం.’ అని రాముడు సూచించాడు.

సుగ్రీవుడు కిష్కింధకు చేరగానే, వాలిని యుద్ధానికి రమ్మని భీకర గర్జన చేశాడు. ఈ గర్జన వింటూనే వాలి క్రోధావేశంతో బయటికి దూసుకు వచ్చాడు. ఇద్దరూ సరస్పరం పిడిగుద్దులు గుద్దుకొన్నారు. ఆ ఇద్దరు

సోదరులు కావడంతో అందులో వాలి ఎవరో రాముడు పోల్చుకోలేక పోయాడు. ఆ కారణంగా రాముడు బాణప్రయోగం చేయలేకపోయాడు. సుగ్రీవుడు రాముడు తనకు సాయం చేయడం లేదని భావించాడు.

కాని సుగ్రీవుణ్ణి వాలి తరిమికొడుతూ 'ఓరీ పిరికిపందా! పరుగెత్తి ప్రాణాలు కాపాడుకో. బ్రతికి పోతావు.' అంటూ వాలి దెప్పిపొడిచాడు. అంతట సుగ్రీవుడు మతంగుని ఆశ్రమం ప్రక్కన అరణ్యంలో ఆశ్రయం పొందాడు. తరువాత కొంతసేపటికి రామలక్ష్మణులు, హనుమంతుడు అక్కడికి చేరుకొన్నారు. అపుడు సుగ్రీవుడు రాముణ్ణి తూలనాడుతూ ఇలా అన్నాడు. 'నీవు వాలిని వధించే ఉద్దేశ్యం లేకపోతే నన్నెందుకు అతనితో యుద్ధానికి ప్రోత్సహించావు? నీ సోదరుణ్ణి వధించటం నాకు ఇష్టం లేదని చెపితే బాగుండేది కదా?'

దానికి రాముడు మీ ఇద్దరి రూపాలు అభిన్నంగా ఉన్నందున నేను వాలి రూపాన్ని పోల్చుకోలేక పోయాను. దానిచే బాణప్రయోగం చేయలేకపోయానే తప్ప వేరే ఉద్దేశ్యం లేదు. నీ సోదరుడినుండి నీవు భిన్నంగా కనిపించే రీతిలో ఏదైనా చిహ్నాన్ని ధరించమని రాముడు సుగ్రీవునితో చెప్పాడు. ఆ తర్వాత మళ్ళీ సుగ్రీవుడు ఒక పుష్పహారాన్ని ధరింగా, రామలక్ష్మణులు, హనుమంతుడు కిష్కింధకు బయలుదేరారు. నగర పరిసరాలకు చేరుకోగానే సుగ్రీవుని తప్పించి మిగతా మగ్గురూ వృక్షాల చాటున దాగుకొనగా, సుగ్రీవుడు మాత్రం గర్జిస్తూ, ముందుకు సాగి వాలిని యుద్ధానికి  ఆహ్వానించాడు.

సుగ్రీవుని గర్జన వినే సమయానికి, వాలి అంతఃపురంలో ఉన్నాడు. వాలి క్రోధావేశంతో గర్జన చేస్తూ మయటికి వచ్చాడు. కాని వాలి భార్య తార తన భర్తతో 'కోపాన్ని వీడి ఆలోచించు. సుగ్రీవుని నీవు హూనం చేసి శక్తిహీనుణ్ణి చేశాడు. ఇంతలో అతడు మళ్ళీ వచ్చి యుద్ధానికి ఆహ్వానిస్తున్నాడంటే, నీవు ఆలోచించాల్సిందే. అతని వెంబడి ఎవడో పరాక్రమవంతుడైన వాడు వచ్చి ఉండాలి. రామలక్ష్మణులు ఇక్కడికి వచ్చారని, వారు సుగ్రీవునితో మైత్రీబంధాన్ని ఏర్పరచుకొన్నారని, మన కుమారుడు అంగదుడు గూఢచారుల ద్వారా తెలుసుకొని వున్నాడు. రాముడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు స్వరూపుడు. అతనితో నీకు శత్రుత్వం తగదు. నీవు చేయవలసిం దేమంటే, ఈ రాజ్యానికి సుగ్రీవుని రాజుగా చేసి, అతనితో సఖ్యత పెంచుకో. అందే నీకు మంచిది.' అంటూ ఎంతో బ్రతిమాలింది తార. వాలికి వినాశకాలం దాపురించినందున ఆ హితవాక్యం పనిచేయలేదు. 'నా సోదరుని అహంకారాన్ని నేను సహించలేను. రామునితో నాకేమీ కలహం లేదు. ఆయన ధర్మాత్ముడైన క్షత్రియుడు. శత్రుత్వం లేని మనిషికి అతడు ఎన్నడూ హాని చేయడని నాకు తెలుసు.' ఇలా అంటూనే, వాలి వెలుపలికి వచ్చి సుగ్రీవుణ్ణి  ఎదుర్కొన్నాడు.

ఇద్దరి మధ్యా ఘోరసంగ్రామం జరుగుతోంది. వాలి బలం పెరుగుతూ, సుగ్రీవుని శక్తి తగ్గుతూ వుంది. సుగ్రీవుని సంకేతాన్ని గ్రహించిన రాముడు ఒక శక్తివంతమైన బాణాన్ని వింటినారికి సంధించాడు. ఆ బాణం వదులుతూనే, మెరుపు వేగంతో, వాలి హృదయంలోనికి లోతుగా చొచ్చుకుపోయింది. దానితో నేలకొరిగిన వాలి తన తండ్రియైన దేవేంద్రుడు ఇచ్చిన స్వర్ణమాలను ధరించి వుండటం చేత వాలి వెంటనే మరణించ లేదు. రామలక్ష్మణులు బయటకు వచ్చి, వాలి పడివున్న స్థలానికి చేరుకొన్నారు. వాలి రాముణ్ణి ఇలా దూషించసాగాడు. 'నీవు ధీరోదాత్తుడవని, ధర్మపరాయణుడైన రాజువని విన్నాను. నీవు నరాధముడవని గ్రహించలేక పోయాను. నీవు బాహ్యంగా ధర్మాన్ని ప్రదర్శిస్తున్నావు. కాని నీవు చేసిన దుష్కార్యం నీ నీచ హృదయాన్ని వెల్లడి చేసింది. నీవు నామీద దాడి చేయవనే నమ్మకంతో నేను సుగ్రీవునితో పోరాడాను. తాను క్షత్రియ వీరుణ్ణని చెప్పుకునే వాడెవడైనా

తనతో విరోధం లేని వేరొకనితో యుద్ధంలో ఉన్నట్టి వ్యక్తిని ఎలా వధించగలుగుతావు? నేను నీకు ఎన్నడూ ఏ అపకారం చేసి వుండలేదు. నీ రాజ్యం మీద దండెత్త లేదు. అన్యాయంగా నా శరీరంపై బాణాన్ని ప్రయోగించి ఏమి పుణ్యం సంపాదించావు? నీవు నిజాయితీగా యుద్ధం చేసి వుంటే, ఇక్కడ ఇలా పడివుండేది నేను కాదు, నీవే. నీవు వెనుకనుండి శరాన్ని ప్రయోగించావు. దీన్ని ఎలా సమర్థించుకొంటావో సమర్థించుకో అని నేను సవాలు చేస్తున్నాను' అని వాలి అనగా, రాముడు ఇలా సమాధానం ఇచ్చాడు.

'నీవు చేసిన ఆరోపణలు చూస్తే, నీకు అసలు ధర్మ స్వరూప మేమిటో తెలియదనిపిస్తోంది. నియంత్రణ లేని మనస్సుల కారణంగా వానరులు చంచల స్వభావులై ఉన్నారు. నీవు వానరుడవు కనుక, నీ సలహాదారులు కూడ వానరులే అయివున్నందున, నీవు ధర్మాన్ని అర్థం చేసుకోలేకున్నావు. పర్వతాలు, అరణ్యాలు, నదీనదాలతో కూడిన ఈ సమస్త భూమండలానికి ఇక్ష్వాకు వంశీయులే ప్రభువులు, వారికే వీటిపై సర్వాధికారం వుంటుంది. తమ ఇష్టానుసారం వాటిని నిగ్రహించటం, అనుభవించటం వారి అధికారమే అయి వున్నది. కామపీడితుడవై, దుర్మార్గుడవై పాపకృత్యాలు చేసింది నీవే. నీ సోదరుడి భార్యను నీవు నీ భార్యలా అనుభవిస్తున్నావు. ఈ దుష్కార్యం చేతనే నాచే వధింపదగిన వాడవై యున్నావు. అక్రమ లైంగిక సంబంధానికి శిక్ష మరణమే. పాపిని రాజు శిక్షించకుంటే, ఆ రాజే పాపాత్ముడౌతాడు. ఈ కారణంగానే నిన్ను వధించి, సుగ్రీవుని భార్యను, రాజ్యాన్ని అతను పొందగలిగేలా చేస్తానని నేను అతనికి మాట ఇచ్చాను. సరే ఆ సంగతి అలా వుంచితే, క్షత్రియులు వేటాడే సమయంలో ఒక రహస్య స్థానంలో పొంచి వుండి, ప్రమత్తమై ఉన్న జంతువలపై బాణప్రయోగం చేయడమనేది సమ్మతించదగ్గ విధానమే అయివుంది. అందుచేత నీవు వానర పుత్రుడవైనందున నేను చేసినదానిలో ఇసుమంతైనా దోషం లేదు.' ఇలా రాముని మాటలకు వివేకోదయం అయిన వాలి తన తప్పుడు పనులకు సిగ్గుపడ్డాడు. చేతులు జోడించి 'నీవు చెప్పినదంతా యదార్థమే. నా అజ్ఞానం వల్ల నిన్ను అభిశంసించ సాహసించాను. ప్రియమైన రామా! నా భార్య ద్వారా కలిగిన ఏకైక పుత్రుడు అంగదుణ్ణి సంరక్షించ వలసినదిగా నిన్ను వేడుకొంటున్నాను. నా మరణం వింటే, అతడు మిక్కిలి దుఃఖిస్తాడు. నా పరుషోక్తులకు నన్ను క్షమించు' అని అన్నాడు. అంగదుని రక్షిస్తానని వాలికి రాముడు అభయమిచ్చాడు.

ఈలోగా తార తన కుమారునితో రాజభవనం నుండి పరుగున బయలుదేరింది. వాలి సచివులు ఆమెను చుట్టుముట్టి వున్నారు. రాముని చూడగానే వారందరు పారిపోయారు. వారిని నియంత్రించాలని తార ప్రయత్నించింది. కాని వారు 'వాలిని చూడటానికి వెళ్ళవద్దు. నీ కుమారుణ్ణి కిష్కింధ సింహాసనంపై ప్రతిష్ఠించటానికి ఏర్పాట్లు చేయి' అని వారు ఆమెను కోరారు.

కాని తార 'నా భర్త లేనపుడు ఈ రాజ్యం, దాని భోగైశ్వరాలు వ్యర్థం. రాజ్యాధిపత్యాన్ని నేను లక్ష్యపెట్టను." అని బదులు పలికింది. తార రోదిస్తూ, మృత్యుముఖంలో నేలకొరిగి, వాలి పడివున్న చోటుకు చేరింది. మరణావస్థలో ఉన్న భర్తను తార ఆలింగనం చేసుకొంది. వాలి ఇతర భార్యలు దుఃఖంతో చుట్టూ నిలిచారు. తన భర్తను అనుగమించటమే తార ఏకైక లక్ష్యం. ప్రాయోపవేశానికి నిర్ణయించుకొంది. దానితో హనుమంతుడు ఆమె వద్దకు వెళ్ళి 'మహారాణీ! దయచేసి లే. దుఃఖించకు. నీవు నీ భర్తకు అంతిమ సంస్కారం చేయించి, అంగదుణ్ణి సింహాసనంపై ప్రతిష్ఠించిన తరువాత, అతని సంరక్షణ భారం వహించు.' అని అభ్యర్థించాడు.

అంతట వాలి 'ప్రియమైన సుగ్రీవా! నీకు నేను చేసిన అపకారాలన్నింటిని క్షమించు. నానుండి ఇపుడు రాజ్యాన్ని స్వీకరించి, నా కుమారుడైన అంగదుని జాగ్రత్తగా చూచుకో. ఎందుకంటే అతడు నీపట్ల సదా

విశ్వాసపాత్రుడుగా నిలుస్తాడు.' అని అన్నాడు. అలా అంటూనే, వాలి తానుపొందిన దివ్యమాలను సుగ్రీవుని చేతిలో పెట్టాడు. అంతట అంగదుని వైపు తిరిగి 'ప్రియ కుమారా! ఇపుడు నేను నిన్ను వీడిపోతున్నాను. నీవు సదా సుగ్రీవుని పట్ల విధేయుడవై ఉండు. సుఖదుఃఖాలను సమానంగా చూచుకో. అత్యాశ, ద్వేషం రెండూ పతనానికి దారితీస్తాయి. ఈ రెండింటినీ తొలగించుకో.' అని చెప్పాడు. అలా అంగదునికి హితబోధ చేసిన తర్వాత రామబాణంతో తీవ్ర క్షతగాత్రుడైన వాలి ప్రాణాన్ని త్యజించాడు. తార భర్తను ఆలింగనం చేసుకొంది. నీలుడు వచ్చి వాని హృదయంలో నాటుకొన్న బాణాన్ని జాగ్రత్తగా బయటకు తీశాడు. అంతట తార అంగదునితో తండ్రి పార్థివ దేహానికి నమస్కరించమని కోరింది.

అంగదుడు అలాగేనని నమస్కరిస్తూ, మిక్కిలి దుఃఖితుడైనాడు. తార వ్యథను గమనించిన సుగ్రీవుడు ఆవేదనాభరిత స్వరంతో రామునితో 'నీవు నా కోరిక నెరవేర్చినందు వల్ల లభించాల్సిన ఫలితం కంటే విరుద్ధమైన ఫలితాన్ని నేను పొందడం గమనించాను. నాకు సుఖం కలగడానికి బదులుగా, రాజ్యం, జీవితం పట్ల విరక్తి కలుగుతోంది. నా పాపానికి అగ్నిప్రవేశం చేసి ప్రాణాల్ని త్యజిస్తాను. ప్రియమైన రామా! ఈ మిగిలిన వానర వీరులందరూ నీకు నీ ప్రయత్నాల్లో సాయం చేస్తారు' అని అన్నాడు.

సుగ్రీవుని ఈ మాటలు రాముని బాధించాయి. విచారవదనుడైనాడు. తార రాముని సమీపించి 'నా భర్త స్వర్గంలో నేను లేకుండా సుఖంగా ఉండలేడు. అందుచే నేను కూడ ఆయన్ని చేరుకొనేలా నన్ను కూడా వధించు. ఒకవేళ స్త్రీహత్య పాపమని భావిస్తే నన్ను వాలికి అభిన్నురాలిగా భావించు' అని అన్నది. అపుడు రాముడు సుగ్రీవుని వైపు తిరిగి 'నీ దివంగత సోదరుని కోసం నీవు విడిచిన అశ్రువులు ఇక చాలు. కాలానుగుణంగానే ఈ లోకంలో అన్ని కార్యాలు జరుగుతూ ఉంటాయి. కాలం దేవాధిదేవుని పరిధిని మించి దాటదు. అందుచేత అనివార్యమైన వాటి కోసం విలపించ తగదు.' అని చెప్పాడు. ఇలా సుగ్రీవుడు స్థిమితపడ్డాడు. లక్ష్మణుని సాయంతో సోదరుని అంతిమ సంస్కార ఏర్పాటు చేయ ప్రారంభించాడు. ఆ తర్వాత కిష్కింధనుండి ఒక పల్లకిని తెప్పించారు. సుగ్రీవుడు వాలి దేహాన్ని అందులో వుంచి, సమీపంలోని గిరితరంగిణీ తీరానికి తీసుకొని పోయేందుకు అవసరమైన కార్యాలు నిర్వహించాడు. కాని శిరస్సును తార ఒడిలో పెట్టుకొని ఏడుస్తూనే ఉంది. ఇతర స్త్రీలు వచ్చి తారను అక్కడినుండి లేపగా, సుగ్రీవుడు, అంగదుడు వాలి దేహాన్ని చితిపై ఉంచాడు. దహన సంస్కారం పూర్తయిన తర్వాత బంధువులు తుంగభద్ర నుండి జలాలను తెచ్చి, వానర రాజు దివంగత ఆత్మకు తర్పణాలు విడిచారు.

అంతిమ సంస్కారాల అనంతరం హనుమంతుడు సుగ్రీవునితో పాటు వచ్చి కిష్కింధలో పట్టాభిషేక ఉత్సవంలో పాల్గొనమని రాముణ్ణి అభ్యర్థించాడు. అయితే అందుకు రాముడు నిరాకరిస్తూ 'హనుమా! నీవు దగ్గర ఉండి సుగ్రీవుని పట్టాభిషేకం జరిపించి, అంగదుని యువరాజుగా ప్రతిష్ఠింప జేయమని నా సలహా. వర్షఋతువు వచ్చింది కనుక ఇది సీతాన్వేషణకు అనుకూలం కాదు. వానర ముఖ్యులందరు ఈ నాలుగు నెలలు కిష్కింధలోనే ఉండవచ్చు. లక్ష్మణుడు, నేను ఒక పర్వత గుహిలో గడుపుతాం. హేమంతం వచ్చిన తర్వాత మనం రావణుని రాజ్యం కోసం పూర్తి శక్తియుక్తులతో అన్వేషిద్దాం' అని అన్నాడు. అంతట సుగ్రీవుడు కిష్కింధలో ప్రవేశించగా, పౌరులందరు ఘనస్వాగతం పలికారు. మైందుడు, ద్వివిదుడు, హనుమంతుడు సహా వానర ప్రముఖులందరు, భల్లూక రాజైన జాంబవంతుడు వచ్చి సుగ్రీవునికి పట్టాభిషేకం జరిపారు. సుగ్రీవుడు తన భార్యయైన రుమను మళ్ళీ స్వీకరించి, అంగదుణ్ణి రాజసింహాసనానికి యువరాజుగా ప్రతిష్ఠించాడు.

రామలక్ష్మణులు నాలుగు నెలల పాటు ఒక పర్వత గుహలో నివసించారు. సీతా వియోగ తీవ్రత కారణంగా రాముడు ప్రాకృతిక సౌందర్యాన్ని ఆస్వాదించలేక పోయాడు. రాత్రిళ్ళు నిద్రించలేక పోయాడు. నిరంతరం కన్నీటితో కాలం గడుపుతున్నాడు. రాముడు లక్ష్మణునితో ఒక రోజుఇ ఇలా అన్నాడు. 'ఇప్పుడు వర్ష ధారలు కురుస్తున్నాయి. కాలమేఘాలు ఆకాశం అంతటా వ్యాపించి విషాదభావలను ఉత్పన్నం చేస్తున్నాయి. విద్యుల్లత నల్లని మేఘాలలోనికి వ్యాపిస్తూ రావణుని హస్తాలలో సీతలాగా కనిపిస్తోంది. భూమాత నానావిధ శోభలతో రంగుల చీరలా కనువిందు చేస్తోంది. తుమ్మెదల నాదాలు, చినుకుల చిటపటలు సుశ్రావ్య సంగీత ధ్వనుల్లాగ వినిపిస్తున్నాయి. సుగ్రీవుని కోరిక నెరవేరింది. కాని నేను సీత లేని నిరంతర నదీప్రవాహం చేత కోతపడిన నదీతటంలా ఉన్నాను.' అని అనగా, లక్ష్మణుడు రామునిలో ఉత్సాహం నింప ప్రయత్నం చేశాడు. కాని ప్రకృతి సౌందర్యం, శోభ రాముని విరహతాపాన్ని హెచ్చించేలా ఉన్నాయి కాని తగ్గించలేదు. తాను సుగ్రీవునికి సాయంచేశాను కనుక సుగ్రీవుడు సీతాన్వేషణలో సాయపడతాడని, మరువడని రాముడు ఆశిస్తున్నాడు. కాని శరదృతువు వచ్చినా, ఆకాశం నిర్మలమైనా కూడా, సుగ్రీవుడు రాముణ్ణి కలుసుకోవడానికి రాలేదు. ఇపుడు సుగ్రీవునికి సోదరుని భయం కాని, మరెవరివల్ల కాని యే హాని లేదు కనుక అతను తన భార్యతోను, ఇతర క్రొత్తగా లభించిన భార్యల యొక్క సాహచర్యంలో మునిగితేలుతూ వున్నాడు. అలా అతడు రాజ్యపాలనా కర్తవ్యాన్ని కూడ నిర్లక్ష్యం చేశాడు.

ఇలా సుగ్రీవుడు ప్రవర్తించటం చూచి, హనుమంతుడు రాజును సమీపించి, 'నీవు నీ వాగ్దానాన్ని అనుసరించి రాముని పట్ల నీ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. నీమీద గల గౌరవం కారణంగానే, రాముడు గుర్తుచేసేందుకు నీ దగ్గరకురాలేదు. కాని ఆయన అనుగ్రహం వల్లనే, నీవు ఇపుడు సకల భోగాలను అనుభవిస్తున్నావనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మరువకూడదు. నీవు ఇపుడు నీ అధీనంలో ఉన్న కోటిమంది వానరులకు కబురు పెట్టి, సీతకోసం సంపూర్ణ శక్తియుక్తులతో అన్వేషణ ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.' అంటూ హనుమంతుడు హితబోధ చేశాడు. హనుమంతుని హితబోధతో కొంతమేర తెలివితెచ్చుకొని, సుగ్రీవుడు నీలుణ్ణి పిలిచి 'వానర యోధులందరు ఒక పక్షం రోజుల్లో విధుల్లోకి చేరాలి. లేకపోతే మరణమే' అని ఆదేశించాడు. ఈ ఆదేశం ఇచ్చి, సుగ్రీవుడు మళ్ళీ అంతఃపులంలోకి వెళ్లిపోయాడు. రామునికి విరహతాపం హెచ్చుతూ ఉంది. సుగ్రీవుడు విషయ లాలస జీవనంలో మునిగి తేలుతున్నాడు అని అర్థం కావడంతో రాముడు మరింత నిరాశకు గురైనాడు. లక్ష్మణుడు రాముని విరహాన్ని తన శక్తి మేరకు తొలగించడానికి అనేక రకాలుగా ప్రయత్నించాడు. ఒక రోజున రాముడు ఒక నిశ్చయానికి వచ్చి ఇలా అన్నాడు.

'ఇపుడు శరదృతువు వచ్చింది. నేల పొడిగా, దృఢంగా ఉంది. గాలి అనుకూలంగా ఉంది. యుద్ధసన్నాహాలు ప్రారంభించటానికి అనువైన సమయమిదే. సుగ్రీవుడు పూర్తిగా తన కర్తవ్యాన్ని విస్మరించి, సుందరీమణుల ఆనందంలో మునిగి ఉన్నట్లున్నాడు. అందుచే ఓ లక్ష్మణా! నీవు కిష్కింధకు వెళ్ళి సుగ్రీవుని నా పేరుతో ఇలా మందలించు. ఓ వానరేంద్రా! నీవు ఇలా వ్యవహరించడంతో నీవు అధమాధముడవు. నీ అన్ననే వధించిన రాముణ్ణి నీవు నిర్లక్ష్యం చేయటం నీకు సాహసమే. నాకు ఆశ్చర్యంగా ఉంది. నీవు కనుక నీ కర్తవ్యాన్ని విస్మరించి, రామునికి సాయం చేయని యెడల, రాముడే స్వయంగా కిష్కింధకు వచ్చి, నిన్ను సబాంధవంగా హతమారుస్తాడు. తెలుసుకో అని హెచ్చరించు.'

ఎప్పుడైతే రాముడు ఇలా క్రోధాన్ని ప్రదర్శించాడో, లక్ష్మణుడు కూడ ఆగ్రహావేశాన్ని పొందాడు. తన ధనస్సును చేతిలోనికి తీసుకొని 'దుర్మార్గుడైన ఆ సుగ్రీవుడు నీ ఆజ్ఞను పాలించటానికి తక్షణమే ఉద్యమించక పోతే, నేనే అతణ్ణి ఈరోజు వధిస్తాను' అని ప్రకటించాడు. అలా లక్ష్మణుడు బయలుదేరుతుండగా, రాముడు 'ముందుగా స్నేహపూర్వకంగా మాట్లాడు. అతని వివేకం మేల్కొనవచ్చు.' అంటూ తమ్ముని కోపాన్ని నిగ్రహించాడు.

శోభాయమానమైన కిష్కింధ నగరంలోనికి లక్ష్మణుడు కోపంతో ప్రవేశించాడు. సుగ్రీవుని ప్రాసాదం వైపు దూసుకుపోతూ, మత్తగజంలా మధ్యలోని చెట్లను కూల్చివేస్తూ వెళుతున్నాడు. లక్ష్మణుని క్రోధాగ్నినిచూనించిన భయంకర వానరులు వృక్షాలనుపెకలించటం, ఆయుధాలను సేకరించటం ప్రారంభించారు. వానర భటులు అలా సాయుధులు కావటాన్ని చూచిన లక్ష్మణుడు మహోగ్రుడు కాగా, వానర భటులు భయపడిపోయారు.

లక్ష్మణుడు వస్తున్న తీరును గురించి సుగ్రీవునికి చెప్పటానికి సచివులు అతని దగ్గరకు వెళ్ళారు. కాని శృంగార క్రీడల్లో మథించి ఉన్న సుగ్రీవుడు సచివులను పట్టించుకో లేదు. అంతట సచివులు వానరులందరిని యుద్ధానికి సిద్ధం కమ్మని ఆజ్ఞాపించగా, కోపించిన లక్ష్మణుడు అంగదుణ్ణి కలుసుకొని, తన రాకను సుగ్రీవునికి చెప్పమని కోరాడు. అంగదుడు పినతండ్రి గదిలోకి వెళ్ళి ఆయన పాదాలు పట్టుకొని లక్ష్మణుని రాకను గురించి చెప్పాడు. కాని మద్యం మత్తులో సుగ్రీవుడు లేవనే లేదు. కాని అసంఖ్యాకులైన వానరులు కేకలు వేయడంతో సుగ్రీవుడు మేల్కొన్నాడు. లక్ష్మణుని భయంతో అతడు తెలివిలోనికి వచ్చాడు.

అతని సచివులు 'నీకోసం లక్ష్మణుడు కోపంతో ప్రాసాదం వద్ద నిరీక్షిస్తున్నాడు. కనుక నీవు వెంటనే వెళ్ళి ఆయనకు నమస్కరించి లొంగిపోవాల్సిందేనని కోరుతున్నాం. దానితో ఆయన కోసం చల్లారుతుందని మా ఆశ' అని చెప్పారు. పరిస్థితి అర్థంచేసుకొన్న సుగ్రీవుడు శయ్య దిగాడు. అంతట హనుమంతుడు సుగ్రీవునికి కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ 'ఓ రాజా! ఇంద్రియ భోగాల్లో నీవు కాల గమనాన్ని గుర్తించ లేకున్నావు. శరదృతువు వచ్చి రాల కాలమయింది. కాని సీతాన్వేషణలో రామనికి సాయం చేస్తానన్న నీ వాగ్దానాన్ని నిర్లక్ష్యం చేశావు. లక్ష్మణుడు నీకు గుర్తు చేసేందుకు ఇపుడు వచ్చాడు. నీవు చేతులు జోడించి ఆయనను సమీపించు. ఆయనను శాంతింపచేయి.' అని అన్నాడు. సుగ్రీవుడు కోరిన మీదట అంగదుడు లక్ష్మణుని వెంటపెట్టుకొని ప్రాసాదంలోనికి వచ్చాడు. ఆయనతో వున్న వానరులంతా అక్కడ చేతులు జోడించి బుద్ధిగా నమస్కరించారు.

సుగ్రీవుని అంతఃపురంలో లక్ష్మణునికి గానాలాపన చేస్తున్న యువతుల కంఠస్వరాలు వినిపించాయి. పరస్త్రీ విముఖుడైన లక్ష్మణుడు ఆ సుందరీమణులను చూచి కొద్దిగా సిగ్గుపడ్డాడు. లక్ష్మణుడు తాన ధనుష్టంకార ధ్వనితో తన రాకను సూచించాడు. ఆ ధ్వని వినగానే సుగ్రీవుడు కంపించిపోయి తారతో 'లక్ష్మణుడు ఎందుకు ఆగ్రహించాడో నాకు తెలియడం లేదు. నీవు ముందుగా బయటకు వెళ్ళి ఆయనను శాంతపరచ ప్రయత్నిస్తే తర్వాత నేను ఆయనను వేడుకొంటాను' అని అన్నాడు. కొద్ది వికృతమైన దుస్తులతొ తార లక్ష్మణుని ఎదుటకు వచ్చింది. లక్ష్మణుడు తన కోపాన్ని తగ్గించుకొని వినయంగా ఆమె పాదాలపై దృష్టిని మరల్చాడు. అపుడు తార 'ప్రియమైన రాకుమారా! నీకు సుగ్రీవునిపై అంత కోపమెందుకు?' అని అనునయంగా ప్రశ్నించింది. అందుకు లక్ష్మణుడు 'రాముని పట్ల నిర్వర్తించవలసిన తన కర్తవ్యాన్ని నీ భర్త మరచిపోయి, యువతులతో సరసాలాడుతూ కాలక్షేపం చేస్తున్నాడు' అంటూ గట్టిగా బదులు యిచ్చాడు.

అందుకు తార 'సుగ్రీవుడు కామాంధకారంలోబుద్ధి చెడి వున్నాడు. కనుక నీవు అతన్ని క్షమించాలి. ఋషులు కూడ ఇంద్రియ సంతృప్తి కోసం ప్రాకులాడుతూ ఉంటారంటే ఇక వానరుడి చలపచిత్తం గురించి చెప్పేదేముందు? సుగ్రీవుడు తన కర్తవ్యాన్ని మరచాడని భావించవద్దు. తాను ఇప్పటికే సీతాన్వేషణ నిమిత్తం లక్షలాది వానరులను ఇక్కడికి సమీకరించాడు. దయచేసి, నీవు లోనికి వచ్చి అతనితో మాట్లాడు' అని అభ్యర్థించింది.

లక్ష్మణుడు అంతఃపురంలోనికి అడుగు పెట్టాడు. అపూర్వ జ్యోత్స్నల్ని, సుందరాంగుల సమూహాన్ని చూడగానే, ఆయనలో మరొకసారి కోపం పెల్లుబికింది. సుగ్రీవుడు శయ్యపై రుమను ఆలింగనం చేసుకొని వున్నాడు. అయితే లక్ష్మణుడు ప్రవేశించడం చూడగానే లేచి చేతులు జోడించి నిలబడ్డాడు. అక్కడ ఉన్న స్త్రీలందరూ అలాగే చేతులు జోడించి నిలబడ్డారు. లక్ష్మణుడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. 'నీవు శుష్క వాగ్దానాలు చేసి అవిశ్వసనీయ మిత్రునిగా నిరూపించుకొన్నావు. కనుక నీవు ఒక నీచుడవు. మిత్రుని సాయం పొంది, అందుక ప్రత్యుపకారం చేయని వానిని హతమార్చాల్సి ఉంది. బ్రహ్మదేవుడు చెప్పినట్లు ఇలాంటి కృతఘ్నుడికి ఎలాంటి ప్రాయశ్చిత్తం లేదు. సుగ్రీవా! ఇదే నా హెచ్చరిక. నీవు తక్షణమే రాముని పట్ల నీ కర్తవ్యాన్ని నెరవేర్చక పోతే, ఈరోజే నీవు కూడ వెళ్ళి నీ అన్నను కలుసుకుంటావు' అంటూ హెచ్చరించాడు.

అంతట తన భర్త తరపున తార ఇలా చెప్పింది. 'ఓ లక్ష్మణా! సుగ్రీవుడు అసత్యవాది కాదు. కఠినాత్ముడు అంతకంటే కాదు. రాముని సాయాన్ని అతను విస్మరించ లేదు. అతని దోషమల్లా ఇంద్రియ సంతృప్తిలో కాలగమనాన్ని మరచాడు. రావణుని, లంకలో కోట్ల మంది రాక్షసులున్నారని వినికిడి. వారిని ముందు వధించకుండా రావణ సంహారం సాధ్యం కాదు. కనుక సుగ్రీవుడు భూమిపై అన్ని దిక్కులలో వున్న వానరులకు కబురు పెట్టాడు. వారందరు ఇంకా రావలసి ఉంది. అందుచేతనే అతడు రాముణ్ణి కలుసుకోవడం గాని, సీతాన్వేషణ ప్రారంభం కాని చేయలేదు. ఈ రోజు నుండే వానరులు, భల్లూకాలు, మహావానరులు కిష్కింధకు రావటం ప్రారంభమవుతోంది ఈ మాటలు వినిన లక్ష్మణుడు తన కోపాన్ని వదిలాడు. సుగ్రీవుడు వినయంగా తన మెడలోని పూదండను తీసివేసి 'రాముడు నాకు చేసిన సాయానికి నేను మూల్యం చెల్లించలేను. ఆయన నా స్వామి, నా దైవం. ఆయన ఎక్కడికి వెళ్ళినా, నేను అనుసరిస్తాను. ఏ ఆజ్ఞ ఇచ్చినా పాటిస్తాను. నేను తప్పు చేశానని పూర్తిగా ఒప్పుకొంటున్నాను. నన్ను క్షమించమని వేడుకొంటున్నాను.' అని అన్నాడు.

లక్ష్మణుడు సంతసించి, 'నా క్రోధానికి నన్ను క్షమించు. నీవు వెంటనే వెళ్ళి రాముణ్ణి చూడటం అత్యవరం. నీ చిత్తశుద్ధి ఆయన్ని ఉత్సాహపరుస్తుంది.' అని బదులు పలికాడు.

అంతట సుగ్రీవుడు హనుమంతునితో 'హిమాలయ, మహేంద్ర, కైలాస పర్వతాలలోని వానరుల నందరిని పిలిపించు. అందరిని ఉత్తేజితులను చేయి. నా ఆజ్ఞను తిరస్కరించిన వారిని సంహరిస్తానని చెప్పు' అని ఆదేశించాడు. హనుమంతుడు తక్షణమే వానర నాయకులను అన్ని ప్రదేశాలకు పంపాడు. అంతట ఒక గంట గడవక ముందే, వానరులెల్లరు కిష్కింధకు రావడం మొదలైంది. వారు సుగ్రీవుని కలుసుకొన్నారు. రాముణ్ణి కలవమని మళ్ళీ లక్ష్మణుడు సుగ్రీవుని కోరాడు. సుగ్రీవుడు ఒక పల్లకిని తెప్పించాడు. అక్ష్మణ, సుగ్రీవులను ఆ పల్లకిలో కూర్చోబెట్టి అసంఖ్యాక వానరులు మోసుకుపోవడం జరిగింది. ఆ తర్వాత సుగ్రీవ, లక్ష్మణులు ముకుళిత హస్తాలతో రాముని ఎదుట నిలబడగా, రాముడు వానర సేన వంక మహదానందంతో చూచాడు. అంతట సుగ్రీవుడు రాముని ముందు సాష్టాంగపడి, సంపూర్ణ సమర్పణ చేసుకొన్నాడు. రాముడు వెనుకటి అసంతృప్తి ఛాయలు కనపర్చకుండా, కారుణ్యంతో సుగ్రీవుని ఆలింగనం చేసుకొన్నాడు.

వానర రాజుకు ఒక ఆసనం ఇచ్చి రాముడు రాజవిధులను గురించి చెప్తూ 'రాజైనవాడు ధర్మార్థ కామమోక్షాలకు ఏ సమయం ఉచితమో తెలుసుకుని వ్యవహరించాలి. ఇంద్రియ సుఖాలకు బానిస అయి వేదోక్త నియమములను ఉల్లంఘించరాదు. అటువంటి రాజు పతితుడవుతాడు. ప్రియమైన సుగ్రీవా! నీవు నాకు చేసిన శపథం ప్రకారం సీతాన్వేషణకు ఇదే సరియైన సమయం.' అని చెప్పాడు.

సుగ్రీవుడు ఇలా జవాబు చెప్పాడు. 'ప్రియమైన రామా! నేను నీకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇక్కడ ఉన్న వానరులందరూ అదేరకంగా ఉన్నారు. దయచేసి నిశ్చింతగా ఉండండి' అని అన్నాడు. తమ స్నేహాన్ని ధృవీకరిస్తూ రాముడు మరల సుగ్రీవుని ఆలింగనం చేసికొన్నాడు.

సుగ్రీవుని ఆజ్ఞానుసారం  కిష్కింధకు వచ్చిపడుతున్న వానర సమూహాలు ఏర్పరచిన ధూళి మేఘంగా కప్పివేయడంతో మార్తాండుడు తెరమరుగైనాడు. వానర మహానాయకులు, భల్లూక రాజైన జాంబవంతుడు తమ తమ లక్షలాది అనుచర గణాలతో సుగ్రీవుని ముందుకు వచ్చారు. పరిసర అరణ్య పర్వత ప్రాంతమంతా వానరులతో నిండిపోయింది. సుగ్రీవుడు వానర యోధులను రామునికి చూపుతూ 'ప్రియమైన ప్రభూ! ఈ వానర యోధులను నీవు నీ స్వంత సైన్యంగా భావించాలి. ఇక నీవు నీకు తోచిన రీతిలో వీరిని ఆజ్ఞాపించు.' అని అన్నాడు సుగ్రీవుడు. అపుడు రాముడు 'ప్రియమైన సుగ్రీవా! రావణుడి నివాస స్థానం ఎక్కడుందో, సీత ఇంకను జీవించి యున్నదా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడమే మనం ముందుగా చేయవలసిన కార్యం. నీవు అన్వేషక బృందాలు ఏర్పాటు చేయాలి. సీతను కనుగొనటం జరిగినపుడు, నేను తక్కిన అవసరమైన ఆదేశాలిస్తాను.' అని అన్నాడు రాముడు.

తక్షణమే సుగ్రీవుడు వానర రాజైన విందుని పిలిచి ఇలా ఆదేశించాడు. 'నీవు నీ సైనికులు తూర్పు దిక్కున అంతటా వెదుక కోరుతాను. క్షీరసముద్రానికి అవతల స్వచ్ఛ జలసాగరం ఒకటుంది. అందులో బడబాగ్ని ఉంటుంది. స్వచ్ఛ జలసాగరానికి తూర్పు తీరం నుండి 13 యోజనాల దూరంలో పూర్తిగా స్వర్ణమయ శిలలతో నిర్మితమైన జాతరూశిల అనే పేరు గల పర్వతం ఉంటుంది. అనంత శేషుడు యావత్ భూతల భారాన్ని అక్కడనురేడ వహిస్తూ ఉంటాడు. అది తూర్పు దిక్కు యొక్క బయటి సరిహద్దు. ఆ మొత్తం ప్రాంతాన్ని గాలించటానికి మీకు ఒక నెల గడువిస్తున్నాను. ఆ గడువు ముగిసిన తర్వాత తిరిగి వచ్చినవారికి రాజాజ్ఞ ధిక్కరణకు గాను మరణ దండన ఉంటుంది.'

ఆ తర్వాత సుగ్రీవుడు వాలి కుమారుడైన అంగదుని నాయకత్వంలో నీలుడు, హనుమంతుడు, జాంబవంతుడు, మైందుడు, ద్వివిదుడు తదితరులను దక్షిణ దిక్కుకు పంపాడు. దక్షిణ ప్రాంతాన్ని వర్ణించిన మీదట, సుగ్రీవుడు ఆ వానరులను ఇలా ఆదేశించాడు. 'లవణ సముద్ర ఉత్తర తీరానికి 800 మైళ్ళ అవతల ఒక ద్వీపం ఉంది. అదే రావణుని నివాసం అయి ఉంటుందని నేను నమ్ముతున్నాను. ఇంకా దక్షిణానికి వెళ్తే వాసుకి చేత పాలించబడుతున్న రసాతల రాజధాని అయిన భోగవతి వస్తుంది. ఆ తర్వాత భూమండలపు అంతిమ సరిహద్దు అయిన ఋషభ పర్వతానికి అవతల అమరుల రాజు నివాసముంటుంది. పితృలోకాన్ని గాని, ఆపైగాని భూలోకవాసులు ఎవరూ వెళ్ళలేరు కనుక అక్కడ మీరు వెదకకండి.' అని అన్నాడు.

అనంతరం సుగ్రీవుడు సుషేణుని, అతని అనుచరులను పశ్చిమ దిక్కుకు పంపాడు. 'లవణ సముద్రానికి మధ్యలో నరకాసురుని పట్టణమైన ప్రాగ్జ్యోతిష పురం ఉంటుంది. సూర్యుడు అస్తమించే పశ్చిమ దిక్కు అదే. దానికావల ఏముంటుందో తెలియదు. కనుక మీరు దాన్ని దాటి వెళ్ళకండి.' అని వారితో చెప్పాడు.

చివరగా శతబలిని ఉత్తర దిక్కుకు పంపిస్తూ సుగ్రీవుడు 'నీవు ముందుగా మ్లేచ్ఛుల దేశానికి, ఆ తర్వాత హిమాలయ పర్వతాలకు వెళ్ళు. ఈ పర్వతాలకు అవతల 800 మైళ్ళ వరకు నిర్జన భూమి ఉంటుంది. ఆపైన కుబేరుడు నివసించే కైలాస పర్వతం వస్తుంది. ఆ తర్వాత క్రౌంచ పర్వతం, ఆపైన ఉత్తర మేరు ప్రాంతం వుంటాయి. చివరకు ఉత్తర లవణ సముద్రం వస్తుంది. ఆ సముద్రం మధ్యలోని సోమగిరి అనే కాంచన పర్వతం ఉంటుంది. అందులో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నివసిస్తుంటారు. దానిని దాటి ముందుకు పోవటం అసాధ్యం. కనుక నీకు ఆ పర్వతం కనిపించగానే వెనుకకు మళ్ళాలి' అని సూచించాడు.

సీతను కనుగొనటానికి అత్యంత సమర్థుడు హనుమంతుడేనని సుగ్రీవుడు గ్రహించాడు. అందుచేత సుగ్రీవుడు హనుమంతునితో 'ఓ హనుమా! వానర శ్రేష్ఠులలో నీవు అసామాన్యుడవు. భూమిమీద కాని, ఆకాశంలో కాని, స్వర్గ, అధోలోకాలలోగాని నిన్ను అడ్డుకోగల వాడెవడూ లేడు. మాయాతీత శక్తియుక్తుడవే గాదు, నీవు ధైర్యశాలివి, ప్రజ్ఞాధురీణుడవు, సమయస్ఫూర్తి కలిగినవాడవు. అందుచేత సీతను కనుగొనుటలో నీ మీదే నాకెక్కువ విశ్వాసం ఉంది.' అని అన్నాడు. ఈ మాటలు విన్న హనుమంతునికే గాక, రామునికి కూడ హనుమంతుని మీద ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. రాముడు అపుడు తన అంగుళీయాన్ని తీసి హనుమంతునికి ఇచ్చి నీవు సీతను కనిపెట్టినపడు దీనిని సీతకు ఇవ్వు. అప్పుడే సీతకు నీవు నా దూతవని నమ్మకం కుదురుతుంది. ప్రియ హనుమా! నీవు ఈ ముఖ్య కార్యాన్ని చేయగలవని నేను సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను.' అని రాముడు అన్నాడు.

హనుమంతుడు అంగుళీయాన్ని స్వీకరించి, దానిని శిరస్సుకు తాకించి, రామునికి ప్రణమిల్లాడు. అక్కడినుండి హనుమంతుడు బయలుదేరాడు. సీత కోసం వానరులందరు భూమండలమంతా తిరుగుతూ గాలిస్తున్నారు. రామలక్ష్మణులిద్దరూ నెలరోజుల పాటు తమ పర్వత గుహలోనే ఉండిపోవడానికి సమ్మతించారు. వానరులు వెళ్ళిన తర్వాత రాముడు ఇంత ఖగోళ పరిజ్ఞానాన్ని నీవు ఎలా సంపాదించావు? అని సుగ్రీవుణ్ణి అడిగాడు.

అందుకు సుగ్రీవుడు ఇలా జవాబు చెప్పాడు. 'వాలి నన్ను బహిష్కరించిన తరువాత నేను అతనికి రాజ్యాన్ని స్వచ్ఛందంగానే అప్పగించినా కూడా అతడు కోపంతో నన్ను వెంటాడసాగాడు. అలాగ భయంతో వాలి నుండి తప్పించుకోవడానికి నేను భూమండలమంతా తిరిగాను. చివరకు కొంతకాలం తర్వాత మతంగుని శాపం గురించి హనుమంతుడునాకు తెలియజేయటంతో మతంగుని ఆశ్రమ ప్రాంతంలో నేను ఆశ్రయం పొందాను.'

సీతాన్వేషణలోనిమగ్నులైన వానరులు పగటి వేళ విడివడిగా తిరుగుతూ, రాత్రివేళ ఒక చోటికి చేరుతూ విశ్రాంతి తీసికొంటూ ఉండేవారు. వినతుడు, శతబలి, సుషేణుడు తమ తమ ప్రాంతాల్లో క్షుణ్ణంగా గాలింపు జరిపి, నెల పూర్తి అయ్యేలోగా వచ్చేశారు. సీత జాడ కనిపెట్టలేక పోయామని విచారంతో సుగ్రీవునికి చెప్పారు. మరియు తమ అనుభవాల్ని రామునికి కూడ చెప్పారు. తత్ఫలితంగా, హనుమంతుడే ఏకైక ఆశాకిరణమనే నిశ్చయానికి అందరూ వచ్చారు.

అంగదుని నేతృత్వంలోని బృందం కూడ నానా కష్టాలు పడ్డారు. ప్రకృతిలోని వనరులు మృగ్యం కావడంతో వానరులు శుష్కించిపోయారు.

ఆ ఆరణ్యంలో ఒకప్పుడు కండూ మహర్షి ఉండేవాడు. అతని కుమారుడు అల్పాయుష్కుడై పదేళ్ళ వయస్సులోనే మరణించినందున, ఆ ఋషి కోపంతో ఆ అడవి మనుష్యులకు, మృగాలకు నివాసయోగ్యం

కాకుండా శపించాడు. ఇలాంటి నిర్జనారణ్యంలో వానరులు తిరుగుతుండగా, వారికి ఒక భయంకర రాక్షసుడు తారసపడ్డాడు. అతడు దేవతల నుండి వరాన్ని పొందిన కారణంగా నిర్భయంగా అడవుల్లో సంచరిస్తుండటం చూచి, అతడే రావణుడు అనుకొని అంగదుడు అతన్ని సంహరించాడు. కాని సీతాన్వేషణలో వారందరూ నిస్పృహ చెందారు.

కాలం ఇలా త్వరగా గడిచిపోయింది. అంగదుడు వింధ్య పర్వత శ్రేణుల్లో తదితర ప్రాంత్లో తమ వానరుల చేత గాలింపు జరిపించినా, ఫలితం లేదు. నెల రోజుల గడువు పూర్తి అయింది. వానరులు నీటికోసం వెదకసాగారు అంతట అంగదుడు, తారుడు ఒక గుహను కనిపెట్టారు. అక్కడ నీరు దొరుకుతుందేమోనని అటువైపు వెళ్ళారు. కాని ఆ గుహ అగాధంగాను, అంధకారబంధురంగాను ఉంది. వారంతా ఒకరొకరి చేతులు పట్టుకొని ఎలాగో లోనికి ప్రవేశించారు. అలా ఎనిమిది మైళ్ళు నడువగా, ఆ గుహలో దూరంగా ఒక కాంతి కనిపించింది. మరికొంత దూరం నడవగా, వారికి స్వర్ణవృక్షాల వనం కనిపించింది. ఆ తరువాత రమణీయమైన ఉద్యానవనాలు, కొలనులు, కాంచన హర్మ్యాలు కనిపించాయి. ఈ దివ్యవనానికి మధ్యలో ఆధ్యాత్మిక తేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక తపస్విని ఈ వానరులకు కనిపించింది. హనుమంతుడు ముకుళిత హస్తాలతో ఆమెను సమీపించి, 'అమ్మా! నీవెవరో, ఈ గుహ ఎవరిదో వివరించు. ఇంత నిర్జనమైన అడవిలో, ఈ ప్రదేశం స్వర్ణశోభితంగా ఉండటానికి కారణమేమి? మాకు చాల దాహంగా ఉంది. చాలాకాలంగా నిర్జన ప్రాంతాల్లో సంచరిస్తూ వచ్చాము' అని అన్నాడు.

అప్పుడు ఆ స్త్రీ ఇలా చెప్పింది. 'నా పేరు స్వయంప్రభ. నేను పర్వతానికి పర్యవేక్షకుడైన మేరు సావర్ణి అనే దేవత యొక్క పుత్రికను. హేమ అనే అప్సరసకు చెలికత్తెను. ఈ ఆశ్రమాన్ని కాపాడుకుంటూ ఇక్కడ ఉంటాను. ఋక్షబిలం అనే పేరుగల ఈ గుహ దానవుడైన మయుని సృష్టి. మయుడు బ్రహ్మనుండి వరాన్ని పొంది తద్వారా శుక్రాచార్యునికి తెలిసిన సమస్త అద్భుత శక్తులను తాను పొందగలిగాడు. ఆ తర్వాత మయుడు ఇక్కడే నివసించసాగాడు. అయితే తరువాత కాలంలో అతను హేమ పట్ల అనురక్తి పెంచుకొన్న కారణంగా, ఇంద్రుడు తన వజ్రాయుధంతో అతన్ని ఈ ప్రాంతంనుండి తరిమివేశాడు. అంతట బ్రహ్మ ఈ గహను హేమకు ఇచ్చేశాడు. దయచేసి మీరు నిశ్చింతగా ఉండండి. ఎవరూ రాలేని ఈ ప్రాంతానికి మీరు రావడానికి కారణమేమిటో దయచేసి తెలుపండి.'

వైదిక సభ్యత ప్రకారం, ఆతిథికి ఎలా మర్యాదలు చేయాలో అలాగే స్వయంప్రభ చేసింది. స్వయంప్రభ మర్యాదలు చేస్తుండగానే, హనుమంతుడు రాముని ప్రవాసం గురించి, సీతాపహరణం గురించి, తమ అన్వేషణ గురించి అన్నింటిని వివరించాడు. అంతట హనుమంతుడు 'మీరు చేసిన అతిథి సత్కారాలకు కృతజ్ఞత చెప్పుకోవట మొక్కటే చాలదు. ఇందుకు ప్రతిగా మేము ఏదైనా చేయగలిగిన సేవ ఉంటే చెప్పు' అని అడిగాడు. అందుకు స్వయం ప్రభ 'నేను తపస్సాధనల్లో మునిగి ఉన్నందున నేను ఇతరులనుండి కోరుకునేది ఏదీ ఉండదు.' అని జవాబు చెప్పింది. అంతట హనుమంతుడు 'మ వానరులైన సుగ్రీవుడు సీత జాడలు కనుగొనుటకై మాకు నెల రోజులు గవుడు ఇచ్చాడు. ఇప్పటికే గుము ముగిసింది. కాని జాడ కనుగొనలేక పోయాము. కాన నీవు మాకేమైనా సాయం చేయగలవా?' అని ప్రశ్నించాడు.

బదులుగా స్వయంప్రభ 'ఈ గుహలోకి వచ్చినవారెవరూ సజీవంగా బయటపడరు. అయినా నా యోగశక్తితో మీకు సాయం చేయగలను. కళ్ళు తెరచుకొని చూస్తూ ఇక్కడినుండి ఎవరూ పోలేరు. కనుక మీరు కళ్ళు

మూసుకోండి.' అని చెప్పింది. ఆ తర్వాత వానరులందరూ గట్టిగా కళ్ళు మూసుకున్నారు. వారందరూ ఒక్కసారిగా గుహ బయటకు చేరవేయబడినట్లుగా తోచింది. కళ్ళు తెరచి చూస్తే, వాళ్ళందరూ గుహ బయట వున్నారు. వృక్షాలు విరబూసినట్లున్నాయి. వసంతకాలం వచ్చినట్లుంది. ఇంతకాలం ఎలా గడిచిందో అనే నిస్పృహ చెందారు.

అంతట అంగదుడు 'మనమంతా ఇప్పుడే ఇక్కడే ప్రాయోపవేశం చేద్దాం. మన నిర్లక్ష్యానికి సుగ్రీవుని చేతిలో మరణించడం కంటే ఇదే శ్రేష్ఠం.' అని సలహా ఇచ్చాడు. ఏదో కొంత సమాచారం సేకరించనిదే, కిష్కింధకు వెళ్ళడం కుదరదని అందరూ అంగీకరించారు. అంతట తారుడు ఎవరూ ప్రవేశించలేని ఈ గుహలోనే మనం ఉండిపోతే మనల్ని ఎవరూ కనిపెట్ట లేరు. కనుక ఇక్కడ ఆశ్రయం తీసికొందాం' అని అన్నాడు. ఈ ఉపాయాన్ని ఆమోదించినట్లుగా అంగదుడు మిన్నకుండిపోయాడు. హనుమంతుడు మాత్రం ఇలా అన్నాడు. 'ప్రియమైన యువరాజా! ఇతరులు చెప్పేతే వినేందుకు సుముఖత, దానిని వినగల సామర్థ్యం, దానికి వ్యతిరేకంగా వితర్కించగల సామర్థ్యం, ఇతరులు చెప్పినదాన్ని లోతుగా పరిశీలించడం మరియు యథార్థమైన వివేకం అనే బౌద్ధికమైన ఎనిమిది సద్గుణాలు నీలో ఉన్నాయని భావిస్తున్నాను. ఇదేగాక మహాపురుషుల లక్షణాలైనటువంటి దేశ, కాల విచక్షణ, దృఢత్వం, తితీక్ష, సర్వవిషయజ్ఞత, కార్యచాతుర్యం, ఉత్సాహం, రహస్యాలను కాపాడగల సమర్థత, స్థిరబుద్ధి, వీరత్వం, శత్రుబలంతో తమ బలాన్ని పోల్చుకొనే సామర్థ్యం, ఇతరుల సేవలను ప్రశంసిరచడం, శరణాగతుల పట్ల వాత్సల్యం, అధర్మాన్ని చూచినపుడు ఆగ్రహించటం, కర్తవ్య పాలనలో స్థిరత్వం అనే 14 అద్భుత లక్షణాలు నీలో వున్నాయి.' ఇలా హనుమంతుడు అంగదుణ్ణి పొగడుతుండగా, రణతంత్రాల్లో మొదటిదైన సామోపాయాన్ని ప్రయోగించాడు. వీటిపై చర్చించి, ఆ చర్చల్లో భేదపాయాన్ని వచ్చేటట్లు చేశాడు. చివరగా అంగదుణ్ణి ఇలా భయపెట్టాడు. 'ఈ గుహలోనే ఉండిపోవాలన్న నీ మూర్ఖ పథకాన్ని అమలు పరచావంటే, త్వరలోనే నీ వినాశం తప్పదు. అన్నిటికి మిగాతా వానరులు నీయందు విశ్వాసం ఉంచరు. అంతేకాదు, నీవు ఎక్కడ ఉన్నావో చివరకు లక్ష్మణుడు తెలుసుకొని, నిన్ను నీ వానరులను గుహను సర్వనాశనం చేస్తాడు. అలాకాక నీవు కిష్కింధకు తిరిగి వెళ్ళినట్లయితే సుగ్రీవుడు నిన్ను తప్పక క్షమిస్తాడు. అతనికి వేరే కుమారులు లేనందున అనంతరకాలంలో నిన్నే సింహాసనంపై ప్రతిష్ఠిస్తాడు.' అని అనగా, అంగదుడు హనుమంతుని వ్యతిరేకిస్తూ ఇలా వాదించాడు.

'నీవు సుగ్రీవుని గురించి మరీ ఎక్కువగా ఊహించుకొంటున్నావు. అతడు తన అన్నగారి భార్యను అనుభవిస్తున్నాడన్న విషయం మరచిపోతున్నావు. రాముడికి చేసిన వాగ్దానాన్ని నిర్లక్ష్యం చేసి, లక్ష్మణుడు బెదిరించిన తర్వాతనే చర్య తీసికొన్నాడు. అందుచేత ఇంటికి వెళ్ళాలనుకొనే వారంతా వెళ్ళవచ్చు. నేను మాత్రం ఇక్కడే ఉండి ప్రాయోపవేశం చేస్తాను' అని అన్నాడు. తర్వాత దర్భాసనంపై కూర్చొని విలపించాడు. అలాగే అందరూ చుట్టూ చేరారు. సరిగ్గా అదే సమయంలో జటాయువు అన్నయైన సంపాతి తన గుహలోనుండి బయటికి వచ్చి వానరులందరికి కనపడేటట్లు ఒక పర్వతాగ్రం పైకి అధిరోహించి కూర్చున్నాడు. ఆ వానరులను చూస్తూ ఆనందిస్తూ ఇంతకాలానికి నాకు కాస్త ఆహారం దొరికింది. ఈ వానరులు తిండిలేక నేలపై పడిపోగానే, నేను వీరిని భుజిస్తాను. అంటూ బిగ్గరగా అనుకొన్నాడు. ఈ మాటలు విన్న అంగదుడు ఆందోళన చెందాడు. హనుమంతుణ్ణి ఉద్దేశించి 'మనకు ఎంత దుర్గతి పట్టుకొన్నది. ఇదంతా కైకేయి పనే. ఆమె మొదట మహాత్ముడైన జటాయువు నాశనానికి, తర్వాత నా వినాశనానికి కారణమైంది. ఇప్పుడు మన మరణాలకూ ఆమెయే కారణమైంది' అని అన్నాడు.

జటాయువు మరణం సంగతి సంపాతి వినటం అదే మొదటిసారి కావడంతో 'జటాయువు మరణం గురించి చెప్పండి. అతని మరణానికి వ్యథ చెందుతున్నా కూడా, మీరు అతనిని కీర్తిస్తున్నారు కనుక వివరాలు చెప్పండి. ఓ వానరోత్తమా! నాకు ఒక మేలు చేయాలి. చాలకాలం క్రితం నా రెక్కలు సూర్యకిరణాల వల్ల మాడిపోయాయి. ఇపుడు నేను ఎగరలేను. దయచేసి నన్ను ఈ పర్వతాగ్రం నుండి దించి పుణ్యం కట్టుకొంటావా?' అని ప్రార్థించాడు. కొద్ది క్షణాల క్రితమే సంపాతి తమను భక్షిస్తాను అనుకోవడంతో, వానరులు అతనిని విశ్వసించలేక పోయారు. 'కాని మనం ఎలాగూ ప్రాయోపవేశం చేయబోతున్నాం. మనలను ఈ రాబందుల రాజు భక్షించినా పోయేదేమీ లేదు. మన బాధలు త్వరగా అంతరించి పోతాయి.' అని వారు తర్కించుకొన్నారు.

వానరులు వెళ్ళి సంపాతిని పర్వతాగ్రం నుండి క్రిందికి దించారు. అంగదుడు రాముని ప్రవాసం గురించి, జటాయువు వీరోచిత మృత్యువును గురించి వివరాలు అందించాడు. అది వినిన సంపాతి తన స్వీయకథను ఇలా వివరించాడు.

'చాలాకాలం క్రితం జటాయువు నేను స్వరాగధిపతిని సవాలు చేసి, మా పరాక్రమాన్ని పరీక్షించుకొందాం అనుకొన్నాం. మేము ఆకాశంలో స్వర్గలోకం వరకు ఎగసి, దేవేంద్రుణ్ణి యుద్ధంలో ఓడించాం. ఆ గర్వంతో మేము ఇంకా ఇంకా పైకగరాలని నిశ్చయించాం. ఆ తర్వాత సూర్యుని వేడిమికి జటాయువు వడలిపోసాగాడు. జటాయువును రక్షించడానికై నేను నా రెక్కలతో అతన్ని సమాచ్ఛాదనం చేశాను. దీనివలన నా రెక్కలు దగ్ధమై, నేను వింధ్యపర్వతాలపై పడిపోయాను.' అని చెప్తుండగా, అంగదుడు మధ్యలో జోక్యం చేసుకొని 'నీవు నిజంగా జటాయువుకు అన్నవు, మాకు శ్రేయోభిలాషివి అయితే మాకు రావణుని నివాసం గురించిన సమాచారం ఇవ్వు' అని అన్నాడు. అపుడు సంపాతి ఇలా అన్నాడు. 'నేను ముసలివాణ్ణి, రెక్కలు తెగినవాడిని కనుక శ్రీరామునికి సేవ చేయలేకుండా ఉన్నాను. అయితే నా వచోశక్తితో సేవ చేయగలను. రావణుడు ఎవరో యువతిని ఎత్తుకు పోయాడని, ఆ స్త్రీ రామా రామా అంటూ రోదిస్తూ, తన ఆభరణాలను నేలపైకి జారవిడిచిందని విన్నాను. ఆ రావణుడు రాక్షస రాజు. అతని రాజ్యం లంక. దక్షిణ తీరానికి నూరు యోజనాల దూరంలోని ఒక ద్వీపంలో నెలకొని వుందని నాకు తెలుసు. నేను వినతా వంశీకుడనైనందున, నా దృష్టి సామర్థ్యం నూరు యోజనాలకు పైగా విస్తరించి ఉంది. అందుచేతనే నేను ఆ స్వర్ణమయ నగరాన్ని చూడగలుగుతున్నాను. ప్రియమైన వానరులారా! లంకలో రాక్షస స్త్రీ సేవలలో ఉన్న సీతను మీరు కనుగొనగలరు. ఇప్పుడు దయచేసి నాకొక మేలు చేయండి. నన్ను సముద్రం దగ్గరకు తీసికొని వెళ్ళితే, చనిపోయిన నా సోదరుని కోసం జలతర్పణం చేస్తాను.

సీతను గురించిన విషయాలు విని వానరులు ఆనందించారు. సంపాతిని సముద్రతీరాన దించి వెంటనే వచ్చారు. అంతట జాంబవంతుడు 'సీతను రావణుడు అపహరించాడనే విషయం నీకెలా తెలిసింది?' అని ప్రశ్నించాడు. అపుడు సంపాతి 'నా రెక్కలు తెగి వింధ్య గిరులపై డిన తర్వాత నా కుమారుడైన సుపార్శ్వుడు, నాకు ఆహారం తెచ్చిపెట్ట సాగాడు. నా రక్షణ భారం వహించాడు. ఒకరోజు నాకు బాగా ఆకలిగా వున్నా కాని నా కుమారుడు నాకు ఆహారం తీసికొని రాలేదు. నేను మందలించగా, అతడు బదులు చెపుతూ 'ఒకరోజు నేను మాంసం కొరకు అన్వేషిస్తుండగా, ఒక రాక్షసుడు ఒక స్త్రీని ఆకాశమార్గాన ఎత్తుకొని పోతూవుండటం నేను చూచాను. నీ తిండికోసం వారిద్దరిని పట్టి తీసికొని వద్దామనుకన్నాను. కాని ఆ రాక్షసుడు తనను పోనిమ్మని బ్రతిమాలుతూ అడిగాడు. నేను కాదనలేక పోయాను. ఆ తరువాత అటుగా వచ్చిన సిద్ధులు, అతడు రావణుడని,

తనను చంపకపోవటం తన అదృష్టమని వారు నాతో చెప్పారు. దానితో వానరులకు తనపై స్నేహభావమే ఉందని గ్రహించ గలిగాడు. తన జీవిత గాథను కొనసాగిస్తూ, 'వింధ్యాచలంపై పడిన తర్వాత 6 రోజులు నాకు స్పృహ లేదు. నాకు స్పృహ వచ్చిన మీదట నాకును, నా సోదరునికి పరిచితులైన సమీపంలో ఉంటున్న నివాకర మహర్షిని దర్శించటానికి వెళ్ళాను. నా యావత్ వృత్తాంతాన్ని ఆ మహర్షికి చెప్పాను. నా సోదరుని సహాయం అందనందున, ఆ పర్వతాగ్రం నుండి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను అని కూడ చెప్పాను. అలా చెప్తూ దుఃఖిస్తున్న నన్ను చూచి, ఆ మహర్షి 'నీవు నిస్పృహ చెందవద్దు. రానున్న కాలంలో నీవు సీతజాడను వానరులకు తెలియజేసినపుడు, నీకు మరల శక్తిసామర్థ్యాలు రావటంతో పాటు నీకు రెక్కలు తిరిగి మొలుస్తాయనే వరాన్ని నేను నీకు ఇప్పుడు అనుగ్రహిస్తున్నాను.' అని అన్నాడు. ఈ మాట చెప్పి, మహర్షి తన కుటీరానికి వెళ్ళగా, నేను కూడ నెమ్మదిగా వింధ్యాచలంలోని నా స్థలానికి చేరాను. అప్పటినుండి మీ రాకకోసమే వేచి ఉన్నాను. 8000 సం॥లు గడచిన తర్వాత నిశాకర ఋషి తన దేహాన్ని వదలి స్వర్గానికి వెళ్ళాడు. ఆయన మాటలోని సత్యాన్ని నేను అనుమానించ సాగాను.' సంపాతి వానరులతో ఇలా మాట్లాడుతుండగానే, అతని దేహంలోనుండి రెక్కలు మొలిచాయి. నూతన శక్తి ఉత్పన్నమవుతున్న అనుభూతి కలిగిది. ఆనందభరితుడైన సంపాతి సీతాన్వేషణ ప్రారంబించమని వానరులను ఆదేశించాడు. సంపాతి ఆకాశంలోకి ఉవ్వెత్తున దూసుకు పోగా, వానరులు నూతనోత్సాహంతో దక్షిణ దిశగా పురోగమించారు.

వానరులు సముద్ర తీరానికి చేరి, తాము దానిని దాటి లంకకు చేరే శక్తి తమకు లేదని నిస్పృహ చెందారు. కాని అంగదుడు మాత్రం – 'నిర్వేదం వల్ల కార్యసిద్ధి జరగదు. రావణుని చెరనుండి సీతను విడిపించ గలగటానికి 100 యోజనాలు లంఘించగలవారు ఎవరైనా ఉంటే దయచేసి ముందుకు వస్తే, సుగ్రీవుని కోపం నుండి బయటపడతాం' అంటూ తన పిలుపుకు ఎవరూ జవాబు ఇవ్వనందున అంగదుడు వ్యక్తిగతంగా ఎంతెంత దూరం లంఘించగలరో చెప్పమన్నాడు. వారందరూ రకరకాలుగా చెప్పారు. మైందుడు 60 యోజనాలు, దివిదుడు 70 యోజనాలు, సుషేణుడు 80 యోజనాలు లంఘించగలమని ప్రకటించారు. జాంబవంతుడు వయోవృద్ధుడు కావడంతో, తాను 90 యోజనాలు మాత్రమే దుముక గలనని చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు. 'పూర్వం వామనుడు విశ్వాన్ని అచ్ఛాదనం చేసిన సమయంలో, ఆయన మూడడుగులు వేస్తుండగా, నేను ఆయనకు ప్రదక్షిణం చేశాను. కాని ఇపుడు దురదృష్టవశాత్తు నాకు లంకకు లంఘించగల శక్తి లేదు' అని వివరించాడు.

చివరగా, అంగదుడు 'నేను 100 యోజనాలు లంఘించగలనేమో గాని, తిరుగు ప్రయాణంలో మళ్ళీ రెండోసారి అంతదూరం దుముకగలననునది అనుమానమే' అని అన్నాడు. అందుకు జాంబవతుడు బదులు చెపుతూ 'నీకున్న శక్తితో1000 యోజనాలు లంఘించగలవని గట్టిగా చెప్పగలను. కాని నీవే నాయకుడవు కనుక ఈ సాహసయాత్రకు నీవు స్వయంగా దిగటం సరైనది కాదు. కనుక వేరే ఎవరికైనా ఈ పని అప్పగించాలి.' అని అన్నాడు. అందుకు అంగదుడు 'నేను గాని మరెవరైనా గాని వెళ్ళకపోతే, మనకు ప్రాయోపవేశమే గత్యంతర మవుతుంది. అదే సమస్య. సుగ్రీవుని ఆగ్రహం నుండి ఏదో ఉపాయంతో మనలను మనం రక్షించుకోవాలి' అని జవాబు ఇచ్చాడు. అంతట జాంబవంతుడు ఇలా అన్నాడు. 'ఏమీ ఆందోళన వద్దు. ఈ క్లిష్ట కార్యాల్ని నెరవేర్చగల శక్తి వున్న ఏకైక వ్యక్తికి నేను ఇప్పుడే విజ్ఞప్తి చేస్తున్నాను. ఓ హనుమా! నీవు విష్ణువాహనుడైన గరుడునితో సముడవు. నీవేమీ మాట్లాడలేదే? నేనిప్పుడు వానరులందరిలోనూ మహిమాన్వితుడైన వానిని వర్ణిస్తాను. దయచేసి వినండి. ఒకప్పుడు, అపస్సరసల్లో అగ్రగణ్యయైన పుంజికస్థలి ఒక ఋషి శాపానికి గురై కుంజరుడనే వానర

రాజుకు పుత్రికగా అంజన అనే పేరుతో జన్మించింది. ఆమె పెరిగి గొప్ప సౌందర్యవతి అయింది. ఆమె కామరూపిణి కూడాను. ఆమె వానర ముఖ్యుడైన కేసరిని వివాహమాడిన తర్వాత ఒకసారి అంజన మానవరూపాన్ని దాల్చి పర్వతాలలోసంచరించ సాగింది. సుందరియైన అంజనను చూచిన వాయుదేవుడు మోహితుడై మారుతం చేత ఆమె వస్త్రాన్ని తొలగించాడు. అంజన ఊరువులను, ఇతరములైన సొగసులను చూచిన వాయుదేవుడు మైథున వాంఛావిచలితుడై ఆమెను బలాత్కారంగా ఆలింగనం చేసుకొన్నాడు. ఆమె 'ఒక పతిని మాత్రమే అంగీకరించే నా వ్రతాన్ని భంగం చేస్తున్నదెవరు?' అని బిగ్గరగా అరిచింది. 'నేను వాయుదేవుణ్ణి. నేను నీలో మానసికంగా ప్రవేశించాను. భౌతికంగా నీ పాతివ్రత్యానికి ఏమీ భంగం కలిగించ లేదు. నా కృపవల్ల నీవు నాతో సముడైన శక్తివంతుడైన పుత్రునికి జన్మనిస్తావు'అని వాయుదేవుడు సమాధానం ఇచ్చాడు. వాయుదేవుని మాటలకు అంజన సంతోషించింది. ఆ తర్వాత కొంతకాలానికి ఒక పర్వత గుహలో హనుమంతనికి జన్మనిచ్చింది. మరునాటి ఉదయమే శిశువుగా వున్న హనుమంతుడు ఉదయించే సూర్యుణ్ణి చూచి మెరిసే ఫలంగా భ్రమించాడు. దానిని పట్టుకోవాలని ఆకాశంలోకి 3000 యోజనాలు పైకి ఎగసాడు. కాని సూర్యుని తేజస్సుతో భూమిపైకి విసిరి వేయబడ్డాడు. మళ్ళీ ఎగిరాడు. కాని ఈసారి ఈ వానర సాహసాన్ని చూచి ఇంద్రుడు కోపించి తన వజ్రాయుధాన్ని విసిరాడు. ఆ ఆయుధం హనుమంతుణ్ణి ఒక పర్వత ప్రాంతంలోనికి విసిరి కొట్టగా, అతని చుబుక వామపార్శ్వం చిట్లింది. నిజానికి ఈ సంఘటన వల్లనే హనుమంతునికి ఆ పేరు వచ్చింది. హనుమంతుడు అంటే 'హనువు భంగమైనవాడు' అని అర్థం.

తన కుమారునిపై ఇంద్రుని దాడిని చూచిన వాయువు కోపంతో ముల్లోకాల్లో వాయువును స్తంభింప చేయసాగాడు. దానితో దేవతలు ఆందోళన చెందారు. బ్రహ్మదేవుణ్ణి తీసికొని, వారు వాయుదేవుని వద్దకు వెళ్ళారు. వాయుదేవునికి తృప్తి కలిగించటానికి బ్రహ్మదేవుడు హనుమంతుణ్ణి యుద్ధంలో అజేయునిగా నిలిచేలా వరమిచ్చాడు. తన వజ్రాయుధం వానర శిశువును వధించక పోవడం చూచి, దేవేంద్రుడు ఆశ్చర్య ఆనందాలు పొందాడు. అందుచేతనే హనుమంతునికి ఇచ్ఛామరణ వరాన్ని ప్రసాదించాడు.'

చివరకు జాంబవంతుడు ఇలా ముగించాడు. 'హనుమంతుడు ఒక్కడే మన కార్యాన్ని చేయగలడు. పూర్వం నాకొక లెక్కలోనిది కాదు. బలిచక్రవర్తి రాజ్యాన్ని కాజేయటానికి త్రివిక్రముడు తన మూడడుగులు విస్తరించినపుడు నేను అంతరిక్షంలోకి ఎగిరి ఆయనకు 21 సార్లు ప్రదక్షిణం చేశాను. క్షీరసముద్రంలోని మూలికన్నీ సేకరించింది నేను ఒక్కణ్ణే. ఇప్పుడు హనుమంతుడు తన పరాక్రమాన్ని ప్రదర్శించవలసిన సమయం వచ్చింది.' ఆ మాటలు వినిన హనుమంతుని ఆనందానికి అవధులు లేవు. అక్కడి వారికందరికి సంతోషాన్ని కలిగిస్తూ, హనుమంతుడు మహాకాయాన్ని ధరించి, అమితంగా విస్తరించ సాగాడు. స్వీయ మహిమాతిశయాన్ని ఇలా హనుమంతుడు వర్ణించసాగాడు. 'నేను తలచుకుంటే మేరు పర్వతాన్ని 1000 సార్లు చుట్టి రాగలను. సముద్ర జలాల్ని ఎగరగొట్టి ప్రపంచాన్ని జలమగ్నం చేయగలను. గరుడుడు ఆకాశంలోఎగురుతుంటే, నేను 1000 సార్లు ప్రదక్షిణం చేయగలను. లంకానగరాన్ని పెకలించి ఎంతదూరమైనా తీసుకుపోగలను.' ఈ విషయాలను విన్న వానరులందరూ ఉత్తేజితులైనారు. పరిస్థితి తీవ్రతను గుర్తు చేయటానికి వారందరు 'నీవు తిరిగి వచ్చేవరకు మేము ఇక్కడే ఒంటికాలిపై నిలిచి ఉంటాం. మా ప్రాణాలు, సీత ఆగమనం అన్నీ నీమీదనే ఆధారపడి ఉన్నాయి.' అని అన్నాడు. హనుమంతుడు 'నేను దూకటానికి ఈ భూమిపై ప్రయోగించే ఒత్తిడిని తట్టుకోగల శక్తి మహేంద్ర పర్వతానికే ఉంది. కనుక నేను మహేంద్ర పర్వత శిఖరం మీదనుండే లంఘిస్తాను.' అని వానరులకు చెప్పి, తక్షణమే బృహత్తర లంఘనకు మహేంద్ర గిరికి చేరుకొన్నాడు.

**-: కిష్కింధకాండ సమాప్తం :-**

ఓం

# శ్రీరామ కథామృతం - సుందరకాండ

ధర్మనిరతుడైన హనుమంతుడు మహేంద్ర పర్వత పాదం వద్ద నిలబడి మొదట సూర్యునికి, ఇంద్రునికి, వాయుదేవునికి, బ్రహ్మదేవునికి అంజలి ఘటించాడు. తరువాత పర్వత శిఖరాన్ని ఎక్కి తన దేహాన్ని అపరిమితమైన స్థాయికి పెంచాడు. హనుమంతుడు కొంచెం సేపు ఆలోచించి, మహాలంఘనకు తన మనస్సును స్థిరపరచుకొన్నాడు. ఆ మహాకాయ ప్రభావానికి ఆ పర్వతం కంపించ సాగింది. మహాసర్పాలు తమ నోళ్ళ వెంట నిప్పులు కక్కుతూ శిలలలోనికి తమ కోరలను పంపగా అవి వేనవేల విస్ఫులింగాలను విరజిమ్మాయి. హనుమంతుని మహాద్భుత లంఘనాన్ని చూచుటకై విద్యాధరులు ఆకాశంలో బారులుదీరారు.

హనుమంతుడు తన శక్తినంతటిని కూడదీసుకొని పాదాలను క్రిందికి అదిమాడు. పర్వత శిఖరం ముక్కలు కాసాగింది. ఒత్తిడికి జలధారలు పెల్లుబికాయి. ఆ దివ్యశిఖర ప్రాంతంలో రమిస్తున్న గంధర్వుల జంటలు, అనేక మంది ఋషులు భయపడి పారిపోసాగారు. అంతట హనుమంతుడు వానరులతో 'నేను లంకనుండి సీతను తీసికొని రావడమో, లేక రావణునితో సహా లంకానగరాన్ని సర్వనాశనం చేయడమో చేస్తాను' అని పలికాడు.

హనుమంతుడు శ్వాసను లోనికి పీల్చుకొని కండరాలను బిగించాడు. రాముని బాణం లాగ, ఒక్క ఉదటున హనుమంతుడు గాలిలోనికి లేచాడు. హనుమంతుని లంఘన శక్తి ప్రభావంతో మహేంద్ర పర్వత శిఖరం పైనున్న వృక్షాలన్నీ నేలకూలాయి. హనుమంతుడు ఒక పెద్ద మేఘం వలె దూసుకుపోయి తన తోకను ఝుళిపించాడు. ఆయన వెంట ప్రయాణించిన వృక్షాలు సైతం సముద్రంలో పడిపోయాయి. హనుమంతుని గగనయానం చేత ఉత్పన్నమైన పెనుతుఫాను సాగరాన్ని అల్లకల్లోలం చేయగా, ఎగసిన తరంగాలు ఆయన వక్షస్తలాన్ని ఢీకొన్నాయి. సముద్రజలం మీద హనుమంతుని నీడ 240 మైళ్ళ పొడవునా, 80 మైళ్ళ వెడల్పున ఆక్రమించింది. మేఘాలన్నీ ఆయనవైపు మళ్ళాయి. మేఘాల మాటున ప్రయాణిస్తున్న హనుమంతుడు చంద్రుని మాదిరిగా కనిపిస్తున్నాడు. వాయుదేవుడు తన పుత్ర వాత్సల్యం చేత చల్లని గాలుల ప్రసరింపచేస్తూ, సూర్యకిరణ తాపం ఆయనకు తాకకుండా జాగ్రత్త తీసికొన్నాడు. ఆకాశంలో పయనిస్తున్న హనుమంతుని చూచి సకల జీవరాసులు ఆయనను వేనోళ్ళ పొగిడాయి. రాముని పట్ల గల గౌరవభావంతో సముద్రుడు కూడ ఆయనకు బాసటగా నిలవదలచాడు. శ్రీరాముడు ఇక్ష్వాకు వంశీయుడు కావడం చేతను, పూర్వీకుడైన సగర మహారాజు కీర్తి సముద్రపు సరిహద్దుల వరకు విస్తరించినందువల్లను, ఆయనకు సాయం చేయటం తన ధర్మంగా, కర్తవ్యంగా కూడ సముద్రుడు భావించాడు.

పూర్వం రసాతలాది అధోలోకాలనుండి రాక్షసులు భూమికి ప్రయాణించే రాక్షసులను నిరోధించటానికి ఇంద్రుడు మైనాక పర్వతాన్ని సముద్ర మధ్యంలో నిలిపాడు. ఇపుడు హనుమంతునికి విశ్రాంతి స్థలాన్ని ఏర్పాటు చేయడానికై మైనాకుణ్ణి నీటిపైకి రావలసిందిగా సముద్రుడు ఆదేశించాడు. అయితే ఆ మహాపర్వత శిఖరం సముద్రంలోనుండి ఆవిర్భవించుట చూచిన హనుమంతుడు, దాన్ని అడ్డంకిగా భావించి, తన వక్షస్థలంతో క్రిందికి కుమ్మాడు. హనుమంతుని పరాక్రమాన్ని చూచిన మైనాకుడు హనుమంతుని అభినందిస్తూ, మానవ రూపంలో శిఖరాగ్రం పైనుండి 'ఓ వాయునందనా! నా శిఖరంపై కొంచెంసేపు విశ్రమించి తరువాత నీ ప్రయాణం కొనసాగించవచ్చు. నీకు ఈ సహాయం అందించటం ద్వారా, నీ తండ్రిని ఆరాధించగోరుతున్నాను. దయచేసి నా

సేవను అంగీకరించు. సత్యయుగంలో పర్వతాలన్నింటికి రెక్కలుండేవి. మేమంతా గరుత్మంఉని వలె ఆకాశంలో ఎగురుతూ వుండేవాళ్ళం. కాని మేము భూమిపై పడి, విధ్వంసానికి కారణమౌతున్నామని దేవతలు, ఋషులు భయపడ్డారు. తుదకు ఇంద్రుడు కోపంతో వజ్రాయుధంతో వేలాది పర్వతాల రెక్కలను ఖండించి వేశాడు. అలాగే ఇంద్రుడు నా మీద కూడ దాడిచేశాడు. అయితే నీ తండ్రి వాయుదేవుడు నన్ను తన బలంతో సముద్రంలోకి త్రోసివేసి నన్ను రక్షించాడు. ఆ విధంగా నా రెక్కలు నిలిచాయి. కనుక నీ తండ్రి నాకు చేసిన మేలుకు ప్రత్యుపకారం చేయదలచి, నీవు కొద్దిసేపు ఆగి నా ఆతిథ్యాన్ని స్వీకరించి పోవలసిందిగా ప్రార్థిస్తున్నాను.'అని అన్నాడు. దానికి సమాధానంగా హనుమంతుడు 'నేను ఆగటానికి సాహసించలేను. కనుక దయచేసి క్షమించు. నా ప్రయాణంల ఎక్కడా ఆపనని నా వానరులకు మాట యిచ్చాను. నాకు సమయం చాల తక్కువగా ఉంది.' అని చెప్పాడు.

హనుమంతుడు మైనాక పర్వతాన్ని స్పృశిస్తూ తన గగనయానాన్ని కొనసాగించాడు. ఇంద్రుడు సంతసించి ముందుకు వచ్చి మైనాకునితో 'నా వజ్రాయుధం గురించి నీవు ఇక భయపడవలసిన అవసరం లేదు. నీ రెక్కలు అలాగే ఉంచుకొని, నీ ఇష్టానుసారం విహరించవచ్చు' అని అన్నాడు.

ఈలోగా దేవతలు, దేవర్షులు, గంధర్వులు, నాగమాత యైన సురసను సమీపించి, 'హనుమంతుని యదార్థ శక్తి ఎంతటిదో మేము లెక్కవేయదలచాం. అందుచేత నీవు ఒక పెద్ద రాక్షస రూపాన్ని ధించి, అతనిని ఆటంక పరచటానికి ప్రయత్నం చేయి' అనగా ఆమె ఒక పెద్ద రాక్షస రూపం ధరించి, హనుమంతుని అడ్డగించ బోయింది. కాని హనుమంతుడు 'నిన్ను జయించటమో, నిస్పృహ పరచటమో జరుగుతుంది. నా దారికి అడ్డురావద్దు' అని సురసను అభ్యర్థించాడు.

తక్షణమే సురస పర్వతమంత పెద్ద వికృత రూపాన్ని ధరించి, సముద్ర మధ్యంలో నిలిచి, హనుమంతుని అటూయిటూ పోనీక ఆటంకపరచ సాగింది. సురస ఇలా అన్నది. 'బ్రహ్మదేవుని వరం ప్రకారం నాకు ఎదురైన ఆహారాన్ని నేను భుజించవచ్చునని విధి నిర్ణయం. ఓ వానరోత్తమా! నీవు దైవ సంకల్పానుసారం నా దారిలో తగిలావు. ఇక నీవు నా తెరచి వున్న నోటిలోనికి ప్రవేశించగోరి ఆహ్వానిస్తున్నాను.' అని తన నోటిని విస్తారంగా తెరవసాగింది. అందుకు హనుమంతుడు జవాబు చెప్తూ 'అపహరణకు గురైన శ్రీరామపత్ని సీత జాడ కనుగొని శ్రీరాముని సేవచేయాలనే నాకు నీవు సాయం చేయాలి. కనుక నీవు నన్ను స్వాహా చేయాలనే పట్టుదలతో ఉంటే, నేను సీత జాడ కనిపెట్టి రామునికి నివేదించిన తరువాత నేను ఇక్కడికి వచ్చి నీ నోట్లో ప్రవేశిస్తాను.' అని అన్నాడు.

అపుడు సురస 'ఓరీ మూర్ఖుడా! బ్రహ్మదేవుని వరం కారణంగా నీవు ఇప్పుడే నా నోట్లోకి వచ్చిపడతావు' అని అంటూ హనుమంతుని మార్గాన్ని ఆటంకపరచడానాకి పది యోజనాల వరకు తన నోటిని తెరిచింది. అంతట హనుమంతుడు తన దేహాన్ని పది యోజనాల మేరకు విస్తరించి, 'నేను నీ నోటిలో ప్రవేశించాలంటే, నీవు నీ నోటిని మరింత పెద్దగా తెరవాలి' అని సవాలు విసిరాడు. సురస ఆ మాటతో తన నోటిని 20 యోజనాల మేరకు విస్తరించగా, కుపితుడైన హనుమంతుడు కూడా తన దేహాన్ని 30 యోజనాలకు విస్తరించాడు. అందుకు బదులుగా సురస తన నోటిని 40 యోజనాలకు పెంచింది. హనుమంతుడు 70కి పెంచాడు. ఆమె 80కి పెంచింది. హనుమంతుడు 90కి పెంచాడు. దానిని ఎదుర్కొనటానికి సురస తన నోటిని వంద యోజనాల

వెడల్పుకు పెంచింది. కాని హనుమంతుడు తన దేహాన్ని మరింత పెంచి, తన శక్తిని వృథా చేసుకోదలచనందున, రెప్పపాటులో హనుమంతుడు అంగుష్ఠ మాత్రానికి తన శరీర పరిమాణాన్ని కుదించి, ఆమె నోటిలోనికి వెళ్ళి బయటకు వచ్చి 'ఓ దక్షపుత్రీ! నీవు పొందిన వరంలోని షరతు నెరవేరింది కదా! ఇక నా ప్రయాణం సాగిస్తాను.' అని అన్నాడు. హనుమంతుని చతుర విజయానికి సురస సంతోషించింది. తన నిజరూపంలో ప్రత్యక్షమై సురస 'శభాష్! వానరోత్తమా! ఇక నీవు వెళ్ళి నీ కార్యాన్ని సాధించుకో. కొద్దికాలంలోనే నీవు సీతను రాముని కలిపెదవు గాక!' అని ఆశీర్వదించింది.

అంతట హనుమంతుడు ఆకాశంలో సాగిపోతున్నాడు. అనుకోని రీతిలో, సింహిక అనే రాక్షసి అతని నీడను ఒడిసి పట్టుకొంది. దానితో హనుమంతుడు తన శక్తి తగ్గుతుందేమోనని భయపడ్డాడు. కాని అటూయిటూ చూస్తుండగా, ఒక పెను రక్కసి సముద్రం నుండి పైకి వస్తూ కనిపించింది. సింహిక హనుమంతుని వైపు దూసుకువస్తూ అతనిని మ్రింగాలని తన నోటిని బార్లా తెరవగా, హనుమంతుడు తన శరీరాన్ని విస్తరించసాగాడు. తెలివిగలవాడు గనుక హనుమంతుడు తనవైపు దూసుకువస్తునన రాక్షసి నోరు తనను మ్రింగివేయ గలిగినంత పెద్దదని గ్రహించాడు. సూక్ష్మపరిమాణానికి కుంచించుకు పోయి, రాక్షసి నోటిలోనికి ప్రవేశించి, దాని దేహంలోనికి ప్రవేశించాడు. హనుమంతుడు తన వాడి నఖాలతో ఆ రాక్షసి హృదయాన్ని ముక్కలుగా చీల్చివేయటం ప్రారంభించాడు. అంతట బయటికి వచ్చి తన దేహాన్ని మరింతగా విస్తరించాడు. దానితో సింహిక నీటిలో చచ్చిపడగా సిద్ధులు, చారణులు, విద్యాధరులు హనుమంతుని విజయాన్ని కీర్తిస్తూ అతనిపై పుష్పవర్షం కురిపించారు.

తరువాత కొద్దిసేపటికి, సుదూరాన లంకా తీరంలోని ప్రాంతాలు, అరణ్యాలు కనిపించ సాగాయి. రాక్షసులు తనను గుర్తిస్తారేమోనని, హనుమంతుడు తన సాధారణ పరిమాణాన్ని పొంది, లంకాద్వీపంలోని ప్రధాన పర్వతమైన త్రికూటం యొక్క ఒక శృంగంపై దిగాడు. ఇలా వంద యోజనాలు లంఘించినా, హనుమంతుడు అలసట చెందలేదు. హనుమంతుడు తన దృష్టిని పైకి సారించగా, త్రికూటం పర్వతాగ్రాన నిలిచి ఉన్న అద్భుతమైన లంకా నగరాన్ని చూచాడు. ఆ నగరం స్వర్ణమయ ప్రాకారాలతో, అసంఖ్యాక మహోగ్ర రాక్షసుల చేత పరిరక్షించ బడి వుంది.

హనుమంతుడు లంకానగరపు ఉత్తర ద్వారాన్ని సమీపించి, శ్వేత హర్మ్యాలను, స్వర్ణమయ స్వాగత ద్వారాలతో అలంకృతమై ఉన్న విశాల వీథులను చూచాడు. భయంకర రాక్షస సమూహాలు ప్రతిచోటా గుమిగూడి వున్నారు. వారు కామరూపులు, అన్ని విధాల ఆయుధాలను ధరించి ఉన్నారు.

హనుమంతుడు అపుడు తనలో తాను ఇలా అనుకొన్నాడు. 'ఈ నగరం దేవతలకు సైతం దుర్భేద్యంగా కనిపిస్తోంది. ఈ రాక్షస సేన గురించి ఏం చెప్పాలి? నేను, సుగ్రీవుడు, అంగదుడు, నీలుడు మాత్రమే సముద్రాన్ని దాటి రాగలిగి వుండగా, ఇక రాముడు ఈ రాక్షసులను ఎలా నిర్జించగలడు? సీత ఇంకా జీవించి ఉన్నదా లేదా అనే విషయాన్ని కనిపెట్టుట నా ప్రథమ కర్తవ్యం. నేను ఆమెను ఎలా కలుసుకో గలగాలి అనే విషయం ఆలోచించాలి. పహరా కాచేవారు జాగరూకులుగా ఉంటారు. అందుచేత నేను నా సహజరూపంలో నగరంలోనికి ప్రవేశించ లేను. కనుక తేలికగా ఇతరుల దృష్టిలో పడని మారురూపాన్ని దాల్చి రాత్రివేళ నగరంలో ప్రవేశించాలి' అని నిశ్చయించుకొన్నాడు.

చీకటి పడగానే, హనుమంతుడు ఒక మార్జాల పరిమాణానికి మారి ఉన్నత ప్రాకారాన్ని లంఘించి లంకా నగరంలో ప్రవేశించాడు. రత్నమాణిక్యాలతో విభూషితమైన వాడు, ఎనిమిది అంతస్తుల మేడలో ఊహాతీతంగా ఉండటాన్ని గమనించాడు. నగరం మొత్తం మహాద్భుతమైన భవంతులతో నిండి ఉంది. ఆ భవనాల్లో అందమైన యువతులు ఉన్నారు. వారి పాటలు, ఆటలు వినిపిస్తున్నారు. నగరమంతా రాక్షస బ్రాహ్మణులు రావణుని క్షేమాన్ని కాంక్షిస్తూ వేదమంత్రాలను ఉచ్చరిస్తున్నారు. అంతట చంద్రుని కాంతి హనుమంతునికి సాయపడింది. ఆ సమయంలో లంక ఒక వికృత రాక్షస రూపం ధరించి హనుమంతుని ఎదుటకు వచ్చి 'ఎవరికంట పడకుండా నీవు ఎలా ఈ నగర ప్రవేశం చేశావు? రాక్షస రాజ్యంలో వానరునికి ఏమి పని?' అంటూ నిలదీసినట్లనిపించింది. 'ముందు నీవెవరో చెప్పు. తరువాత నీ ప్రశ్నకు సమాధానం చెప్తాను' అని అన్నాడు హనుమంతుడు. 'నేను లంకకు అధిష్ఠాన దేవతను. రావణుని తరపున నేను ఈ నగరాన్ని పరిరక్షిస్తుంటాను. నీవు అనుమతి లేకుండా చొరబడ్డావు. ఇవాళ నా చేతిలో నీకు చావు తప్పదు.' అని రాక్షసి మహాకోపంతో బదులు పలికింది. 'నేను ఊరికే ఈ నగరం చూద్దామని వచ్చాను. ఇంద్రుని మహాద్భుతాలను చూడాలనుకొంటున్నాను' అని హనుమంతుడు చెప్పాడు.

'రాక్షసులు మాత్రమే నివసించే నగరం ఇది. కోతులు వచ్చి వీధుల్లో తిరగటానికి కుదరదు. నీవు లంకా వైభవాన్ని చూడాలని ఉంటే, ముందు నన్ను చంపాలి' అని లంక నిర్లక్ష్యంగా అన్నది. అందుకు హనుమంతుడు 'సరే నేను నా ఇష్టం వచ్చినట్లు నగరాన్ని చూచి, వచ్చిన త్రోవనే వెళ్ళిపోతాను.' అని చెప్పాడు. అందుకు కోపించిన లంక 'వీల్లేదు' అంటూ తన ఎడమ అరచేతితో హనుమంతుని చరిచింది. హనుమంతుడు ఆగ్రహంతో గర్జించి, లంక స్త్రీ అయినందుచేత, హింసాత్మకంగా కాకుండా తన ఎడమ పిడికిలితో లంకను గ్రుద్దాడు. లంక నేలకొరికి, బాధతో 'నిజమైన వీరుడు స్త్రీలను ఎన్నడూ కొట్టడు. కనుక దయచేసి నన్ను వదలివేయి. ఒకప్పుడు బ్రహ్మ నాతో 'ఒక వానరం నిన్ను లొంగదీసుకోవచ్చును. కొద్ది రోజుల్లోనే, నీ నగరానికి, రాక్షస రాజ్యానికి వినాశం తప్పదు' అని చెప్పాడు. అందుచే నేను ఓటమిని అంగీకరిస్తున్నాను. ఎందుకంటే రావణుని మరణం దగ్గర పడిందని నేను అర్థం చేసుకొన్నాను. ఓ వానరా! నీకు లంకా ప్రవేశానికి అనుమతి ఇస్తున్నాను' అని అన్నది. హనుమంతుడు తక్షణమే ఒక సౌధాగ్రం నుండి మరొక దాని మీదికి దూకుతూ నగరమంతా సంచరించాడు మారువేషాల్లో ఉన్న చాలమంది గూఢచారులను గుర్తించాడు. బలీయుడై, స్వర్ణమయ ప్రకారాలలో పరివేష్టించబడిన రావణుని ప్రసాదాన్ని సంరక్షిస్తున్న లక్ష మంది రాక్షసులను చూచాడు.

సీతాన్వేషణలో హనుమంతుడు నగరమంతా గాలించాడు. స్వర, రజిత ఖచితమైన మహాశోభాయమానమైన మహాప్రాసాదాలను చూచాడు. సంగీత వాద్య పరికరాలు సుస్వరాలను నినదిస్తుండగా, రాక్షస ప్రియాంగనలు వచ్చి రసికశయ్య ఎక్కిన తమ భర్తల బాహువుల్లో ఒదిగి పోయారు. ఒక భవంతినుండి మరొక భవంతికి చేరుకొంటున్న హనుమంతుడు, ఆలింగనాలు చేసుకొన్న ప్రేమికులను, చందనాలు అద్దుకొంటున్న అతివలను చూచాడు. కొంతరు నిద్రిస్తున్నారు. కొందరు హాస్యాలాడుతున్నారు. కొందరు శృంగార క్రీడల్లో నిమగ్నులై ఉన్నారు. కొందరు ప్రియుల కోసం ఎదురు చూస్తుంటే, మరికొందరు ప్రియుడు విడిచిపోగా, విలపిస్తున్నారు. ఇలాంటి సుందరీమణులను వేలకొలదిగా గమనించాడు హనుమంతుడు. కాని ఎక్కడ సీత జాడ, కనపడక పోవడంతో నిరాశకు లోనైనాడు.

రావణుని ప్రాసాదాలను, అతని బంధువుల, సహచరుల ప్రాసాదాలను, క్షుణ్ణంగా పరిశీలించాలని హనుమంతుడు నిర్ణయించుకొన్నాడు. దూరం నుండి చూస్తే ఆ భవంతులు మెరుపుతీగల్లా, ఎంతో శోభాయమానంగా గోచరిస్తున్నాయి. ఐశ్వర్యవిలసితమైన అనేక ప్రాసాదాలను తిలకించిన మీదట, హనుమంతుడు సుందర తరుణీమణులతోను, గలగల ఆభరణాల ధ్వనులతో నిండిన రావణుని ప్రాసాదంలో ప్రవేశించాడు. ఏదో దివ్యరథంలో ప్రయాణిస్తున్న అనుభూతి హనుమంతునికి కలిగింది. రావణుని రాజ ప్రాసాదాంతర్భాగం స్వర్గసీమలా ఉంది. అలా సందర్శిస్తూ అనేక విలాస మందిరాలను చూచాడు. గదులు, ఆయుధాలతో, సకల నిధినిక్షేపాలతో కూడి ఉన్నాయి. కాని నాలుగు మైళ్ళ వెడల్పు, ఎనిమిది మైళ్ళ పొడవు గల రావణుని వ్యక్తిగత అంతఃపురాన్ని ఇంకా తాను అన్వేషించ లేదు.

రావణుని సువిశాల ప్రాసాదం అంతా తిరుగుతూ, అంతఃపురంలోని ఎలా ప్రవేశించాలా అని హనుమంతుడు ఆలోచిస్తున్నాడు. చివరకు ఎలాగో పుష్పక రథం ఉంచబడిన గదిని చేరుకొన్నాడు. ఈ రథాన్ని మొదట విశ్వకర్మ బ్రహ్మ కోసం నిర్మించాడు. కేవలం చోదకుల మానసిక సూచనల కనుగుణంగా అది గగనతలంలో విహరించగల శక్తి కలది. ఈ రథం నేలను తాకకుండా గాలిలోనే విహరిస్తుంది. రత్నమాణిక్యాలతోనూ యాంత్రికంగా తమ రెక్కలు ఆడిస్తున్న పక్షులతోనూ, రజిత నిర్మిత సర్పాలతోనూ, అది అలంకరించబడి వుంది. దానిలోపల, నీటి కొలనులో అందంగా నిలిచివున్న లక్ష్మీదేవి విగ్రహంపై పరిమళ జలాలలను వెదజల్లుతున్న ఏనుగులు ఉన్నాయి. స్వర్ణమయ సోపాన పంక్తులతోనూ, శ్వేతస్ఫటికమయ భూతలాలతోను, ఇంద్రనీల నిర్మితమైన మండపాలతోనూ కూర్చబడిన ఆ పుష్పకరథం గాలిలో తేలియాడుతున్న మహానగరంలా గోచరమౌతోంది.

రావణుని అంతఃపురాన్ని చూడాలని హనుమంతుడు పుష్పరథంపైకి ఎగిరి కూర్చున్నాడు. అనుకూలమైన ప్రదేశంనుండి హనుమంతుడు చూడగా, అతనికి ముత్యాలు, సువర్ణం, వజ్రాలు పొదగబడిన స్ఫటిక భూతలం కలిగి, పర్వతాలు, సాగరాలతో సహా సంపూర్ణ భౌగోళిక దృశ్య చిత్రమైన ఒక విశాలమైన తివాచీ పరచబడిన ఒక మహామంటపం కనిపించింది. రత్ననిర్మితమైన సోపాన పంక్తుల అంతస్తులకు దారితీస్తున్నాయి. స్వర్ణమయ దీపాలనుండి వెలువడుతున్న కాంతి రత్నమాణిక్యాలపై ప్రతిఫలించి, మంటపంలోని ప్రతి వస్తువు విశేషంగా ప్రకాశిస్తోంది. ఈ మంటపంలో ప్రతి ఒక్కటీ ప్రమోదాన్ని విరజిమ్ముతూ వుంది. ఇవన్నీ చూచిన హనుమంతుడికి ఇది స్వర్గమా, బ్రహ్మలోకమా? నేను ఎక్కడున్నాను? అని అనిపించి, ఆశ్చర్యపడ సాగాడు.

హనుమంతుడు ఒక విస్తారమైన తివాచీ మీద శోభితులైన వేలాదిమంది తరుణీమణులను చూచాడు. అర్ధరాత్రి దాటినందునను, మద్యం మత్తులో మునిగి నందునను, రతిక్రీడా వినోదాలన్నీ అలసినందునను వారు గాఢనిద్రలో మునిగియున్నారు. ఆ సుందరీమణులు ధరించిన కంకణాలు, వడ్డాణాలు, మంజీరాలు ధగధగ మెరుస్తూ పద్మ సరోవరాలను తలపిస్తున్నాయి. నిమీలితనయనలై ఉన్న ఆ స్త్రీలపై హనుమంతుడు దృష్టి సారించాడు. ఆ స్త్రీల ఆభరణాలు అన్నీ తెగిపోయి చెల్లాచెదరై పడివున్నాయి. వారి స్థితి ఏనుగుల చేత ధ్వంసం చేయబడిన పుష్పలతల్లా కనపడుతోంది. వారు అనేక రీతుల్లో జుగుప్సాకరంగా నిద్రిస్తున్నారు. ఈ దృశ్యాన్ని చూచిన హనుమంతుడు ఆశ్చర్యపడ్డాడు. నిజానికి రావణుని సహచరిణులు ఎంతగా కలగలిసి పోయారో, రాజపుత్రికలు, బ్రాహ్మణ, దైత్య, గంధర్వ పుత్రికలు రావణునికి భార్యలైనారు. వారిలో కొందరిని రావణుడు అపహరించి తెచ్చినవారు కూడ వున్నారు. వారందరు ఇంద్రియలోలురై అతనిని స్వీకరించారు.

కాని ఆశ్చర్య మేమంటే – వారిలో అధమ జాతులు గాని, వికార రూపులు గాని, అజ్ఞానులు గాని ఎవరూ వున్నట్లు కనబడలేదు. రావణుడు ఎవరినీ అనాదరించ లేదు. వారి నడుమ ఒక మనోజ్ఞ పుష్పసమలంకృతమై యున్న శయ్యపై నిద్రిస్తున్న రావణుని హనుమంతుడు చూచాడు. అతడు ఒక తలతోను, రెండు చేతులతోను కనిపించాడు. ఎందుకంటే యుద్ధంలో మాత్రమే అతడు దశకంఠుడై, ఇరవై బాహువులతో మహారూపాన్ని ధరిస్తాడు. ఇంద్రుని వజ్రాయుధం, మహావిష్ణువు చక్రం వంటి ఆయుధాల వల్ల ఏర్పడిన అసంఖ్యాక గాయాలు కూడ రావణుని శరీరంపై వుండటం గమనించాడు హనుమంతుడు.

నల్లని దేహం గల రావణుని శరీరం చందనచర్చితమై ఉంది. విందులతోను, సురాపానంతోనూ, శృంగార రసక్రీడలతోనూ రాత్రంతా గడిపి అలసిపోయి వున్న ఆ శరీరం మీద వున్న కర్ణాభరణాలు అగ్నివలె మెరుపులు విరజిమ్ముతున్నాయి. రాజసం ఉట్టిపడుతున్న రావణుని చూచి, కొంచెం భయంతో హనుమంతుడు కొంత గౌరవ దృష్టితో తన చూపు నిలిపాడు. అతనిని పరివేష్టించియున్న అతని భార్యలను చూచాడు. కొంతమంది తమ చేతులను రావణునిపై పరచి వున్నారు. మరికొందరు సంగీత వాద్యాలను కౌగిలించుకొని యున్నారు.

వీరందరికి ఒకింత దూరంగా, అపరిమితమైన అలంకరణతో శోభిల్లుతున్న శయ్యపై రావణుని ప్రీతిపాత్రురాలైన రాణి మండోదరి ఉంది. ఈమె గాంభీర్యాన్ని, సౌందర్యాన్ని చూచి హనుమంతుడు ఈమెయే సీత అని అనుకొన్నాడు. సీతను కనుగొన్నాననే సంతోషంతో హనుమంతుడు వానర చేష్టలు చేయసాగాడు. కాని అంతలోనే అతనికి ఒక సందేహం కలిగింది. 'ఈమె సీత కాజాలదు. ఎవరో అయివుండవచ్చును. రాముని విరహంలో సీత నిద్రాహారాలు లేకుండా ఉండివుండవచ్చు. ఆమె పరమ సాధ్వీమణి అని వినియున్నాను. ఆమె వేరొక పురుషుని సంగమంలో ఉండజాలదు. ఇక ఈ దుష్టుని గురించి చెప్పేదేముంది?' అనుకొంటూ. ఆమె సీత కాదనే నిర్ధారణకు వచ్చాడు.

ఆ తర్వాత హనుమంతుడు రావణుని ప్రసాదాలను ఒక్కొక్కటిగా లంఘించి మొత్తం సంచరించాడు. మద్యపాత్రల మధ్య నివసించే వేలాది స్త్రీలను చూచాడు. సీతాన్వేషణలో ఈ స్త్రీలను ఇలా పరిశీలించవలసి వచ్చింది హనుమంతునికి. 'ఇలా నేను అధర్మకార్యం చేస్తున్నానేమో, నాకే గతి పడుతుందో' అనుకొంటున్నాడు హనుమంతుడు. ఎందుకంట గుడ్డలు లేకుండా నిద్రిస్తున్న పరస్త్రీలను నేను చూచాను కదా అని అనుకొన్నాడు. మళ్ళీ 'ఒక కార్యం పాపమా, పుణ్యమా అని నిర్దేశించేది దాని ఉద్దేశ్యం మాత్రమే. నా ఏకైక ఉద్దేశ్యం సీతను కనుగొనుట మాత్రమే. ఈ స్త్రీలను చూస్తున్నా కూడా నేను మనస్సులో పవిత్రునిగా ఉన్నాను. ఒక స్త్రీని వెదకాలనుకొన్నపుడు అనేక స్త్రీలను చూడాలి కదా! ఇదంతా నేను శ్రీరాముని సేవలోనే చేస్తున్నాను. కనుక నేను పరస్త్రీలను చూడటం పాపకార్యం కాజాలదు.' అనే నిశ్చయానికి వచ్చాడు హనుమంతుడు. రావణుని ప్రాసాదంలో కూడ తాను సీత జాడను కనిపెట్టలేక పోయినందున, ఆమె ఇక జీవించి ఉండదనే నిర్ధారణకు కూడా వచ్చాడు. తాను వానరులకు ఏమి చెప్పాలి? అని మధన పడుతున్నాడు. కాని మొక్కవోని పట్టుదలతో తాను విజయం సాధించ గలనని గట్టిగా విశ్వసించాడు. ఇంకా ఏమైనా మరుగుపడిన స్థలాలుంటే, వాటిని కూడ వెదికాడు. కాని ఎక్కడా జాడ కనిపించ లేదు లంక మొత్తంలో.

సీత లంకలో ఉన్నదని సంపాతి గట్టిగా చెప్పాడు. కాని తాను ఎక్కడా కనిపెట్ట లేకుండా పోయాడు, కారణం ఏమిటని ఊహించసాగాడు. ఏవో కారణాల వల్ల సీత రావణుని చేతిలోనే మరణించి ఉండవచ్చునని హనుమంతుడు తలంచాడు.

అంతట హనుమంతుని ఆలోచనలు ఇలా సాగాయి. 'సీత లేకుంటే రాముడు ప్రాణాన్ని త్యజిస్తాడు. ఆ తర్వాత లక్ష్మణుడు కూడా అదే చేస్తాడు. ఈ వార్తలు విన్న భరత శత్రుఘ్నులు కూడ అదే దారిలోకి వెళతారు. నలుగురు కుమారులు గతించడంతో ముగ్గురు మాతృమూర్తులు శుష్కించి, మరణించడం జరుగుతుంది. తాము విఫలం కావడంతో సుగ్రీవుడు, అంగదుడు, మిగిలిన వానర సమూహం కూడ ప్రాణాలను త్యజిస్తారు. అందువల్ల నేను కిష్కింధకు తిరిగి వెళ్ళకూడదు. నేను ఇక్కడనే ఆత్మహత్య చేసుకోవడమో లేక సన్యాసిగా జీవించటమో చేస్తాను.' అని అనుకొన్నాడు.

కాని హనుమంతుడు బలశాలి, వివేకి కనుక తన మనస్సును సరిచేసుకొంటూ 'నేను రావణుని చంపడం మంచిదేమో లేదా వాడిని రాముడి వద్దకు ఈడ్చుకొని వెళితే, రాముడే వాడిని పరమశివునికి నరబలిగా సమర్పించ గలుగుతాడు.' అని అనుకొన్నాడు.

ఇలా ఆలోచిస్తూ వుండగా, హనుమంతుడు తాను ఇంతవరకు అన్వేషించి ఉండని ఒక విశాలమైన అశోకవృక్ష వాటికను కనిపెట్టాడు. తన అన్వేషణను కొనసాగించాలని నిర్ణయించుకొన్నాడు. ముందుగా రామునికి, లక్ష్మణునికి, ప్రధాన దేవతలకు నమస్కరించాడు. అంతట రక్షణ ప్రాకారాన్నుంచి అశోకవనంలోనికి దూకాడు. అక్కడ సంచరిస్తూ, మరింత స్పష్టత కోసం, ఒక ఎత్తైన వృక్షాన్ని అధిరోహించాడు. ఆపైనుండి చూడగా సమీపంలో ఒక తామర కొలనులోనికి జలపాతంగా పడుతున్న గిరి తరంగిణి కన్పించింది. అదొక మనోజ్ఞమైన వనం. సీత ఉండటానికి తగిన స్థలమని తోస్తోంది. సీత తన దినచర్యల నిమిత్తం, అటు వస్తుందని ఆశిస్తూ, హనుమంతుడు ఆ వృక్షాగ్రం మీదనే ఉన్నాడు. సమీపంలోనే ఆ వనంలో వెయ్యి స్తంభాలపై నిలిచిన ఒక దేవాలయం కనిపించింది. ఆ దేవాలయానికి ఎదురుగా జీర్ణవస్త్రాలు, మలినమైన ఒక వస్త్రాన్ని ధరించి ఉన్న ఒక స్త్రీ కూర్చొని ఉంది. ఆమె ఆహారలేమితో లేక ఉపవాసం వల్లనో కృశించి ఉంది. మనోవ్యధతో నిట్టూరుస్తోంది. వ్యాకులత కారణంగా నయనాలు అశ్రుసిక్తమై ఉన్నాయి. కాని ఆమె ఒక దివ్య తేజస్సుతో ప్రకాశిస్తోంది. ఆమె అనేకమంది రాక్షస స్త్రీలచేత పరివేష్టింపబడి వుంది.

గతంలో రావణుడు తీసికొని పోతున్నప్పుడు కనిపించిన ఆ స్త్రీయే ఈమె అని గుర్తుపట్టాడు హనుమంతుడు. ఆమె ఆభరణాలు సరిపోలి ఉండటం కూడ గుర్తించాడు. సీతయొక్క శరీర సౌష్టవాన్ని, వివిధ భాగాలను కూడ పోల్చుకో గలిగాడు. అన్ని పోలికలు కూడ సీతను నిర్ధారణ చేస్తున్నట్లు గమనించాడు. ఆమె లావణ్యవతియై కూడ తపస్సాధనలు చేస్తూ నేలపై కూర్చొని ఉంది. ఆమె ఒక మహనీయురాలిగానే గోచరిస్తున్నా, వేదనకు దారియైన ఆమె వక్రభాష్యానికి గురియైన పవిత్ర శాస్త్రం వలె, కళంకితమైన యశస్సు వలెనూ కనిపిస్తోంది. రామునే ఈమె ప్రేమిస్తున్నది. దైన్యాన్ని, దారుణాన్ని, దుఃఖాన్ని రాముడు పొందుతున్నాడు. తనమీదనే ఆధారపడిన లావణ్యవతిని పోగొట్టుకొని దుఃఖిస్తున్నాడు రాముడు. ఈ రాక్షసుల నందరినీ సంహరిస్తే, ఆమె యోగ్యురాలే అవుతుంది. రాముని ఆలోచనల్లో నిమగ్నురాలైన, ఆమె తన బాధలను గమనించటం లేదని అర్థమవుతోంది.' అని అనుకొన్నాడు.

సీతను, ఆమెకు కావలి కాస్తున్న రాక్షస స్త్రీలను గమనించుకోవడానికి చంద్రుడు పైనుంచి వచ్చాడు. ఆ రాక్షస స్త్రీలు అన్ని రకాల దేహ వికారాలతో జుగుప్సాకరంగా అగుపిస్తున్నారు. ఎంత వికారము అంటే కొందరు రాక్షస స్త్రీల శిరస్సులు కబంధుని వలె వారి దేహంలోకి చొరబడి వున్నాయి. అంతేకాదు వారిలో ఎక్కువమంది తమ దేహాలకు రక్తమాంసాలను అలదుకొని ఉన్నారు.

సీతను ఈ విధంగానైనా కనుగొన గల్గినందకు హనుమంతుడు సంతోషించాడు. అశోక వృక్షాగ్రంపై ఉండి ఇలా గమనిస్తూ ఉండగా, రాత్రి గడిచిపోయింది. వందిమాగధుల గానాలాపనలతో సూర్యోదయానికి ముందే రావణుడు మేల్కొన్నాడు. సీతను గురించి ఆలోచించ సాగాడు. రావణుడు తన ఇంద్రియ లాలసను అణచుకోలేక వందమంది రమణీమణులు వెంటరాగా, రాజచిహ్నాలను ధరించి అశోకవనం వైపు బయలుదేరాడు. మద్యం ప్రభావంతో నున్న రావణడు మెల్లగా నడుస్తుండగా, సుందరాంగులు మెరుపు తీగల్లా వెంబడించారు. రావణుని కదలికలను గమనించిన హనుమంతుడు గుబురాకుల మధ్యన నక్కాడు. రావణుని రాకను గమనించిన సీత పూర్తిగా ఆచ్ఛాదనంతో విలపిస్తూ కూర్చొని వుంది. అటువంటి దీనస్థితిలో ఉన్న సీత మసకబారిన జ్ఞానంవలెనూ, కూలిన ఆశవలెనూ, పరాజితమైన సేనవలెనూ, శోషించిన తరంగిణివలె గోచరించింది. ఆమె పద్మాలు లేని కొలనువలె, ఆరిపోయిన అగ్నివలె, భయంతో ఎగిరిపోతున్న పక్షివలె ఉంది. ఆమె దేహం శుష్కించి ఉంది మనస్సు విషణ్ణమై ఉంది. రావణుడు సీత ఎదుటకు వచ్చి, ప్రలోభ పెట్టాలనే తలంపుతో ఇలా ప్రేలాపన సాగించాడు. 'ఓ సుందర లలనామణీ! నీ కుదురైన వక్షోజాలను, సన్నని నడుమును దాచుకొంటావెందుకు? ఓ విశాలాక్షీ! నీకోసం ప్రేమతో వేగిపోతున్నాను. దయచేసి సిగ్గు విడిచిపెట్టు. నా ప్రియతమా! నన్ను అనుగ్రహించు. నా దుర్భర వాంఛను తీర్చు. రాక్షస తత్వానికి వ్యతిరేకంగా నిన్ను పొందటానికి నీవు ఇష్టాపూర్వకంగా సమ్మతించే వరకు నిన్ను నేను ముట్టుకోను. ఓ ముగ్ధ దేవతా! నేలపై ఎందుకు పడివుంటావు? ఉపవాసాలు ఎందుకు? అదేపనిగా మథనపడతావెందుకు? నీవంటి మోహనాంగికి ఇటువంటి ప్రవర్తన అనుచితం. నా రాణివై ముల్లోకాల్లో భోగాలను అనుభవించు. మహోన్నత రాజభోగాలన్నీ నీ సొంతం చేసికో. అమృతతుల్యమైన ఆహారం తీసికో. అత్యంత విలాసవతమైన శయ్యలపై పవళించు. సంగీత నృత్యగానాలతో పరవశిస్తూ, భోగాల్ని అనుభవించు.

ఓ అపురూప లావణ్యవతీ! యౌవనం ఇట్టే గతించి పోతుంది. నీ పట్టు మూర్ఖమైనది. నీ ముఖం చంద్రుని మించిన శోభాయమానమై వున్నది. నీ దేహలక్షణాలు లావణ్యాలతో అతి సుందరమైనవి. నా ప్రేయసివి కా. నీ ఆనందం కోసం నేను ఏదైనా చేస్తాను. ఈ సమస్త భూమండలాన్ని జయించి, నీకు నీ తండ్రియైన జనక మహారాజును కానుకగా ఇస్తాను. నన్ను ధిక్కరించగల వాడెవ్వడు లేడు. ఓ సీతా! నీ మీద నాకు ఎంత ఆసక్తి వున్నదంటే, నిన్ను చూచిన తర్వాత నాకెవరి మీద తుదకు మండోదరి మీద కూడ ప్రీతి కలుగుట లేదు. నాతో పోల్చితే, ఒక నరాధముడికి విధేయురాలై ఉండాలనే పట్టుదల నీకెందుకు? రాముడు ఇంకా బ్రతికి వున్నాడన్నది సందేహమే. ఒకవేళ బ్రతికి వున్నా, నీవు అతనిని చూడలేవు అన్నది నిశ్చయం.' అని రావణుడు అనగా సీత అతనికి సమాధాన మివ్వడానికి ఇష్టపడక, సీత తనకు, రావణునికి మధ్య ఒక గడ్డిపోచను ఉంచి, మృదువుగా ఇలా అన్నది. 'నీవు నీ మనస్సును నానుండి ఉపసంహరించుకొని, నీ భార్యలతో సుఖంగా ఉండాలి. పాపాత్ముడు పరిపూర్ణతను సాధించలేనట్లే, నీవు నన్ను ఎప్పటికి పొందలేవు. నేను శ్రేష్ఠవంశం నుండి వచ్చి, ధర్మబద్ధంగా వివాహమాడిన దానను. ధర్మ విరుద్ధంగా నేను ఎన్నటికీ ప్రవర్తించను నీవు నా అనుగ్రహాన్ని పొందటమనేది కల్ల' అంటూ రావణుని వైపు వీపు త్రిప్పి మాటలు ఇలా కొనసాగించింది. 'నీవు ధర్మమార్గం వీడి అధర్మమార్గంలో ప్రయాణిస్తున్నావు కనుక నీ యావత్ రాజ్యానికి నీవు వినాశ హేతువు అవుతావు. సజ్జనుల ఆదర్శాలను ఎందుకు అనుసరించవు? స్వీయ పత్నియందు అనురాగం వీడి, పరసతుల పట్ల అనురాగం వాంఛించే వాడికి పతనం తప్పదు. బుధజనుల సలహాలు పాటించు. మొత్తం రాక్షసజాతికి వినాశం ఎందుకు కోరుకొంటావు? దుష్టుల వినాశానికి ప్రతి ఒక్కరూ ఆనందిస్తారని నీకు తెలియదా? నీవు చూపిన దుష్ట ప్రలోభాలకు నేనుఎన్నడును లోబడను. సూర్యుని నుండి సూర్యకాంతి వీడనట్లే, రాముని నుండి నేను అవిభాజ్యం. నన్ను క్షేమంగా రామునికి

అప్పగించడం ద్వారానే, నీవు నిన్ను కాపాడుకోగలవు. ఆయన ఆశ్రితవత్సలుడు, మైత్రికి ప్రయత్నించు. లేనియెడల రామలక్ష్మణులు వచ్చి నీ జీవనశ్వాసను లాగిపారేయటానికి ఎంతోకాలం పట్టదు. రాముని ప్రతీకారం నుండి నీవు రక్షించుకోలేవు. రాముడు నీ దుర్మార్గానికి గాను నిన్ను వధించటం నేడో రేపో జరిగి తీరుతుంది.' అని సీత చెప్పగా రావణుడు ఇలా ఎదురుచెప్పాడు.

'సాధారణంగా ఒక పురుషుడు ఒక స్త్రీ పట్ల ఎంత అనురాగంతో ప్రవర్తిస్తాడో, ఆ స్త్రీ అంతే అనురాగంతో పురుషుడితో ప్రవర్తిస్తుంది. కాని నీవు అందుకు విరుద్ధంగా ఉన్నావు. నీ కఠిన వచనాలకు నేను నిన్ను చంపవలసిందే. కాని నీపట్ల నాకున్న ప్రేమ నన్ను అదుపు చేస్తోంది. అది నీ అదృష్టం. ప్రేమ అనేది విచిత్రంగా పనిచేస్తుంది. ప్రేయసి ప్రియుణ్ణి అనుమానించిన కొద్దీ ప్రియుడికి ప్రేయసి మీద అభిమానం ఎక్కువవుతుంది. నిజానికి నాచేత నీకు అవమానం, మృత్యువే తగిన పురస్కారాలు. కాని నేను నిన్న చంపటం లేదు. నీకిచ్చిన సంవత్సర కాలంలో ఇప్పటికే 10 మాసాలు గడిచాయి. నీవు ఈ రెండు మాసాల్లో నన్ను ప్రేమించే పరిస్థితులలో లేకపోతే, నిన్ను నా వంటవాళ్ళ చేత ముక్కలు చేయించి, నేను భుజిస్తాను.' అని అన్నాడు.

రావణునిచే అపహరించబడిన చాలమంది స్త్రీలు ఇక్కడే ఉన్నారు. వారు సీతపట్ల సానుభూతి కలిగి వున్నారు. వారు సీతను సముదాయించారు. సీత చివరగా రావణని ఇలా మందలించింది. 'నీ ఈ చేటు కార్యం వలన నిన్ను నేను భస్మం చేయగలను. కాని రాముని నుండి నాకు ఇంకా ఏ ఆజ్ఞ రానందున మిన్నకున్నాను. నీవు మూర్ఖుడవు. ఎందుకంటే శ్రీరాముని భార్యను అపహరించటం అనేది అసాధ్య కార్యం. నీ మృత్యువుకు నన్ను నిమిత్తమాత్రురాలిగా దైవం నిర్ణయించడం చేతనే, నీవు నన్ను అపహరించ గలిగావు' అని పల్కిన సీత పరుష వచనాలకు కోపోద్రిక్తుడైన రావణుడు 'నిన్ను ఈరోజే సంహరిస్తాను.' అని గర్జించాడు. ఆ తరువాత అక్కడ వున్న రాక్షస స్త్రీలతో రావణుడు 'సీతకు మీరు కానుకలిచ్చిగాని, బలవంతంగా గాని, ఎలాగైనా సరే నాకు తాను లొంగేటట్లు చేయాలి.' అని చెప్పాడు. ఇలా అంటూనే రావణుడు చటుక్కున సీతవైపు తిరిగాడు ఏదైనా ఆకస్మికంగా హింసకు పూనుకొంటాడనిపించింది. అయితే రావణుని భార్యలందరిలో చిన్నదైన ధన్యమాలినితో పాటు అక్కడికి వచ్చిన మండోదరి తన భర్తను కౌగలించుకొని 'నీ ప్రాసాదానికి తిరిగి వచ్చి, మాతో ఆనందించు. ఈ శుష్కించిన సీతను మరిచిపో. ఇష్టపడని స్త్రీ పొందు కోరితే, కష్టాలు తప్ప మరేవీ ఉండవు. స్త్రీ అతనిని ప్రేమించేది అయితే అతను అమితానందాన్ని పొందుతాడు, పొందగలడు.' అని చెప్పింది. సీతను దూషించకుండా, మండోదరి అలా అడ్డు తగిలింది. అలా రావణుడుతన ప్రాసాదానికి వెళ్ళాడు. రాక్షస స్త్రీలు సీతను కఠోరంగా బెదిరించ సాగారు. 'రావణుడు గొప్ప వ్యక్తి. బిడియం వీడి ఆయనను స్వీకరించు. విశ్రవ ఋషి కుమారుడు రావణుడని నీవు తెలుసుకోవాలి. నీవు స్వీకరించకపోతే, నీవు నాశనం అవుతావు.' అంటూ వాళ్ళు బెదిరించ సాగారు ఒక్కొక్క రాక్షస స్త్రీ ఒక్కొక్క విధంగా సీతను బెదిరిస్తూ, రావణుని గొప్ప శక్తియుక్తులను ఏకరువు పెట్టారు. అన్నింటికి సీత ఒకే జవాబు 'మీరు తింటే నన్ను తినండి. నేను ఎన్నటికీ రావణునికి లొంగేది లేదు.' అని కఠినంగా జవాబు ఇచ్చింది. ఎంత చెప్పినా వినకపోవడంతో ఆ స్త్రీలు గొడ్డళ్ళతో, కత్తులతో, శూలాలతో ఆమె చుట్టూ నిలబడి దాడి చేస్తామని బెదిరించారు.

అనేక విధాలుగా ఆ రాక్షస స్త్రీలు సీతకు భయంకర రీతుల్లో దడ పుట్టించారు. ఇలాంటి భయంకరమైన వచనాలను విని సీత భరించలేక కన్నీరు కార్చింది. 'ఓ రామా! ఓ లక్ష్మణా!' అంటూ బిగ్గరగా అరిచింది. సీత ఇలా విలపించ సాగింది. 'నన్ను కాపాడుటకు రాముడు రాడేమో, నేను ఎక్కడ వున్నదీ ఆయనకు తెలియదేమో!

నా వియోగంలో ఆయన మరణించి స్వర్గంలో ఉన్నాడేమో. అయ్యో! ఎప్పుడు రాముడు వచ్చి వీరినందరిని సంహరించి నన్ను అయోధ్యకు తీసికొని పోతాడో, ఏమైనా నేను మరణించితేన మేలు. ఈ బాధలకంటే నాకు మరణమే నయం' అంటూ విలపించింది సీత.

అలాంటి సమయంలో త్రిజట అనే వృద్ధ రాక్షసస్త్రీ ఇతర స్త్రీలను సమీపించి ఇలా అన్నది. 'నిర్భాగ్యులారా! మీరెందుకు సీతని హింసించుటకు సాహసిస్తున్నారు. నాకొక కల వచ్చింది. అందులో సీతను కాపాడటానికి రాక్షసులందరినీ సంహరించటానికి రాముడు రావడం నేను చూచాను.'.

ఇంకా ఇలా అన్నది 'రామలక్ష్మణులు ధవళ వస్త్రాలు ధరించి, ఒక దివ్య ధవళ రథంలో రావడం చూశాను. రాముడు మహాగజంపై ఆసీనుడై వుండటం చూచాను. సీతకూడ ఒక ధవళాచలంపై నిలిచి ఉంది. రాముడు ఆమెను సమీపించగా, ఆమె ఆ గజాన్ని అధిరోహించి, రామునితో పునస్సమాగమమై పోయింది. ఆ తర్వాత సీతారామలక్ష్మణులు పుష్పక రథంలో ఆకాశమార్గాన ఉత్తర దిశకు పోవడం నేను చూచాను. అంతట రావణుడు ముండిత శిరస్కుడై, తన శరీరానికి రక్తచందనం అలముకొని ఉండటం చూచాను. గార్ధభాలు లాగుతున్న రథంలో తైలస్నానం చేస్తూ మతిభ్రమించి నవ్వుతున్నాడు. ఆ రథం పోయి పోయి అంధకార బంధురంలో గల నరకంలో పడింది, రావణుడు అదృశ్యం కావడం చూచాను. కుంభకర్ణుడు, రావణ పుత్రులు కూడ అలాగే పోయారు.కాని విభీషణునికి ఆ గతి పట్టలేదు. అతని ముందు శంఖనాదాలు, భేరీలు మ్రోగుతున్నాయి.చివరకు లంకానగరం అంతా సముద్రంలో మునిగిపోవటం చూచాను. ఇలా రాముడు వచ్చి రాక్షసులను వధించి, సీతను తీసికొని పోతాడు అనే నిర్ధారణకు నేను వచ్చాను. ఇక మీరు సీతను బాధించటం మాని ఆమె క్షమాపణ కోరండి' అని చెప్పింది.

ఈలోగా సీత అనింద్య దేహంలో శుభశకునాలు ప్రత్యక్షమైనాయి. ఆమె వామనేత్రం అదరసాగింది. వామ భుజం కూడా కొద్దిగా కంపించింది. రాముడే వచ్చి తన ఎదుట నిలిచినట్లు అనుభూతి కలిగింది ఆమెకు. వీటినన్నింటిని గమనించిన త్రిజట 'సీతకు త్వరలోనే ఏదో శుభవార్త అందుతుందని, ఈ శుభశకునాలను బట్టి అర్థం చేసుకోగలను' అని ప్రకటించింది.

సీత ఈ మాటలు విని మిక్కిలి సంతోషించి, 'నీవు చెప్పినదంతా నిజంగా జరిగితే, అపుడు నా భర్త ఆగ్రహం నుండి నీకు పూర్తి రక్షణ ఏర్పాటు చేయిస్తాను.' అని అన్నది. కాని సీత తన చుట్టూ వున్న రాక్షస స్త్రీల భయంతో ఉంటూ వున్నది. ఆ వేదన భరించలేక జీవితాన్ని అంతం చేసుకోదలచి, ఒక త్రాటిని తన కంఠానికి బిగించి ముడివేసింది. రెండవ కొనను అశోక వృక్షశాఖకు కట్టి వేయసాగింది. కాని అదే సమయంలో సీతకు అనేక శుభసంకేతాలు పొడసూపాయి. దానితో ఆశాభావం పురివిప్పింది. ఇంతసేపూ, హనుమంతుడు చెట్టుపై నక్కి, సీత మాటలను, రాక్షస స్త్రీల మాటలనూ వింటూ ఉన్నాడు. ఇలా అనుకోసాగాడు. 'సీత దుఃఖిత యైనందున ఆమె ప్రజ్ఞ మరుగున పడింది. నేను పోయి ఏదోవిధంగా, ఆమెను అనునయించాలి. లేకపోతే ఆమె ఏ అకృత్యానికైనా పాల్పడవచ్చు. కాని ఈ రాక్షస స్త్రీల నడుమ ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎలాగైనా సమాచారాన్ని సేకరించి, రాముని చేరి, ఆయనకు చెప్పాలి. అపుడు ఇద్దరి మధ్య సాంత్వన ఏర్పరచిన వాడనవుతాను. కావలివాళ్ళు అశ్రద్ధగా ఉన్నపుడు, నేను వెళ్ళి సీతను కలుసుకొంటాను. నేను సంస్కృతంలో మాట్లాడితే, ఆమె నన్ను విశ్వసించవచ్చు. బ్రాహ్మణుని వేషంలో వెడితే రావణునిగా శంకించవచ్చు. నేను అయోధ్య మాండలికంలో మాట్లాడితే, ఆమె నన్ను

తప్పక విశ్వసిస్తుంది. రావణుడు ఏ రూపాన్ని అయినా ధరించగలడు కనుక నా సమస్య జటిలంగా ఉంది. నేను అతి జాగ్రత్తగా వ్యవహరించాలి. నా మహాకాయం చూస్తే, కావలివారు భయపడి, రాక్షస సైన్యాన్ని పిలువవచ్చు. సీతను నేను ఎలా సమీపించగలనో అనే విషయం చాల జాగ్రత్తగా ఆలోచించాలి అని అనుకొంటూ – నేను రాముని స్తుతిగానం చేస్తాను. ఆ తర్వాత ఆయన సందేశం అందిస్తాను అని దృఢంగా నిర్ణయించుకొన్నాడు హనుమంతుడు.

అశోక వృక్ష శాఖలలో నుండి హనుమంతుడు 'ఇక్ష్వాకు కుల సంజాతుడు, ధర్మాత్ముడు, మహావీరుడు, దశరథుడనే ఒక మహారాజు, అయోధ్యను పాలించుచుండెను.' అని మొదలుపెట్టి గానం చేయసాగాడు. చివరగా 'తన ప్రియతమ సతివగు నిన్ను రక్షించుటకై రాముడు వచ్చును, నీ పతి ప్రాణముల నిలుపుటకై నాకొక సందేశమును ఇపుడీయవా' అని ముగించాడు. ఈ గానాన్ని విన్న సీత చెట్టుపైకి చూడసాగింది. హనుమంతుణ్ణి చూడగానే సీత తాను కలగంటున్నా ననుకొన్నది. 'స్వప్నాల్లో వానరులను చూడటం అమంగళకరం' అని తనలో తాను గొణుక్కొన్నది. మనోవ్యథ హెచ్చుగా, సీత రోదిస్తూ స్పృహ కోల్పోయింది. స్పృహలోనికి తిరిగి వచ్చి 'వానరాన్ని చూచిన మీదట నేను రాలమక్ష్మణుల క్షేమం కోసం ప్రార్థించాలి. రాముని నుండి విడివడిన తర్వాత నాకు నిద్రలేదు కదా! ఎలా కల కనగలను? నాకు ఎటుచూచినా రాముడే కనిపిస్తాడు. నేను రాముణ్ణి తప్ప మరేదీ ఆలోచించలేను. నేను వానరాన్ని చూడలేదు. చూడలేదని అనడం కూడ భ్రమగానే ఉంది. వాస్తవంగా నేను చూచాను. ఓ బ్రహ్మ, ఇంద్ర, సూర్య, వాయుదేవులారా! ఆ వానరం వాస్తవంగా వుండేలా చేయండి. అతని మాటలు నాకు శుభాన్ని చేకూర్చేలా చేయండి.

చెట్టుపైదాగి వున్న హనుమంతుడు క్రిందికి దిగివచ్చాడు. సీత ఎదుట ముకుళిత హస్తాలతో నిలిచి 'అమ్మా! నీవెవరవు? దేవతవలె నున్నావు. నీవు రాముని సహధర్మచారిణివే అయివుంటావని తలుస్తున్నాను' అని అన్నాడు. రాముని పేరు వినడంతో సీత మహదానందంతో తన జీవిత వృత్తాంతాన్ని హనుమంతునికి చెప్పింది. తరువాత 'రావణుడు నేను జీవించడానికి 2 నెలలు వ్యవధి మాత్రమే ఇచ్చాడు. ఈలోగా రాముడు ఇక్కడికి రాకుంటే నేను ప్రాణాలను త్యజిస్తాను.' అని వివరించింది. అందుకు హనుమంతుడు ఇలా అన్నాడు. 'నేను రాముడు పంపగా వచ్చిన దూతను. ఆయన క్షేమంగానే ఉన్నాడు. నీ జాడ తెలుసుకునేందుకు నన్ను ఇక్కడికి పంపాడు. నీ క్షేమసమాచారాలను ఆయన తెలుసుకోవాలని ఉన్నాడు' అని చెప్పాడు.

సీత ఎంతగానో ఆనందించింది. వారిద్దరు పరస్పరం సంభాషించుకొంటూ ఉన్నారు. హనుమంతుడు సీతకు మరింత దగ్గరయ్యాడు సంభాషణల్లో. అపుడు సీతకు అనుమానం వచ్చింది. వీడు వానర రూపంలో వున్న రావణుడేమోనని. అలా అనుమానంతో హనుమంతుణ్ణి 'మారువేషంలో వచ్చిన నీచుడా' అని దుర్భాషలాడింది. కాని నాకు ఆ వానరాన్ని చూస్తే, రాముని దూతగానే అనుమానం కలుగుతోంది. ఇలా సీత స్థిమితపడి హనుమంతునితో రాముని గురించిన మరిన్ని వివరాలు చెప్పమని అడిగింది. రాముని గురించి నీవు చెపుతుంటే నా మనస్సు ఆనందడోలికల్లో ఊగిపోతోంది' అని అంటూనే, సీతకు అనుమాన పిశాచం ఆవహించినందున మళ్ళీ హనుమంతుని గురించి 'ఈ వానరం ఒక భూతమేమో' అని అనుకొంది. 'కల్లోలిత మనస్సు చెప్పినట్లు నేను ఎందుకు నడచుకోవాలి? రాముడు పంపగా నిజంగానే ఈ వానరం ఇక్కడికి వచ్చిందా. కాని ఒక వానరమాత్రుడు సముద్రాన్ని ఎలా లంఘించగలడు? ఈ మారువేషంలో వచ్చింది రావణుడే అయివుంటాడు.' అని ఏవేవో ఆలోచనలు చేస్తున్న సీత మనసును హనుమంతుడు గ్రహించాడు. ఆమె అనుమానాన్ని, భయాన్ని

దూరం చేయాలని, హనుమంతుడు రాముని కీర్తిస్తూ గానం చేయసాగాడు. అపుడు సీత 'నీవు రాముణ్ణి ఎలా కలుసుకున్నావో అంతా చెప్పు. రాముని, లక్ష్మణుని దేహ ఛాయలను వర్ణించి చెప్పు' అని సీత అడిగింది. అంతట హనుమంతుడు 'ఓ విదేహ రాజకుమారీ! రాముని నేత్రాలు అరవింద దళాలు. భుజాలు విశాలం. బాహువులు బలమైనవి. మెడ శంఖాకారం. నయనాలు తామ్రరంజితాలు. కంఠస్వరం దుందుభి. ఆయన వక్షం, నాభివలయం, ఉదరం ఉన్నతమైనది. నాభి లోతైనది. ఆయన శీఘ్రగామి. ఆయన మెడ, ఉదరం మీద మూడు రేఖలున్నాయి. ఆయన సింహంవలె, వ్యాఘ్రం, గజం, వృషభం వంటి గమనం కలవాడు. ఆయన నోరు, నేత్రాలు, జిహ్వ, పెదాలు, తాలువులు, స్తనాలు, నఖాలు, కరతలాలు, పాదాలు అనే పది స్థానాలు పద్మాలవంటివి. ఆయన వెంట్రుకలు, చర్మం, వ్రేళ్ళ కణుపులు, గ్రహణశక్తి సూక్ష్మమైనవి. ఇవేకాక మరెన్నో ఉత్తమోత్తమలక్షణాలతో ఆయన శోభిల్లుతుంటాడు. లక్ష్మణుని సౌందర్యం కూడ అమేయమైనదే. రాముడు శ్యామలవర్ణుడు. లక్ష్మణుడు హేమవర్ణుడు. వీరిద్దరిని నేను ఋష్యమూక పర్వతం వద్ద కలుసుకొన్నాను.

నీవు ఆ వానరుల మధ్య విడిచిన ఆభరణాలను రాముడు చూచి చాల రోదించాడు. సుగ్రీవునితో మైత్రి నెలకొల్పుకోవడానికి, వాలిని వధించాడు, ఈ మేలుకు ప్రత్యుపకారంగా, సుగ్రీవుడు లక్షలాది వానరులను పంపి నీకోసం అన్వేషణ ప్రారంభించాడు. ఇపుడు అదృష్టవశాత్తు, నేను ఉపాయంతో నిన్ను కలుసుకున్నాను నేను వానరుల్లో మేటిని. కేసరి నందనుడను. నా తండ్రి మలయ పర్వతంనుండి గోకర్ణ పర్వతానికి మారాడు. శంబసాదనుడు దేవర్షులను పీడిస్తుండగా, వారి ప్రార్థన మీద కేసరి ఆ దానవుణ్ణి సంహరించాడు. ఆ తర్వాత కేసరి పత్నియైన అంజనా దేవి గర్భంలో వాయుదేవుని వల్ల నేను జన్మించటం జరిగింది.' అని చెప్పాడు.

రాముని వర్ణనతో సీతకు నమ్మకం కలిగింది. ఆనందబాష్పాలు రాల్చింది. అపుడే హనుమంతుడు రాముడిచ్చిన అంగులీయకాన్ని సీతకు ఇచ్చాడు. దానిని చూచి సీత రాముడే వచ్చినట్లుగా భావించి ఉప్పొంగి పోయింది. సీత 'ఓ హనుమా! నీవు ఈ అంగులీయకాన్ని ఇచ్చినందుకు, నీకు నేను శాశ్వతంగా ఋణపడి ఉంటాను. నాకోసం ఇంత దూరం రావటం నీ ఔదార్యాన్ని చాటుతున్నది. ఇంకా రాముని గురించి వినాలని ఉంది.' అని అడుగగా, హనుమంతుడు 'నీవు ఎక్కడున్నావో తెలియక ఇక్కడికి రాలేదు. నీవు లేక రాముడు ఉండలేడు. కనుక నేను వెళ్ళి నీ జాడ చెప్పగానే, రాముడు ఇక్కడికి వచ్చి రావణుని సంహరిస్తాడు' అని చెప్పాడు. అంతట సీత 'రావణుడు రెండు నెలల తర్వాత నన్ను చంపాలని ఉన్నాడు. కనుక నీవు రామునికి గట్టిగా చెప్పు. నన్ను రామునికి అప్పగించమని రావణుని తమ్ముడు విభీషణుడు పదే పదే చెప్పాడు. రాముని చేతిలో రాక్షస సంహారం జరుగనున్నది. ముందస్తు హెచ్చరిక చేసిన విషయాన్ని విభీషణుని పెద్ద కుమార్తె నాకు తెలియజేసింది. కాని రావణుడు ఏదీ లెక్క చేయడం లేదు.' అని అన్నది.

అపుడు హనుమంతుడు ఇలా అన్నాడు. 'అమ్మా! నీకిష్టమైతే నిన్ను నా వీపుపై కిష్కింధకు మోసుకొని పోయి రామునికి అప్పగించగలను. నేను సముద్రంపై ప్రయాణిస్తుంటే, ఈ రాక్షసులు నన్నేమీ చేయలేరు' అని అనగా, సీత సంతోషించి, 'నీ ప్రతిపాదన చూస్తే ఒక వానరం చేసే ప్రతిపాదనలానే ఉంది. కాని ఇంతటి అల్పుడు నన్ను సముద్రం మీదుగా ఎలా మోసుకొని పోగలడని ఊహించలేక పోతున్నాను.' అని అన్నది. ఈ మాటలు వినిన హనుమంతుడు కొద్దిగా అవమానం పొంది 'నా గురించి ఈమెఎంత తక్కువగా భావిస్తోంది' అనుకొన్న తర్వాత తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శించటానికై, హనుమంతుడు తన బృహద్రూపాన్ని ప్రదర్శించి, 'నీకిష్టమైతే ఈ లంకానగరాన్ని అంతటిని పెకలించగలను. అందువల్ల దయచేసి, నా గురించి నీకున్న సందేహాలను వదలి

వేయి' అని అన్నాడు.

దానికి సీత 'నీవు నన్ను సముద్రం మీదుగా మోసుక పోగల బలశాలివే. అయితే ఆ పని అంత సమంజసంగా తోచదు. ఎందుకంటే నీతో నేను సముద్రం మీద వెళుతుండగా నేను జారి సముద్రంలో పడిపోవడం జరగవచ్చు. లేదా రాక్షసులు నిన్ను వెంబడించినపుడు, నీవు వారితో యుద్ధంలో నిమగ్నుడవై ఉంటే, నా స్థితి ఏమిటి? పైగా నీవే రాక్షసులందరిని సంహరించ గలిగితే, రాముని కీర్తి తగ్గుతుంది కదా! కనుక ఓ హనుమా! నేను రామునికి సంపూర్ణంగా అంకితురాలనైనందున, నేను రాముని తప్ప ఇతర దేహాలను స్పర్శించను. రావణుని అపహరణ సమయంలో అతనిని నుండి తప్పించుకోలేకపోయాను, విధి లేకపోయింది. కనుక రాముడే వచ్చి ఈ దుష్టుణ్ణి వధించి నన్ను తీసికొనిపోవాలి. ఈ అద్భుత కార్యమే రాముని కీర్తిని అతిశయింపజేస్తుంది.' అని అన్నది. అందుకు హనుమంతుడు జవాబుగా 'నేను ఇక వెళ్ళివస్తాను. నేను నిన్ను దర్శించినట్లు యదార్థంగా ఉండే ఏదైన చిహ్నాని ఇవ్వు' అని అడిగాడు. అపుడు సీత 'హనుమా! నీవు ఆయనకు ఈ వృత్తాంతాన్ని చెప్పు. సరిపోతుంది. మేము చిత్రకూటంలో వుండగా, ఒక రోజు జలక్రీడలాడిన తర్వాత రాముడు తడి దుస్తులతో నా ప్రక్కనే వున్నాడు. ఆ సమయంలో ఒక కాకి వచ్చి మాంసం కొరకు అన్నట్లుగా, నన్ను ముక్కుతో పొడవటం ప్రారంభించింది. నేనొక మట్టిగడ్డను దానిపై విసిరాను. కాని ఆ మొండి కాకి వదలకుండా ఒక చోట దాగింది. నేను కోపంతో నా పైటలోంచి ఒక పోగు లాగబోగా, పైట జారింది. అది చూచిన రాముడు నా వ్యాకుల వదనాన్ని చూచి నవ్వాడు. ఈలోపున ఆ కాకి మళ్ళీ వచ్చి నన్ను పొడిచింది. నేను రాముని తొడపై కూర్చొని ఆయన రక్షణను కోరగా, ఆయన నా కన్నీటిని తుడిచి ఓదార్చాడు. పూర్తిగా అలసిపోయిన నేను ఆయన బాహువుల్లోనే నిద్రపోయాను. కొద్దిసేపట్లో ఆయన కూడ నిద్రలోకి జారుకొన్నాడు. అదే అదనుగా భావించిన కాకి ఒక్కసారిగా ఎగురుతూ వచ్చి, నా వక్షోజాలపై రక్కింది. తనపై రక్తపు బిందువులు పడగా, రాముడు నిద్రనుండి మేల్కొన్నాడు. నా వక్షోజాలపై గీరుకుపోయిన గాయాలను చూచిన రాముడు క్రుద్ధుడై అల్లంత దూరంలో రక్తం అటుకున్న కాకి గోళ్ళను చూచాడు. రాముడు తన దర్భాసనంలోని ఒక దర్భను తీసి దానిపై బ్రహ్మాస్త్రాన్ని ఆవాహన చేశాడు. ఆ దర్భ భగభగ మండుతుండగా, దానిని కాకిపై విసిరాడు. ఆ దర్భాయుధం కాకిని తరుముతుండగా, ఆకాశంలోకి ఎగిరిపోయింది. అయితే ఆ కాకి ఇంద్రుని తనయుడట. బ్రహ్మాస్త్రం వెంటాడగా కాకి తండ్రి కూడా దానికి సాయపడలేని  శక్తిహీనుడైనాడు.

చిట్టచివరకు, ఆ కాకి వచ్చి రాముని శరణు కోరింది. కాని రాముడు 'పారిపోయిన నిన్ను నేను క్షమించినా, ఈ బ్రహ్మాస్త్రం విఫలం కాజాలదు. అందువల్ల ఏదో ఒకచోట దెబ్బ తగలవలసిందే'. ఈ మాటలు అంటూ రాముడు ఆ కాకి యొక్క కుడి కంటిని నాశనం చేసేలా ఆయుధాన్ని నిర్దేశించాడు. ఆ తర్వాత ఇంద్రతనయుడు ప్రణామాలు చేసి వెళ్ళిపోయాడు.

సీత హనుమంతునితో తన దివ్యలీలా వృత్తాంతాన్ని చెబుతూ, వివశురాలవుతూ 'ఓ హనుమా! రాముడు గతంలో ఒక కాకి మీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ఇపుడు రావణుని మీద పోరాడడేమి? రాముడు నన్ను ప్రేమించడం లేదా? నన్ను నిరాదరిస్తున్నాడేమిటి?' అని అన్నది. హనుమంతుడు సీతాదేవి దుఃఖాన్ని దూరంచేసి ఉత్సాహపరచటానికి 'అమ్మా! రాముడు నీ విరహాగ్నిలో దుఃఖితుడై వున్నాడు. నేను రామునికి చూపించటానికి ఏదైనా ఒక వస్తువు ఇవ్వు.' అని అన్నాడు. సీత 'హనుమా! ఏదో కొంత ఆశ కనపడుతోంది. నీవు రాముని ఇక్కడికి త్వరగా రమ్మని చెప్పు. ఎందుకంటే నేను ఇంకా రాముని నుండి దూరంగా ఉండవలసి వస్తే, నేను

మరణించడం ఖాయం.' అని పలికింది.

సీత తన తలపై నుండి తీసి కొంగులో దాచుకొన్న ఉజ్వలమైన ఒక చూడామణిని తీసి, హనుమంతునికి ఇస్తూ 'ఈ చూడామణిని రాముడు చూస్తే, ముగ్గురు వ్యక్తులు ఆయనకు గుర్తుకు వస్తారు. ఎందుకంటే రాముడు, ఆయన తండ్రి సమక్షంలో దీనిని నా తల్లి నాకు పెండ్లి కానుకగా ఇచ్చింది. ఓ హనుమా! నీవు వెంటనే వెళ్ళి రాముని పంపి నా దుస్థితిని తొలగించమని గట్టిగా చెప్పు.' అని అన్నది. అంతట హనుమంతుడు సీతకు ప్రదక్షిణ నమస్కారం చేసి వెళ్ళుతుండగా, సీత రాముని త్వరగా రమ్మని చెప్పు అని పలికింది. హనుమంతుడు అందుకు సమాధానంగా 'తల్లీ! చింతించకు. రాముడు, లక్ష్మణుడు, వానరయోధులందరు రావణుని వధించటానికి త్వరలోనే ఇక్కడికి వస్తారు. నీవు చూస్తావు కదా! దుఃఖించకు' అని సమాధాన మిచ్చాడు. అపుడు సీత 'దయచేసి మరొక్క రోజు ఉండు. నీ సాగంత్యం వల్ల నా మనస్సుకు ఎంతో ఊరట లభిస్తోంది. కాని వానరులు సముద్రాన్ని ఎలా దాటగలరు? ఆశలసౌధంలో ఉన్నావా? గరుత్మంతునికి, వాయుదేవునికి, నీకు తప్ప రామలక్ష్మణులకు ఇంతటి సామర్థ్యం ఉందనుకోను. హనుమా! నీవు ఒంటిచేత్తో నన్ను రక్షింగలవని నాకు తెలుసు. కాని రాముడు ఈ రాక్షసులను వధించి నన్ను రక్షించే విధంగా చేయాలని ప్రార్థిస్తున్నాను. అపుడే రాముని ఖ్యాతి తేజోమయంగా, శాశ్వతంగా నిలిచిపోతుంది.' అని సీత వేడుకొంది. అందుకు హనుమంతుడు 'అమ్మా! సుగ్రీవుని సేనలో వానరులందరు నాతో సమానులుగానో, అధికులుగానో వున్నారు. వారు సులభంగా లంక చేరుకోగలరు. నీకు సందేహమే వద్దు. అవసరమైతే, రామలక్ష్మణులను నా వీపుపై ఎక్కించుకొని సముద్రాన్ని దాటి వస్తాను.' అని అన్నాడు.

సీత బదులు ఇస్తూ 'హనుమా రాముని కోసం మరొక సందేశం ఇస్తున్నాను. నా ముఖాలంకరణలు చెరిగిపోయినపుడు ఒక విప్రుని ధాతువుతో రాముడు నా చెక్కిళ్ళపై తాను పూసిన విషయాన్ని గుర్తుచేయి' అని అన్నది. హనుమంతుడు 'రాక్షసుల యదార్థ శక్తి ఏపాటిదో నిశ్చయిస్తే తప్ప నేను వచ్చిన కార్యం పూర్తి అయినట్లు కాదు. అందుచేత రావణునికి కోపం తెప్పించటానికై, ఈ అశోకవనాన్ని ధ్వంసం చేస్తాను. రాక్షస రాజు సైన్యాన్ని పంపుతాడు. ఆ సైన్యాన్ని నేను ధ్వంసం చేసిన తరువాత నేను రాముని వద్దకు తిరిగి వెళ్ళగలను' అని అనుకొన్నాడు. ఆ తర్వాత వృక్షాలను పెకలించాడు. కొలనులను కల్లోలితం చేయటం, పర్వతాలను నుగ్గు చేడ మొదలు పెట్టాడు. ఇలా అన్నింటిని ధ్వంసం చేసి ప్రవేశ ద్వారం వద్ద నిలబడ్డాడు. హనుమంతుని విధ్వంసం వల్ల ఏర్పడిన బీభత్సంతో కాపలా రాక్షస స్త్రీలే మేలుకొన్నారు. హనుమంతుని మహాకాయాన్ని చూచి, వారి గుండెలు పగిలాయి. వారు సీతను సమీపించి, 'ఇతడు ఎవరు? ఏమి పట్టుకున్నాడు?' అని ప్రశ్నించారు. అపుడు సీత 'ఎవరో నాకు తెలియదు. రాక్షసుడై ఉంటాడు. మీరూ రాక్షసులే కనుక మీరే తెలుసుకోండి. అతని మహాకాయాన్ని చూచి నాకూ భయం వేస్తోంది' అని పలికింది సీత.

కొందరు స్త్రీలువెళ్ళి రావణునికి ఈ విషయం ఇలా విన్నవించారు 'ఒక మహాకాయుడైన వానరుడు ఇక్కడికి వచ్చాడు. సీతతో మాట్లాడి, తరువాత ఆమె ఉన్న కొద్ది ప్రదేశాన్ని వదలి, మిగతా అశోక వనాన్నంతా ధ్వంసం చేశాడు. సీతను అడిగితే తనకు తెలియదన్నది' రావణుడు తక్షణమే ఆగ్రహించి, హనుమంతుని పట్టుకోవడానికి 80 వేల మంది భయంకర రాక్షసులను పంపాడు. సైనికులు సాయుధులై హనుమంతుని ఎదుటకు రాగా, హనుమంతుడు తన రూపాన్ని మరింత విస్తరించి, తన వాలాన్ని భీకరంగా ఝుళిపించ సాగాడు. దానివల్ల కలిగిన మహా శబ్దం లంకానగర మంతటా ప్రతిధ్వనించింది. అంతట హనుమంతుడు 'నేను శ్రీరాముని

బంటును. నేను తలచుకొంటే, వెయ్యిమంది రావణులను నిర్జించగలను.' అంటూ సవాలు చేశాడు. హనుమంతుడు గర్జించటంతో రాక్షసులు భయకంపితులైనారు. అయినా నలువైపుల నుండి, వారు హనుమంతునిపై దాడి ప్రారంభించారు. అయినప్పటికి, హనుమంతుడు ద్వారం వద్ద పడి వున్న ఒక ఇనుప గదను దొరకపుచ్చుకొని, గాలిలోకి ఎగురుతూ, రాక్షస సేననంతటిని సంహరించాడు. మిగిలిన కొద్దిమంది రాక్షసులు రావణుని వద్దకు వెళ్ళి మారణకాండను వివరించారు.

ఈ వార్తను వింటూనే రావణుడు కోపంతో జ్వలించాడు హనుమంతునితో పోరాడమని ప్రహస్తుని కుమారుడైన జంబుమాలి అనే వాణ్ణి ఆజ్ఞాపించాడు రావణుడు.

ఈలోగా హనుమంతుడు అశోకవనంలో ఉన్న రాక్షసుల సంరక్ష కులదైవం యొక్క మందిరాన్ని ధ్వంసం చేయసాగాడు. దానిని ముక్కలు ముక్కలుగా చేసి కూల్చగా, వ్యాపించిన ధ్వని లంకానగరం అంతా మారుమ్రోగింది. నా పేరు హనుమంతుడు. రాక్షసులు చూస్తుండగానే లంకా నగరాన్ని సర్వనాశనం చేస్తాను అని రంకెలు వేశాడు. ఆ ఆలయ రక్షక భటులు భయపడుతూనే ఆయుధాలతో హనుమంతుని చుట్టుముట్టారు. ఆలయ స్తంభాలతో అగ్ని రాజుకునేట్టు చేశాడు. రక్షకులు మరణించగా, ఆలయం అగ్నికీలల్లో చిక్కుకుంది. రాముడు, లక్ష్మణులకు జయం, జయం అంటూ హనుమంతుడు నినాదాలు చేశాడు. అంతటితో గార్ధభాలు లాగుతున్న రథంపై ప్రయాణిస్తూ జంబుమాలి రంగప్రవేశం చేశాడు. హనుమంతుని ముఖాన్ని, బాహువులను బాణాలతో కొట్టాడు జంబుమాలి. కోపించిన హనుమంతుడు ఒక పెద్ద శిలా ఖండాన్ని దొరకబుచ్చుకొని మహాశక్తితో జంబుమాలి పైకి విసిరాడు. అయితే జంబుమాలి తన బాణాలతో దానిని ముక్కలు చేశాడు. ఆ రాక్షసుడు ఐదు బాణాలతో హనుమంతుని బాహువులను, మరో పది బాణాలతోనూ, ఒక క్షిపణితోనూ అతని వక్షాన్ని ఛేదించాడు. అంతట హనుమంతుడు ఒక ఇనుప గను తీసికొని జంబుమాలి వక్షస్థలంపై కొట్టాడు. ఆ ఇనుప గద దెబ్బ ఎంతటిదంటే – అతని కాళ్ళు, తాను, రథం, గార్ధభాలు ఏవీ గుర్తించటానికి వీలు లేకుండా పోయాయి. జంబుమాలి మరణవార్త వినిన రావణుడు మరీ కోపించి, తన ప్రధాన సచివుని, ఏడుగురు పుత్రులను ఒక పెద్ద సైన్యంతోవెళ్ళి హనుమంతుని సంహరించమని ఆజ్ఞాపించాడు. ఆ రాక్షసులు రథాలలో వెళ్ళి శరపరంపర కురిపించటంతో ఒక్క క్షణం హనుమంతుడు వారికి కనిపించ లేదు. ఆకాశంలోకి ఎగిరి వారి దాడినుండి తప్పించుకొన్నాడు. ఆపై గర్జిస్తూ హనుమంతుడు తన బాహువులతోను, పాదాలతోనూ అసంఖ్యాక రాక్షసులను పడగొట్టి, మరికొందరిని తన నఖాలతో చీల్చివేశాడు. అతడు చేసిన గర్జనతో చాలమంది భయపడి పారిపోయారు. ప్రధాన సచివులు, ఏడుగురు రావణుని పుత్రులు వధించబడటంతో, తక్కినవారు కాలికి బుద్ధి చెప్పారు. హనుమంతుడు తోరణ ద్వారం దగ్గరకు వచ్చి ఇంకా ఎవరైనా వస్తారేమోనని ఎదురు చూచాడు. అంతట రావణుడు ఐదుగురు ప్రముఖ సేనాధిపతులతో భారీ సైన్యాన్ని ఇచ్చి, 'ఇతడు మామూలు వానరం కాదు. మహా శక్తిశాలి వలె ఉన్నాడు. అందుచేత మీరు అతనిని బంధించ గోరుతాను' అని అన్నాడు. ఆ తరువాత రాక్షస సేన హనుమంతుని నలువైపులా చుట్టుముట్టింది. ఒక సేనాధిపతి ఐదు బాణాలను వదలి హనుమంతుని ఫాలభాగాన్ని గాయపరచాడు. దానితో కుపితుడైన హనుమంతుడు అమితంగా శరీరాన్ని పెంచాడు. ఆకాశంలోకి ఎగిరి, దుర్ధరుని రథంపై దూకాడు. అతని మహాకాయ ప్రభావంతో దుర్ధరుడు, అశ్వాలు నుగ్గునుగ్గు అయి మరణించారు.

అతని మరణం చూచిన మిగతా ఇద్దరు సేనాధిపతులు విరూపాక్ష, యుపక్ష అనువారు గదాయుధాలతో హనుమంతుని వక్షస్థలంపై కొట్టారు. అపుడు హనుమంతుడు నేలపై వుండే ఒక పెద్ద వృక్షాన్ని పెకలించి, దానితో

ఆ ఇద్దరు సేనాధిపతులను సంహరించాడు. ఇక ప్రఘసుడు, భాసకర్ణుడు అనే ఇద్దరు సేనాధిపతులుహనుమంతుని ఎదుటకు వచ్చి ఒక శూలంతోను, క్షిపణితోను హనుమంతుని రక్తసిక్తం చేశారు. కోపించిన హనుమంతుడు ఒక పర్వత శిఖరాన్ని దానిపై వున్న జంతువుల, వృక్షాలతో సహా పెకలించి, దానితో ఆ ఇద్దరు సేనాధిపతులను గుజ్జుగా చేశాడు. ఐదుగురు సేనాధిపతులు మరణించడంతో, మిగిలిన సైన్యాన్ని సులభంగా నాశనం చేశాడు హనుమంతుడు. ఇలా అనేక మృతదేహాల్ని పోగుచేసి, మళ్ళీ తోరణ ద్వారం వద్ద నిలబడి వున్నాడు.

ఈ మారణకాండ వింటూనే, రావణుడు తన కుమారుడు అక్షునివైపు చూడగా, ఆ యువరాజు కదన కుతూహలంతో, ఎనిమిది గుర్రాలతో గాలిలో నడువగల మాయా రథాన్ని అధిరోహించాడు. అశోకవనాన్ని సమీపించగానే అక్షుడు హనుమంతునిపై శరవర్షం కురిపించ సాగాడు. వారిద్దరి మధ్య జరిగిన భీకర పోరాటంతో భూమి కంపించ సాగింది. గాలి వీయడం ఆగిపోయింది. సూర్యుడు మసకబారాడు. అక్షుడు వదలిన మూడు బాణాలు తన శిరస్సులో గుచ్చుకొనగా, హనుమంతుడు తన దేహాన్ని హెచ్చించ సాగాడు. రాక్షసుడు బాణాలు వదులుతూనే ఉన్నాడు. అక్షుడు గర్వంతో హనుమంతుని ముందుకు వచ్చాడు. వీని బాణాలు తగిలిన హనుమంతుడు ఉగ్రరూపుడై నింగికెగశాడు. బాణాలు వదులుతూ అక్షుడు వెంబడించాడు. హనుమంతుడు ఆకాశంలో ప్రయాణిస్తూనే బాణాలనుండి తప్పించుకొన్నాడు. అనుకోకుండా ఒక బాణం తన వక్షస్థలంలో గుచ్చుకొనగా, శత్రువు నైపుణ్యాన్ని మెచ్చుకొన్నాడు. కాని ఇతనిని నేను చంపకపోతే, నేను విజయం సాధించలేను. అందుచేత ఇతణ్ణి నేను వధించడం అవసరం అని అనుకొన్నాడు హనుమంతుడు. తన దేహాన్ని పెంచుతూ, ఒక్క చరుపుతో అక్షుని అశ్వాలన్నింటిని చంపివేయటమే గాక, రథాన్ని నేలకూల్చి ముక్కలు చేశాడు. అక్షుడు తన ధనస్సును, ఖడ్గాన్ని ధరించి, శిథిల రథం నుండి క్రిందికి దకి, స్వర్గానికి వెళుతున్న వాడిలా ఆకాశానికి అధిరోహించాడు. అయితే హనుమంతుడు అక్షుని కాళ్ళు పుచ్చుకున్నాడు చాకచక్యంగా. వానిని గిరగిర త్రిప్పి నేలకేసి కొట్టాడు. వాడు రక్తం కక్కుతూ మరణించాడు.

ఆకాశంలో నిలిచి చూస్తున్న దేవర్షులు హనుమంతుని విజయాన్ని గమనించి ఆశ్చర్యపడ్డారు ఇక రావణుని హృదయం భీతితో నిండిపోయింది. మళ్ళీ హనుమంతుడు తోరణ ద్వారం వద్ద నిలబడగా, రావణుడు తన జ్యేష్ఠ పుత్రుడైన ఇంద్రజిత్తును పిలిపించాడు. అతనితో 'నీవు మహా పరాక్రమశాలివి. బ్రహ్మదేవుని నుండి ఆయుధాలు పొందినవాడివి. నీవు ఇపుడు వెళ్ళి ఈ అంతు చిక్కని శత్రువును ఓడించుటకు చేయవలసిందేదో అన్నీ చేయి' అని అన్నాడు.

ఇంద్రజిత్తు తన రథంమీద హనుమంతుని ముందుకు వచ్చి ధనుష్టంకారం చేశాడు. అతను బాణాలను వర్షిస్తుండగా, హనుమంతుడు బిగ్గరగా గర్జించి, తన దేహాన్ని పెంచి దాడినుండి తప్పించుకోవడానికి ఆకాశంలోకి ఎగిరాడు. ఇద్దరి మధ్య జరిగిన పోరాటంలో హనుమంతుని ఛేదించే అవకాశం ఇంద్రజిత్తుకు లభించలేదు. హనుమంతుడు కూడా ఇంద్రజిత్తును పట్టుకోలేక పోయాడు. తన ఆయుధాలతో హనుమంతుని చంపలేనని గ్రహించిన ఇంద్రజిత్తు, హనుమంతుని బందీగా చేయాలని యోచించాడు. ఇంద్రజిత్తు ఒక మహా శక్తివంతమైన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించగా, హనుమంతుడు దానిచే బంధితుడై స్పృహ లేకుండా నేలపై పడిపోయాడు. ఒక ఆయుధ రూపంలో ఉన్న బ్రహ్మదేవుని చేత తాను బంధింపబడుతున్నానని హనుమంతుడు అర్థం చేసుకొన్నాడు. అయితే ఆ అస్త్రం తనకు తగిలిన కొద్దిసేపట్లోనే దాని ప్రభావాన్ని కోల్పోతుందని బ్రహ్మ ఇచ్చిన వరాన్ని ఆయన గుర్తు చేసుకొన్నాడు. అందువల్ల హనుమంతుడు 'ఇప్పుడైతే విముక్తం కాలేను. అయినా నేను భయపడు.

అపజయంగా భావించను. దానితో రావణుని ప్రత్యక్షంగా చూచే అవకాశం దొరుకుతుంది. ఇది మంచి అవకాశం. పైగా కొద్ది సేపట్లోనే అస్త్రం ప్రభావం క్షీణించగా, నన్ను నేనే విడిపించుకోగలను, సందేహం లేదు.' అని అనుకొన్నాడు హనుమంతుడు.

కొందరు రాక్షస యోధులు వచ్చి హనుమంతుని త్రాళ్ళతో బంధించారు. ఇలా చేయడంతో బ్రహ్మాస్త్ర శక్తి నిష్ఫలమై పోయింది. అయినా హనుమంతుడు తాను రావణుని చూడాలని ఉన్నాడు కనుక వారికి తనను బంధించే అవకాశం యిచ్చాడు. ఇంద్రజిత్తుకు ఈ విషయం అర్థమైంది. హనుమంతుడు విముక్తుడై కూడ నటిస్తున్నాడనే విషయం తెలుసుకొన్నాడు. ఆ అస్త్రాన్ని మరొకసారి ప్రయోగించ లేదు. ఇలా ఇంద్రజిత్తు ఆలోచిస్తుండగా, మిగిలిన రాక్షస యోధులు వీడు వానరుడుగా వున్నాడు. ఇతన్ని వెంటనే చంపేయండి. అల్పాహారంగా తిందాం.' అంటూ ఉత్సాహంగా చెప్పుకొంటూ, హనుమంతుని రావణుని ఎదుటకు మోసుకొని వచ్చారు. హనుమంతుడు రావణుని ఎదుట నిలిచి వున్నాడు. హనుమంతుని ప్రశ్నించమని మంత్రులను ఆదేశించాడు రావణుడు. వారి ప్రశ్నలకు సమాధానంగా హనుమంతుడు 'నేను వానరరాజైన సుగ్రీవుని దూతను. ఆయన మీకు శుభాకాంక్షలు తెలుపమన్నాడు. మీరు ధర్మబద్ధంగా రాజ్యం పాలిస్తున్నారని, అందుచేత మీ రాజ్యం అభివృద్ధిలో ఉన్నదని మహాత్ముడు సుగ్రీవుడు భావిస్తున్నాడు' అని చెప్పాడు.

అలా నయంగా మాట్లాడుతున్నాడే కాని హనుమంతుని మనసులో క్రౌర్యం అధికమవసాగింది. స్ఫటిక సింహాసనంపై ఆసీనుడై వున్న రాక్షస రాజును చూచిన హనుమంతుడు తన మనసులో 'ఇంతటి ఆకర్షణ, సమయస్ఫూర్తి, ధైర్యం, తేజస్సు, శారీరకంగా శుభలక్షణాలు కలిగియున్న రావణుడే ధర్మవిముఖుడై వుండకపోతే యశోధనుడై, భూమిపై దేవేంద్రుణ్ణి తలదన్నేవాడే గదా!' అని అనుకొన్నాడు.

అలాగే రావణుడు కూడ క్రుద్ధుడై వుండికూడా హనుమంతుణ్ణి చూచి సంశయంలో పడ్డాడు. 'ఇదివరలో తనను చూచి, నేను గేలిచేసినందుకు, నన్ను శపించిన శివుని వాహనమైన నందియా ఇతడు? లేక వానరరూపంలో వచ్చిన అసురరాజైన బాణాసురుడా?' అని అనుకొన్నాడు.

ఆ తర్వాత రావణుని ప్రధాన సచివుడు ప్రహస్తుడు 'నీవు ఇక్కడికి వచ్చిన నిజమైన కారణ మేమిటో చెపితే చాలు. నిన్ను వదలివేస్తాం.' అని హనుమంతునికి అభయమిచ్చాడు. దానికి హనుమంతుడు ఇలా జవాబు ఇచ్చాడు. 'నేను కేవలం రావణుని కలుసుకోవాలన్న కోరికతో మాత్రమే ఇక్కడికి వచ్చాను. నావంటి వానికి రాజదర్శనం దుర్లభమని తెలుసు. అందుచేతనే నేను లంకలో కోలాహలం సృష్టించాను. ఈ వినోద వనాన్ని ధ్వంసం చేశాను. ఎవరికి గాని హాని చేయాలనుకో లేదు. కాని రాక్షస యోధులు నాపై దాడి చేసినపుడు స్వీయరక్షణకై, వారిని వధింక తప్పలేదు. ఏ ఆయుధాలు గాని, త్రాళ్ళుగాని నన్ను బంధించ లేవు అనే వరం నేను బ్రహ్మ నుండి పొందాను. అందుకే ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం వృధా అయిపోయింది. కాని నేను ఇష్టపూర్వకంగానే బంధితుడనయ్యాను. తద్వారా రాక్షస సేన నన్ను బందీగా చేసి, రాజసభకు తీసికొని వస్తారని ఆశించాను. అన్నీ నాకు తెలుసు. మీరూ తెలుసుకోండి.' అని అన్నాడు. ఇంకా...

'ఇక నేను రావటానికి అసలు కారణ మేమిటో చెపుతాను వినండి. నాపేరు హనుమంతుడు. దశరథ పుత్రుడైన శ్రీరాముని దూతగా నన్ను ఇక్కడికి పంపారు. రాముని పత్ని సీతకోసం నేను ఎంతోకాలంగా అన్వేషిస్తున్నాను. నా అదృష్టం వల్ల ఆమెను ఇక్కడ కనుగొన్నాను. ఓ రాక్షసేంద్రా! రామలక్ష్మణుల శరాఘాతల

నుండి తప్పించుకోగల వారెవ్వరూ లేరని గ్రహించు. స్వయంభువు అయిన బ్రహ్మ, పరమశివుడు, దేవేంద్రుడు సైతం రణరంగంలో రాముని ఎదిరించి నిలువలేరు. ఓ రావణా! నీవు ధర్మ నియమాలను బాగా ఎరిగినవాడవని విన్నాను. వివేకి అయినవాడు ఎవడూ అధర్మాన్ని ఆచరించి వినాశాన్ని కోరి తెచ్చుకోడు. దయచేసి నా సలహా పాటించి, రామునికి సీతను అప్పగించు. గతంలో నీవు నీ ఉగ్ర తపస్సాధనల వల్ల మృత్యువు సంభవించకుండా చేసికో గలిగావని నాకు తెలుసు. అలాగే, నీవు సీతాపహరణం అనే అధార్మిక కృత్యంవల్ల నీకు వినాశమే జరుగుతుందని నీవు గ్రహించితే మంచిది. లంక మొత్తాన్ని నేనే సర్వనాశనం చేయగలను. కాని ఇక సమస్త విశ్వాన్ని సృష్టించి, లయంచేయగల శ్రీరాముని గురించి చెప్పేదేముంది చెప్పు.' అని చెప్పగా, రావణుని క్రోధం తీక్షణరూపం దాల్చింది. 'ఈ వానరుణ్ణి తక్షణమే వధించండి' అంటూ రావణుడు కేకవేశాడు.

కాని విభీషణుడు మృదుస్వరంతో 'అగ్రజా! దూతలను చంపటం భావ్యం కదు. నీవు నిజంగా గొప్ప విద్వాంసుడవు. కాని నీవు ఆగ్రహావేశానికి వశుడవైతే, నీ జ్ఞానమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది' అని సలహా ఇచ్చాడు. కాని రావణునికి ఆ సలహా నచ్చలేదు. దుష్కార్యం చేసిన వానిని చంపితే పాపం లేదు. వానిని చావనీయండి' అని కోపంతో అన్నాడు. అంతట హనుమంతుడు ఇలా అన్నాడు.'దూతను చంపవచ్చునని ఏ శాస్త్రాల్లోనూ లేదు. అంగవిచ్ఛేదం, కొరడా దెబ్బలు అనే శిక్షలు మాత్రమే ఉన్నాయి. ప్రియమైన రావణా! నాలాంటి ధీరోదాత్తుడు ఎన్నటికీ క్రోధానికి బలి కాకూడదు.' అన్నాడు. అంతట విభీషణుడు 'నీవు హనుమంతుని కాదు, అతనిని పంపిన వారిని చంపమని నా సలహా. నీమీద ప్రతీకారానికి సిద్ధమవుతున్నవారు రామలక్ష్మణులు. నీవు వారి మీదికి ఎందుకు సైన్యాన్ని పంపవు?' అని అన్నాడు. పవిత్రాత్ముడైన తన సోదరుని పలుకుల ప్రభావం వల్ల రావణుడు చివరకు సమ్మతించి, 'వానరులు తమతో కలహానికి ప్రాధాన్యం ఇస్తారు కనుక ఈ హనుమంతుని తోకకు నిప్పు అంటించి, పురవీథుల్లో ఊరేగించండి. ఆ తర్వాత మాడిపోయిన తోకతో ఇతన్ని తన దారిన పోనిచ్చి, అవమానం, బాధ పొందనియ్యండి' అని సేవకులతో అన్నాడు. ఈ ఆదేశం రావడంతో రాక్షసులు హనుమంతుని వాలానికి గుడ్డలు చుట్టి, దానికి నూనెను బాగా పట్టించారు. ఆ పనిలో వారు ఉండగా, హనుమంతుడు కోపంతో తన వాలాన్ని ఝళిపిస్తూ, వారిని బాదసాగాడు. అయినప్పటికీ రాక్షసలు వదలకుండా అతని తోకకు వస్త్రాలను చుట్టారు. నిజానికి హనుమంతుడు లంకానగర రక్షణ వ్యవస్థను పరిశీలించ దలచి వారు ఏమిచేసినా తనను బంధింపనిచ్చాడు. రాక్షసులు హనుమంతుని పురవీథుల గుండా ఈడ్చుకొంటూ పోతూ వుంటే, స్త్రీలు, పిల్లలు, పెద్దలు అందరూ వింతగా చూడటానికి బయటకు వచ్చారు. హనుమంతుని ఈ స్థితిని సీత కాపలా స్త్రీలు ఆమెతో చెప్పారు. సీత చాల బాధపడి అగ్నిదేవుని ఇలా ప్రార్థించింది. 'నేను భక్తిచేతను, తపస్సాధనల చేతను ఏదైనా పుణ్యం సంపాదించుకొని వుంటే, వాటి ప్రభావంతో ఇపుడు హనుమంతుని అగ్ని శీతల మగుగాక! అని ప్రార్థించింది. నగర శివారులకు తీసుకొని పోయిన రాక్షసులు, హనుమంతుని తోకకు నిప్పంటించారు. కాని, వాయువు, అగ్నిదేవుని దయలతో హనుమంతుని వాలానికున్న అగ్ని చల్లగా మారిపోసాగింది.

అపుడు హనుమంతుడు ఇలా అనుకొన్నాడు. 'ఇదేమిటి? అగ్ని జ్వాలలు ఇలా ఉండగా నన్ను కాల్చడం లేదేమిటి? ఇది రాముని ఆదేశం వల్లనో లేక సీత కరుణ వల్లనో ఇలా జరిగివుంటుంది.' అనుకొంటూ ఆశ్చర్యపడ్డాడు.

అంతట హనుమంతుడు 'శ్రీరామునిబంటునయిన నాకుఈ రాక్షసుల వల్ల అవమాన మేమిటి? జరిగింది చాలు' అనుకొంటూ క్షణంలో తన శరీరాన్ని కుదించుకొని, బంధనాల నుండి బయటపడ్డాడు. దాలిలోకిఎగిరి మహాకాయాన్ని ధరించి, ద్వారం వద్ద పడివున్న ఇనుప గదను తీసుకొన్నాడు. నేను రాముని వద్దకు తిరిగి

వెళ్ళేలోగా, నా ఈ అగ్నితో జ్వలించే వాలాన్ని ఉపయోగించి, మహానగరాన్ని అగ్ని కీలల్లో ఎందుకు ముంచెత్తకూడదు అనుకొన్న వెంటనే హనుమంతుడు ప్రధాన సచివుని ప్రసాదాగ్రంపైకి లంఘించి, దానికి నిప్పు పెట్టాడు. ఇలా ఒక ఇంటినుండి మరొక ఇంటిపైకి దూకుతూ, నిప్పు అంటించడం కొనసాగించాడు. కాని పవిత్రమూర్తియైన విభీషణుని ప్రాసాదాన్ని ఆ అగ్ని దహించ లేదు. కారణం గ్రహించి దానిని వదలిపెట్టాడు. ఇలా మహానగర మంతా అగ్ని జ్వాలల్లో మండిపోతోంది. రావణుని ప్రసాదంతోసహా అన్ని ప్రాసాదాల్లోనికి హనుమంతుడు ప్రవేశించాడు. మంటలు అదుపు తప్పడంతో భవనాలు అన్నీ కూలిపోయాయి. అగ్ని ప్రవాహం వలె వీథుల్లోనికి ప్రవహించ సాగింది. ఇలా రథాలు, అశ్వాలు, గజాలు, పక్షుల ఆర్తనాదాలతో తీవ్రస్థాయికి చేరాయి. అగ్ని జ్వలిసూత, జగత్తుకు విలయం వచ్చిందా అనిపించేంత దారుణంగా ఉంది. నగరవాసులు వానర రూపంలో అగ్నిదేవుడు మనల్ని నాశనం చేస్తున్నాడా అని అనుకోసాగారు. నగరమంతా చుట్టివచ్చిన హనుమంతుడు ఈ రాక్షస విధ్వంసాన్ని చూచి సంతృప్తి చెందాడు. సముద్రం దగ్గరకు వెళ్ళి, తన వాలాన్ని చల్లార్చుకున్నాడు. ఇక రాముని వద్దకు వెళ్ళటం గురించి ఆలోచించసాగాడు. మరణిస్తున్న రాక్షస ఆర్తనాదాలు మిన్నుముట్టగా, హనుమంతుడు ఒక అనుమానం కలిగింది. నేను చేసిన ఈ పనితో సీత కూడ మరణించి వుండవచ్చు కదా! కోపం ఎంతటిదో తెలుసుకొన్నాడు. కోపంతో చెడు కార్యాలు చేస్తాడు. తన గురువులను, తల్లిదండ్రులను కూడ హత్యచేస్తాడు. మహాత్ములను అవమానిస్తాడు. కోపాన్ని అదుపులో పెట్టుకోగలిగినవాడే మానవుడిగా పరిగణింప బడతాడు. నా ఈ కార్యం వల్ల సీతకు హాని జరిగితే, అది రామునికి జరిగినట్లే. అపుడు నా ప్రాణాల్ని త్యజించాల్సి ఉంటుంది. నా ఈ వానర మూర్ఖ స్వభావం చాల హేయమైనది ఆవేశపూరిత చర్యలు సదా అనార్థదాయకాలే. సీత మరణిస్తే, రాముడు ఆయన సోదరులందరూ మరణిస్తారు. ఇలా నేను సమస్త విశ్వం యొక్క వినాశనానికి హేతుభూతుడ నవుతాను.' అని అనుకొన్నాడు హనుమంతుడు. హనుమంతుడు మనస్సులోనే సీతకు ప్రణామం చేసుకొని, వెంటనే అశోకవనానికి వెళ్ళి, సీత క్షేమంగా వుండడం చూసి, ఆమె వద్ద శలవు తీసుకొని తన కోసం వేచివున్న వానరులను కలుసుకోవాలని మరల సముద్ర లంఘనం చేసి, తనవారిని చేరుకొన్నాడు.

వారందరు హనుమంతుని విజయవార్త తెలుసుకొని, ఆలస్యంగానైనా విజయం సాధించి వచ్చిన వార్త తెలిసిన తర్వాత, ఆ వివరాలు చెప్పమని కోరారు. హనుమంతుడు మనస్సులోనే సీతకు ప్రణామం చేసుకొని, లంక యాత్ర వివరాలు, సీతను కనుగొన్న విధానం, రావణుడు తనను పట్టి వధించబోగా విభీషణుడు అడ్డుకోవడం, తన వాలానికి నిప్పుపెట్టడం, నగరాన్ని ధ్వంసం చేయటం, సవివరంగా వర్ణించి చెప్పాడు. ఇలా అన్నాడు. 'సీత రాక్షస స్త్రీల నడుమ దుర్భర జీవితం అనుభవిస్తోంది. రావణుడు తన సర్వస్వాన్ని ఆమెకు అర్పిస్తానన్నా కూడా, సీత తృణీకరించింది. రాముని ధ్యానమే సీతను జీవింప చేస్తోంది. కనుక శీఘ్రమే ఆమెను కాపాడకపోతే, ఆమెమరణించడం తథ్యం. అందుచేత మనం వెంటనే లంకపై దాడిచేసి, సీతను తెచ్చి రామునికి అప్పగిద్దాం. నేనొక్కడినే రాక్షసులనందరినీ సంహరించ గలను. అంగదుడు కూడా అలాంటి సమర్థుడే. సీతను మనం రక్షించి, తీసికొనివస్తే, రాముడు ఎంత సంతోషిస్తాడో గదా! నేను సీతను నా వీపు మీద మోసుకొని తెచ్చేవాడినే కాని నాకు అనుమతి లేనందున నేను ఆ పని చేయలదని తెలుసుకోండి.' అంటూ ముగించాడు.

అప్పుడు అంగదుడు 'ఒకప్పుడు బ్రహ్మదేవుడు అశ్వనీ కుమారుల మీద ఉన్న గౌరవంతో వారి కుమారులైన మైందునికి, ద్వివిదునికి ఏ యుద్ధంలోనూ మరణించకుండా ఉండేలా వరమిచ్చాడు. ఆ కారణంగా, వానరులు

అందరూ దేవతల సైన్యాన్నంతటిని పరాజయంపాలు చేసి బలవంతంగా వారి అమృతాన్ని త్రాగగలిగారు. వీరు రావణుని సులభంగానే జయించగలరనుకుంటాను. వీరిపుడు మనతోనే ఉన్నందున, మనం లంకపై దాడిచేసి సీతను రక్షించిన తర్వాతనే రాముని వద్దకు తిరిగి వెళ్ళాలనే ప్రతిపాదనకు అంగీకరిస్తున్నాను' అని అన్నాడు.

అందుకు జాంబవంతుడు 'ఓ యువరాజా! నీ ఆలోచనలో వివేకం లేదు. నిన్ను సీత జాడను కనుగొనమనియే ఆదేశించారు కాని ఆమెను స్వాధీనం చేసుకోవడానికి కాదు అనే విషయం నీవు మరచి పోతున్నావు. ఒకవేళ మనం జయించినా, రాముడు సంతృప్తి చెందడని నా నమ్మకం. ఎందుకంటే, రావణుని తాను సంహరించి, సీతను స్వాధీనం చేసుకొంటానని వానరులందరి ఎదుట ఆయన శపథం చేసి వున్నాడు.' అని అన్నాడు.

జాంబవంతుని ఈ సలహాను అంగదుడు, హనుమంతుడు, ఇతర వానర ప్రముఖులు సమ్మతించారు. ఇక ఆలస్యం చేయకుండా, వారు కిష్కింధకు బయలుదేరారు. మార్గమధ్యంలో సుగ్రీవుని మధువనం అనే దివ్య వనానికి చేరారు. మధుపానం చేయాలన్న ఉత్సాహంతో వారు అంగదుణ్ణి కొంచెం ఆగమని అభ్యర్థించారు. వానరులు తనివితీరా ఆహారాదులను స్వీకరించారు ఆ వనంలో. మైకంలో వారు ఒళ్ళు మరచారు. యథేచ్ఛగా క్రీడావిహారం చేసి, ఆ వనాన్ని ధ్వంసం చేశారు. దీనితో వనసంరక్షకులైన దధిముఖుడు అనేవాడు చాల కోపిరాఙడు. అతడు వానరులను అడ్డగించబోగా, వానరులు అతనిని దూషించసాగారు. దధిముఖుడు వనసంరక్షణ కోరి, ఎన్నో రకాలుగా వానరులను సంతృప్తి పరచసాగాడు. కాని మధించిన వానరులు రెచ్చిపోయారు.

నిజానికి హనుమంతుడు 'మీ ఇష్టం వచ్చినట్లు అనుభవించండి. మిమ్మల్ని అడ్డుకునే వాళ్ళను నేను అదుపు చేస్తాను.' అంటూ వానరులు ప్రోత్సహించాడు. అంగదుడు కూడ అదే మాట అన్నాడు. దానితో వానరులు ఎంత చేయాలో అంతా చేశారు వనాన్ని ఖాళీ చేశారు. తరువాత దధిముఖుణ్ణి వదలివేసి, వానరులు మధుపాన కార్యాల్లో మునిగి తేలారు. కొందరు సోమరులైనారు. కొందరు ఆకతాయిలైనారు. వీరి విధ్వంస కాండను అరికడతానని పర్యవేక్షకుడు కావలివారికి హామీ ఇచ్చాడు. కాని వాళ్ళను హనుమంతుడు, వానరులు ఎదుర్కొనేదుకు సిద్ధమైనారు. అంగదుడు కూడ మైకంలో తన తాత వరుస అయిన దధిముఖుణ్ణి కూడ చితకబాదాడు.

చివరకు, దధిముఖుణ్ణి వదలిపెట్టగా, అతడు కావలివాళ్ళను తీసికొని సుగ్రీవుని కలవడానికి వెళ్ళాడు. అలా దధిముఖుడు కిష్కింధకు చేరి సుగ్రీవుని పాదాలకు ప్రణామం చేయగా, రాజు అతని ఆందోళనను గమనించాడు అపుడు దధిముఖుడు, అంగదుడు, అతని అనుచరుల యొక్క ఆగడాలను గురించి వివరించాడు. అసలు విషయ మేమిటో తెలుసుకొందామని లక్ష్మణుడు రాగా సుగ్రీవుడు అతనితో 'అంగదుడు, అతని అనుచరులు ఇప్పుడు మధువనంలో ఉన్నారు. హనుమంతుడు సీత జాడ కనిపెట్టే ఉంటాడని చూచాయగా చెప్పగలను. లేకపోతే ఈ వానరులు ఇంత కల్లోలం చేయరు' అని అన్నాడు. ఈ మాటలు విన్న రామలక్ష్మణులు ఉత్సాహభరితులైనారు. అలాగే సుగ్రీవుడు కూడ సంతోషంతో దధిముఖునితో 'నీ ఆరోపణలో నాకు శుభవార్త అందుతోంది. అందుచే ఈ వానరుల ఆగడాలను సహిస్తున్నాను. కనుక నీవు మధువనానికి తిరిగివెళ్ళి, అంగదుణ్ణి, ఇతర వానరులను నేను వెంటనే రమ్మన్నానని చెప్పు.' అని అన్నాడు. ఆ ఆజ్ఞను శిరసావహిస్తూ, దధిముఖుడు ఆకాశంలోనికి ఎగిరాడు. మధువనం చేరేసరికి, వానరులు తాము మద్యం ప్రభావంనుండి బయటపడి మామూలు స్థితికి వచ్చినట్లు గమనించాడు. దధిముఖుడు అంతట అంగదుణ్ణి సమీపించి, 'ఓ రాకుమారా! నిన్ను, నీ అనుచరులను ఈ

వనంలో యథేచ్ఛగా తిరగనివ్వకుండా అడ్డుకున్నందుకు మన్నించు. మీ పినతండ్రి మీ రాకకు సంతోషించి, మిమ్మల్ని వెంటనే తనవద్దకు రావాలని కోరుతన్నాడు' అని చెప్పాడు. అపుడు అంగదుడు సహచరుల వైపు తిరిగి 'మనం వెంటనే కిష్కింధకు వెళ్ళాలి. నేను యువరాజునైనా, నేను మీకంటే గొప్పవాడినని అనుకోవడం లేదు. మీరెలా చెప్తే, అలా చేస్తాను' అని అన్నాడు. ఈ మాటలకు సంతోషించిన వానరులు 'ఓ యువరాజా! నీ మంచితనం మాకు తెలియనిదా. నీ యోగ్యతే నీ గొప్పదనం. మనకోసం రాముడు, లక్ష్మణుడు వేయికళ్ళతో ఎదురు చేస్తున్నారు. కనుక వెంటనే బయలుదేరుదాం' అని అన్నాడు.

దూరాన వానరులు వస్తున్నట్లు చూచి సుగ్రీవుడు, దుఃఖంతో వున్న రాముని వద్దకు వెళ్ళి, 'అంగదుడు వచ్చాడు. విజయంతోనే తిరిగి వస్తారని నాకు తెలుసు. సీత జాడ కనిపెట్టినందుననే ఆ మధువనాన్ని వాళ్ళు ధ్వంసం చేశారు. ఇలా కొద్ది సేపట్లోనే, అంగదుని బృందం అంతా రాముని సమక్షానికి చేరారు. హనుమంతుడు ఇలా ప్రకటించాడు. 'సీత క్షేమంగా ఉంది. రావణుడు ఎన్ని కుట్రలు చేసినా ఆమె తన పాతివ్రత్యాన్ని కాపాడుకొంది' అని చెప్తుండగా, రాముడు ప్రేమపూరిత నేత్రాలతో హనుమంతుణ్ణి చూస్తున్నాడు. వానరులందరు సుగ్రీవునికి, రామలక్ష్మణులకు ప్రణామాలు చేశారు. వానరులందరూ అదే విషయాన్ని చెప్పారు. అది అలా ముగిసిన పిదప రాముడు 'రావణుని నివాసం ఖచ్చితంగా ఎక్కడ ఉందో నాకు నివేదించండి. సీతను గురించి మరింత చెప్పండి. నా గురించి ఆమె ఏమనుకొంటోంది?' అని అన్నాడు. అందుకు సాధికారంగా సమాధానం ఇవ్వమని వానరులందరు హనుమంతుణ్ణి ముందుకు తోశారు. దక్షిణ దిక్కుకు నమస్కారం చేసి, సీతను కనుగొనటానికై దారితీసిన సన్నివేశల నన్నింటిని వివరంగా చెప్పాడు. అంతట సీత ఇచ్చిన చూడామణిని రామునికిస్తూ 'జనరకాజ పుత్రిక భక్తి అంతా నీమీదే స్థిరంగా ఉంది. నీ వియోగంలో ఆమె జీవితం దుర్భరమైంది' అని చెప్పాడు. అంతట, హనుమంతుడు సీత సందేశాలను వినిపించాడు. నెలలోపు రాముడు రాకుంటే, తాను ప్రాణత్యాగం చేస్తానని చివరి మాటలుగా చెప్పాడు. రాముడు అన్నీవింటూనే, సీత పంపిన చూడామణిని తన హృదయానికి హత్తుకున్నాడు. రామలక్ష్మణులు నిరంతరాయంగా కన్నీరు కార్చారు. 'ఈ చూడామణిని మా వివాహ సమయంలో సీతకు ఆమె తండ్రి బహూకరించాడు. జనక మహారాజు చేసిన యజ్ఞాలు సంతుష్టుడై దేవేంద్రుడు ఈ మణిని ప్రసాదించాడు. ఓ హనుమా! నేను దుఃఖతప్తుడనై సీత వియోగంలో అచేతనుణ్ణి అయిపోయాను. దయచేసి సీత చెప్పిన సందేశాలను మరొక్కసారి నాకు వినిపించు. అవి నా శిరస్సుపై శీతల పానీయాల్లా పనిచేస్తాయి.' అని అన్నాడు రాముడు. అందుకు హనుమంతుడు 'ఇంద్రుని కుమారైన జయంతణ్ణి నీవు మందలించిన వృత్తాంతాన్ని చెప్పిన సీత 'రాముడు అపరిమిత శక్తివంతుడు, అజేయుడు ఐనప్పటికీ నన్ను రక్షింటానికి ఇక్కడికి రావడం లేదు. ఇది నా గత జన్మ పాపఫలమేమో' అని అన్నది. నేను సీతను నా వీపుపై తీసికొని పోతాను అని చెప్పాను. కాని పరపురుషుణ్ణి స్పర్శించటానికి ఇష్టం లేనందున ఆమె తిరస్కరించింది. నన్ను రక్షించడానికి రాముడే రావాలి అని గట్టిగా చెప్పు. రాముడు, లక్ష్మణుడు, వానరులు సముద్రాన్ని ఎలా దాటగలరు? నీవు రావణుని వధించ గలవని నాకు తెలుసు. కాని రాముడే స్వయంగా వచ్చి రావణుని సంహరించి, నన్ను తోడ్కొని పోతేనే రాముని యశస్సుకు మరింత వన్నె వస్తుంది. నేను లంకకు వచ్చిన రీతిలో కిష్కింధకు వెళ్ళాలని కోరుకోవడం లేదు.' అని సీత చెప్పింది. అపుడు హనుమంతుడు 'నాకంటే ఘనులైన వానరులున్నారు. లంకకు సులభంగా రాగలమని ధైర్యం చెప్పాను. నేను మిమ్మల్ని, లక్ష్మణుని కూడ నా వీపుపై తీసికొని రాగలనని ధైర్యం చెప్పాను. కాని ఆమె ప్రస్తుతం ఉన్న దీన పరిస్థితి నుండి విముక్తించటానికి ఆలస్యం లేకుండా మనం లంకపై దాడిచేయడానికి తగిన మార్గం ఏదైనా శీఘ్రమే ఆలోచించాల్సి ఉంది అని అభ్యర్థిస్తున్నాను.' అంటూ ముగించాడు.

**-ః సుందరకాండసమాప్తం ః-**

ఓం

# శ్రీరామ కథామృతం - యుద్ధకాండం

హనుమంతుడు సాధించిన విజయ పరంపరలను విని రాముడు పరమానందభరితుడైనాడు. రాముడు ఇలా ప్రస్తుతించాడు.'గరుత్మంతుడు తప్ప మరెవవరూ నీవు చేసిన సాహసం చేయలేరు. యజమాని అప్పగించిన కర్తవ్యాన్ని ఎక్కువగా సాధించేందుకు ఉత్తమ సేవకుడు, యజమాని చెప్పిన మేరకే సమర్థవంతంగా చేసి, మించి చేయనివాడు మధ్యస్థుడు, సమర్థత ఉండి కూడ యజమాని ఆజ్ఞలను పాటించనివాడు అథమాథము సేవకుడు, హనుమా! నీవు సీత జాడను కనిపెట్టుటయే కాదు, ఆమెకు మిక్కిలి సాంత్వన చేకూర్చావు. నీవు లంకానగరాన్ని అంతటిని చూచి, రాక్షస యోధుల సామర్థ్యమేమిటో పరీక్షించి, రావణుని గుండెలో భయం సృష్టించావు. నిజానికి నీ సేవ వల్లనే ఇప్పటివరకు నా ప్రాణం నిలిచింది. నీకు ఉచిత బహుమతి ఇవ్వలేకపోవటం నాకు బాధ కలిగిస్తోంది. ప్రవాస జీవితంలో వున్న నేను నీకు ఏమీ ఇవ్వ లేను, నీ సేవలకు ప్రతిఫలంగా నా ఆలింగనాన్ని మాత్రమే ఇవ్వగలను' ఈ మాటలంటూ రాముడు హనుమంతుని ప్రేమాదరాలతో ఆలింగనం చేసుకొన్నాడు.

అంతట రాముడు సుగ్రీవునితో 'సీతను కనుగొన్నాడు. కాని వానరులు సముద్రాన్ని ఎలా దాటగలరు? మన కృషి నిష్ఫలమేనా?' అని, మౌనంగా ఆలోచిస్తున్నాడు. అపుడు సుగ్రీవుడు 'నా స్వామీ! నీవు దుఃఖాన్ని విడిచి పెట్టాలి. రాక్షసులతో యుద్ధం నాకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ వానర శ్రేష్ఠులు అందుకు సమర్థులే. వానరులు లంక చేరుకోగలిగితే, విజయం మనదే.' అని అన్నాడు. అపుడు రాముడు హనుమంతునితో 'హనుమా! నేను నా యోగశక్తితో సముద్రాన్ని సులభంగానే దాటగలను. అనుకొంటే శుష్కింప జేయగలను. అందువల్ల నీవు లంకలోని రక్షణ వ్యవస్థ సమాచారమంతా నాకు వివరించి చెప్పు' అని అన్నాడు. అపుడు హనుమంతుడు ఇలా చెప్పాడు. 'లంకకు నాలుగు రకాలైన రక్షణ వ్యవస్థ ఉంది. మొదటి రక్షణ వ్యవస్థ ప్రకృతిసిద్ధమైంది అనగా సముద్రం చేత చుట్టబడి, అరణ్యాల చేత పరివేష్ఠించబడి, మహోన్నత పర్వతాగ్రం మీద ఆ నగరం నెలకొని ఉంది. రెండవది దుర్గ వ్యవస్థ. ఎత్తైన స్వర్ణమయ ప్రాకారాలు లంకను పరివేష్ఠించి ఉంటాయి. వాటికి నలుగు దిక్కులలో నాలుగు ద్వారాలున్నాయి. ప్రతి ద్వారం వద్ద భారీ తోట ఏర్పరచబడి వుంది. ప్రాకారాల చుట్టూ విశాలమైన కందకాలున్నాయి. ఈ కందకాలపైన నాలుగు ద్వారాలకు దారితీసే వంతెనలు ఉన్నాయి. నేను లంకాదహనం చేసినపుడు ఈ వంతెనలన్నింటిని ధ్వంసం చేసి, ప్రాకారాలను కూల్చివేశాను. ప్రియమైన రామా! మహాయోధులైనటువంటి అంగదుడు, ద్వివిదుడు, మైందుడు, జాంబవంతుడు, నీలుడు, పనసుడు మరియు నేను మాత్రమే లంకకు లంఘించి వెళ్ళాలని నా సూచన. మొత్తం వానర సేన సముద్రం దాటించకుండా, మేము రావణుని జయించగలం' అని చెప్పగా, రాముడు 'నేను స్వయంగా వెళ్ళి లంకను నాశనం చేయాలనేది నా శపథం' అని బదులు చెప్పాడు.

ఇలా చెపుతూ రాముడు సుగ్రీవునితో 'సూర్యుడు ఇపుడు నడినెత్తిన ఉన్నాడు. శుభముహూర్తం. మన కార్యక్రమాలు ప్రారంభించడానికి అనువైనది ఇదే. అందువల్ల వెంటనే వానరులను సమావేశ పరిస్తే, తక్షణమే లంకకు మన జైత్రయాత్ర సాగించవచ్చు' అని అన్నాడు. అందుకు లక్ష్మణ సుగ్రీవులు ఆనందించారు. కొద్ది క్షణాల్లోనే వానర సమూహమంతా వచ్చేసింది. అపుడు రాముడు నీలునితో 'నీవు సేనకు అగ్రభాగాన ఉండు.

నీతో కొందరు వీరులను తీసికొని వెళ్ళు. నలుదిక్కులకుపంపు. మనం చేయబోయే యుద్ధం తీవ్రమైనది. కనుక బలహీన వానరులను ఇక్కడే వదలివేయి.' అని ఆదేశించాడు.

అంతట రాముడు సేన మధ్యభాగంలో హనుమంతుని భుజాల మీద తాను, అంగదుని భుజాల మీద లక్ష్మణుడు నిలిచి ఉండేలా వ్యూహాన్ని రచించాడు. సుగ్రీవుడు రాముని ఆదేశాలను సేనకు అందించాడు. యోధులందరూ దక్షిణ దిక్కుగా బయలుదేరారు. శక్తిశాలురైన, ధైర్యవంతులైన వానర శ్రేష్ఠులు గర్జిస్తూ, కేకలు వేస్తూ, రకరకాల చేష్టలతో ముందుకు సాగారు. కదనోత్సాహంతో వానరులు అనేకమైన కుతూహల చేష్టలు ప్రదర్శించ సాగారు. అపుడు లక్ష్మణుడు రామునితో 'మన చుట్టూ శుభ చిహ్నాలే కనిపిస్తున్నాయి. మంద పవనం, మృగాల మధురస్వరాలు, నిజానికి ఈ భూతలమే ప్రశాంతిలో ఉన్నట్లు కన్పిస్తోంది. పైన సూర్యుని విశేష దీప్తి' అని అన్నాడు.

సైన్యం అహోరాత్రులు ప్రయాణించి అరణ్యాల్లో చిత్ర విచిత్ర చేష్టలు చేశారు. చివరకు రాముడు మహేంద్ర పర్వతం వద్దకు చేరి దాని శిఖరాన్ని అధిరోహించాడు. క్రిందికి చూడగా సైన్యం ముందుకు సాగింది. కొద్దిసేపట్లోనే వారందరు సముద్ర తీరానికి చేరుకున్నారు. అపుడు రాముడు సుగ్రీవునితో 'మనం సముద్రం దాటే ఉపాయం చేయి. వానరులను ఇక్కడే ఉండనివ్వు. మనం ముందు లంకకు చేరి తర్వాత ఏదో ఉపాయాన్ని ఆలోచిద్దాం' అని చెప్పాడు. దానవులకు ఆశ్రయంగా వున్న ఆ మహానగరాన్ని సుగ్రీవుడు చూచాడు. భీకర జలాలతో, జలచరాలతో నిండిన సముద్రాన్ని సైనికులు తిలకించారు. అవతలి తీరాన లంకను అపార జలనిధిని వానరులు చూచారు.

విశ్రాంతిగా కూర్చొని ఉన్న లక్ష్మణునితో రాముడు 'లక్ష్మణా! కాలం గడిచే కొద్దీ, సీతకు ఇవ్వబడిన వ్యవధి తగ్గిపోతోంది. బాధగా ఉంది. రావణుని సంహరించి, సీతను రక్షించే సమయం కోసం నా హృదయం తొందరచేస్తోంది.' ఇలా తన వేదనను రాముడు లక్ష్మణునికి వెళ్ళబోసుకుంటూ ఉండగా సూర్యాస్తమయం అయింది.

అటు రావణుడు హనుమంతుని పరాక్రమాన్ని చూచిన వాడగుటచే, రాక్షస ప్రముఖులను సమావేశ పరచాడు. రావణుడు వారితో ఇలా అన్నాడు. 'గొప్పదైన లంకానగరం ఛిన్నాభిన్నం చేయబడింది. నా ప్రాసాదాలు శిథిలమైనాయి. రాక్షస యోధులెందరో మరణించారు. మంచి సలహాల కోసమే మిమ్మల్ని పిలిచాను. ఈ లోకంలో మూడు రకాల వ్యక్తులుంటారు. ఏ చర్య తీసికొనే ముందు వివేకి అయిన వ్యక్తి, పెద్దల, మిత్రుల సలహాలు తీసికొంటాడు. ఆపైన దైవం మీద భారం వేసి, తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తాడు. మధ్యముడైన వ్యక్తి తనకు తానే ఆలోచించి, అన్ని విధాలుగా పరిశీలించి, దానికి అనుగుణంగా వ్యవహరిస్తాడు. ఇక అధముడు దేవుని మీద విశ్వాసం విసర్జించి, తనకు ఏది తోస్తే అదే చేసేస్తూ తనకు హానికరము, శ్రేయోదాయకము అనే ఆలోచన లేకుండా కార్యాన్ని నిర్వర్తిస్తాడు. ఫలితాన్ని లెక్కచేయడు. సలహా కూడా మూడు రకాలు. ధర్మసూత్రాలకు అనుగుణంగా ఇవ్వబడేది మంచి సలహా. స్వప్రయోజనానికి ప్రాధాన్యత నిచ్చేది మధ్య రకం. ముఖస్తుతి కోసం ఇచ్చేది చెడు సలహా. రాముడు త్వరలోనే లంక మీద దాడి చేస్తాడు. సులభగానే సముద్రాన్ని దాటగలడు. కనుక ప్రియ రాక్షస ప్రముఖులారా! మీ సలహాతో మన సంక్షేమం భద్రంగా ఉండాలని నేను ఆశిస్తున్నాను.' అని అడిగాడు.

రాక్షసులు రాముని పరాక్రమం తెలియనివారు. రాజులంటే భయపడకూడదనుకునే వారు. 'రాజా! నీకు భయమెందుకు? వారినందరిని పరాజితుల్ని చేయగల సమర్థుడవు. ఆరోజు కుబేరుణ్ణే జయించావు. ఆ మయ దానవుడు తన కుమార్తె మండోదరిని నీకు అప్పగించలేదా? నీవు హాయిగా ఉండు. వాళ్ళు సముద్రం దాటి రాకముందే, ఇంద్రజిత్తు వారినందరిని నాశనం చేస్తాడు. ఇంద్రజిత్తు దేవేంద్రుణ్ణి లంకలో బందీగా ఉంచలేదా? బ్రహ్మ దేవుని వల్లనే మళ్ళీ ఇంద్రుడు స్వర్గాధిపతి అయినాడు.' అని అన్నారు.

సేనాధిపతియైన ప్రహస్తుడు 'మనం దేవతలను, దానవులను, గంధర్వులను, పిశాచులను జయించిన వాళ్ళం. ఈ వానరులు మనముందు ఎంతటివారు?' అని అన్నాడు. మరో రాక్షస ప్రముఖుడు దుర్ముఖుడు లేచి 'నేను ఈ వానరులందరిని చంపి, ప్రపంచాన్ని వానరముక్తం చేస్తాను.' అని ప్రకటించాడు. వజ్రదంష్ట్రుడనే రాక్షసుడు లేచి 'నేను ఈ వెధవ వానరులను కాదు, రామలక్ష్మణులనే చంపుతాను. అనుమతివ్వండి' అని అన్నాడు.మరో ముఖ్యుడు వజ్రహనుడు అనేవాడు 'నేను రామలక్ష్మణులను, వానరుల నందరినీ చూసుకొంటాను. నీవు హాయిగా మద్యం సేవిస్తూ సుఖం అనుభవించు' అని అన్నాడు. ఇలా అందరూ ప్రగల్భాలు పలికి రావణునికి ధైర్యం కలిగించ ప్రయత్నించారు. కాని పవిత్రాత్ముడైన విభీషణుడు 'ప్రియ సోదరా! మూడు ఉపాయాలు విఫలమైతేనే దండోపాయం చేపట్టాలి. అదికూడా దైవోపహతుల మీదనే సఫలమౌతుంది. రాముని విషయానికి వస్తే, అతడు ధార్మికుడు, అత్యంత శక్తివంతుడు. సీతాపహరణమే ఈ దుస్థితికి మూలహేతువు. రాముని బాణాలు ఈ లంకను, లంకావాసులను సర్వనాశనం చేసేలోగానే, నీవు సీతను రామునికి అప్పగించాలి.' అని అన్నాడు. విభీషణుని హితవాక్కులు రుచించక, రావణుడు సభను ముగించి అంతఃపురానికి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు ఉదయం సింహాసనం అధిష్ఠించి, బ్రాహ్మణుల ప్రార్థనలను ఆలకిస్తూ వున్న సమంలో విభీషణుడు అతని ఎదుటకు వచ్చాడు. అతడు రావణునితో 'ప్రియ అగ్రజా! నీవు సీతను అపహరించినప్పటి నుండి ఎన్నో దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. అన్నింటినీ మించి, నగరంపై రాబందులు సంచరిస్తున్నాయి. ఉద్యానవనాల్లో సర్పాలు సంచరిస్తున్నాయి. ఆడ నక్కలు ఊళపెడుతున్నాయి. నీవు ఆమెను అపహరించటం చేతనే ఇలా జరుగుతోంది. రావణా! నీవు వెంటనే ఆమెను రామునికి అప్పగించు. సచివులంతా నీకు భయపడి పొగడ్తలతో ముంచెత్తారు. కాని నేను నిజాయితీగా ప్రార్థిస్తున్నాను.' అని అన్నాడు.

ఇన్ని హితబోధలు విన్న రావణుడు 'నేను రామునికి గాని, మరెవరికి గాని భయపడను. నేను తిరిగి అప్పగించను. తమ్ముడూ! నీవింక నీ పని చూచుకో.' అని గట్టిగా మందలించాడు. రావణుని కామవాంఛ వల్ల అందరు హీనంగా చూడసాగారు. ఏ క్షణంలోనైనా యుద్ధాన్ని ఎదుర్కోటానికి, రావణుడు సేనాధిపతులకు తగిన ఆదేశాలు ఇచ్చాడు. తాను రథంపై వచ్చి తన సేనాధిపతితో 'ప్రహస్తా! నీవు నగరాన్ని లోపలనుండి, వెలుపల నుండి రక్షించుటకు తగిన సైన్యాన్ని సిద్ధం చేయి' అని అన్నాడు. ప్రహస్తుడు పర్యవేక్షణకై అక్కడనుండి నిష్క్రమించాడు.

రావణుడు సభనుద్దేశించి, ఇలా ప్రసంగించ సాగాడు. 'నా ప్రియ రాక్షసులారా! ఆరు నెలలు నిద్రించి కుంభకర్ణుడు ఈనాడు అనుగ్రహిస్తున్నాడని చెప్పడానికి సంతోషంగా ఉంది. నా పరిస్థితి మీకు తెలుసు. సీతపై మక్కువ పడ్డాను. నిజానికి ఆమెపై వ్యామోహానికి నేను బానిసనైనాను.' అంటూ తనపై సీతకు గౌరవప్రదగా చెప్పదలంచి ఒక కట్టుకథ ఇలా చెప్పాడు. 'సీత నా భార్య కావటానికి ఒప్పుకొంది. కాని సమయం కావాలని కోరింది. కాని ఇపుడు రామలక్ష్మణులు వానరులు విస్తార సైన్యంతో దాడిచేయ బోతున్నారని తెలుస్తోంది. కాని కోతిమూక వల్ల ప్రమాదం ఉండదు. కాని హనుమంతుడు అనేవాడు తీవ్ర నష్టం కలిగించాడు. కనుక విజయం

సందేహాస్పదం అయితే మిమ్మల్ని పిలిచాను. సీతను నేను అనుభవించేలా రాముని ఎలా వధించాలో మీరు సలహాలు ఇవ్వమని కోరుతున్నాను' అని అన్నాడు.

తరువాత కుంభకర్ణుడు లేచి, 'ఓ మూర్ఖరాజా! నీవు సీతాపరణకు ముందే మమ్మల్ని సంప్రదించవలసి ఉంది. ఇప్పుడు దుఃఖిస్తే లాభం లేదు. నేను నీ దోషానికి ప్రతిగా రామలక్ష్మణులను సంహరించి, వానరులందరినీ మ్రింగేస్తాను. నీవు నిశ్చింతగా ఉండు.' అని అన్నాడు. తర్వాత మహాపార్శ్వుడు లేచి 'నీవు సీతను తనివితీర అనుభవించవచ్చు. నిన్నెవరు అడ్డుకుంటారు? నీ కంటె శక్తివంతుడు ఎవరూ లేరు.' అని అన్నాడు. ఈ విధంగా అందరి మాటలు విన్న రావణుడు బదులు చెప్తూ 'నా జీవితంలో ఒక రహస్యం వుంది. దానిని వెల్లడిస్తాను. విను. ఒకప్పుడు శంబకస్థలి అనే అప్సరస బ్రహ్మదేవునికి అంజలి ఘటించడానికి వెళుతూ ఉండగా నేను ఆమెను చూచి, మోహితుణ్ణి అయి లొంగదీసుకొని, మానభంగం చేశాను. ఆమె నగ్నంగా పారిపోయి, బ్రహ్మదేవునికి చెప్పగా, బ్రహ్మదేవుడు కోపించి 'దుష్ట రాక్షసరాజా! నీవు తిరిగి ఎన్నడైనా మరొక స్త్రీని చెరచాలనుకుంటే, నీ శిరస్సునూరు ముక్కలవుతుంది.' అంటూ నన్ను శపించాడు. ఈ భయం చేతనే నేను సీతను బలవంతం చేయడం లేదు. రామునికి నా పరాక్రమం తెలియదు. నేను అతని అంతుచూస్తాను.' అని అనగా, విభీషణుడు 'రావణా! సీత నీ కంఠం చుట్టూ చుట్టుకొన్న విషసర్పం లాంటిదని గ్రహించలేకున్నావు. లంక సర్వనాశనం కాకముందే, సీతను రామునికి అప్పగించు. యుద్ధంలో రామునికి ఎదురుగా నిలిచి, ఆ విషయం చెప్పేందుకు జీవించి ఉండగల రాక్షస యోధుడు ఎవడూ లేదని నేను నీకు నిస్సందేహంగా చెపుతున్నాను' అని అన్నాడు.

అపుడు ప్రహస్తుడు మానవుడికి భయపడవలసిన అవసరం లేదన్నాడు. ఇది వినిన విభీషణుడు రావణుని శ్రేయస్సు కోరినవాడై, 'రాముడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు స్వరూపుడు. మహామాతిశయం గలవాడు. అందుచేత నీ రాజును రామునితో పోరాడకుండా చేయగలిగితే, నీవు నీ రాజుకు మేలు చేసినవాడవవుతావు.' అని అన్నాడు. అపుడు విభీషణుడు కూడ 'నీ క్షేమాన్ని కాంక్షించే, సీతను అప్పగించమని చెప్తున్నా. రాజు క్షేమం కోరేవాడు, మంచి సలహాలు యిచ్చేవాడే నిజమైన శ్రేయోభిలాషి' అని అన్నాడు. విభీషణుని హితబోధలు సహించని ఇంద్రజిత్తు 'విభీషణా! నీవు ఒక నపుంసకుడవు. నీకు ఈ సభలో చోటు లేదు. వీరత్వం లేదు, నేను ఇంద్రుణ్ణి, దేవతలను గతంలో పారిపోయేట్లు చేశాను. ఈ రామలక్ష్మణులను సంహరించటం నాకొక లెక్కకాదు.' అని అన్నాడు. అందుకు విభీషణుడు పరుషంగా 'నీవొక అర్భకుడవు. నీ బుద్ధి వికసించ లేదు. అవివేకివి, మందమతివి, దుష్టుడవు అయినందున నీవు రావణునికి పుత్రుడవు కాదు, శత్రువువు. సంస్కార హీనుడవు. సీతను రామునికి అప్పగిస్తేనే, రాక్షసులు ప్రశాంతంగా జీవించగలుగుతారు.' అని అన్నాడు.

ఇలా విభీషణుని మాటలకు రావణుడు విసిగిపోయాడు. కుటుంబ సభ్యులే శత్రువులుగా మారుతుంటారు. రావణుడు 'విభీషణా! నేనంటే నీకు అసూయ ఉంది. నీలాగ మరెవరైనా మాట్లాడివుంటే, తక్షణమే చంపేసేవాణ్ణి. నీవు మన వంశానికి ఒక కళంకుడవు'. ఈ దూషిత వాక్యాలు వినిన, విభీషణుడు గదాపాణియై దిగ్గున లేచి 'రాజా! నీవు ఉన్నత స్థానంలో వున్నా, అధర్మ మార్గాన్నే అనుసరిస్తున్నావు. నీ మాటలు సహించలేను. భజనపరులు సులభంగా లభిస్తారు. సత్యవాదులు అరుదుగా వుంటారు. రావణా! నీకు రాముని చేతిలో మృత్యువు కలుగకూడనే ఆశతోనే ఈ సలహా ఇచ్చాను. కాని నీవు తిరస్కరించావు. నీకు స్వేచ్ఛ ఉంది. కాని సోదరా! నేను ఇక్కడ ఈ అధర్మం నీడలో వుండను. నీతో ఉండను.' అని చెప్పి, విభీషణుడు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ సభ వదలి

వెళ్ళిపోయాడు. ఆ తర్వాత తన అనుచరులతో సహా రాముని శిబిరానికి చేరుకొన్నాడు. ఆకాశంలో నిలిచి వున్న విభీషణుని వానరులు చూచారు. సుగ్రీవుడు హనుమంతునితో 'జాగ్రత్త తీసికో, ఈ రాక్షసుడు మనలను చంపటానికి వచ్చినట్లున్నాడు' అని అన్నాడు. వానరులందరు శిలలను చేపట్టి, వృక్షాలను పెకలించి సుగ్రీవుని ఆజ్ఞకై ఎదురు చూస్తున్నారు.

విభీషణుడు సుగ్రీవునితో 'ఓ వానరేంద్రా! నేను రావణుని చిన్న తమ్ముణ్ణి. సీతను రామునికి అప్పగించమని రావణునికి పదే పదే సలహా ఇచ్చాను. కాని అతను నన్ను పరుషోక్తులతో అవమానించినందున, నేను నా గృహాన్ని, భార్యాబిడ్డల్ని వదలి రాముని పాదపద్మాలవద్ద ఆశ్రయం తీసికోవాలని నిశ్చయించుకొని ఇక్కడికి వచ్చాను. దయచేసి నా అభీష్టాన్ని రామునికి చెప్పు.' అని వెల్లడించాడు.

సుగ్రీవుడు రాముని వద్దకు వెళ్ళి 'శత్రుపక్షంలో ఒకడు వచ్చాడు. అతను రావణుని వదలివేసి వచ్చానని అంటున్నాడు. కాని గూఢచారి కావొచ్చు. నమ్మలేం. మనకు హాని తలపెట్టవచ్చు. కనుక అతనిని తక్షణమే వధించుటయే మంచిది' అని అన్నాడు. అయితే రాముడు హనుమంతుడు మున్నగు వానర ముఖ్యుల సలహా కోరాడు. వారు 'ప్రియమైన శ్రీరామా! నీవు సర్వజ్ఞుడవు. మమ్ములను గౌరవించడం కోసమే మమ్మల్ని సలహా అడిగావు అని మేము అర్థం చేసుకోగలం' అని అన్నారు. అపుడు అంగదుడు 'ఇతనివల్ల ప్రయోజనం ఉంటే సరి, లేకపోతే సాగనంపాలి' అని అన్నాడు. శరభుడు 'ఇతన్ని కనిపెట్టి మిత్రుడని తేలితే స్వాగతిద్దాం' అని సూచించాడు. జాంబవంతుడు 'ఇతనిని మిక్కిలి జాగరూకతతో కనిపెట్టి ఉండాలి.' అని చెప్పాడు. మైందుడు కూడ అదే సలహా ఇచ్చాడు. అంతట నిత్యవివేకశీలుడైన హనుమంతుడు 'విభీషణుని పరిశీలించటానికి సమయం లేదు. అతను శ్రీరాముని ఆశ్రయాన్ని కోరుతూ చిత్తశుద్ధితో వచ్చాడని నమ్ముతున్నాను. ఎందుకంటే అతని ప్రశాంత వ్యవహార శైలి, మృదుబాషణ లక్ష్యసిద్ధిని తెలుపుతున్నాయి. అతడు రావణుడు దుష్టుడని, రాముడు ధర్మాధికారి అని అర్థం చేసకొన్నాడు. కపట స్వభావులు అంత ప్రశాంతంగా ఉండలేరు. ముఖకవళికలు ఆయనను పట్టిస్తాయి. అందుచే ఏ అనుమతి లేకుండా, విభీషణుని స్వీకరించమని నా అభిప్రాయం' అన్నాడు.

అంతట రాముడు 'విభీషణుడు చిత్తశుద్ధితోనే రావణుని తిరస్కరించాడని నేను నమ్ముతున్నాను. రాజకుటుంబాల్లో అవి సర్వసాధారణం. కనుక మనం అతనిని స్వాగతిద్దాం,' అని అన్నాడు. అంతట సుగ్రీవుడు కొంత జాగరూకత అవసరమని చెప్పగా రాముడు 'ఈ రాక్షసుడు నాకు హాని చేయగలడా? నేను నా కొనగోటి వ్రేలితో ఈ రాక్షసులను, దానవులను సంహరించ గలను. నేను ఒక కథ చెబుతాను. విను. ఒకప్పుడు ఒక బోయవాడు వలవేసి ఒక కపోతాన్ని పట్టుకొన్నాడు. ప్రక్కనే వున్న వృక్షంపై విశ్రమించాడు. పట్టుబడిన కపోతం భార్య అదే వృక్షంపై ఉంది. తన గృహానికి వచ్చిన ఆ బోయవానికి అతిథ్యమిచ్చింది. తన దగ్గర అతిథికి పెట్టడానికి ఏమీ లేనందున, ఆ పక్షి తన విధి నిర్వర్తించటం కోసం తన మాంసాన్నే అతనికి ఆహారంగా సమర్పించింది. సుగ్రీవా! ఒక సాధారణ పక్షియే అలా వ్యవహరించినపుడు, నావంటి మానవుని విషయం ఏమని చెప్పాలి? శత్రువు శరణుకోరి వచ్చినపుడు అతనిని ఎపుడైనా రక్షించవలసినదేనని శాస్త్ర గ్రంథాలు చెపుతున్నాయి. భయం లేక మూర్ఖత్వం వల్ల వ్యతిరేకంగా ప్రవర్తించరాదని, పాపమని కండూ మహర్షి వ్యాఖ్యానించాడు. అంతేకాదు మీరంతా దేవదేవునిగా భావించే నేను ఏ ప్రాణి అయినా వచ్చి నీవాడిని అని అంటే నేను రక్షించడమే నా నిత్యవ్రతంగా భావిస్తాను. రావణుడే స్వయంగా వచ్చినా, నేను అతనిని అన్ని విధాలా రక్షిస్తాను.' అని అన్నాడు.

రాముని ఈ మహోన్నతమైన మాటలను విన్న సుగ్రీవుని హృదయం భక్తిసంభరితమైంది. కన్నీటితో 'ఓ రామా! విభీషణుడు చిత్తశుద్ధి గలవాడేనని నాకు కూడ తోస్తోంది. అందుచే వెంటనే మైత్రి చేసుకుందాం' అన్నాడు.

రాముని రక్షణకు సంతసించి, విభీషణుడు భూమిపై దిగి శ్రీరాముని పాదపద్మాలకు నమస్కరించి ఇలా అన్నాడు. 'నా పేరు విభీషణుడు. నేను రావణుని చిన్న తమ్ముణ్ణి. నేను మా సోదరుని క్షేమం కోరి సలహాలు ఇస్తే, నన్ను నిందించాడు. నేను నీ భక్తియుత సేవలో నిమగ్నుడనై ఉండదలచి, నా రాజ్యాన్ని, గృహాన్ని, కుటుంబాన్ని సర్వం త్యజించి నీ సన్నిధిలో నిలిచాను. నీ దయతో నన్ను ఆజ్ఞాపించ ప్రార్థన' అని వేడుకొన్నాడు. విభీషణుణ్ణి ప్రేమాదరాలతో వీక్షిస్తూ, రాముడు శత్రువు యొక్క శక్తి, బలాబలాలను వివరించమని అడిగాడు. జవాబుగా విభీషణుడు ఇలా చెప్పాడు. 'బ్రహ్మదేవుని వరం వల్ల రావణునికి దేవతలు, గంధర్వులు, దైత్యులు, దానవులు, నాగుల చేతిలో మరణం లేదు. మానవులే అతని మృత్యువును చూడగలరు. అతని దృష్టిలో మానవులు లెక్కలోనే ఉండరు. దేవేంద్రుడంతటి శక్తిమంతుడు. రాక్షసుల సేనాధిపతి ప్రహస్తుడు. ఇతడు కైలాస పర్వతవద్ద మణిభద్రుణ్ణి ఓడించాడు. కుమారుడైన ఇంద్రజిత్తు తండ్రితో సమానుడే. అతడు దుర్భేధ్యమైన కవచం ధరించి ఉంటాడు. అగ్నిదేవుని ప్రసన్నం చేసుకొని అతడు యుద్ధరంగంలో అదృశ్యుడై ఉంటాడు. మహోరథుడు, మహాపార్శ్వుడు, అకంపనుడు మొదలైనవారి నాయకత్వంలో అనేక ఇతర రాక్షసులున్నారు. వారు భయంకరులు, కామరూపులు.' ఇలా విభీషణుడు చెప్పగా, రాముడు 'విభీషణా! నేను రావణుని పరాక్రమాలను ఎరుగుదును. అతణ్ణి ఇతర రాక్షస యోధులందరినీ సంహరించిన మీదట, నిన్ను లంకారాజ్య సింహాసనంపై ప్రతిష్ఠిస్తానని మాట ఇస్తున్నాను.' అని చెప్పాడు. రాముడు విభీషణుని భక్తిప్రపత్తులకు మెచ్చి ఆలింగనం చేసుకొన్నాడు. విభీషణుని రాజ్యాభిషేకానికి తక్షణమే సముద్ర జలాన్ని తీసికొని రమ్మని లక్ష్మణుని రాముడు ఆదేశించాడు. రాముని ప్రేమను, చూచిన వానరులు హర్షధ్వానాలు చేశారు.

అంతట హనుమంతుడు, సుగ్రీవుడు విభీషణునితో 'రావణునితో యుద్ధానికి వానరులు సాగరం దాటాలి. ఎలా? సలహా ఇవ్వగలవా?' అని అడిగాడు. విభీషణుడు సమాధానంగా 'సముద్రానికి అధిష్ఠాన దైవమైన వరుణుని రాముడు ఆవాహన చేయాలి. పూర్వం రాముని వంశీకుడు సగరుడు భూమిని తొలిచి సాగర విస్తీర్ణాన్ని పెంచాడు. ఈ కారణంగా సముద్రుడు రామునికి తప్పక సాయం చేస్తాడు.' అని అన్నాడు.

విభీషణుని ఆలోచనను సుగ్రీవుడు రామలక్ష్మణులకు తెలిపాడు. రాముడు మంచిదని అంగీకరించి, సముద్రముఖుడై దర్భాసనంపై కూర్చొన్నాడు. ఇది ఇలా ఉండగా, శార్దూలుడనే రాక్షస చారుడు రావణుని వద్దకు వెళ్ళి వానర సేన అన్ని దిశల్లో ఎనభై మైళ్ళ వరకూ నిలిచివున్నారని చెప్పాడు. రావణుడు కలవరపడి శుకుడు అనే దూతను పిలిచి 'నీవు సుగ్రీవుని వద్దకు వెళ్ళు. నేను వారికి ఏ హాని చేయలేదు. మీరెందుకు దాడికి ప్రయత్నిస్తున్నారు? సీతాపహరణంతో నీకు సంబంధం లేదు. కనుక నీవు కిష్కింధకు వెళ్ళి ప్రశాంతంగా జీవించు అన్న సందేశాన్ని సుగ్రీవునికి వినిపించు' అని ఆదేశించాడు.

శుక్రుడు గగనానికి ఎగరి గాలిలో నిలిచి సుగ్రీవునికి రావణుని సందేశాన్ని వినిపిస్తుండగా, వానరులు గాలిలోకి ఎగిరి అతన్ని పట్టుకొన్నారు. వాని రెక్కలు విరిచి, నేలపై పడేసి కొట్టారు. శుకుడు అమితమైన బాధతో 'ఓ రామా! ధర్మమాడువాడు దూతను వధించాడు' అని కేక పెట్టాడు. అది విని రాముడు అతనిని విడిపించడంతో,

ఆకాశంలోకి ఎగిరి, రావణునికి ఏదైనా సందేశం ఇస్తావా అని సుగ్రీవుణ్ణి అడిగాడు. అపుడు సుగ్రీవుడు 'ఓ రావణా నీ పరస్త్రీ వాంఛ నికృష్టమైంది. నా సేన సముద్రాన్ని దాటి లంకకు చేరుతుంది. రాముడు నిన్ను సబాంధవంగా వధిస్తాడు అని చెప్పు' అని చెప్పాడు. ఇతనిని దూతగా భావించక బంధించమని అంగదుడు చెప్పగా, వానరులు గాలిలోకి ఎగిరి, అతణ్ణి పట్టుకొని త్రాళ్ళతో బంధించారు. శుకుడు మళ్ళీ రామునికి మొర పెట్టుకోగా, తాము లంకకు చేరిన వెంటనే బంధవిముక్తుణ్ణి చేస్తానని రాముడు హామీ ఇచ్చాడు.

రాముడు వరుణుని ప్రార్థించాడు. సముద్రుడు సాయం చేయని యెడల అతనిని వధించటానికైన రాముడు సిద్ధంగా ఉన్నాడు. మూడు రోజులు గడచినా కూడా సమాధానం రానందున రాముడు క్రుద్ధుడై లక్ష్మణునితో 'ఈ భౌతిక ప్రపంచంలో గుణహీనులే అధికంగా ఉంటారు. సముద్రుడు నన్ను నపుంసకునిగా భావిస్తున్నట్లున్నాడు. అందుకే నా ముందుకు రావడం లేదు. లక్ష్మణా! నా ధనస్సు నివ్వు. ఈ సముద్రునికి గుణపాఠం చెపుతాను. నేను ఈ జలధిని శోషింప చేయటం చూడు ఇక వానరులు కాలినడకన లంకకు సాగిపోతారు.' అని అన్నాడు.

రాముడు అలా అంటూనే ధనుష్టంకారం చేయగా, భూమండలం ప్రకంపించింది. బాణాలతో తరంగాలు ఎగిసిపడ్డాయి. జలచరాలు భయకంపితమైనాయి. రాముడు తన అమోఘ బ్రహ్మాస్త్రాన్ని సంధించుచుండగా, లక్ష్మణుడు వచ్చి 'ప్రియమైన అగ్రజా! ఇక బాణాలు ఆపు. కోపం నిగ్రహించుకో. సముద్రాన్ని శేషింప చేయటానికి ఇంతకంటే మంచి ఉపాయమే ఉండి వుంటుంది. సందేహం లేదు' అని అన్నాడు. రాముని ఆగ్రహ ప్రదర్శనకు గగనంలోని బ్రహ్మర్షులు సైతం భయపడిపోయారు. లక్ష్మణుని మాటను లెక్కచేయకుండా రాముడు బ్రహ్మాస్త్రం సంధించి, సముద్రునితో ఇలా అన్నాడు. 'ఇపుడు నేను నీ జలాల నంతటిని శేషింప చేసి, మరుభూమిగా చేస్తాను. ఓ సముద్రుడా! నీవు గర్వంతో నా సేవకు రానందున, నా స్వీయపరాక్రమంతో వానరులను లంకకు కాలినడకన చేరేటట్లు చేస్తాను' అని హెచ్చరించాడు. రాముడు బ్రహ్మాస్త్రాన్ని సంధిస్తుండగా, స్వర్గమర్త్య లోకాలు కంపించ సాగాయి. అంధకారం అలముకొనసాగింది. దివ్యప్రభంజనం చెలరేగింది. ఉల్కలు దూసుకు వచ్చాయి. పిడుగులు వర్షించాయి. సముద్రం రాముని చెలియలికట్ట దాటి జీవులు భయపెట్టసాగింది. అయినా రాముడు తొణుకూ, బెణుకూ లేకుండా తిరుగులేని నిశ్చయంతో నిలిచాడు.

అకస్మాత్తుగా సముద్రుడు సర్పంతో పరివేష్ఠించబడిన వాడై, రాముని ఎదుట దర్శన మిచ్చాడు. ముకుళిత హస్తుడై సముద్రుడు రాముని సమీపించి, 'ఓ పరమపురుషా!  మందమతులమైన మేము నిన్ను గ్రహించలేక పోయాం. నీవు పరమ పురుషుడవని, జగత్తుకు ఆదినాథుడవని, ఆదిపురుషుడవైన భగవానుడవని ఇప్పుడే మేము అర్థం చేసుకొన్నాం. నీవు త్రిగుణాలకు అధిపతివి. ఓ రాఘవ కులతిలకా! పంచభూతాలు తమ తమ లక్షణాలతో సమన్వితమై ఉంటాయి. నేను అగాధమైన వాడిని. స్వభావతః దుస్తరమైన వాడిని. మరోరకంగా ఉండజాలను. రామా! నా సాగర జలాలలను దాటటానికి నీకు ఒక సౌలభ్యాన్ని కలుగజేస్తున్నాను. నీవు నా జలాలను కోరిన విధంగా ఉపయోగించకోవచ్చు. నీవు నిజంగానే నన్ను దాటి రావణుని చేరవచ్చును. వాడు పరమనింద్యుడు. దయచేసి నీవు వెళ్ళి అతనిని వధించి నీ పత్నిని తీసుకొని రా. మహాకీర్తి నార్జించుటకై ఈ సాగరం మీద ఒక వారథిని నిర్మించు. దానితో నీ కీర్తిని భవిష్యత్తులో దేదీప్యమానమై వెలుగొందుతుంది. నీవు వారథిని నిర్మిస్తే, నేను దానిని నా శక్తిచేత తేలియాడేలా చేస్తాను. దానితో వానరసేన దాడి సులభమై పోతుంది. నీ సతిని నీవు స్వాధీనం చేసుకోగలవు' అని అన్నాడు. అపుడు రాముడు బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించను, దేనిపై

ప్రయోగించమంటావో చెప్పు అని సముద్రుణ్ణి అడిగాడు. అపుడు సముద్రుడు 'రామా! ఇక్కడికి ఉత్తరంగా ద్రుమకుల్యమనే పవిత్ర స్థలం ఉంది. అక్కడ భయంకర చేరజాతి నివసిస్తోంది. వారి కళంకిత స్పర్శ నాకు వికారాన్ని కలిగిస్తోంది. ఓ ప్రభూ! నీ అస్త్రాన్ని ఆ స్థలంలో పడేలా చేస్తే, నేను మిక్కిలి సంతోషిస్తాను.' అని చెప్పాడు. రాముడు సముద్రుని మన్నించి, అస్త్రం అలాగే పడేలా చేశాడు. ఆ చోటు మరుకారకం అని పేరుగాంచింది.. ఇది సస్యశ్యామలమై, సకల విధాల విలసిల్లుతుందని రాముడు ఆశీర్వదించాడు.

ఆ తరువాత, సముద్రుడు 'ఓ రామా! ఇదిగో నలుడు విశ్వకర్మ కుమారుడు. ఇతడు నీకు మహాభక్తుడు. వారధి నిర్మాణాన్ని ఇతడు పర్యవేక్షిస్తాడు. నేను నీ వారధిని జలాల్లో తేలియాడేటట్లు చేస్తాను' అని అన్నాడు. అంతర్ధానమైనాడు. అంతట నలుడు రాముని ఎదుటకు వచ్చి, ప్రణామాలాచరించి ఇలా అన్నాడు. 'వరుణుడు దండన భీతివల్లనే, నీకు మార్గాన్ని అనుమతించాడని నాకు తెలుసు. నా తల్లికి ఇచ్చిన వరం వల్లనే, నాకు విశ్వకర్మ తన యొక్క శిల్ప నిర్మాణ కౌశలాన్ని కరతలామలకం చేశాడు. కాబట్టి నేను వారధి నిర్మాణాన్ని పర్యవేక్షించ గలను. కనుక తక్షణమే వానరులు నిర్మాణ సామగ్రిని సేకరించటం ప్రారంభించాలని కోరుతున్నాను. అంతట రాముని ఆదేశాల మేరకు లక్షలాది మంది వానరులు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనేక రకములైన సామగ్రిని సముద్ర తీరానికి చేర్చారు. సామగ్రిని సముద్రంలో విసరగా వింత శోభ చేకూరింది. నిర్మాణం జరుగుతుండగా, విభీషణుడు అతని సచివులు అక్కడ అప్రమత్తులై కావలి కాచారు.

హనుమంతుడు కూడ పెద్ద పెద్ద శిలాఖండాలను సముద్రంలోకి విసురుతున్నాడు. భగవంతుడైన రామునికి సాయం చేయడం కోసం ఒక ఉడత సముద్రంలోకి మట్టిని ఎగదోస్తూ కనిపించింది. 'నీవు అడ్డం రావద్దు. మట్టితో ఏమి సాధిస్తావు' అని హనుమంతుడు ఉడుతను అడిగాడు. ఈ మాటలు విని రాముడు 'ఎందుకలా అంటావు. నీవు ఈ ఉడుత ఇద్దరూ నన్ను ప్రేమిస్తున్నారు. నీవు పెద్ద శిలలు వేస్తే ఉడుత చిన్న రేణువులను మోస్తున్నది. ఎవరి సామర్థ్యం కొద్దీ వారు సేవలో ఉన్నారు. ఈ ఇద్దరి సేవలు సమానమైనవిగానే నేను స్వీకరిస్తున్నా' అంటూ హనుమంతుణ్ణి రాముడు మందలించాడు. ఇలా నూరు యోజనాల పొడవు, పది యోజనాల వెడల్పుతో వారధి నిర్మాణం జరిగింది. దానిపైపుష్పలతలను పరిచారు. ఈ అద్భుత వారధిని చూడటానికి దేవతలు, మహర్షులు ఆకాశంలో సమావేశమైనారు. అంతట రామలక్ష్మణులను హనుమంతుడు, అంగదుడు తమ వీపుపై ఎక్కించుకొనమని సుగ్రీవుడు కోరాడు. ఆ తర్వాత వెంటనే కోట్లాది వానర సేన మొత్తం పురోగమించ సాగింది. ఆవలి సువేల పర్వతాన్ని చేరటంతో వానరులు సంతోషభరితులైనారు. సుగ్రీవుడు అక్కడ శిబిరం ఏర్పాటు చేయగా, దేవతలు, మహర్షులు పవిత్ర జలాలతో వచ్చి సుగ్రీవుని, వానరులను అభిషేకించి, విజయోస్తు అని ఆశీర్వదించారు. అంతట రాముడు లక్ష్మణుని ఆలింగనం చేసుకొని 'లక్ష్మణా! ఎందరో మహావీరుల గురించి దుశ్శకునాలు గోచరిస్తున్నాయి. అన్నివిధాలా జాగ్రత్త తీసికో. ప్రకృతి కనపరుస్తున్న విపరీత లక్షణాలను బట్టి ఇక తక్షణమే లంకానగరం మీద దాడిచేయాలని అనుకొంటున్నాను.' అన్నాడు. అలా రాముని అభీష్టం మేరకు వానర సైన్యం బయలుదేరింది. వీరి గర్జారావాలు రాక్షసుల చెవిన పడ్డాయి. రాముడు సేనకు శిరోభాగాన లక్ష్మణునితో కలిసి ఉండే విధంగా వ్యూహం రచించమని దళ నాయకులను రాముడు కోరాడు. వానరులు భయంకర కృత్యాలకు పాల్పడ్డారు. రాముడు సీతను విడుదల చేయడమో, లేక మృత్యువుకు సిద్ధపడటమో తేల్చుకోమంటూ రావణునికి సమాచారం పంపాడు. పక్షిరూపంలో ఉన్న రావణుని దూతను వానరులు విముక్తించగా,

అతడు తక్షణమే రావణుని వద్దకు వెళ్ళాడు. శుకుని రెక్కలు ఖండించి ఉండటం చూచిన రావణుడు ఈ పని ఎవరు చేశారు అని అడిగాడు. అందుకు శుకుడు 'నీ సందేశాన్ని సుగ్రీవునికి అందించాను. వానరులు నన్ను చావబాదారు. నా రెక్కలు ఖండించారు. ధర్మాత్ముడైన రాముని దయతో నేను విడుదల చేయబడ్డాను. ఓ రాజా! సీతను కాపాడుటకై వానర మూక వచ్చేసింది. వారు దాడిచేయక ముందే, నీవు సీతను అప్పగించడమో లేదా వారిపై నీవు దాడిచేయడమో చేయమని నాతో సందేశం పంపారు' అని చెప్పాడు.

అపుడు రావణుడు ఆగ్రహంతో 'నేను సీతను విడిచిపెట్టేది లేదు. వారినందరిని వధిస్తాను. ఎలా వారధి దాటారు? ఆశ్చర్యంగా ఉంది. నీవు సారణుడు వానర రూపం ధరించి శత్రు రహస్యాలను సేకరించి నాకు తెలపండి' అని అన్నాడు. వానర సంఖ్య ఎంత అంటే, ఈ చారణులు వారిలో ప్రవేశించలేక పోయారు. విభీషణుడు వీరిని మారురూపంలో ఉన్న రాక్షసులని గ్రహించి, వీరిని పట్టుకొని రాముని వద్దకు తీసుకొని వెళ్ళాడు. శుకచారణులు భయంతో రామునితో 'మేము స్వచ్ఛందంగా రాలేదు. మీ సేనాబలాన్ని అంచనా వేయమని మమ్మల్ని రావణుడు పంపించాడు.' అంటూ చేతులు జోడించి, దీనంగా నిలబడ్డారు. ఈ మాట విన్న రాముడు నవ్వి 'మీ పని పూర్తయితే, తక్షణమే రావణుని వద్దకు వెళ్ళవచ్చు. ఇంకా పని మిగిలి ఉంటే, విభీషణుని మార్గదర్శకత్వంలో చేసుకోవచ్చు. మా ఈ సౌజన్యానికి ప్రతిగా మీరు ఒక పని చేయాలి. మీరు తిరిగి వెళ్ళి రావణునికి నా సందేశం అందించండి. నేను వానర సేనతో వచ్చి లంకా నగరాన్ని నాశనం చేస్తాను. రాక్షసులందరినీ సంహరిస్తాను అనేదే నా సందేశం.' అని చెప్పాడు.

కృతజ్ఞతా సూచకంగా ఆ ఇద్దరూ రామునికి నమస్కరించి, 'నీకు విజయం కలుగు గాక!' అని అన్నారు. రావణుని వద్దకు వెళ్ళి 'మమ్మల్ని విభీషనుడు పట్టుకొన్నాడు. కాని కరుణామయుడు రాముడు మమ్మల్ని వదిలాడు. వారి సేనను అంచనా వేయలేక పోయాం. కాని వానరుల సహాయం లేకుండానే రాముడు, లక్ష్మణుడు, విభీషణుడు, సుగ్రీవుడు తలచుకొంటే, లంకానగరాన్ని నాశనం చేయగలరని చెప్పగలం. రాముడు ఒక్కడే చాలు ఆ కార్యానికి. కనుక సీతను రామునికి అప్పగించమని మా సలహా' అని వారు వివరించారు.

అందుకు రావణుడు 'నామీద దేవతలు, దానవులు ఒక్కటై దాడి చేయడానికి వచ్చినా, నేను సీతను ఇవ్వటం అనేది జరుగదు. మీరు వానరులకు భయపడుతున్నారు. నేనెందుకు భయపడతాను?' అని బదులు చెప్పాడు.

రావణుడు శత్రుబలాన్ని చూడగోరి, ఆ ఇద్దరు చారులతో తన సౌధాగ్రాన్ని అధిరోహించి, వారిని చూపించమని సారణుని కోరాడు. అపుడు సారణుడు రావణునికి హనుమంతుడు, సుగ్రీవుడు, అంగదుడు, జాంబవంతుడు మున్నగు మహావీరులందరిని చూపించాడు. అంతేకాక, వారియొక్క బలపరాక్రమాలను వివరించి ప్రస్తుతించాడు. సారణుడు వానర విస్తరణను వివరించటానికి ముందుగా కైసిక గణన పద్ధతిని వివరించవలసి వచ్చింది. నూరు వేలు అంటే లక్ష ఓఘాలను ఒక మహౌఘమంటారని వివరించాడు. సారాంశంగా సారణుడు రాముని వానరసేనలో కనీసం 100 కోట్ల మహౌఘాల సైనికులు ఉన్నారని వివరించాడు. రామలక్ష్మణులు ఇతర వానర వీరులను చూచి రావణుడు క్రుద్ధుడైనాడు. రావణుడు వారిని దూషించుచుండగా, శుక, సారణులు తమ తలలను దించుకొన్నారు. 'మీరు అజ్ఞానంతో శత్రువును ఆకాశానికి ఎత్తుతున్నారు. మీరు నా సచివులుగా లేరు' అని రావణుడు వారిని దూషించాడు.

ఆ విధంగా నిందించిన రావణుని మాటలు విని శుక, సారణులు సిగ్గుపడ్డారు. 'నీకు విజయం చేకూరు గాక( అని చెప్పి, వారిద్దరూ అక్కడినుండి వెళ్ళిపోయారు. రావణుడు మరికొంతమంది చారులను రప్పించగా, వారు రావణుని ఆశీర్వదించారు. శత్రువుల శక్తిని నిర్ధారించమని వారిని కోరగా, వారు నమస్కరించి, రహస్యంగా రాముడు విడిది చేసిన చోటికి చేరుకొన్నారు. చారులు వానర రూపాలు ధరించినా, వారు రాక్షసులేనని విభీషణుడు వారిని బంధించాడు. వారిని వానరులు కొట్టసాగారు. దీన్ని గమనించిన కరుణామూర్తి శ్రీరాముడు వారిని విడిచిపెట్టమని ఆదేశించాడు. వీరు లంకకు తిరిగివచ్చి రావణునికి ఇలా చెప్పారు. 'వానర సైనిక శక్తిని మేము కనిపెట్టలేకపోయాం. మేము అక్కడికి చేరుకోగానే, విభీషణుడు మమ్మల్ని బంధించగా, వానరులు మమ్మల్ని చావబాదారు. రాముని కారుణ్యం వల్లనే మేము ఇలా తిరిగి వచ్చాం. ఓ రాజా! రాముడు విశ్వాన్నే నాశనం చేయగలవాడుగా కన్పిస్తున్నాడు. కనుక నీవు సీతను అప్పగించటమో లేక యుద్ధం చేయటమో తప్పదు.' అన్న మాటలు విన్న రావణుడు 'నేను సీతను ఎప్పటికీ విడిచిపెట్టను' అని ప్రకటించాడు.

అంతట రావణుడు విద్యుజ్జిహ్వాకుడనే మాయోపాయ చతురుడైన రాక్షసుని పిలిపించాడు. అతనితో 'నీవు రామునిగా మాయారూపాన్ని ధరించాలి. పరిపూర్ణంగా రాముని అనుకరిస్తూ ఉండాలి. నేను ఇపుడు సీతను చూచుటకు అశోకవనానికి వెళ్తాను. నీవు నాతో వచ్చి ఒక చోట దాగివుండు. నేను నిన్ను పిలువగానే, నీవు మాయతో సృష్టించిన వాటినన్నింటిని తీసికొని రావాలి' అని చెప్పాడు.

రావణుడు సీను చూడ దలంచి వెళ్ళాడు. ఆమె ఎదుట నిల్చి, 'రాముణ్ణి నా సేనాధిపతి వధించాడు. నీవు ఇక నా ప్రియతమ రాణివే. అసలు జరిగిన దేమంటే రాముడు సముద్రాన్ని దాటగనే చీకటి పడింది. బాగా అలసి పోయిన రామలక్ష్మణులు, వానరులు నిద్రలోకి జారుకొన్నారు. ఆ చీకటిలో మా రాక్షస యోధులంతా వారిని ఊచకోత కోయసాగారు. రాముడు నిద్ర పోతుండగా, ప్రహస్తుడు అతని శిరస్సును ఖండించాడు. అలాగే మిగిలిన వారిని వధించగా, అందరూ పారిపోయారు. ఓ సుందరీ! నీకు నమ్మకం కలిగించటానికి ఖండించిన రాముని శిరస్సును తెచ్చాను.' అని అన్నాడు. అంతట విద్యుజ్జిహ్వుణ్ణి పిలువగా, ఆ మాయావి రాముని మాయా శిరస్సుతో పాటు, ధనుర్బాణాలను కూడ పుచ్చుకొని అక్కడ ప్రత్యక్షమైనాడు. 'చూడు నీ భర్త రక్తసిక్తమైన శిరస్సు। అని రావణుడు అన్నాడు. రాముని శరీరపు ముక్కలను సీతకు చూపమని ఆదేశించాడు. ఆ మాయావి మాయా శిరస్సును సీత పాదాల చెంత ఉంచి వెళ్ళిపోయాడు. రావణుడు ధనుర్బాణాలను సీత మొఖంపై విసిరి వేసి 'నీవిక నాకు లొంగిపోక గతి లేదు.' అని అన్నాడు. మాయాఖండిత శిరస్సు లక్షణాలు ముమ్మాటికీ రాముని లక్షణాలనే పోలి ఉండడం చూచిన సీత ఇలా విలపించ సాగింది. 'ఓ కైకేయీ! నీ లక్ష్యం నెరవేరింది. ఓ రామా! నీవు లేక నేను వితంతువును. తాను మరణించక ముందే భర్త గతించటం కంటే స్త్రీకి ఏ విపత్తు గొప్పది కాదు. అయ్యో! నేనెంతగా నా భర్త మరణానికి కారణమయ్యాను. ఓ రామా! నేను లేకుండా నీవు పరలోకానికి వెళ్ళావా?' అంటూ శోకించింది. అంతట సీత రావణునితో 'నా భర్త దేహం పడివున్న చోటుకు నన్ను తీసికొని వెళ్ళు. అక్కడ నా దేహాన్ని నా భర్త దేహంపై ఉంచగా, నన్ను చంపివేయి.' అని విలపించింది. సరిగా అదే సమయంలో ఒక వార్తాహరుడు వచ్చి, తక్షణమే రావణుడు సచివుల సభకు రావలసిందని చెప్పాడు. రావణుడు వెళ్ళిపోయాడు. వెంటనే రాముని శిరస్సు, దేహభాగాలు సీత దృష్టిపథం నుండి అదృశ్యమైనాయి.

సభకు వచ్చి, రావణుడు యుద్ధ సన్నాహాలకు ఆదేశించాడు. ఇంతలో విభీషణుని భార్య సరమ సీతను ఓదార్చడానికి వచ్చింది. సరమ సీతతో ఇలా అన్నది. 'దగ్గరలోనే నేను దాగి రావణుడు నీతో చెప్పినదంతా

విన్నాను. రాముడు మరణించ లేదు. ఒక మాయావి వాటిని సృష్టించాడు. వారు ఇపుడు లంకపై దాడిచేయ సిద్ధపడుతున్నారు. రావణునికి వారిని ఓడించలేనని తెలుసు. త్వరలోనే ఉభయుల మధ్య యుద్ధం జరుగుతుంది. సీతా! ఆందోళన చెందకు. ఎందుకంటే రాముడు రావణుని వధిస్తాడు. నీవు రామునికి ఏదైనా సందేశం ఇవ్వదలచుకొంటే, నేను పంపిస్తాను.' సరమ హామీతో సీత ఊరట చెందింది. సీత సరమను రావణుని పథకం గురించి తెలుసుకోమని కోరింది. సరమ వెళ్ళి రావణుడు తమ సచివులతో మాట్లాడిన విషయాలను రహస్యంగా విని వచ్చి సీతతో 'రావణుని సచివులు చాలమంది రామలక్ష్మణుల బలపరాక్రమాలను గురించి చెప్పి, నిన్ను రామునికి అప్పగించమని సలహా ఇచ్చారు. రావణుని తల్లి కూడ సంధి చేసకోమని రావణుని కోరింది. కాని రావణుడు వినలేదు. వానరుల శంఖనాదాలు, భేరీనినాదాలు రావణుడు విన్నాడు. అంతట మాల్యవంతుడు రావణునికి ఇలా హితబోధ చేశాడు. 'తెలివిగల రాజు తనకంటే బలవంతుడితో యుద్ధం చేయడు. కనుక సీతను అప్పగించి, మైత్రి చేసుకో, కానట్లయితే ధర్మం నీ దుష్ట ఆత్మపై విజయం సాధించడం ఖాయం అని తెలుసుకో. నీవు ఋషులను వేధించావు. ఆ పాపం నీ వినాశంపై ఇపుడు గురి పెట్టబడింది. నీకున్న బ్రహ్మదేవుని వరం మానవుని నుండి రక్షణ కల్పించ లేదు. నీవు అతి ప్రమాదకరమైన స్థితిలో వున్నావు. గమనించుకో. దౌహిత్రుడా! లంక వినాశం కోరుకోకు. నల్లని భారీ శరీరంతో, ముండిత శిరస్సుతో కాలుడు ఉభయ సంధ్యల్లో లంకలోని గృహాలన్నింటిలోనూ తొంగిచూస్తూ దర్శనమిస్తున్నాడు. ఓ రావణా! రాముడు మానవాకృతిలో ఉన్న శ్రీమహావిష్ణువని నేను నమ్ముతున్నాను. నీవు ఆయనను శరణు వేడి, రానున్న విపత్తు నుండి ముక్తుడవై నీవు నిన్ను కాపాడుకో.' అని అన్నాడు.'

సరమ ఇంకా ఇలా చెప్పింది. 'రావణుడు ఆ హితబోధ వినలేదు. పైగా అతన్ని దూషించాడు. నాపై అసూయ వల్లనే నీవు రాముని పొగుడుతున్నావు. రాముడు త్వరలోనే నానుండి మరణిస్తాడని తెలుసుకో.' అని అన్నాడు. ఆ తర్వాత మాల్యవంతుడు కొంతసేపు మౌనంగా వుండి, రావణునికి నమస్కరించి, తన నివాసానికి వెళ్ళిపోయాడు. అంతట రావణుడు లంక పరిరక్షణకు నాలుగు ద్వారాల వద్ద ప్రహస్తుణ్ణి, మహాపార్శ్వుణ్ణి, మహోదరుని, ఇంద్రజిత్తును, శుకసారణులను తనతో పాటు నగరం మధ్యన విరూపాక్షుణ్ణి నియమించాడు. తర్వాత సచివులందరిని పంపించి, తాను తన ప్రాసాదాంతఃపురంలోనికి ప్రవేశించాడు.' అని చెప్పింది.

అక్కడ రాముడు అందరితో కలిసి లంకను స్వాధీనం చేసుకొనే విధానాన్ని గురించి చర్చించుకొంటున్నాడు. విభీషణుడు ఇలా అన్నాడు. 'నా సచివుడైన అనలుడు, కసనుడు, సంపాతి, ప్రమతిలతో పాటు, నేను రావణుని సైనిక వ్యూహాన్ని పరిశీలించాను. మాకు ఇపుడు అన్నీ తెలుసు. పూర్వం రావణుడు కుబేరుని ఓడించిన విధంగానే, నీవు వానర సేనతో విజయం సాధిస్తావు.' అని అన్నాడు. అపుడు రాముడు ఇలా ఆదేశించాడు.

'నీలుడు తూర్పు ద్వారం వద్ద ప్రహస్తునిపై దాడిచేస్తాడు. అంగదుడు దక్షిణ ద్వారం వద్ద మహాపార్శ్వుని, మహోదరులను ఎదుర్కొంటాడు. హనుమంతుడు పశ్చిమ ద్వారం వద్ద ఇంద్రజిత్తుపై దాడికి సిద్దపడతాడు. లక్ష్మణుడు, నేను ఉత్తర ద్వారం వద్ద రావణుని ఎదుర్కొంటాం. సుగ్రీవుడు, జాంబవంతుడు, విభీషణుడు మన సేన మధ్యలో నిలిచి, ఎక్కడ సాయం అవసరమైతే అక్కడ సాయాన్ని అందిస్తారునేను, లక్ష్మణుడు, విభీషణుడు, అతని మంత్రులు వానర మధ్యలో వుండి పోరాడుతాం. తక్కినవారంతా వానర రూపాల్లోనే వుండాలి. అప్పటికి సూర్యాస్తమయం కావచ్చింది. కనుక రాముడు, లక్ష్మణుడు, వానర నాయకులు సువేల పర్వత శిఖరాన్ని రాత్రి

గడపడానికై అధిరోహించారు. పర్వతాగ్రం నుండి వారు లంకను బాగా చూడగలిగారు. యుద్ధసన్నాహాల్లో తలమునక లవుతున్న రాక్షస యోధులను కూడ చూడగలిగారు.

మరునాటి ఉదయం ఆ దివ్య నగరాన్ని చూచి అందరూ దాని శోభకు ఆశ్చర్య చకితులైనారు. ఆ నగరం 20 యోజనాల పొడవు, ఇరవై యోజనాల వెడల్పు గలిగి ఉంది. నగరం మధ్యలో రావణుని వెయ్యి స్తంభాల మీద నిలిచిన మనోజ్ఞ ప్రాసాదముంది. నగర శోభను తిలకిస్తున్న రామునికి ఉత్తర ద్వారం వద్ద పైకి ఎక్కి నిలిచిన రావణుడు కనిపించాడు. అతడు ఛత్రఛాయలో వున్నాడు. సేవకులు వింజామరలు వీస్తున్నారు. అంతట అసంఖ్యాక వానరులను లంక పరిసరాలను ఆక్రమించమని సుగ్రీవుడు ఆదేశించాడు. అతడు కూడ ఆకస్మికంగా రావణుని చూచాడు. అంతట సుగ్రీవుడు ఒక్క ఉదటున తన పర్వత శిఖరం మీద నుండి రావణుడు ఆసీనుడై ఉన్న ఉత్తర ద్వారం మీదకు లంఘించాడు. రావణుని వంక చూస్తూ 'నేను శ్రీరాముని సేవకుణ్ణి. నేను నిన్ను ఈ రోజు హతమారుస్తాను' అని ప్రకటించాడు. సుగ్రీవుడు రావణుని మీదికి లంఘించడంతో అతని కిరీటం కూలింది. రావణుడు సుగ్రీవుని చేతబుచ్చుకొని నేల మీదికి విసిరివేశాడు. కాని క్షణంలో సుగ్రీవుడు పైకిలేచి రావణుని బలంతో పట్టుకొని నేలమీదికి విసిరాడు. ఇలా వారిద్దరి మధ్య ద్వంద్వయుద్ధం భీకరమై పరస్పరం గోళ్ళతో రక్కుకోగా, వారి శరీరాలు రక్త, స్వేదసిక్తమైనాయి. ఇద్దరూ ఇలా పోరాడుతూ రక్షణ గోడకు, కందకానికి మధ్యలో పడిపోయారు. ఆ రాజులిద్దరూ లేచి మల్లయుద్ధ పోరాటం సాగించారు. రావణుడు కేవలం బలంతో సుగ్రీవుణ్ణి ఓడించలేనని తెలుసుకొని తన మాయా విద్యను ప్రదర్శించ సాగాడు. దీనిని గ్రహించి సుగ్రీవుడు పోరాటం నుండి వైదొలగాలని నిర్ణయించుకొన్నాడు.

అంతట గాలిలోకి ఎగిరి, రాముడున్న చోటికి చేరాడు. సుగ్రీవుని వీరోచిత కార్యానికి రాముడు, వానరులు ఆనందించి, అభినందించారు. కాని రాముడు సుగ్రీవుని ఆలింగనం చేసుకొని ఇలా అన్నాడు. 'నా అనుమతి లేకుండా మూర్ఖంగా ప్రవర్తించావు సుగ్రీవా! రాజు ఎన్నడూ మహాపాయకరాలైన కార్యాలకు పూనుకోకూడదు. రాజు మరణిస్తే, జాతికే విపత్తు. రావణుడు నిన్ను చంపి ఉన్నట్లయితే, నేను వానిని సంహరించేవాడిని. ఆ తర్వాత లంకా సింహాసనంపై విభీషణుని, అయోధ్యకు భరతుణ్ణి ప్రతిష్ఠించి, నా సమక్షంలో నీ మరణం సంభవించినందున నేను నా ప్రాణాన్ని త్యజించేవాడిని' అని రాముడు అన్నాడు. అందుకు సుగ్రీవుడు 'సీతను అపహరించిన ఆ దుర్మార్గుడిని చూడగనే వాడిని వదిలేయటం నాకు నచ్చలేదు' అన్నాడు. రాముడు 'అయితేనేమి, నీవు నీ వీరత్వాన్ని ప్రదర్శించావు. దానితో వానర సైనికులంతా ప్రేరణ పొందారు' అని అన్నాడు. రాముడు పర్వతం మీద నుండి దిగి 'మనం లంకను ముట్టడిద్దాం' అని అన్నాడు. రాముడు పర్వతం మీద నుండి దిగివచ్చాడు. ధనుర్ధారియై లంకవైపు పయనిస్తుండగా, వానర సమూహం వెంట నడిచింది. రాముడు తన సైన్యంతో ఉత్తర ద్వారం వద్ద విడిది చేశాడు. అదేవిధంగా అంతకుముందు రచించుకొన్న వ్యూహం ప్రకారం యోధులందరు తమ తమ స్థానాలను ఆక్రమించారు. నగరాన్ని పూర్తిగా చుట్టుముట్టారు. వానర సమూహాన్ని చూచిన రాక్షసులు ఆశ్చర్యచకితులైనారు. ఇలా నగరాన్ని ముట్టడించిన విషయాన్ని రావణునికి తెలియజేశారు. స్వయంగా చూచుటకు రావణుడు మేడపైకి వెళ్ళాడు. ఆ వానర సమూహాన్ని చూచి, రావణుడు కూడా ఆశ్చర్యపోయాడు. రాముని వైపు స్తే, ఏమి చేయాలో తోచక, నిశ్చేష్టుడై నిలిచిపోయాడు రావణుడు. అంతట రాముడు ఒక సందేశాన్ని రావణునికి అందించమని అంగదుని ఆదేశించాడు. అంగదుడు గాలిలో ఎగిరి రావణుడు ఉన్న చోటికి వచ్చాడు. రావణునికి కొద్ది దూరంలో నిలిచి 'నా పేరు అంగదుడు. రాజైన సుగ్రీవుని అన్న కుమారుడను. కిష్కింధ రాజ్యానికి యువరాజును.

రాముడు పంపిన సందేశాన్ని నీకు అందించటానికి నేను ఇక్కడికి వచ్చాను. ఓ రాక్షసరాజా! నీ పుణ్యమంతా నశించిపోగా, ఋషులపై నీవు చేసిన అత్యాచారాలకు ప్రతిక్రియగా నిన్ను సంహరించబోతున్నాను. నీవు వెంటనే నా శరణు వేడితే, ప్రపంచాన్ని రాక్షసముక్తం చేస్తాను. నీవు నాకు లొంగిపోవటమో లేక నా శరాఘాతల చేత నిన్ను కళంకముక్తుని చేయగలగటానికై నా ఎదుటకు రావటమో చేయాలి. సీతను నాకు తిరిగి అప్పగించి, నాముందు నీవు తలవంచక పోతే లంకను కడసారి తనివితీరా చూసుకోమని సలహా ఇస్తున్నాను.' అని చెప్పాడు. అందుకు రెచ్చిపోయిన రావణుడు అంగదుణ్ణి సంహరించమని సచివులకు చెప్పాడు. నలుగురు రాక్షసులను పట్టుకోనిచ్చాడు అంగదుడు. ఆ నలుగురు రాక్షసులను కూడ పైకి తీసుకొని పోతూ, అకస్మాత్తుగా రావణుని సౌధాగ్రం మీదకు ఎగిరాడు. అంగదుని లంఘన బలం కారణంగా, రాక్షసులు పట్టుజారి రావణుని పాదాలవద్ద నేలపై దబ్బున పడ్డారు.

రావణుడు నిస్సహాయుడై చూస్తుండగా, అంగదుడు రావణుని సౌధాగ్రాన్ని బలంగా తన్నడంతో, దాని గోపురం ముక్కలై కూలింది. అంగదుడు ఇలా రావణునికి ఆగ్రహం కలిగించి రాముని వద్దకు తిరిగి వచ్చాడు. రావణుడు తన వినాశనాన్ని ఊహించుకోసాగాడు. రాముడు తన సేనను రాక్షసులను సంహరించండని ఆదేశించాడు. అంతట వానరులు రక్షణ ద్వారాలను వృక్షాలతోను, శిలలతోనూ కూల్చసాగారు. రావణుడు కూడ తన సైన్యాన్ని ముందుకు సాగమన్నాడు. ఇలా భీకర ఘర్షణ ప్రారంభమైంది.

రాక్షసులు గదలతోను, ఆయుధాలతోను ఉండగా, వానరులు వృక్షాలను, శిలలను ఆయుధాలుగా చేసికొని ప్రతిఘటించసాగారు. రావణుని సైనికులకు ఆయుధ సామగ్రి ఉంది. కాని వానరులకు లేదు. రామలక్ష్మణులు మాత్రమే కొన్ని బాణాలను ప్రయోగించారు. అయితే రావణుని సైనికులు సీతా మాత శాపానికి గురైనవారు కావడంతో, వారులు కేవలం వృక్షాలతో, రాళ్ళతో వారిని సంహరించ గల్గుతున్నారు.

హనుమంతుడు జంబుమాలితోను, అంగదుడు ఇంద్రజిత్తుతోనూ, నీలుడు నికుంభునితోను, సుగ్రీవుడు ప్రఘసునితోనూ పోరాడగా, అక్కడ రక్తపు టేరులు మృతదేహాలను మోసుక పోయాయి.

ఇంద్రజిత్తు అందగునిపై గదాప్రహారం చేయగా, అంగదుడు నేర్పుతో ఆ గదను లాక్కొని రథంపై వేసి ముక్కలు చేశాడు. జంబుమాలి హనుమంతుని శూలంతో పొడిచాడు. కాని హనుమంతుడు అతని రథంపై దూకి తన తీవ్ర హస్తప్రహారంతో అతనిని చంపేశాడు. నికుంభుడు బాణాలతో నీలుని గాయపరచాడు. కాని ఆ వానరవీరుడు రథపు చక్రాన్ని పెరికి దానితో అతని శరస్సు ఛేదించాడు. రాముడు, సుగ్రీవుడు, నలుడు ఎందరో రాక్షసులను సంహరించారు. వానరవీరులు ఎంతో నష్టపరచారు. ఆ భీకర సంగ్రామం కారణంగా రణరంగం భీభత్సంగా తయారయింది.

ఉభయ పక్షాలు నష్టపోయారు. చీకటి పడింది. రాత్రులు రాక్షసులకు ఉత్సాహం ఎక్కువ. గర్జనలు చేస్తూ రామునిపై దాడిచేశారు. గోలాంగుడు ఒక ప్రక్కన, ధూమ్రుడు మరొక ప్రక్కన తనకు దన్నుగా నిలువగా, రాముడు ఆ రాత్రిని ఉజ్వల కాంతిమయం చేసి, ఆరు స్వర్ణమయ శరాలతో మహాపార్శ్వ, మహోదర, శుక, సారణులను, మరి ఇద్దరు రాక్షసులను గాయపరచారు. అంతట ఆ ఆరుగురు రాక్షసులు ప్రాణాలు నిలుపుకోవాలని పారిపోగా, అంగదుడు ఇంద్రజిత్తు రథాన్ని ధ్వంసం చేసి, సారథిని చంపేశాడు. ఇంద్రజిత్తు కూడ గాయపడి అదృశ్యరూపుడు కాగా, దేవతలు, ఋషులు ఆకాశంలో నిలబడి వానర యువరాజును కీర్తించారు. ఇంద్రజిత్తు

క్రుద్ధుడై, ఆకాశంలో నిలిచినవాడు అక్కడినుండి క్రిందికి నాగాస్త్రాలను వర్షించాడు. బ్రహ్మదేవుని వరప్రభావంతో, ఆ నాగాస్త్రాలు తక్షణమే రామలక్ష్మణులను బంధించాయి.

నాగాస్త్రాల ప్రభావంతో చలనరహితంగా పడివున్న రామలక్ష్మణులు ఇంద్రజిత్తును కనుగొనటానికై అంగదుడు, నీలుడు, హనుమంతుని నాయకత్వంలో పదిమంది వానర ముఖ్యులను పంపించారు. కాని వీరు ఆకాశంలోనికి ఎగిరి అన్వేషిస్తుండగా, ఇంద్రజిత్తు వీరిపై అనేక బాణాలను ప్రయోగించాడు. అతడు రామలక్ష్మణులపై కూడ ప్రయోగించాడు. తత్ఫలితంగా, రామలక్ష్మణులు కూడా గాయపడి రక్తం స్రవించ సాగింది. అపుడు ఇంద్రజిత్తు 'రామలక్ష్మణులారా! ఇంద్రుడు కూడ మిమ్మల్ని కాపాడలేడు. నన్ను ఎవరూ చూడలేరు. మీరు ఏపాటివారు. నా నిశిత బాణధారతో మిమ్మల్ని చంపి ఆనందపడతాను.' అని ప్రకటించాడు. ఇంద్రజిత్తు నిరంతర బాణ ప్రయోగంతో రామలక్ష్మణుల దేహాల నిండా బాణాలు గ్రుచ్చుకొన్నాయి. చివరకు రాముడు శరీరమంతా రక్తసిక్తం కాగా నేలమీద పడిపోయాడు. లక్ష్మణుడు కూడ మూర్ఛపోయాడు. ఈ భయంకర దృశ్యాన్ని చూచిన వానరులు నిరాశకు లోనైనారు. అందరూ రామలక్ష్మణుల చుట్టూ చేరియుండగా, ఇంద్రజిత్తు తన అనుచరులతో వచ్చి 'ఈ మహాబలశాలురు ఇద్దరూ బ్రహ్మదేవుని శక్తితో నిండిన నా మాయాసర్ప శరాలకు బలైపోయారు. ఎవరూ వీరిని కాపాడలేరు' అంటూ ఉద్ఘోషించాడు ఇంద్రజిత్తు. అంతట రాక్షసులందరు కేకలు పెడుతూ రాముణ్ణి ఇంద్రజిత్తు ఒక్కడే సంహరించాడు అని బిగ్గరగా అరవసాగారు. తాను వారిని చంపాననే విజయగర్వంతో, ఇంద్రజిత్తు రావణుని ప్రాసాదానికి బయల్దేరాడు.

రామలక్ష్మణులు పడివున్న చోటికి సుగ్రీవ, విభీషణులు వచ్చారు. సోదరులిద్దరూ శ్వాసించటం కూడ లేదు. సుగ్రీవుడు బాధపడుతూ ఉండగా, విభీషణుడు ప్రత్యేక శ్రద్ధతో, సుగ్రీవుని కన్నీటిని తుడుస్తూ 'ఓ రాజా! రామలక్ష్మణులను పునరుజ్జీవింప జేయడ నాకు తెలుసు. వారు మరణించబోరు. దుఃఖించకు. నీవు రామునికి కాపలా కాస్తూ ఉండు. నేను వానరులకు ధైర్యం చెప్పి వస్తాను.' అని అన్నాడు.

వానరాగ్రగణ్యులు రామలక్ష్మణులకు కాపలా కాస్తుండగా, ఇంద్రజిత్తు రావణుని వద్దకు చేరి, తాను విజయం సాధించానన్న భ్రమతో విజయవార్తను నివేదించాడు. రామలక్ష్మణులను ఇంద్రజిత్తు చంపాడనే వార్తతో రావణుడు కుమారుని ఆలింగనం చేసుకొని 'కుమారా! ఇంత గొప్ప కార్యాన్ని ఎలా సాధించావు? చెప్పు.' అని అడిగాడు. అందుకు ఇంద్రజిత్తు బదులు చెప్తూ 'నేను ఆకాశంలో అదృశ్యంగా నిలిచి వారిని నాగాస్త్రాలతో బంధించాను. ఆ ర్వాత నిశిత బాణవర్షం కురిపించాను. వారు ఇప్పుడు నేలపై ప్రాణం లేకుండా పడివున్నారు.' వానర యోధులు నిరాశతో యుద్ధం చాలిస్తున్నారు.' అని చెప్పాడు. ఇపుడు రావణునికి ఏ భయాలు లేవు. అందుచేత రావణుడు సీతకు కాపలాగా ఉన్న రాక్షస స్త్రీలను పిలువనంపాడు. వారితో రావణుడు ఇలా అన్నాడు. 'నా కుమారుడు ఇంద్రజిత్తు రామలక్ష్మణులను వధించాడు. ఈ వార్తను సీతకు వెంటనే చెప్పండి. రాముడు ఎలా వధించబడ్డాడో చూచుటకు సీతను పుష్పరథంలో తీసుకువెళ్ళి చూపించండి.' అన్నాడు.

తరువాత రావణుడు ఇంద్రజిత్తు విజయ వార్తను లంకా నగరమంతటా చాటించి పౌరులకు ఆనందాన్ని పంచండి అని ఆదేశించాడు.

రావణుని ఆదేశం మేరకు, రాక్షసులు సీతకు మరణవార్త చెప్పగా, ఆమె వివశురాలై నేలమీద పడిపోయింది. అంతట రాక్షస స్త్రీలు ఆమెను పుష్పరథంపై తీసికొనిపోయి నేలపై పడివున్న రామలక్ష్మణులను చూపించారు. సీత

ఆ దృశ్యాన్ని చూచి నిగ్రహించుకోలేక పోయింది. తన సౌభాగ్యాన్ని గురించి పండితులు, జ్యోతిష్కులు చెప్పినవన్నీ బూటకమని తేలిపోయింది. 'రాముడు లేక నా సౌభాగ్యం అంతరించింది.' అంటూ సీత విలపించింది. అంతట త్రిజట సీతను సమీపించి 'రాకుమారీ! రామలక్ష్మణులు మరణించ లేదని నిర్భయంగా ఉండు. ఎందుకంటే ఈ దివ్య రథం వితంతువులను మోయజాలదు. కిందికి చూడు. వానర శ్రేష్ఠులు రామలక్ష్మణులను కావలి కాస్తూనే ఉన్నారు. మరణించి వుంటే కాపలా ఎందుకు? వారి ముఖాల మీద తేజస్సు కనిపిస్తోంది. సీత నీ భర్త ఎప్పటికీ జీవించే ఉన్నాడు' అని అన్నది. ఆమె మాటలు విన్న సీత కొంచెం ధైర్యం తెచ్చుకోగా, ఆమెను మళ్ళీ అశోక వనానికి చేర్చారు. ఆ పరిస్థితి చూచిన సీత నుండి దుఃఖం దూరం కాలేదు.

రాముడు తిరిగి స్పృహలోనికి వచ్చాడు. కాని ప్రక్కనే అచేతనంగా ఉన్న లక్ష్మణుని చూచి దుఃఖితుడై, లక్ష్మణుడు లేకుండా నేను అయోధ్యకు వెళ్ళలేను. అతడు మరణిస్తే, నేనూ మరణిస్తాను. సుగ్రీవుని వైపు తిరిగి రాముడు 'లక్ష్మణుడు, నేను తమను రక్షించకపోతే, వానర సేన ప్రమాదస్థితిలో చిక్కుకొంటుంది. నీవు నీ సేన నా సేవలో ప్రాణాలకు తెగించారు. నా కృత్జ్ఞతలను స్వీకరించు. తిరిగి వెనుకకు వెళ్ళవలసిందే' అని అనగా వానరులందరూ విలపించసాగారు. విభీషణుడు వానర సైన్యంలో ధైర్యం నింపి తిరిగి వచ్చాడు. రామలక్ష్మణుల దుస్థితిని చూచి విభీషణుడు విలపించాడు. సుగ్రీవుడు విభీషణుని కౌగిలించుకొని 'రామలక్ష్మణులు తిరిగి కోలుకొని త్వరలో రావణుని వధించటానికి వెళుతారనే విషయం శంకించవద్దు' అన్నాడు. అంతట సుగ్రీవుడు తన మామయైన సుషేణుని వద్దకు వెళ్ళి, రామలక్ష్మణులను కిష్కింధకు చేర్చు.అక్కడ వారు గాలినుండి కోలుకొంటారు. వానరులు కూడ వెళతారు. నేనొక్కడినే ఇక్కడ ఉంటాను. నేను రావణుని ఓడించి, సీతను కిష్కింధకు తెస్తాను' అని అన్నాడు. అందుకు జవాబుగా సుషేణుడు ఇలా అన్నాడు. 'పూర్వం దేవదానవుల యుద్ధంలో ఎందరో దివ్యులు వధించబడ్డారు. అయితే బృహస్పతి ఔషధ మూలికలను ఉపయోగించి మరల వారిని బ్రతికించారు. వీటి గురించి సంపాతికి, పవనుడికి బాగా తెలుసు. వారిని క్షీరసాగరం వద్దకు పంపాలి. స్వయంగా బ్రహ్మదేవుడే సృష్టించిన ఆ రెండు మూలికలు ప్రాణాలు కాపాడతాయి. చంద్ర, ద్రోణ పర్వతాల మీద ఆ మూలికలు లభిస్తాయి. హనుమంతుడైతేనే వాటిని తేగలడు. వానిని పంపాలి' అని అన్నాడు. ఇంతలో సాగరం సంక్షుభితం కావడంతో తీవ్ర ప్రభంజనం వీచింది. పర్వతాలు ప్రకంపించ సాగాయి. ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు. కాని ఒక బృహత్తర విహంగం వల్ల ఆ కల్లోలం జరుగుతున్నదని వారు గ్రహించారు. అతను మహావిష్ణువు వాహనమైన గరుత్మంతుడు. ఆయన రామలక్ష్మణులను చూచిన వెంటనే వారిని బంధించిన నాగాస్త్రాలు పారిపోయాయి. గరుత్మంతుడు అంతట రామలక్ష్మణులను చేతులతో తుడిచాడు. ఆయన స్పర్శమాత్రం చేత వారి శరీరాలు ప్రకాశించ సాగాయి. శక్తి రెట్టింపయింది. గరుడుడు రాముని ఎత్తి ఆలింగనం చేసుకొన్నాడు. రాముడు సంతోషంతో 'మేము నీకు ఋణపడి ఉన్నాం. నీవెవరివో దయచేసి చెప్పు.' అని రాముడు అన్నాడు.

ఆ మహావిహంగం (గరుడుడు) బదులు ఇస్తూ 'నేను నీ నిత్య సేవకుణ్ణి అయిన గరుత్మంతుణ్ణి. వినతా పుత్రుణ్ణి. ఇంద్రజిత్తు నాగాస్త్రాల నుండి నిన్ను దేవతలు విడిపించ లేరు. ఇంద్రజిత్తు వీటిని అస్త్రాలుగా మార్చాడు. సర్పాలు నాకు సహజసిద్ధమైన ఆహారం కనుక వారికి నేనంటే ఎప్పటికీ భయమే. నా ప్రియ ప్రభూ! వారిని తరిమివేయటానికి ఇక్కడికి వచ్చాను. రాక్షసులతో పోరులో మీరు చాల జాగ్రత్తగా ఉండాలి. మీరు సదా ఋజువర్తనులై ఉండగా వారు సదా జిత్తులమారులై ఉంటారు. నేను వెళ్ళి వస్తాను. నేనొక హామీ ఇస్తున్నాను. నీవు విజయం సాధించటం, సీతను తిరిగి పొందటం తథ్యం' అని అన్నాడు. అంతట గరుత్మంతుడు రామునికి

ప్రదక్షిణ నమస్కారాలు చేసి మరొక్కసారి ఆలింగనం చేసుకొని ఆకాశంలోకి దూసుకపోయాడు. రామలక్ష్మణులు పూర్వస్థితికి రావడం చూచి అందరూ ఆనందంలో మునిగితేలారు. దుందుభులు మ్రోగించి, యుద్ధం కొనసాగించటానికి సిద్ధమైనారు.

వానరుల గర్జనలను విన్న రావణుడు, రామలక్ష్మణులు మళ్ళీ జీవించారనే అనుమానించాడు. కారణం తెలుసుకోమని రాక్షసులను పంపాడు. వారికి రామలక్ష్మణులు సజీవంగా, స్వస్థ దేహాలతో కన్పించారు. వారు వెళ్ళి రావణునికి ఈ వార్త చెప్పారు. రావణుడు వికలుడై, క్రోధంతో ధూమ్రాక్షుడనే రాక్షస మహా యోధుణ్ణి తక్షణమే వెళ్ళి రామునిపై దాడిచేయమని ఆజ్ఞాపించాడు. అతడు వెంటనే సైన్యాన్ని సమీకరించుకొని, గార్ధభాలు కట్టిన తన రథాన్ని అధిరోహించాడు. హనుమంతుడు నిలిచివున్న పశ్చిమ ద్వారం వైపు పయనమైనాడు. ఇతడు లంకా పురవీథుల్లో వెళ్తుండగా, ఒక పెద్ద రాబందు అతని రథం మీద వాలింది. మరికొన్ని పక్షులు ధ్వజం మీద వాలాయి. ఎవరో ఒక తలలేని మొండాన్ని అతని దారిలో పడేశారు. రక్తవర్షం కురవసాగింది. ఈ దుశ్శకునాలను గమనించిన ధూమ్రుడు కొద్దిగా భయపడ్డాడు. కొందరు సైనికులు మూర్ఛిల్లారు. అయినా ధైర్యంతో ధూమ్రాక్షుడు వానర యోధులను సమీపించాడు. ఆపై భీకర యుద్ధం జరిగింది. రెండు వైపుల చాలమంది చనిపోయారు. వానర సేన భీభత్సానికి తట్టుకోలేక రాక్షసులు పారిపోయారు.

ఇటు ధూమ్రాక్షుడు వానరసేనపై విరుచుకు పడటంతో వానరులు కూడ భీతితో పరుగు తీశారు. హనుమంతుడు క్రుద్ధుడై ఒక పెద్ద పాషాణ ఖండాన్ని ఎత్తి ధూమ్రాక్షుని రథంమీదికి వేసి ముక్కలుగా చేశాడు. హనుమంతుడు తన విధ్వంస కాండను కొనసాగించాడు. హనుమంత, ధూమ్రాక్షుల మధ్య పోరాటం జరిగి, దానిలో ధూమ్రాక్షుడు ప్రాణాలు కోల్పోయాడు. దీనివల్ల రాక్షససేన లంకకు పారిపోగా, రావణుడు వజ్రదంష్ట్రుణ్ణి యుద్ధానికి పంపాడు. అతడు అంగదుని సమీపించాడు. అంగదుడు భీకరంగా స్పందించాడు. ఇతని ప్రతిస్పందనకు యావత్ రాక్షస సేన కాలికి బుద్ధి చెప్పడంతో సేనాధిపతి నిస్సహాయుడై నిలిచిపోయాడు. ప్రతిక్రియగా, వజ్రదంష్ట్రుడు తన బాణపరంపరతో శత్రువులను సంహరించగా, వానరులు అంగదుణ్ణి ఆశ్రయించారు. అంగదుడు వానిని ఎదుర్కొనటానికి బయలుదేరగా, వజ్రదంష్ట్రుడు 1,00,000 బాణాలను ప్రయోగించి అంగదుని దేహాన్ని రక్తసిక్తం చేశాడు. అంగదుడు భీకరంగా గర్జిస్తూ మొనదేలిన ఒక పర్వత శిఖరాన్ని విసరగా, వజ్రదంష్ట్రుడు రథం మీదనుండి దూకి ప్రాణాలు కాపాడుకొన్నాడు. కాని రథం నుగ్గు నుగ్గు అయింది. అదే అదనుగా అంగదుడు మరొక శిలాఖండాన్ని వజ్రదంష్ట్రుడి శిరస్సు మీద విసిరి కొట్టాడు. రాక్షసుడు రక్తం కక్కుకుంటూ స్పృహ తప్పి నేల కూలిపోయాడు. అయితే త్వరలోనే వజ్రదంష్ట్రుడు స్పృహలోకి వచ్చాడు. తన గదతో అంగదుని రొమ్ము మీద గుద్దాడు. ఇద్దరూ అలసిపోయేంతవరకు ముష్టిఘాతాల్లో మునిగిపోయారు. వీరిద్దరు పరస్పరం పోరాడి, చివరకు మోకాళ్ళపై కూలబడ్డారు. అదే అదనుగా అంగదుడు అతని ఖడ్గాన్ని గుంజుకొని అతని శిరస్సును ఛేదించాడు. తమ సేనానాయకుడు ఇలా మరణించగా, రాక్షసులు లంకకు పారిపోయారు.

ఇది తెలిసిన రావణుడు మహావీరుడైన అకంపనుణ్ణి పిలిచి, వానరులను చంపి, రామలక్ష్మణులను సంహరించి రమ్మని ఆదేశించాడు. యుద్ధానికి బయలుదేరిన అకంపనుడు తనకు దుశ్శకునాలు ఎదురైనా లెక్కచేయక, తన రాక్షస సైన్యంతో ముందుకు సాగాడు. ఉభయ సేనలు ఒకరినొకరు సంహరించుకొంటూ భీకర యుద్ధం చేశారు. రాక్షసులు రాక్షసులను, వానరులు వానరులను తెలియకుండానే సంహరించుకో సాగారు. చెదిరిన వానర యోధులను చూచిన హనుమంతుడు అకంపనుణ్ణి సమీపించగా తక్కినవారు వెనక ఉన్నారు.

అకంపనుడు బాణవర్షం కురిపిస్తుండగా, హనుమంతుడు నవ్వుతూ ఒక పర్వత శిఖరం నుండి ఒక ఖండాన్ని పెరికాడు. ఆ ఖండంతో శత్రువు మీదికి దూసుకుపోయాడు. కాని ఆ రాక్షసుడు శిలాఖండాన్ని ముక్కలు చేశాడు. హనుమంతుడు కోపంతో ఒక మహావటవృక్షాన్ని పెకలించి శత్రువుల వైపు దూసుకుపోయాడు. ఇతని ఉగ్రరూపాన్ని చూచి రాక్షసులు పరుగెత్తి పోసాగారు. హనుమంతునిపై అకంపనుడు 14 బాణాలు వేశాడు. కాని హనుమంతుడు బెదరక ఆ మహావృక్షంతో శత్రువు శిరస్సుపై మోదగా, అతడు నేలకూలి మరణించాడు. రాక్షసులందరు లంకకు పారిపోతుండగా, రామలక్ష్మణులు, వానరులు హనుమంతుణ్ణి అభినందించారు.

అకంపనుడి మరణవార్త రావణుడు విన్నాడు. ఆందోళనకు గురైనాడు. రక్షణ ఏర్పాట్లు సమీక్షించడానికి సభికులను పిలిపించాడు. తన సైన్యాధ్యక్షుని ఉద్దేశంచి, 'ప్రహస్తా! నీవు, నేను, కుంభకర్ణుడు, నికుంభుడు, ఇంద్రజిత్తు మాత్రమే వానరులను ఓడించగల సమర్థులం. నీ వంతుగా శత్రువుల మీద దాడిచేయి.' అని అన్నాడు. అందుకు ప్రహస్తుడు బదులు చెప్తూ 'రాజా! సీతను రామునికి అప్పగించమని నేను ఇదివరలో సలహా ఇచ్చాను. కాని అపుడు యుద్ధం ప్రకటించబడింది. నీ తరపున నేను ప్రాణాలు త్యజించటానికి సిద్ధంగా ఉన్నానని గ్రహించు' అని అన్నాడు.

ప్రహస్తుడు సైన్యంతో బయలుదేరాడు. ప్రయాణంలో దుశ్శకునాలు కనిపించాయి. ఒక రాబందు వచ్చి అతని ధ్వజశూలాగ్రం మీద వాలింది. అతిశీతల వాయువులు వీచాయి. మేఘాలు అతని మీద రక్తం వర్షించాయి. సారథి కొరడా జారిపోతోంది. అశ్వాలు తూలుతున్నయి. ప్రహస్తుని తేజస్సు క్షీణించసాగింది. సుగ్రీవుని సేన వైపు కదిలాడు ప్రహస్తుడు. మొదట పోరాటంలో వానరులను ఊచకోత కోశారు రాక్షసులు. అంతట ద్వివిదుడు ఒక పెద్ద పర్వత శిఖరాన్ని విసిరి వానరాంతకుణ్ణి వధించాడు. దుర్ముఖుడు సమున్నతుణ్ణి నుగ్గు చేశాడు. జాంబవంతుడు మహానందుడి వక్షాన్ని నుగ్గు చేశాడు. తారుడు ఒక వృక్షంతో కుంభహనుణ్ణి సంహరించాడు. దీనికి ప్రతీకారంగా ప్రహస్తుడు బాణాల కుంభవర్షంతో వేలాది వానరులను సంహరించాడు. వానరవీరుడు నీలుడు అనేకమంది రాక్షసులను సంహరించాడు. తర్వాత నీలుడు, ప్రహస్తుడు ఎదరెదురుగా తలపడ్డారు. యోధులిద్దరూ నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు. ప్రహస్డుడు గదతో నీలుడి నుదిటి మీద కొట్టడంతో రక్తం విరజిమ్మింది. నీలుడు ఒక వృక్షంతో ప్రహస్తుని వక్షస్థలం మీద మోదాడు. ప్రహస్తుడు సమీపించగా, నీలుడు ఒక బండరాతిని దొరకబుచ్చుకొని అతని మీద విసరగా, ప్రహస్తుని శిరస్సు ముక్కలై అతడు మరణించాడు. రాక్షసులు లంకకు పారిపోగా, రామలక్ష్మణులు నీలుణ్ణి అభినందించారు.

సైన్యాధ్యక్షుని మరణవార్త వినిన రావణుడు దుఃఖభరితుడైనాడు. సచివులతో 'శత్రువులను ఇక ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయలేము. నేనే స్వయంగా రణరంగంలో ప్రవేశిస్తాను.' అని ప్రకటించాడు. రావణుడు రాక్షస సైన్యంతో రథం మీద నగరం దాటి వెలుపలకు వచ్చాడు. ఇలా వస్తున్నా వానిని చూచి రాముడు విభీషణుని కొన్ని వివరాలు అడిగాడు. అంతట రావణుడు తనకు కనిపించగానే రాముడు 'తన అసాధారణమైన తేజస్సు, బలపరాక్రమం వల్ల, రాక్షసరాజు దుర్నిరీక్ష్యంగా ఉన్నాడు. అయినా రావణుడు నా దృష్టిలోకి రావడం నా అదృష్టమేనని నా నిశ్చయం. ఇంతకాలం నాలో దాగిన క్రోధాన్ని వెళ్ళగక్కే అవకాశం ఇప్పుడు నాకు లభించింది.' అన్నాడు.

కొంత సైన్యాన్ని లంకలోనే రక్షణకు ఉంచబడింది. నగరం నుండి వెలుపలికి వచ్చిన రావణుడు వానర సముద్రాన్ని రెండుగా చీల్చుకొంటూ దారి చేసుకొని వస్తుండగా, రామలక్ష్మణులు తమ ధనుస్సులను దాల్చి సమాయత్తమైనారు.

సుగ్రీవుడు ఒక పర్వత శిలను తెచ్చి, రావణునిపై వేయడంతో యుద్ధం మొదలైంది. అయితే రావణుడు వాటిని ముక్కలు చేసి, మరొక బాణం వేయగా అది సుగ్రీవునిలో లోతుగా దిగబడింది. బాధతో సుగ్రీవుడు నేలకొరిగాడు. రాక్షసులు గంతులు వేశారు ఆనందంతో. ఇతర వానర ముఖ్యులు పర్వత శిలలతో రావణుని వైపు దూసుకెళ్ళారు. రావణుడు వారినందరిని సంహరించినందున, తాకిడికి తట్టుకోలేక వానరులు రాముని ఆశ్రయించారు.

రాముడు రావణుని వైపు బయలుదేరుతుండగా, రాక్షస రాజుతో ముందుగా పోరాడటానికి అనుమతించమని లక్ష్మణుడు రాముని బ్రతిమాలుకొన్నాడు. రాముడు సమ్మతించాడు. హనుమంతుడు లక్ష్మణునికి సహాయంగా నిలుస్తూ శిలలు విసురుతూ రావణుని బాణాలను నిరోధించాడు. ఇక నిగ్రహించుకోలేక హనుమంతుడు ఒక్కసారిగా రావణుని వైపు దూసుకెళ్ళాడు. హనుమంతుడు తన కుడిచేతిని శిరస్సుకంటే ఎత్తుగా ఎత్తి 'బ్రహ్మదేవుడిచ్చిన వరం వల్ల వానరుల చేతిలో నీకు మరణం లేకుండా పోదు. నా శక్తివంతమైన ఒక్క ముష్టిప్రహారంతో నిన్ను చంపేస్తాను.' అని సవాలు చేశాడు. 'నిన్ను ఒక్క దెబ్బతో చంపుతా' అని రావణుడు కూడ సవాలు విసిరాడు. అందుకు హనుమంతుడు 'మూర్ఖుడా! నీ కుమారుడైన అక్షుణ్ణి ఎంత సులువుగా హతం చేశానో మరచిపోయావా?।' అనగా రావణుడు ఒక్క ఉదటున హనుమంతుని వైపు వచ్చి వక్షస్థలంపై చరచటంతో, హనుమంతుడు వెనుకకు తూలాడు. హనుమంతుడు కోలుకొని అరచేతితో రావణుని కొట్టి ఎదురు దెబ్బ తీశాడు. రావణుడు దిమ్మెర పోయాడు. ఈ యుద్ధాన్ని చూస్తున్న దేవతలు, ఋషులు హనుమంతుని పొగిడారు.

రావణుడు కోలుకొని హనుమంతుడు తనకు తగిన ప్రత్యర్థేనని ప్రశంసించాడు. దానికి హనుమంతుడు 'నీవింకా బ్రతికే ఉన్నావు కనుక నా పరాక్రమం గణనీయం కాదని అర్థం చేసుకోగలను. నీవు నన్ను ప్రత్యర్థిగా అనుకొంటే, మరొకసారి కొట్టు' అని అన్నాడు. రావణుడు కోపంతో హనుమంతునిపై విపరీతంగా ముష్టిప్రహారాలు కురిపించగా, హనుమంతుడు తూలాడు. అంతటితో హనుమంతుని వదలిపెట్టి, నీలునిపై శరవర్షం కురిపించ సాగాడు రావణుడు. నీలుడు ఒక పర్వత శిలను ఎత్తి రావణునిపైకి విసిరాడు. ఈలోగా హనుమంతుడు కోలుకొన్నాడు. కాని ఒకరిపై పోరాటం చేసేటప్పుడు, మరొకరు జొరబడకూడదు. అందుచేత ఊరుకొన్నాడు. నీలుడు, రావణుని మధ్య పోరాటం జరిగి చివరకు నీలుడు సూక్ష్మరూపం ధరించి రావణుని ధ్వజశూలం మీదికి దూకాడు. రావణుడు మండిపడ్డాడు. నీలుడు రావణుని ధ్వజశూలం నుండి రావణుని ధనస్సు మీదికి దూసుకు పోవడం చూచి రామలక్ష్మణులు ఆశ్చర్య పడ్డారు.

రావణుడు అంతట ఒక శక్తివంతమైన ఆగ్నేయాస్త్రాన్ని అభిమంత్రించి వదలగా అది నీలుని వక్షస్థలాన్ని తాకగా, అతడు క్రిందికి దొర్లి పడ్డాడు. నీలుడు అలా అయిపోగానే, రావణుడు లక్ష్మణుని వైపు సాగాడు. రావణుడు వదిలే బాణాలను లక్ష్మణుడు ఖండించివేశాడు. కోపించిన రావణుడు శరవర్షం కురిపించగా, లక్ష్మణుడు వాటిని నిర్వీర్యం చేశాడు. అంతట లక్ష్మణుడు రావుణిని మీదికి బాణాలు వదిలాడు. రావణుడు వాటిని ముక్కలు చేశాడు. చివరగా రావణుడు ఒక బ్రహ్మాస్త్రాన్ని వదలగా, అది లక్ష్మణుని నుదుటిని తాకింది. లక్ష్మణడు మూర్ఛిల్లి యుద్ధభూమిలో నేలకొరిగాడు. ఎంతో కష్టంతో కోలుకొని లక్ష్మణుడు తిరిగి దాడి ప్రారంభించాడు. లక్ష్మణుడు తన శక్తివంతమైన బాణాలతో రావణుని ధనస్సును విరిచి, మూడు బాణాలతో అతనిని గాయపరచగా, అతడు స్పృహ కోల్పోయాడు. రావణుని అవయవాలన్నీ రక్తసిక్తమై నేలపై పడి ఉన్నాడు. తరువాత ఎంతో ప్రయత్నించి చాలసేపటికి లేవగలిగాడు. తన ప్రత్యర్థిని ఓడించాలని, రావణుడు తనకు బ్రహ్మ ప్రసాదించిన శూలాన్ని తీసుకొని

మహావేగంతో లక్ష్మణుని వైపు విసిరాడు. లక్ష్మణుడు ఎంత ప్రయత్నించినా దానినుండి తప్పించుకోలేక పోయాడు. ఆ శూలం అతని వక్షస్థలంలో దిగబడింది. లక్ష్మణుడు నేలపై పడిపోయాడు. లక్ష్మణుడు తేరుకోవాలని ప్రయత్నంలో ఉండగా, అతనిని బంధించాలని రావణుడు వచ్చాడు. ఆ సమయంలో సాక్షాత్తూ శ్రీమహావిష్ణువుయొక్క సంపూర్ణ విస్తృతిని లక్ష్మణుడు జ్ఞప్తికి తెచ్చుకొని, తన అపరిమిత బలశక్తులను ప్రదర్శించసాగాడు. నిజానికి రావణుడు ముల్లోకాలను ఎత్తగల శక్తి గలవాడు. కాని ఆ శక్తిని ఉపయోగించికూడా లక్ష్మణుని ఎత్తలేక పోయాడు.

రావణుడు రథాన్ని అధిరోహిస్తుండగా, హనుమంతుడు అకస్మాత్తుగా వచ్చి, అతని వక్షస్థలం మీద తన పిడికిలితో బలంగా గుద్దాడు. రావణుని 10 నోళ్ళు, 20 కర్ణాలు, ఇరవై నేత్రాల నుండి రక్తం స్రవించి, స్పృహ కోల్పోయి, రథం నుండి క్రిందికి నేలమీదకు జారిపడ్డాడు. వానరులు హర్షధ్వానాలు చేవారు. అంతట హనుమంతుడు లక్ష్మణుడు గాయపడిన చోటికి వెళ్ళాడు. హనుమంతుడు లక్ష్మణుని మోసుకుపోతుండగా, మాయాశూలం తన పని పూర్తి కావటంతో లక్ష్మణుని వక్షస్థలం నుండి తనకు తానే ఉపసంహరించుకొని రావణుని వద్దకు తిరిగి వెళ్ళింది. ఈలోగా రావణుడు స్పృహలోకి వచ్చి మళ్ళీ తన ధనస్సును అందుకొన్నాడు. లక్ష్మణుడు కూడా లేచి నిలిచాడు. శ్రీమహావిష్ణువు యొక్క ప్రభావంతో ఆయన గాయాలన్నీ మాయమైనాయి. రావణుని మూలంగా ఎందరో వానరులు చనిపోయినందున, రాముడు తాను స్వయంగా రావణునితో సంఘర్షించ వలసిన సమయం ఆసన్నమైందని భావించాడు. హనుమంతుడు అభ్యర్థించగా రాముడు అతని వీపుపై ఎక్కి రావణుని వద్దకు దూసకెళ్ళి యుద్ధానికి సవాలు చేశాడు. రామునిపై విపరీత ద్వేషభావం గల రావణుడు హనుమంతునిపై శరవర్షం కురిపించ సాగాడు. కాని వాటి ప్రభావం శూన్యం. రాముడు రావణుని రథం ముందుకు వెళ్ళి దానిని నుగ్గుచేశాడు.

రాముడు ఒక ఉజ్వలమైన శరాన్ని ఎక్కుపెట్టి రావణుని వక్షస్థలాన్ని ఛేదించటంతో, రావణుడు దిమ్మెర పోయి, తన ధన్నును జారవిడిచాడు. రాముడు రావణుని ధ్వజాన్ని విరిచి వేశాడు. అంతట రాముడు రావణునితో 'నీవు ఎందరో వానరులను చంపావు. అలసిపోయి ఉంటావు. నేను నిన్ను ఇపుడు చంపుటకు ఇష్టపడటం లేదు. నీవు లంకకు తిరిగి ఎళ్ళి విశ్రాంతి తీసికోవచ్చు. నీవు బాగా కోలుకొన్న పిదప నేను నీతో తిరిగి యుద్ధం చేస్తాను.' అని ప్రకటించాడు.

ఈ మాటలు విని రావణుడు అవమానభారంతో లంకకు తిరిగి వెళ్ళాడు. రామలక్ష్మణులు వానరుల దేహాలనుండి బాణాలను వెలికితీసే పని చేపట్టారు. రావణుని భీతిని తిలకించిన దేవతలు, ఋషులు ఆకాశంనుండి వీక్షించి, తమ కార్యం త్వరలోనే నెరవేరబోతోందని ఆనందించారు.

విచారవదనంతో రావణుడు తన సింహాసనంపై ఉండి సచివులకు ఇలా వివరించాడు. – 'బ్రహ్మదేవుని నుండి నేను వరాలు పొందినపుడు నన్ను మానవు విషయంలో జాగ్రత్తగా ఉండమని హెచ్చరించాడు. ఆ తర్వాత ఇక్ష్వాకు వంశపు రాజు అనరణ్యుడనే అతను నన్ను ఇక్ష్వాకు వంశపు రాజు వధిస్తాడని శపించాడు. తరువాత వేదవతిని నా కోర్కె తీర్చమన్నపుడు ఆమె కూడ శపించింది. నిజానికి ఆమెయే జనకపుత్రికగా అవతరించి వచ్చిందని తలుస్తున్నాను. అంతేకాదు, ఒకసారి నేను కైలాస పర్వతాన్ని ఎత్తినపుడు ఉమాదేవి భయపడి 'ఓ దుష్టుడా! నీ మృత్యువుకు ఒక స్త్రీయే కారణ మవుతుందని శపించింది. తరువాత ఇంకొకసారి, నేను నందీశ్వరుని చూచి వానర ముఖంలా వుందని నవ్వగా, ఒక వానర సేన నీ వంశాన్ని నాశనం చేస్తుందని అతడు కూడ శపించాడు. పైగా నేను అమాయక స్త్రీలను మానభంగం చేసినందుకు గాను రంభ, బ్రహ్మదేవుడు, నలకూబరుడు

నన్ను వివిధంగా శపించారు. ఇలా నా పూర్వ పాపఫలాలన్నీ ఇపుడు ఫలిస్తున్నాయని అర్థం చేసుకో గలుగుతున్నాను. రాక్షసులారా! యుద్ధంలో కుంభకర్ణుని తలదన్నగల వారెవరూ ఉండరు. తొమ్మిది రోజుల క్రితమే నిద్రలోకి జారుకొన్నాడు. సాధారణంగానైతే ఆరు నెలలు నిద్రిస్తాడు. ఇపుడు అతను లేకపోతే నాకు భారీ నష్టం జరుగుతుంది. అని రావణుడు చెప్పగా, వెంటనే రాక్షసులు కుంభకర్ణుని వద్దకు వెళ్ళారు. అనేక వస్తువులను అతనికి రుచికరమైనవి, ఇష్టమైనవి తీసికొని గుహను బోలిన భూగర్భస్థితమైన అతపి నివాసానికి వెళ్ళారు. అతని నాసిక నుండి వెలువడుతున్న వాయువేగం వీరిని వెనుకకు నెట్టింది. ఎంతో కష్టం మీద అతని వద్దకు చేరి లేపే ప్రయత్నం సాగించారు. కుంభకర్ణుడు ఒక బృహత్తర శయ్యపై నిద్రిస్తూ రత్నకిరీటాల కారణంగా ప్రకాశిస్తున్నట్లు కనిపిస్తున్నాడు. ముందుగా అతనిముందు భాండంలో రక్తమాంసాలను తెచ్చి పెట్టారు. శరీరానికి పరిమళ ద్రవ్యాలను పూశారు. స్తోత్రం చేస్తున్నా, కుంభకర్ణుడు మాత్రం నిద్రపోతూనే ఉన్నాడు. అంతట రాక్షసులు గర్జించటం, అతని చెవుల్లో శంఖాలను ఊదటం, దుందుభులు మ్రోగించడం ప్రారంభించారు. చేతులను, కాళ్ళను కదిలించారు. ఇంతచేసినా కుంభకర్ణుడు నిద్ర లేవలేదు. ఆ తర్వాత రాక్షసులు సుత్తులతోను, గదలతోనూ కొట్టడం ప్రారంభించారు. కాని అతని ఉచ్ఛ్వాస నిశ్వాసల వల్ల వచ్చే వాయువేగానికి ఎదురుగా నిలబడే శక్తి వారికి లేకపోయింది. పైగా శ్వాస దుర్గంధంతో ఉంటుంది. అతని నోరు నరకద్వారమే. అతని చుట్టూ నిలిచిన 10 వేల మంది రాక్షసులు అతని ఉచ్ఛ్వాస నిశ్వాసలకు అటూ ఇటూ సోలుతూ, ఊగుతూ వున్నారు. ఆ తర్వాత రాక్షసులు అశ్వాలను, గార్ధభాలను తెప్పించి అతని దేహం మీద నడిపించారు. కొందరు దూలాలతో కాళ్ళను మోదారు. కాని అతడు మేల్కొన లేదు. విసుగుచెందిన రాక్షసులు వెయ్యి ఏనుగులతో అతని శరీరాన్ని తొక్కించారు. ఎట్టకేలకు ఎవరో తనను మృదువుగా మేల్కొలుపుతున్న భావనతో కుంభకర్ణుడు మేల్కొన్నాడు. ఒళ్ళు విరిచి, ఆవలించి తినటానికి ఏమి ఉన్నాయని చూచాడు. తనకోసం ఉంచిన రక్తమాంసాలను తనివితీర మెక్కాడు. తరువాత రాక్షసులను చూచి కుంభకర్ణుడు 'నన్ను అకాలంలో ఎందుకు లేపారు? మీకు ఏదో విపత్తు వచ్చి వుంటుంది. లేకపోతే నన్ను ఎవరూ లేపరు?' అని అన్నాడు. అందుకు యుపాక్షుడనే సచివుడు ఇలా చెప్పాడు. 'లంకానగరాన్ని రామలక్ష్మణుల నాయకత్వంలో వానరసేన చుట్టబెట్టింది. చాలమంది రాక్షస వీరులు చనిపోయారు. రావణుడు స్వయంగా వెళ్ళగా, రాముడు అతన్ని పరాజితుణ్ణి చేసి పంపాడు.' అని చెప్పగా కుంభకర్ణుడు 'నేను వెంటనే వెళ్ళి రామలక్ష్మణుల రక్తాన్ని త్రాగుతాను. ఆ తరువాతనే, నేను రావణుని కలుసుకుంటాను.' అని అన్నాడు. అయితే మహోదరుడు అందుకు అంగీకరించక 'రావణుడు నీకు అగ్రజుడు, రాజు. కనుక నీవు ముందు ఆయన్ని కలిసి, ఆదేశాలు స్వీకరించటం మంచిది' అని సలహా ఇచ్చాడు. రాక్షసులందరు రావణుని కలిసి జరిగినదంతా చెప్పారు. 'కుంభకర్ణుని ముందుగా రామునితో యుద్ధం చేయమంటారా? లేక మీవద్దకు రమ్మంటారా చెప్పం'డని వారు అడిగారు. అందుకు రావణుడు 'ఆయన్ని ఇక్కడికి తీసికొని రండి. నేను తగిన సలహాలు చెప్తాను. అతనికి తగినంత మద్యమాంసాలు అందించి, ప్రసన్నంగా ఇక్కడికి వచ్చేటట్లు చేయండి.'అని అన్నాడు. రాక్షసులు మళ్ళీ తగిన రీతిలో మద్యమాంసాలను, రక్తాన్ని తీసుకొని కుంభకర్ణుని వద్దకు వెళ్ళారు. కుంభకర్ణుడు వాటినంతటిని తిని ఉత్సాహభరితుడయ్యాడు. తన సోదరుని కలుసుకునేందుకు ఆ గుహనుండి కుంభకర్ణుడు బయటికి వచ్చాడు. ఆ మహాకాయాన్ని చూచిన వానరులు భీతి చెందారు. కొందరు రాముని వద్దకు వెళ్ళారు. కుంభకర్ణుని చూచిన రాముడు 'రెండవ మేరుపర్వతం వలె వున్న ఈ రాక్షసు డెవరు?' అని అడగగా విభీషణుడు 'ఇతడు విశ్రవసు ఋషి యొక్క పుత్రుడు కుంభకర్ణుడు. యమధర్మరాజును పరాజితుణ్ణి చేశాడు. పుట్టుకతోనే వేలాదిమందిని స్వాహా చేశాడు. వీడి శౌర్యానికి భయపడి ప్రాణులందరూ దేవేంద్రుని ఆశ్రయించగా, దేవేంద్రుడు క్రుద్ధుడైనాడు. ఇంద్రుడు కుంభకర్ణుని మీద దాడి చేశాడు.

ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించగా, రాక్షసులు స్పృహ కోల్పోయాడు. కాని త్వరలోనే తేరుకొని ఐరావతం యొక్క దంతాన్ని ఊడబెరికి, దానిని ఇంద్రుని వక్షస్థలంపై కొట్టగా, ఇంద్రుడు తీవ్ర ఆవేదన చెందాడు. తరువాత ఇంద్రుడు బ్రహ్మదేవుని ఆశ్రయించి ఇలా అన్నాడు. 'కుంభకర్ణుడనేవాడు ఋషులను వేధిస్తూ, పరస్త్రీలనుఅపహరిస్త, ప్రాణులను హరిస్తూ ఉండేవాడు. మేమూ ఎంతోకాలం వుండలేము.' అని చెప్పాడు. బ్రహ్మదేవుడు ధ్యానంలోనికి వెళ్ళిదివ్యదృష్టితో కుంభకర్ణుని ఆగడాలు చూచి కవలర పడ్డాడు. బ్రహ్మదేవుడు కుంభకర్ణుని సమీపించి 'నిన్ను లోక వినాశం కోసం సృష్టించడం జరిగింది. కాని ఇపుడు లోకరక్షణ అవసరమైంది. కనుక సకల జీవుల సంరక్షణ కోరి, నీవు ఈ రోజునుండి గాఢనిద్రలో నిమగ్నుడవై పడి వుంటావు' అని అన్నాడు. కొద్ది క్షణాల్లోనే కుంభకర్ణుడు బ్రహ్మదేవుని శాప ప్రభావానికి లోనైనాడు. అపుడు రావణుడు 'ఓ బ్రహ్మదేవా! నీ మునిమనుమణ్ణి ఇలా శపించటం తగదు. మంచి సమయంలో పడగొట్టావు. నీ శాపం వృధా పోదు అని తెలుసు. అందుకే కుంభకర్ణుడు కొంతసేపు మేలుకొని ఉండే సమయాన్నివ్వు' అని వేడుకొన్నాడు. దానికి బ్రహ్మదేవుడు 'సరే! కుంభకర్ణుడు ఆరు నెలలు నిద్రించి, ఒక రోజు మేల్కొంటాడు.' అని అన్నాడు. చివరగా విభీషణుడు ఇలా చెప్పాడు. 'రావణుడు యుద్ధ తాకిడి చేత కుంభకర్ణుని ముందే లేపాడు. ఈ మహాకాయుణ్ణి చూచి మన వానరులు భయపడిపోయారు. కుంభకర్ణుడు కేవలం ఒక భారీ వస్తువేనని మనం వానరులకు చెప్పితే, వారి భయం పోతుంది.' అని అన్నాడు.

కుంభకర్ణుడు రావణుని ప్రాసాదంలోనికి ప్రవేశించగా, వానరులందరిని సమీకరించి పురద్వారాలను ముట్టడించ వలసినదిగా రాముడు నీలుణ్ణి ఆదేశించాడు. వానరులకు, రాక్షసులకు ఇలా యుద్ధం తిరిగి ప్రారంభమయింది. అదే సమయంలో, ఆందోళనతో పుష్పరథంపై ఆసీనుడైన రావణుని ఎదుటకు కుంభకర్ణుడు వేలాదిమంది అనుచరులతో వచ్చి నిలిచాడు. కుంభకర్ణుని చూడగానే, రావణుడు సంతోషంతో ప్రక్కన కూర్చుండ బెట్టుకొని ఆలింగనం చేసుకొన్నాడు. 'రావణా! నీకు నేను ఏ విధమైన సేవ చేయాలి' అని కుంభకర్ణుడు అడిగాడు. అందుకు రావణుడు 'రామలక్ష్మణులు ఇప్పటికే చాలమంది రాక్షస వీరులను చంపారు. వారిని వధించగల సమర్థులు ఎవరూ లేనందున, ఆ పనికోసం నీ మీదనే ఆధారపడుతున్నాను' అని అన్నాడు. రావణుని మాటలకు కుంభకర్ణుడు నవ్వి 'విభీషణుడు మున్నగు సచివులు చెప్పినట్లే ఇపుడు జరుగుతున్నది. ప్రియ సోదరా! శ్రేయోభిలాషుల హితబోధ పెడచెవిన పెట్టిన నీవు వట్టి మూర్ఖుడవు. సీతను తిరిగి అప్పగించమని అందరూ హితం చెప్పారు. కాని నీవు నీ తప్పులను సరిచేసుకోవటానికి ఇంకా సమయం మించి పోలేదు. కాని నిర్ణయం మాత్రం నీదే.' అని అన్నాడు. అడగని సలహా విన్న రావణుడు క్రోధాన్ని అణచుకొని 'ప్రియ సోదరా! ఇప్పుడు పూర్తి స్థాయిలో యుద్ధం జరుగుతుంటే, ఇప్పుడు ఈ మాటల వల్ల ఏమి ప్రయోజనం? నిజమే నేను సీతను అపహరించి దోషం చేసినా, నీవు ఆ దోషాన్ని నిర్దోషంగా మార్చగలవని, అది నీ బలపరాక్రమాలతోనే సాధ్యమని నేను ఆశిస్తున్నాను. ఇదే నా అభ్యర్థన.' అని అనగా, రావణుని శాంతింప జేయటానికి కుంభకర్ణుడు మృదువుగా 'రాజా! దుఃఖించకు. నీ శత్రు సమూహాన్ని యావత్తునూ నేను సంహరిస్తాను. నేను లేకపోవడంతో వీరందరూ వీరులైనారు. ఇక నా శక్తి ముందు ఏమి జరుగుతుందో నీవే చూస్తావు.' అని అన్నాడు. రావణుని సంతోష పెట్టడానికి, మహోదరుడు 'నీ సోదరుడు రాజు కనుక సీతను అపహరించటంలో తప్పేమీ లేదు. నీ అగ్రజుణ్ణి విమర్శించవద్దు. నీవు చెప్పుకొంటున్న నీ స్వీయ శక్తిచేత రాముణ్ణి పరాజితుణ్ణి చేయలేవని చెప్పగలను.' అని చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు. 'రాజా! నీవు సీత మనస్సును గెలుచుకోవటానికి ఒక ఉపాయం చెపుతాను.

కుంభకర్ణుడు, నేను ఇతర రాక్షస యోధులు రామునిపై దండెత్తుతాము. మేము అతన్ని వధించగల్గితే మనదే విజయం. లేక మేము పరాజితులం అయితే, మేము లంకకు తిరిగి వచ్చి, మేము వారిని భక్షించాము అని చెప్పుకొంటూ, ఈ వార్తనే నగరమంతా చాటింపు వేయిస్తే, ఆ వార్త సీతను చేరి, దుఃఖసాగరంలోమునిగి ఉన్నపుడు నీవు ఆమెను సమీపించవచ్చు. నీవు అపుడు ఆమెను అన్ని ప్రలోభాలతో ముంచెత్తాలి. తనకు వేరే దిక్కులేక లొంగిపోతుంది అని చెప్పగలను. ఓ రాజా! నీవు రామునితో యుద్ధం చేస్తే, నీవు మరణించటం ఖాయం. కనుక నీవు నా మాట వింటే, రాముణ్ణి ఎదుర్కోకుండానే, సీతను గెలుచుకోగలవు' అని అన్నాడు. దీనికి కుంభకర్ణుడు పరుషంగా 'మహోదరా! నీ మాటలు భీరువులైన రాజులకే వర్తిస్తాయి. రాముణ్ణి వధించాలని నేనెప్పుడో నిర్ణయించుకున్నాను. నా నిర్ణయం వృధా కాదు. నేనొక్కడినే సరిదిద్దుతాను. మీరు నాశనం చేశారు నాకు ఎవరి సహాయం అవసరం లేదు.' అన్నాడు. ఈ మాటలకు రావణుడు నవ్వి, 'నీవు చెప్పింది నిజమే. వానికి రాముడంటే భయమే. కాని నీవు యుద్ధభూమిలో అడుగుపెడితే నీ ఎదుట ఎవరూ నిలువలేరు. యుద్ధానికి బయలుదేరు. ఒంటరిగా గాక రాక్షస సేనను వెంటబెట్టుకొని వెళ్ళు' అని చెప్పాడు. రావణునికి ఉత్సాహం వచ్చింది. కుంభకర్ణుని మెడలో ఒక స్వర్ణ హారాన్ని, పూదండలను వేసి ఇతర ఆభరణాలతో అలంకరించాడు. భయంకరమైన శూలాన్ని చేపట్టాడు కుంభకర్ణుడు. ఒక స్వర్ణ కవచాన్ని ధరించాడు. రావణునికిప్రదక్షిణ నమస్కారం చేయగా, రావణుడు కౌగిలించుకొని ఆశీర్వదించాడు.

కుంభకర్ణుడు యుద్ధరంగం చేరగానే, తన దేహాన్ని 600 ధనస్సుల ఎత్తుకు 100 ధనస్సుల వెడల్పుకు విస్తరింపజేశాడు. కాని ఎన్నో దుశ్శకునాలు కనిపించ సాగాయి. వాడి వామనేత్రం అదరసాగింది. వామభుజం కంపించింది. అతని శూలం మీద ఒక రాబందు వచ్చి వాలింది. అయితే అతడు వాటిని లెక్కపెట్ట లేదు. వీనిని చూచిన వానరులు భయంతో పరుగులు తీశారు. అయితే అంగదుడు ఎలాగో సేనను సమీకరించాడు. అలా తిరిగి వచ్చిన వానరులు కుంభకర్ణుడి మీద అసంఖ్యాకమైన వృక్షాలను, పర్వత శిలలను వర్షించారు. అవి ఆ మహాకాయునికి తగిలి తుత్తునియలైనాయి. కోపంతో కుంభకర్ణుడు వానరులను సంహరించ సాగాడు. అంతట అంగదుడు సైనికులను సమీకరించి వారితో 'ఆశతో పారిపోవటం కంటే రణరంగంలో మరణించటం మేలు. యశస్సు. పిరికిపందలుగా బ్రతకటం వ్యర్థం. అవమానం, అది మృత్యువుకంటే బాధాకరం' అంటూ ఉద్బోధించాడు. అయినా వారు ప్రాణాలకే విలువనిచ్చి పారిపోతూనే ఉన్నారు. అదిచూచి రాముడు సంహరిస్తాడంటూ నమ్మబలికిన మీదట వారు తిరిగి వచ్చారు. కుంభకర్ణుని వైపు దూసుకెళ్ళగా అతడు తన గదను ఊపుతూ 7 వేల మంది పైగా వానరులను నేల కూల్చాడు. ఒక్కసారిగా 30 మంది వానరులను తన చేతులతో పట్టుకొని గుహలాంటి తన నోటిలో కుక్కుకొన్నాడు.

ద్వివిదుడు ఒక గొప్ప శిలను కుంభకర్ణుని వైపు విసిరాడు. అది గురితప్పి, రాక్షసుల మధ్యలో పడి ఎందరో రాక్షసులు హతులైనారు. హనుమంతుడు ఆకాశం నుండి కుంభకర్ణునిపై పర్వతశిలను పడవేయాలని ప్రయత్నించాడు. కాని కుంభకర్ణుడు దానిని ముక్కలు చేశాడు. అంతట కుంభకర్ణుడు తన దేహాన్ని కుదించి, వానరుల వైపు వస్తుండగా, హనుమంతుడు వానిపై పర్వత శిలను విసిరాడు. దానినుండి తప్పించుకొన్న కుంభకర్ణుడు తన శూలాన్ని విసరగా, అది హనుమంతుని వక్షస్థలంలో గ్రుచ్చుకొని, అతడు రక్తం కక్కి బాధతో అరిచాడు.

దానికి భయపడి వానరవీరులు పరుగెత్తగా నీలుడు వారినందరిని సమీకరించి కుంభకర్ణునిపై ఒక శిల విసరగా, దానిని ఆ రాక్షసుడు ముక్కలు చేశాడు.

అంతట ఋషభుడు, శరభుడు, గవాక్షుడు, నీలుడు, గంధమాదుడు కలిసి ఒక్కసారిగా కుంభకర్ణుని మీదికి లంఘించారు. కుంభకర్ణుడు ఋషభుని చేజిక్కించుకొని స్పృహ కోల్పోయేలా నేలకేసి కొట్టాడు. మిగిలిన నలుగురు వానర వీరులను కూడ ఆ రాక్షసుడు అదేవిధంగా చేయగా, వారు మూర్ఛిల్లి నేలపై పడిపోయారు. వానరులంతా రెచ్చిపోయి వేలాదిమంది కుంభకర్ణుని శరీరం మీదికి వెళ్ళి, తమ కోరలతో కొరకటానికి ప్రయత్నిస్తుండగా, కుంభకర్ణుడు వారిని చేతులతో చిక్కించుకొని, తన నోట్లో కక్కుకొన్నాడు. ఇలా అసంఖ్యాకులైన వానరులను కుంభకర్ణుడు స్వాహాచేశాడు. వానరులు రాముని వైపు పరుగులు తీస్తుండగా, అంగదుడు ఆకస్మికంగా కుంభకర్ణుని శిరస్సు మీద ఒక పర్వత శిలను విసిరాడు. కోపించిన కుంభకర్ణుడు అంగదునిపై శూలాన్ని విసిరాడు. అంగదుడు తప్పించుకొని, పైకెగిరి కుంభకర్ణుని వక్షస్థలంపై గట్టిగా చరచటంతో, అతడు స్పృహ కోల్పోయి నేలమీద పడ్డాడు. కాని వెంటనే లేచి, కుంభకర్ణుడు అంగదునిపై అరచేతితో కొట్టగా, అంగదుడు ఆ ఘూతాన్ని భరించలేక నేలమీద పడ్డాడు. అంతట కుంభకర్ణుడు శూలాన్ని తీసికొని సుగ్రీవుని వైపు దూసుకెళ్ళగా, అతను ఒక పర్వత శిఖరాన్ని తీసుకొన్నాడు. సుగ్రీవుడు విసిరన ఆ పర్వత శిల, కుంభకర్ణుని వక్షస్థలానికి తగిలి ముక్కలు ముక్కలుగా అయింది. రాక్షసులకు సంతోషం, వానరులకు దుఃఖం.

కుంభకర్ణుడు గర్జిస్తూ తన శూలాన్ని సుగ్రీవునిపై విసిరాడు. ఇలా ఇద్దరి మధ్య జరుగుతున్న పోరాటాన్ని హనుమంతుడు ఆకాశం నుండి గమనిస్తూ, గాలిలో ఆ శూలాన్ని అందిపుచ్చుకొని, మోకాలి మీద దానిని మధ్యకు విరిచి వేశాడు. కుంభకర్ణుడు ఇది చూచి నిరుత్సాహ పడ్డాడు. కాని ఒక పర్వత శిలను పెకలించి బలం కొద్దీ సుగ్రీవుని మీదికి విసరగా, అది తగిలి అతడు స్పృహ కోల్పోయాడు. కుంభకర్ణుడు అపుడు అతన్ని చంకలో ఇరికించుకొని లంకకు వెళ్ళసాగాడు. దీనిని చూచిన హనుమంతుడు, సుగ్రీవుడు బందీ అయితే మనకు కష్టమేనని భావించి, 'నేను ఒక మహాపర్వతమంత విస్తరించి, కుంభకర్ణుని వధిస్తాను' అని అనుకొన్నాడు. కాని మళ్ళీ 'సుగ్రీవుడు తెలివితో మళ్ళీ వస్తాడు. రాజును వేరొకరు విడిపిస్తే, అతను దానిని అవమానంగా తీసికొంటాడు అని అనుకొన్నాడు.

సుగ్రీవుణ్ణి బందీగా తీసుకొని వస్తుండగా, పురజనులు చల్లిన పన్నీరు వల్ల సుగ్రీవుడికి స్పృహ వచ్చింది. ఎదురుతిరగటం ప్రారంభించాడు. తన వాడియైన గోళ్ళతో సుగ్రీవుడు కుంభకర్ణుని చెవితమ్మెలను చీల్చివేశాడు. రాక్షసుని నాసికను, పార్శ్వాలను చీల్చి తెరిచాడు. కోపంతో కుంభకర్ణుడు కొట్టి విసిరి వేయగా, సుగ్రీవుడు వెంటనే ఆకాశంలోకి ఎగిరాడు. వచ్చి రాముని ప్రక్కన చేరాడు.

క్రుద్ధుడైన కుంభకర్ణుడు ఒక సుత్తిని చేతబట్టి మళ్ళీ శత్రుసైన్యంలోనికి చొరబడ్డాడు. చేతుల నిండా వారిని పట్టుకొని నోట్లో వేసుకోవడం ప్రారంభించాడు. వానరులు రాముని వద్దకు పోనీయకుండా అడ్డుపడ్డారు. అంతట లక్ష్మణుడు వచ్చి కుంభకర్ణునిపై శరపరంపరతో దాడిచేశాడు. కుంభకర్ణుడు వాటిని త్రోసివేయగా, లక్ష్మణుడు మళ్ళీ బాణాలను సమకూర్చుకోబోగా, కుంభకర్ణుడు 'నేను రామునితోనే యుద్ధం చేస్తాను. తమ్మునితో కాదు' అని అన్నాడు. లక్ష్మణుడు రాముని చూపించాడు. అంతట లక్ష్మణుని దాటుకొంటూ, రామునివైపు పయనమైనాడు.

కుంభకర్ణుడు సమీపిస్తుండగా, రాముడు ఒక రుద్రాస్త్రాన్ని వదిలాడు. అది అతని వక్షస్థలంలో దూసుకుపో, గదను జారవిడిచాడు. ఇతర ఆయుధాలు కూడ చెల్లా చెదరైపోయాయి. కాని కోలుకొని, ఒక పర్వతశిలను తీసుకొని రాముని వైపు దూసుకెళ్ళాడు. రాముడు శీఘ్రమే దానిని ఏడు బాణాలతో ముక్కలు చేశాడు. అంతట లక్ష్మణుడు రామునితో 'కుంభకరుణడు అందరినీ భక్షిస్తాడు. వేలాదిమంది వానరులు అతని శరీరం మీదికి ప్రాకి తమ బరువుతో వానిని వంచగలిగితే చాలు, వాడిని సులభంగా జయించవచ్చు.'అని అన్నాడు. వేనకు వేలు వానరులు ఎగబ్రాకసాగారు.

కుంభకర్ణుడు ఆ వానరులను విదిలించి వేయాలనే ప్రయత్నంలో ఉన్న విషయం గమనించి, రాముడు అదే అదనుగా ముందుకు సాగి వచ్చాడు. తన వింటినారిని లాగి రాముడు 'ఓ రాక్షసాధమా! ఒక్క క్షణం నా మాట విను. నా బాణాలతో నిన్ను యమపురికి పంపిస్తాను' అంటూ సవాలు విసిరాడు. తల పైకెత్తిన కుంభకర్ణుడు రాముని చూచి ఆనంద పడ్డాడు. కుంభకర్ణుడు నవ్వుతూ 'ఎంత అదృష్టం. నిన్ను ఇప్పుడే భక్షించి వేస్తాను.' అని అన్నాడు.

రాముని శరపరంపరకు ఏమాత్రం తొట్రుపడని కుంభకర్ణుడు ఒక భయంకరమైన గదను చేతబూనాడు. రాముడు ఒక వాయవ్యాస్త్రాన్ని అభిమంత్రించి వదలడంతో, కుంభకర్ణుని కుడి చేతిని అది ఖండించింది. రాక్షసుడు ఆర్తనాదం చేశాడు. క్రోధంతో అతడు ఒక మహావృక్షాన్ని తన చేతితో ఊడబెరికి రాముని వైపు దూసుకెళ్ళాడు. అయితే రాముడు ఒక ఇంద్రాస్త్రాన్ని ప్రయోగించి కుంభకర్ణుని ఎడమ చేతిని కూడా ఖండించి వేశాడు. ఆ మహాబాహువు నేలపై కూలగా చాలమంది రాక్షసులు, వానరులు నుగ్గునుగ్గైనారు. రెండు చేతులు తెగిపోయినా కుంభకర్ణుడు రాముని వైపు దూసుకు రాసాగాడు. అంతట రాముడు రెండు బాణాలను ప్రయోగించి, అతని రెండు పాదాలను తెగనరికాడు. అప్పటికీ రాముని స్వాహా చేయాలని నోరు తెరచుకొని రామును వైపు దేకుతూ రావడం చూచిన రాముడు తన అనేక బాణాలతో ఆ నోటిని కప్పివేయడంతో, వానికి ఊపిరాడ లేదు. చివరకు విపరీతమైన బాధతో కుంభకర్ణుడు స్పృహ కోల్పోయి తూలి పడసాగాడు. అప్పుడు రాముడు విడిచిన మరొక ఇంద్రాస్త్రం దిక్కులను ప్రకాశింపజేస్తూ ఆకాశం గుండా ప్రయాణిస్తూ కుంభకర్ణుని శిరస్సును ఛేదించింది. అతని శిరస్సు ఎగురుతూ వెళ్ళి మహా ప్రాసాదాలను, రక్షణ ప్రాకారాలను ధ్వంసం చేస్తూ లంకా నగరంలోని రాజవీథిలో పడింది. కుంభకర్ణుడి మహాకాయాన్ని ఆ బాణం పైకెత్తి సముద్రం మధ్యలో పడవేసింది. ఇది గమనించిన గగనంలో నిలిచిన దేవతలు హర్షధ్వానాలు చేశారు. వానరుల ఉత్సాహం చెప్పపనిలేదు. కుంభకర్ణుని బంధువులు రోదించగా, ఆ వీరోచిత కార్యాన్ని సాధించిన రాముడు దివ్యానందాన్ని పొందాడు.

కుంభకర్ణుని శరీర భాగాలు ఎలా ఎక్కడ పడిపోయాయో అన్న విషయాలు రావణుడికి చెప్పడం జరిగింది. ఈ వార్త విన్న రావణుడు స్పృహ కోల్పోయాడు. తిరిగి స్పృహలోనికి వచ్చి కుంభకర్ణుడు లేని నేను ఇక జీవించ లేను. విభీషణుని మాట వినకుండా ఎంత పొరపాటు చేశాను.' అంటూ విలపించగా అపుడు రావణుని కుమారుడు త్రిశిరుడు 'తండ్రీ! విలపించకు. నా వద్ద బ్రహ్మదేవుడిచ్చిన అస్త్రాలున్నాయి. నా సోదరులు ముగ్గురూ మాయాజాలంలో సిద్ధహస్తులు. వారు ఆకాశంలోనే యుద్ధం చేయగలరు. మేము వెళ్ళి ఆ రామలక్ష్మణులను, వానరులను తుదముట్టిస్తాం.' అని అన్నాడు.

త్రిశిరుని మాటలకు రావణుడు ఉత్తేజితుడైనాడు. తన నలుగురు కుమారులను మహాపార్శ్వ, మహోదరులతో పాటు అన్ని విధాల అలంకరించి, యుద్ధానికి పంపాడు. శక్తివంతులైన ఆ ఆరుగురు మహాయోధులు బ్రహ్మాండమైన రాక్షస సేనతో యుద్ధానికి వెళ్ళారు. ఉభయ పక్షాల మధ్య యుద్ధం ప్రారంభమైంది.

ఖండిత శిలలతో, వృక్షాలతో రణభూమి భయంకరంగా ఉంది. నరాంతకుడు తన శూలంతో 700 మంది వానరసైన్యాన్ని చంపేశాడు. అతనిపై దాడిచేయమని సుగ్రీవుడు అంగదుణ్ణి ఆదేశించాడు. అపుడు అంగదుడు 'నీ శూలం చేతనైతే నామీదికి విసురు' అని అనగా, నరాంతకుడు అలాగే శూలాన్ని విసిరాడు. అది అంగదని తాకగానే, ముక్కలై నేలపై పడిపోయింది. అంగదుడు అశ్వాల యొక్క కపాలం మీద గ్రుద్దాడు. నరాతంకుడు అంగదుని కపాలం మీద ముష్టిఘాతాన్ని ప్రయోగించాడు. రక్తం కారుతుండగా అంగదుడు తూలి వెనుకకుపడ్డాడు. కాని వెంటనే తేరుకొన్నాడు. మళ్ళీ తన శక్తిని ప్రయోగించి శత్రువులను చితకబాదాడు ఆ మహాఘాతం నరాతంకుని వక్షస్థలాన్ని నుగ్గుచేయడంతో, వాడు ప్రాణాలు విడిచి యుద్ధభూమిలో పడ్డాడు. రాముడు అంగదుని వీరోచిత కార్యాన్ని చూచి సంతసించాడు. అంతలో మహోదరుడు, దేవాంతకునితో, త్రిశరునితో కలిసి అంగదుని వైపు దూసుకెళ్ళారు.

వీరిని గమనించిన అంగదుడు ఒక మహావృక్షాన్ని పెకలించి, దానిని దేవాంతకునిపై విసిరాడు. అంగదుడు వారి మీద శిలలను, వృక్షాలను విసురుతూనే ఉన్నాడు. కాని లాభం లేకపోయింది. అపుడు మహోదరుడు ఏనుగుపై వచ్చి గదతో అంగదుని వక్షస్థలంపై కొట్టాడు. అంగదుడు బెదరకుండా చేతితో బలంగా గజాన్ని మోదగా అది చచ్చి పడింది. దాని దంతాన్ని పెరికి దేవాంతకునిపై విసరగా, అతను గాయపడ్డాడు. అయితే దేవాంతకుడు తేరుకొని గదతో అంగదుణ్ణి కొట్టగా, అతడు మోకాళ్ళపై కూలాడు. అంగదుడు ఎదురు నిలిచినప్పటికీ, త్రిశరుడు మూడు బాణాలతో అతని నుదిటి మీద కొట్టాడు. యువరాజును కాపాడటానికి హనుమంతుడు, నీలుడు ముందుకొచ్చారు. వీరి మధ్య భయంకర పోరాటం జరిగింది. దేవాంతకుడు ప్రాణం కోల్పోయి పడిపోయాడు. త్రిశరుడు నీలునిపై శరపరంపర విడువగా, మహోదరుడు మళ్ళీ రంగప్రవేశం చేశాడు. నీలుడు కొద్దిగా స్పృహ కోల్పోగా, త్వరలోనే తెలివిలోకి వచ్చి, ఒక పర్వత శిలను తీసికొని మహోదరుని శిరస్సుపై కొట్టాడు. మహోదరుడు చనిపోయి తన ముందు పడగానే, త్రిశరుడు కోపంతో శరవర్షంతో హనుమంతుని కట్టడి చేయసాగాడు.

హనుమంతునికి, త్రిశరునికి మధ్య పోరాటం భీకరంగా సాగింది. హనుమంతుడు త్రిశరుని అశ్వం మీద దూకి, దాని చర్మాన్ని చీల్చాడు. త్రిశరుడు శూలంతో హనుమంతుని పొడవబోగా, హనుమంతుడు దానిని రెండు ముక్కలుగా చేశాడు. త్రిశరుడు ఖడ్గంతో హనుమంతుని మోదాడు. హనుమంతుడు ఆ రాక్షసుని వక్షసథలం మీద చరచటంతో, అతను తెలితప్పి, రథం మీదినుండి క్రిందికి జారిపడ్డాడు. హనుమంతుడు జారిన ఖడ్గాన్ని తీసుకొని గర్జించగా, త్రిశరుడు భరించలేక మండిపడ్డాడు. అంతట త్రిశరుని మూడు తలలలో ఒకదానిని దొరకబుచ్చుకొని, వరుసగా మూడు తలలు నరికివేశాడు. వానరులు సంతసించగా, మహాపార్శ్వుడు ఇనుప గదను తీసుకొని, వానరులను తరిమి వేశాడు. అంత ఋషభుడు వచ్చి మహాపార్శ్వుణ్ణి పోరుకు

పిలవగా, వారి మధ్య పోరాట మొదలైంది. చివరగా, రాక్షసుడు ఋషభుని గదను తీసికోవాలని ప్రయత్నిస్తుండగా, ఆ గదను అతను తీసికొనేలోగా. వానర నేత అతని శిరస్సుపై గట్టిగా మోదటంతో ఆ రాక్షసుని శిరస్సు శరీరంలోకి దిగబడిపోయి అతడు ప్రాణం విడిచాడు.

అతికాయుడు వానరుల మీద దాడి ప్రారంభించాడు. వారు ఈ మహాకాయుని చూచి, పరాక్రమానికి భయపడి రాముని ఆశ్రయం కోసం పరుగులు తీశారు. వీడిని గురించిన విషయం రాముడు విభీషణుని ప్రశ్నించాడు. విభీషణుడు ఇలా చెప్పాడు. 'అతికాయుడనే వీడు రావణునికి, ధన్యమాలినికీ జన్మించినవాడు. వీడు తీవ్ర తపస్సు చేత బ్రహ్మదేవుని నుండి తనకు దేవదానవుల చేత మరణం లేకుండా వరం పొందాడు. అంతేకాదు బ్రహ్మ వీనికి అస్త్రాలు, కవచాలు, రథాన్ని కూడ ప్రసాదించాడు. అలా వాడు అసాధారణ శక్తివంతుడైనాడు. రామా! ఇదివరకు జరిగిన యుద్ధాల్లో ఇతడు ఇంద్రుని వజ్రాయుధాన్ని, వరుణుని పాశాలను త్రిప్పికొట్టగలిగాడు. అతడు వానర సేనను హరించకముందే, నీవు ఇతనిని సంహరించాలి.' అని అన్నాడు.

విభీషణుడు ఇలా చెప్తుండగానే, అతికాయుడు వానరుల మధ్య పోరు జరుగుతోంది. కాని చివరికి అతికాయుడు వానరులను ప్రక్కనపెట్టి, రాముని వైపు దూసుకొని వెళ్ళాడు. కోపించిన లక్ష్మణుడు తన ధనస్సుతో అతని వైపు వెళ్ళాడు. అతికాయుడికి, లక్ష్మణునికి మధ్య వీరోచిత వాగ్బాణాలు సాగాయి. అతికాయుడి పిలుపుకు లక్ష్మణుడు ప్రతిస్పందించాడు. అతికాయుడు తన బాణాన్ని విడువగానే లక్ష్మణుడు దాన్ని రెండు ముక్కలు చేశాడు. కోపించిన అతికాయుడు వెంటనే రెండు బాణాలను వదిలాడు. లక్ష్మణుడు వాటిని కూడ విరిచేసి, ఒక శక్తివంతమైన బాణంతో అతికాయుని నుదుటిని ఛేదించగా, అతడు వణికిపోయాడు. శీఘ్రమే కోలుకొని అతికాయుడు మళ్ళీ బాణాలను వదిలాడు. లక్ష్మణుడు వాటిని నిర్వీర్యం చేశాడు. కోపించిన రాక్షసుడు ప్రయోగించిన అస్త్రం లక్ష్మణుని వక్షస్థలంలోనికి వెళ్ళింది. రక్తస్రావం అవుతున్నా లక్ష్మణుడు ఆగ్నేయాస్త్రాన్ని అభిమంత్రించి వదలగా అతికాయుడు సూర్యాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ రెండు అస్త్రాలు ఒకదానినొకటి ఢీకొని భస్మమై నేలపై పడ్డాయి. అంతట అతికాయుడు త్వష్టాస్త్రాన్ని విడవగా, లక్ష్మణుడు దానిని ఇంద్రాస్త్రంతో ఎదుర్కొన్నాడు. అతికాయుడు మరో అస్త్రాన్ని విడువగా, లక్ష్మణుడు దానిని వాయవ్యాస్త్రంతో తటస్థీకరించాడు.

లక్ష్మణుడు శరపరంపరను వదలసాగాడు. 1000 బాణాలను వదలినా తొణకని అతికాయుడు ఒక్క బాణంతో లక్ష్మణుని వక్షస్థలాన్ని కొట్టగా ఆయన అచేతనుడైనాడు. కాని లక్ష్మణుడు త్వరలోనే తెలివి తెచ్చుకొని, అతని ధ్వజాన్ని పడగొట్టడమే కాకుండా, అశ్వాల్ని, సారథిని వధించాడు. ఎన్ని శక్తివంతమైన బాణాలను లక్ష్మణుడు వదిలినా, ఆ రాక్షసుణ్ణి కొంచెంగా కూడ గాయపరచ లేకపోయాడు. ఆ సమయంలో వాయుదేవుడు లక్ష్మణుని సమీపించి, 'అతికాయుడు బ్రహ్మ కవచాన్ని ధరించి వున్నాడు. అది దుర్భేద్యమైంది. కనుక నీవు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి, ఆ రాక్షసుని వధించు' అని చెప్పాడు. లక్ష్మణుడు అలాగే బ్రహ్మాస్త్రాన్ని వాని మీదికి వదిలాడు. బ్రహ్మాస్త్రాన్ని ఎదుర్కొనటానికి రాక్షసుడు ఎంతో ప్రయత్నం చేశాడు. ఫలించలేదు. బ్రహ్మాస్త్రం అతికాయుని శిరస్సును ఖండించి వేసింది. ఖండిత శిరస్సు నేలపై పడగా, రాక్షసులు లంకకు పరుగు తీశారు. వానరులు లక్ష్మణుని సమీపించి అభినందించారు. అతికాయుని మరణ వార్త రావణుని నిరుత్సాహ పరచింది. ఇలా

అలోచించాడు – 'రామలక్ష్మణులు అనూహ్య శక్తివంతులు. వారు ఇప్పటికే నా అత్యుత్తమ యోధులను చంపారు. రాముడంటే శ్రీమన్నారాయణుని అవతారమేనని ఇప్పుడు అర్థమవుతోంది. ఇంతకు ముందే తెలిసినను, వారిని పిరికిపందల ప్రేలాపనలుగా భావించాను. ఇపుడు రాముని ఓడించగల యోధుడెవరు?' అని ఆలోచించాడు. సచివులతో 'నగర ద్వారాల భద్రత చూడండి. అశోక వనం చుట్టూ భద్రత జాగ్రత్త. శత్రువు కదలికలను ప్రతివారు గమనిస్తూ ఉండాలి.' అని అన్నాడు. రావణుని వేదనను గమనించిన ఇంద్రజిత్తు 'నేను బ్రతికి ఉన్నంత వరకు నీవు దుఃఖించవద్దు. రామలక్ష్మణులను నేను ఈ రోజే వధిస్తానని వాగ్దానం చేస్తున్నాను.' ఇలా తండ్రి ఆజ్ఞతో ఇంద్రజిత్తు యజ్ఞవాటిక వద్దకు వెళ్ళి ఒక మేకను యజ్ఞ గుండంలో వేశాడు. అగ్ని ఉజ్వలంగా ప్రకాశించింది. ఇది శుభసూచకంగా భావిస్తూ, అగ్ని జ్వాలల్లోంచి అగ్నిదేవుడు వచ్చి ఆహుతిని స్వీకరించాడు.

తర్వాత ఇంద్రజిత్తు తన రథాన్ని, అన్ని ఆయుధాల్ని అదృశ్య రూపంలో మార్చగలిగే మంత్రాలను ఉచ్చరించాడు. శత్రువులపైకి తన సేనను పంపి, తాను అదృశ్య స్థానంలో నిలిచి వానరులపై శరపరంపరను వర్షించసాగాడు. వానరులు ఎదురు దెబ్బ తీస్తున్నారు. కాని వానరులు వధింపబడ సాగారు. అంతట ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించగా, స్వర్గమర్త్య లోకాలు కంపించాయి. ఆ అస్త్ర ప్రభావంతో లక్షల మంది వానరులు నేలకూలారు. అదృశ్యరూపంలో ఇంద్రజిత్తు శూలాలను, ఖడ్గాలను వర్షిస్తూనే ఉన్నాడు. వానరులు వ్యక్తిని చూడలేక పోతున్నారు. హనుమంతుడు, సుగ్రీవుడు, నీలుడు, జాంబంతుడు కూడ నేలకొరిగారు. ఇంద్రజిత్తు ఆయుధాల వల్ల రామలక్ష్మణులకు గ్రహణం పట్టినట్లున్నది. రాముడు శల్యగ్రస్తుడైనప్పటికీ, 'లక్ష్మణా! ఇంద్రజిత్తు బ్రహ్మదేవుని బాణాలను వదులుతున్నాడని అర్థం అవుతోంది. ఆ రాక్షసుడు అదృశ్యంగా ఉన్నంతకాలం అతన్ని ఎవరూ జయించలేరు. అందుచేత అతని బాణాలు నన్ను లోబరచుకోనివ్వటమే ఉత్తమం. మనం స్పృహ కోల్పోవటం చూచి ఇంద్రజిత్తు వెంటన లంకకు వెళ్ళి రావణునితో చెప్పడం ఖాయం. విజేతగా భావిస్తాడు.' అని అన్నాడు.

ఇంద్రజిత్తు బాణాలకు రామలక్ష్మణులు నేలమీద పడిపోయారు. ఇలా వీరిని చూచి సతోషంతో లంకకు తిరిగి వెళ్ళిపోయాడు ఇంద్రజిత్తు. నీరసించిన వానరులతో విభీషణుడు 'యోధులారా! రామలక్ష్మణులు గౌరవభావంతో నిస్సహనానికి లోనైనారు. మీరు శోకించకండి. కొద్ది క్షణాల్లోనే వారు మేల్కొని శత్రువులను సంహరిస్తారు. అని ధైర్యం చెప్పాడు.

అంతట హనుమంతుడు బ్రహ్మాస్త్రానికి అంజలి ఘటించి 'పోరు అణిగింది. చీకటి పడింది. సైన్యానికి ధైర్యం చెప్పడమే మన కర్తవ్యం.' అని అన్నాడు. బ్రహ్మాస్త్ర ప్రభావానికి లోనైన సుగ్రీవుడు, అంగదుడు, నీలుడు, నలుడు కూడ అక్కడ ఉన్నారు. 60 లక్షల మంది వానరులు కూడ కనిపించారు.

జాంబవంతుడు తీవ్రంగా గాయపడి ఉండటం వారు గమనించారు. జాంబవంతుడు 'హనుమంతుడు జీవించే వున్నాడా?' అని అడిగాడు. ఈ మాట విని విభీషణుడు 'రామలక్ష్మణుల గురించి కాకుండా, హనుమంతుణ్ణి గురించి ఎందుకు అడుగుతున్నావు?' అని ప్రశ్నించాడు. జాంబవంతుడు సమాధానం చెప్తూ 'హనుమంతుడు జీవించి ఉంటే, సైన్యం కూడ జీవించి ఉన్నట్లే. హనుమంతుడు మరణిస్తే, సైన్యం జీవించి వున్నా మరణించినట్లే! అని అన్నాడు.

ఈ మాటలు విని హనుమంతుడు ముందుకు వచ్చాడు. జాంబవంతుని పాదాలు పట్టుకని 'నేను క్షేమంగా ఉన్నాను. నీవు నిశ్చింతగా ఉండు' అని అన్నాడు. అంతట జాంబవంతుడు 'నీవు వెంటనే హిమాలయాలకు వెళ్ళి ఋషభ పర్వతం ఎక్కడ ఉందో చూడు. మహిమాన్వితమైన ఓషధులతో ఉజ్జ్వలమైన పర్వతం ఒకటి ఋషభ, కైలాసాలకు మధ్యన ఉంటుంది. నేను చెప్పిన నాలుగు మొక్కలను అక్కడినుండి తీసికొనిరా. ఈ నాలుగు ఔషధాల ప్రభావం ఏంటంటే – మృతసంజీవని జీవాన్ని యిస్తుంది, శల్యకరణి గాయాలను మాన్పుతుంది, సువర్ణకరని దేహంలోని తేజస్సును పునరుద్ధరిస్తుంది. సంధాని ఎముకలను కలుపుతుంది. ఈ నాలుగు ఔషధాలు నీవు తేగలిగితే, మరణించిన వారినందరిని పునరుజ్జీవులుగా చేయవచ్చు' అని అన్నాడు. దానిని విన్న హనుమంతునిలో నూతన చైతన్యం, శక్తి పెల్లుబికాయి. త్రికూట పర్వతానికి వెళ్ళిన మీదట మహాలంఘనానికి సిద్ధంగా ఉన్నాడు. ఇతని ఒత్తిడికి పర్వతశిఖరాలు నుగ్గు అయినాయి. లంకానగరపు ప్రాసాదాలు, పురద్వారాలు కూప్పకూల సాగాయి. నగరం యావత్తు కంపించటంతో పురజనులు భీతిల్లారు. హనుమంతుడు మొదట మలయ పర్వతం మీదికి లంఘించాడు. తర్వాత, తన శరీరాన్ని విస్తృత పరచి గాలిలోనికి ఎగురగా, అతి పెద్ద శిలలు, వృక్షాలు ఆయన వెంట వాయువేగంతో పోతున్నాయి. హనుమంతునికి కాంచనశిఖరాలు గల హిమాలయ పర్వతాలు కనిపించాయి. ఋషభ పర్వతం, కైలాస పర్వతం మధ్యలోగల పర్వతాన్ని (జాంబవంతుడు సూచించినది) గమనించిన హనుమంతుడు దాని ప్రకాశాన్ని చూచి ఆశ్చర్య పడ్డాడు. ఓషధుల కోసం హనుమంతుడు వెదికాడు. కాని కనుగొనలేక పోయి, భీకర గర్జనలతో మండిపడ్డాడు. 'శ్రీరాముని సేవకు భంగం కలిగిస్తే, నిన్ను నుగ్గు నుగ్గు చేస్తాను.' అని అంటూ, ప్రతిస్పందన లేనందున, ఆ పర్వతాన్నే ఎత్తుకొని పోయి జాంబవంతుని ముందు పెడితే, అతడే ఆ ఓషధులను కనుగొంటాడు అని హనుమంతుడు అనుకొన్నాడు. పర్వతాగ్రభాగాన్ని త్రుంచి హనుమంతుడు ఆకాశంలో 1000 యోజనాలు ఎగిరి లంకకు చేరాడు. అతడు త్రికూట పర్వతంపై వాలడంతో వానరులు హర్షించారు. జాంబవంతుడు ఆ ఓషధులు తీసి, రామలక్ష్మణుల నాసికా రంధ్రాల వద్ద ఉంచడంతోనే, వారి గాయాలు నయమైనాయి. వానరులపై ప్రయోగించగా, వారుకూడ స్వస్థులైనారు. అంతకు ముందు మరణించిన వారుకూడ జీవితులైనారు. అంతట హనుమంతుడు ఆ పర్వత శిఖరాగ్రాన్ని తీసికొని పోయి యథాస్థితిలో ఉంచాడు. తిరిగి వచ్చేసరికి చీకటి పడింది. సుగ్రీవుడు 'హనుమా! రాక్షసులు చనిపోగా వారిని రావణుడు సముద్రంలో విసిరి వేయమన్నాడు. అందుచేత ఎందరో తెలియదు. కాని ఇప్పటికి రావణుని పుత్రుడు ఇంద్రజిత్తు ఒక్కడే బ్రతికి ఉన్నాడు. లంకానగరం రాక్షసహీనంగా ఉంది. కాబట్టి మనం కాగడాలు చేపట్టి రాత్రివేళనే లంకను కలవర పెట్టాలని నా ఆలోచన.' అని అన్నాడు. కొద్దిసేపట్లోనే, వానరులు లంకకు బయలుదేరి, పురద్వారాలను సమీపించే సరికి, ద్వారరక్షకులైన రాక్షసులు పారిపోయారు. అందుచేత వానర నేతలు సులభంగా లంకాప్రవేశం చేసి కాగడాలతో ప్రాసాదాలకు, కుడ్యాలకు నిప్పు పెట్టసాగారు. మంటల్లో చిక్కుకొన్న వేలాది భవంతులు మసి అయిపోయాయి. దేహాలు కాలిన రాక్షసులు, జనం భీతితో పరుగులు తీశారు.

రామలక్ష్మణులు తమ ధనస్సులను చేతబట్టారు. రాముడు తన వింటినారిని మీటగా వచ్చిన ధ్వనికి రాక్షసులు భీతితో పరుగు తీయసాగారు. అంతట రాముడు లంకానగర ప్రధాన ద్వారాన్ని తన శర పరంపరతో

నాశనం చేశాడు. రావణుడు ఉన్మత్తుడైనాడు. కుంభకర్ణుని పుత్రులను, ఇతర రాక్షస వీరులతో కలిసి వారిమీద దాడి చేయమని పంపాడు. ఈ ఇరువురి మధ్య లంక పురద్వారాలకు వెలుపల ప్రారంభమైన యుద్ధం అతి భయంకరంగా సాగింది. ఇరుపక్షాల్లో యోధులు ఊరకోతకు గురి అవుతుండగా, అంగదుడు కంపనుని వైపు దూసుకెళ్ళాడు. ఆ రాక్షసుడి గదాఘాతానికి అంగదుడు స్పృహతప్పి వెనుకకు పడిపోయాడు. కాని అంగదుడు వెంటనే తేరుకొని ఒక పర్వత శిలను అకంపనునిపైకి బలంగా విసరగా, ఆ శిలాఘాతానికి శిరస్సు పగిలి అతడు మరణించాడు. కోపించిన శోణితాక్షుడు అంగదునిపై బాణవర్షం కురిపించాడు. అందుడు భయపడకుండా చేతులతోనే అంగదుడు ఆ రాక్షసుడి రథాన్ని, ధనుస్సును ముక్కలు చేశాడు. శోణితాక్షుడు రథం దిగి శూలాన్ని, డాలును చేపట్టవలసి వచ్చింది. అంగదుడు ఖడ్గాన్ని దొరకబుచ్చుకొని దానితో దెబ్బ కొట్టాడు. శోణితాక్షుడు గాయపడి క్రింద పడిపోయాడు. అంగదుడు అపుడు ఇతర రాక్షస యోధులవైపు వెళ్ళాడు. మైందుడు, ద్వివిదుడు, శోణితాక్షుడు మున్నగు వారి మధ్య భయంకర యుద్ధమే జరిగింది. తనవైపు దూసుకొని వస్తున్న ప్రజంఘుణ్ణి అంగదుడు చేతి చరుపుతో శిరచ్ఛేదనం చేశాడు. కొద్ది సేపట్లోనే యుపాక్ష, శోణితాక్షులతో ద్వివిద, మైందులు మల్లయుద్ధంలో చిక్కుకొన్నారు. ఈ వీరులిద్దరు ఇలా మరణించగా, రాక్షస సేనలు కుంభుణ్ణి ఆశ్రయించారు తన మేనమామ లిద్దరూ నేలకూలటంతో అంగదుడు క్రుద్ధుడై కుంభుని వైపు దూసుకు పోయాడు. అంగదునికి కుంభుని మధ్య వివిధ రీతుల్లో పోరాటం జరిగింది. అంగదుడు నేలకూలాడు. దానితో వానరులు రాముని వద్దకు వెళ్ళి అంగదుని దీనస్థితిని వివరించారు. అంగదుని సహాయానికై రాముడు జాంబవంతుణ్ణి ఇతర సేనలతో పంపించాడు. కుంభుడు, సుగ్రీవుల మధ్య పోరు జరుగుతూ, కుంభుని రథం వద్దకు ముందుకు సాగాడు. అకస్మాత్తుగా సుగ్రీవుడు కుంభుని చేతుల్లోని ధనుస్సును గుంజుకొని విరిచేశాడు. సుగ్రీవుని ఉదాత్త వచనాలకు కుంభుడు ఆనందించాడు కాని అకస్మాత్తుగా సుగ్రీవుని తన దృఢ బాహువులతో దొరకబుచ్చుకొన్నాడ వారిద్దరి మధ్య జరిగిన మల్లయుద్ధం వల్ల భూమి క్రుంగిపోయింది. సుగ్రీవుని ఘాతాలకు కుంభకర్ణునిపుత్రుడు నుగ్గయి నేలకూలి మరణించాడు.

క్రుద్ధుడైన కుంభుడు గదతో హనుమంతుని వక్షస్థలం మీద మోదాడు. హనుమంతుడు పిడికిలి బిగించి నికుంభుని వక్షస్థలం మీద గట్టిగా కొట్టగా ఆ రాక్షసుడు కలవర పడ్డాడు. వీరిద్దరి పోరాటంలో, ఆ రాక్షసుని శిరస్సు దేహంనుండి వేరైపోయింది. ఈ మరణ వార్తవినగానే, రావణుడు మహారక్షకుడు అనేవాణ్ణి పోరాటానికి పంపించాడు. ఇతడు యుద్ధభూమిని సమీపించాడు. పలువురు వానరులను వధించాడు. రాముడు తన ధనుస్సుతో రాక్షసుల మీద శరవర్షం కురిపించాడు. మహారక్షకుడు రామునితో పోరాడమంటూ, ఒకటి తర్వాత మరొకటిగా బాణాలను రామునివైపు వదలగా, రాముడు వాటినన్నిటిని ఛేదించాడు. ఈ ద్వంద్వయుద్ధాన్ని దేవతలు ఆకాశం నుండి చూడసాగారు. వారు వదలిన అసంఖ్యాక బాణాల వల్ల యుద్ధభూమియే సరిగా కనిపించకుండా పోయింది. అంతటి భీకర పోరు సాగింది.

అంతట రాముడు ఆగ్రహంతోమహారక్షకుడి ధనస్సును త్రుంచివేసి అతని రథాన్ని ముక్కలు చేసి, అతని సారథని, అశ్వాలను వధించాడు. మహారక్షకుడు రథం దిగి, శూలాన్ని రాముని మీదకు విసిరాడు. రాముడు దానిని ముక్కలు చేశాడు. ఆపై రాముడు ఆగ్నేయాస్త్రాన్ని ఎక్కుపెట్టగా, రాక్షసుడు పిడికిలి బిగించి

రాముని వైపు వచ్చేలోగానే, రాముడు తన దివ్యాస్త్రంతో వాని హృదయాన్ని ఛేదించి, అతణ్ణి వధించాడు. తన నాయకుని మరణాన్ని చూచిన రాక్షస సేన లంకకు వెళ్ళిపోయింది.

ఇలా ఎంతోసేపు కాకుండానే, ఇంద్రజిత్తు మళ్ళీ యుద్ధభూమికి రానే వచ్చాడ. లక్ష్మణుడు ఇంద్రజిత్తును యుద్ధానికి రమ్మని పిలవగా, ఇంద్రజిత్తు విభీషణునితో – 'నాకు హాని చేయటానికి నా పినతండ్రే ఇక్కడికి వచ్చాడా? నేను నీ అన్నకు ప్రియ కుమారుణ్ణి. నీకు వారి పట్ల ప్రేమ లేదా? నీవూ రాక్షస వంశంలో జన్మించావు. బుద్ధిలేనివాడా! అతడి శత్రువులతో చేరి హింస కొనసాగించటానికి సిగ్గు లేదా? బంధువుల్లో ఎంతటి అధముడైనా ఇతరుల కంటే మేలనిపిస్తాడు. నీవు ద్రోహబుద్ధితో వ్యవహరిస్తున్నావు' అంటూ దూషించాడు.

అందుకు విభీషణుడు జవాబు చెప్తూ 'నాయనా! నీవు నీకన్నా పెద్దవాడినైన నన్ను ఎందుకు దూషిస్తావు? నీకు ధర్మనిరతి ఉందా? నేను రాక్షస వంశంలో జన్మించినా, నాలో క్రూరత్వం లేదు. క్రూరత్వం కలిగి కట్టుబ్లాటు తప్పినవాడు నీ తండ్రియే కాని నేను కాదు. బంధువులైనా అధర్మపరులైనపుడు వారిని త్యజించుటయే ఉత్తమమని ధర్మశాస్త్రాలు చెపుతున్నాయి. పరసతిని అపహరించేవాడు అధమాధముడు. అలాటి వారిని విసర్జించి. మిత్రులను విశ్వసించకపోవటం, పరస్త్రీ లైంగిక సంబంధం కోరడం, పరుల ఆస్తి అపహరించడం వినాశానికే దారితీస్తాయి. ఇంద్రజిత్తూ! నీకు అహంభావం మెండు. మర్యాద లేనివాడివి. నీవు త్వరలోనే లక్ష్మణుని చేతిలో వధించబడతావు.' అని అన్నాడు.

లక్ష్మణుడు హనుమంతుని వీపు మీద ఎక్కాడు. ఇంద్రజిత్తు ఆకస్మికంగా శరద్వయంతో లక్ష్మణుని గాయపరచాడు. ప్రతిగా లక్ష్మణుడు ఇంద్రజిత్తు వక్షస్థలంపై బాణపంచకం వదిలాడు. అలా భయంకరమైన ద్వంద్వ యుద్ధం ప్రారంభమైంది. కొంతసేపటికి లక్ష్మణుని బాణప్రభావంతో ఇంద్రజిత్తు బలహీన పడ్డాడు. రాక్షసుని తుదముట్టించమని విభీషణుడు కోరగా, లక్ష్మణుడు మరిన్ని శక్తివంతమైన బాణాలు వదలగా ఇంద్రజిత ఆశ్చర్యపడి, వెంటనే తేరుకొని ఏడు బాణాలను లక్ష్మణునిపై వదిలాడు. హనుమంతునిపై పది బాణాలను వదిలి ఇద్దరినీ గాయపరచాడు. కాని లక్ష్మణుడు నవ్వుతూ బాణపుంజంతో ఇంద్రజిత్తు స్వర్ణ కవచాన్ని ఛిద్రం చేశాడు. అయితే ఇంద్రజిత్తు వెయ్యి బాణాలను సంధించగా, లక్ష్మణుని కవచం కూడ ఛిద్రమైంది. ఎవరిదీ పైచేయి కాలేదు. యుద్ధం చాలసేపు సాగింది. ఇరువురు అనూహ్యమైన బాణాలు వేసుకోగా అవి భూమిలోకి చొచ్చుకొని పోయాయి. ఇద్దరూ అలసిపోలేదు. విభీషణుడు ఇతర రాక్షసులపై దాడిచేశాడు. హనుమంతుడు చెలరేగి పోయాడు. లక్ష్మణుడు, హనుమంతుడు వేలాదిమంది రాక్షసులను హతమార్చారు. సూర్యాస్తమయం సమీపించింది. అంధకారం ఆవరిస్తుండగా, లక్ష్మణుని బాణం ఇంద్రజిత్తు సారథి శిరస్సును ఖండించగా, ఇంద్రజిత్తు రథాన్ని నడుపుకొంటూ బాణ ప్రయోగం చేశాడు. కాని బాగా బలహీనపడ్డాడు. నలుగురు వానర యోధులు ఇంద్రజిత్తు అశ్వాల మీదికి లంఘించి వాటిని తమ వాడియైన గోళ్ళతో ముక్కలు ముక్కలుగా చీల్చివేశారు. రథాన్ని ముక్కలు చేయగా, ఇంద్రజితుత నేలపైకి దిగక తప్పలేదు. అంధకారంలో లక్ష్మణుడు తన శత్రువును సమీపించాడు. ఇంద్రజిత్తు నూతన రథం కోసం లంకలో ప్రవేశించాడు. నూతన రథంతో తిరిగి వచ్చి, ఇంద్రజిత్తు ఉత్సాహంతో వానర సంహారం చేయగా, వారు లక్ష్మణుని ఆశ్రయించారు. అంతట

లక్ష్మణుడు ఇంద్రజిత్తు ధనస్సును విరిచివేసి, ఐదు బాణాలతో అతని వక్షస్థలాన్ని గాయపరచాడు. ఇంద్రజిత్తు విడిచిన బాణాలను అన్నిటిని లక్ష్మణుడు నిరుపయోగం చేశాడు.

లక్ష్మణుడు మరింత ఉత్సాహంతో ఒక్కొక్క రాక్షసుణ్ణి రెండేసి బాణాలతో కొడుతూ, ఇంద్రజిత్తును గాయపరుస్తూ ఉన్నాడు. ఇంద్రజిత్తు కూడ శరవర్షం లక్ష్మణునిపై ప్రయోగించగా, అవన్నీ లక్ష్మణుని కవచానికి తగిలి క్రిందపడిపోయాయి. లక్ష్మణుని కవచం దుర్భేధ్యమని గ్రహించిన ఇంద్రజిత్తు అతని నుదుటి మీద బాణ ప్రయోగం చేశాడు. తాను గాయపడినా లక్ష్మణుడు ఇంద్రజిత్తు ముఖం మీదికి ఐదు బాణాలను వదిలాడు. ఇంద్రజిత్తు విభీషణుని ముఖంపై మూడు బాణాలు నాటగా, అతడు గదను తీసికొని ఇంద్రజిత్తు వైపు వెళ్ళాడు. విభీషణుడు అతని అశ్వాలను చితకగొట్టి చంపాడు. దానితో ఇంద్రజిత్తు రథంనుండి క్రిందికి దూకి విభీషణునిపై ఒక శూలాన్ని వదిలాడు. లక్ష్మణుడు దాన్ని ముక్కలు చేశాడు. అంతట విభీషణుడు ఇంద్రజిత్తు వక్షస్థలాన్ని ఐదు బాణాలతో ఛేదించగా, ఇంద్రజిత్తు యమాస్త్రాన్ని సంధించటం చూచిన లక్ష్మణుడు తనకు స్వప్నంలో కుబేరుడు ప్రసాదించిన ఒక అద్భుత అస్త్రాన్ని తీశాడు. ఆ రెండు అస్త్రాలను విడుదల చేయగా, ఆకాశంలో తగలి, చుక్కలు రాలిపడ్డాయి. అంతట లక్ష్మణుని వారుణాస్త్రాన్ని ఇంద్రజిత్తు రుద్రాస్త్రంతో నిలువరించాడు. ఇంద్రజిత్తు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించగా, లక్ష్మణుడు సూర్య క్షిపణితో దాన్ని త్రిప్పికొట్టాడు. అంతట ఇంద్రజిత అసురాస్త్రాన్ని ప్రయోగించగా, దానిని లక్ష్మణుడు ఒక రుద్రాస్త్రంతో నిర్వీర్యం చేశాడు. ఇంద్రజిత్తు క్రమంగా ధైర్యోత్సాహాలను కోల్పోసాగాడు.

అపుడే లక్ష్మణుడు దేవేంద్రుని వరప్రసాదితమైన ఒక అద్భుతాస్త్రాన్ని ఎంచుకొన్నాడు. లక్ష్మణుడు ఆ అస్త్రాన్ని వింటినారికి సంధించి, 'ఓ స్వర్గాధిపతీ! రాముడు నిజంగానే పౌరుషంలో ఎదురు లేనివాడైతే, సర్వ ధర్మాలకు ఆశ్రయం అయినవాడైతే, ఈ అస్త్రం రావణ పుత్రుని వధించు గాక!' అని ప్రార్థించి వదిలాడు. ఆ అస్త్రం గగనతలాన అతివేగంగా పయనించి ఇంద్రజిత్తు శిరస్సును ఛేదించింది. రాక్షసులు పరుగులు తీశారు. వానరులు హర్షించారు. ఆకాశంలో దేవతలు, ఋషులు లక్ష్మణుని అభినందిస్తూ పూలవర్షం కురిపించారు. వానరులు జై రామా, జై లక్ష్మణా అంటే కేకలు వేస్తూ నాట్యం చేశారు. పూర్తిగా అలసిపోయి, గాయపడిన లక్ష్మణుడు విభీషణ, హనుమంతుల మీదికి ఒరిగి, రామునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసేందుకు రాముని ఎదుటకు వచ్చాడు. విభీషణుడు ఇంద్రజిత్తు పరాజయ విషయాలు చెప్పాడు. రాముడు శ్రద్ధగా విని ఆనందించాడు. లక్ష్మణుని అభినందించి, రాముడు అతని తలను ఆఘ్రూణించి, 'ఇంద్రజిత్తు రావణునికి కుడిభుజం. మూడు రోజుల యుద్ధంలో అతడు వధించబడ్డాడు. కనుక ఇక రాక్షస రాజు పోరాటానికి రావడం ఖాయం' అని రాముడు అన్నాడు.

ఇంద్రజిత్తు అస్త్రాల వల్ల బాగా గాయపడిన లక్ష్మణునికి, ఇతరు వానరసేనకు గాయాలకు చికిత్స చేయవలసిందిగా రాముడు సుషేణుని ఆదేశించాడు. మొదట లక్ష్మణుని గాయాలను మాన్పించాడు సుషేణుడు.

అక్కడ రావణునికి లక్ష్మణుడు, విభీషణుని సాయంతో ఇంద్రజిత్తును వధించిన వృత్తాంతాన్ని సచివులు చెప్పారు. రావణుడు ఆ వార్త వినగానే స్పృహ కోల్పోయి మూర్ఛిల్లాడు. తెలివి రాలేదు. తన వారసుడు

మరణించడాన్ని రావణుడు జీర్ణించుకోలేక పోయాడు. ఎంతగానో విలపించాడు. రావణుడు ప్రతీకారంతో సీతను వధించాలని నిర్ణయించుకొన్నాడు మహోగ్రరూపంతో రావణుడు. ఈ ప్రకటనకు రాక్షస యోధులు, సైనికులు భీతి చెందారు. రావణుడు బ్రహ్మదేవుడు ప్రసాదించిన కవచాన్ని ధరించి, ధనుర్బాణాలను తీసికొని, మాయాజాలంతో యుద్ధం చేస్తానంటూ ఘోషించి, భీషణంగా తన ఖడ్గాన్ని దూసి అశోకవనంలోకి వెళ్ళాడు. ఆయన వెంటే మండోదరి, పలువురు సచివులు వెళ్ళారు. వీరంతా శ్రేయస్సు కోరి నివారించ దలిచినా, రావణుడు సీత ముందు నిలబడగా, ఆమె భీతావహురాలైంది. రావణుడు తనను వధించాలని వచ్చాడని సీతకు అర్థమైంది. ఆమె ఆశ్చర్యంతో '12 నెలలు గడువు కాకముందే వీడు రావడానికి కారణం ఏమిటి? రామలక్ష్మణులను ఓడించలేక నన్ను వదించాలని ఉన్నాడా? నిరాశతో నన్ను చంపనున్నాడా? అపుడు హనుమంతుడు నన్ను తన వీపుపై రమ్మని అన్నపుడు నేను వెళ్ళివంటే, ఈ ఆపద వచ్చేది కాదు గదా!' అని అనుకొంది. సీత వ్యధను గుర్తించిన సుపార్శ్వుడనే సచివుడు రావణునితో 'ఓ ప్రభూ! నీవు సకల వేదాలను చదివావు. వ్రతాలను పాటించావు. అయినప్పుడు ఇలా ఒక స్త్రీకి ఎలా హాని చేయాలనుకొంటున్నావు? నీ క్రోధాన్ని నీ శత్రువులపై చూపించు. రాముని మీదకు, వానర సేన మీదకు రేపు వెళ్ళి దండయాత్ర చేయి. రాముణ్ణి వధించిన తర్వాతనే నీవు సీతను అనుభవించ గలవు. ఎందుకు ఇలా విఫలం అవుతావు?' అని ఉద్బోధించాడు.

ఈ సలహాకు రావణుడు సరేనన్నాడు. తన ప్రాసాదానికి తిరిగి వెళ్ళాడు. రాక్షస యోధులందరినీ వెళ్ళి రాముని వధించి రమ్మని చెప్పాడు. వారు చేయలేకపోతే, తానే రేపు వెళ్ళి అతనిని వధిస్తానని కూడ చెప్పాడు రావణుడు. రాక్షస సైన్యం ఉదయం కాగానే బయలుదేరింది. భయంకర యుద్ధం ప్రారంభమైంది. రాక్షసులు వానర సమూహాన్ని వధించటంతో, వారు రాముని ఆశ్రయించారు. రాముడు గంధర్వాస్త్రాన్ని ప్రయోగించి అనేకమంది రాక్షసులను వధించాడు. గాంధర్వాస్త్ర ప్రభావంత రాముడు అదృశ్యం కావటం, మరొకసారి వెయ్యి మందిగా రాముని రూపాలు కనిపించటం జరిగింది. కొద్ది సేపట్లోనే రాముడు రెండు లక్షల మంది రాక్షస సైనికులను, ఎనిమిది వేల మంది గజ యోధులను, 14 వేల మంది అశ్వికులను, అసంఖ్యాక రథికులను హతమార్చాడు. మిగిలిన వారు లంకకు పారిపోయారు. ఆకాశంలో దేవతలు రాముని ఘనతను కీర్తించారు.

అపుడు రాముడు వానర వీరులతో 'ఓ వీరులారా! ఇలాంటి దివ్యాస్త్రాలను ప్రయోగించటం గురించి నాకు, పరమ శివునికి మాత్రమే సాధ్యం అని తెలుసుకోండి.' అని అన్నాడు.

అటు లంకానగరంలో మృతవీరుల భార్యలు శోకిస్తూ 'రామరావణుల మధ్య యుద్ధానికి కారకురాలైన శూర్పణఖ నాశనం కావాలని, రాముని శక్తిని రావణుడు గ్రహించాలని అనుకోసాగారు. మూర్ఖుడైన మన రాజు విభీషణుని మాట విని ఎందుకు దాన్ని ఆపలేదు?' అని వారు బిగ్గరగా రోదించసాగారు.

ఈ విషయం గమనించిన రావణుడు మహాక్రోధంతో రగిలిపోయి 'తక్షణమే నా సేనను యుద్ధానికి సిద్ధపరచండి. ఈరోజు నేను రామలక్ష్మణులను వధించి వేస్తాను. నా రథాన్ని తీసికొని రండి. ప్రతి రాక్షస యోధుడు నా వెంట నడవాలి' అని సచివులను ఆదేశించాడు.

రావణుని ఆదేశం మేరకు ఒక లక్షమంది రథికులు, మూడు లక్షల మంది గజదళ యోదులు, ఆరు కోట్ల మంది అశ్విక సైనికులు, అసంఖ్యాక పదాతి దళ సైనికులు బారులు తీరారు. అంతట రావణుడు ఎనిమిది అశ్వాలు లాగే తన రథాన్ని అధిరోహించి, ప్రధాన దేవతాస్త్రాలను సమకూర్చుకున్నాడు.

రావణుడు ఇలా ఉత్తర ద్వారం నుండి వస్తుండగా, విషాద వాతావరణం నెలకొంది. కాలమేఘాలు రక్తవర్షాన్ని కురిశాయి. అశ్వాలు తడబడ్డాయి. రావణుని వామనేత్రం అదిరింది. అతని వామ భుజం ప్రకంపించింది. ముఖం వివర్ణమై, స్వరం గద్గదమైంది. అటూఇటూ ఆకాశంలో ఉల్కలు దూసుకెళ్ళాయి. రావణుని ధ్వజ శూలం మీద ఒక రాబందు వాలింది. ఈ అపశకునాలను వేటినీ రావణుడు లక్ష్యపెట్టక, తనకు దాపురించనున్న విధిని కలుసుకొనేందుకు ముందుకు సాగాడు.

యుద్ధ ప్రారంభంలోనే రావణుడు అల్లకల్లోలం సృష్టించాడు. అతని బాణాల ధాటికి వానరులు నిలువలేక పోయారు. సుగ్రీవుడు ఒక మహావృక్షాన్ని పెరికి దానితో విరూపాక్షుని ఏనుగును మోది, వెనుకకు కూలద్రోశాడు. క్రింది దుమికిన విరూపాక్షుడు ఒక ఖడ్గాన్ని, డాలును తీసుకొని క్రోధంతో సుగ్రీవునివైపు దూసుకెళ్ళాడు. సుగ్రీవుడు అది గమనించి ఒక పెద్ద బండరాయిని విసిరి అతని కవచాన్ని ఛేదించాలని ప్రయత్నించగా, విరూపాక్షుడు తన్నడంతో సుగ్రీవుడు వెనుకకు పడ్డాడు. తన చేతితో విరూపాక్షుని చరచాలని సుగ్రీవుడు ప్రయత్నించగా, రాక్షసుడు సుగ్రీవుని వక్షస్థలంపై ముష్టిఘాతం ఇచ్చాడు. దానిని తట్టుకొని, సుగ్రీవుడు తన ఒక అరచేతితో విరూపాక్షుని వక్షస్థలంపైన, మరొక అరచేతితో నుదుటిపైన కొట్టాడు. దీనితో ఆ రాక్షసుని నుండి రక్తస్రావం జరిగి విరూపాక్షుడు మరణించాడు.

విరూపాక్షుని మరణమే కాకుండా, ఇతర సేనాధిపతుల మరణాన్ని కూడ చూచిన రావణుడు మరింత ఉద్రేకానికి లోనయ్యాడు. శత్రువును ఓడించమని మహోదరుణ్ణి కోరాడు రావణుడు. మహోదరుడు భారీ వానర సేనను హతమార్చబోగా, వారు సుగ్రీవుని ఆశ్రయించారు. సుగ్రీవుడు అంతట కోపంతో మహోదరునిపై ఒక పెద్ద శిలను విసిరాడు. కాని రాక్షసుడు దానిని ముక్కలు చేశాడు. సుగ్రీవుడు క్రోధంతో ఒక ఎత్తైన వృక్షాన్ని పెకలించి రాక్షసునిపైకి విసిరాడు. కాని వాడు దానిని ముక్కలు చేసి, సుగ్రీవుని గాయపరచాడు. ఇలా పరస్పరం గదలతోను, వృక్షాలతోనూ పోరుసలిపారు. మహోదరుడు సుగ్రీవుని కవచాన్ని పొడవ బోగా, సుగ్రీవుడు అతని శిరస్సును ఖండించి వేశాడు. ఈ నాయకుడు చనిపోగా మహాపార్శ్వుడు రంగప్రవేశం చేశాడు. ఇద్దరి మధ్య గదలతో కొండలతో యుద్ధం సాగింది. జాంబవంతుడు విసిరిన పెద్ద బండరాయి మహాపార్శ్వుని కిరీటాన్ని విరిచి వేయడంతో బాటు, వాని ధనర్బాణాలను కూడా విరిచి వేసింది. అంగదుడు బలాన్నంతా ఉపయగించి, రాక్షసుని వక్షస్థలంపై మోదడంతో, అది పగిలి తక్షణమే వాడు మరణించాడు. ఇలా మహాపార్శ్వుని సేన అయోమంలో పడిపోయింది. వానరులు, దేవతలు హర్షించారు. అంతట రావణుడు ఉడికిపోయి, రథాన్ని అధిరోహించి, బాణాలు ప్రయోగిస్తూ, రాముని వైపు సాగాడు. రాముడు రావణుని బాణాల్ని ప్రతిఘటించడంతో, ఇద్దరి మధ్య భీకరపోరు రాజుకొంది. ఇరువురి నిరంతర బాణప్రయోగంతో చీకటి అలముకొంది.

రావణుడు రాముని నుదుటి మీద బాణంతో కొట్టబోగా, రాముడు రుద్రాస్త్రంతో దాన్ని ఎదుర్కొన్నాడు. దానినుండి వెలువడిన బాణాలు రావణునికి ఏ హానీ చేయలేకపోయాయి. రావణుడు మాయామయమైన ఒక అసురాస్త్రాన్ని ప్రయోగించగా, దానినుండి అనేకమైన బాణాలు మ్రింగటానికై రామునివైపు దూసుకువెళ్ళాయి. రాముడు ఆగ్నేయస్త్రాన్ని ప్రయోగించి, రావణుని బాణాలను ఆకాశంలోనే నిర్వీర్యం చేశాడు. రావణుని శక్తివంతమైన ఆ అస్త్రం నిర్వీర్యం కావడంతో రావణుని పని అయిపోయిందని సంతోషించారు. రావణుడు మరల వాయుదేవుడు సృష్టించిన రుద్రాస్త్రాన్ని అభిమంత్రించగా, దానినుండి గదలు, శూలాలు, వజ్రాయుధాలు వెల్లువలా వచ్చి పడ్డాయి. రాముడు వెంటనే గాంధర్వాస్త్రంతో ఆ అస్త్రాన్ని నిర్వీర్యం చేసేశాడు. అంతట రావణుడు ఒక సూర్యాస్త్రాన్ని ప్రయోగించగా చక్రాయుధాలు పుట్టి రాముని వైపు బయలుదేరాయి. రాముడు నైపుణ్యంతో వాటినన్నింటిని భగ్నం చేశాడు. కాని ఈలోగానే రావణుడు పది బాణాలతో రాముని వక్షస్థలాన్ని ఛేదించాడు. కాని రాముడు తొణకకుండా రావణుని అవయవాల మీద అసంఖ్యాక బాణాలు ప్రయోగించాడు. లక్ష్మణుడు కూడ ప్రవేశించి రావణుని ధ్వజాన్ని విరిచేశాడు. వేరొక బాణంతో రథసారథి శిరస్సును ఖండించి మరి ఐదు బాణాలతో రావణుని ధనస్సును ఖండించాడు. ఇంతలో విభీషణుడు కూడ వచ్చి తన గదతో అశ్వాలను మట్టుబెట్టాడు. రావణుడు ఆగ్రహంతో ఒక శూలాన్ని విభీషణుని మీదికి విసిరాడు. లక్ష్మణుడు దానిని మూడు ముక్కలుగా చేశాడు. అంతట రావణుడు మయుడనే దానవునిచే నిర్మితమైన ఒక మాంత్రిక శూలాన్ని చేపట్టగా, విభీషణుని ప్రాణాలకు అపాయంగా భావించిన లక్ష్మణుడు వెంటనే లెక్కకు మిక్కిలిగా బాణాలు గుప్పించడంతో రావణుడు ఆ శూలాన్ని అలాగే చేతిలో ఉంచుకొని నిలిచి దిమ్మెరపోయాడు. రావణుడు లక్ష్మణునితో 'నీవు విభీషణుణ్ణి రక్షించ చూచావు. ఇపుడు ఆ శూలమే నిన్ను వధిస్తుంది' అని హుంకరించాడు. ఆ మాంత్రిక శూలాన్ని రావణుడు విసిరాడు. అది లక్ష్మణునివైపు దూసుకు వస్తుండగా గమనించిన రాముడు దాని ప్రభావాన్ని ఉపసంహరించుకోమని ప్రార్థించాడు. అయిన ఆ శూలం లక్ష్మణుని వక్షస్థలాన్ని ఛేదిస్తూ నేలపై దిగబడగా, లక్ష్మణుడు గాయపడి నేలపై కూలాడు. లక్ష్మణుని దయనీయ స్థితిని గమనించిన రాముడు తనపై రావణుడు బాణాలు కురిపిస్తున్నా కూడ, లక్ష్మణుని దేహంనుండి శూలాన్ని వెలికి తీసి, దాన్ని రెండు ముక్కలుగా చేసేశాడు. లక్ష్మణుని విషయం చూసుకోమని హనుమంతుడు, సుగ్రీవులకు చెప్పి, రాముడు అపుడు రావణునిపై తన పరాక్రమాన్ని ప్రదర్శిస్తానని అన్నాడు. 'త్వరలో ఇక్కడే అతనిని సంహరిస్తానని ప్రతిన బూనాడు. వానరులంతా పర్వతాగ్రాల మీద, దేవతలు ఆకాశం నుండి నా ఈ అద్భుత కృత్యాన్ని గమనించెదరు గాక!' అని ఉద్ఘోషించాడు.

రాముడు ప్రతీకారంతో రావణునిపై దాడి చేశాడు. ఒకరినొకరు శరపుంజాలతో కప్పివేయగా, ధనుష్టంకారాలు మహాధ్వనులను కలిగించాయి. ఆగ్రహోదగ్రుడయిన రాముడు రావణుని ఉక్కిరిబిక్కిరి చేయగా, ఆ రాక్షసుడు భీతిల్లి రణరంగం నుండి పారిపోయాడు. అంతట రాముడు లక్ష్మణుడు పడివున్న చోటుకు వెళ్ళి 'ఇతన్ని చూస్తే, నా శక్తిసామర్థ్యాలు ఉడిగిపోతున్నాయి. వేదన భరించలేను. ఇతను మరణిస్తే, నేనూ మరణిస్తా' అని చెప్పాడు. సుషేణుడు ధైర్యంతో రామునితో ఇలా అన్నాడు. 'రామా! లక్ష్మణుడు మరణించ లేదు. తేజస్సు ఏమాత్రం తగ్గలేదు. నేత్రాలు ఉజ్వలంగా వున్నాయి. ఇతనికి కాలసిన ఓషధులను తేవటానికి హనుమంతుడు

మహోదయ పర్వతం వద్దకు పంపాలి. వీటి చికిత్సతో లక్ష్మణుడు పరిపూర్ణ ఆయురారోగ్యాలు తిరిగి పొందుతాడు.' అని చెప్పాడు.

హనుమంతుడు హిమాలయాలకు లంఘించాడు. ఆ పర్వతం మీద ఓషధులను గుర్తించలేకపోయాడు. పర్వతాన్ని పెకలించి, లంకకు తీసుకువచ్చాడు. ఆ పర్వతాన్ని సుషేణుని ముందుంచి, బడలికతో కొద్ది క్షణాలు నేలపై పడుకొన్నాడు హనుమంతుడు. సుషేణుడు ఓషధులను ఉపయోగించిన మీదట లక్ష్మణుని గాయాలు మాయమైనాయి. లక్ష్మణుడు లేచి నిలబడగానే రాముడ కౌగిలించుకొని 'లక్ష్మణా! నీ ఆరోగ్యం నా భాగ్యం. నీవు లేకుంటే నేను, సీత జీవించము' అని అన్నాడు. లక్ష్మణుడు బదులుగా 'సోదరా! రావణ సంహారానికి నీవు చేసిన ప్రతిజ్ఞను వెంటనే నెరవేర్చి, విభీషణుని లంకాధీశునిగా ప్రతిష్ఠించు' అని అన్నాడు.

ఈలోగా రావణుడు మరొక రథాన్ని అధిరోహించి రామునితో పోరాటానికి లంకా నగరం నుండి బయటకు వచ్చాడు. రాముడు ధనుస్సును చేతబూని రావణునిపై బాణవర్షం కురిపించాడు. ఆకాశంలోని దేవతలు 'ఈ యుద్ధం ధర్మబద్ధంగా లేదు. రావణుడు రథాన్ని అధిరోహించి యుద్ధం చేస్తుండగా, రాముడునేల మీదనే నిలిచి ఉన్నాడు' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. దీన్ని అర్థం చేసుకొన్న ఇంద్రుడు మాతలిని పిలిచి తన రథాన్ని రణరంగంలో వున్న రాముని వద్దకు తీసుకొని వెళ్ళమని ఆదేశించాడు. దానితో మాతలి వెయ్యి హరితాశ్వాలను పూన్చిన ఇంద్రుని స్వర్ణమయ రథాన్ని తోలుతూ, రాముని ఎదుటకు వచ్చాడు. ఆ దివ్యరథ సారథి మాతలి రామునితో "ప్రియమైన ప్రభూ! రావణునితో యుద్ధానికి ఈ రథాన్ని స్వీకరించమని ఇంద్రుడు నిన్ను అభ్యర్థిస్తున్నాడు. దీనితో నీవు ఇంద్రుని ధనస్సు, కవచం, ఒక అసమాన శూలం, వివిధ దివ్యాస్త్రాలు నీకోసం ఉంచబడి వున్నాయి. రామా! వెంటనే రథాన్ని అధిరోహించు. ఇలా నీవు నేలపై నుండి యుద్ధం చేస్తూ వుండడం చూచి దేవతలు కలరవపడ్డారు.' అని అన్నాడు.

ఇంద్రుని రథానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి రాముడు రథాన్ని అధిరోహించాడు. అంతట ప్రముఖమైన ద్వంద్వ యుద్ధం ప్రారంభమైంది. రావణుడు గాంధర్వాస్త్రాన్ని వెలువరించగా, రాముడు వెంటనే దానిని మరొక గాంధర్వాస్త్రంతో తటస్థీకరించాడు. తర్వాత రావణుడు ఒక రాక్షసాస్త్రాన్ని ప్రయోగించగా, అది అసంఖ్యామైన సర్పరూపాలను ధరించింది. దీనిని గమనించిన రాముడు ఒక గరుడాస్త్రాన్ని విడువగా, అది అనేక గరుడ పక్షులుగా మారి, రావణుని సర్పరూప బాణాలన్నింటిని తినివేసింది.

దీనితో రావణుడు క్రుద్ధుడై రాముని మీదికి వెయ్యి బాణాలను ప్రయోగించాడు. అంతేగాక, అతను మాతలిని అనేక బాణాలతో కొట్టి, అశ్వాలను గాయపరచాడు. రావణుడు రాముని ఇలా ఇబ్బంది పెడుతుండగా, దేవతలు, వానర యోధులు ఉద్వేగభరితులైనారు. అపుడు రాముడు మహోగ్రరూపాన్ని దాల్చగా, సముద్రాలతో సహా యావత్ భూమండలం కంపించింది. ఎన్నో దశ్శకునాలు కనిపించాయి. దీనితో రావణునితో సహా సృష్టిలోని సకల ప్రాణులు భీతిల్లారు.

రావణుని ఉత్సాహపరచడానికి, లెక్కలేనంతమంది రాక్షసులు ఆకస్మికంగా ఆకాశంలో ప్రత్యక్షమైనారు. దానిని అదనుగా తీసికొని రావణుడు గర్జించగా, స్వర్గ మర్త్య లోకాలు కంపించ సాగాయి. అంతట రావణుడు

'రామా! నీవు మరణించక తప్పదు. సిద్ధంగా ఉండు.' అని కేకపెట్టాడు. అతడు ఒక ప్రాణాంతక శూలాన్ని విసిరాడు. అది ఆకాశంలో మహాధ్వని చేసింది. రావణుని శూలాన్ని ప్రతిఘటించడానికి రాముడు అనేక బాణాలను వదిలాడు. కాని ఆ బాణాల్ని ఆ శూలం నాశనం చేస్తుండటం గమనించిన రాముడు ఇంద్రుని శూలాన్ని విసిరాడు. ఇంద్రుని శూలం ఆకాశంలో దూసుకు పోతూ రావణుని శూలాన్ని ఢీకొనగా, అది ముక్కలై నిరపాయంగా నేలకూలింది.

ఆ తరువాత రాముడు రావణుని వక్షస్థలాన్ని, నుదుటిని, అశ్వలను బాణాలతో ఛేదించాడు. రావణుడు పూర్తిగా అలసిపోయి కూడా రాముని మీద బాణవర్షం కురిపిస్తూనే ఉన్నాడు. నిజానికి రావణుడు వెయ్యి బాణాలతో రావణుని వక్షస్థలాన్ని జల్లెడలా చేయగా, ఆయన దేహమంతా రక్తసిక్తమయింది. బాణవర్షం చేత చీకటి ఆవరించింది. ఒకరినొకరు చూచుకోలేకున్నారు. అయినను, రాముడు నవ్వుతూ రావణునితో "నీవు రాక్షసుల్లో అధమాధముడవు. నీవు పరమ మూర్ఖుడవు. మహావీరుడిగా భ్రమపడుతున్నావు. నేను లేని సమయం చూచి, నా భార్యను అపహరించ సాహసించావు. కనుక నీవు ఒక భీరుడవు. నీవు కుక్కతో సమానుడవు. యముడి పాపులను శిక్షించినట్లే నేను నిన్ను శిక్షిస్తాను. నీవు అత్యంత నీచుడవు, పాపాత్ముడవు, సిగ్గుమాలినవాడ రావణా! నీకు సముచితమైన అంత్యకాలం నేడే ప్రాప్తిస్తున్నది. నీ దేహం నక్కలకు, రాబందులకు ఆహారమౌతుంది అంటూ నిందించాడు. ఆపైన రాముడు అమిత దక్షతతో, ఉత్సాహంతో బాణాలు ప్రయోగించ సాగాడు. వానరులు శిలాపాతం కూడ కురిపించసాగారు. ఈ దాడులతో రావణుడు ఉక్కిరిబిక్కిరై, తాను సావధానంగా బాణాన్ని కూడ తీసికొని సంధించటానికి అసమర్థుడై పోయాడు. రావణునికి రాముని వల్ల మృత్యువు ఆసన్నమైనదని గ్రహించిన రథసారథి రథాన్ని వేగంగా ప్రక్కకు తీసికొని పోవ ప్రయత్నించాడు. రావణుడది గమనించి సారథిని కోపగించినపుడు, సారథి 'మహారాజా! నీ శ్రేయస్సు కోరే నిన్ను పోరాటంనుండి తప్పించి ఇలా తెచ్చాను. నీవు నీ శక్తినంతటిని కోల్పోయినట్లు కనిపించావు. అశ్వాలు పూర్తిగా అలసిపోయాయి. దుశ్శకునాలు కూడ కన్పించసాగాయి. అపుడు నా ప్రధాన కర్తవ్యంగా భావించి ఈ పనిచేశాను' అని వివరించాడు.

అయినాకూడా, రావణుడు 'నన్ను రాముని వద్దకే తీసికొని పో, శత్రువును వదలను' అని సారథిని కోరాడు రాముడు కూడ అలసి ఉన్నాడని గ్రహించిన అగస్త్య మహాముని రావణుడు లేని సమయంలో రాముని వద్దకు వచ్చాడు. అగస్త్యుడు 'శ్రీరామచంద్రా! సూర్యభగవానునికి ప్రీతి కలిగించి, విజయం చేకూర్చే ఆదిత్య హృదయ స్తోత్రం నానుండి స్వీకరించు. ఈ మంత్రం సర్వపాపాలను హరిస్తుంది. ఆయుర్వృద్ధి కలుగుతుంది. నీకు విజయం తప్పక లభిస్తుంది. ఈ మంత్రాన్ని విను. 'ఓ సూర్యభగవానుడా! నీకు నా ప్రణామాలు. సకల విశ్వాన్ని నీ అపరిమిత తేజస్సు చేత నీవు దేవతల్లో ముఖ్యుడవు. దేవదానవులు సైతం నిన్ను ఆరాధిస్తారు. నీవు సకల జగత్‌శక్తి నిధానానివి. సకల జీవుల ప్రాణాధారానివి. అందుచేత నీవు శ్రీమహావిష్ణువు యొక్క శక్తి విస్తృతిగా, ఆయన పరిపూర్ణ ప్రతినిధిగా విరాజిల్లుతున్నావు. అందువల్లనే వేదవేత్తలు సైతం నిన్ను నిత్యం ముమ్మారు ప్రార్థనలనర్పిస్తూ, నిన్ను సూర్యుని రూపంలో వున్న శ్రీమన్నారాయణునిగా అర్చిస్తున్నారు. ఈ జగత్తు యొక్క తిమిరాన్ని ధ్వంసం చేసే వాడవు నీవే. అందుచేత నీకు వినమ్రంగా ప్రణమిల్లుతున్నాను.

పరమాత్మునికి నేత్రమై, సర్వజగత్తుకు సాక్షీభూతుడవైన ఓ అమిత తేజస్వీ! నీకు మరల మరల ప్రణమిల్లుతున్నాను.' అని చెప్తూ, ఆదిత్య హృదయ స్తోత్రాన్ని రామునికి ఉపదేశించాడు.

రామునితో 'ఓ రామా! ఈ మంత్రాన్ని ఉచ్చరించి సూర్యభగవానుని ఆరాధించావంటే, నీ శత్రువును తప్పక జయిస్తావు. కష్టంలో వున్న ఏ వ్యక్తి అయినా ఈ జపాన్ని పఠిస్తే, దుఃఖాన్ని పొందదు.' అని చెప్పి, అగస్త్యుడు నిష్క్రమించాడు. అప్పటికి రామునిలో నవోత్తేజం వెల్లివిరిసింది. మహామంత్రాన్ని ఉచ్చరించి ప్రార్థన చేసికొని, మహత్తుగల దివ్యానందాన్ని పొందాడు రాముడు. ధనస్సును చేతబూని రావణునివైపు రాముడు కదలుతుండగా, సూర్యభగవానుడు ఆకాశం నుండి 'ఆలస్యం చేయవద్దు. వెంటనే వెళ్ళు' అని ఉద్బోధించాడు. రాముడు అంతట 'మాతలీ! రథాన్ని వెంటనే రావణుడు ఉన్న చోటుకు తీసుకొనిపో' అని ఆదేశించాడు. కాని రామునికి తాను మాట్లాడుతున్నది ఇంద్రుని రథసారథితోనని గుర్తు రాగా క్షమాపణ కోరాడు. సారథితోరాముని వినయానికి ముందే శమించాడు. వెంటనే రావణుని ప్రక్కకు రథాన్ని తీసికొచ్చాడు. వారిద్దరి మధ్య బాణాలతో యుద్ధం తీవ్రరూపం దాల్చింది. రావణుని రథం మీదికి సాగిన వేనవేల బాణాలు రక్తవర్షం కురిపించాయి. రాబందులు చేరాయి. ఒక పెద్ద ఉల్క దగ్గరకు వచ్చింది. వాటినన్నింటిని గమనించిన రాక్షసులు రావణుడు త్వరలోనే మరణించనున్నాడని దుఃఖించారు.

దానికి భిన్నంగా రామునికి అన్నీ శుభసూచకాలే గోచరించి, ఆనందించారు. ఆ తర్వాత ఇద్దరూ తమ తమ బలపరాక్రమాలను ప్రదర్శించుకొన్నారు. సైనికులందరు బొమ్మల్లాగ నిలిచి చూస్తున్నారు. నిమగ్నులై శత్రువులనే భావమే మరచిపోయారు. ఇంద్రుని ధ్వజాన్ని ఛేదించాలని రావణుడు ప్రయత్నించగా, రాముడు దానిని ఛిన్నాభిన్నం చేశాడు. రాముడు రావణుని ధ్వజాన్ని కూల్చివేశాడు. రావణుడు ఇంద్రుని అశ్వాలను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే, అవి చలించలేదని రావణుడు నిరాశపడ్డాడు. రావణుడు చివరకు రాక్షస మాయా యత్నాలకు పాల్పడ్డాడు. ఆ ఆయుధాలన్నీ రాముని చేరకముందే, రాముడు వాటిని నిర్వీర్యం చేశాడు. ఇరువురూ ఇలా వేలకొలది బాణాలు వర్షింప చేసుకొంటూనే ఉన్నారు. ఇలా చాల సమయం గడిచింది. సారథులు నైపుణ్యాన్ని చూపించారు. వారిరువురి ఆయుధాల కోలాహలం ఇనుమడించి అద్భుత రీతిలో సాగింది. రావణుడు తన రూపాలను మార్చుకొంటూ ఉంటాడు. అలా మార్చినా, రాముడు ప్రతి రావణ రూపాన్నీ ఖండిస్తూనే వున్నాడు. రావణుని పది శిరస్సులను ఖండిస్తున్నా కూడా మరొక కొత్త శిరస్సు మొలుస్తూనే ఉంది అపుడు రాముడు 'ఈ బాణాలతోనే నేను మారీచ, ఖర, విదులను వధించాను. వాలిని సంహరించాను. మహాపర్వతాలను, మహాసాగరాలను దారికి తెచ్చాను. ఇవి రావణుని మీద పనిచేయడం లేదు. ఎందుకని?' అంటూ ఆశ్చర్యపడ్డాడు. యోధులిద్దరి మధ్య ద్వంద్వ యుద్ధం విడుపు లేకుండా ఎన్నో పగళ్ళు, రాత్రిళ్ళు గడచిపోయాయి. రాముడు విజయం సాధించకపోవటం చూచిన సారథి మాతలి చివరకు రామునితో, 'ప్రభూ! ఆత్మరక్షణ పద్ధతిలోనే పోరాడుతున్నావెందుకు? నీ అపరిమిత మహిమాతిశయాన్ని నీవు ఎరుగవా? రావణునికి అంతిమ ఘడియలు ఆసన్నమైనాయి. దివ్యమైన బ్రహ్మాస్త్రాన్ని వినియోగించ వెందుకు?' అంటూ ప్రశ్నించాడు.

గతంలో అగస్త్య మహర్షి తనకు ప్రసాదించిన అస్త్రాన్ని గుర్తుచేసుకొని రాముడు ఆ అస్త్రాన్ని చేతబూనాడు. బ్రహ్మదేవుడు ఈ అస్త్రాన్ని స్వయంగా సృష్టించి అగస్త్యునికి కానుకగా ఇచ్చాడు. దానికి అధిష్ఠాన దేవత

వాయుదేవుడు. దాని శిరస్సు అగ్నిదేవుని, సూర్యదేవుని యొక్క శక్తి సమ్మేళనంతో స్పృశింబడింది మేరు, మంధర ప్వతాల గురుత్వాన్ని చేర్చినందున ఈ అస్త్రం భారంగా ఉంటుంది. దండం ఆకాశ పదార్థంతో రూపొందింది. ఈ అస్త్రం సర్వశక్తివంతమూ, అమోఘమూ అయింది. దాని ప్రకారం సూర్యుని తేజస్సుతో పోటీ పడుతుంది.

రాముడు ఇలాంటి మహా శక్తివంతమైన బ్రహ్మాస్త్రాన్ని తన వింటినారిపై సంధించాడు. రాక్షసులు భయంతో వణికిపోయారు. రాముడు వింటినారిని ఆకర్ణాంతం లాగగానే భూమండలం కంపించ సాగింది. లోకాలు గతులు తప్పుతున్నట్లుంది. రాముడు వదలిన ఆ బ్రహ్మాస్త్రం మృత్యుదేవత వలె ఆకాశం గుండా చూసుకుపోయి బలంగా రాక్షసరాజ (రావణుని) వక్షస్థలాన్ని తాకింది. వజ్రాయుధం వలె రావణుని హృదయాన్ని తొలుచుకొంటూ పోయి, అంతట ఆ అస్త్రం రావణుని పాపభూయిష్టమైన జీవితాన్ని కూడా వెంట తీసికొని పోతూ, భూమిలోపలికి ప్రవేశించింది. ఆ తరువాత ఆ బ్రహ్మాస్త్రం తిరిగి వచ్చి రాముని తూణీరంలో చేరింది.

రావణుడు తన చేతిలోని ధనస్సును జారవిడిచాడు. తన పది నోళ్ళనుండి రక్తం క్రక్కుతూ విగతజీవుడై నీలకూలాడు. ఈ భీకర దృశ్యాన్ని చూచిన రావణుని అనుచరులు 'అయ్యో! అయ్యో! ఏమి జరిగింది? ఏమి జరిగింది?' అంటూ గగ్గోలు పెట్టారు. వానర సేనలు అమితానందంతో రాముని విజయాన్ని కీర్తిస్తూ, రాక్షసులను తరిమి కొట్టారు. ఆకాశం నుండి దేవతలు 'భళారే! అద్భుతం!' అంటూ నినదిస్తూ, రాముని రథంపై పూలవర్షం కురిపిస్తూ, దివ్యదుందుభులు మ్రోగించారు. రావణుడు మరణించడంతో దేవతలు, ఋషులు అంతవరకు అనుభవించలేని ధన్యమైన నిశ్చింతను, ప్రశాంతతను పొందారు మనశ్శాంతితో ఆనందించారు.

వెంటనే సౌరభయుతమైన మందమారుతం వీచసాగింది. సూర్యుడు ప్రశాంతంగా, ప్రకాశవంతంగా వున్నాడు. అన్ని దిశల్లో సుఖంతోషాలు వ్యాపించినట్లనిపించింది. ప్రథమంగా సుగ్రీవుడు, అంగదుడు, విభీషణుడు, లక్ష్మణుడు వచ్చి శ్రీరామునికి ప్రణామాలు సమర్పించారు. ఈలోగా రావణుని మరణవార్త రాజప్రాసాదాల్లో లంకలో అంతటా వ్యాపించింది. రావణుని భార్యలందరూ యుద్ధభూమికి తరలివచ్చారు. వారందరూ రోదిస్తూ రావణుని మృతదేహాన్ని సమీపించారు. వారందరు మృతుడైన రావణుని వివిధ రీతుల్లో అతని శరీరాన్ని తాకి తమ ప్రేమను చాటుకొన్నారు. కొందరు దుఃఖంతో స్పృహ కోల్పోయారు. వారు 'ఓ ప్రియ ప్రాణనాథా! మా హితబోధలను వినకుండా వినాశాన్ని తెచ్చి పెట్టుకొన్నావు. మాకు భార్యలుగా ఏ ఆధారం లేకుండా చేశావు. మేమూ పరాజితలమయ్యాం. ఒక క్రూరవ్యక్తి ముగింపు ఇలాగే వుంటుంది. సీతను ఎవరు అపహరించగలరు?' అని విలపిస్తున్నారు.

రాణి మండోదరి ఇలా దుఃఖించింది – 'నా స్వామీ! ప్రానాథా! పరపీడనకు నీవు మారుపేరుగా రావణుడవైనావు. కాని నేడు లంకారాజ్యం శత్రువు చేత జయించబడింది. మేమూ పరాజితలమే. నీవు ఇంతటి శక్తిశలివి అయికూడా రాముని ఎదుట నిలువలేక పోయావు. నీ బలపరాక్రమాలను అతిగా ఊహించుకొని ఈ భూమికి భారంగా పరిణమించావు. ఈ భూభారాన్ని తొలగించటానికే స్వయంగా శ్రీ మహావిష్ణువే వచ్చాడని నీవు తెలుసుకోలేక పోయావు. రావణా! నీ సీతా వ్యామోహం సకల రాక్షస జాతిని తుడిచిపెట్టింది. నీవు

కామాంధుడ వగుట చేత, సీతా మాత మహాత్మ్యాన్ని నీవు గ్రహించలేక పోయావు. ఇపుడు ఆమె శాపఫలితంగా రామునిచే వధింపబడి ఈ స్థితిలో వున్నావు. నీవల్ల ఇపుడు లంకారాజ్యానికి, రాక్షస జాతికి నాథుడు లేకుండా పోయాడు. నీ పాపకార్యాల వల్ల నీ దేహాన్ని రాబందులకు ఆహారంగాను, నీ ఆత్మను నరకానికి పోయేలా నీవే చేసుకొన్నావు. నీవు శీలహీనుడవైనా, నీవు లేకుండా నేను ఎలా జీవించాలో తెలియకున్నది.' అని విలపించింది. మండోదరి తన శిరస్సును రావణుని వక్షస్థలంపై ఉండగా, ఆమె స్పృహ కోల్పోయింది. ఆమె సవతులు సపర్యలు చేసి తిరిగి స్పృహలోనికి తెచ్చారు.

అంతట రాముడు విభీషణునితో 'ఇంక ఆలస్యం లేకుండా నీ అన్నకు అంతిమ కర్మకాండ ప్రారంభించు. అతని దేహానికి అగ్నిసంస్కారం జరిగిన మీదటనే, అతని భార్యలను అనునయించడం జరుగుతుంది.' అని ఆదేశించాడు. అందుకు విభీషణుడు 'పరస్త్రీలను అపహరించినవాడు, క్రూరాత్ముడు, దుర్మార్గ స్వభావుడు, అధర్మాభిరతుడు అయిన వ్యక్తికి నేను అంతిమ సంస్కారాలు జరపను. నా అగ్రజుడు కనుక నేను గౌరవించ వలసిందే. కాని అతని చర్యలన్నీ హీనచ్యలే కనుక నాకు పూజనీయుడు కాదు' అని చెప్పాడు.

అంతట రాముడు 'నీ మాటలు ధర్మశీలతను నిలబెట్టేవి కనుక నేను సమ్మతిస్తాను. అయినా నీ సోదరుని దేహానికి నీవు దహన సంస్కారం చేయగోరుతాను. మరణంతో శత్రుత్వాలన్నీ అంతమై పోతాయి' అని అన్నాడు. అంతట విభీషణుడు రావణుని అంత్యక్రియల నిర్వహణకై లంకకు వెళ్ళాడు.

విభీషణుడు, మాతామహుడైన మాల్యవంతుణ్ణి వెంట తీసుకొని, రాక్షస బృందంతో దక్షిణ దిశగా వెళ్ళి అక్కడ వేదోక్త విధిగా రావణుని దహన సంస్కారం చేశాడు. ఆ తర్వాత రావణుని భార్యలను ఓదార్చి, లంకా నగరానికి వెళ్ళాడు.

రాముడు ఆగ్రహాన్ని త్యజించి, ప్రసన్నవదనుడై, ధనుర్బాణాలను కవచాన్ని తీసి ప్రక్కన పెట్టాడు. దేవతలు స్వస్థలాలకు వెళ్ళారు. యుద్ధం ముగిసినందున, మాతలి రాముని నుండి సముచిత సత్కారాన్ని స్వీకరించి తిరిగి వెళ్ళటానికి అనుమతి కోరిన పిమ్మట ఇంద్రుని రథంపై ఆకాశానికి అధిరోహించి స్వర్గానికి చేరింది. రాముడు తన సైనిక శిబిరానికి తిరిగి వచ్చి, విభీషణుని పట్టాభిషేక కార్యక్రమం జరిపించమని లక్ష్మణుని కోరాడు. వెంటనే లక్ష్మణుడు వానరులతో నాలుగు సముద్రాల జలాలను తీసుకొని రమ్మని ఆదేశించాడు. లక్ష్మణుడు వైదిక ధర్మ సూత్రాల కనుగుణంగా విభీషణుని పట్టాభిషేకం జరిపించాడు. నగరవాసులందరు దివ్య వాటికకు వచ్చి కానుకలు విభీషణునకు సమర్పించగా, విభీషణుడు వాటిని రామునికి సమర్పించాడు. అంతట రాముడు హనుమంతునితో "సీత ఎలా వుందో విచారించు. నేను రావణుని వధించానని ఆమెకు చెప్పి, ఆమె ఏదైన సందేశమిస్తే, తీసికొని రా' అని చెప్పాడు.

హనుమంతుడు వెంటనే అశోక వనానికి వెళ్ళగా, సీత మమూలుగానే రాక్ష స్త్రీలచే పరివేష్టించబడి దుఃఖితగా కన్పించింది. హనుమంతుడు వినయంగా ఆమె ఎదుట నిలబడి, 'అమ్మా! నీ భర్త నీకు ఈ సందేశాన్ని పంపాడు. రాక్షసరాజు మరణించాడు. నీ ఆందోళనను విడిచిపెట్టు. నిన్ను విముక్తిస్తానని చెప్పిన నా శపథాన్ని నేడు నెరవేర్చుకొన్నాను.' అని చెప్పగా, సీత రెండు సతోష వార్తలను విని మౌనంగా ఉండిపోయింది.

సమాధానమేమీ చెప్పలేదేమని హనుమంతుడు అడుగగా, సీత 'నేను ఆనందాతిశయం వల్ల మాట్లాడలేక పోయాను. హనుమా! ఎంతటి స్వర్గంకన్నా, రత్నరాసుల కన్నా నీవు నాకు ఇపుడు చెప్పిన విషయం అపరిమితంగా ఎంతో విలువైనది.' అని సీత అన్నది. ముకుళిత హస్తాలతో, హనుమంతుడు 'అమ్మా! నీవు కోరితే, నిన్ను బాధించిన ఈ రాక్షస స్త్రీలను వధించగలను. ప్రతీకారం నాకు ఆనందాన్నిస్తుంది. నీ అనుమతి కోసం వేచి వున్నాను.' అని చెప్పాడు. కరుణామూర్తి సీత బదులు ఇస్తూ 'వీరందరు రాజు ఆదేశాన్ని పాటించిన మూర్ఖ పరిచారికలు మాత్రమే నా బాధలన్నీ నా పూర్వజన్మకృతమైవే. ఓ హనుమా! మహాపురుషుడైనవాడు తన పట్ల ఇతరులు చేసిన అపకారా లెన్నటికీ లెక్కలోకి తీసికోడు. అతడు ఎప్పుడూ కీడుకు కీడు చేయరాదన్న వ్రతానికి బద్ధుడై ఉంటాడు అనే విషయాన్ని నీవు వినే ఉంటావు.

ఒకప్పుడు ఒక వేటగాడిని ఒక వ్యాఘ్రం తరుముతూ వస్తోంది. తప్పించుకునేందుకు అతడు ఒక చెట్టును ఎగబ్రాకాడు. కాని ఆ చెట్టుపై ఒక భలూకం సేద తీర్చుకొంటున్నది. ఆ భల్లూకాన్ని చూచిన వ్యాఘ్రం దానితో 'ఓ భల్లూకమా! ఈ వేటగాడు నీకు నాకు గూడ శత్రువే. నీవు వాడిని చెట్టుమీద నుండి క్రిందకు పడదోశావంటే నేను వాడిని భక్షించి వెళ్తాను.' అని అన్నది. అయితే అందుకు భల్లూకం జవాబుగా 'ఈ వేటగాడు నా ఇంట ఆశ్రయం పొందాడు. కనుక నేను ఏ హానీ చేయలేను.. అది అధర్మం అవుతుంది.' అని చెప్పింది. ఈ మాటలు చెప్పి భల్లూకం నిద్రపోయింది. అంతట ఆ వ్యాఘ్రం వేటగానితో 'నీవు ఆ భల్లూకాన్ని ఆ చెట్టు మీదికొరిగి క్రిందికి పడవేస్తే, దానిని నేను భక్షిస్తాను. నీకేమీ హాని చేయనని నీకు వాగ్దానం చేస్తున్నాన' అని అన్నది.

వ్యాఘ్ర వచనాలకు ప్రలోభపడిన వేటగాడు నిద్రిస్తున్న భల్లూకాన్ని క్రిందికి తోశాడు. అయితే ఆ భల్లూకం మరొక కొమ్మను పట్టుకొని ఆత్మరక్షణ చేసుకొంది. వ్యాఘ్రం భల్లూకంతో 'ఈ వేటగాడు నిన్ను చంపాలని చూశాడు. నీవు ప్రతిగా వానిని చెట్టు మీదనుండి పడవేయి' అని చెప్పింది. కాని భల్లూకం తిరస్కరించింది. 'మహాపురుషుడు అపచారం చేసినవాని పాపాలను లెక్కలోకి తీసికోడు. ధర్మవర్తనం సదాచారణకు ఆభరణం. ఎట్టి పరిస్థితుల్లోనూ, కీడుకు కీడు చేయరాదు అన్న వ్రతాన్ని నిలబెట్టుకొంటాడు.' అని చెప్పింది.

అలా మందలింపబడిన హనుమంతుడు రామునికి ఏదైనా సందేశం ఇస్తావా అని అడిగాడు. 'అనన్య భక్తివత్సలుడైన నా ప్రియ ప్రాణేశ్వరుని దర్శించటానికి తహతహలాడుతాను' అని సీత బదులు చెప్పింది. 'అమ్మా! నీవు ఈ రోజు రామలక్ష్మణులకు తక్షణమే నివేదిస్తాను.' అని చెప్పి వెంటనే వచ్చి రామునికి అందించాడు. హనుమంతుడు 'ఓ దేవా! నీకోసం సీత ఇంతకాలం ఎన్నో బాధలు అనుభవించింది. నిన్ను చూడాలని తహతహలాడుతోంది దయచేసి అశోకవనానికి వెళ్ళు' అని అన్నాడు.

హనుమంతుని మాటలు వినిన రాముడు విభీషణునితో 'సీత స్నానం చేసి నూతన వస్త్ర, దివ్యాభరణ భూషితురాలై నీ ఎదుటకు తీసుకొని రాబడు గాక!' అని ఆదేశించాడు. అంతట విభీషణుడు అశోక వనానికి వెళ్ళి, సీతను సమీపించి 'అమ్మా! రాముడు నిన్ను చూడాలని అభిలషిస్తున్నాడు. దయచేసి నేను తెచ్చిన ఈ పల్లకిని అధిరోహించు. నీవు స్నానం చేసి దివ్యాలంకరణ శోభితయై రావాలని రాముడు ఆశించాడు.' అని

నివేదించాడు. అంతట రాక్షస స్త్రీలు సీతను విభీషణుని ప్రాసాదానికి తీసుకొని వెళ్ళి, సుగంధభరిత జలాలతో స్నానం చేయించి, శోభాయమానంగా అలంకరించగా, ఆమె విభీషణునితో కలిసి రాముడున్న చోటికి పల్లకిలో వచ్చింది. ఆమెను తక్షణమే తన ఎదుటకు తీసికొని రమ్మని రాముడు చెప్పాడు. వానరులు గుంపులు గుంపులుగా సీతను చూడాలని వచ్చారు. వారి కోలాహలాన్ని విభీషణుడు అడ్డగించగా, రాముడు అది చూచి ఆగ్రహంతో విభీషణునితో 'ఈ వానరులను వేధించకు. ఒక స్త్రీని ప్రతికూల సమయంలోనూ, యుద్ధంలోనూ, స్వయంవరం వద్దనూ, యజ్ఞశాలలలోనూ, విరహంలోనూ, బహిరంగంగా చూడడంలో తప్పు లేదు. వారు సీతను చూడదలిస్తే, వారిని చూడనివ్వు' అని చెప్పాడు. అపుడు రాముడు 'సీతను పల్లకి దిగి నా ఎదుటకు రానివ్వండి' అని ఆదేశించాడు. విభీషణుడు సీతను వెంటబెట్టుకొని వస్తున్నాడు. సీతను అందరిముందు నడిపిస్తున్నందుకు వానరులు, రాక్షసులు అందరూ ఆశ్చర్యపోయారు.

సీత అమితమైన సిగ్గుతో రాముణ్ణి సమీపించింది. ఆమె హృదయేశ్వరుని చూడగనే, తన బాధలన్నీ అంతరించి, ఆమె సహజ విరాజమానమైన తేజస్సు ఆమెకు తిరిగి వచ్చింది. తన ప్రియతముణ్ణి చూడగానే, ఆమె హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. కాని రాముని ధోరణి మరో విధంగా ఉంది. కారణం ప్రజలు ఏమి అపనిందలు మోపుతారోనని. ఇదే రాముని హృదయాన్ని పీడిస్తోంది. సీతనుద్దేశించి ఆగ్రహంతో 'నిన్ను తిరిగి గెలుచుకోవాలనే శపథాన్ని నెరవేర్చుకొన్నాను. అలా రావణుడు చేసిన అవమానానికి ప్రతీకారం తీర్చుకొన్నాను. కాని నేను రాక్షస రాజును సంహరించటానికై నేను చేసిన మహా కృషి వాస్తవంగా నీకోసం కాదని, నా పరువు ప్రతిష్ఠలను, ఇక్ష్వాకు వంశపు కీర్తిని నిలబెట్టడం కోససమేనని నీవు అర్థం చేసుకోవాలి. సత్యమేమంటే నీవు నా ఎదుట నిలబడటం ఎంతమాత్రం సంతోషకరం కాదు. అందువల్ల నీవు కోరుకొన్న చోటికి నీవు స్వేచ్ఛగా వెళ్ళడానికి నీకు నేను అనుమతిస్తున్నాను.

పరపురుషుని చేత ఆలింగనం చేసుకోబడిన లేదా పరుని ఇంట ఇంతటి దీర్ఘకాలం నివసించిన భార్యను సంస్కారవంతుడైన ఏ వ్యక్తీ స్వీకరించడు. రావణుని చేత అనుభవించబడకుండా ఏ స్త్రీగాని ఇంతటి దీర్ఘకాలం అతనితో ఉండలేదనటంలో నాకు సంశయం ఎంత మాత్రం లేదు. రావణుడు నీకోసం కామపీడితుడైనాడు. అతను నిగ్రహించుకొని, నిన్ను చెరబట్టకుండా ఎలా ఉండగలడు? రావణుని వధించి నేను తిరిగా నా గౌరవాన్ని పొందాను. కాని నీపట్ల ఇకపై సంగత్వం ఉంచుకోవలసిన అగత్యమేమీ లేదు. కనుక నీవు నీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే స్వేచ్ఛ నీకుంది. కనుక నీ మనస్సును లక్ష్మణుని మీదకో, భరతుని మీదకో లేక నీవు ఎంచుకొన్న ఎవరి మీదనైనా సరే నిలుపుకో' అని అన్నాడు రాముడు.

రాముని పలుకులు విన్న సీత శిరస్సు అవమానంతో వాలిపోయింది. ఇప్పటివరకు తన భర్తనుండి ప్రేమపూరిత వచనాలనే విన్న ఆమె హృదయం ఇప్పుడు రాముని మాటలు నిశిత శరాల్లా నాటుకొన్నాయి. ఆమె భోరుమని విలపించ సాగింది. అసంఖ్యాక సాక్షుల ఎదుట నిందావాక్యాలు వినడంతో ఆమెకు దుఃఖం కట్టలు తెంచుకొంది.

తడబడుతున్న మందస్వరంతో సీత 'నా గురించి ఇంత బాధ్యతారహితంగా మాట్లాడటానికి ఎలా సాహసిస్తావు? మనసా వాచా కర్మణా నా పాతివ్రత్యాన్ని ఎన్నడూ విడనాడ లేదు. నా శీలం పవిత్రం. ఒక సాధారణ స్త్రీ గురించిన తీర్పులా నీ తీర్పు ఉండకూడదు. నేను జనక మహారాజు కుమార్తెగా పేరుగాంచినా, నేను భూమినుండే ఉత్పన్నమైన నా జననం అలౌకిక మైనట్టిది. రామా! ఈ విధంగా నీవు నన్ను తిరస్కరించటానికే ఆలోచిస్తునట్లయితే, నీవు హనుమంతునితో ఎందుకు ఆ మాట చెప్పి పంపలేదు? ఆనాడే నీవు నన్ను స్వీకరించనని చెప్పి పంపివుంటే, ఆ క్షణమే నేను నా ప్రాణాన్ని త్యజించి, ఆనాటి దుర్భర బాధలనుండి తప్పించుకొనేదాన్ని.ఈ రాక్షసుల నడుమ మృత్యువుతో వేగినా యుద్ధం కూడ జరిగి ఉండేది కాదు. నీ మిత్రులనుండి ఇంతగా సేవలు అందుకోవలసిన అవసరం ఉండేది కాదు గదా! రామా! ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నావు? నా విశుద్ధ భక్తి ప్రపత్తులు నీ దృష్టిలో విలువ లేనివా?' అని పలికింది. సీత లక్ష్మణుని సంబోధిస్తూ 'దయచేసి, నేను ప్రవేశించటానికి ఒక పెద్ద అగ్నిజ్వాలను రాజేయి. భర్తచే తిరస్కరింబడిన భార్యకు మిగిలి ఉన్న మార్గం ఇదొక్కటే.' అని అన్నది. లక్ష్మణుడు తన ఆందోళనను అణచుకొంటూ, రాముని వైపు తిరిగి చూచి తన అగ్రజుడు సీత మాటలను అంగీకిస్తున్నట్లు గ్రహించాడు. అందుచేత లక్ష్మణుడు అగ్నిని సిద్ధపరచటానికి వెళ్ళాడు. రాముడి ధోరణి చూసిన వారెవరూ ఆయనతో మాట్లాడ సాహసించ లేదు. ఇక శాంతించే దెక్కడ?

అగ్ని ప్రజ్వరిల్లగా, సీత రామునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసింది. అగ్ని ఎదుటకు వచ్చి, బ్రాహ్మణులకు, దేవతలకు వందనాలు అర్పించింది. ఆ తరువాత అగ్నిదేవుని ఇలా ప్రార్థించింది. – 'ఓ అగ్నిదేవా! నా హృదయం ఎన్నడూ రాముడి నుండి ఎడబాసి ఉండనందున, దయచేసి, నాకు రక్షణ ప్రసాదించు. నేను మనసా, వాచా, కర్మణా రామునికి ఎన్నడూ ద్రోహం చేయనప్పటికీ, నేను కళంకితురాలనైనానని నాపై నిందారోపణ చేస్తున్నాడ అందుచే త్రిలోకాల్లో జరిగే కర్మలన్నిటికీ సాక్షీభూతుడవైన ఓ అగ్నిదేవా! నా పవిత్రతకు నీవు సాక్షి కాలసిందిగా ప్రార్థిస్తున్నాను.' ఈ ప్రార్థనతో సీత అగ్నికి ప్రదక్షిణం చేసింది. అందరూ చూస్తుండగా, సీత నిర్భీకమైన మనస్సుతో అగ్నిప్రవేశం చేసింది. సీత అగ్నిప్రవేశంతో స్త్రీల నుండి ఒక ఆర్తనాదం వెలువడింది.

అమితమైన విలాపాలకు మధ్య రాముడు ఆలోచనమగ్నుడైనట్లు కనిపించాడు. ఈలోగా దేవతా ముఖ్యులు రథాల నధిరోహించి రాముని ముందుకు వచ్చారు. బ్రహ్మదేవుడు, పరమశివుని నేతృత్వంలో వచ్చిన ఆ దేవతలు, ముకుళిత హస్తాలతో నిలిచి ఉన్న రామునితో 'ఓ దేవాధిదేవా! శ్రీరామచంద్రా! నీ శాశ్వత దివ్య సహచరియైన సీతామాతను నీవు నిర్లక్ష్యం చేయటం మాకు బాధ కలిగిస్తోంది. నీవు ఈ విశ్వాన్నే సృష్టించిన వాడవు. సకల దేవతలకు అధీశుడవు. నీవు నీ దివ్యత్వాన్ని లెక్కలోనికి తీసికోకుండా, ఒక సాధారణ మానవునిలా ప్రవర్తిస్తా వేమి? సీతను తిరస్కరిస్తావేమి?' అని అన్నారు.

అందుకు రాముడు బదులు చెప్తూ 'నేను ఒక సాధారణ మానవుడనని, దశరథ మహారాజు కుమారుడనని అనుకొన్నాను. కాని ఇంకా ఏమైన చెప్పుకోవలసిందేమైనా ఉంటే, అప్పుడు బ్రహ్మదేవా! బహుశా నీవు నాకు వెల్లడి చేయగలవు" అని అన్నాడు.

బ్రహ్మదేవుడు 'ప్రియమైన శ్రీరామా! నీవు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడవు. నారాయణుని అన్ని రూపాలు నీవే. నీవు దేవాధిదేవుడవు. సకల కారణాలకు కారణానివి. నీవు విశ్వం యొక్క విశ్వరూపానివి మరియు ఆధారానివి. దేవతలంతా నీలోని వారే. నీ శాశ్వత సేవకులే. అదీకాక సీత భాగ్యదేవతయైన జగన్మాత. శ్రీమహాలక్ష్మియే తప్ప వేరు కాదు. రావణ సంహారానికై మీరిద్దరూ ఈ భూలోకంలో అవతరించారు. ఈ మహాకార్యం మీచే సాధించబడింది. ఓ దేవా! నీవు కోరుకున్నంత కాలం ఈ భూమండలాన్ని పాలించిన మీదట ఆధ్యాత్మిక లోకంలో ఉన్న నీ దివ్యధామానికి తిరిగి చేరుకోవచ్చు.' అని వివరించాడు. బ్రహ్మదేవుడు చెప్పటం పూర్తి కాగానే, అగ్ని జ్వాలల్లోంచి సీతతో సహా అగ్నిదేవుడు వెలువడ్డాడు. సీత రాముని ఎదుట నిలువగా ఆమె దేహం మీద దహించబడిన ఏ చిహ్నాలు గోచరించ లేదు.

విశ్వసాక్షి హోదాలో అగ్నిదేవుడు రామునితో 'రామా! నీ ప్రియసతి సీత ఇదిగో. లేశమాత్రమైనా కళంకం లేనిది. త్రికరణశుద్ధురాలై చరించింది. నీకెన్నడూ ద్రోహం చేయలేదు. ఇక ప్రియమైన రామా! నీ ఆగ్రహాన్ని, పరుషవాక్కులను విడిచి పెట్టి ఎటువంటి ఆక్షేపణలు లేకుండా సీతను నీవు స్వీకరించి తీరాలి.' అని ప్రకటించాడు. అగ్నిదేవుని సాక్ష్యం విని రాముడు ప్రమోదం చెందాడు. అశ్రునయనాలతో 'ఓ అగ్నిదేవా! సీత నిష్కళంక పవిత్రత గురించి జనావళికి విశ్వాసం కలిగించటం కోసం ఈ అగ్ని పరీక్షకు గురికావడం సీతకు అనివార్యమైంది. ఈ విధంగా సీత పాతివ్రత్యాన్ని జనులు చూడకుండా వుంటే, నన్ను కామప్రేరితుడనని విమర్శించేవారు. సీత గురించి నాకు ముందే తెలుసు. తన ధర్మశక్తి చేత సదా రక్షించబడి వుంది. సీత పాతివ్రత్యాన్ని ప్రపంచానికి నిరూపించటం కోసమే, నేను అలా కనిపించాను. వాస్తవానికి సీత నా ఆంతరంగిక శక్తి కాన నాకంటె భిన్నం కాదు. సూర్యునినుండి కాంతి వేరు కానట్లే నేను సీతనుండి వేరయే అవకాశమే లేదు అని బదులు చెప్పాడు. రాముడు అలౌకిక ఆనందాన్ని పొందాడు.

పరమశివుడు రాముని ఆలింగనం చేసుకొని 'ప్రియమైన ప్రభూ! నీవు రావణుని సంహరించి చూపిన బాహుపరాక్రమం ముల్లోకాల్లోను కీర్తించబడతాయి.' అని అంటూ ఆకాశం వైపు చూపుతూ 'రామా! నీ తండ్రి దశరథుడు, తన దివ్యరథాన్ని అధిరోహించి ఎలా నిరీక్షిస్తున్నాడో చూడు. కరుణామూర్తివైన నిన్ను చూచేందుకు దశరథ మహారాజు చూడాలని కూర్చున్నాడు. శీఘ్రమే లక్ష్మణునితో వెళ్ళి ఆయనను కలుసుకో' అని చెప్పాడు.

రామలక్ష్మణులు వెళ్ళి తండ్రి ఎదుట నిలబడి ప్రణామం చేశారు. మహారాజు రాముణ్ణి తన అంకం మీదకు తీసికొని మహా ఆనందంతో ఇలా అన్నాడు. 'నా స్వర్గలోక వాసం నాకు నిజమైన ఆనందాన్నివ్వదు. రామా! ఇపుడు నిన్ను చూచి సంతోషంతో పొంగిపోతున్నాను. నీ ప్రవాసం ముగింపుకు వచ్చింది. నాకిప్పుడు ఊరట కలుగుతుంది. నీవు తిరిగి అయోధ్యకు వెళ్ళి, భరతుణ్ణి కలవటం, చక్రవర్తిగా పట్టాభిషిక్తుడవటం చూడాలని ఆశిస్తూనే ఉన్నాను. నీవు సాక్షాత్తు శ్రీమహావిష్ణువువే, రావణుని వధ కోసమే ఈ లోకంలో నీవు అవతరించావని నమ్ముతున్నాను.' అని అన్నాడు.

రాముడు జవాబు చెప్తూ 'ప్రియమైన జనకా! నా ప్రవాసం ముగిసి, ఈ కార్యం సిద్ధించగా, ఇందుకు నేను ఎంతో ఆక్రోసిస్తున్నాను. అయితే మీకు నా ప్రార్థన ఒకటి. నన్ను ప్రవాసానికి పంపే సమయంలో మీరు కైకేయి, భరతునితో సంబంధాలు త్యజిస్తున్నట్లు కటువుగా ప్రకటించారు. వాటిని ఉపసంహరించుకోండి.' అని అన్నాడు. దశరథ మహారాజు తథాస్తు అంటూ సమ్మతించాడు. లక్ష్మణుని ప్రేమతో ఆలింగనం చేసుకొని 'నాయనా! నీవు రామునికి అంకితభావంతో సేవచేసినందున నీకు నేను ఋణపడి ఉన్నాను. నీ అగ్రజుడు విశ్వ శ్రేయస్సుకై అవతరించిన పరమపురుషుడని గ్రహించు. దేవతా ముఖ్యులకే ఆరాధ్యుడు కాగా మావంటి వారి గురించి చెప్పేదేముంది.' అని అన్నాడు.

దశరథుడు సీతతో 'నీ పాతివ్రత్యాన్ని పరీక్షించినందుకు రామునిపై కోపగించకు, అలుగకు. నీ శ్లాఘనీయ ప్రవర్తన కారణంగా మహా మహిమోపేతురాలైన స్త్రీగా ప్రపంచ చరిత్రలోనే నీ పేరు పదిలపరుస్తుందని గ్రహించు.' అని చెప్పాడు. ఇలా చెప్పి, దశరథుడు దివ్యరథాన్ని అధిరోహించి, స్వర్గలోక దిశగా ప్రస్థానించాడు. ముకుళిత హస్తాలతో నిలిచిన రాముణ్ణి చూచి ఇంద్రుడు 'నా దర్శనం ఎన్నడూ వృధా కాబోదు. అందుచే నావల్ల ఏదైనా వరాన్ని స్వీకరించ గోరుతాను' అన్నాడు. రాముడు అది విని సంతసించి 'దేవేంద్రా! నా సేవలో ప్రాణాలు కోల్పోయిన వానరులనందరిని బ్రతకించు. వారు ఎక్కడ నివసించినా, అక్కడవృక్ష సంపదన వర్ధిల్లేటట్లు వరమివ్వు.' అని అన్నాడు. అంతట ఇంద్రుడు 'ఈ వరాన్ని ఇవ్వటం నాకు కూడ కష్టమే అయినప్పటికీ సంతోషంతో ఇస్తున్నాను.' అని అన్నాడు. ఇంద్రుని వరప్రభావంతో వానరులందరు సజీవులై, గాయాలు మానిన స్థితిలో లేచి నిలుచున్నారు. దీర్ఘ నిద్ర నుండి మేల్కొన్నట్లు భావించారు. లేవగానే, ఎదుట రాముడు, దేవతలు వుండటం చూచి, తమ ప్రాణాలు పోయినవి తిరిగి వచ్చినాయని గ్రహించారు. ఆనందాన్ని పొందారు.

అంతట ఇంద్రుడు, ఇతర దేవతలు నిష్క్రమించగా, రాముడు, మునులు ఆరాత్రి అక్కడే గడిపారు. విభీషణుడు రాముని అభిషేకం కోసం రాజలాంఛనాలతో అసంఖ్యాక పరిచారికలతో రాముని ఎదుటకు వచ్చారు. కాని రాముడు 'ప్రియ విభీషణా! సుగ్రీవుని నాయకత్వాన వానరుల నందరిని పిలిపించు. ఈ రాజ భోగాన్ని వారినే అనుభవించనివ్వు. తపస్సాధనలతో ఉన్న భరతుడి నుండి వేరుగా ఉన్నంత కాలం నాకు ఈ రాచమర్యాదలేవీ రుచించవు. నేను వేగమే అయోధ్యకు చేరుకొనే ఏర్పాట్లు మాత్రమే చేయమని అభ్యర్థించ గలను. కాలినడకన ప్రయాణించలేను. ప్రయాసతో కూడిన పని అవుతుంది.' అని ఆదేశించాడు.

విభీషణుడు 'నీవు పుష్పక రథంలో ప్రయాణించావంటే, ఈరోజే అయోధ్యకు చేరగలవు. అయితే మీరందరు కొంతకాలం ఇక్కడనే ఉంటే, మిమ్మల్ని నేను రాజ్యాధీశుని హోదాలో అనందింప జేయగలను.' అని అన్నాడు. రాముడు 'నీ ఆతిథ్యాన్ని ఎంతమాత్రం నిరాకరించలేను. కాని నేను భరతుణ్ణి, తల్లులను కలుసుకోవాలని తహతహలాడుతున్నాను. ఆలస్యం లేకుండా నన్ను వెళ్ళటానికి అనుమతించమని వేడుకొంటున్నాను.' విభీషణుడు వెంటనే వెళ్ళి పుష్పకరథాన్ని తెచ్చి రాముని ముందు ఉంచాడు. ఈ రథం పూర్వం కుబేరునిది. కాని దీనిని రావణుడు అపహరించాడు. దీనిని విశ్వకర్మ అత్యద్భుతంగా నిర్మించాడు. ఈ అంతరిక్ష నౌక సారథి అంతరంగ సూచనల ప్రకారం ఎక్కడికైనా ప్రయాణించ గలదు. అందుచేత తమ ఎదుట గాలిలో నిలిచిన రథాన్ని చూచి, ఆదేశం కొరకు ఎదురుచూస్తున్నాడు. రాముడు వానరులకు స్వర్ణాన్ని,

రత్నమాణిక్యాలను కానుకలుగా ఇవ్వమని విభీషణుని కోరాడు. అంతట రాముడు, లక్ష్మణుడు, సీత పుష్పకరథం అధిరోహించారు. అక్కడ ఉన్న వారితో రాముడు 'నా ప్రియమైన వానర యోధులారా! మీరు చేసిన వీరోచిత పోరాటాలకు నేను ఋణం తీర్చుకోగల మార్గం ఏదీ లేదు. మీ భక్తియుత సేవ సర్వదా భక్తులకు ఆదర్శంగా నిలుస్తుంది. మీ కీర్తి ప్రతిష్ఠలు అలా ఉజ్జ్వలంగా ప్రకాశిస్తాయి. ఇక కిష్కింధకు వెళ్ళి, సుగ్రీవుని నాయకత్వంలో సుఖంగా జీవించండి. విభీషణా! లంక ప్రజలు రాజును కోల్పోయి వున్నారు. కనుక నీవు పరిపాలనా బాధ్యతలు చేపట్టి, నగరవాసులను రంజింప చేయి' అని ఉద్బోధించాడు. అంతట సుగ్రీవ, విభీషణులు ముకుళిత హస్తాలతో 'ఓ ప్రభూ! మమ్ము మీ వెంట అయోధ్యకు రానివ్వండి. మీ పట్టాభిషేక ఉత్సవం చూచి తిరిగి వస్తాం' అని వేడుకొన్నాడు. రాముడు సమాధానమిస్తూ 'నా ప్రియమిత్రులందరు నాతో అయోధ్యకు వస్తే, అంతకంటే నాకు ఆనందకరమైనది ఏదీ ఉండదు. అందువల్ల, మీరు వానర వీరులందరు కూడ పుష్పక రథంపై ఎక్కితే మనం వెంటనే బయలుదేరుదాం' అని అన్నాడు. అలాగే అందరు సుఖాసీనులైన తర్వాత పుష్పక రథం ఠీవిగా గాలిలోనికి తేలింది. మిగతావారు ప్రయాణాన్ని ఆనందిస్తుండగా, రాముడు వివిధ ప్రదేశాలను సీతకు చూపిస్తూ, వీరంతా నీకోసమే చంపబడ్డారు. అదిగో అది రావణుడు కూలిన చోటు. కుంభకర్ణుడు వధించబడిన స్థలం ఇదే. అక్కడే ప్రహస్తుడు ప్రాణాలు విడిచాడు. అదిగో వంతెన చూడు. దాన్ని దాటి మేము లంకకు వచ్చాం. అదిగో ఆవలి తీరాన సేతుబంధం (రామేశ్వరం) అనే ప్రదేశంఉంది. అక్కడే వారధి నిర్మాణం ప్రారంభమైంది. ఇది మొదలు సేతుబంధం పవిత్ర క్షేత్రంగా విరాజిల్లుతూ, సంచిత పాపాలను ప్రక్షాళన చేస్తూ ఉంటుంది.' అని వివరించాడు.

అంతట రాముడు కిష్కింధను చూపించాడు. సీత రామునితో 'వానర ముఖ్యుల పత్నుల సాంగత్యంలో నేను అయోధ్యకు వెళ్ళగలిగితే, నాకు సంతోషంగా ఉంటుంది.' అని అన్నది. సీత కోరిక మన్నించగా, పుష్పక రథం అక్కడ ఆగింది. రాముడు, సుగ్రీవుడు, ఇతర యోధులతో తమ భార్యలను వెంట తీసుకు రమ్మని సూచించాడు. అలాగే అందరూ వచ్చి ఆసీనులు కాగా, వారి ప్రయాణం కొనసాగింది.

రాముడు 'అదిగో ఋష్యమూక పర్వతం. అక్కడే సుగ్రీవుణ్ణి కలిశాను. దగ్గరలోనే పంపా సరోవరం కనిపిస్తుంది. చూడు. అంతట గోదావరి నదిని నీవు చూడవచ్చు. దాని తీరానే అగస్త్య మహర్షి ఆశ్రమం. ఓ సీతా!అదిగో రావణుడు నిన్ను అపహరించిన ప్రదేశం. అదిగో భరతుడు నన్ను కలుసుకోవటానికి వచ్చిన చిత్రకూటం. అల్లదిగో యమునా స్రవంతి. అటువైపు అమిత శకివంతమైన గంగానది అదిగో. ఆ నదీ తీరాననే గుహుని రాజధాని ఉంది.' అంటూ వివరించాడు. ఇలా వీరందరూ అయోధ్యకు తిరిగి వెళుతుండగా, వారి అరణ్యవాసం మొత్తం విలోమ పద్ధతిలో వ్యక్తమైంది.

అయితే నగర ప్రవేశానికి ముందు, రాముడు భరద్వాజ మహర్షి ఆశ్రమం వద్ద ఆగి, వారి యోగక్షేమాలు తెలుసుకొన్నాడు. భరద్వాజుడు సంతసించి, 'భరతుడు నీవు లేనప్పుడు జింకచర్మాన్ని, నారవస్త్రాల్ని ధరించి జటాజూటాలతో కఠినమైన వైరాగ్య జీవితాన్ని గడుపుతూ ఉన్నాడు. నీ పాదుకలను సింహాసనంపై వుంచి, నీ సేవకునిగా రాజ్యాన్ని పాలిస్తున్నాడు. ఓ రామా! నీవు భూభారాన్ని తొలగించావని నా దివ్యదృష్టితో తెలుసుకొన్నాను.

అందుచే నీవు ఏమి కోరితే దానిని నేను ప్రసాదిస్తాను.' అని అన్నాడు ఋషి. రాముడు సంతోషంతో 'అయోధ్యకు వెళ్ళే మార్గంలో వృక్షాలన్నీ ఫలపుష్ప సంభరితమగు గాక! అద్భుత పరిమళాలను వెదజల్లు గాక!' అని అన్నాడు. ఆయన తథాస్తు అనగానే వృక్షాలు తక్షణమే రసవంతమైపోగా, వేలాది వానరులు దుమికి తనివితీరా ఫలాలను ఆస్వాదించ సాగారు. రాముడు హనుమంతుని వైపు తిరిగి 'నా రాకను గురించి గుహునకు తెలియచేయి. ఆ తరువాత నందిగ్రామం వెళ్ళి భరతునికి సంఘటలన్నింటిని వివరంగా చెప్పు. నా రాక భరతుని ఎలా ప్రభావితం చేసిందో గమనించు. పదవి, అధికార శక్తి, రాజభోగాల పట్ల తనకు గల అనురక్తి వల్లగాని, లేక కైకేయి దుర్బోధ వల్ల గాని రాజ్యాభిలాష ఉంటే, నేను అందుకు సంతోషంతో అనుమతిస్తాను.' అని అన్నాడు.

హనుమంతుడు మనుష్యరూపం దాల్చి, ఆకాశయానంతో నిష్క్రమించాడు. ముందుగా అతను గుహునితో 'రాముడు ఈ రాత్రి భరద్వాజ ముని ఆశ్రమంలో గడిపి, మరునాడు వచ్చి అతన్ని కలుసుకొంటా'డని చెప్పాడు. హనుమంతుడు నందిగ్రామం చేరిన మీదట అక్కడ భరతుడు నారవస్త్రాలు ధరించి, జటాజూటాలతో ఉండటం చూచాడు. చిన్న కుటీరంలో నివసిస్తూ, కందమూల ఫలాలను తింటూ, ఎంతో విచారంగానూ, శుష్కించిన దేహంతోనూ ఉన్నాడు. అంతట హనుమంతుడు భరతుణ్ణి సమీపించి 'నేను రాముని సందేశ వాహకునిగా వచ్చాను. ఆయన నీ క్షేమ సమాచారం గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాడు. తాను త్వరలోనే అయోధ్యకు తిరిగి వస్తున్నట్లు నీకు తెలియజేయమన్నాడు.' అని తెలిపాడు. ఆ మహత్తర వచనాలను వినడంతోనే భరతుని ముఖం తేజోవంతమై అమితానందంతో వెలిగింది. ఆనందంతో వివశుడై స్పృహ కోల్పోయాడు. తెలివి తెచ్చుకొని వెంటనే హనుమంతుని ఆలింగనం చేసుకొన్నాడు. హనుమంతుని అశ్రు ధారలతో అభిషేకిస్తూ, భరతుడు 'నాకీ శుభవార్త తెచ్చినందుకుగాను నీకు నేను తక్షణమే ఒక లక్ష గోవులను, 100 గ్రామాలను, నీవు వివాహమాడటానికి షోడశ కన్యలను బహూకరిస్తాను. ఇక ఇప్పుడు రాముని ప్రవాసం కాలంలో జరిగిన విశేషాలనన్నింటని సవివరంగా చెప్పు.' అని అడిగాడు. హనుమంతుడు సమస్త విషయాలను పూసగ్రుచ్చినట్లు భరతునికి నివేదించాడు. భరతుడు 'నా చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరింది. రాముని స్వాగతించటానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేయమని శత్రుఘ్నుని ఆదేశించాడు. దానితో సుమంత్రుడు, ఇతర సచివులు గజాలను అధిరోహించి, నందిగ్రామానికి చేరుకొన్నారు. అంతట కౌసల్య, సుమిత్ర, కైకేయి పల్లకీల్లో చేరుకొన్నారు. నిర్మాణకర్తలు నందిగ్రామాన్ని అయోధ్యతో అనుసంధానం చేస్తూ హడావిడిగా ఒక క్రొత్త బాటను నిర్మించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని, భరతుడు రామ పాదులకను, ధవళశోభితమైన ఛత్రాన్ని, చామరులను తీసికొన్నాడు. అంతట పలువురు బ్రాహ్మణులు వెంటరాగా శంఖనాదాలు, దుందుభి ధ్వానాల మధ్య తన కుటీరం నుండి భరతుడు వెలుపలికి వచ్చాడు. రాముడు వస్తున్నాడన్న వార్త క్షణాల మీద వ్యాపించింది. అయోధ్యవాసులందరు రాముని చూడటానికి నందిగ్రామానికి తరలి వచ్చారు. భరతుని వెంట సచివులు, సంగీత గానాలు, వాద్యధ్వనులు మ్రోగించుకొంటూ, వేదమంత్రాలతో బ్రాహ్మణులు బయలుదేరారు.

వారి వెనుక శోభాయాత్రలో బంగారు పగ్గాలతో లాగబడే అందమైన అశ్వాలతో రథాలు బయలుదేరాయి. ఈ రథాలు అనేక ఆకర్షణీయ రీతుల్లో అలంకరించబడి ఉన్నాయి. స్వర్ణ కవచాలు ధరించిన సైనికులు, సేవకులు, ఎందరో రూపవంతులైన వేశ్యాంగనలు ఉన్నారు. ఛత్రచామరాలను చేతబూని, రాజోచిత స్వాగత సత్కారానికి తగిన ఇతర లాంఛనాలతో పరిచారకులు కాలినడకన బయలుదేరారు.

అయితే కొంతసేపటికి రాముడు వస్తున్న సూచనలేవీ కనపడక పోవడంతో భరతుడు ఆందోళన చెందుతూ హనుమంతుని అడిగాడు. కాని అప్పుడే దూరంనుండి ఒక గర్జన వినపడింది. దూరాన పుష్పక రథం కనబడగానే, హనుమంతుడు 'అదిగో! శ్రీరాముడు వస్తున్నాడు' అంటూ కేక పెట్టాడు. ఉదయిస్తున్న పూర్ణచంద్రుని వలె శ్రీరాముడు రథంపై కనిపించగానే జనం నుండి హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ప్రతి ఒక్కరూ తమ తమ ఆసనాల నుండి దిగి గౌరవాన్ని ప్రదర్శించారు. భరతుడు దూరాన్నుంచే రాముణ్ణి పూజించ సాగాడు. శ్రీరాముని మహిమలను ప్రస్తుతిస్తూ, భరతుడు అర్ఘ్యాది ఉపచారాలను సమర్పించాడు. పుష్పక రథంపై తేజస్వియై ప్రకాశిస్తున్న శ్రీరాముని చూచి అత్యంత భక్తిప్రపత్తులతో వంగి నమస్కరించాడు.

దివ్యరథం భూమి మీదికి దిగగానే, భరతుడు పరుగున వెళ్ళి రథం ఎక్కి, తన అగ్రజునికి అభివాదాలు తెలిపాడు. రాముడు తక్షణమే తన ఆసనం మీదనుండి లేచి, భరతుని ఆలింగనం చేసుకొన్నాడు. తన అంకం మీదకు తీసికొన్నాడు. దివ్య ప్రేమాతిశయంతోనూ, మృదువైన హృదయంతోనూ, భాష్పపూరిత నయనాలతోనూ భరతుడు శ్రీరామచంద్రుణ్ణి సమీపించి, అపరిమిత భక్తి పారవశ్యంతో ఆయన పాదాలపై పడ్డాడు. భరతుడు బాగా శుష్కించి ఉండటాన్ని రాముడు గమనించాడు. తాను లేనప్పుడు భరతుడు ఋషి జీవనం గడుపుతున్నాడని రాముడు విన్నాడు. ఇందుకు రాముడు ఎంతో దుఃఖించాడు. తరువాత భరతుడు సీతను, లక్ష్మణుని ప్రశంసిస్తూ, అభివాదాలు తెలిపాడు. తర్వాత సుగ్రీవుని ఆలింగనం చేసుకొని అభివాదం తెలుపుతూ 'మేము నలుగురు సోదరులమైనా, ఇప్పుడు నీతో మనం ఐదుగురం సోదరులం అయినాము. నీవు మా సోదరుడివంటి వాడవు' అని అన్నాడు. ఈలోగా రాముడు కౌసల్యమాతను సమీపించి, పాదాలకు ప్రణమిల్లాడు. రాముడు వరుసగా సుమిత్ర, కైకేయి, వశిష్ఠునికి అభివందనం చేయగా, పురజనులు ముకుళిత హస్తాలతో రామునికి స్వాగతం పలికారు. అంతట సీత, లక్ష్మణుడు తన వెంటరాగా, శ్రీరామచంద్రుడు వేదవిదులైన బ్రాహ్మణులకు, పెద్దలకు తన సగౌరవ ప్రణామాలు సమర్పించగా, అయోధ్య పురవాసులంతా శ్రీరామునికి గౌరవాంజలి ఘటించారు. చాలకాలం తర్వాత తమ ప్రభువును చూచిన జనులు పుష్పహారాలు సమర్పించారు.

అటు తర్వాత రామ పాదుకలను తన చేతులతో పట్టుకొని భరతుడు శ్రీరాముని ఎదుటకు వచ్చాడు. ప్రేమతో ఆ పాదుకలను శ్రీరాముని పాదాల వద్ద జాగ్రత్తగా వుంచి, 'నీ పరోక్షంలో నేను పర్యవేక్షించిన రాజ్యమిదిగో. నీ కృపవల్ల అయోధ్య సిరిసంపదలతో తులతూగుతోంది. కోశము, భాండారాలు, సేన అన్నీ దశగుణాధికమై వ్రిరించాయి. ఇక నా కర్తవ్యం పూర్తి అయింది. ఇక వీటన్నింటినీ త్యజించి, నీకు ధారాదత్తం చేస్తున్నాను.' అని అన్నాడు. రామ పాదుకలను శ్రీరాముని పాదాల వద్ద వుంచిన భరతుడు భాష్పపూరిత

నేత్రాలతో, ముకుళిత హస్తుడై నిలిచాడు. శ్రీరామచంద్రుడు భరతుని రెండు చేతులతోనూ చాలసేపు ఆలింగనం చేసుకొని, అతన్ని అశ్రులతో అభిషేకించాడు.

దీని తర్వాత రాముడు పుష్పక రథాన్ని తన అధిదేవతయైన కుబేరుని వద్దకు వెళ్ళమని ఆదేశించాడు. అంతట ఆ దివ్య వాహనం గగనతలంలో ఉత్తర దిశగా సాగిపోయింది. ఆ తర్వాత రాముడు గురువైన వశిష్టుని పాదాల వద్ద కూర్చొని ఉండగా, భరతుడు ఆయన ఎదుటకు వచ్చి 'ప్రియాగ్రజా! దయచేసి ఇంకా ఆలస్యం చేయకుండా రాజసింహాసనంపై పట్టాభిషిక్తుడవై, రాజభోగాలతో కూడిన జీవితాన్ని పునః స్వీకరించు' అని ప్రార్థించాడు. అంతట శ్రీరామచంద్రుడు అపూర్వమైన ఉత్సవ సంబరాల నడుమ అయోధ్యలో ప్రవేశించాడు. దారిపొడవునా శ్రీరామచంద్రునిపై పూలవర్షం సౌరభభరితంగా కురుస్తూనే ఉంది. రాజన్యులు అభివాదాలు చేయగా, బ్రహ్మాది దేవతలు అమితానందంతో ప్రభువు లీలా విశేషాలను కీర్తించారు.

వశిష్ఠుడు రామలక్ష్మణులకు శిరోముండనాలు చేయించగా, వారికి జటాజూటాల నుండి విముక్తి లభించింది. స్నానాదులు పూర్తి కాగా, శ్రీరాముడు రాజోచిత వస్త్రాలను, మాలలను ధరించి, ఆభరణాల చేత అలంకృతుడైనాడు. మాతృమూర్తులు ముగ్గురు అలాగే సీతను సంభూషితురాలిగా చేయగా, వానరుల సతీమణు కూడ నూతన వస్త్రాభరణాలను ధరించారు.

తర్వాత శత్రుఘ్నుని ఆదేశం మేరకు సుమంత్రుడు శోభాయమానంగా అలంకరింబడిన ఒక రథం తీసుకొని రాముని సౌధం ముందు నిలిచాడు. శ్రీరాముడు ఆ రథాన్ని అధిరోహించాడు. భరతుడు పగ్గాలు చేపట్టగా శత్రుఘ్నుడు శ్వేతఛత్రాన్ని చేతబూనాడు. శ్రీరామునికి ఇరువైపుల లక్ష్మణ, విభీషణులు నిలిచి వింజామరలు వీయగా, ఆకాశంలో దేవతలు దివ్యఋషులు శ్రీరాముని ఘనంగా కీర్తించారు. శ్రీరాముడు సభా ప్రాంగణానికి సాగిపోగా, వానరులందరు మానవ రూపం దాల్చి గజారోహణంతో ఒక బ్రహ్మాండమైన ఊరేగింపు శ్రీరాముని వెంట సాగింది. తన రాజధానికి చేరిన శ్రీరాముడు పురజనులు వీధులవెంట బారులు తీరి ఉండటాన్ని గమనించాడు. ఆబాలగోపాలం ప్రాణాలు తిరిగి వచ్చినట్లుగా శ్రీరాముని వీక్షించసాగారు. జయోస్తు అంటూ నినదించారు.

శ్రీరాముడు తన ప్రజలను ప్రేమాదరాలతో వీక్షించాడు. అందరికి అభివాదాలు తెలిపి, శ్రీరాముడు తన తండ్రి ప్రాసాదానికి చేరాడు. తన స్వీయ ప్రాసాదాన్ని సుగ్రీవుని అవసరాలకు ఇవ్వవలసినదిగా ఆదేశించాడు. వెంటనే భరతుడు వానర రాజును చేయిపట్టి తీసికొని వెళ్ళాడు.

భరతుడు కోరిన మేరకు జాంబవంతుడు, హనుమంతుడు, గవయుడు, ఋషభుడు, అంగదుడు నాలుగు సముద్రాల నుండి జలాలను తీసికొని రాగా, కొంతమంది శక్తియుతులైన వానరులు 500 పవిత్ర నదీ తీర్థాల నుండి జలాలను తెచ్చారు. ఆ జలాలనన్నింటిని వశిష్ఠుని ఎదుట ఉంచారు. తదుపరి ఆ మహర్షి విలువైన రత్నమాణిక్యాలతో నిర్మించబడిన సింహాసనంపై రాముణ్ణి, సీతను ఆసీనులను గావించాడు. వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు తదితర ఋషులు సహకరించగా వశిష్ఠుడు పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించాడు. తొలుత బ్రాహ్మణులు అభిషేకించారు.

తర్వాత ఒక కన్య రాముణ్ణి అభిషేకించింది. ఆ తర్వాత ఆయన సచివులు, ప్రముఖ యోధులు, వైశ్యులు ఒకరి తర్వాత ఒకరుగా అభిషేకించారు. అభిషేకం పూర్తి అయిన తర్వాత, వశిష్ఠుడు ఆకాశం నుండి వీక్షిస్తున్న లోకపాలురను, ఇతర దేవతా ముఖ్యులను శ్రీరామునిపై ఓషధులతో సంప్రోక్షించ వలసినదిగా ఆదేశించాడు.

సంప్రోక్షణ ముగిసిన తర్వాత శ్రీరాముడు రత్నఖచిత సింహాసనంపై కూర్చుండగా, వశిష్టుడు ఆయన శిరస్సుపై రాజ మకుటాన్ని పెట్టి, ఆయన దేహాన్ని స్వర్ణాభరణాలతో అలంకరించాడు. ఇక్ష్వాకు మహారాజులందరి చేత ధరింపబడిన ఆ కిరీటం వైవస్వత మనువు యొక్క పట్టాభిషేకం కొరకు బ్రహ్మదేవుని చేత ప్రత్యేకంగా రూపొందించబడింది. దేవేంద్రుని సూచన మేరకు వాయుదేవుడు శ్రీరాముని మెడలో 100 స్వర్ణకమలాలతో కూర్చబడిన హారాన్ని వేసి, ముత్యాలతోనూ, మణులతోనూ కూడిన ఒక దివ్య కంఠహారాన్ని ఆయనకు కానుకగా సమర్పించాడు. శత్రుఘ్నుడు శ్రీరాముని శిరస్సుపై రాజఛత్రాన్ని పట్టగా, సుగ్రీవ, విభీషణులు ఇరుప్రక్కల నిలిచి వింజామరలు వీచారు.

తదనంతరం గంధర్వులు గానం చేయగా, అప్సరసలు ఆనందోద్వేగంతో నాట్యం చేస్తుండగా, శ్రీరాముడు లక్ష గోవులను, ఇరవై లక్షల బంగారు నాణేలను, అన్నిరకాల విలువైన రత్నమాణిక్యాలను బ్రాహ్మణులకు దానం చేశాడు. శ్రీరాముడు సుగ్రీవునికి ఒక దివ్య కంఠహారాన్ని, అంగదునికి వజ్రాలు, రత్నాలతో అలంకృతమైన కంకణ ద్వయాన్ని బహూకరించాడు.

రాముడ తనకు పూర్వం వాయుదేవుడు ప్రసాదించిన ఒక కంఠహారంతో పాటు విలువైన వస్త్రాలను సీతకు బహూకరించాడు. సీత హనుమంతునికి అతని సేవలకు గుర్తుగా ఒక కానుక ఇవ్వదలచింది. రాముడు తనకిచ్చిన కంఠహారన్ని చేతిలో తీసికొని, రామునివైపు ప్రశ్నార్థకంగా చూచింది. శ్రీరాముడు సీత అంతరంగాన్ని గ్రహించి, సీతను ఆ హారాన్ని హనుమంతుని కివ్వమని అన్నాడు. దానితో సీత అమిత సంతోషంతో ఆ హారాన్ని హనుమంతుని మెడలో వేసింది. ఆ తర్వాత వానర ముఖ్యులందరికి విలువైన వస్త్రాభరణాలనుబహూకరించటం జరిగింది. ఇలా శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం పరిసమాప్తమైంది. వానరులు తమ తమ రాజ్యాలకు తృప్తిగా వెళ్ళారు. విభీషణుడు లంకకు వెళ్ళాడు. అందరూ శలవు తీసుకొన్న మీదట, శ్రీరాముడు లక్ష్మణునితో 'ప్రియ సోదరా! నేను నేడు సింహాసం అధిష్టించడం జరిగింది కనుక నిన్ను నా వారసునిగా ప్రతిష్టించాలని అభిలషిస్తున్నాను.' అని చెప్పాడు. ఎన్నిమార్లు చెప్పినా, లక్ష్మణుడు ఇష్టపడక మౌనంగా ఉన్నాడు. శ్రీరాముడు లక్ష్మణుని మనోగతాన్ని చక్కగా, సరిగా అర్థం చేసుకొన్న వాడై, ఆయన చివరకు ఆ గౌరవాన్ని భరతునికి ప్రసాదించాడు.

××× ×××

శ్రీరామచంద్రుడు తన రాజధానియైన అయోధ్య నుండి ఈ భూమండలాన్ని 11000 సం॥లు పరిపాలించాడు. ఆ కాలంలో శ్రీరాముడు 100 అశ్వమేధాలే కాకుండా చాల యితర యజ్ఞాలు చేశాడు.

ఆయన పరిపాలనా సమయంలో అరణ్యాలు, నదులు, పర్వతాలు, మహాపర్వతాలు, రాజ్యాలు, సప్తద్వీపాలు, సప్త సాగరాలు అన్నీ అనుకూలంగా ఉన్నాయి. సకల జీవరాశికి అవసరమైన జీవనావసరాలను సమకూర్చాయి. శారీరక, మానసిక బాధలు, వ్యధ, వృద్ధాప్యం, వియోగం, విలాపం, ఆపద, భయం, చిత్తక్షోభ అనేవి ఎవరికి ఎప్పుడూ కలుగలేదు. భర్తలను కోల్పోయి వ్యధ చెందిన వితంతువులు కూడా ఎవరూ లేరు. చోరుల భయం ఎన్నడూ ప్రజలు ఎరుగరు.

అద్భుతమైన విషయం ఏమంటే – వన్యమృగాలు కూడ తమ సహజ శతృత్వాన్ని వదలి, పరస్పర హింసా కార్యకలాపాలను మానివేశాయి. పౌరులందరు ధర్మవర్తనులై మెలిగారు. శ్రీరాముని సర్వదా తమ ప్రభువుగాను, యజమానిగాను భావించారు. అంతే కాదు. శ్రీరాముని వారు తమ ప్రాణంగాను, ఆత్మగాను సంభావించారు. ప్రతి ఒక్కరూ వేలాది సంవత్సరాలు ఆయుష్షు పొందారు. వేలాది పుత్రులకు జన్మనిచ్చారు. ఎవరు ఎక్కడ ఏమి మాట్లాడుకొన్నా, అది అంతా శ్రీరాముని గురించే తప్ప మరే విషయాలు ఉండేవి కావు. మృత్యువు కోరుకొన్న వారికి కూడ వచ్చేది కాదు.

ఆ విధంగా భూలోకమంతా విష్ణులోకమైన వైకుంఠంలా భాసించింది. అంతట లవకుశులు తమ రామాయణ కథాగానాన్ని ఇలా ముగిచారు – 'రామాయణంగా పేరుగాంచిన ఈ అద్భుతమై కథను నిత్యం వినేవారెవరైనా గాని పాపాలనుండి విముక్తులౌతారు. తమ తమ వ్యామోహాలను జయించి, ఈ పవిత్ర కథను శ్రద్ధాపూర్వకంగా విన్నవారికి, ఇది ఓజస్సును, దీర్ఘాయువును, విజయాన్ని ప్రసాదిస్తుంది. ఈ రామాయణాన్ని స్త్రీలు పఠిస్తే పుత్రులను పొందుతారు. రాజులు పఠిస్తే, భూమండలాన్ని జయిస్తారు. యాత్రికుడైతే తనమ్యాన్ని చేరుకొంటాడు. పాపాత్ముడు పఠిస్తే పవిత్రుడౌతాడు.

"పవమాన సుతుడు బట్టె పాదారవిందములకు – నీ నామరూపములకు నిత్య జయ మంగళం"

– ః యుద్ధకాండం సమాప్తం ః–

**రామకథామృతం సమాప్తం**

**ఓం తత్ సత్**

ఓం

# శ్రీరామ కథామృతం

రామాయణం అంటే కేవలం రామునియొక్క కథ కాదు, అది శ్రీరామునియొక్క ప్రయాణం లేక ఆశ్రయం. అది కేవలం రాముని యానమే కాదు, సీతాదేవిది కూడ.

ఆ ఇద్దరియొక్క సమన్విత ప్రయాణమే రామాయణం. రామ మరియు రామా (సీత)లో రమణీయత వుంటే, వారిద్దరి దివ్య ప్రయాణంలో గతిశీలత ఉంది. అందుచేతనే రమణీయత, గతిశీలతలు గలదే రామాయణం.

తమసానదియొక్క స్వచ్ఛ జలములంత ప్రసన్నం మరియు రమణీయత అయి వుంది. అంతేకాదు క్రౌంచ మిథున ఆక్రందనం వలె కరుణారసాప్లావితమై కూడ ఉంది. శ్రీరాముడు ప్రేమకు ప్రతినిధి అయితే సీతాదేవి కారుణ్యమునకు మూర్తిమత్వం వహిస్తుంది. మానవ జీవితముయొక్క ఈ రెండు మౌలిక విలువలను ఆధారంగా చేసుకొని వాల్మీకి మహర్షి రామాయణ మహాకావ్యాన్ని రచించారు. ఇందులో పృథ్వీ మరియు ఆకాశం, పరిమళం మరియు మాధుర్యం, సత్యం మరియు సౌందర్యంయొక్క మంజుల సామంజస్యముతో కూడిన కథయే అయనముయొక్క గౌరవ స్థానాన్ని ప్రసాదిస్తుంది.

జీవితపు పిలుపే రామాయణంయొక్క జీవనాడి. తాను జీవిస్తూ, ఇతరులను జీవించనీయడమే రామాయణ సంస్కృతి యొక్క మూలసూత్రం. ఇందులోనే రాముని కథ విశ్వవ్యాప్తమై శోభిల్లుతోంది.

భారతీయ జనజీవనంలోనే కాకుండా, విశ్వ సంస్కృతిలో వాల్మీకియొక్క ఈ అమర కృతి విశిష్ట స్థానాన్ని సంపాదించింది.

మానవ జీవిత గమనంలో అడుగడుగునా రామాయణ ప్రసక్తి రావాల్సిందే. ప్రతి వ్యక్తి రామునిలా జీవితం గడపాలని ఆశిస్తుంటాడు. సమత, మమత, సామరస్యంపై స్థిరమైన పునాది గల్గిన మానవజీవితము యొక్క మధుర మనోహర మార్మికతను చిత్రించడమే ఆ మహర్షియొక్క అనర్ఘ సృష్టికి బీజంగా ఉంది. ఈ మూల మంత్రమే రామాయణంలో అనేక సందర్భాల్లో, ప్రసంగాల్లో క్రమక్రమంగా పల్లవిస్తూ, తుదకు రామరాజ్యం శుభోదయంతో పారిజాత పుష్పంలా శోభిల్లుతోంది.

ఇదియే రామాయణం యొక్క పారమార్థికత. రామకథ నవనీతం. ఇదియే ఆదికవియొక్క ఆత్మదర్శనంగా విలసిల్లుతోంది.

హిందీ మూలం గ్రంథం : 'రామకథా నవనీతం'

కీ.శే. డా॥ ఇలపావులూరి పాండురంగరావు
డైరెక్టర్, భారతీయ జ్ఞాన్ పీఠ్, న్యూఢిల్లీ.
తెలుగు సేత : పింగళి పాండురంగరావు

*Pingali Pandu Ranga Rao*
M.A.(Eng)., M.A.(P.A)., B.Ed.,
Principal (Rtd.)
A.B.M. Degree College, Ongole.
C.M.B.C. Degree College (Women), Ongole.
A.B.M. Degree College, Kavali.

Phone : 08592-232126
Cell : 94405 54114
"Srirangadhamam"
8-71, Lawyerpet,
ONGOLE - 523002
kripanidhiom@gmail.com

# అక్షర కైంకర్యం

శ్రీ రఘురామ చారు తులసీదళదామ, శమక్షమాది శృం
గార గుణాభిరామ, త్రిజగన్నుత శౌర్యరమాలలామ దు
ర్వార కబంధరాక్షస విరామ, జగజ్జనకల్మషార్ణవో
త్తారకనామ భద్రగిరి దాశరథీ! కరుణా పయోనిధీ!

'చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్।
ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్॥'

శ్రీరామచంద్రుని చరిత్రము శతకోటి శ్లోకములతో గానం చేయబడింది. అందులోని ప్రతి అక్షరము మహా మహా పాపరాశిని నశింపచేస్తుంది.

భారతీయ సంస్కృతిని విశ్వవిఖ్యాతం చేసిన మహాగ్రంథాలు రామాయణం, భారతం, భాగవతం. ప్రజల నిత్య జీవితాలను భారతం ప్రదర్శిస్తుంది. దివ్యమైన జీవితాన్ని ఎలా గడిపి భగవంతుణ్ణి చేరుకోవచ్చునో భాగవతం తెలియజేస్తుంది. రామాయణం మానవుడు ఎలా ఆదర్శప్రాయమైన జీవితాన్ని అలవరచుకోవాలో మార్గనిర్దేశనం చేస్తుంది.

ఈ భూమి మీద పర్వతాలు, నదులు ఉన్నంత కాలం రామాయణ కథ వ్యాప్తిలో ఉంటుందన్నది బ్రహ్మ వాక్కు. అది సత్యమే. శ్రీరాముడు వేదం ప్రవచించిన ధర్మానికి ప్రతిరూపం కావడమే అందుకు కారణం. శ్రీమహావిష్ణువు మానవ రూపంలో శ్రీరాముడుగా అవతరించాడు. మానవుల సహజ లక్షణాలనే ఆయన ప్రదర్శించాడు. తాను భగవంతుణ్ణి అని తనకు తెలిసినా, బ్రహ్మాది దేవతలు, ఋషులు ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో ఆయనతోనే చెప్పినా కూడ, తను మాత్రం మానవుడనేనని, దశరథుని కుమారుడనే నని ప్రకటించాడు.

వేదాలే వాల్మీకి మహర్షి ద్వారా శ్రీమద్రామాయణంగా ప్రకటించబడినవి. శ్రీరామనామ మహిమ వర్ణించాలంటే మాటలు చాలవు. రామమంత్రంలో, అష్టాక్షరీ, పంచాక్షరీ మహామంత్రం నుండి 'రా', 'మ' అనే రెండు అక్షరాలు కలిపి రామనామ తారక మంత్రం రూపొందింది. శివకేశవులు అభిన్నులనే అద్వైత సిద్ధాంతానికి ఇది ప్రతీకగా పెద్దలు చెపుతారు. వశిష్ఠ మహర్షి కూర్చిన ఈ మంత్రాన్ని ఎందరో మహనీయులు జపించి సిద్ధిని పొందారు. ప్రకృతి శక్తులను రక్షించే దైవీ శక్తులను ప్రేరేపించి, దానిద్వారా లోకకళ్యాన్ని సాధించుటయే భగవత్తత్త్వం. ఆ తత్త్వాన్నే లోకానికి చాటి చెప్పటానికే విష్ణువు రాముడుగా అవతరించి జగద్రక్షణ చేశాడు. ధర్మప్రతిష్ఠాపనయే రామాయణ ప్రధానాంశం. ఇహపర సాధనయే రామాయణం ద్వారా సాధ్యమని నిరూపించడమే వాల్మీకి సంకల్పం. మానవుడు పరిణతి చెంది, పరిపూర్ణతను సాధించటానికి సాయపడే గ్రంథమే రామాయణం.

రామయణం అంటే రాముడు ప్రదర్శించిన ఆదర్శవంతమైన మార్గం. ఆ మార్గంలోనే ప్రతి ఒక్కరూ నడుస్తూ, జీవితంలో ధర్మమార్గాన్ని అనుసరించాలని రామాయణం ఉపదేశిస్తుంది, నిర్దేశిస్తుంది. రామాయణంలో మానవ ధర్మాలు, కుటుంబ ధర్మాలు, పాలనా ధర్మాలు, మానవీయ అంశాలు ఉన్నాయి. ధర్మసూక్ష్మాలు పుష్కలంగా ఉన్నాయి.

రామాయణం విశిష్టత ఏమంటే – భారతీయ సంస్కృతిని దేశవిదేశాల్లో పరివ్యాప్తం చేసిన మహత్తర గ్రంథం. రామాయణం అనేక రూపాల్లో, అనేక భాషల్లో వెలువడింది. రాముడు తమకే కాదు, సర్వజగత్తుకే రక్షకుడు అనే భావన మానవుని హృదయంలో నిలిచిపోతుంది.

వాల్మీకి మహర్షి ఒక ప్రేమకథను బహుసుందరంగా రామాయణ రూపంలో తరతరాలకు అందించాడు. రామాయణం వల్ల వ్యక్తుల మధ్య ప్రేమ అజరామరమయింది. ప్రేమకు శాశ్వతత్వం లభించింది. అందుకు వాల్మీకి మహర్షికి అందరమూ ఋణపడి వుండాలి.

శ్రీరామచంద్రుడంటే – ఒక కల్పిత వ్యక్తి కాదు. సామాన్య మానవుడు కాదు, ఒక మహాపురుషుడు కాదు. అగణిత లౌకికాలౌకిక విశ్వాలకు సృష్టికర్త, సంరక్షకుడు, నియామకుడు అయిన దేవాధిదేవుడే. ఆత్మలకు ఆత్మయై ప్రతి అణువులోను, ప్రతి జీవి హృదయాంతర్గతంగాను నెలకొని ఉన్నాడు. త్రికాలాల్లోని సర్వమూ ఎరిగినవాడు, త్రికాలజ్ఞుడు, సర్వజ్ఞుడు.

బలము, సంపద, యశస్సు, సౌందర్యం, వైరాగ్యం, జ్ఞానం అనే ఆరు దివ్య వైభవాలను పరిపూర్ణంగా కలిగినవాడు శ్రీరాముడు. సకల కళ్యాణ గుణాభిరాముడు. యోగులకు, విరాగులకు, భక్తులకు అంతిమ గమ్యం శ్రీరాముడే.

బాధలతో అలమటిస్తున్న బద్ధజీవుల పట్ల తనకున్న అపార కారుణ్యంతో భగవానుడు ఈ లోకంలోకి దిగివచ్చి, అవతార పురుషునిగా కొనియాడబడుతూ ధర్మసంరక్షణ చేస్తూ ఉంటాడు. ఈ విషయాన్ని భగవద్గీతలో మనం చూడవచ్చు. భగవానుడు తన శాశ్వత సచ్చిదానంద రూపంలో అవతరించటం జరుగుతుంది.

ఎన్నో వేల సంవత్సరాలుగా శ్రీరాముని చరిత ఆస్తిక జనులకు ఆనందాన్ని నిత్యం ప్రసాదిస్తూ వస్తోంది. రామాయణంలోని పాత్రల తీరు, నాటకీయత, కరుణరసం అత్యంత ప్రజాదరణ పొందిన ప్రపంచ వాఙ్మయంలో దాని స్థాయిని భద్రంగా నిలబెట్టాయి.

రామాయణాన్ని రంజింపజేసే కథగా భావించకుండా, శ్రీరామచంద్రుని లోకాతీతమైన శాశ్వత పరమ వైభవ స్థితిని ఆకళింపు చేసికొని చదివినపుడే పరమ శ్రేయస్సును ప్రసాదిస్తుందని చెప్పక తప్పదు. అట్టివారు జీవితం యొక్క పరమ లక్ష్యమైన భగవత్ చరణారవింద ప్రాప్తిని పొందుతారు.

శ్రీరామనామ మహిమ

"శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే। సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే॥"

విష్ణుసహస్రనామ స్తోత్రం పఠించడంలో భక్తులకు కొంత యిబ్బంది కలుగుతుందేమో! లఘురూపంలో ఆ పుణ్యఫలం లభించే ఏదైనా ఉపాయం చెప్పమని పార్వతీదేవి పరమశివుని వేడుకొంటుంది. అపుడు పరమశివుడు

పార్వతీదేవికి పై శ్లోకాన్ని వినిపించాడు. భావమేమనగా – నిన్ను దర్శించాలని తలచేవారందరికీ అఖండానందం ప్రసాదించు ఓ భవానీ! వినుము. శ్రీరామ రామ రామ అని శ్రీరామనామాన్ని వరుసగా మూడు సార్లు పఠించినచో, ఆ నామములు వేయిసార్లు పఠించిన దానితో సమానము. ఈ విధంగా పఠించి ఎల్లరు తరింతురు గాక! అని చెప్పాడు.

కనుక ప్రియతమ భక్తమిత్రులారా! రామాయణం సీతారాముల దివ్యచరితం. వాల్మీకి విరచితమై, లవ కుశుల ప్రవచనమై, మధుర వాఙ్మయ మనోహరమై, భక్తిభావనామృతమై, ఆరుకాండల సమన్వితమై, విశుద్ధ భక్తుల జీవితమైవేల వసంతాలనుండి ప్రజానురంజకమైన ఈ మహకావ్యమును చదివి జీవితం సార్థకం చేసుకొందాం.

**మరొక మనవి:** నేను ఈ గ్రంథంలో ఆరు కాండలు మాత్రమే వ్రాశాను. ఏడవదైన ఉత్తరకాండను లుప్తం చేశాను. కారణమేమంటే – చాలమంది పండితులు, పెద్దవారు ఈ కాండను సహేతుకంగా నిరూపించి వదలినారు. అందుచేత నేను కూడ చేర్చలేదు. మన్నించ ప్రార్థన.

ఈ మహాకావ్యాన్ని కూడ నాచే వ్రాయించిన శ్రీవారి దివ్యచరణములకు ఈ గ్రంథాన్ని పూజాపుష్పంగా సమర్పించుకొంటున్నాను.

నా మేనమామ, పరమపూజ్య కీ.శే. ఇలపావులూరి పాండురంగరావుగారి (డైరెక్టరు, భారతీయ జ్ఞానపీఠ్, న్యూఢిల్లీ) జ్యేష్ఠపుత్రులు, నా కత్యంత ప్రియులైన సుప్రసిద్ధ సాహితీవేత్త డా॥ ఇలపావులూరి వెంకట సుబ్బారావుగారు ఈ గ్రంథం గురించి తమ మహెూన్నత మధుర భావాలను అందించినందుకు వారికి నా హృదయపూర్వక, కృతజ్ఞతాపూర్వక శుభాశీస్సులు అందిస్తున్నాను. వీరి కుటుంబాన్ని శ్రీనివాస ప్రభువు సదా కాపాడు గాక!

ఈ నా రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహిస్తూ, ఈ గ్రంథానికి తమ అక్షరాశీస్సులు ప్రసాదించిన మహా మాన్యవర్యులు, మహెూపాధ్యాయ, వాచస్పతి, సాహితీ శిరోమణి డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారికి అభివందనాలు సమర్పించుకొంటున్నాను.

అలాగే నా గ్రంథ రచనలకు అన్ని విధాల సహకరిస్తున్న నెల్లూరు వాస్తవ్యులు శ్రీ ఎన్. రఘుకుమార్‌గార్కి, ఒంగోలు వాస్తవ్యులు శ్రీ యం. రాజేంద్ర కుమార్‌గార్కి నా శుభాశీస్సులు తెలుపుకుంటున్నాను.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

–: సర్వేజనా స్సుఖినో భవన్తు :–

... పింగళి పాండురంగరావు

SIROMANI, VACHASPATI, MAHAMAHOPADHYAYA
Dr. SAMUDRALA LAKSHMANAIAH, M.A.
SPECIAL OFFICER (Retd.)
Purana-Itihasa Project
Tirumala Tirupati Devasthanams

Off. : 0877 - 2264305
Res: 0877 - 2230679

TIRUPATI - 517 507

Date : ..................................

# నివేదన

వేదవేద్యే పరే పుంసి – జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసాదాసీత్ – సాక్షాద్రామయణాత్మనా ॥

వేదాలచే తెలియదగినవాడు, పరమాత్ముడు 'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః' అని గీతావచనం. ధర్మస్థాపనకై ఆ దేవుఉ పలు అవతారాలు ధరిస్తాడు. త్రేతాయుగంలో రావణాదులైన దుష్టరాక్షసులను శిక్షించడానికై ఆ దేవుడు దశరథుని పుత్రుడుగా ఆవిర్భవించాడు. ఆ సమయంలోనే వేదం రామాయణంగా ఆదికవి వాల్మీకి ద్వారా రూపొందింది.

యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే।
తావద్రామయణ కథా లోకేషు ప్రచరిష్యతి॥

పర్వతాలూ, నదులూ భూతలంలో ఎంతవరకూ ఉంటాయో, అంతవరకూ రాముని కథ లోకాలలో ప్రచారంలో వుంటుందని భావం.

వేదవాఙ్మయం తరువాత లౌకిక వాఙ్మయంలో అవతరించిన మొదటి రచన రామాయణమే. అందుకే అది ఆదికావ్యంగా ప్రశస్తి పొందింది. వాల్మీకి యోగదృష్టితో కరతలామలకంగా రాముడి చరిత్రను సమగ్రంగా దర్శించి రామాయణం రచించాడు.

ఒక గ్రంథం లోకంలో ప్రశస్తి పొందాలంటే అందులో వర్ణింపబడే నాయకుడు లోకోత్తర గుణసంపన్నుడై యుండాలి. రాముడు సుగుణాభిరాముడు, వీర్యశాలి, ధర్మజ్ఞుడు, సత్యసంధుడు, దృఢవ్రతుడు, సర్వభూత హితకారి, విద్వాంసుడు, కోపరహితుడు, ఇంకా ఇలాంటి ఉత్తమ గుణాలెన్నో ఆయనలో ఉన్నాయి. అందువల్లనే రాముడు రామాయణంలో కథానాయకుడై నేటికీ ఆరాధనీయుడై వున్నాడు.

రాముని కథ నానా భాషలలో గద్యకావ్యాలుగా, పద్యకావ్యాలుగా, చంపూప్రబంధాలుగా, రపకాలుగా వివిధ రూపాలతో అవతరించింది. అనన్య సామాన్యమైన ప్రశస్తి పొందింది. ఆదికావ్యమైన అద్వితీయ కావ్యంగా రూపొందింది.

ఎందుకిలా పాడినపాటే పాడినట్లు రామకథనే కవులు కీర్తిస్తున్నారు? అని ఒక కవిని ప్రశ్నిస్తే ఆయన ఇలా సమాధానం చెప్పాడు –

'యదిక్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్య చరితం।
గుణైరేతావద్భిః జయతి పునరన్యో జగతి కః? (మురారి)

'ఒకే రామకథను మాటిమాటికీ చెప్పడం ఎందుకు? అని వదలివేస్తే శ్రీరాముని వంటి గుణవంతుడు

మరొకడుంటే చెప్పండి! అప్పుడు రాముణ్ణి విడిచి మీరు చెప్పిన వ్యక్తినే అభివర్ణిస్తూ కావ్య రచన కావిస్తాము' అని భావం.

రామాయణాన్ని "చతుర్వింశతి సాహస్రీ సంహితా" అని అంటారు. అంటే గాయత్రీ మంత్రంలో 24 అక్షరాలున్నట్టే ఇందులో 24 వేల శ్లోకాలున్నాయి. రచన సరళమూ, సుందరమూ అయిన లౌకిక సంస్కృతంలో సాగింది.

రామాయణ రచనా కాలనిర్ణయంలో పరిశోధకులు భిన్నాభిప్రాయాలు కల్గివున్నారు. అనేక ప్రమాణాలను బట్టి బుద్ధునికి పూర్వమే, అనగా క్రీస్తుకు పూర్వం 500 సంవత్సరాలకు ముందే రామాయణ రచన జరిగిందని ప్రముఖ పరిశోధకుల అభిప్రాయం.

రామాయణంలో ఎక్కడా దీర్ఘ దీర్ఘ సమాసాలు ప్రయుక్తం కాలేదు. వ్యస్తమైన చిన్న చిన్న పదాలతోనే వివక్షితార్థం చెప్పడమయింది. రాముని స్వభావాన్నీ, శిక్షకత్వాన్నీ వివరించే యీ క్రింది శ్లోకాన్ని గమనించండి.

"నాస్య క్రోధః ప్రసాదో వా నిరర్థోస్తి కదాచన।
హన్త్యేష నియమాద్వధ్యాన్ అవధ్యేషు నకుప్యతి॥ (2-2-46)

ఇలా అలతి అలతి పదాలతో అల్లిన అనుష్టుప్ శ్లోకాలు పరమ రమణీయాలై పాఠకులకు పునఃపునః పఠించడానికి ప్రేరణనిస్తాయి.

కావ్యరచనలో వర్ణన చాలా కీలకమైనది. వర్ణనతో పాటే కవిత్వం పుట్టిందనీ, అంతకు ముందు కవిత్వం పుట్టలేదనీ అలంకార శాస్త్రజ్ఞులు చెప్పారు. కావ్యంలో అష్టాదశ వర్ణనలుండాలని వారంటారు. రామాయణం వివిధ వర్ణనలకు నిలయం. నగరాలు, ఋతువులు, యుద్ధాలు, అడవులు ఇత్యాదిగా వివిధములైన దృశాయలు అతిమనోజ్ఞంగా ఈ ఆదికావ్యంలో వర్ణింపబడి వున్నాయి. అనంతర కవులకు ఈ కావ్యమే ఆదర్శమయింది. కావ్యరచనలకు దారి చూపింది. అందుకే చంపూ రామాయణకర్త భోజమహారాజు వాల్మీకిని 'మధుమయ ఫణతీనాం మార్గదర్శీ మహర్షిః' అని కీర్తించాడు.

కవికులతిలకుడుగా ప్రసిద్ధుడైన కాళిదాస మహాకవి రఘువంశాది మహాకావ్యాల రచనలో వాల్మీకినే అనుసరించాడు. ఆయన చెప్పిన మాట ఇది.

"అథవా కృతవాగ్ద్వారే వంశేస్మిన్ పూర్వసూరిభిః।
మణే వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మే గతిః॥ (రఘువంశం)

'వజ్రపు సూదితో బెజ్జం వేసిన మణిలోదూరే దారానికి లాగా పూర్వకవులు తీర్చిన వాగ్రూపమైన ద్వారంగల యీ వంశంలో నాకూ ప్రవేశమున్నది.' అని తాత్పర్యం. ఇక్కడ కాళిదాసు స్మరించిన పూర్వసూరులలో అగ్రగణ్యుడు వాల్మీకి మహర్షియే.

రామాయణాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం చేసే వారెందరో వున్నారు. దానివల్ల అశుభాలు తొలగిపోయి శుభాలు కల్గుతాయని వారి విశ్వాసం. రామాయణంలో సుందరకాండకు ఎంతో వైశిష్ట్యం ఉన్నది. ఈ కాండలో హనుమంతునికి గల ప్రాముఖ్యాన్ని బట్టి ఈ కాండను 'హనుమద్విజయం' అని కూడ వ్యవహరిస్తారు.

"సుందరే సుందరో రామ, సుందరే సుందరీ కథ।
సుందరే సుందరీ సీతా, సుందరం వనం।
సుందరే సుందరం కావ్యం సుందరే సుందరం కవి।
సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరం?"

అన్నట్లు "సుందరకాండలో రాముడు సుందరుడు, ఆంజనేయుడు సుందరుడు, సీత సుందరి, ఇక ఆ కాండలో సుందరం కానిదేమున్నది?"

యుద్ధకాండలో రావణ కథకు ముందు ప్రస్తావనకు వచ్చే ఆదిత్య హృదయ స్తోత్రం మిక్కిలి ప్రశస్తం. ఆరోగ్యసిద్ధి కొరకు దాన్ని పారాయణం చేస్తారు. ఇలా ఎన్నో రీతుల రామాయణ కావ్యం మన సాహిత్యంలో ప్రథమగణ్యమై విరాజిల్లుతున్నది.

కావ్యజగత్తులో శృంగారం మొదలైన తొమ్మిది రసాలు ప్రసిద్ధాలు. రామాయణంలో ఏది ప్రధాన రసం? అంటే ఆనందవర్ధనుడు కరుణ రసమే ప్రధానమన్నారు. సీతాచరిత్ర అంతా దుఃఖభూయిష్టమే. క్రౌంచపక్షుల వియోగం శోక కారణమై శ్లోకరూపం పొంది కరుణరసానికి హేతువయింది. ఆ రసమే రామాయణంలో ప్రముఖమయింది. 'ఏకోరసః కరుణయేవ' అని భవభూతి మాట గూడా దీన్ని సమర్థిస్తున్నది.

రాముడు దశావతారాలలో ఏడవ అవతారం. ఆయనను మర్యాద పురుషోత్తమునిగా వాల్మీకి చిత్రించాడు. ఉత్తమ మనుజరూపంలో వర్ణింపబడిన శ్రీరాముడు లోకానికంతా ఆదర్శమై వెలుగొందాడు.

శ్రీరాముని సోదర ప్రేమ అనుపమానమైనది. లక్ష్మణుడు శక్తి ప్రయోగానికి గురి అయినప్పుడు రాముడు 'దేశే దేశే కళత్రాణి' ఇత్యాదిగా విలపించిన ఘట్టం ఎంత ఉదాత్తమో కదా!

గీతలో కామక్రోధలోభాలనే మూడు నరక ద్వారాలు పేర్కొనబడ్డాయి. వాలి వినాశనానికి కామక్రోధాలే కారణాలు. అట్లే ధర్మవిరుద్ధ కామమే రావణ వినాశ హేతువు. ఈ అంశాలు రామాయణంలో నిపుణంగా చిత్రించబడి వున్నాయి.

"రమో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథా।
రామ భూతం జగద భూ ద్రామే రాజ్యం ప్రశాసతి॥

రామరాజ్యంలో ప్రతి ఒక్కరూ 'రాముడు, రాముడు, రాముడు' అని రాముణ్ణి గురించే చెప్పుకొనేవారు. ఆ కాలంలో జగమంతా రామమయ మయింది.

అట్టి రాముణ్ణి గురించి వివరించే రామాయణం ప్రపంచ సాహిత్యంలో నిరుపమానమై రాణిస్తున్నది. ఎన్నో భాషలలో రామాయణం అనువదింపబడింది. నేటికీ కవులు రామకథా ప్రధానమైన రచనలు కావిస్తూనే వున్నారు. చలనచిత్రాదులు వచ్చిన తరువాత రామాయణ ప్రశస్తి ఇంకా విస్తరించి దేశవిదేశాలకు ప్రాకిపోయింది.

ప్రస్తుతం 'శ్రీరామకథామృతం' అన్న పేరుతో ఈ రామాయణ గాథను సులభ సుందర వ్యావహారిక భాషలో రచించిన శ్రీ పింగళి పాండురంగరావు గారిని గురించి నాల్గు మాటలు.

శ్రీ పింగళిగారు సుప్రసిద్ధ సాహితీవేత్తల వంశంలో జన్మించారు. అధ్యాపకులుగా, ప్రిన్సిపాలుగా ఉద్యోగాలు నిర్వర్తించి విద్యావంతుల అభిమానాన్ని చూరగొన్నారు. గ్రంథరచన, వారికి వెన్నతో పెట్టిన విద్య. ఎనుబదేండ్లు దాటినా వారి రచనా వ్యాసంగం కుంటుపడ లేదు. ఇంచుమించు శతగ్రంథ కర్తృత్వ స్థితిని సొంతం చేసుకొన్నారు.

వీరి రచనలన్నీ ధార్మిక – నైతిక – ఆధ్యాత్మిక – ఉపదేశాత్మకాలే కాని ఉబుసుపోకకు, కేవలం కాలక్షేపానికి రూపొందినవి కావు. కావ్యం వల్ల ఎన్ని గుణాలు కీర్తి, అర్థం, వ్యవహారజ్ఞానం, అమంగళక్షతి, ఆనందం, సదుపదేశం మొదలైనవి పూర్వాలంకారికులచే కీర్తింపబడినవో అవన్నీ వీరి రచనల వల్ల వీరికి అనుభవానికి వచ్చాయి. ఈ రచనలు రచయితనే కాక, పాఠకులను గూడా తరింపజేసే లక్షణాలు గలవి. అట్టి లోకోత్తర రచనలు గావించి ఆంధ్ర సారస్వ వైభవాన్ని పెంపొందించిన శ్రీ పాండురంగరావుగారు అభినందనీయులు.

వీరి పలు రచనలకు 'నివేదనల' రూపంలో పరిచయ వచనాలు వ్రాసే భాగ్యాన్ని వీరు నాకు కల్గించినందుకు కృతజ్ఞుణ్ణి. ఒకటి, రెండు రచనలను నాపేర అంకితం కూడా చేసిన ఈ మహనీయునికెలా కృతజ్ఞతలు తెలుపహెూ తెలియకున్నది.

ఇటీవలే భారతం ఆధారంగా అందలి వనితామణులు, 'యువభారతం' పేర భారతంలోని ప్రముఖ పాత్రల గురించి విశిష్ట రచనలు కావించారు. ప్రస్తుతం ఆదికావ్యమైన రామాయణం గురించి ఈ గ్రంథాన్ని రూపొందించి జన్మను ధన్యం కావించుకొన్నారు. ఇందులో కథాగమనమూ, వర్ణనలూ, పాత్రల చిత్రణా – ఇత్యాది విషయాలన్నీ మనోరంజకాలై ఉన్నాయి

అటు ఉద్యోగ జీవితాన్ని కర్తవ్య పరిపాలనతోనూ, విశ్రాంత జీవితాన్ని సారస్వత సేవతోనూ గడిపి జీవితాన్ని సఫలం చేసుకొన్న శ్రీ పాండురంగ రావుగారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

తిరుపతి

8-4-2021 ... సముద్రాల లక్ష్మణయ్య

# అభివాద సన్నుతం

రామాయణం ఆదికావ్యంగా పరిగణింపబడడానికి ముఖ్యకారణం, ఆనాటికి కావ్యరచన ఎవరూ చేపట్టక పోవడం, కావ్యరచనా శైలి ఎలావుండాలో కవులకు తెలియజేయడం, కావ్యరచనా పటిమను పెంపొందించడమూ. అయితే కావ్యం రూపొందాలంటే కేవలం భావుకత్వం చాలదు, సరియైన కథావృత్తాంతం, దానిని పెంచి పోషించే నైపుణ్యం కలిగివుండడం ముఖ్యం. చదువరుల మనసులను తెరిచి, కనులకు చూపునిచ్చి, చెవులకు రసజ్ఞత కలిగించి, ఆనందామృతాన్ని పంచడమే 'కావ్య రసామృత ధార' లక్ష్యంగా వుండాలి.

అలాంటి కావ్యాన్ని రచించిన వాల్మీకి మహామునికి కోటి కోట్ల నమస్కారాలు పెట్టినా తక్కువే అవుతుంది. సమస్త భూమండలంలో సకల సద్గుణ సంపన్నుడు, అత్యంత ఘనుడు, శక్తిమంతుడు, విద్వాంసుడు, ఋద్ధిమంతుడు, సత్యశీలి, నిష్కళంక సౌశీల్యం కలిగిన వాడు, ప్రజ్ఞావంతుడు, సకల జీవకోటి క్షేమాన్ని కాంక్షించేవాడు, అవజ్ఞతకు లోబడనివాడు, దేవతలకు సైతం ప్రీతిపాత్రుడైనవాడు, ముల్లోకాల్లో ఎవరినైనా రక్షించగల వాడు, భక్తజనవల్లభుడు అయిన రాముని కథ చదువుతుంటే మన అజ్ఞానపొరలు తొలగి, వివేకం ఉదయిస్తుంది. సౌశీల్యమైన మాటలతో అందరికీ ఆరాధ్యుడుగా మారినవాడు రాముడు. ఇన్ని శుభలక్షణాలు కలిగినవాడుగా ఆయనను వాల్మీకి తన రచనలో కథానాయకునిగా మలచిన తీరు సుహృద్భావపూర్వకంగా వుంటుంది.

తండ్రి, కుమారుడు, భర్త, రాజు, స్నేహితుడు, సోదరుడు, గురువు ఎలావుండాలనే దానికి, వావివరుసలకు, ఆచార విచార వ్యవహారాలకు రూపకల్పన చేస్తే రాముడవుతాడు. 'రామ' అనే పదమే ఒక పవిత్రమైన పదం. రామనామతారకం, భక్తిముక్తిదాయకం. ఈ 'రామ' అనే పదాన్ని తారక మంత్రం అంటారు. మంత్రాలన్నీ సాధారణమైనవైతే, అందులో ఒక నక్షత్రం లాంటిది రామనామ మంత్రం. 'రామ' అంటే చాలు సమస్త పాపాలు నశిస్తాయని పూర్వం పండితులెందరో చెప్పారు. మనం కొంచెం ఆలోచిస్తే మనకు ఒక అద్భుతమైన భావం కలుగుతుంది రామ నామ సాధనలో. 'రా' అనే అక్షరం అష్టాక్షరిలోనిదైతే, 'మ' అనే అక్షరం పంచాక్షరిలోనిది అంటారు. హరిహర తత్త్వాన్ని తెలుసుకోవడానికి ఇంతకన్నా మంచి 'మంత్రం' ఏదీలేదని సాధకుల మాట.

'రా' అనగానే మనలోని పాపాలు బయటకు వస్తాయి. బాగా నోరు తెరవబడి ఆ పాపాలన్నీ బయటకు పోయే విధంగా ఆ అక్షరం పలకబడుతుంది. అలాగే 'మ' అంటే రావద్దు అని అర్థం. 'మ' అనగానే మన నోరు మూసుకు పోతుంది పాపాలు తిరిగి లోనికి చొరబడకుండా. అంటే రామ నామాన్ని పలుకుతూ వుంటే, అదేపనిగా స్మరిస్తూ వుంటే మనలోని పాపాలన్నీ బయటకు తోయబడి, తిరిగి లోనికి చేరకుండా చేసే ఏకైక 'మంత్రం'గా రామనామాన్ని పరిగణిస్తారు. మరి 'రామ' నామానికి అంత సామర్థ్యం కలగడానికి కారణం ఏమై వుండవచ్చు అంటే పైన చెప్పిన ఉదాత్త గుణాలు కలిగి, త్రిగుణాలను అదుపులో పెట్టుకున్న రాముడు విశిష్ట వ్యక్తియైనవాడు కాబట్టి. నిజంగా ఒక వ్యక్తిలో ఇన్ని సద్గుణాలుంటాయా అంటే, అది త్రేతాయుగంలో ధర్మం మూడు పాదాల మీద చరిస్తున్నప్పటి మాట, ఇప్పటిది కాదు. కాని; ఈనాటికీ వన్నెతగ్గని రీతిలో ఆ నామం ప్రజల గుండెల్లో పదిలంగా నిలిచిపోయింది. అంటే ఆ నామాన్ని సాధనచేసి మంచి ఫలితాలు సాధించిన రామదాసు, త్యాగరాజు, పోతన వంటి భక్తుల చరిత్రల ద్వారా ఆ నామమహిమ మనకు అందుబాటులో వుంది.

'రామ'నామాన్ని సాధన చేయడానికి సమయం, ఓర్పు, తెలివి, ధైర్యం అనే అనేక విషయాలు వుండవలసిన అవసరం లేదు. ఎప్పుడైనా, ఎక్కడైనా, నిరంతరం ఆ నామాన్ని స్మరించడం వల్ల మనలోని దైవీశక్తులు బలోపేతమై, దుష్టశక్తులను పారద్రోలుతాయన్న నమ్మకం మనలో వుంటే చాలు. తప్పక విజయులమవుతాం.

ఒక ఊర్లో ఒక శూద్రుడు వుండేవాడు. ఆ గ్రామంలోనే ఒక సదాచారవంతుడైన బ్రాహ్మణుడు కూడా వుండేవాడు. ఆ శూద్రుడు ఎవరు పిలిస్తే వారి యిండ్లకు వెళ్ళి, వారు చెప్పిన పనిచేసిపెట్టి, వారు తినడానికి

ఏదైనా ఇస్తే దానితో జీవనం సాగించేవాడు. బ్రాహ్మణుడు నిరంతరం ఊరిజనాలకు రామయణ, భారత కథలు వినిపిస్తూ, మంచి సలహాలు ఇస్తూ, ప్రజలు తనకు యిచ్చిన కానుకలతో కుటుంబాన్ని పోషించుకుంటూ వుండేవాడు.

ఈ బ్రాహ్మణుడు పురాణ కాలక్షేపం చేస్తున్న సమయంలో, తనకు ఏమీ పనిలేక పోతే శూద్రుడు కూడ దూరంగా నిలబడి వింటూ వుండేవాడు. అలాంటి సమయంలో ఒకనాడు బ్రాహ్మణుడు చెప్పిన "రామనామ మహిమ" అతని మనసులో గాఢంగా నిలిచిపోయింది. వాడు చదువులేనివాడు కాబట్టి దాని గురించి ఇంకా తెలుసుకోవాలనే ఆశ అతడిలో కలగలేదు. కాని ఆనాటి నుండి వాడు నిరంతరం రామనామ జపం చేయడం కొనసాగించాడు. ఇలా వుండగా, మరణం అనేది మానవసహజమైన ప్రకృతి నియమం కాబట్టి ఆ బ్రాహ్మణుడు, శూద్రుడు ఇద్దరూ ఒకేరోజు మరణించారు. యమభటులు బ్రాహ్మణుని నరకానికి తీసుకు వెళ్ళడానికి వచ్చారు. కాని దేవదూతలు శూద్రుడిని స్వర్గానికి తీసుకు పోసాగారు. బ్రాహ్మణుడికి ఏమీ అర్థం కాక, వచ్చిన యమభటులను ఇదేమిటి నేను నిరంతరం ఊరి ప్రజలకు మేలుకలిగేలా పురాణ ప్రవచనం చేస్తుండేవాడిని, నన్ను యమలోకానికి ఎందుకు తీసుకుపోతున్నారు. ఆ శూద్రుడికి స్వర్గప్రాప్తి ఎలా కలిగింది? అని అడిగాడు. అందుకు యమభటులు 'నీవు కేవలం పురాణ కాలక్షేపం చేస్తూ, దానికి ప్రతిఫలం పొందుతూ, కుటుంబ పోషణపై నీ చూపు నిలిపి వుంచడం వల్ల నీవు కొంతకాలం నరకంలో వుండవలసి వస్తున్నది. కాని ఆ శూద్రుడు ఏ పనిచేస్తున్నా దాని ఫలం గురించి ఆలోచించక, ఆశించక, కేవలం తనకు లభించిన దానితో తృప్తి పడి, నీ బోధనలు విని నిరంతరం 'రామ'నామం జపించడం వల్ల అతనికి స్వర్గప్రాప్తి కలిగింది' అని చెప్పారు. శుద్ధిలోనే సిద్ధి ఉంటుంది.

కాబట్టి 'రామ' అనే రెండు అక్షరాలను నిరంతరం జపిస్తూ వుంటే, అంటే ఏ పనిచేస్తున్నా ఆ నామపారాయణం చేస్తుంటే, మపలో వున్న దోషాలు ప్రక్షాళితమై పుణ్యఫలం కోరకనే కలుగుతుందని తెలుసుకోవాలి. ఇక ఇటువంటి రామనామ మహిమను గురించి ఒక కథారూపంలో చెప్పిన వాల్మీకి, దానిని తిరిగి తమ భావాలతో రచించిన యితర కవులు, రామాయణంలోని అతి నిగూఢమైన భావాలను వెలికితీసిన పండితులు, ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా, ఎప్పుడూ ఏదో ఒక కొత్త భావాన్ని అందించగల సమర్థతను కలిగివున్న రామాయణం గురించి తిరిగి చెప్పాలన్న మా గురువుగారైన బ్రహ్మశ్రీ పింగళి పాండురంగరావు గారు ఎనిమిదిన్నర పదులు దాటిన వయస్సులో ఒక దుస్సాహసమైన పనినే చేపట్టారని చెప్పుకోవాలి. కాలూచెయ్యీ కదిలించలేని వయసు అది. ఒకరి మీద ఆధారపడి బ్రతకడం మనం చూస్తూనే వుంటాం. అందుకు వ్యతిరేకంగా తన స్వహస్తాలతో ఆ రచనను చేయడం, దానిని పరిశీలింపజేయడం, అభిప్రాయాలను తీసుకోవడం, ఖర్చుకు వెనుకాడకుండా నిస్వార్థ బుద్ధితో ముద్రణ చేయించడం, వాటిని ఉచితంగా తెలిసినవారందరికీ పంచడం అంటే అది సాధారణమైన విషయం కాదు. కాని ఆ కార్యాన్ని వారు సునాయాసంగా చేయగలిగారు. అక్షర దోషాలున్నాయని తెలిసి, వాటిని సరిచేయించి, పునర్ముద్రణకు పూనుకోవడం మరో పెద్ద కసరత్తు.

ఆ విషయం గురించి వారు చెబుతూ, 'భారతంలాగే ఈ మహాకావ్యాన్ని కూడ నాచే వ్రాయించిన శ్రీవారి దివ్యచరణములకు ఈ గ్రంథాన్ని పూజాపుష్పంగా సమర్పించుకొంటున్నాను.' అని కర్తృత్వ భావం తనపై వేసుకోకుండా ఆ భగవంతునికే సమర్పించడం మనకు ఆదర్శప్రాయమైన విషయం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా ఆ భావాన్నే వెలిబుచ్చాడు కదా 'పని చేయడమే నీవంతు, దాని ఫలితంపై నీకు అధికాం లేదు' అని. కేవలం అటువంటి విషయలను కంటితో కాక మనోనేత్రంతో చదవడం, బుద్ధితో ఆలోచించి, దానిని ఆచరించడం, ఆ విధంగా ప్రవర్తించడం కష్టసాధ్యమే కాని, అసాధ్యం మాత్రం కాదని మా గురువుగారు నిరూపించారని చెప్పవచ్చు.

ఈ రామాయణ మహాకావ్యంలో మిగిలిన ఐదు కాండలకంటే 'సుందరకాండ'కు ప్రశస్తి ఎక్కువ. సుందరకాండను 'పారాయణ కాండ' అని కూడా అంటారు. బ్రహ్మాండపురాణం ఈ కాండను 'సమస్త మంత్ర

రాజోయం పృథివ్యాం నాత్ర సంశయః' అని 'బీజకాండమితి ప్రోక్తం సర్వం ఏతత్పారాయణాత్సిద్ధిర్యదినైవ భవేద్ధువి, న కేనాపి భవేత్సిద్ధిరితి బ్రహ్మానుశాసనమ్' అని ప్రకటించింది. అంటే సమస్త మంత్రాలకంటే ఇది అత్యంత శక్తివంతమైనదని, దీనిని మించిన పారాయణం మరేదీ లేదని బ్రహ్మచే చెప్పబడిందని అర్థం. సుందరకాండకు ఆ పేరు ప్రతిపాదించడానికి అనేక కారణాలున్నాయి. తరచి చూస్తే, సుందరకాండలో సుందరం కానిది ఏదీ లేదని చెప్పవచ్చు. అంటే శబ్ద, అర్థ, పద, రస సౌందర్యాల మేలుకలయిక "సుందరకాండ". మంత్రయుక్తమైన రామాయణ కావ్యంలో, సుందరకాండలో, హనుమంతుని యొక్క "కుండలినీ యోగసాధన', త్రిజటా స్వప్నంలో "గాయత్రి మంత్రం" నిక్షేపించబడ్డాయి. కాబట్టి దీనిని "బీజకాండం" అని కూడా అంటారు. ఇక రామాయణం 'తతోయుద్ధ' అనే పదంతో ప్రారంభమవుతుంది. ఇందులో 'తత్' అంటే పరబ్రహ్మం. ఆ పరబ్రహ్మను ఎలా ఉపాసించాలో సుందరకాండ వివరిస్తుంది. అందుకని దీనిని 'ఉపాసన కాండ' అని కూడా అంటారు. 'అన్య సుందరకాండస్య సమం మంత్రం న విద్యతే' అని కూడా చెప్పబడింది. అసలు సుందరకాండకు ఆ పేరు ప్రతిపాదించడానికి కూడా అనేక కారణాలున్నాయని విజ్ఞులైన పండితులు ప్రకటించారు. 'సుందరం' అంటే ఆనందం కలిగించేది అనే అర్థం వుంది. ఇందులో సీతారాము లిద్దరిని కలిపేందుకు హనుమంతుడు చేసిన ప్రయత్నాలు, వారి సంభాషణలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. సుందరకాండలో 68 సర్గలున్నాయి. ఇందులో ఒక్కొక్క సర్గ పారాయణం చేస్తే ఒక్కొక్క ఫలితం లభిస్తుంది. అలాగే జన్మ నక్షత్రాన్ని అనుసరించి పారాయణం చేయడం కూడా ఒక పద్ధతి.

ఇలా రామాయణం మొత్తం ఒక "మంత్రసారం"గా కనిపిస్తుంది. అటువంటి రామాయణాన్ని వ్యాఖ్యానించడం చాల కష్టతరమైన విషయం. అయినా బృహత్ప్రయత్నంతో, పండు ముదిమి వయస్సులో, మా గురువుగారు వ్రాయడం, దానిపై మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్యగారు, శతసహస్రాధిక కవితావన పంచాస్యులైన ఊరుబిండి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తమ అమూల్యమైన అభిప్రాయాలను వెల్లడిచేయడం, దానిని నేను అక్షరబద్ధం చేయడం, పుస్తకరూపంలో రాజేంద్ర కుమార్‌గారు రూపకల్పన చేసి, ప్రచురణ చేయడం ముదావహమైన విషయం. ఈ విధంగా వారు నాకు ఆధ్యాత్మిక మార్గదర్శకులై నన్ను ఉద్ధరించారు. నేను ఆ మార్గం నుండి తప్పిపోకుండా నన్ను ఎంతో ప్రోత్సహించారు.

ఇలా నా ఈ అభిప్రాయాన్ని వారికి అందజేయడం నా పూర్వజన్మ సుకృతంగానే భావిస్తున్నాను. ఈ పుస్తకంలో లోపాలను సరిచేసి, ప్రచురణదాకా తీసుకు వెళ్ళడం ద్వారా మరోసారి రామాయణ పారాయణం చేయగలిగినందుకు నాకు మరెంతో సంతోషంగా వుంది. ఆ శ్రీరాముడు మా గురువుగారి చేత మాకు ఉపయోగకరమైన మరెన్నో గ్రంథాలను వ్రాయించి, వారిని నిండు నూరేళ్ళు చల్లగా కాపాడి నావంటి మరెందరికో ఆధ్యాత్మిక మార్గాన్ని చూపేందుకు వారికి సంపూర్ణ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, వంశాభివృద్ధిని ప్రసాదించ వలసినదిగా ఆ దేవదేవుని మనసారా కోరుకుంటూ ప్రార్థిస్తున్నాను.

**-: హరే రామ హరే రామ రామ రామ హరే హరే :-**

**రామ గాయత్రి : ఓం దాశరథాయ విద్మహే॥ సీతావల్లభాయ ధీమహి - తన్నో రామః ప్రచోదయాత్॥**

**శుభం భూయాత్! మంగళం మహత్!!**

పూజ్య గురుదేవులు, ఆధ్యాత్మిక జ్ఞాన ప్రపూర్ణులు మాన్యశ్రీ పింగళి పాండురంగరావుగారి పాదపద్మములకు నమస్సుమాంజలులు. బీరం సుందర్రావును - మీ శిష్యుణ్ణి.

వందే వాల్మీకి ఒంగోలు కోకిలమ్ - నమశ్వతమ్ సమర్పయామి॥

మీ రామకథామృతాన్ని తనివితీరా ఆస్వాదించాను. ఆనందామృతధారలో తడిశాను. తనిశాను. ప్రపంచ సాహిత్యంలో 'శ్రీమద్రామాయణం' సార్వకాలిక మహాకావ్యం.

మహర్షి వాల్మీకి మానవాళికి మహాపథ నిర్మాత. భారతీయులకు భారత రామాయణాలు నిత్యం పఠనీయ గ్రంథాలు.

భారతం బ్రతకడం నేర్పుతుంది, రామాయణం నడవడిక నేర్పుతుంది. మానవ విలువల సమాహారమే రామయణం. శ్రీరాముడు నైతిక నిష్ఠకు పరాకాష్ఠ. అలాంటి శ్రీమద్రామాయణాన్ని తేటతెలుగులో **"శ్రీరామకథామృతం"**గా అందించిన మీ కృషికి వందన మందారాలు. మీ రచనా సంవిధానానికి అభినందన చందనాలు.

రామాయణాన్ని గతంలో చాలమంది పండిత కవులు తెలుగులో అనువదించారు. కొందరు పద్యాల్లో, మరికొందరు గద్యంలో, ఇంకొందరు గేయాల్లో. గద్యానువాదాలన్నీ యధామూలకంగా సాగినందున రుచిలేని అన్నంలాగా వున్నాయి. వాల్మీకి శ్లోకాల్లోని నిండుదనం తెలుగులో ప్రతిబింబించ లేదు. కారణం యధానువాదాలు కావడమే. మీరు రామాయణాన్ని క్షుణ్ణంగా చదివి, అవగాహన చేసుకొని, సారాంశాన్ని ముద్దగా ముందుంచుకొని, ఎప్పుడు ఏ శిల్పం కావాలో ఆ శిల్పాన్ని చెక్కారు. ఆ శిల్పాలు పాత్రలై పలకరించాయి. కథను విపులీకరించారు. సంభాషణాత్మక శైలిలో శోభించాయి. మీరు గీసిన రామాయణమనే ఇంద్రధనుస్సులో సప్తవర్ణాలూ ప్రకాశించాయి ఒకటి మీరు ఎంచుకున్న స్వేచ్ఛానువాదం, రెండు మీ అనుభవపూర్వక రసరమ్య విశ్లేషణ శ్రీరామకథామృతానికి రుచిని పెంచాయి. ఎందుకంటే - "ఇందులో సాహితీరమ్యత పుష్కలంగా వుంది. అందరినీ ఆకట్టుకునేలా వుంది" (పేజి-5) అన్న శ్రీరాముని మాటలు మీ శ్రీరామకథామృతానికి అక్షరాల వర్తిస్తాయి.

దశరథుడు తన ధర్మపత్నులకు పాయసం అదించే ఘట్టం సంక్షిప్త సుందరంగా వుంది. అలాగే శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల జననాన్ని, నామకరణం, శస్త్రాస్త్రప్రవీణులైన ఉదంతాన్ని ఒకే ఒక పేరాలో చెప్పడం మీ సంక్షిప్త దృష్టికి నిదర్శనం (పేజి-14). అలాగే తాటకి వధ సంస్కృత మూలంలో పేజీలకు పేజీలకు విస్తరించింది. దాన్ని మీరు 2 పేజీల్లో చెప్పారు (18, 19). అలాగే చులి వృత్తాంతం (23). "స్పర్థయా వర్ధతే విద్యా" అన్నారు. వశిష్ఠుని కంటే గొప్పవాడు కావాలన్న విశ్వామిత్రుని పట్టుదల అతణ్ణి బ్రహ్మర్షిని చేసింది. ఆ విషయాన్ని ఒక గురువుగా చాల చక్కగా వివరించారు. సీతారాముల దాంపత్య రహస్యాన్ని కూడ చక్కగా వివరించారు. (48)

అయోధ్యకాండ మొత్తం అమ్మవడిలా ఎంతో రుచిప్రధానంగా సాగింది. పేజి 67లో ఉచితం తెలియని తండ్రయినా, గురువైనా శిక్షార్హులే నన్న లక్ష్మణుని భ్రాతృభక్తి అద్దంలో బొమ్మ కట్టి చూపారు. గుహుని ఉదంతం రామాయణంలో ఒక రసవత్కథ. బృందావనం రంగాచార్యులు (పర్చూరు) గారు "గుహుడు" అనే అద్భుత పద్యకావ్యం రాశారు. కైక-భరతుల సంఘర్షణ - మన ఎదురుగా మాట్లాడుతున్నట్లే వుంది. (95,96). ఇక్కడ మన ప్రకాశం జిల్లా పలుకుబడి చక్కగా ఒదిగిపోయింది. భరతుడి రూపంలో మీరే మాట్లాడినట్లుగా వుంది.

'జాబాలి' ఉదంతాన్ని, మీరు ఆస్తికులైనా నాస్తికత్వాన్ని నిష్పాక్షికంగా విశ్లేషించారు. అదే రచయిత సమతూకుముంటే! ఇక 'మందర' తన దుష్ట నైపుణ్యాన్నంతా ఏకంచేసి (చాలా గొప్ప అంచనా) దశరథుని పట్ల హింసాత్మక దృక్పథాన్ని సానపెట్టి కైకేయికి చిలవలు పలవలు సృష్టించి చెప్పింది. ఏదైనా ఒక పాత్రను పరిచయం చేయడానికి సన్నివేశం, భాష పరమ సాధనాలు. మొత్తం దృశ్యమంతా మీ భాషలో ఒదిగిపోయి కైకను వంగిపోయేలా చేసింది. మందర కైకేయి అందాన్ని మంద్రమంద్రంగా వర్ణించే దృశ్యం (59) సహజమైన భాషలో సుందరంగా వుంది. మందరలు ఇప్పుడూ వున్నారు, కైకలూ వున్నారు. తల్లిని నిందించే భరతులూ వున్నారు. తండ్రిని గౌరవించే శ్రీరాములూ వున్నారు. కనుకనే రామాయణం మానవజీవన నడవడికి ప్రామాణిక పఠనీయ గ్రంథం.

మీరే రాశారు "రాముడు సామాన్య మానవుడు కాదు. సాక్షాత్తు సూర్యుణ్ణి ప్రకాశింపచేయగలవాడు." కనుకనే రామాయణం స్వయం ప్రకాశ కావ్యం. ఆ కావ్యసృష్టి మహర్షి వాల్మీకికే సాధ్యం. "భగవద్భక్తులు సదా కారుణ్యాన్ని నింపుకొని వుంటారు' (90) సీత ఎందుకు మహాపతివ్రతో ఒక్క మాటలో చెప్పారు. అనసూయ వరం కోరుకోమన్నపుడు 'ఓ మహా తపస్వినీ! నీ సన్నిధియే నాకు అన్నింటినీ మించిన వరం" అంటుంది సీత (118) సీత నడత, నడక సదా ఆచరణీయాలు.

అరణ్యకాండను చాలా సంక్షిప్తంగా చెప్పారు. అనవసర విషయాలు తొలగించారు. కథకు అనుకూలంగా మలచుకున్నారు.

ఇక కిష్కింధకాడ రామాయణంలో కీలకమైంది. సుందరకాండ కంటే కిష్కింధకాండలోనే మానవ స్వభావం అద్భుతంగా చిత్రితమైందని నా భావన. కోతుల చేత మాట్లాడించడం ఒక ఎత్తైతే, వారధిని కట్టించడం మరో ఎత్తు. కోతి సాయం అందుకనే లోకంలో నిలిచిపోయింది. వాలి, సుగ్రీవుల పోరులో ధర్మవిచక్షణపై చర్చ జరిగింది. వాలి ప్రశ్నలకు రాముని వద్ద జవాబులు లేవు. కారణం, కార్యసాధన ముందు ధర్మం అచేతనమయింది.

సుందరకాండలో అలంకార లంక అందచందాల వర్ణన ఒక ఎత్తైతే, ఆంజనేయుని సాహస పరాక్రమాలు మరో ఎత్తు. సీత, ఆంజనేయుల సంభాషణను అతి సరళంగా రాశారు. ఆంజనేయుడు మహా పండితుడు. జ్ఞాని. కాని అచ్చం మన తెలుగుబంటును చేసి, చక్కని తెలుగులో మాట్లాడించారు పాఠకుల కోసం. ఏదైనా అర్థం కావడమే రచన పరమోద్దేశం.

కవయిత్రి మొల్ల సీతను చూచిన ఆంజనేయుడితో 'ఉన్నాడు రాఘవుడు లెస్సగా నున్నాడు నీకై..." అని పలికిస్తుంది. ఇదే సందిగ్ధత లేని సంభాషణ అంటే. మీరు మొత్తం 318 పేజీల్లో భాషా స్పష్టతకు ప్రాధాన్యత నిచ్చారు. కనుకనే 'శ్రీరామకథామృతం' అనే పేరు సార్థకమైంది. 242వ పేజీలో పక్షి చెప్పిన ఉదంతం కంటతడి పెట్టించింది. రాముని ఔన్నత్యం ఆంజనేయుడికి, లక్ష్మణుడికి, సీతకు తెలుసు. కనుకనే రాముణ్ణే నమ్మారు. శ్రీరాముడు అజేయుడు. ఆ విషయం సీతకు తెలుసు. కాని ఎక్కడా తొట్రుపాటు లేని మహాపతివ్రతా శిరోమణి సీత. ఈ విషయాన్ని మీరు చాల సందర్భాల్లో చక్కగా, ఉపపత్తులతో వివరించారు.

చివరగా యుద్ధకాండ, యుద్ధకాండ ఘట్టాన్ని స్వయంగా చూచినంత మనోహరంగా వర్ణించారు. తరగతి గదిలో పాఠం చెప్పిన మీకు ఇలాంటి వర్ణనలు పెన్నుతో పెట్టిన విద్యలు. చివరగా శ్రీరామాయణ పఠన ఫలితాన్ని 318లో చక్కగా చెప్పారు. పాపాత్ముడు పఠిస్తే పవిత్రుడవుతాడు. రామాయణమే కాదు, ఏ రచన అయినా మానవుని మహితాత్ముని చేయడానికే గదా!

అనుబంధంలో ఇచ్చిన రామాయణ సంబంధమైన విశేషాలు, ఆదిత్య హృదయం సూర్యుడిపరంగా, నారాయణపరంగా అర్థాన్ని విశ్లేషించిన మీ భాషా పాండితీ వైదుష్యం తక్కువనుకుంటే నా అంతటి మూర్ఖుడు మరొకరుండరు.

"ఓ సూర్యనారాయణా!" సంబోధన ఆదిత్య హృదయం ద్వారానే లోకంలో స్థిరపడింది.

"మనోమందిరంలో మందర" చాల గొప్ప నవ్య రచన. మందర మన మనస్సులోనే వుంది. మన మనస్సే మందరలా వ్యవహరిస్తూ వుంటుంది. అపార్థాలను సృష్టిస్తుంది. మనల్ని దుఃఖరూపంలోనికి తోసేస్తుంది. (361) కనుకనే సకల కల్మష నివారణకు రామాయణం చదవమన్నారు.

ఆ పుణ్యగాథను చదివి, అందరికీ అర్థమయ్యేలా అమృతవాక్కుల్లో అందించిన మీ బంగారు కలానికి నా ఆత్మీయ శుభాకాంక్షలు. కోకిలలు కనుమరుగై కాకులు పెరిగిన ఈ కాలానికి రామాయణం నిత్య సతనీయ గ్రంథం. ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకోగలరు.

సదా మీ శిష్యుడు,
బీరం సుందరరావు
20/10/2021